
# లజ్జ



తస్లీమా నస్రీన్

తస్లీమా నస్రీన్

# లజ్జ

అనువాదం:

వల్లంపాటి వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435 బ్యాంక్ స్ట్రీట్
హైదరాబాద్-500 001.

LAJJA - Tasleema Nasrin
Translated from English to Telugu By : Vallampati Venkata Subb'ah

ప్రచురణ నెం. : 1990

ప్రతులు : 2000

ప్రథమ ముద్రణ : సెప్టెంబరు, 1996

894.82731
నస్రీ-లజ్జ

© English: M/s. Ananda Publishing Pvt. Ltd., Calcutta

© తెలుగు అనువాదం: 1996 విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు

టైటిల్ డిజైను : చంద్ర

A C.No. 97120
హైదరాబాద్-500052

C.24986

వెల: రూ. 50-00

ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, విజ్ఞానభవన్, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాదు - 500 001.

విశాలాంధ్ర బుక్ హౌస్
విజయవాడ, హైదరాబాదు, గుంటూరు, విశాఖపట్నం,
అనంతపురం, తిరుపతి, హన్మకొండ, కాకినాడ.

అక్షరాలు : ట్వంటీ ఫస్ట్ సెంచరీ, ఫోన్: 4066986
ముద్రితము : శ్రీ కళాంజలీ గ్రాఫిక్స్, 3-5-323, విఠల్‌వాడి,
నారాయణగూడ, హైదరాబాదు-500 029 * ఫోన్ : 597831

* అంకితం *

భారత ఉపఖండంలోని

ప్రజలకు

# ముందుమాట

మత దురహంకారమన్నా, మతతత్వమన్నా నాకు అసహ్యం. అందుకే 1992, డిసెంబరు 6న అయోధ్యలో బాబ్రీమసీదు విధ్వంసం జరిగిన వెంటనే "లజ్జ"ను రాశాను. ఈ పుస్తకం రాయటానికి నాకు ఏడురోజులు పట్టింది. బంగ్లాదేశ్‌లో అధికసంఖ్యాకులైన ముస్లిములు అల్పసంఖ్యాకులైన హిందువుల్ని హింసించటం ఇందులోని కథావస్తువు. బాబ్రీమసీదు విధ్వంసం తరువాత నాదేశంలో ముస్లిములు హిందువుల్ని వేటాడటం తలవంచుకోవాల్సిన విషయం. బంగ్లాదేశ్‌ను ప్రేమించే మనమంతా అలాంటి భయంకరమైన సంఘటనలు మన అందమైన దేశంలో జరిగినందుకు అవమానంతో తలదించుకోవాలి. 1992లో ఈ దేశంలో జరిగిన అల్లర్లకు బాధ్యత మనందరిదీ. దీనికి మనందర్నీ తప్పుపట్టాలి. "లజ్జ" మన సామూహిక పరాజయానికి సంబంధించిన సాక్ష్యపత్రం.

"లజ్జ" 1993 ఫిబ్రవరిలో బంగ్లాదేశ్‌లో ప్రచురించబడింది. ఐదునెలల తరువాత ప్రభుత్వం దాన్ని నిషేధించేలోగా 60,000 ప్రతులు ఖర్చయ్యాయి. దీన్ని నిషేధించటానికి ప్రభుత్వం ఇది మత సామరస్యాన్ని చెడగొడుతూ ఉందన్న కుంటిసాకును చూపించింది. ఆ సంవత్సరం సెప్టెంబర్‌లో ఒక మతోన్మాద సంస్థ నాకు వ్యతిరేకంగా ఒక "ఫత్వా" ను విడుదలచేసింది. నన్ను చంపినవాళ్ళకు బహుమతిని కూడా ప్రకటించింది. ఢాకా నగర వీధుల్లో నాకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. వాటిని నిర్వహించిన మతతత్వవాదులు నేను బతికి ఉండకూడదని కేకలుపెట్టారు. కానీ ఇవేవీకూడా మత హింసకూ, జాతి నిర్మూలనకూ, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడదలుచుకున్న నా కృతనిశ్చయాన్ని సడలించలేకుండాపోయాయి. బంగ్లాదేశ్ నా మాతృభూమి. మనం ముప్పైలక్షల ప్రాణాలను త్యాగంచేసి పాకిస్తాన్ వద్దనుంచీ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాం. మత అతివాదానికి మనం దాసోహమంటే ఆ త్యాగాలకు అర్థమే లేకుండా పోతుంది. వాళ్ళ ఆటల్ని సాగనిస్తే ముల్లాలు బంగ్లాదేశ్‌లో అభ్యుదయకరమైన అన్నిటినీ చంపేస్తారు. నా అందమైన దేశాన్ని కాపాడుకోవటానికి ప్రయత్నించటం నా బాధ్యత. నా హక్కుల్ని రక్షించుకోవటానికి నాతో సహకరించమని నా అభిప్రాయాలను పంచుకునేవారిని కోరుతున్నాను.

మత దురహంకార జాడ్యం బంగ్లాదేశ్‌కు మాత్రమే పరిమితంకాదు. దాంతో మనం ప్రతి దశలోనూ పోరాడాలి. నావరకూ నాకు ఈ పోరాటంలో ఎలాంటి సవాళ్ళు ఎదురైనా, నా ప్రాణాలకే ప్రమాదం వచ్చినా భయంలేదు. మత పీడనకూ, ఇతరుల్ని

తక్కువగా చూడటానికి వ్యతిరేకంగా నేను రాస్తూనే ఉంటాను. లౌకికవాదులూ, మానవతావాదులూ ఒకరితో ఒకరు చేతులు కలిపినప్పుడు మాత్రమే మత దురహంకార శక్తుల్ని ఆపటానికి వీలౌతుందన్నది నా గట్టి నమ్మకం. నా నోరు మూయించటం జరగని పని.

★ ★ ★

ఇది నవల కాబట్టి ఇందులోని పాత్రలన్నీ కేవలం కల్పితాలు. చనిపోయిన లేదా బతికి ఉన్న వ్యక్తులకూ, ఈ పాత్రలకు పోలికలు కనిపిస్తే అది కాకతాళీయం మాత్రమే. వాస్తవంగా జరిగిన అనేక చారిత్రక సంఘటన్నీ, గణాంక వివరాలనీ ఈ నవలలో చేర్చాను. నా శక్తికి లోపంలేకుండా ఈ వివరాలను సరిచూశాను. "ఏకత", "ఆజేర్ కాగజ్", "భోరేర్ కాగజ్", "గ్లాని" పత్రికలనుంచీ, "బంగ్లాదేశ్‌లో మత పీడన", "బంగ్లాదేశ్‌లో పాటింపబడుతూ ఉన్న మత భేదాలు: వాస్తవాలూ, సాక్ష్యసత్యాలు", "పరిషత్ వార్త" మొదలైన రిపోర్టులనుంచీ ఈ సమాచారాన్ని సేకరించాను.

ఢాకా
మార్చ్, 1994

తస్లీమా నస్రిన్

# కాలక్రమంలో సంఘటనలు

★ 1947 – ఆగస్టు 15, 1947న భారత ఉపఖండం భారత్, పాకిస్తాన్ దేశాలుగా విభజించబడింది. బ్రిటిష్ పాలకులు వెళ్ళిపోయారు. బెంగాల్ కూడా విభజించబడింది. తూర్పు బెంగాల్ పాకిస్తాన్‌లో భాగమైంది.

★ 1952 – తూర్పుబెంగాల్‌లో (అప్పుడు దాని పేరు తూర్పు పాకిస్తాన్) బెంగాలీని జాతీయ భాషగా ప్రకటించాలని ఉద్యమం ప్రారంభమైంది.

★ 1966 – స్వపరిపాలను సాధించటానికి ఆరు అంశాల కోరికల పత్రం సమర్పణ

★ 1969 – పాకిస్తాన్ నియంతృత్వ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తూర్పు పాకిస్తాన్ ప్రజల తిరుగుబాటు.

★ 1971 – మార్చి, 26న బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా అవతరణ. కానీ మరో తొమ్మిది నెలలపాటు పోరాటం కొనసాగింది. డిసెంబర్ 16న పాకిస్తాన్ సైన్యాల పరాజయం, ఈ రోజే బంగ్లాదేశ్ విజయోత్సవ దినం.

★ 1975 – మిలిటరీ తిరుగుబాటులో షేక్‌ముజీబర్ రహమన్ ప్రభుత్వం పతనం కావటం.

★ 1978 – లౌకికతత్వాన్ని ప్రధాన సూత్రంగా స్వీకరించిన బంగ్లాదేశ్ రాజ్యాంగ చట్టం మార్పు. "ఇస్లాం"ను జాతీయమతంగా ప్రకటించటం.

★ 1990 – భారతదేశంలో వచ్చిన బాబ్రీమసీదు వివాదం కారణంగా బంగ్లాదేశ్‌లో విస్తృతంగా మత కలహాలు జరగటం.

★ 1992 – డిసెంబరు 6న బాబ్రీమసీదు విధ్వంసం కారణంగా బంగ్లాదేశ్‌లో మతకల్లోలాలు చెలరేగటం, అల్పసంఖ్యాక మతస్తులమీద విపరీతమైన దౌర్జన్యకాండ జరగటం.

★ ★ ★

# మొదటి రోజు

సురంజన్ ఇంకా పడకమీదనుంచి లేవలేదు. అతని చెల్లెలు నీలాంజన – అవిణ్ణందరూ 'మాయ' అని పిలుస్తారు – మాటిమాటికీ గదిలోకొచ్చి "దాదా, నువ్వు త్వరగా నిద్రలేవవా? పరిస్థితి చేయిదాటి పోయేలోగా ఏమైనా చెయ్యవా?" అని అడుగుతోంది. ముంచుకొస్తున్న ప్రమాదంనుంచీ తప్పించుకోవటానికి తాత్కాలికంగా ఒక ఆశ్రయంకోసం వెదకమని మాయ అడుగుతోందని సురంజన్‌కు తెలుసు. కానీ అతని మనసు తిరగబడుతోంది. తనకుటుంబానికి మళ్ళీ ఈపారిపోవటం తప్పనిసరా? తమ నాన్నగారిపేరు సుధామయ్ కావటంచేతా, తల్లిపేరు కిరణ్మయి కావటం చేతా, చెల్లాయిపేరు నీలాంజన కావటం చేతా మాత్రమే తాము ఇల్లువిడిచి పారిపోవాలా? రెండేళ్ళ క్రితంలాగా కమాల్ ఇంట్లోనో, బెలాల్ ఇంట్లోనో, హైదర్ ఇంట్లోనో తలదాచుకోవాలా? ఆరోజు – 1990 వ సంవత్సరం అక్టోబర్ 30వ తేదీ – అతనికి జ్ఞాపకం వచ్చింది. ఎస్కాటన్ మొహల్లాలో కాపురం ఉంటున్న కమాల్ ప్రమాదాన్ని శంకించి పరుగుపరుగున వచ్చాడు. తనతోపాటు వాళ్ల ఇంటికి వచ్చేయాలన్నాడు. కమాల్ ఇంట్లో ప్రేమాభిమానాలకూ, అతిథిమర్యాదలకూ కొదవలేదు. ఉదయంపూట రొట్టె, వెన్న, గుడ్లు తిన్నారు. మధ్యాహ్నభోజనాలకు అన్నమూ, చేపలూ ఉండేవి. తాము వాళ్ల ఇంటిముందున్న పచ్చికమీద పనీపాటా లేకుండా, గంటలకొద్దీ గడిపేవారు. రాత్రిపూట మెత్తని డన్‌లప్ పరుపులమీద ప్రశాంతంగా, హాయిగా నిద్రపోయేవారు. మొత్తంమీద వాళ్ల ఇంట్లో ఉండటం ఎంతోహాయిగా ఉంది కానీ, అసలు ప్రశ్నలకు సమాధానం మాత్రం దొరకలేదు. అమాటకొస్తే కమాల్ వాళ్ల ఇంట్లో ఎందుకు తలదాచుకోవాలి? కమాల్, సురంజన్ పాతనేస్తాలే. ఒకరింటికొకరు వచ్చి వెళ్లేవాళ్లే. కానీ అలాంటి సందర్భాల్లో మాత్రంకాదు. తాము కమాల్ ఇంట్లో తలదాచుకోవాల్సిన అవసరం ఎందుకు కలిగింది? తాను తన సొంత ఇంటినుంచి ఇలా పారిపోయి, మరోచోట తలదాచుకోవటం తప్పదా? కమాల్ అలా చేయాల్సిన అవసరం ఎప్పుడూ కలగలేదే? కమాల్‌కులాగే తనకూ ఇది సొంత దేశంకాదా? ఇది తన మాతృదేశమే అయినా తన హక్కులు హరించబడుతూ ఉన్నట్టు ఎందుచేత అనిపిస్తోంది? తన మాతృదేశం తన్ను ఎందుచేత తిరస్కరిస్తోంది? "నేను ఈమట్టిలో పుట్టిన మనిషిని, నాకు అపకారం జరక్కుండా కాపాడు"– అని తాను తన దేశమాతతో ఎందుచేత చెప్పలేకుండా ఉన్నాడు?

ఇలా ఆలోచిస్తూ సురంజన్ అలాగే పడుకొని ఉన్నాడు. చెల్లెలి మాటలు అతనికి వినిపించటంలేదు. ఆవిడ గదిలో అటూ ఇటూ పచార్లు చేసింది. ఆతరువాత ఇల్లంతా అన్యమనస్కంగా తిరగటం ప్రారంభించింది. తమందరికీ ప్రమాదం ముంచుకొచ్చేలోగా ఏదో ఒకటి చేయక తప్పదని ఎవరూ ఎందుకు అర్థం చేసుకోవటంలేదని నీలాంజన ఆలోచిస్తోంది. 1992, డిసెంబరు ఆరున బాబ్రీమసీదును కూలదోయటాన్ని

సవివరంగా సి.ఎన్.ఎన్. టెలివిజన్‌లో చూపించింది. టెలివిజన్‌లో అదృశ్యాలను ఇంకా చూపిస్తూనే ఉన్నారు. సుధామయ్, కిరణ్మయి టీవీకి అంటుకుపోయి వాటిని చూస్తూ కూచున్నారు. విధ్వంసం వాళ్ళ కళ్ళముందు జరుగుతూ ఉంటే వాళ్లుకూడా సురంజన్ తమను ఓ ముస్లిం స్నేహితుని ఇంటికి తీసుకెళ్ళకూడదా అని కోరుకుంటూ కూచున్నారు. కానీ సురంజన్ అలాంటి పనిచేయకూడదన్న నిర్ణయానికి వచ్చేశాడు. కమాల్‌కానీ, మరోముస్లిం స్నేహితుడుకానీ తమను తీసుకెళ్లటానికొస్తే, "పరిస్థితులు ఎలా ఉన్నాసరే నేనుమాత్రం నాఇంటిని వదిలిరాను", అంటాడు.

సుధామయ్ దత్తా కుటుంబంలో ఈ దృశ్యాలు డిసెంబరు ఏడున జరుగుతున్నాయి. అముందురోజు సాయంకాలం సరయూనదీతీరంలోని అయోధ్యానగరంలో భయంకరమైన చీకటి తెట్టెలు తెట్టెలుగా కురిసింది. ఆ దుర్దినాన కరసేవకులమని చెప్పుకునే గుంపు నాలుగువందలా యాభై సంవత్సరాల క్రితంకట్టిన ఒక మసీదును నేలమట్టం చేసింది. విశ్వహిందూపరిషత్ (వి.హెచ్.పి.) అభిప్రాయం ప్రకారం అమసీదు శ్రీరాముని జన్మభూమి. కాబట్టి అది హిందువుల మతసంబంధమైన ఆస్తి. ఆ సంకుచిత స్వయంసేవకులగుంపు మసీదులోనూ, అపరిసరాల్లోనూ "కరసేవ" ప్రారంభించింది. కరసేవంటే పరిసరాలను శుభ్రం చేయటం. కానీ కరసేవ ప్రారంభమైన ఇరవై ఐదు నిమిషాలకే విధ్వంసం ప్రారంభమైంది. కరసేవకులు దుర్మార్గంగా మసీదును కూలదోయటం ప్రారంభించారు. ఈ నాటకమంతా ఉన్నతాధికారులూ, విశ్వహిందూ పరిషత్, భారతీయజనతాపార్టీ, రాష్ట్రీయస్వయం సేవకసంఘం, భజరంగదళ్‌లకు చెందిన మంత్రులూ చూస్తుండగానే జరిగింది. మసీదు విధ్వంసం జరుగుతూ ఉంటే కేంద్రపోలీస్ దళానికీ (సి.ఆర్.పి.ఎఫ్.), రాష్ట్రపోలీస్ దళానికీ (పి.ఎ.సి.), ఉత్తరప్రదేశ్ పోలీస్ దళానికీ చెందిన అధికారులు కాలు కదల్చకుండా చూస్తూ ఉన్నారు. మధ్యాహ్నం రెండుగంటలా నలభై అయిదు నిమిషాలకు మొదటి గుంబజ్ కూలిపోయింది. నాలుగుగంటలకు రెండవది నేలమట్టమైంది. మత దురహంకారులైన కరసేవకులు నాలుగుముప్పావుకల్లా మూడవ గుంబజ్‌ను కూడా ముక్కలుముక్కలు చేసేశారు. ఈ విధ్వంసం జరుగుతూ ఉండగా నలుగురు కరకసేవకులు శిధిలాలకింద కూరుకుపోయి చనిపోయారు. కొన్నివందలమంది తీవ్రంగా గాయపడ్డారు. సురంజన్ చదువుతూ ఉన్న పత్రికలో ఇంకా చాలా వివరాలున్నాయి. "బాబ్రీ మసీదు కూల్చివేత" అని పతాకశీర్షిక గొంతెత్తి అరుస్తోంది.

సురంజన్ ఏనాడూ అయోధ్యకు వెళ్ళలేదు. బాబ్రీ మసీదును చూళ్ళేదు. బంగ్లాదేశ్ దాటి బయటికి అడుగుపెట్టనివాడు వాటిని ఎలా చూస్తాడు? కూల్చివేయబడ్డ భవనం రామజన్మభూమో, పవిత్రమసీదో సురంజన్‌కు ముఖ్యమైన విషయంకాదు. కానీ పదహారోశతాబ్దానికి చెందిన అకట్టడాన్ని కూల్చివేయటం భారతదేశంలోనే కాకుండా, ఇతర దేశాల్లోకూడా ముస్లిముల మనోభావాలమీద తీవ్రమైన దెబ్బతీసింది. ఈ వార్తాపత్రిక అన్నట్టుగా ఆ విధ్వంసకృత్యం హిందువులక్కూడా తీవ్రమైన అపకారాన్ని చేసింది. ఈ పత్రిక మాటల్లోనే చెప్పాలంటే ఈ విధ్వంసం అంతర్జాతీయ సామరస్యానికీ, ప్రజల ఉమ్మడి వివేకానికీ తగిలిన దెబ్బతప్ప మరేంకాదు. ఆ పత్రికా

కథనం ఇలా కొనసాగింది:

"ఈ సంఘటనకు ప్రతిక్రియగా బంగ్లాదేశ్‌లోకూడా మతపిచ్చి వెల్లువగా లేస్తుం దనటానికి సందేహంలేదు. దేవాలయాలు నేలమట్టమౌతాయి. హిందువుల ఇళ్ళు బూడిదౌతాయి. వాళ్ళ వ్యాపారస్థలాలు కొల్లగొట్టబడతాయి. బి.జె.పి. ప్రోద్బలంతో కరసేవకులు బాబ్రీమసీదును కూలదోసి బంగ్లాదేశ్‌లో ముస్లిం ముల్లాలకు బలాన్నిచ్చారు. బి.జె.పి., వి.హెచ్.పి. వారి అనుయాయులూ అయోధ్యలో చేసిన పిచ్చిపనుల ప్రభావం భారతదేశంలో మాత్రమే ఉంటుందని వీరు భావించారా? భారతదేశంలో అప్పుడే మతకలహాలు విస్తృతంగా ప్రారంభమయ్యాయి. ఐదువందలమంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈసంఖ్య ఆరువందలుండవచ్చు. ఏడువందలుకూడా ఉండవచ్చు. గంటగంటకూ మృతులసంఖ్య పెరుగుతోంది. తమ మతాన్ని గురించీ, మతస్థులను గురించీ శ్రద్ధతీసుకుంటున్నామని భావించిన మతాభిమానులైన హిందువులు బంగ్లాదేశ్‌లోకూడా రెండున్నర కోట్ల హిందువులు నివసిస్తున్నారని విస్మరించారా? బంగ్లాదేశ్‌లోనేకాదు పశ్చిమాసియాలోని ప్రతిదేశంలోనూ చెప్పుకోదగ్గ సంఖ్యలో హిందువులు నివసిస్తున్నారు. ఈ హిందూ దురభిమానులు ఇతరదేశాల్లో నివసించే హిందువులు ఎలాంటి తీవ్రమైన పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఆలోచించారా? భారతదేశాన్ని మిగిలిన ప్రపంచంనుంచీ వేరు చేయటానికి వీల్లేదని రాజకీయపార్టీ అయిన బి.జె.పి. బాధ్యతకలిగి గుర్తించి ఉండవలసింది. ఒక ప్రమాదకరమైన సంఘటన భారతదేశంలో ప్రారంభమైతే దానికి సంబంధించిన బాధ ప్రపంచమంతా వ్యాపిస్తుంది – మరీ ముఖ్యంగా సరిహద్దుదేశాల్లో అది నిస్సందేహంగా కనిపిస్తుంది."

సురంజన్ కళ్లు మూసుకున్నాడు. కానీ మాయ గట్టిగా కుదిపితే మళ్ళీ కళ్ళు తెరిచాడు.

"నువ్వేం చేయవా? అమ్మా, నాన్నా తమ భద్రతకోసం నీమీద ఆధారపడి ఉన్నారని నీకు అర్థం కావటంలేదా?", అంది మాయ.

సురంజన్ ఆవులించాడు. ఒళ్ళు విరుస్తూ బద్దకంగా అన్నాడు, "నీకు వెళ్ళాలనుంటే నువ్వెళ్లు. నేను ఈ ఇంట్లోనుంచీ అడుగు బయటపెట్టను."

"కానీ వాళ్లసంగతేమిటి?"

"నాకు తెలీదు!"

"ఏమైనా జరిగితే ఎలా?"

"ఏం జరుగుతుంది?"

"వాళ్ళు మనింటిమీద దాడిచేస్తే? మనింటిని తగలబెడితే?"

"అలాగే చేయనీ."

"అంటే అలాంటివి జరుగుతూ ఉంటే నువ్వు చూస్తూ కూచుంటావా?"

"కూచోను. పడుకుంటాను."

సురంజన్ పరగడుపునే సిగరెట్ వెలిగించాడు. ఒకకప్పు టీ దొరికితే బావుంటుం దనుకున్నాడు. సాధారణంగా ప్రతిరోజూ కిరణ్మయి టీ తీసుకువస్తుంది. కానీ ఈరోజు

ఆవిడ ఆపని చెయ్యలేదు. మాయను అడిగి ప్రయోజనం లేదు. ఈ ఇంట్లోంచీ మరో భద్రమైన చోటికి పారిపోవటాన్ని గురించి తప్ప ఆవిడ మరోవిషయాన్ని గురించి ఆలోచించటం లేదు. టీ అడిగితే మాయ అరిచి గీపెట్టి ఇంటిని కూలదోసేస్తుంది. తానే లేచి ఒకప్ప టీ చేసుకొని ఉండవచ్చు. కానీ తనకు చాలా బద్దకంగా ఉంది. అవతలివైపు గదిలోంచీ టి.వి. శబ్దం గట్టిగా వినిపిస్తోంది. తనకు అక్కడికెళ్ళి సి.ఎన్.ఎన్. వాళ్ళు చూపిస్తున్న దృశ్యాలను చూడాలని సుతరామూ అనిపించటం లేదు. అకస్మాత్తుగా ఆగదిలోంచీ మాయగట్టిగా అరవటం వినిపించింది.

"దాదా పడుకొని పత్రికలు చదువుకుంటున్నాడు. అతనికీ ప్రపంచంలో చింతలేవీ ఉన్నట్టులేదు."

పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో సురంజన్‌కు అర్థం కాలేదనికాదు. తమ ఇంట్లోకి ఒక గుంపుదూరి ఇంటిని లూటీ చేయవచ్చు. ఇంటిని కూలదోసినా కూలదోయవచ్చు. ఇలాంటి పరిస్థితిలో ఆశ్రయం అడిగితే కమాల్ కానీ హైదర్ కానీ తిరస్కరించరు. కానీ వారిదగ్గరికి ఆశ్రయం కోరుతూ పరుగెత్తటం సురంజన్‌కు సిగ్గనిపించింది. మాయ బిగ్గరగా అరుస్తూనే ఉంది. "మీకెవ్వరికీ మరోచోటికి వెళ్ళి తలదాచుకోవాలని లేకపోతే నేను వెళ్తాను. పరుల్ ఇంటికెళ్ళి పరిస్థితి మెరుగుపడేవరకూ అక్కడే ఉంటాను. దాదాకు మనల్ని మరోచోటికి తీసుకెళ్ళాలనే ఆలోచన లేనట్టుంది. బహుశా అతనికి బతకాలని లేకపోవచ్చు. నాకుంది. తప్పకుండా ఉంది," అంటోంది. ఆవిడ అన్న చివరిమాటల్లో తన అన్న తమకు తలదాచుకోవటానికో చోటు వెదకడన్న ఆక్రోశం ధ్వనించింది. ఆపనితానే చేయాలి.

సురంజన్ ఆలోచిస్తూ పడకమీదే పడుకొని ఉన్నాడు. తాము ఇల్లుకదలటంకూడా క్షేమం కాకపోవచ్చు. అక్టోబర్, 1990లో అదృష్టవశాత్తు తాము సర్వనాశనాన్ని తప్పించుకోగలిగారు. ఆనెల్లో జరిగిన సంఘటనలు అతని మనసులో పునరావృతం కావటం ప్రారంభించాయి.

- ★ దక్షిణేశ్వరి దేవాలయాన్ని ఒకగుంపు తగలబెట్టింది. పోలీసులు చూస్తూ ఉండిపోయారు. వాళ్ళని ఆపే ప్రయత్నమేమీ చేయలేదు. గర్భగుడి బూడిదైపోయింది. దేవాలయంలోని నాట్యమందిరం బాగా దెబ్బతినింది.
- ★ శివాలయం, దానికి సంబంధించిన అతిధుల గదులూ, శ్రీధామ్ ఘోష్‌కు వారసత్వంగా వచ్చిన భవనమూ నేలమట్టం చేయబడ్డాయి.
- ★ గౌడీయమఠంలోని ప్రధాన దేవాలయం, నాట్యమంటపం, అతిధులగదులూ కూల్చివేయబడ్డాయి. వాటిలోని విలువైన వస్తువులు లూటీ చేయబడ్డాయి.
- ★ మాధవగౌడీయ మఠంలోని ప్రధాన దేవాలయం నాశనం చేయబడింది.
- ★ జైకాళీ దేవాలయం ముక్కలు ముక్కలైంది.
- ★ బ్రహ్మసమాజం ప్రాకారాని కానుకొనిఉన్న ఒకగదిని పేల్చేశారు. రామ-సీతా దేవాలయంలో ఎంతో శిల్పసౌందర్యం ఉన్న సింహాసనాన్ని పూర్తిగా నాశనం చేశారు. కాబట్టి గర్భగుడి బాగా దెబ్బతిన్నదని చెప్పనవసరంలేదు.

★ నయాబజారులోని మఠం ధ్వంసం చేయబడింది. అలాగే బోన్‌గ్రాంలోని దేవాలయాన్ని గడ్డపారల్ని పెట్టి పెళ్ళగించేశారు.

★ శంకరీబజారు మొదట్లోనే హిందువులకు చెందిన అనేకదుకాణాలను లూటీ చేశారు, బూడిద చేశారు. షీలా వితాన్, సుర్మాట్రేడర్స్, అనేక దుకాణాలూ, టైర్లు అమ్మే ఏజన్సీలు, లాండ్రీలు, మితామార్బుల్స్, సాహోకాబినెట్ రెస్టారెంట్లు....... హిందువులకు చెందిన ఏ ఆస్తీ నిలవలేదు. నిజానికి శంకరీబజారు ప్రారంభంనుంచీ కనుచూపు అనినంతవరకూ విధ్వంసమే కనిపించింది.

★ ధమ్‌రాయ్‌లో షోణీ దేవాలయం, వ్యాయామశాలలో కొంతభాగం లూటీ చేయబడ్డాయి.

★ మూడువందలమంది మతదురహంకారులైన గుండాలు పాతికఇళ్ళను తగులబెట్టారు. లక్ష్మీబజారులోని వీరభద్రదేవాలయం గోడల్ని కూలదోశారు. దేవాలయాన్ని పూర్తిగా దోచుకున్నారు.

★ ఇస్లాంపూర్ రోడ్‌లో బంగారమూ, గొడుగులూ అమ్మే దుకాణాలను తగులబెట్టారు.

★ నవాబ్‌పూర్ రోడ్‌లోని ప్రసిద్ధమైన మారన్‌చంద్ మిఠాయి దుకాణం పూర్తిగా ధ్వంసం చేయబడింది. పురానాపల్టన్‌లోని ఇతని మరో దుకాణానిక్కూడా ఇదేగతి పట్టింది.

★ రాయ్‌బజార్‌లోని కాళికాదేవి విగ్రహం గుర్తుతెలియనంతగా వికృతం చేయబడింది.

★ సూత్రపూర్‌లో హిందువుల దుకాణాలు లూటీ చేయబడ్డాయి. ఆదుకాణాలకున్న హిందూ పేర్లున్న బోర్డులస్థానంలో ముస్లిం పేర్లున్న బోర్డుల్ని వారే పెట్టవలసి వచ్చింది.

★ నవాబ్‌పూర్‌లోని ప్రసిద్ధమైన ఘోష్ అండ్ సన్స్ మిఠాయి దుకాణం లూటీ చేయబడింది. ఆ దుకాణంమీద నవాబ్‌పూర్ యువజన సంఘం జెండా వెలిసింది.

★ ధతేరీ బజార్‌లోని బొత్తోలీ దేవాలయం సర్వనాశనం చేయబడింది.

★ నవాబ్‌పూర్‌లో రామ్‌ధన్ పాషారీకి చెందిన ప్రసిద్ధ దుకాణం మంటలపాలైపోయింది.

★ బాబూబజార్ పోలీస్ ఔట్ పోస్టుకు కొన్ని గజాలదూరంలోనే ఉన్న సుఖలాల్ మిఠాయి దుకాణం దోపిడీ చేయబడింది.

★ జటీర్ అండ్ కంపెనీవారి షోరూములూ, ఫాక్టరీ ధ్వంసం చేయబడ్డాయి.

★ ప్రాచీనమైన షంప్ మందిరం పాక్షికంగా కూలదోయబడింది.

★ సదర్‌ఘాట్ మలుపులో ఉన్న రతన్‌శంకర్ మార్కెట్ మొదట లూటీ చేయబడింది, ఆతరువాత పూర్తిగా ధ్వంసం చేయబడింది.

1990 హింసాకాండలో ధ్వంసమైన స్థలాలను ఒకటి తరువాత ఒకటిగా సురంజన్ తన మనసులో లెక్కవేసుకున్నాడు. అల్లర్లంటే ఇవేనా? 1990లో జరిగిన సంఘటనల్ని "అల్లర్లు" అనవచ్చా? అల్లరి అంటే ఒక మతంవారు మరొక మతంవారిని

దయాదాక్షిణ్యాలు లేకుండా హింసించటమేనా? కాదు. అలాంటి సంఘటనల్ని "అల్లర్లు" అని చేతులు కడుక్కోవటానికి సాధ్యంకాదు. ఒకమతంవారు మరొక మతంవారి పవిత్రతమీదా, వ్యక్తి గతజీవితంమీదా అదేపనిగా, దయాదాక్షిణ్యాలు లేకుండా దాడిచేయటం వాస్తవంగా జరిగిన సంగతి. ఇది నియంతృత్వానికీ, పీడనకూ తీసిపోదు....సూర్యకాంతి కిటికీలోంచి జాలువారి సురంజన్ నుదుటిమీద వెలుగుతోంది. కానీ అది చలికాలపు ఎండకావటంచేత అతనికి ఇబ్బంది కలగలేదు. సురంజన్ అలాగే పడకమీదనుంచి లేవకుండా టీ కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు.

★ ★ ★

అవతలివైపు గదిలో ఉన్న సుధామయ్‌కూడా గతాన్ని గురించి ఆలోచిస్తున్నాడు. అతడు యువకుడుగా ఉన్నప్పుడు అతని బాబాయిలూ, మామయ్యలూ తమ కుటుంబాలతోపాటు ఒకరి తరువాత ఒకరుగా బంగ్లాదేశ్‌ను వదిలి వెళ్తుండేవారు. ఆవిరి ఇంజన్లరైళ్ళు మైమెన్‌సింగ్ నుంచీ ఫూల్‌బరియాకు బయలుదేరేవి. రైళ్ళు బయలుదేరటానికి ముందు గార్డు ఈలవెయ్యగానే తమకు తెలిసిన ఒకేఒక దేశాన్ని వదిలి వెళ్లిపోతున్న ప్రజల హృదయవిదారకమైన ఆర్తనాదాలు వినిపించేవి. ఇరుగుపొరుగులు అతని నాన్న సుకుమార్‌ను బయటికి పిలిచి, "సుకుమార్, నువ్వూ రాకూడదూ? ఇది ముస్లిముల మాతృభూమి. ఈ దేశంలో మన ప్రాణానికి భద్రతలేదు", అనేవాళ్ళు. కానీ సుకుమార్ దత్త తాను ఇంతకాలంగా నమ్ముకున్న విలువల్ని వదిలిపెట్టలేదు. "మన దేశంలోనే మనకు భద్రతలేకపోతే దాని కోసం ప్రపంచంలో ఎక్కడ వెదుక్కుంటూ పోగలం? నా మాతృదేశంనుంచీ పరిగెత్తిపోలేను. మీరు కావాలంటే వెళ్ళండి. మా తండ్రులూ, తాతలూ సంపాదించిన ఆస్తిపాస్తుల్ని వదిలిపెట్టి వెళ్ళను. కొబ్బరి తోటలూ, పోకతోటలూ, సుక్షేత్రాలైన వరిపొలాలూ, రెండెకరాల విస్తీర్ణం ఉన్న ఇల్లూ.... వీటన్నిట్నీ వదిలిపెట్టి సీల్దా స్టేషన్లో కాందిశీకుడుగా నిలబడలేను," అనేవాడు. అప్పుడు సుధామయ్ వయస్సు, సుమారు పందొమ్మిదేళ్ళు. అతని కాలేజీ నేస్తాలు చాలామంది భారతదేశానికి వలసపోతుండేవారు. వాళ్ళు "ఎప్పుడో ఒకప్పుడు మీనాన్న ఈ నిర్ణయాన్ని తీసుకున్నందుకు పశ్చాత్తాపపడక తప్పదు", అని హెచ్చరించేవారు. కానీ సుధామయ్ తన నాన్నగారిలాగే "నేను నా మాతృదేశాన్ని వదిలి మరోచోటికి ఎందుకు వెళ్ళాలి? నేను ఈ మట్టిమీదనే బతకాలి, ఈ మట్టిమీదనే చావాలి", అనటం నేర్చుకున్నాడు. కానీ అనివార్యమైన ఆవలస ఆగలేదు. కాలేజీల్లో విద్యార్థులసంఖ్య క్రమక్రమంగా తగ్గిపోసాగింది. 1947 లో వెళ్ళి పోకుండా మిగిలిన వాళ్ళు ఇప్పుడు వెళ్ళిపోవటానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అనాడు సుధామయ్ కొద్దిమంది ముస్లిం విద్యార్థులతోనూ, మరికొద్దిమంది బీద హిందూవిద్యార్థులతోనూ కలిసి లిట్టన్ మెడికల్ కాలేజీలో చదువుకొని డాక్టరయ్యాడు.

1952లో సుధామయ్ ఇరవైనాలుగు సంవత్సరాల ఉత్సాహవంతుడైన యువకుడు. ఆనాడు ఢాకా వీధుల్లో ఉద్రేకం పొంగిపొర్లింది. బెంగాలీలు బెంగాలీని జాతీయభాషగా చేయాలని ఉద్యమించారు. పాకిస్తాన్ దేశాధినేత మహమ్మదాలీ జిన్నా బెంగాలీల అభిప్రాయాన్ని తిరస్కరించి పాకిస్తాన్‌లో ఉర్దూ మాత్రమే జాతీయ భాషగా

ఉంటుందని ప్రకటించాడు. కానీ యువకులూ, రాజకీయ చైతన్యమూ, ధైర్యమూ కలిగిన తూర్పు పాకిస్తాన్ (బంగ్లాదేశ్‌ను అనాడు అలాగే పిలిచేవారు)లోని బెంగాలీలు వెనక్కు తగ్గలేదు. జిన్నా నిర్ణయానికి వ్యతిరేకంగా తిరగబడ్డారు. నగరంలోని వీధుల్లో వారి రక్తం చిమ్మింది. కానీ ఎవరూ వెనకడుగు వేయలేదు. బెంగాలీ మాత్రమే తమ జాతీయభాషగా ఉండాలని నినదించారు. "మాకు బెంగాలీ భాషకావాలి"– అని డిమాండు చేస్తూ సాగిన ఊరేగింపుల్లో సుధామయ్ పాల్గొన్నాడు. కొన్నిటికి నాయకత్వం వహించాడు. రఫీక్ సలామ్ బర్కత్ జబ్బార్‌ను పోలీసులు కాల్చివేసినప్పుడు అతడు అక్కడే ఉన్నాడు. ఉద్యమం విస్తరిస్తే అతడుకూడా పోలీసు తూటాలకు బలై, మృతవీరుడయ్యే పరిస్థితులుగూడా ఉండేవి.

1969లో వచ్చిన జాతీయోద్యమంలోకూడా అతడు పాల్గొన్నాడు. అప్పుడు ఊరేగింపులమీద కాల్పులు జరపమని పాకిస్తాన్ అధినాయకుడు ఆయూబ్ ఖాన్ ఆదేశాలిచ్చాడు. ఈ బెదిరింపులకు లొంగిపోకుండా బెంగాలీలు పదకొండు అంశాల డిమాండును అమలు జరపాలని తమ పోరాటాన్ని కొనసాగించారు. అలంగీర్ మన్సూర్ మింటును పోలీసులు కాల్చేశారు. అతని శవాన్ని మైమెన్‌సింగ్ పురవీధుల్లో సుధామయ్ మోశాడు. శోకతప్తులైన వందలాది బెంగాలీలు నిశ్శబ్దంగా అతణ్ణి అనుసరించారు. చిట్టచివరికి మార్షల్ లా విధించబడింది.....

1952లో వచ్చిన భాషోద్యమం, 1954లో జరిగిన ఐక్యసంఘటన ఎన్నికలు, 1962లో కొనసాగిన విద్యాసంస్కరణోద్యమం, అగర్తలా కుట్రకేసుకు వ్యతిరేకంగా లేచిన ఉద్యమం, 1970లో జరిగిన సాధారణ ఎన్నికలు, 1971లో వచ్చిన స్వాతంత్ర్యోద్యమం...... ఇవన్నీగూడా రాజకీయంగా చైతన్యవంతులైన బెంగాలీ యువకులను ఒకతాటిమీదికి తెచ్చాయి. రెండు జాతుల సిద్ధాంతం ఆధారంగా దేశాన్ని విభజించటం తప్పని ప్రతి కొత్తఉద్యమమూ నిరూపించింది. మౌలానా అబుల్ కలాం అజాద్ ఎప్పుడో చెప్పాడు :

"భౌగోళికంగా, ఆర్థికంగా, భాషాపరంగా, సాంస్కృతికంగా భిన్నంగా ఉన్న ప్రాంతాలను మతం ఐక్యం చెయ్యగలుగుతుందని ప్రజలకు సూచించటం పెద్ద మోసం. జాతులకూ, భాషలకూ, ఆర్థిక, రాజకీయ సరిహద్దులకూ అతీతమైన వ్యవస్థను స్థాపించటానికి ఇస్లాం ప్రయత్నించిన మాట వాస్తవమే. కానీ మొదటి దశకాల తరువాత, లేదంటే మొదటి శతాబ్దం తరువాత ఇస్లామిక్ దేశాలను ఇస్లాం ఐక్యం చేయలేక పోయిందని చరిత్ర నిరూపించింది".

రెండు జాతుల సిద్ధాంతాన్ని అమలు జరపటం పనికిమాలినపని అని జిన్నాకుకూడా తెలుసు. మౌంట్ బాటన్ పంజాబ్‌నూ, బెంగాల్‌నూ విభజించాలని పథకాలు వేస్తున్నప్పుడు స్వయంగా జిన్నా ఇలా అన్నాడు, "ఒక వ్యక్తి హిందువో, ముస్లిమో కావటానికి ముందుగానే అతడు పంజాబీనో, బెంగాలీనో అయి ఉంటాడు. వారికో ఉమ్మడి చరిత్రా, భాషా, సంస్కృతీ, ఆర్థిక వ్యవస్థా ఉంటాయి. ఈ రాష్ట్రాలను విభజించటం ద్వారా మీరు అనంతమైన రక్తపాతాన్నీ, బాధనూ సృష్టిస్తారు".

1947 నుంచీ 1971 వరకూ బెంగాలీలు తెరలుతెరలుగా రక్తపాతాన్ని చూస్తూనే

వచ్చారు. ఈ రక్తపాతాలు చివరకు 1971లో స్వాతంత్ర్యోద్యమంగా రూపొందాయి. ముప్పైలక్షలమంది బెంగాలీలు తమ ప్రాణాలను పోగొట్టుకుంటే స్వాతంత్ర్యం వచ్చింది. వారు జాతీయ ఐక్యతకు మతం పునాదిగా ఉండదని నిరూపించారు. భాషా, సంస్కృతీ, చరిత్రా జాతీయతాభావానికి పునాదిగా రూపొందాయి. పంజాబీ ముస్లిములకూ, బెంగాలీ ముస్లిములకూ మధ్య ఒక సంబంధాన్ని కల్పించటంలో పాకిస్తాన్ మొదట కొంత విజయాన్ని సాధించింది. కానీ హిందూ బెంగాలీలూ, ముస్లిం బెంగాలీలూ కలిసి రెండు జాతుల సిద్ధాంతంలోని డొల్లతనాన్ని నిరూపించారు. పాకిస్తానీ ముస్లిముల్తో ముఖ్యమైన విషయాలమీద సర్దుబాట్లు చేసుకోవటానికి తిరస్కరించారు.

1971లో మైమెన్‌సింగ్ పట్టణంలోని ఎస్.కె. ఆస్పత్రిలో సుధామయ్ డాక్టరుగా పనిచేస్తుండేవాడు. అతడు ఇంట్లోనూ, ఆస్పత్రిలోనూ ఎప్పుడూ క్షణం తీరికలేకుండా ఉండేవాడు. సాయంకాలంపూట స్వదేశీ బజార్లోని ఒకగదిలో ప్రాక్టీస్ చేసేవాడు. అప్పుడు కిరణ్మయి ఆరునెల్ల పాపతో పొద్దు చాలకుండా ఉండేది. కొడుకు సురంజన్ అప్పటికి పన్నెండేళ్ళవాడు. ఒకవైపు చిన్నపిల్లల బాధ్యత. మరోవైపు దాదాపు ఒంటరిగా ఆస్పత్రిని నడిపే బాధ్యత. సుధామయ్‌కి ఈ రెండు బాధ్యతలూ చాలా బరువుగా ఉండేవి. విశ్రాంతి దొరికితే అప్పుడప్పుడూ స్నేహితుల్ని కలుసుకోవటానికి షరీఫ్ ఇంటికి వెళ్ళేవాడు. మార్చి ఎనిమిదినో, తొమ్మిదినో సుధామయ్ స్నేహితులు షరీఫ్, ఫైజుల్, బబ్లూ, నెమాయ్ రేస్ కోర్స్ మైదానంలో ముజీబుర్ రహమాన్ ఉపన్యాసం వినటానికి వెళ్ళారు. అర్ధరాత్రి ఉపన్యాసం నుంచీ తిరిగొస్తూ బ్రహ్మపల్లిలోని సుధామయ్ ఇంటి తలుపు తట్టారు. "మరో తూటా పేలినా, నా అనుయాయుల్లో మరొక్కడు చంపబడ్డా మీ ఇళ్ళను కోటలుగా మార్చేయమని కోరుతున్నాను. శత్రువుల్ని ఎదుర్కోవటానికి అవసరమైన అన్ని వస్తువుల్నీ సమకూర్చుకోండి. ఈసారి పోరాటం స్వాతంత్ర్యపోరాటం," అన్నాడట ముజీబుర్ రహమాన్. ఆవేశంతో ఊగిపోతూ అతని స్నేహితులన్నారు, "సుధాఅన్నయ్యా! మనం ఏదో ఒకటి చేయాల్సిన సమయం వచ్చేసింది".

చేతులు ముడుచుకొని, జరగాల్సినవేవో జరుగుతాయిలే అని కూచుంటే ఏమీ జరగదని సుధామయ్‌కి తెలుసు. తనకో కుటుంబం ఉంది. ఉద్యోగం ఉంది. వాటి సంగతి ఆలోచించాలితాను. అందుచేత తానేమీ చేయలేదు. మార్చి 25న పాకిస్తానీ సైనికులు అకస్మాత్తుగా బెంగాలీలమీద విరుచుకు పడ్డప్పుడు అతని స్నేహితులు మళ్ళీవచ్చి సుధామయ్ తలుపు తట్టారు. "మనం యుద్ధానికి వెళ్ళాల్సిందే, మరో మార్గం లేదు," అన్నారు రహస్యంగా. సుధామయ్ సంశయంలో పడ్డాడు. అతడు కుటుంబాన్ని గురించి మొదట ఆలోచించాలి. అంతేకాదు, యుద్ధానికి వెళ్ళే వయస్సు అతనికి దాటిపోయింది. అయినా అతని స్నేహితుల కోరిక అతణ్ణి ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఆస్పత్రి పనిమీదకూడా దృష్టిని కేంద్రీకరించలేకపోయాడు. చిట్టచివరికి కిరణ్మయితో ఈ విషయం ప్రస్తావించాడు. తాను వెళ్ళిపోతే తనంతకుతాను సంసారం సంగతి చూసుకోగలదా – అని ప్రశ్నించాడు. కిరణ్మయి భయపడిపోయింది.

"భారతదేశానికి వెళ్ళిపోదాం. మన ఇరుగుపొరుగు వాళ్ళంతా ఒకరి తరువాత ఒకరుగా వెళ్లిపోతున్నారు" అంది. నిజమే. సుకాంత చటోపాధ్యాయ, సుధాంశు హల్దార్, నిర్మలేందు భౌమిక్, రంజన్ చక్రవర్తి భారతదేశానికి వెళ్లిపోవటం సుధామయ్‌కి స్వయంగా తెలుసు. 1947 నాటి వలస పునరావృతమౌతోంది. సుధామయ్‌కి ఒళ్ళు మండిపోయింది. అలా పారిపోతున్న వాళ్లని తిట్టిపోశాడు. వాళ్లని పిరికిపందలన్నాడు.

కొన్ని రోజుల తరువాత నేమాయ్ వచ్చాడు. "సుధా అన్నయ్యా, సైనికులు వీధులమీద పడ్డారు. హిందువుల్ని పట్టుకొని చంపుతున్నారు. రా, పారిపోదాం," అన్నాడు. 1947 అతని తండ్రి సుకుమార్ దత్త తన దేశాన్ని వదిలి వెళ్ళనని స్థిరంగా ఉన్నాడు. సుధామయ్ కూడా అదే నిర్ణయం తీసుకున్నాడు. "కావాలంటే నువ్వెళ్ళు. నా ఇంటినుంచీ నేను పారిపోను. ఆ పాకిస్తానీ కుక్కల్ని చంపి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకుంటాం. అప్పుడు రాదలుచుకుంటే నువ్వు తిరిగి రావచ్చు," అన్నాడు.

చిట్టచివరికి కిరణ్మయి, పిల్లలూ ఫూల్‌పూర్ దగ్గరున్న ఫైజిలూ అన్న గ్రామంలో ఉండేటట్లూ, సుధామయ్ షరీఫ్, బబ్లూ, ఫైజుల్‌లతోపాటు నలితాబారీకి వెళ్లేటట్టూ నిర్ణయం జరిగింది. కానీ అతడు తన పథకాన్ని అమలు పరిచేలోగా అతణ్ణి సైనికులు నిర్బంధంలోకి తీసుకున్నారు. అతడు ఒక తాళం కొనుక్కురావటానికి – బయటికి వెళ్ళటం ప్రమాదమని తెలిసినా – వెళ్ళాడు. సైనికులు వీధుల్లో తిరుగుతున్నారు. బెంగాలీలకు ఎలాంటి భద్రతాలేదు. భయంగా, బెరుగ్గా, ఉద్రేకాన్ని అణుచుకుంటూ నిర్మానుష్యంగా ఉన్న వీధులగుండా నెమ్మదిగా నడవసాగాడు. ఏవో కొన్ని దుకాణాలు మాత్రమే సగం సగం తెరిచి ఉంచారు. ఉన్నట్టుండి ముగ్గురు అతని ముందు ప్రత్యక్షమయ్యారు. అతణ్ణి ఆగమని కేకలు వేశారు. వాళ్ళలో ఒకడు అతని మెడ పట్టుకొని "నీపేరేమిటి?" అని ఉర్దూలో అడిగాడు.

ఆ సమయానికి ఏపేరు చెబితే సరిపోతుందో సుధామయ్‌కి స్ఫురించలేదు. బతికి బట్టకట్టదలుచుకుంటే పేరుమార్చుకొమ్మని కిరణ్మయికి ఆవిడ స్నేహితురాళ్ళు సలహా ఇవ్వటం సుధామయ్‌కి జ్ఞాపకం వచ్చింది. ఆవిడకు వాళ్ళు ఫాతెమా అక్తర్‌లాంటి పేర్లు సూచించేవారు. పాకిస్తానీ సైనికులకు తన హిందూపేరు నచ్చదని అతడు అర్థం చేసుకున్నాడు. అతడు కష్టపడి తనపేరూ, తన తండ్రి సుకుమార్‌పేరూ, తాత జ్యోతిర్మయ్‌పేరూ మరిచిపోయాడు. తనకే తెలియకుండా తనపేరు సిరాజుద్దీన్ హుసేన్ అని చెప్పటాన్ని విని తానే ఆశ్చర్యపోయాడు. వాళ్ళలో ఒకడు "నీలుంగీ విప్పు" అని కసిరాడు. మరొకడు సుధామయ్ లుంగీని లాగిపారేశాడు. అప్పుడు అతనికి నెమాయ్, సుధాంశు, రంజన్ ఎందుకు పారిపోయారో స్పష్టంగా అర్థమైంది.....

★ ★ ★

భారతఉపఖండం రెండు పాకిస్తాన్‌లుగానూ, ఒక భారతదేశంగానూ విడిపోగానే చాలామంది తూర్పు పాకిస్తానీ హిందువులు తమ ఇళ్లను వదిలిపెట్టి భారతదేశానికి పారిపోయారు. భారత ఉపఖండాన్ని మతప్రాతిపదికమీద విభజించటంచేత హిందువులు భారతదేశానికి పారిపోవటానికి సరిహద్దుల్ని తెరిచి ఉంచారు. డబ్బున్నవాళ్ళూ, చదువుకున్నవాళ్ళూ గుంపులుగుంపులుగా భారతదేశానికి పారిపోయారు. 1981

జనాభా లెక్కలప్రకారం బంగ్లాదేశ్‌లో హిందువుల జనాభా 10.57 మిలియన్లు. అంటే మొత్తం జనాభాలో 12.1 శాతం. ఆతరువాత పన్నెండేళ్ళలో హిందువుల సంఖ్య ఇరవై, ఇరవై ఐదు మిలియన్లకు పెరిగింది. కానీ దేశంలోని హిందువుల సంఖ్యను అధికారికంగా తక్కువచేసి చెబుతుండేవారు. సుధామయ్ అంచనా ప్రకారం 1990 దశకంలోని తొలి సంవత్సరాల్లో హిందువులు మొత్తం జనాభాలో దాదాపు ఇరవైశాతం ఉన్నారు.

1901 లో తూర్పుబెంగాల్ జనాభాలో హిందువులు 33.1 శాతం ఉండేవారు. 1911 కు అది 31.5 శాతానికి తగ్గింది. 1921 లో అది 30.6 శాతానికీ, 1931 లో 29.4 శాతానికీ, 1941 లో 28 శాతానికీ తగ్గింది. 1947 భారతదేశవిభజన తరువాత పదేళ్లలో హిందూ జనాభాశాతం 28 శాతంనుంచీ 22 శాతానికి పడిపోయింది. ఈ పదేళ్ళలో గతనలభైఏళ్ళలో తగ్గినదానికంటే ఎక్కువగా హిందువుల జనాభా తగ్గిపోయింది. పాకిస్తానీ పరిపాలనలో హిందువులు భారతదేశానికి వలసపోతూనే ఉన్నారు. 1961 జనాభా లెక్కలప్రకారం హిందువుల జనసంఖ్య 18.5 శాతానికి పడిపోయింది. 1974 లో అది 13.5 శాతం మాత్రమే ఉండేది. కానీ బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం వచ్చాక దేశాన్ని వదిలిపెట్టి వెళ్లిపోయే హిందువుల ప్రవాహం కొంతవరకూ తగ్గింది. 1981 లో హిందూ జనాభాశాతం 12.1 మాత్రమే అయినా దేశాన్ని వదిలివెళ్లే హిందువులసంఖ్య క్రొద్దిగా తగ్గటం స్పష్టంగానే కనిపించింది. కానీ ఈ పరిణామం ఎంతకాలం కొనసాగుతుంది? మరీముఖ్యంగా 1990 లో జరిగిన అల్లర్లకు దారితీసిన పరిస్థితుల్లో ఎలా కొనసాగుతుంది. ఇప్పుడిది 1992 వ సంవత్సరం. ఇప్పుడు హిందువులు దేశాన్ని వదిలివెళ్ళిపోవాలా? వారు వెళ్లిపోవాలని మనం ఆశించాలా?

సుధామయ్ ఎడమవైపు ఛాతీలో నొప్పి ప్రారంభమైంది. అది పాతనొప్పి. అప్పుడప్పుడూ వచ్చే నొప్పి. అతనికి తలపోటుకూడా ప్రారంభమైంది. సి.ఎన్.ఎన్. టెలివిజన్ డిసెంబరు ఆరున అయోధ్యలో జరిగిన విధ్వంసాన్ని ఇంకా చూపుతోంది. ఇప్పుడు బాబ్రీమసీదును చూపించటం లేదు. దాన్నిగురించి చెప్పటం మాత్రమే జరుగుతోంది. అధికసంఖ్యాకులైన ముస్లిములనుంచీ, అల్పసంఖ్యాకులైన హిందువుల్ని రక్షించాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వం కోరటంచేతనే అలా జరుగుతోందని సుధామయ్ ఊహించాడు. కానీ చిన్న కారణానికూడా ఆవేశంతో రెచ్చిపోయే స్వభావం ఉన్న ప్రజలకు అల్లర్లు ప్రారంభించటానికి సి.ఎన్.ఎన్. వారి టెలివిజన్ ప్రసారం అవసరంలేదు. అతని ఛాతీలో గుచ్చినట్టుగా నొప్పివచ్చింది. నొప్పివచ్చినచోట చేతితో రుద్ది పరుపుమీద పడుకున్నాడు. మాయ వరండాలో ఆందోళనగా అటూఇటూ పచార్లు చేస్తోంది. తన కూతురు తాము ఎక్కడికైనా పారిపోయి తలదాచుకోవాలని కోరుకుంటోందని సుధామయ్‌కి తెలుసు. కానీ సురంజన్ పడకమీదనుంచీ లేవకపోతే అదెలా సాధ్యం? సుధామయ్ నిస్సహాయంగా సూర్యకాంతి పరుచుకున్న వరండాకేసి చూశాడు. అక్కడ కిరణ్మయి నీడ పొడవుసాగింది. ఆమె కదలకుండా కూచొని ఉంది. "మనప్రాణాలు కాపాడుకుందాం. ఎక్కడికైనా పారిపోయి తలదాచుకుందాం", అంటున్నాయి దీనంగా ఆవిడకళ్లు. సుధామయ్ తన ఇల్లువదిలి వెళ్ళాలనుకున్నా

ఎక్కడికి వెళ్లగలడు? ఇంతకుముందులాగా అటూ ఇటూ పరుగెత్తే వయసుకాదుకదా? గతంలో అతడు ఏనాడూ చేతులు ముడుచుకొని కూచోలేదు. పాకిస్తానీ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన స్థానిక ప్రదర్శనలకు తప్పకుండా నాయకత్వం వహించాడు. కుటుంబసౌఖ్యం, కుటుంబప్రేమ ఆపనులు చేయటానికి ఏనాడూ అడ్డురాలేదు. అనాటి శక్తి ఈనాడు రమ్మంటే ఎలా వస్తుంది? ప్రజాస్వామిక, మతాతీత బంగ్లాదేశ్‌లో ముస్లిములకున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, మత హక్కులు హిందువులక్కూడా ఉంటాయని ఆశించాడు. కానీ మతసమానత్వం క్రమక్రమంగా ఈదేశంలో తనస్థానాన్ని పోగొట్టుకుంది. ఈనాడు బంగ్లాదేశ్ జాతీయ మతం ఇస్లాం! 1971 లో జరిగిన స్వాతంత్ర్యపోరాటాన్ని వ్యతిరేకించిన లేదా అణిగిమణిగీ ఉన్న మతదురహంకారులు ఈనాడు దేశాన్ని ఏలుతున్నారు. ఊరేగింపులు తీస్తున్నారు. సమావేశాలు పెడుతున్నారు. 1990లో హిందువులకు వ్యతిరేకంగా జరిగిన క్రూరమైన పోరాటం వెనక ఉన్నది వీరే. హిందూ దేవాలయాలను కూలద్రోసినవారూ, హిందువుల దుకాణాలనూ, ఇళ్ళనూ తగలబెట్టినవారూ ఈ దుర్మార్గులే.

సుధామయ్ కళ్లుమూసుకున్నాడు. ఈసారి ఏం జరుగుతుందో అతనికి అర్థంకాలేదు. కానీ ఒకటిమాత్రం తథ్యం. హిందూ దురభిమానులు బాబ్రీమసీదును ధ్వంసం చేశారుకాబట్టి బంగ్లాదేశ్‌లోని హిందువులు బాధలు భరించక తప్పదు. 1990 లో సుధామయ్‌లాంటి హిందువుల్నికూడా ముస్లిం ఫండమెంటలిస్టులు వదిలిపెట్టలేదు. 1992 లో ఎందుకు వారిని కనికరించాలి? కాబట్టి వాళ్లు ఎలుకల్లా పారిపోవాలి. ఎందుకు? తాము హిందువులం కాబట్టి మాత్రమేనా? భారతదేశంలోని హిందువులు బాబ్రీ మసీదును కూల్చేశారు కాబట్టి మాత్రమేనా? దానికి తన్నెందుకు బాధ్యుణ్ణి చేయాలి? మళ్ళీ ఒకసారి వరండాలో పడుతున్న మాయ నీడకేసి చూశాడు. ఆనీడ స్థిరంగా ఉండటంలేదు. అకస్మాత్తుగా ఆనీడ గదిలోకి అదృశ్యమైపోయింది. ఆకర్షణీయమైన ఆవిడ నల్లనిముఖంనిండా ఆందోళన, ఫూసలుఫూసలుగా చెమట, మాయ అకస్మాత్తుగా గట్టిగా అంది, "మీరు కావాలంటే ఇక్కడే ఉండండి. ఇక్కడే కుళ్ళి చావండి. నేను వెళ్తున్నాను."

"ఎక్కడికెళ్లాలనుకుంటున్నావు?" కిరణ్మయి కఠినంగా ప్రశ్నించింది.

"నేను పరుల్ ఇంటికెళ్తున్నాను. మీకు బతకాలని లేకపోతే నేను చెయ్యగలిగింది ఏమీలేదు. అన్నయ్యకూడా ఈచోటును వదిలేలా లేడనుకుంటాను", అంది మాయ తల్లికంఠస్వరంలోని బెదిరింపును ఖాతరు చేయకుండా త్వరత్వరగా తలదువ్వుకుంటూ. "మరి నీపేరునేం చేస్తావ్? నీలాంజన అన్నపేరు నువ్వెవరో పట్టివ్వదా?" అన్నాడు సుధామయ్. అతనికి తన పేరు సిరాజుద్దీన్ అని గతంలో చెప్పుకోవటం జ్ఞాపకం వచ్చింది. మాయ చలించలేదు.

"ముస్లింకావాలనుకుంటే "లా ఇలాహ ఇల్లల్లాహు మహమ్మదున్ రసూలల్లా" అంటేచాలు. ఇప్పుడు అదే చేయబోతున్నాను. నాపేరు ఫిరోజాబేగం అని మార్చుకుంటాను," అంది.

"మాయా!" అంది కిరణ్మయి బాధగా.

తాను చేయబోతున్నపని తప్పుకాదన్నట్టుగా మాయ తల్లివేపు కోపంగా చూసింది. కిరణ్మయి ముఖంలో కనిపిస్తున్న బాధ మాయను కదిలించలేకపోయింది. సుధామయ్ బాధగా నిట్టూర్చి కిరణ్మయినీ, మాయనూ మార్చిమార్చి చూశాడు. అతడు మాయమనసులోని ఆందోళనను అర్థం చేసుకోగలిగాడు. ఆవిడ వయస్సు ఇరవైఒక్క సంవత్సరాలు మాత్రమే. 1947 లో భారతదేశ విభజనను ఆవిడ చూళ్లేదు. 1950 లోనూ 1964 లోనూ జరిగిన అల్లర్లు ఆవిడకు తెలియవు. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రం కావటాన్నికూడా ఆవిడ చూళ్లేదు. ఆవిడకు బుద్ధి తెలిశాక అర్థమైందల్లా బంగ్లాదేశ్‌లో అధికార మతం ఇస్లాం అనీ, తాము అల్పసంఖ్యాకులైన హిందువులమనీ, కాబట్టి తాము ఆదేశంలోని వ్యవస్థలో తరచుగా సర్దుబాట్లు చేసుకోక తప్పదనీ మాత్రమే. 1990 లో జరిగిన అల్లర్ల భయంకరానుభవం ఆవిడకు తెలుసు. తన ప్రాణాన్ని విసిరిపారేయాల్సిన అవసరం లేదని తెలుసుకోవటానికి అవసరమైన జ్ఞానాన్ని ఆ అనుభవం ఇచ్చింది............సుధామయ్ ఛాతీలో నొప్పి ఎక్కువైంది. అది అతని కళ్లలో ప్రతిఫలించింది. మాయ చుట్టూరా అల్లుకున్న ఆలోచనల్ని అతడు తన మనసులోంచి బయటికి తోసేశాడు.

★ ★ ★

సురంజన్‌కు టీ తాగాలన్న కోరిక తీరలేదు. అతడు లేచి బాత్‌రూంలోకి వెళ్ళాడు. పళ్ళు తోముకోవటానికి ముందుగానే మొదటి కప్పు టీ తాగుంటే బావుండేది. కానీ అది వీలుకాలేదు. ఇంట్లో మాయ ఉన్న ఛాయ కనిపించలేదు. ఆ అమ్మాయి నిజంగానే వెళ్లిపోయిందా? సురంజన్ నెమ్మదిగా పళ్ళు తోముకున్నాడు. ఇంటి వాతావరణం చాలా ఉద్విగ్నంగా – ఆ ఇంట్లో ఎవరో చనిపోవటానికి సిద్ధంగా ఉన్నట్టుగా – ఉంది. ఏ క్షణాన్నైనా తాము ఎదురు చూస్తూ ఉన్న మృత్యువులాంటి పిడుగు పడవచ్చు. టీ తాగాలన్న కోరిక దప్పిలా బాధపెడుతూ ఉండగా సురంజన్ సుధామయ్ గదిలోకి వెళ్ళాడు.

"మాయ ఏదీ?" పరుపుమీద కూర్చుంటూ అడిగాడు. సురంజన్ ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు. ఏదో ఆలోచిస్తూ కిటికీ పక్కన కూర్చొనిఉన్న కిరణ్మయి లేచి వంటగదిలోకి వెళ్లిపోయింది. పైకప్పునుచూస్తూ నిస్తేజంగా పడుకొనిఉన్న సుధామయ్ కళ్లుమూసుకొని, మరోవైపుకు తిరిగి పడుకున్నాడు. సురంజన్‌ను పట్టించుకోవాలని ఎవరికీ ఉన్నట్టులేదు. తనకు తల్లిదండ్రులపట్లా, చెల్లెలిపట్లా ఉన్న బాధ్యతను తాను నిర్వర్తించలేదేమోనని సురంజన్‌కు నెమ్మదిగా అర్థం కావటం ప్రారంభించింది. తాను తన కుటుంబం తలదాచుకోవటానికో చోటు చూడాలని అందరూ ఆశించారు. కానీ తానాపని చేయలేకపోయాడు. అంతేకాదు. సరిగ్గా చెప్పాలంటే చూడకూడదనుకున్నాడు.

మాయ జహంగీర్ అన్న యువకుణ్ణి ప్రేమిస్తూ ఉందని సురంజన్‌కు తెలుసు. అవకాశంఉంటే అతనితో బయటికి వెళ్ళిపోతుందనికూడా తెలుసు. ఇప్పుడావిడ వెళ్లిపోయింది. కాబట్టి ఎవరూ ఆవిడను ఆపలేకపోయారనేగా? నగరంలో అల్లర్లు ప్రారంభమైనప్పుడు హిందువుల్ని పరామర్శించటం ఉదారవాదులైన ముస్లిములకు

ఒక ఫాషన్‌గా వస్తోంది. జహంగీర్ తప్పకుండా మాయ క్షేమంగా ఉందోలేదో తెలుసుకోవటానికి వస్తాడు. అదే జరిగితే మాయతాను అదృష్టవంతురాలిననుకుంటుంది. కృతజ్ఞతాభావంతో అతణ్ణి పెళ్ళి చేసుకోవటానికి నిర్ణయించుకున్నా ఆశ్చర్యం లేదు. అతడు మాయకన్నా చదువులో రెండుక్లాసులు ముందున్నాడు. కానీ చిట్టచివరికి అతడు మాయను పెళ్లి చేసుకోకపోవచ్చన్న భయం సురంజన్‌కు లోపల్లోపల ఉంది. ఇలాంటి మతాంతర వివాహం బంగ్లాదేశ్‌లో దాదాపు అసంభవమని అతని అనుభవం చెబుతోంది. తాను పర్వీన్‌ను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. కానీ పర్వీన్ తన్ను ఇస్లాంలోకి మతం మార్చుకోమని కోరింది. తాను తిరస్కరించాడు. తమ పెళ్ళి జరగలేదు. తామిద్దరూ మతం మార్చుకోవాల్సిన అవసరంలేదని తాను చెప్పాడు. దీనికితోడు పర్వీన్ హిందువును పెళ్ళిచేసుకోవటం ఆవిడ కుటుంబానికి ఇష్టంలేదు. చివరికి వాళ్లు ఒక ముస్లింవ్యాపారస్తునితో తమ కూతురిపెళ్ళి జరిపించారు. పర్వీన్ గుండెలు పగిలిపోయేలా ఏడ్చింది. కానీ లాభంలేకపోయింది. కుటుంబం అభిప్రాయానికి ఆవిడ తలవంచక తప్పలేదు.

★ ★ ★

బయటున్న చిన్న వరండావైపు సురంజన్ బాధగా చూశాడు. వాళ్లుంటున్నది అద్దెఇల్లు. ఇంటిముందు ఖాళీస్థలం లేదు. హాయిగా ఒట్టికాళ్ళతో పచార్లు చేయటానికి చోటులేదు. కిరణ్మయి టీ తీసుకొని వచ్చింది. తల్లిచేతిలోంచీ టీకప్పు అందుకుంటూ సురంజన్ "డిసెంబరు నెలకూడా వచ్చేసింది. కానీ ఇంకా వాతావరణం చల్లబడాల్సినంతగా చల్లబడలేదు. శీతకాలంలో ఉదయంపూట పళ్ళరసం తాగటమంటే ఎంత ఇష్టమో జ్ఞాపకం వస్తోంది", అన్నాడు యధాలాపంగా. కిరణ్మయి నిట్టూర్చింది.

"ఇది అద్దెకొంప. తాజాపళ్ళరసం ఎలా దొరుకుతుంది? నేను ఎన్నో రకాల మొక్కలు పెంచుకున్న ఇంటినేమో తెగనమ్ముకున్నాం", అంది.

సురంజన్ టీ చప్పరించాడు. తోటమాలి తాజాపళ్ళ రసాన్ని తెచ్చి అందిచ్చే దృశ్యం అతనికి తీరని కోరికలా జ్ఞాపకం వచ్చింది. తోటలో చెట్లకింద కూచొని తానూ, మాయా అతణ్ణి ఉత్సాహంగా చూసేవాళ్ళు. తాము మాట్లాడటానికి నోరుతెరిస్తే తెల్లని పొగమంచు నోట్లోంచి వచ్చేది. అపచ్చని పొలాలు....తమపరుగులు....మామిళ్ళు, జామున్, పనసపళ్ళు, జామిపళ్ళు, పోకలు, కొబ్బరికాయలు ఆతోటల్లో పుష్కలంగా ఉండేవి.... ఇప్పుడవన్నీపోయాయి. మాటిమాటికీ సుధామయ్ చెబుతూ ఉండేవాడు, "ఇది నీతాతముత్తాతల పురిటిగడ్డ. దీన్నివదిలి పారిపోవద్దు".

దురదృష్టవశాత్తూ సుధామయ్ ఆ ఆస్తిని బలవంతంగా అమ్మవలసివచ్చింది. మాయకు ఆరేళ్ల వయస్సున్నప్పుడు ఒకరోజు బడినుంచి ఇంటికొస్తూ దారితప్పిపోయింది. పట్టణమంతా వెదికారు. కానీ దొరకలేదు. మాయవాళ్ల బంధువుల ఇళ్లకూ వెళ్లలేదు. స్నేహితుల్ని చూట్టానికి వెళ్లలేదు.... ఇంట్లో భయంకరమైన ఆందోళన. ఎడ్వర్డ్‌స్కూల్ గేట్లవద్ద ఎప్పుడూ పడిఉండే సోమరివెధవలు మాయను కిడ్నాప్‌చేశారేమో అనుకున్నారంతా. రెండురోజులతరువాత తనంతక్కుతానుగా మాయ తిరిగివచ్చింది. కానీ తన్ను ఎవరు తీసుకెళ్ళారో, ఈరెండురోజులూ ఎక్కడ ఉంచారో

మాత్రం చెప్పలేకపోయింది. ఈ సంఘటన తరువాత దాదాపు రెండునెల్లు మాయ చిత్రంగా ప్రవర్తించింది. సరిగ్గా నిద్రపోయేది కాదు. అర్ధరాత్రిపూట అకస్మాత్తుగా మేల్కొనేది. ఇతరుల్తో మాట్లాడాలంటే భయపడేది. ఒక్కోసారి రాత్రిపూట తమ ఇంటిమీద ఎవరో రాళ్ళు వేసేవాళ్లు. క్రమక్రమంగా ఆకాశరామన్న ఉత్తరాలు రాసాగాయి. మళ్ళీ మాయను బలవంతంగా ఎత్తుకుపోతామనీ, ప్రతిఫలంగా డబ్బు ్లించకపోతే విడిచిపెట్టమనీ అందులో బెదిరింపులు ఉండేవి. సుధామయ్ పోలీసులకు ర్యాదుచేశాడు. వాళ్ళు మామూలుగా ఫిర్యాదు తీసుకున్నారేకానీ ఆ తరువాత లాంటి చర్యా తీసుకోలేదు. వీటికితోడు ఇతర సమస్యలుండేవి. స్థానికంగా ఉన్న బ్బాయిలు వాళ్ల తోటమీద దాడిచేసేవాళ్ళు. పళ్లు కోసుకుపోయేవాళ్లు, పూలు తెంచేసేవాళ్ళు, కూరగాయలమళ్లను విచ్చలవిడిగా తొక్కేసేవాళ్ళు. దాన్నిగురించి తాము చేయగలిగింది ఏమీ ఉండేదికాదు. అధికార్లకు ఫిర్యాదు చేసి లాభంలేదనుకొని సుధామయ్ ఇరుగుపొరుగుల్తో చెప్పేవాడు. "దానికి మేమేం చేస్తాం. ఇది మామూలే. ఏం చేసినా పరిస్థితి మారదు", అనేవాళ్ళు వాళ్ళు. సురంజన్ కొంతమంది స్నేహితుల్ని కలుపుకొని ఈ రౌడీలసంగతి చూస్తాననేవాడు. కానీ సుధామయ్ ఒప్పుకోలేదు. మైమెన్‌సింగ్ వదిలిపెట్టి మరోచోటికి వెళ్లటానికి నిర్ణయించాడు. తన ఇంటిని అమ్మేయ్యాలనుకున్నాడు. దీనికి మరోకారణంకూడా ఉంది. ఆ ఇంటినిగురించి చాలాకాలంగా అనేక వ్యాజ్యాలుకూడా తలెత్తుతున్నాయి. అతని పొరుగు షౌకత్‌అలీ దొంగపత్రాలు సృష్టించి సుధామయ్ ఆస్తిలో చాలాభాగాన్ని కాజేయాలని ప్రయత్నించాడు. ఈకేసుతో సుధామయ్ విసిగిపోయాడు. ఇల్లు అమ్మివేయటానికి సురంజన్ అంగీకరించలేదు. అప్పుడు అతడు కాలేజీలో విద్యార్థిగా ఉండేవాడు. అతడు కొత్తకొత్త అభిప్రాయాలతో ఉత్సాహంగా ఉండేవాడు. అతడు కాలేజీ యూనియన్ తరపున కాలేజీ పరిపాలకమండలి సభ్యుడుగాకూడా ఎన్నికయ్యాడు. కావాలనుకుంటే అతడు ఆరౌడీలపని పట్టేవాడు. కానీ సుధామయ్ అంగీకరించలేదు. అతడు తన ఆస్తిని అమ్మేసి ఢాకాకు వెళ్ళిపోవాలనే నిశ్చయించుకున్నాడు. తన వైద్యవృత్తికూడా బాగా దెబ్బతింటోందనీ, స్వదేశీ బజార్‌లోని తన ఆస్పత్రికి రోగులు రావటం బాగా తగ్గిపోతోందనీ తన కుటుంబసభ్యులకు వివరించి చెప్పాడు. వచ్చే కొద్దిమందీ బీదహిందువులు మాత్రమే. నాన్నగారు మానసికంగా ఎలాంటి దీనమైన పరిస్థితిలో ఉన్నారో అర్థం చేసుకున్న సురంజన్ ఆ తరువాత మొండిపట్టు పట్టలేదు.

కానీ సురంజన్‌కు తను పెరిగిన విశాలప్రాంగణాన్ని గురించి జ్ఞాపకం ఉంది. రెండు భిగాల వైశాల్యం ఉన్న తమ ఇల్లు అతనికి బాగా జ్ఞాపకమే. కనీసం పదిలక్షల టాకాల విలువచేసే ఆభవంతిని రైసుద్దీన్ సాహెబ్‌కు రెండు లక్షల టాకాలకు తెగనమ్ముకోవటం కూడా అతనికి జ్ఞాపకమే.

వాళ్ళు ఊరు విడిచి బయలుదేరేరోజున సుధామయ్ కిరణ్మయితో అన్నాడు, "రా, సామాను సర్దుకుందాం. మనం బయలుదేరాలి". కిరణ్మయి నేలకూలిపోయి గొల్లుమంది. తాము నిజంగానే తమ పూర్వీకుల ఇంటిని ఖాళీచేసి వెళ్ళిపోతున్నామని నమ్మటానికి సురంజన్‌కు కష్టమనిపించింది. తాను పుట్టినచోటు, తాను పొలాల్లో

ఆడుకుంటూ బాల్యాన్ని గడిపిన చోటు, బ్రహ్మపుత్ర ప్రవహించేచోటు, తన నేస్తాలంతా ఉన్నచోటు.... అచోటు విడిచి అతనికి వెళ్లాలనిపించలేదు. సుధామయ్ అలాంటి నిర్ణయం తీసుకోవటానికి ప్రధానకారణం మాయ. కానీ మాయకూ్కడా పుట్టి పెరిగిన ఊరు వదిలివెళ్ళటం ఇష్టంలేకపోయింది.

"నేను సూఫియాను వదిలి వెళ్ళను", అంది.

సూఫియా ఆవిడ బడినేస్తం. వాళ్ళుంటున్న ప్రాంతంలోనే ఉండేది. వాళ్లిద్దరూ ప్రతిసాయంకాలమూ పిడతలూ, బొమ్మలూ పెట్టుకొని గంటలతరబడి ఆడుకుంటారు. వాళ్ళిద్దరూ చాలా అన్యోన్యంగా ఉంటారు.... సుధామయ్‌కి కూడా అలాగే ఉంది. ఇల్లు అమ్మేసి వెళ్లిపోవాలన్న తన నిర్ణయం విషయంలో గట్టిగా ఉన్నాడేగానీ తాను పుట్టిన చోటు వదిలి వెళ్ళటానికి అతనికీ బాధగానే ఉంది. "జీవితం చాలా చిన్నది. నేను నా పిల్లల్తో మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా గడపాలి", అని తనకుతాను చెప్పుకున్నాడు. కానీ ఇతరచోట్లలో ప్రశాంతంగా జీవించటానికి వీలౌతుందా? వీలుకాదేమో – అనుకున్నాడు సురంజన్.

ఢాకా చేరగానే సుధామయ్ బరువు తగ్గినట్లుగా నిట్టూర్చాడు. అతడు అడుగుపెట్టింది స్వతంత్ర ఢాకాలోనే. కానీ అతడు తన ధోవతిని విసర్జించి పైజమాలు వాడటం ప్రారంభించక తప్పలేదు. కొంతకాలం తరువాత సురంజన్‌కు నాన్నగారి పరిస్థితేమిటో అర్థం కావటం ప్రారంభించింది. పరిస్థితులు అతణ్ణి ఇక్కడికి నెట్టుకొచ్చాయి. తమకూ, ప్రశాంత జీవితానికీ మధ్య ఒకదాటలేని కంచె ఉంది. దాన్ని అతడుకానీ, అతని కొడుకుకానీ దాటి ముందుకెళ్లే ప్రసక్తేలేదు......

ఇలా ఆలోచిస్తూ సురంజన్ పరుపుమీద జారగిలపడి కూర్చున్నాడు. అలా కూచొని వరండాలో పరుచుకున్న సూర్యకాంతిని చూస్తున్నాడు. ఉన్నట్టుండి దగ్గరౌతున్న ఊరేగింపు శబ్దం అతని చెవుల్లో పడింది. అతని విశ్రాంతికి భంగం కలిగింది. ఊరేగింపు దగ్గరపడుతున్నకొద్దీ అందులోంచి వినిపిస్తున్న నినాదాలను సురంజన్ శ్రద్ధగా విని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు. ఆ అరుపుల్ని అర్థం చేసుకునే ప్రయత్నంలో సుధామయ్, కిరణ్మయికూడా ఆందోళనకూ, ఉద్వేగానికీ గురయ్యారు. కిరణ్మయిలేచి కిటికీ తలుపుల్ని మూసివేయటాన్ని సురంజన్ గమనించాడు. ఊరేగింపు వాళ్లింటిపక్కనుంచీ వెళ్తోంటే వాళ్ళ అరుపులు స్పష్టంగానే వినిపించాయి. "ఒకరో ఇద్దరో హిందువుల్ని పట్టుకుందాం, ఉదయం సాయంకాలం వాళ్లను తిందాం". నాన్నగారు గజగజలాడిపోవటం సురంజన్‌కు కనిపించింది. అమ్మ తానప్పుడే మూసిన కిటికీవైపు వీపుతిప్పి నిలబడింది. 1990 లో కూడా ఇదే నినాదం వినిపించటం సురంజన్‌కు జ్ఞాపకం వచ్చింది. ఎవరు వీళ్ళు? వాళ్ళు అదే ప్రాంతంలో నివసిస్తున్న అబ్బాయిలే కావటం చిత్రం! జబ్బార్, రంజాన్, ఆలంగీర్, కబీర్, అబెదీర్! వీళ్లంతా అదే బస్తీలో నివసిస్తున్న తన స్నేహితులే. తరచుగా కలుసుకుంటూ, ద్వేషాలులేకుండా చర్చించుకుంటూ, ముఖ్యమైన విషయాలను గురించి ఉమ్మడి నిర్ణయాలు తీసుకుంటూ ఉన్న మిత్రబృందమే. వాళ్లే సురంజన్ని ఫలహారం చేయాలనుకుంటున్నది.

★ ★ ★

సుధామయ్ ఢాకాకు రాగానే అసిత్ రంజన్ తంతీబజార్‌లో అతనికో ఇల్లు చూసిపెట్టాడు. "చూడు సుధామయ్, నువ్వు కలిగిన ఇంట్లో పుట్టినవాడివి. ఈ అద్దె ఇంట్లో ఉండగలవా?" అన్నాడు.

"ఎందుకుండలేనూ? ఇతర్లు ఉండటంలేదా?" అన్నాడు సుధామయ్.

"ఉంటున్నారు. కానీ పుట్టినప్పట్నుంచీ నీకు ఏనాడూ దేనికీ కరువులేదు. నీ సొంత ఇంటిని ఎందుచేత అమ్మావో నాకు తెలీదు. మాయ చాలా చిన్నపిల్ల. మన ఆడపిల్లలకు ఎదురయ్యే ప్రమాదాలు అందుకు కారణం కాకపోవచ్చు. నిజానికి మా అమ్మాయి ఉత్పలను కలకత్తాకు పంపేయాల్సి వచ్చింది. భయపడకుండా, అల్లరి పడకుండా కాలేజీకి వెళ్లటం వీలయ్యేదేకాదు. మన ఊరి యువకులు ఆవిడను అల్లరి పెట్టేవాళ్లు. ఎత్తుకుపోతామని బెదిరించేవాళ్లు. ఇప్పుడా అమ్మాయి తిల్జాలాలో వాళ్ల మేనమామ ఇంట్లో ఉంటోంది. చూడు దాదా, ఎదిగిన కూతురు ఉండటానికి మించిన ఆందోళన మరొకటి లేదనుకో".

అసిత్ రంజన్ చెబుతున్న మాటల్లో ఎంతో మంచి లోకజ్ఞానం ఉందని సుధామయ్‌కి తెలుసు. అతని మాటలు వింటుంటే కొంతకాలం క్రితం ఒక గుంపు రౌడీలు నడివీధిలో తనవద్ద చదువుకునే ఒక అమ్మాయికి చీరలాగేయటం సుధామయ్‌కి జ్ఞాపకం వచ్చింది. ఆ అమ్మాయి ముస్లిం, ఆమెమీద దుర్మార్గం చేసినవారూ ముస్లిములే. అమ్మాయిల దగ్గరికొచ్చేసరికి హిందూముస్లిం తేడాలు లేవు. బలవంతులు బలహీనుల్ని పీడించటం – బలవంతులైన మొగవాళ్ళు బలహీనులైన ఆడవాళ్లను పీడించటం. అసిత్ రంజన్ ఎలాంటి ప్రమాదాలనూ కొనితెచ్చుకోలేదు. తన ఇద్దరు కూతుళ్ళనూ కలకత్తాకు పంపేశాడు. అతడు బాగా డబ్బు సంపాదించాడు. ఇస్లాంపూర్‌లో అతనికో నగలదుకాణం ఉంది. అతనికున్న పాత రెండంతస్తుల మేడను బాగుచేయాలనికానీ, ఆధునికంగా చేయాలనికానీ అతడు అనుకోవటంలేదు.

"చూడు దాదా, సంపాదించిందంతా ఖర్చు పెట్టెయ్యకు. కొద్దిగా దాచుకో. కావాలంటే నువ్వు దాచుకున్న డబ్బును అక్కడున్న మా బంధువులకు పంపుదాం. వాళ్ళు నువ్వు ఇల్లుకట్టుకోవడానికి కొంతస్థలాన్ని కొనిపెడతారు", అన్నాడు.

"అక్కడ అంటే?" అని అడిగాడు సుధామయ్.

"కలకత్తాలో. నేనుకూడా కొన్నాను", అన్నాడు అసిత్‌రంజన్ గొంతుతగ్గించి.

సుధామయ్‌కి చాలా కోపం వచ్చింది. "అంటే నువ్వు ఇక్కడ డబ్బు సంపాదించి అక్కడ – ఆదేశంలో – ఖర్చు పెడతావన్నమాట. నిన్ను దేశద్రోహి అనాలి", అన్నాడు.

సుధామయ్ కోపాన్ని చూసి అసిత్ రంజన్ ఆశ్చర్యపోయాడు. ఒక హిందువు అలా మాట్లాట్టం అసిత్‌రంజన్ చూళ్లేదు. వాళ్ళ భవిష్యత్తు బంగ్లాదేశ్‌లో అనిశ్చితంగా ఉండటంచేత హిందువులంతా భారతదేశంలో ఆస్తులు కొంటున్నవారే.

ఇక్కడే స్థిరపడిపోతే ఏదో ఒకరోజు బతుకు బజార్లో పడవచ్చు. ప్రమాదాలు కొనితెచ్చుకోవటం ఎందుకూ?

★ ★ ★

తాను మైమెన్‌సింగ్‌ను ఎందుకు వదిలివచ్చానా అని సుధామయ్ అప్పుడప్పుడూ ఆశ్చర్యపోతుంటాడు. తనకు తన పూర్వీకుల ఇంటిమీదున్న మమకారం తానా పనిచేయకుండా ఎందుకు ఆపలేకపోయిందో? మాయ క్షేమాన్ని గురించి సమస్యలొచ్చాయి. కానీ ఎక్కడున్నా అలాంటి సమస్యలు వస్తూనే ఉంటాయి. కిడ్నాపుల్ని గురించి ఆలోచిస్తే అది హిందువులకూ, ముస్లిములకూ కూడా జరుగుతోంది. కిడ్నాపులకు గురైన పిల్లల కుటుంబాలు పడేబాధ – వాళ్ళు హిందువులైనా, ముస్లిములైనా – ఒకేరకంగా ఉంటోంది, మళ్ళీ ఈ ప్రశ్న మొదటికే వస్తోంది. తన దేశంలోనే తాను ఎందుకోసం భయపడ్డాడు, ఎందుకోసం భద్రత లేదనుకున్నాడు? తాను హిందువు కాబట్టేనా? బిగ్గరగా ఈ ప్రశ్నను అడగలేకపోయాడు సుధామయ్. తంతీబజారులోని ఆ ఇరుకుకొంపలో కూచొని తాను తన పూర్వీకుల ఇంటిని వదిలి రావటానికున్న కారణాలను గురించి ఆలోచిస్తున్నాడు. తాను ఈ కొత్తచోటికెందుకొచ్చాడు? తాను తన నుంచీ పారిపోయి వచ్చాడా? పెద్ద ఆస్తిపరుడైన తాను కాందిశీకునిలా ఎందుకు బాధపడుతున్నాడు? దొంగపత్రాలు సంపాదించుకున్న షౌకత్ అలీ కేసు గెలుస్తాడనీ, తాను ఓడిపోతాడనీ అనుకున్నాడా? తన సొంత ఇంటిమీదనే వ్యాజ్యం వస్తే ఎంత బాధగా ఉంటుంది? బాగా ఆలోచిస్తే కేసు పోవటానికిముందే ఆత్మగౌరవంతో ఆ ఊళ్లో నుంచి బయటపడటం ఒకరకంగా మంచిపనే. తన బంధువొకతను ఎంతో ప్రయత్నించాడుకానీ తన ఇంటిని నిలుపుకోలేకపోయాడు. అతడు తంగైల్ పట్టణంలో అకుర్‌టకుర్ మొహల్లాలో ఉండేవాడు. జమీర్‌మున్షీ అన్న పొరుగింటివాడు అతని భూమిలో ఒక గజం తనకు రావాలన్నాడు. ఈ వివాదం కోర్టుకెళ్లింది. ఐదేళ్ల తరువాత జమీర్ మున్షీకి అనుకూలంగా జడ్జిమెంటు వచ్చింది. సుధామయ్ మామయ్య తారాపాద ఘోషాల్ కూడా బంగ్లాదేశ్‌ను వదిలి భారతదేశానికి వెళ్లవలసిన పరిస్థితులు వచ్చాయి. తారాపాద్ పడ్డ బాధలు తానుకూడా పడవలసి వస్తుందని తన పెద్దల ఆస్తిని అమ్మేశాడా? కావచ్చు. దానికితోడు ఆ ప్రాంతంలో తన ప్రాధాన్యత క్రమక్రమంగా తగ్గిపోవటాన్ని సుధామయ్ గమనించాడు. చాలామంది స్నేహితులు – చనిపోవటంవల్లనో, భారతదేశానికి వలసపోవటంవల్లనో – దూరమయ్యారు. బ్రతికున్నవాళ్ళూ, అక్కడే ఉండిపోయిన వాళ్లూ అన్ని ఆశలూ పోగొట్టుకున్నారు... ..దాదాపుగా బ్రతికుండటమే వృధా అన్న నిర్ణయానికొచ్చారు. వాళ్లతో సుధామయ్ ఎప్పుడు మాట్లాడినా భయంకరమైన భూతం ఏదో వచ్చి అర్థరాత్రిపూట తమ మీద పడిపోతుందన్న భయంతో వాళ్లు బ్రతుకుతున్నట్టుగా అనిపించేది. వాళ్ళందరికీ స్వప్నసీమ భారతదేశం. దొరికిన మొదటి అవకాశాన్ని ఉపయోగించుకొని భారతదేశానికి పారిపోవాలని వాళ్ళంతా రహస్యంగా పథకాలు వేస్తుండేవారు. వాళ్లతో సుధామయ్ ఎప్పుడూ అంటూ ఉండేవాడు, "ఈ దేశంలో యుద్ధం వస్తే మీరు పిరికిపందల్లా పారిపోతారు. మన దేశానికి స్వాతంత్ర్యం

వచ్చాక తిరిగొచ్చి మేం వీరులమంటారు. ఇప్పుడు....చిన్న కారణం దొరికితేచాలు భారతదేశానికి పారిపోవాలని ప్రయత్నిస్తారు. మీరంతా పిరికిపందలు". అతని కోపాన్నీ, అసహ్యాన్నీ చూసి జతిన్ దేవనాథ్, తుషార్ కాక్, ఖగేశ్ కిరణ్ లాంటి స్నేహితులు దూరం కావటం ప్రారంభించారు. ఒకవేళ అనుకోకుండా తారసపడ్డా అతని సమక్షంలో ఇబ్బందిగా ఉండేవాళ్ళు. క్రమక్రమంగా సుధామయ్ తన ఊళ్లోనే పరాయివాడైపోయాడు. కారణాలు వేరైనా షుకూర్, ఫైజల్, మజీద్, గఫార్ లాంటి ముస్లిం స్నేహితులుకూడా క్రమక్రమంగా దూరం కావటం ప్రారంభించారు. ముస్లిం స్నేహితుల ఇళ్ళకు వెళ్తే చిత్రమైన పరిస్థితులు ఎదురయ్యేవి. "సుధామయ్, ఆ పక్కగదిలో కూచో, నేను నమాజ్ చేసుకునేదాకా", అనేవాళ్లు. లేదా, "ఓ... ఈరోజొచ్చావా? ఈరోజు మాఇంట్లో "మిలాద్" ఉందే....." అనేవాళ్లు.

అతని వామపక్ష స్నేహితులు వయస్సు మళ్లగానే మతాన్ని ఆశ్రయించటం ప్రారంభించారు. అలాంటి విషయాల్లో ఏనాడూ ఆసక్తిలేని సుధామయ్‌కి రానురానూ స్నేహితులే కరువైపోయారు. హేతువాదం, సంవేదన, మానవత్వం తనకు ఎంతో ప్రియమైన సొంత ఊళ్లో క్రమక్రమంగా కృశించి పోతూ ఉండటం సుధామయ్ హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది. చిట్టచివరికి అతడు బంగ్లాదేశ్ నుంచీ కాదుగానీ తన ప్రియమైన మైమెన్‌సింగ్ నుంచీ పారిపోవాలనుకున్నాడు. తన కలల్ని మృత్యువు చెరిపివేసేలోగా అతడు పారిపోవాలనుకున్నాడు.

మొదట సురంజన్ ఆ చిన్న ఇంట్లో సర్దుకోలేకపోయాడు. గట్టిగా తిరగబడ్డాడుకూడా. కానీ క్రమక్రమంగా కొత్త జీవిత పద్ధతికి అలవాటు పడసాగాడు. యూనివర్సిటీలో చేరాడు. కొత్త స్నేహితుల్ని సంపాదించుకున్నాడు. తన పరిసరాల్ని ప్రేమించటం నేర్చుకున్నాడు. కొంతకాలం రాజకీయాల్లో ఆసక్తి చూపించాడు, సమావేశాల్లో, ఊరేగింపుల్లో పాల్గొనేవాడు.......

కొత్తవాతావరణానికి అలవాటు పడలేక కిరణ్మయికూడా చాలా బాధపడింది. రాత్రిపూట నిద్రలేచి కూచొని తాను వదిలిపెట్టి వచ్చిన తన ప్రియమైన ఇంటిని తలుచుకొని కన్నీళ్లు పెట్టుకునేది. తాను చిక్కుడు తీగకువేసిన పందిరి అలాగే ఉంటుందా లేదా అని ఆలోచించేది. రుచిలో ఊళ్లో సాటిలేని తమ పెరట్లోని జామపళ్లను గురించీ, పచ్చని కొబ్బరిచెట్లను గురించీ ఆలోచించేది. వాటిని శ్రద్ధగా చూసుకుంటున్నారో లేదోనని బాధపడేది..... సుధామయ్ బాధకూడా అంతకంటే తక్కువకాదు....

★ ★ ★

ఢాకాలో సుధామయ్ ఒక సీనియర్ గవర్నమెంట్ ఉద్యోగానికి అర్జీ పెట్టాడు. అతడు మైమెన్‌సింగ్‌లో చేస్తూ ఉండిన ఉద్యోగానికి అది ప్రమోషన్ లాంటిది. తన అర్జీ సంగతి తెలుసుకుందామని అతడు మంత్రిగారి కార్యాలయానికి వెళ్తుండేవాడు. అతణ్ణి గుమాస్తాలు కూచునే చిన్నగదిలో వేచి ఉండమనేవాళ్లు. ఒక్కోసారి అసిస్టెంట్ ప్రైవేట్ సెక్రటరీ గదిలో కూర్చోవటానికి అనుమతించేవారు. "నా ఫైలు

వారు చూస్తారా, దయచేసి చెప్పండి", అని తరచు అడిగేవాడు. కానీ ఏనాడూ సంతృప్తికరమైన సమాధానం లభించేదికాదు.

అప్పుడప్పుడూ ఆ కార్యాలయంలోని వాళ్ళు పొడిపొడి మాటల్తో జవాబు చెప్పేవాళ్ళు. అంతే. మరికొందరు "డాక్టర్‌గారూ! మా అమ్మాయికి కడుపునొప్పిగా ఉంది. ఛాతీ ఎడమవైపున కూడా నొప్పివస్తోంది. ఏవైనా మందులు రాసిస్తారా?" అని అడిగేవాళ్ళు. సుధామయ్ బ్రీఫ్‌కేస్ తెరిచి, ప్రిస్క్రిప్షన్ పాడ్ తీసి శ్రద్ధగా పెద్దపెద్ద అక్షరాల్తో మందులపేరు రాసిచ్చేవాడు. ఆ తరువాత "ఫరీద్‌బాబూ, నాపని జరుగుతుంది కదా!" అని అడిగేవాడు. ఫరీద్‌బాబు తియ్యగా చిరునవ్వునవ్వి, "మీరు నిజంగా ఇదంతా మా చేతుల్లో ఉందనుకుంటున్నారా?" అనేవాడు.

తరువాత కొన్నాళ్ళకు తనకంటే జూనియర్లకు ప్రమోషన్లు వచ్చాయని సుధామయ్ తెలుసుకున్నాడు. అతని ఎదుటే అతని ఫైల్‌ను డా. కరీముద్దీన్, డా. యాకూబ్ మొల్లాల ఫైళ్ళ క్రింద పెట్టారు. వీళ్ళు అప్పుడప్పుడే అసోసియేట్ ప్రొఫెసర్లుగా ఉద్యోగం ప్రారంభించారు. సుధామయ్ జోళ్ళరిగిపోయేలా తిరిగినా లాభం లేకపోయింది. ఎన్నిసార్లు ఆ ఆఫీసుకు వెళ్ళినా ఒకే సమాధానం లభించేది. "బహుశా రేపు మీ పని జరగవచ్చు. ఈరోజు మాత్రం కాదు. మీఫైలు మంత్రిగారికి పంపాం", అనేవారు. "ఈరోజు వీలుకాదు. ఎల్లుండి రండి. సెక్రటరీగారు ఒక సమావేశంలో ఉన్నారు", అనేవారు. లేదా "మంత్రిగారు విదేశాలకు వెళ్ళారు. ఒకనెల తరువాత వస్తారు", అనేవారు. ఇలా తిరగటంవల్లా వేచి ఉండటంవల్లా ఫలితం లేదని తెలిసేదాకా ఈ మాటల్ని సుధామయ్ చాలా శ్రద్ధగా విన్నాడు. ఇలా రెండేళ్లు ప్రమోషన్ కోసం ప్రయత్నించాడు. యోగ్యత ఉన్నా లేకపోయినా కొందరికి మాత్రమే అది లభిస్తుందని అతనికి రెండేళ్ళ తరువాత అర్థమైంది. ఈలోగా పదవీవిరమణ వయస్సు దగ్గరపడింది. అతడు కనీసం అసోసియేట్ ప్రొఫెసర్ కావలసింది. కానీ కాలేకపోయాడు. ఉద్యోగానికి సంబంధించినంత వరకూ అతడు ఏనాడూ తనకిది కావాలని గట్టిగా అడిగినవాడు కాదు......

సుధామయ్ చిట్టచివరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రిటైరయ్యాడు. మాధవ చంద్రపాల్ అని అతనికో సహోద్యోగి ఉండేవాడు. సుధామయ్ రిటైరైన రోజు అతడు సుధామయ్ మెళ్ళో ఒక బంతిపూల దండవేసి రహస్యంగా, "చూడు సుధామయ్ ఈ ముస్లిందేశంలో మనం ఇంతకంటే ఎక్కువ ఆశించి లాభంలేదు. మనకు లభించిందే చాలు", అని సంతోషంలేని నవ్వు నవ్వాడు. మాధవ చంద్రకూడా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉండేవాడు. రెండుసార్లు అతనికి రావాల్సిన ప్రమోషన్ అతని జూనియర్లకు వచ్చింది. అతనిమీద కొన్ని నేరారోపణలుండేవి. అందులో ఒకటి అతడు సోవియట్ యూనియన్‌లో పర్యటించాడన్నది. మాధవచంద్ర అభిప్రాయం సరైందని సుధామయ్‌కి అర్థమైంది. ఈ దేశంలో బహిరంగంగా హిందువులపట్ల వ్యతిరేకత కనిపించదు. ప్రభుత్వంలోనూ, పోలీస్ దళంలోనూ, సైన్యంలోనూ హిందువులకు ఉద్యోగాలూ, ప్రమోషన్లూ ఇవ్వగూడదన్న సూత్రం ఏదీ బంగ్లాదేశ్ రాజ్యాంగంలో లేదు. కానీ ప్రభుత్వంలో సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ పదవుల్ని

ఏనాడూ హిందువులు అధిష్ఠించలేదన్నది మాత్రం సత్యం. దాదాపు ముగ్గురు జాయింట్ సెక్రటరీలూ, మరికొందరు డిప్యూటీ సెక్రటరీలూ మాత్రం ఉన్నారు. కానీ ఈ ఉద్యోగులెవరూ ప్రమోషన్లు ఆశించటంలేదని సుధామయ్‌కి గట్టిగా తెలుసు. పోలీసు శాఖలో చూస్తే మొత్తం దేశంలో ఆరుగురు హిందూ డి.సి.లు మాత్రమే ఉన్నారు. హైకోర్టులో ఒకే హిందూ జడ్జి ఉన్నాడు. పోలీసుశాఖలో తక్కువస్థాయి ఉద్యోగాల్లో కొందరు హిందూ ఉద్యోగులున్న మాట వాస్తవమే. కానీ దేశం మొత్తంమీద ఒకే ఒక హిందువుకూడా సూపరెంటెండెంట్ స్థాయిలో లేడు. ఈ వాస్తవాల్ని అంగీకరించటానికి సుధామయ్‌కి చాలా కాలం పట్టింది. అప్పుడతడు తాను అసోసియేట్ ప్రొఫెసర్ కాకపోవటానిక్కారణం తాను సుధామయ్ దత్తా అన్న పేరుకల హిందువుకావటమే కారణమని తెలుసుకున్నాడు. తనపేరు మహమ్మద్ ఆలీగానో, సలీముల్లాచౌదరిగానో ఉంటే తన దారిలో ఎలాంటి అడ్డంకులూ ఉండేవికావు. ఇలాంటి వ్యతిరేకత ప్రభుత్వోద్యోగులకు మాత్రమే పరిమితం కాదు. వ్యాపారరంగంలో కూడా హిందువు తనంతకు తానుగా ఏమీ సాధించలేడు. హిందువుపేరుతో మాత్రమే ఉన్న వ్యాపారసంస్థకు లైసెన్స్ లభించదు. అతనికో ముస్లిం భాగస్తుడు తప్పకుండా ఉండి తీరవలసిందే. ఏ జాతీయ బాంకుగానీ, వ్యాపారసంస్థలకు సాయం చేసే మరే ఇతర బాంకుగానీ హిందూ వ్యాపారసంస్థలకు సాయం చేయదన్నది మరింత ముఖ్యమైన వాస్తవం.

ఈ నిరాశల్ని తట్టుకొని సుధామయ్ దత్త ఎలాగో తంతీబజార్‌లో కాపురం పెట్టాడు. ఇంటిని నివాసయోగ్యంగా తయారుచేసుకున్నాడు. పుట్టిన ఊరిని వదిలాడుకానీ పుట్టిన దేశాన్ని వదలటం తనకు సాధ్యం కాదని తెలుసుకున్నాడు. "మైమెన్‌సింగ్ మాత్రమే నా మాతృభూమికాదు. బంగ్లాదేశ్ మొత్తం నా మాతృభూమి", అనికూడా అతడు చాలా తరచుగా అంటుండేవాడు.

అతని కుటుంబంలోని ఇతరసభ్యుల అభిప్రాయాలు ఇలాగే ఉండేవికావు. "నేను మన చెరువులో చేపలు పెంచుకుంటూ, కొత్తకూరగాయల మొక్కలు నాటుకుంటూ ఉండవలసినదాన్ని. పిల్లలు మనతోటలో పండిన తాజాపళ్ళు తినేవాళ్ళు. ఇప్పుడు మన సంపాదనంతా ఈ ఇంటి అద్దెకే సరిపోతోంది", అనేది నిట్టూరుస్తూ కిరణ్మయి. లేదా అర్ధరాత్రిపూట లేచికూచొని, "మనం ఇల్లమ్మితే వచ్చిన డబ్బూ, మీ రిటైర్మెంటు తరువాత వచ్చిన డబ్బూ కలిస్తే పెద్ద మొత్తమే అవుతుంది. మనం భారతదేశానికి వెళ్ళిపోదాం పదండి.... మనబంధువులు చాలామంది ఇప్పటికే అక్కడికి వెళ్ళిపోయారు", అనేది.

ఆవిడ సలహాలకు సుధామయ్ ఎప్పుడూ ఒకే సమాధానం చెప్పేవాడు. "మీ బంధువులు ఒకపూట అన్నమైనా పెడతారనుకుంటున్నావా? నువ్వు వాళ్ళ ఇళ్ళలో ఉండటం కుదురుతుందనుకున్నావేమో! కానీ నువ్వు చుట్టపుచూపుగా వచ్చావని మాత్రమే వాళ్ళు అనుకుంటారు. కాస్త టీ తీసుకుంటారా? ఎక్కడుంటున్నారు? – అని వాళ్ళనటానికి ఎంతోకాలం పట్టదు", అనేవాడు.

"మన సొంత డబ్బుంటే ఇతరుల దయాదాక్షిణ్యాలు మనకెందుకూ?" అని కిరణ్మయి పట్టుబట్టేది. "సొంత ఊరును వదిలివచ్చినంతమాత్రాన సొంతదేశాన్ని వదిలి వెళ్ళాలనిలేదు", అనేవాడు.

★ ★ ★

వాళ్ళు కొంతకాలం తంతీబజార్లో ఉన్నారు. ఆ తరువాత అర్మనితోలాకు మారారు. అక్కడ ఆరేళ్ళున్నారు. చిట్టచివరికి టికాతులీకి మారారు. అక్కడే గత ఏడేళ్ళుగా ఉంటున్నారు. ఈలోగా తనకు గుండె జబ్బు ఉందని సుధామయ్ తెలుసుకున్నాడు. అతడు ఉద్యోగం నుంచీ రిటైరయ్యాక సాయంకాలాల్లో గోపీబాగ్‌లో ప్రైవేట్ ప్రాక్టీస్ చేసేవాడు. ఇప్పుడు ప్రతిరోజా వెళ్ళలేకపోతున్నాడు. పేషంట్లు ఇంటికే వస్తారు. డ్రాయింగ్ రూంలో రోగుల్ని పరీక్షచేయటంకోసం ఒకబల్ల ఏర్పాటు చేసుకున్నాడు. ఆగదిలో ఒక మంచమూ, ఒక పేము సోఫా, కొన్ని కుర్చీలూ కూడా ఒక మూల ఉన్నాయి. అందులో ఉన్న పుస్తకాల అలమార్లో రకరకాల పుస్తకాలున్నాయి. వైద్యపత్రికలూ, సాహిత్య గ్రంధాలూ, సామాజిక, రాజకీయ శాస్త్రాలమీద గ్రంథాలూ అందులో కనిపిస్తాయి. సుధామయ్ ఎక్కువ కాలం ఆగదిలోనే గడుపుతాడు. సాయంకాలంపూట నిషిత్‌బాబు, అక్తరుజ్జమాన్, షహీదుల్ ఇస్లామ్, హరిపాద లాంటి వాళ్ళు వస్తుంటారు. దేశంలోని రాజకీయ పరిస్థితిని గురించి చర్చించుకుంటారు. కిరణ్మయి అందరికీ టీ చేసి ఇస్తుంది. వీరిలో ఎక్కువమంది – రకరకాల జబ్బులుండటంచేత – చక్కెరలేకుండా టీ తాగుతారు. వీరంతా వయస్సు పైబడుతున్నవాళ్లేకూడా. సుధామయ్‌కూడా వాళ్ళలో వాడే.........

దగ్గరపడుతున్న మరో ఊరేగింపు శబ్దం గదిలోకి రావటంతో సుధామయ్ అదిరిపడ్డాడు. సురంజిన్ పళ్ళుబిగించి కోపంతో ఒణికి పోయాడు. కిరణ్మయి భయపడిపోయింది. కానీ మొదట కంగారుపడ్డ సుధామయ్ ఆతరువాత చాలా చిత్రంగా ప్రశాంతంగా మారిపోయాడు. అతడు ఎందుచేత ప్రతిస్పందించటం లేదు? అతనిలో కోపమో, భయమో కనిపించాల్సిన అవసరం లేదా?

★ ★ ★

# రెండవరోజు

సురంజన్ స్నేహితుల్లో చాలామంది ముస్లిములే. వీళ్లలో మతాభిమానం అతిగా ఏనాడూ ఉండేదికాదు. సురంజన్ హిందువే అయినా వీళ్ళు అతణ్ణి ఆత్మీయుడైన స్నేహితుడుగా స్వీకరించాడు. ఉదాహరణకు గత ఏడాది కమాల్ సురంజన్ కుటుంబాన్ని మొత్తం తన ఇంటికి ఆహ్వానించాడు. సురంజన్‌కు కాజల్, అషీం, జైదేవ్‌లాంటి హిందూ స్నేహితులుకూడా ఉండేవారు. కానీ అతడు పులోక్, కమాల్, హైదర్, బెలాల్, రైబుల్‌లాంటి ముస్లిం స్నేహితులకే దగ్గరగా ఉండేవాడు. వాస్తవానికి సురంజన్‌కు ఎప్పుడు ఇబ్బందులొచ్చినా అతని హిందూ స్నేహితులకంటే హైదర్, కమాల్, బెలాల్‌లాంటి ముస్లిం స్నేహితులే ఎక్కువ ప్రేమగా వచ్చి ఆదుకున్నారు. ఒకసారి సుధామయ్‌ని రాత్రి ఒకటిన్నరకు సుహ్రావర్దీ ఆసుపత్రిలో చేర్చాల్సి వచ్చింది. అతనికి గుండెపోటు వచ్చిందనీ, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళాలనీ డా. హరిపాద చెప్పాడు. సురంజన్ ఈ విషయాన్ని కాజల్‌తో చెప్పాడు. "ఇంత రాత్రప్పుడు ఎలా తీసుకెళ్తాం? తెల్లారేవరకూ చూద్దాం. ఆతరువాత ఏదో ఒకటి చేద్దాం", అన్నాడు అతడు ఆవులిస్తూ. ఇదే విషయాన్ని బెలాల్‌తో అంటే అతడు తన కారుకోసం పరుగెత్తాడు. అన్ని ఏర్పాట్లూ తానే చేశాడు. సుధామయ్‌ని ఆస్పత్రిలో చేర్పించాడు. సురంజన్‌కు సాయంగా ఎప్పుడూ అందుబాటులోనే ఉన్నాడు. "మామయ్యగారూ, బాధపడకండి, అంతా సవ్యంగా జరుగుతుంది. నేను మీ కొడుకేననుకోండి", అని మాటిమాటికీ ధైర్యం చెప్పాడు. సుధామయ్ ఆస్పత్రిలో ఉన్నంతకాలమూ బెలాల్ వస్తూనే ఉండేవాడు. ఆస్పత్రిలోని డాక్టర్లతో మాట్లాడి ప్రత్యేక శ్రద్ధ తీసుకోమని కోరేవాడు. ఇలా ఎంతమంది తమ స్నేహితుల విషయంలో ఇంత శ్రద్ధతీసుకుంటారు? కాజల్ డబ్బున్నవాడుకూడా. కానీ బెలాల్‌లో ఉన్న హృదయవైశాల్యం అతనిలో లేదుకదా? సుధామయ్ వైద్యం ఖర్చు మొత్తం రబీవుల్ భరించాడు. అతడు ఒకరోజు హటాత్తుగా టికాతులీలోని సురంజన్ ఇంటికొచ్చి "మీ నాన్నగారు ఆస్పత్రిలో ఉన్నారా?" అన్నాడు. సురంజన్ జవాబు చెప్పేలోగా ఒక సీల్‌చేసిన కవర్ను బల్లమీదపెట్టి, "నీ స్నేహితుల్ని పరాయి వాళ్ళనుకోకు", అంటూ ఎంతవేగంగా వచ్చాడో అంతవేగంగానూ వెళ్ళిపోయాడు. సురంజన్ కవరు తీసిచూస్తే అందులో ఐదువేల టాకాలున్నాయి. సురంజన్ తన హిందూ స్నేహితులతోకంటే తన ముస్లిం స్నేహితుల్తో ఎక్కువ సన్నిహితంగా ఉండటానికి వాళ్ళు తన్ను ఆర్థికంగా, భౌతికంగా ఆదుకోవటం ఒక్కటే కారణం కాదు. వారితో అతనికి ఆత్మికంగానూ, ఆలోచనాత్మకంగానూ సాన్నిహిత్యం కుదిరింది. మొత్తంమీద చెప్పాలంటే కాజల్, అషీం, జైదీప్‌లతోకంటే సురంజన్ స్నేహం హైదర్, కమాల్, రైబుల్‌లతో ఎక్కువ గాఢంగా ఉండేది. హృదయం గురించి ఆలోచించినా అతడు అర్చననూ, దీప్తినీ, గీతనూ, సునందనూ ప్రేమించిన దానికంటే పర్వీన్‌నే ఎక్కువ అర్థవంతంగా ప్రేమించాడు.

ఏనాడూ సురంజన్ మత(ప్రాతిపదికమీద తన స్నేహితుల్ని వేరువేరుగా చూళ్ళేదు. అతడు చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడే అతనికి తాను హిందువునని అర్థమైంది. కానీ హిందువుగా ఉండటమంటే ఏమిటో అతనికి బోధపళ్ళేదు. అతడు మూడో తరగతిలోనో, నాలుగో తరగతిలోనో ఉన్నప్పుడు ఖలీద్ అన్న అబ్బాయితో పెద్ద పోట్లాట వచ్చింది. అప్పుడు అబ్బాయిలందరూ పచ్చిబూతుల్తో ఒకర్నొకరు తిట్టుకున్నారు. అప్పుడు ఖలీద్ కోపంగా అతణ్ణి హిందువని తిట్టాడు. అప్పుడు "హిందువు" అన్నమాట పంది, కుక్కలాంటి తిట్టుతో సమానమని సురంజన్‌కు అర్థమైంది. మరికాస్త ఎదిగాక అది తన మతాన్ని సూచించే పదమన్న సంగతి బోధపడింది. ఇలాంటి విషయాల్ని గురించి సొంతంగా ఆలోచించటం తెలిశాక తాను మొదట మానవుణ్ణనీ, తరువాత బెంగాలీ జాతీయుణ్ణనీ సురంజన్ అనేవాడు. జాతిని మతం సృష్టించలేదనీ, ప్రజలు మతం సృష్టించిన సరిహద్దుల్ని దాటాలనీ, ఐక్యంగా జీవించాలనీ చెప్పేవాడు. బెంగాలీ జాతి మత తారతమ్యాలకు అతీతంగా జీవించాలనీ, "బెంగాలీ" అన్నపదం అన్నిరకాలుగా అవిభాజ్యంగా ఉండాలనీ సురంజన్ తన స్నేహితులతో, కుటుంబసభ్యులతో చెబుతుండేవాడు. కానీ అతని ఆదర్శ దృక్పథాన్ని ఆమోదించేవాళ్ళు బంగ్లాదేశ్‌లో లేకపోయారు. ఐకమత్యం మతానికి సంబంధించిందే కానీ (ఆమతానికి సంబంధించిన ప్రజలు వేరువేరు దేశాల్లో ఉన్నాసరే), జాతికి సంబంధించింది కాదని అక్కడి ప్రజలు భావించసాగారు. దాని ఫలితంగా వేరు మతానికి చెందినవారు కావటంచేత అక్కడున్న ప్రజల్లో ఒకభాగం పరాయివారైపోయారు. తమదేశంలోనే వారు జాతి బహిష్కృతులుకూడా అయిపోయారు. ఈ అభిప్రాయం క్రమక్రమంగా బలాన్నీ, ప్రజల ఆమోదాన్నీ పొందుతోంది. దీని ఫలితంగా హిందూ ముస్లిములమధ్య అగాధం ఏర్పడింది..........

ఈరోజు డిసెంబర్ ఎనిమిదవతేదీ. దేశం మొత్తంమీద ఫండమెంటలిస్టుల పిలుపు మేరకు సమ్మె జరుగుతోంది. బంగ్లాదేశ్‌లోని బలమైన పార్టీల్లో ఒకటైన జమాత్-ఎ-ఇస్లామీ బాబ్రీమసీదు విధ్వంసానికి వ్యతిరేకంగా సమ్మె పిలుపునిచ్చింది. సురంజన్ రెండురోజులు పడకమీదనుంచీ లేవకుండా సోమరితనంగా గడిపాడు. ఆ తరువాత తనకు ఎంతో ఇష్టమైన ఢాకా నగరంలో సమ్మె ప్రభావాన్ని గురించి తెలుసుకోవటానికి లేచాడు. పక్కగదిలో అతని తల్లి తమకేం ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడిపోయి పడకనంటుకుపోయి పడివుంది. సుధామయ్ భయపడుతున్నాడో లేదో సురంజన్‌కు అర్థం కాలేదు. ఈసారి తాను దాక్కొని ప్రాణాలు కాపాడుకోవటానికి ప్రయత్నించనని మాత్రం అతడు స్పష్టంగా చెప్పాడు. ఇలా చేయటంవల్ల ప్రాణాలు పోయినా సరే అన్నాడు. ఒకవేళ ముస్లిములొచ్చి తన్ను ముక్కలు ముక్కలుగా నరకాలనుకుంటే వాళ్ళ ఇష్టం. నాన్నగారి నిర్ణయం ఎంతవరకూ సరైందో సురంజన్‌కు బోధపళ్ళేదు. కానీ తానుకూడా – నాన్నగారిలాగే – ఇల్లువదిలి పారిపోకూడదన్న కృతనిశ్చయంతోనే ఉన్నాడు. కానీ మాయ తనంతకుతానుగా వెళ్ళిపోయింది. దాన్నిగురించి ఇప్పుడు తాను చేయగలిగింది ఏమీలేదు. ఆవిడ పరుల్ రిఫత్ అన్న ముస్లిం ఇంట్లో తలదాచుకోవటానికి వెళ్ళింది. పాపం మాయ!

ఆవిడైనా తన ప్రాణాల్ని కాపాడుకోనీ – అనుకున్నాడు సురంజన్.

అతడు లేచి బయటికి వెళ్ళటానికి తయారయ్యాడు. కిరణ్మయి అదిరిపడిలేచి, "ఎక్కడికెళ్తున్నావ్?" అంది.

"బయటికెళ్ళి నగరం ఎలా ఉందో చూసి రావాలని ఉంది. ఈ సమ్మె నగరాన్ని ఏం చేసిందో!"

"వెళ్ళకు సురూ! బయటికెళ్తే ఏం జరుగుతుందో చెప్పలేం".

"ఏం జరుగుతుందో అది జరుగుతుంది. ఏదో ఒక రోజు మనమంతా చనిపోవాల్సిన వాళ్లమే. నీకు పుణ్యముంటుంది అలా భయపడకు. మీరలా భయపడితే నాకోరకంగా ఉంటుంది", అన్నాడు సురంజన్ విసుగ్గా, శ్రద్ధగా తలదువ్వుకుంటూ.

భయంతో వణికిపోతూ ఆవిడ సురంజన్ వద్దకు పరుగెత్తి దువ్వెన లాక్కుంది. "చూడు సురంజన్, బయటికెళ్ళటం చాలా ప్రమాదం. సమ్మె జరుగుతున్నా వాళ్ళు దుకాణాల్నీ, దేవాలయాల్నీ ధ్వంసం చేస్తున్నారు. ఇంట్లోనే ఉండు. నువ్వు బయటికెళ్ళి నగరంలో ఏం జరుగుతోందో చూడాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు", అంది.

సురంజన్ ఎప్పుడూ మొదటినుంచీకూడా వినయవిధేయతలున్న కుర్రవాడుకాదు. ఇప్పుడు మాత్రం ఆవిడ మాటెందుకు వినాలి? ఆవిడ అభ్యంతరాల్ని పక్కకునెట్టి సురంజన్ బయటికెళ్ళిపోయాడు. ఒంటరిగా కూర్చో ఉన్న సుధామయ్ కొడుకు బయటికి వెళ్లటాన్ని చూశాడు. కానీ అభ్యంతరపెట్టలేదు.

సాయంకాలపుగాలి హాయిగా ఉంది. కానీ భయంకరమైన నిశ్శబ్దం సాయంకాలం మీద పరుచుకొని ఉంది. సురంజన్‌కు ఇంట్లో ఉన్నంతసేపూ భయం కలగలేదు. ఇల్లువదిలి బయటికొచ్చాక కాస్త భయంగా ఉంది. కానీ అతడు నగరం నాలుగు దిక్కులా తిరిగి చూడాలనుకున్నాడు. ఈసారి తన స్నేహితులెవరూ తన యోగక్షేమాలు కనుక్కోలేదనీ, తనకు ఆశ్రయం ఇవ్వటానికి ముందుకు రాలేదనీ జ్ఞాపకం వచ్చిమరింత ఇబ్బందిగా అనిపించింది. బెలాల్ అడగలేదు.... కమాల్ కూడా అడగలేదు.... ఎవ్వరూ అడగలేదు. ఒకవేళ వాళ్ళు వచ్చిఉన్నా తాను వెళ్లేవాడుకాదు – అనుకున్నాడు సురంజన్. తానెందుకెళ్లాలి? నగరంలో అల్లరి జరిగిన ప్రతిసారీ తాను సంచిసర్దుకొని పారిపోవాలా? అది నిజంగా సిగ్గుచేటు. ఇంతకు ముందుసారి కమాల్ ఇంట్లో తలదాచుకోవటం కూడా తప్పే, తెలివిమాలినపనే! ఈసారి తన్ను తీసుకెళ్లటానికి వాళ్లెవరైనా వచ్చిఉంటే, "మీరు మమ్మల్ని ఒకవైపు చంపుతూ మరోవైపు మామీద ఎలా దయచూపిస్తారు? దీనికంటే ఈ దేశంలో ఉన్న హిందువుల్నందరినీ ఒకచోటికిచేర్చి అందర్నీ ఒక్కసారిగా కాల్చిపారెయ్యటం మెరుక్కదా? అప్పుడు మీసమస్యలన్నీ ఒకేసారిగా తీరిపోతాయి. అప్పుడు మమ్మల్ని ఇలా జట్లు జట్లుగా చంపటమూ అవసరంలేదు. మమ్మల్ని ఇలా రహస్యంగా రక్షిస్తున్నట్లు నటించాల్సిన అవసరమూలేదు", అని వాళ్లతో చెప్పేవాడు. సురంజన్ ఓ పెద్దవీధిలోకి మళ్ళేసరికి, "వాణ్ణి పట్టుకోండి. వాడు హిందువు", అని ఒక గుంపు అబ్బాయిలు అరిచారు. వాళ్ళెవరోకాదు. తన చుట్టుపక్కల ఇళ్ళవాళ్లే. గత ఏడేళ్ళుగా వాళ్ళను రోజుకొక్కసారైనా చూస్తున్నాడు.

వాళ్ళలో కొందరు సురంజన్‌కు వ్యక్తిగతంగా కూడా తెలుసు. వాళ్ళలో అలం అన్న అబ్బాయి వాళ్ల క్లబ్బు చందాలకోసం అప్పుడప్పుడూ తమ ఇంటికి వచ్చేవాడు. వాళ్ళ క్లబ్బు కార్యక్రమాల్లో సురంజన్ పాడాడుకూడా. వాళ్ళల్లో కొందరికి డి.ఎల్.రాయ్, హేమాంగ బిశ్వాస్ పాటల్ని నేర్పించాలనికూడా అనుకున్నాడు. వీళ్ళు రకరకాల సహాయాలు కోరుతూ తమ ఇంటికి వస్తుండేవారు. చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు కాబట్టి సుధామయ్ వీళ్ళకి ఉచితంగా వైద్యంకూడా చేసేవాడు. ఈరోజు వీళ్లే తాను హిందువుకాబట్టి తన్ను తంతామంటున్నారు. భయంవల్లకాదుగానీ, సిగ్గుతో సురంజన్ అవతలివైపుకు వేగంగా నడిచాడు. ఈ కుర్రవాళ్ళు తన్ను కొట్టాలని ఆలోచిస్తున్నారన్న భావం సురంజన్‌ను తీవ్రంగా బాధపెట్టింది. అతడు నిజంగా సిగ్గుపడిపోయాడు కూడా. అతని సిగ్గుకానీ, బాధకానీ తన్ను గురించికాదు – తన్ను తన్నాలనుకుంటున్న వాళ్ళను గురించే. సిగ్గు బాధించేవాళ్ళకు సంబంధించిందేకానీ బాధను అనుభవించేవాళ్ళకు సంబంధించిందికాదు!

సురంజన్ షాప్లా చౌరస్తావరకూ నడిచాడు. ఆ ప్రాంతమంతా నిశ్శబ్దంగా, ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠగా ఉంది. చౌరస్తా చుట్టూరా జనం గుంపులుగుంపులుగా నిలబడ్డారు. ఇటుక పెళ్లలూ, కాలిన కొయ్యలూ, గాజుముక్కలూ వీధి పొడవునా పడిఉన్నాయి. కొంతమంది యువకులు ఏదో పనిమీద పరుగెత్తిపోయారు. మరోవైపు వీధికుక్కలు దారీతెన్నూ లేకుండా పరుగెడుతున్నాయి. గంటలు మోగిస్తూ కొన్ని రిక్షాలు వెళ్ళాయి. ఏం జరిగిందో సురంజన్‌కు సరిగ్గా అర్థం కాలేదు. మతమౌఢ్యం, మతతత్వం అంటే భయంలేని కుక్కలుమాత్రమే ఆనందంగా అటూ, ఇటూ పరుగెడుతున్నాయి. సురంజన్‌కుకూడా అలా పరుగెత్తాలనిపించింది. ఎప్పుడూ రద్దీగా ఉండే మోతిజ్‌హీల్ వ్యాపారకేంద్రం నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉంది. అతనికి తన చిన్నతనం జ్ఞాపకం వచ్చింది. నారింజపండుతో ఫుట్‌బాల్ ఆడేవాడు. లేదా స్టంపులుపెట్టి క్రికెట్ ఆడేవాడు. ఇప్పుడలా ఆడితే ఎంత బావుంటుంది? ఈ తియ్యటి కోరికల్లోంచీ తేరుకొని సురంజన్ ఎడమ వైపుకు తిరిగి చూశాడు. అది 'ఇండియన్ ఏర్‌లైన్స్' కార్యాలయం అని అతనికి అర్థమైంది. ఆ భవనం సైన్‌బోర్డుకానీ, తలుపులుకానీ, కిటికీలుకానీ మిగల్లేదు. చుట్టూరా కొంతమంది నిలబడి కాలిపోయిన వస్తువుల్ని చూపిస్తూ నవ్వుతున్నారు. అలాచూస్తూ నిలబడ్డ సురంజన్‌కు తన్ను అందరూ పరీక్షగా గమనిస్తున్నారని అర్థమైంది. ఆ కాలిపోయిన భవనానికి దూరంగా చకచకానడిచి వెళ్ళాడు సురంజన్. కాలిపోయిన భవనాల్ని గురించి తానెందుకు తలబాదుకోవాలి? అలా నడుస్తూ వెళ్తుంటే మరింకెన్నో కాలిపోయిన భవనాలు కనిపిస్తున్నాయి. పెట్రోల్ కాలుతున్న వాసన తనకు ఇష్టమైనట్టుగానే కాలుతున్న భవనాల వాసన తనకిష్టమా? ఇష్టమేనేమో! బంగ్లాదేశ్ కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు (సి.పి.బి.) ముందు ఓ పెద్ద గుంపు జనం నిలబడి ఉన్నారు. రోడ్డుమీద చెల్లాచెదురుగా రాళ్లు పడి ఉన్నాయి. ఆ పక్కనే సురంజన్ తరచుగా పుస్తకాలు కొనుక్కునే దుకాణం ఉంది. వాళ్లు దాన్నికూడా వదిలిపెట్టలేదు. సగం కాలిన పుస్తకం ఒకటి అతని కాలికి తగిలింది. అది మాక్సిం గోర్కీ

రాసిన "అమ్మ". ఒక్కక్షణంపాటు అతనికి తాను "పావెల్" ననిపించింది. తాను ఏన తల్లికి నిప్పంటిస్తున్నట్టూ, కాళ్ళతో ఆమెను తొక్కుతున్నట్టూ సురంజన్‌కు అనిపించింది. ఆ ఆలోచనకు అతడు ఒణికిపోయాడు. మరింతజనం చేరారు. అందరూ గుసగుసలాడుతున్నారు. ఆ ప్రాంతమంతా ఉద్రేకంగా ఉంది. ఏం జరిగింది? లేదా ఏం జరగబోతోంది? పుకార్లు పుష్కలంగా ఉన్నా ఎవరికీ కచ్చితంగా ఏమీ తెలియదు. సి.పి.బి. కార్యాలయం బూడిదైందని మాత్రం స్పష్టంగా కనబడుతోంది. కానీ ఎందుకు? కమ్యూనిస్టులు దారిమార్చారని కొందరంటున్నా వాళ్ళు ముస్లిం మతవాదుల కోపాన్ని ఎందుచేత తప్పించుకోలేకపోయారు? కామ్రేడ్ ఫర్‌హాద్ చనిపోయాడు. అతని అంత్యక్రియలు ఘనంగా జరగబోతున్నాయి. అతని స్మృత్యర్థం వైభవంగా మిలాద్ జరిగింది. దానికి అందరూ వెళ్ళారు. కానీ మతతత్వం కమ్యూనిస్టు పార్టీ కార్యాలయాన్ని బూడిదపాలు చేసిందంటే ఆశ్చర్యమే! కాలికూలిపోయిన కమ్యూనిస్టు పార్టీకార్యాలయాన్ని దీనంగా చూశాడు సురంజన్. కైజర్ తనవైపు వస్తున్నట్టుగా అకస్మాత్తుగా గమనించాడుకూడా. అతడు గడ్డం గీసుకోలేదు. తలదువ్వుకోలేదు. అతని కళ్లు ఎర్రగా రక్తపు ముద్దల్లా ఉన్నాయి. అతని కంఠస్వరంలో చిత్రమైన ఆతురత ఉంది.

"నువ్వెందుకు బయటికొచ్చావ్?" అన్నాడు.

"ఏం, రాకూడదా?" సురంజన్ ఎదురు చెప్పాడు.

"అలాకాదు..... ఈ పందులసంగతి నీకు తెలుసు. వాళ్ళు మతాన్ని గురించి మాట్లాడతారు! వాళ్లకు నిజంగా మతంమీద నమ్మకం ఉందంటావా? జమాత్ శిబిర్ యూత్ కమాండ్ గూండాలు దీనిక్కారణం. వాళ్లే పార్టీ ఆఫీసును కాల్చేశారు. పుస్తకాల్ని తగలబెట్టారు. ఇండియన్ ఏర్‌లైన్స్ ఆఫీసును బూడిదచేశారు. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కావాలన్నప్పుడు వ్యతిరేకించిన వీళ్ళు ఇప్పుడు అల్లర్లు సృష్టించటంకోసం కారణాలు వెదుకుతుంటారు. వాళ్లు అరిస్తే అందరూ వినాలని కాచుక్కూచున్నారని వాళ్ళ ఉద్దేశం".

వాళ్ళిద్దరూ ఆ విధ్వంసానికి దూరంగా నడిచారు. సురంజన్ అడిగాడు.

"వీళ్ళింకా ఏమేం తగలబెట్టారు?"

"చిట్టకాంగ్‌లోని తులసీధామ్, పంచనందన్‌ధామ్, కైవల్యధామ్ దేవాలయాల్ని ముక్కలు ముక్కలు చేశారు. మాలీపారాలోని దేవాలయాన్నిటినీ తగలబెట్టారు. షంషాన్‌మందిర్, కోర్బనీగంజ్, కాళీబారి, చత్తేశ్వరి విష్ణుమందిరాలు బూడిదయ్యాయి. తమాషా ఏమిటంటే అదే సమయంలో మతసామరస్యాన్ని కోరుతూ ఊరేగింపులుకూడా జరిగాయి."

సురంజన్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

"నిన్న ధ్వంసమైంది దేవాలయాలు మాత్రమేకాదు. మజ్‌హర్ ఘాట్‌లోని ఒక బెస్తవాళ్ళకాలనీక్కూడా నిప్పుపెట్టారు. సుమారు యాభై ఇళ్ళు దగ్ధమైపోయాయి", అన్నాడు కైజర్ తన క్రాపును వేళ్ళతో దువ్వుకుంటూ.

"ఇంకా ఏమిటి?" ప్రశ్నించాడు సురంజన్ అనాసక్తిగా.

"జైదేవ్‌పూర్‌లోని మాధవమందిరం, దుర్గామందిరాలమీద దాడిచేశారు. షేర్‌పూర్‌లో అన్నపూర్ణామందిరం, కృషికేంద్రం, కాళీమందిరం, షెరీఘాట్ ఆశ్రమం పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఫరీద్‌పూర్‌లో రామకృష్ణామిషన్‌లోని దేవాలయాల్ని లూటీచేశారు. ఆశ్రమంలోని గురువుగారూ, అతని శిష్యులూ తీవ్రంగా గాయపడ్డారు."

"తరువాత?" అన్నాడు సురంజన్ మరింత అనాసక్తంగా.

"నర్సిందీలో చలక్‌చోర్ ప్రాంతంలోని ఇళ్ళూ, దేవాలయాలూ ధ్వంసమయ్యాయి. మోరాపారా బజార్‌లోని రూప్‌గంజ్ స్టేషన్‌ను కూలదోశారు. కోమిల్లాలో ప్రాచీనమైన అభయాశ్రమాన్ని దగ్ధం చేశారు. నవఖాళీలోకూడా చాలా దుర్మార్గాలు జరిగాయి".

"ఎలాంటివి?"

"సుధారామ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని అధోర్‌చంద్ ఆశ్రమం, వీడుమంది హిందువుల ఇళ్ళూ ధ్వంసం చేశారు. గంగాపూర్‌లోని హిందువుల ఇళ్ళను మొదటి లూటీచేసి, తరువాత తగలబెట్టారు. షోనాపూర్‌లోని శివకాళీ దేవాలయాన్నీ, బినోద్‌పూర్‌లోని వ్యాయామశాలనూ ధ్వంసం చేశారు. చౌమూహినిలోని కాళీమందిరాన్నీ, దుర్గాపూర్‌లోని దుర్గామందిరాన్నీ, కుతుబ్‌పూర్, గోపాల్‌పూర్‌లలోని దేవాలయాల్నీ నేలమట్టం చేశారు. డా.పి.కె. సింఘా మందులఫాక్టరీని, అఖండాశ్రమాన్నీ, ఛాయానీ ప్రాంతంలోని దేవాలయాలనీ నేలమట్టం చేశారు. చౌమూహినిలో, బాబాపూర్‌లో, తేటూయియాలో, మెహదీపూర్‌లో, రాజ్‌గంజ్ బజార్లో, తాంగీర్‌పార్‌లో, ఖిజీర్‌పాత్‌లో, రసూల్‌పూర్‌లో జమీర్‌హర్‌హాట్‌లో, పోరాబరీలో పదిదేవాలయాలనూ, పద్దెనిమిది హిందువల ఇళ్ళనూ లూటీచేసి, తగలబెట్టారు. ఒక దుకాణాన్నీ, ఒక కారునూ, చివరకు ఒక స్త్రీనికూడా తగలబెట్టారు. భాబోర్దీలోని పదిహేడు ఇళ్ళలో పదమూడు ఇళ్ళను దోపిడీ చేశారు. స్త్రీలను చిత్రహింసలు పెట్టారు. విప్లవ్‌భౌమిక్‌ను కత్తితో పొడిచారు. నిన్న బిరాహింపూర్‌లోని దేవాలయాలన్నిటినీ కూలదోయటానికి ప్రయత్నించారు. బార్‌హజార్ గ్రామంలోని జగన్నాథ మందిరాన్నీ, కొన్ని దుకాణాలనూ, క్లబ్బునూ లూటీచేశారు. బార్‌పర్‌బాతీ గ్రామంలో ఒక ఇల్లూ, దాశీర్‌హాట్‌లో రెండు దేవాలయాలూ, చార్‌కుక్రీ, ముబ్బాపూర్‌లలో బైక్రాళీ దేవాలయాలూ బూడిదయ్యాయి. సిరాజ్‌పూర్‌లోని ఇళ్ళను లూటీచేశారు. ప్రజల్ని చావగొట్టారు, చివరకు ఇళ్లను తగులబెట్టారు".

విధ్వంసం మీద ఈ సుదీర్ఘమైన ఉపన్యాసం విన్న తరుఘాత సురంజన్ "ఓహో" అని మాత్రమే అన్నాడు. రోడ్డుమీద చెల్లాచెదురుగా పడివున్న రాళ్లను – అతని చిన్నతనంలోలాగా – తన్నాలని మాత్రమే అతనికి అనిపించింది. కైజర్ మరిన్ని లూటీలను గురించీ, గృహదహనాలను గురించి చెబుతున్నాడు. కానీ సురంజన్ వినటం మానేశాడు. అతనికి వాటిమీద ఆసక్తికూడా పోయింది. అలా నడుస్తూ వచ్చి వాళ్ళిద్దరూ ప్రెస్‌క్లబ్‌ముందు ఆగారు. తీవ్రంగా తమలోతాము చర్చించుకొంటూ కొంతమంది యువ పత్రికారచయితలక్కడ గుంపుగా నిలబడి ఉన్నారు. సురంజన్

వారివైపు ఆసక్తి ఉండిలేనట్టుగా చూశాడు. వాళ్లు ఏం మాట్లాడుకుంటున్నారో వినాలని ప్రయత్నించాడు. భారతదేశంలో జరిగిన అల్లర్లలో పోలీసుల కాల్పుల్లో కనీసం రెండువందలమంది చనిపోయారని కొందరంటున్నారు. గాయపడ్డవారి సంఖ్య వేలల్లో ఉందట. ఆర్.ఎస్.ఎస్., శివసేన మొదలైన మతోన్మాద సంస్థలమీద నిషేధం ప్రకటించారట. లోక్‌సభ ప్రతిపక్షనాయకుడుగా అద్వానీ రాజీనామా చేశాడట. మరికొందరు చిట్టగాంగ్‌లో నందన్‌కానన్ తులసీధామ్ శిష్యుడైన దీపక్‌ఘోష్‌ను జమాతీలు పట్టుకున్నారని అంటున్నారు. అతడు పారిపోవటానికి ప్రయత్నించాడట. అతడికి నిప్పు పెట్టాలనుకున్నారటకానీ అక్కడున్న దర్వాన్లు దీపక్ ముస్లిం అని చెబితె తన్ని వదిలేశారట.....

సురంజన్‌ని ఎరిగిన వాళ్లు అతణ్ణి అక్కడ చూసి ఆశ్చర్యపోయారు. ఎందుకు ఇల్లు వదిలివచ్చావని మందలించారు. అల్లర్లు అధికం అయ్యే అవకాశం ఉందికాబట్టి తక్షణం ఇంటికి వెళ్ళిపొమ్మని సలహా ఇచ్చారు.

సురంజన్ జవాబు చెప్పలేదు. అతని మనసు గందరగోళంగా ఉంది. తనపేరు సురంజన్‌దత్తాకాబట్టి తాను ఇంట్లోనే ఉండాలా? కైజర్, లతీఫ్, బెలాల్, షహీర్ ఇళ్లలోంచి బయటికొచ్చి, జరుగుతున్న సంఘటల్ని చర్చించవచ్చా? మతతత్వాన్ని ఖండిస్తూ ఊరేగింపుల్లో పాల్గొనవచ్చా? ఇది న్యాయం ఎంతమాత్రమూ కాదు. సురంజన్ నిజాయితీ, హేతుబద్ధమైన స్వతంత్ర ఆలోచనా కలిగినవాడుకాదా? శూన్యంలోకి చూస్తూ గోడకు ఆనుకొని నిలబడ్డాడు సురంజన్. పక్కనే ఉన్న దుకాణంలో కొనుక్కున్న "బంగ్లాఫైవ్" సిగరెట్టు వెలిగించాడు. అతనికి తనకు నాఅన్నవాళ్లు లేనట్టుగా, ఒంటరిగా అనిపించింది. తనచుట్టూరా ఉన్నవాళ్లలో చాలామంది అతనికి తెలిసినవాళ్లే, వాస్తవానికి వాళ్లలో కొందరు అతనికి బాగా ఆత్మీయులుకూడా. కానీ అతనికి ఒంటరిగా అనిపించింది! వాళ్ళు బాబ్రీ మసీదు విధ్వంసాన్ని గురించీ, ఈదేశంలో దేవాలయాల విధ్వంసాన్ని గురించీ ఉద్రేకంగా చర్చించుకుంటూ ఉంటే సురంజన్ ఆచర్చలో పాల్గొనలేకపోయాడు. ఒకవేళ అతడు పాల్గొనాలన్నా వారిమధ్య ఉన్న రేఖను దాటటం అతనికి సాధ్యంకాదు. తన్ను ఇతరులు ఎందుకు దూరంగా ఉంచుతున్నారో, తాము దూరంగా ఎందుకు తొలగిపోతున్నారో అతనికి అర్థమైంది. అతణ్ణి వాళ్ళు 'అయ్యో పాపం' అన్నట్టు చూస్తే అతడు దాన్ని భరించలేకపోతున్నాడు. సిగరెట్టు గట్టిగా పీల్చి ఉంగరాలు ఉంగరాలుగా పొగవదిలాడు సురంజన్. చుట్టూరా ఉన్న ఉద్వేగం మధ్య అతడు గోడకు జారగిలపడిపోయాడు.

★ ★ ★

సురంజన్‌వైపు అదోరకంగా చూసే వాళ్ళ సంఖ్య పెరిగింది. ఇల్లువదిలి బయటికొచ్చిన హిందువు అతడొక్కడే కావటంచేత చాలామంది ఆశ్చర్యపోయారు. భయంతో వాళ్లు ఇళ్ళలోనే ముడుక్కున్నారు. కాబట్టి సురంజన్‌ను చూసిన వాళ్లు ఆశ్చర్యపోకతప్పలేదు.

ఊరేగింపు తీయాలని ప్రయత్నిస్తున్న ఒకగుంపులో కైజర్ కలిసిపోయాడు. పత్రికావిలేఖరులు తమ సంచుల్తో, కెమేరాలతో అక్కడికి చేరుకున్నారు. వాళ్ళలో లుత్‌ఫార్‌కూడా ఉన్నాడు. సురంజన్‌కు అతడు బాగా తెలుసు. అయినా సురంజన్ అతణ్ణి పిలిచి పలుకరించలేదు. మరికాస్సేపటికి లుత్‌ఫారే సురంజన్ వద్దకొచ్చి ఆశ్చర్యంగా అన్నాడు :

"ఇక్కడెందుకున్నావు దాదా?"

"ఎందుకుండకూడదూ?" అన్నాడు సురంజన్.

లుత్‌ఫార్ ఎంతో ఆసక్తిగా, బాధగా అన్నాడు.

"ఇంటిదగ్గరేం ఇబ్బంది లేదుకదా?"

లుత్‌ఫార్ కంఠస్వరంలో తమభద్రతపట్ల ఆసక్తిఉందా అని సురంజన్ గమనించాలనుకున్నాడు. సాధారణంగా లుత్‌ఫార్ బిడియస్తుడు. ఎవరితోనూ తలెత్తి, కళ్లలోకి చూసి మాట్లాడడు. అతడు చాలా మంచివాడుకూడా. "ఏకత" పత్రిక సంపాదకునితో మాట్లాడి అతనికి ఉద్యోగం ఇప్పించింది సురంజన్‌నే. లుత్‌ఫార్ బెన్సన్ సిగరెట్ వెలిగించి, మళ్ళీ సురంజన్‌ను అడిగాడు. "సురంజన్‌దాదా, ఇంటివద్ద గొడవేం రాలేదుకదా?"

"ఏం సమస్య?" నవ్వాడు సురంజన్.

"దేశంలో పరిస్థితి ఎలా ఉందో నీకు తెలుసుకదా?"

సురంజన్ సిగరెట్ నేలమీద వేసి నలిపేశాడు. లుత్‌ఫార్ తనతో అలా గొంతుపెంచి మాట్లాడుతున్నందుకు సురంజన్‌కు ఆశ్చర్యం కలిగింది. అది కాస్త అవిధేయతగాకూడా అనిపించింది. లుత్‌ఫార్ సిగరెట్టు దమ్ములాగి ఆందోళనగా అన్నాడు, "దాదా, మీరు ఈరోజు మీఇంట్లో కాకుండా మరోచోట ఉండటం మంచిదనిపిస్తోంది. కనీసం రెండురాత్రులు మీరు మీ చుట్టుపక్కలున్న ముస్లింల ఇంట్లో గడపకూడదూ!"

బడ్డీకొట్టు పక్కన సిగరెట్టు అంటించుకోవటంకోసం వెలుగుతున్నతాడుకేసి శూన్యంగా చూస్తూ, "ఊహు..." అన్నాడు సురంజన్ అలక్ష్యంగా ఉండాలనే.

"వీలుకాదా?" సురంజన్ పద్ధతిచూసి లుత్‌ఫార్ ఆశ్చర్యపోయాడు. లుత్‌ఫార్ కంఠస్వరంలో ధ్వనించిన ఆతురత సురంజన్‌కు అర్థమైంది. అతడు చెబుతున్నది తనకు కొత్తవిషయంకాదు. సలహా చెప్పదలచుకున్న ప్రతివాడూ అదే సలహా చెప్పాడు. "ఇంట్లో ఉండటం క్షేమంకాదు.... మరోచోటికెళ్ళి దాక్కో.... బయటికి రాకు. నువ్వెవరో ఎవరికీ చెప్పకు... పరిస్థితిలో మార్పువచ్చేవరకూ బయటికి రావటం మంచిదికాదు...."

సురంజన్‌కు మరో సిగరెట్ వెలిగించాలనిపించింది. లుత్‌ఫార్ ముఖంలోని ఆందోళనా, మళ్ళీమళ్ళీ అతడిస్తున్న హెచ్చరికలూ అతని సిగరెట్ కోరికను దూరం చేశాయి. చేతులు కట్టుకొని చుట్టూరా చూశాడు. చుట్టూరా ఉన్న చెట్లు ముదురు పచ్చరంగు హేమంతవస్త్రాలను ధరించి ఉన్నాయి. ఈ రుతువంటే తనకు ఎంతో

ఇష్టం. ఉదయంపూట వేడివేడి రొట్టెలూ... రాత్రులు కప్పుకోవటానికి వెచ్చని రజాయ్‌లూ.... నిద్రపోవటానికిముందు అమ్మచెప్పే దయ్యాలకథలూ....

భుజానికి సంచీ తగిలించుకున్న ఒక గడ్డంవ్యక్తిని చూసేసరికి సురంజన్ మళ్లీ వర్తమానంలోకొచ్చాడు. అతడు లుత్‌ఫార్ పక్కన నిలబడి పెద్దగొంతుతో అంతవరకూ జరిగిన దుర్మార్గాలను గురించి చెబుతున్నాడు.

“దక్షిణేశ్వరీమందిరం, సిద్ధేశ్వరీ కాళీమందిరం, రామకృష్ణామిషన్, మహాప్రకాశ మఠం, నరేంద్రగౌడీయమఠం, భోలాగిరీ ఆశ్రమం - అన్నిటిమీదా రాళ్లు రువ్వారు, దోచుకున్నారు. స్వామీబాగ్ ఆశ్రమాన్నికూడా లూటీచేశారు. షోనీ వ్యాయామశాల ప్రాంతంలో పాతిక ఇళ్లను తగలబెట్టారు. షోనీ మందిరాన్నీ, దుర్గామందిరాన్నీ కూలదోసి, కాల్చేశారు. నరేంద్ర రుషిపారానూ, దయాగంజ్ జలేషారానూకూడా వాళ్లు వదిలిపెట్టలేదు. షార్క్‌గేట్‌నూ, పల్టాన్‌నూ, మరాన్‌చంద్ మిఠాయి దుకాణాన్నీ, దేశబంధు మిఠాయి దుకాణాన్నీ నేలమట్టంచేసి, తగలబెట్టారు. తతారీ బజార్లోని దేవాలయాన్నికూడా బుగ్గిచేశారు”

లుత్‌ఫార్ దీర్ఘంగా నిట్టూర్చి “ఓ” అన్నాడు. తాను వెంటనే వెళ్లిపోవాలా లేదా అని ఆలోచించాడు. అతనికి ఇతరుల్తో కలిసి ఉండటం అంతగా ఇష్టంలేదు. కానీ అతనికి తనకు ఏం కావాలో, ఎక్కడికెళ్ళాలోకూడా అర్థం కాలేదు. తాను ఇక్కడే నిలబడి ఉండాలా, లేదా ఊరేగింపులో కలుసుకోవాలా, లేదా దూరంగా వెళ్ళిపోవాలా? బహుశా తాను బంధువులూ, స్నేహితులూ కనిపించని అడవికి పారిపోవాలేమో? భుజానికి సంచి వేలాడుతున్న గడ్డంవ్యక్తి గుంపులో చేరిపోయాడు. ఏవో ప్రకటనలు చేస్తున్నాడు. సురంజన్ అనాసక్తితో విసిగిపోయిన లుత్‌ఫార్‌కూడా బయలుదేరటానికి సిద్ధమౌతున్నాడు.

ఇంకా వాతావరణంలో చాలా ఉద్విగ్నత ఉంది. అక్కడ జరుగుతున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొనాలని సురంజన్‌కు మనసు మారింది. అతనికి గుంపులో కలిసి పోవాలనీ, ధ్వంసమైన దేవాలయాల్ని చూడాలనీ అనిపించింది. ఈలోగా జరుగుతున్న సంఘటనలపట్ల తన నిరసనను వ్యక్తం చేయాలనికూడా అనిపించింది. “ఈ మత దురహంకారుల్ని కొరడాలతో కొట్టాలి. ఈ దొంగమతాభిమానులు మతంపేరుతో ప్రజల్ని రెచ్చగొడుతున్నారు. వీరికీ, మతానికీ ఎలాంటి సంబంధమూలేదు”. కానీ ఈమాటల్ని అనలేకపోయాడు. తాను అనుకున్నదేమీ చేయలేకపోయాడు. తనవైపు జాలిగాచూస్తున్న వారిచూపులు అతణ్ణి మరింత నిరుత్సాహపరిచాయి. తనకు ఈ ఉద్వేగంలో పాలుపంచుకునే అర్హతలేదని ఆచూపులు నిశ్శబ్దంగా చెబుతున్నాయికాబోలు. తాను అన్ని కార్యక్రమాల్లోనూ పాలుపంచుకోవటమూ, అనేక విషయాలమీద తాను మంచి వక్తనని అనుకోవటమూ ఇప్పుడు తలుచుకుంటే హాస్యాస్పదంగా ఉంది. ఈనాడు తనకు మాటపడిపోయింది. తనచుట్టూరా ఉన్నవాళ్లు తన్ను మాట్లాడమనికానీ, నిలబడి పోరాడమనికానీ ఉత్సాహపరచటంలేదు.

గుంపులోనుంచీ బయటపడి సురంజన్‌వద్దకొచ్చాడు కైజర్.

"బైతుల్ మొకర్రమ్‌లో బాబ్రీమసీదు విధ్వంసాన్ని గురించి ఒక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. జనం చేరుతున్నారు. నువ్వు ఇల్లు చేరుకుంటే క్షేమం", అన్నాడు రహస్యంగా.

"నువ్వు వెళ్ళటంలేదా?" అన్నాడు సురంజన్.

"లేదు. నేను మతసామరస్యసభ జరిగితే వెళ్తాను", అన్నాడు కైజర్. అతని వెనక లిట్టన్, మహతాబ్ అన్న ఇద్దరు అబ్బాయిలు నిలబడి ఉన్నారు.

"ఇది నీమంచికోసమే. వాళ్ళు జిల్ ఖబర్‌నుకూడా తగలబెట్టేశారు. ఎక్కడచూసినా తగలబెట్టటాలే. నిన్ను గుర్తుపడితే వాళ్ళు నిన్నేం చేస్తారో ఊహించగలవా? వాళ్ళు బహిరంగంగానే లాఠీలూ, కత్తులూ పట్టుకు తిరుగుతున్నారు", అన్నారు వాళ్లు.

సురంజన్‌ను ఇంటికి పంపించటంకోసం కైజర్ రిక్షాను పిలిచాడు. లుత్ ఫార్ పరుగెత్తుకొచ్చాడు.

"చూడుదాదా. సరాసరి ఇల్లుచేరుకో. నువ్వు ఈరోజు ఇల్లువదిలి ఎందుకు బయటికొచ్చావో అర్థం కావటంలేదు", అన్నాడు.

చుట్టూరా ఉన్న అందరూ అతడు తక్షణం ఇంటికి వెళ్ళాలని పట్టుపట్టారు. అతణ్ణి ఎరగని కొంతమంది విషయమేమిటో తెలుసుకోవటానికి చుట్టూరా చేరారు. సురంజన్ హిందువనీ, కాబట్టి అతడు అక్కడ ఉండటం క్షేమం కాదని తాము చెబుతున్నామనీ వాళ్ళు వివరించవలసి వచ్చింది. "ఔను, అతడు తప్పకుండా ఇంటికి వెళ్ళటమే మంచిది", అన్నారు అందరూ. కానీ సురంజన్ ఇల్లువదిలి బయటికొచ్చింది మళ్ళీ బలవంతంగా ఇల్లు చేరుకోవటానిక్కాదు. అతని స్నేహితులు మెల్లగా అతణ్ణి రిక్షా వైపు నడిపించారు. లుత్ ఫార్ అతని చెయ్యి వదలకుండా పట్టుకున్నాడు. కానీ ఉన్నట్టుండి తిరగబడ్డ సురంజన్ - అతని చెయ్యిని పక్కకు తోసేశాడు.

★ ★ ★

సుధామయ్‌కి అలసటగా ఉంది. పడుకొని, విశ్రాంతి తీసుకోవాలని మాత్రమే అతనికి అనిపిస్తోంది. కానీ అశాంతిగా పడకమీద దొర్లటమేగాని విశ్రాంతి మాత్రం లేదు. దీనికితోడు సురంజన్ బయటికెళ్ళాడు. అతడు వెళ్లిన తరువాత ఎవరో తలుపుతట్టారు. సురంజన్ తిరిగొచ్చాడేమోనన్న ఆశతో పడకమీదనుంచి దిగ్గుమని లేచి తలుపుతీశాడు సుధామయ్. వచ్చింది తన కొడుకు సురంజన్‌కాదు – అఖ్తరుజ్జమాన్. అతడు అరవైఐదేళ్ళ వయసున్న రిటైర్డ్ ప్రొఫెసర్. అతడుకూడా ఆ మొహల్లాలోనే ఉంటాడు. అవృద్ధుడు లోపలికొచ్చి తలవాకిలికి గడియపెట్టాడు. "ఇబ్బందులేం రాలేదుకదా?" అన్నాడు గొంతుతగ్గించి. "ఏం లేదు" అన్నాడు సుధామయ్ బల్లమీద కట్టలుకట్టలుగా ఉన్న పుస్తకాల్నిచూస్తూ.

"ఏం జరిగిఉండేదనుకుంటున్నారు", అన్నాడు మళ్ళీ.

అఖ్తరుజ్జమాన్ ఓ కుర్చీ లాక్కొని కూచున్నాడు. అతడు సర్వైకల్ స్పాండిలైటిస్‌తో బాధపడుతూ ఉండటంచేత అతని మెడ అసహజంగా, నిటారుగా ఉంది.

"బాబ్రీ మసీదును గురించి నీకంతా తెలిసే ఉంటుంది. మసీదు ఏమీ మిగల్లేదుట. మొత్తం నాశనమైపోయింది. ఇది సిగ్గుచేటు", అన్నాడు.

సుధామయ్ జవాబు చెప్పలేదు.

"చెప్పటానికేం లేదా? వాళ్ళను నువ్వు బలపరుస్తున్నావా?"

"వాళ్ళను నేనెందుకు బలపరచాలి?"

"అలాగైతే జవాబెందుకు చెప్పవు?"

"దుష్టులు దుష్టమైన పనిచేశారు. దాన్ని గురించి విచారపడటం తప్ప మరేం చేయగలను?"

"ఇలాంటి సంఘటన ఒక మతాతీత రాజ్యంలో జరుగుతుందని ఊహించలేకుండా ఉన్నాను! ఎంత సిగ్గుచేటు! వాళ్ళు గొప్పగా చెప్పుకునే జాతీయతా లక్షణం, ఆ రాజకీయ ఉద్ఘాటనలు, వాళ్ల సుప్రీంకోర్టు, లోక్‌సభ, రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్య సంప్రదాయం – ఇవన్నీ ఒట్టి డొల్ల, గాలి అని తేలిపోయింది. నువ్వేమైనా చెప్పు సుధాబాబూ, భారతదేశంతో పోలిస్తే ఈదేశంలో మతకలహాలు దాదాపు లేవనిపిస్తోంది....."

"1964 లో 1990 లో జరిగిన వాటి మాటేమిటి?"

"1964 లో జరిగినవాటిని గురించికాదు 1950 లో జరిగిన వాటినిగురించి చెప్పుకోవటం మంచిది. 1950 లో జరిగిన అల్లర్లకూ 1964 లో జరిగిన అల్లర్లకూ తేడాఉంది. 1964 లో మతతత్వానికి వ్యతిరేకంగా నిరసన పొంగివచ్చింది. మానిక్‌మియా, జహూర్ హుసేన్‌చౌధురీ, అబ్దుల్ సలాంల నాయకత్వంలో అల్లర్లు ప్రారంభం కాగానే మనపత్రికలన్నీ 'తూర్పు పాకిస్తానీలారా! మీ హక్కులకోసం నిలబడండి' అని పతాకశీర్షికలు ప్రచురించాయి. ఒక హిందూకుటుంబాన్ని రక్షించ టంకోసం అమీర్‌హుసేన్ చౌధురి అన్న యాభైఐదేళ్ళ ముస్లిం తన ప్రాణాలను పోగొట్టుకున్నాడు. అది ఎంతగా మన మనస్సుల్ని చలింపచేసింది!"

సుధామయ్‌కి ఛాతీలో నొప్పి ఎక్కువైంది. పరుపుమీద మరింత సౌకర్యంగా జారగిలబడి కూచున్నాడు. ఒకకప్పు టీతాగితే కాస్త ఉపశమనం కలిగేదేమో, కానీ టీ ఎవరిస్తారు? సురంజన్ చేసిన పనులవల్ల కిరణ్మయి ఎంతో బాధపడుతోంది. కాబట్టి ఆమె టీచేసి ఇస్తుందని ఆశించి లాభం లేదు.... సురంజన్ ఎందుచేత ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు? అతడు ఎప్పుడూ అంతే. అతడు ఆవేశపరుడు. అతనికి బయటికి వెళ్ళాలనే ఉంటే అతణ్ణి ఇంట్లో ఉంచటం ఎవరితరమూకాదు. అతడికి బయటికి వెళ్ళాలనే ఉంటే హైదర్‌ను ఎందుకు తోడుగా తీసుకెళ్ళి ఉండకూడదు? సుధామయ్‌కి ఇవన్నీ తెలుసు. కానీ ఆందోళనపడటం మానవలక్షణం. ఆందోళనకు తర్కంలేదు. తన భయాన్నీ, ఆందోళననూ తనలోనే దాచుకొని అఖ్తరుజ్జమాన్‌మీద దృష్టి కేంద్రీకరించాడు సుధామయ్.

"చిత్రమేమిటంటే అన్నిమతాలకూ గమ్యం ఒకటే – శాంతి. కానీ మతంపేరుతోనే ఇంత అశాంతి సృష్టించబడుతూ ఉంది. ఎంతో రక్తం చిందింది. ఎందరో మానవులు

బాధలు పడ్డారు. ఇరవైయవశతాబ్దం చిట్టచివరకూడా మనం ఇలాంటి దుర్మార్గాలను చూడవలసిరావటం ఆశ్చర్యం. ఇవన్నీ మతం పేరుమీదనే జరుగుతున్నాయి. మానవుల్ని అణగదొక్కటానికీ, మానవుల ఆత్మల్ని చిదిమివేయటానికీ మతం బావుటాను ఎగరేయటానికి మించిన సులభమార్గంలేదు."

అఖ్తరుజ్జమాన్ అందీ అందనట్టుగా సమాధానం చెప్పాడు.

ఇంతలో కిరణ్మయి రెండుకప్పుల్తో టీ తీసుకువచ్చింది.

"మీఛాతీలో నొప్పి ఎక్కువైందా? ఎక్కువగా ఉంటే మీమాత్రలు తీసుకోకూడదూ?" అంది ఆమె భర్తతో.

టీకప్పులు బల్లమీద పెట్టి తాను పరుపుమీద కూచుంది.

"వదినా, మీరు కుంకుమా, పాపిట్లో సిందూరం పెట్టుకోరా?" అన్నాడు అఖ్తరుజ్జమాన్.

"లేదు. 1975 నుంచీ పెట్టుకోవటం లేదు", అంది కిరణ్మయి.

"అమ్మయ్య. అలాగైతే మీకు భద్రత ఉన్నట్టే. బాధలు పడటంకంటే భద్రత కోరుకోవటమే మంచిది".

కిరణ్మయి బాధగా నవ్వింది. సుధామయ్ పెదవులమీదకూడా అలాంటి నవ్వే కదిలింది.

అఖ్తరుజ్జమాన్ టీని గబగబా తాగేశాడు. సుధామయ్ ఛాతీనొప్పి కొద్దిగా కూడా తగ్గలేదు.

"చూడు భాయీ, చాలాకాలం క్రితమే నేను ధోవతి కట్టుకోవటం మానేశాను – ప్రాణంమీది తీపితో", అన్నాడు సుధామయ్.

అఖ్తరుజ్జమాన్ టీకప్పు కిందపెడుతూ లేచాడు. "ఇక నేను వెళ్ళాలి. వినోద్‌బాబు సంగతికూడా కనుక్కొని ఇంటికెళ్తాను", అన్నాడు.

ప్రొఫెసర్‌గారు వెళ్ళిపోయాక సుధామయ్ పరుపుమీద పడుకున్నాడు. బల్లమీదున్న టీ అలాగే చల్లారిపోతోంది.

కిరణ్మయి తలుపు గడియపెట్టివచ్చి పరుపుమీద కూర్చుంది. దీపం ఆమె వెనక ఉండటంచేత ఆమె ముఖంమీద నల్లగా నీడపడుతూ ఉంది.... ఒకప్పుడు కిరణ్మయి కీర్తనలు అద్భుతంగా పాడేది. బ్రహ్మణ్‌బారియాలోని సుప్రసిద్ధ న్యాయవాది కూతురు ఆమె. పదహారేళ్లకే ఆమెకు పెళ్ళిచేశారు. కిరణ్మయి తన ఇంటికి వచ్చాక రవీంద్రసంగీతం నేర్చుకోమని ఆమెను ప్రోత్సహించాడు సుధామయ్. ఆవిడ మిథున్‌దే దగ్గర కొంతకాలం సంగీతం నేర్చుకుందికూడా. ఆవిడ చాలా కొద్దికాలంలోనే మంచిగాయనిగా తయారైంది. మైమెన్‌సింగ్‌లో పాడగలిగినవాళ్లు చాలాకొద్దిమంది మాత్రమే ఉండేవాళ్లు. అందుచేత ఆమెను వేదికలమీదకూడా పాడమని కోరేవారు....సుధామయ్‌కి ఓ సంఘటన జ్ఞాపకం వచ్చింది....కిరణ్మయి టౌన్‌హాలులో పాడవలసి ఉంది. మొదట ప్రసిద్ధగాయకుడు సమీర్‌చంద్రడే పాడాడు. కిరణ్మయి వేదికమీదికి వెళ్లవలసి ఉంది. భయంతో సుధామయ్‌కి ముచ్చెమటలు పోశాయి.

కిరణ్మయి వేదిక ఎక్కి "ఆనందలోకె....మంగళలోకె....బిజారో సత్యసుందరో" అన్నపాట పాడింది. ప్రేక్షకులు ఊగిపోయారు. మళ్ళీ మళ్ళీ పాడమన్నారు. కిరణ్మయి మళ్ళీ మూడుపాటలు పాడింది. ఆవిడ ఆ పాటల్ని ఎంతమనసు కదిలిపాడిందంటే సుధామయ్‌లాంటి నాస్తికుడుకూడా కన్నీళ్ళు వచ్చేలా చలించిపోయాడు.

స్వాతంత్ర్యం వచ్చాక బహిరంగంగా పాడటానికి కిరణ్మయికి ఇష్టం ఉండేదికాదు. ఒకసారి సురంజన్ సుప్రసిద్ధ గాయకులు సుమితా నాహా, మైధిలీ ముఖర్జీ పాల్గొంటున్న ఒక స్థానిక కార్యక్రమంలో తల్లినికూడా పాడమన్నాడు. కిరణ్మయి నవ్వి ఇలా అంది, "నేను సంగీతం అభ్యాసం చేయటంలేదు. నాగొంతుకూడా తగిన శ్రుతిలోలేదు. కాబట్టి పాడలేను".

"మరీ అంత వినయంవద్దు. నువ్వు ఎంతో కమ్మగా పాడేదానివి. ఆసంగతి ప్రజలకూ తెలుసు. ఒకప్పుడు నువ్వు పాడితే ప్రజలు ఆనందించేవాళ్ళు, మళ్ళీ మళ్ళీ పాడమనేవాళ్ళు", అన్నాడు సుధామయ్.

"నిజమే, కానీ చప్పట్లు చరిచి, ఆనందించేవాళ్ళు. ఏమనేవారో తెలుసా? 'ఈ హిందూస్త్రీలకు సిగ్గూ శరమూ లేవుకాబట్టే సంగీతం నేర్చుకుంటారు. పరాయివాళ్ళ ఎదుట కూచొని పాడతారు'' అంది కిరణ్మయి.

"అంటే ముస్లిం స్త్రీలు సంగీతం నేర్చుకోరని నీ అభిప్రాయమా?" అన్నాడు సుధామయ్.

"ఈమధ్య నేర్చుకుంటున్నారు. ఇంతకుముందు వాళ్ళ కంతగా పేరూ, ప్రఖ్యాతీ లేవు. అప్పుడు వాళ్ళు అనరాని మాటలంటే మనం భరించవలసి వచ్చేది. మినాతీ అక్కయ్య ఎంత మంచి గాయకురాలో మీకు తెలుసుకదా? ఒకరోజు ఒక గుంపు అబ్బాయిలు ఆమెమీద దాడిచేసి, ఆమె ముస్లిం అమ్మాయిలకు సంగీతం నేర్పించాలని ప్రయత్నిస్తున్నదని ఆమెను దూషించారు. ఆమె ఎంత నిరాశపడిపోయిందో తెలుసా?"

"కానీ సంగీతం నేర్పించటం మంచిదేకదా?" అన్నాడు సుధామయ్.

"అందరూ అలా అనుకోలేదు. చాలామంది మొగవాళ్ళు ఆడవాళ్లు సంగీతం నేర్చుకోకూడదనేవారు. సంగీతం వాళ్ళ శీలాన్ని పాడుచేస్తుందని నమ్మేవారు".

"అలాగా!"

అలా కిరణ్మయి క్రమక్రమంగా సంగీతమంటే ఆసక్తిని పోగొట్టుకుంది. ఆమె సంగీత గురువు ఎంతో ప్రోత్సహించేవాడు. కానీ "దాదా, ఇకమీదట నాకు పాడాలన్న కోరికలేదు. సంగీతాన్నీ, నాట్యాన్నీ అనుచితమైన పనులుగా ప్రజలు భావిస్తుంటే పాడాలనుకోవటంలో అర్థం లేదుకదా – " అని బాధగా నిట్టూర్చేది.

సుధామయ్ ఆమె అభిప్రాయాలను గౌరవించాడు. బహిరంగవేదికమీద పాడవలసిన అవసరంలేదన్నాడు. కానీ ఇంట్లోకూడా ఆమె పాడకపోవటాన్ని గురించి అప్పుడప్పుడూ బాధపడేవాడు.

అప్పుడప్పుడూ నిద్రపట్టని రాత్రుల్లో వాళ్ళు డాబామీదికి వెళ్లేవాళ్ళు. అలాంటి సందర్భాల్లో సుదూరాకాశంలోని నక్షత్రాలను నిశ్శబ్దంగా చూస్తూ నిలబడేవారు. వాళ్ళ హృదయాలు బ్రహ్మపుత్రా తీరాన ఉన్న తమ ఇంటిని తలుచుకొని రెపరెపలాడిపోయేవి. అప్పుడు మరపురాని మధురస్మృతుల్ని గురించిన ఓ టాగూర్ గీతాన్ని కిరణ్మయి లోగొంతులో పాడేది. ఆ పాటను వింటే సుధామయ్ హృదయం ద్రవించిపోయేది. గతంలో అనుభవించిన సుఖాలు మళ్ళీ కావాలని మనసు కోరుకునేది. తాను చిన్ననాడు పరుగులుతీసిన పొలాలూ, తాను ఆడుకున్న బడిప్రాంగణం, పొంగిపొర్లుతున్న నదీ, నది గట్టుమీదుగా అడవుల్లోకి వెళ్లే కాలిబాటా మనసులో మెదిలేవి.

పుట్టుకతో సుధామయ్ నిబ్బరం ఉన్న మనిషే అయినా బాధలు అతని స్థైర్యాన్ని కుంగదీశాయి. అప్పుడప్పుడూ అర్థరాత్రిపూట వీడుస్తూ మేల్కొనేవాడు. తన బాధను మరిచిపోవటానికి తన భార్యను గట్టిగా కౌగిలించుకునేవాడు. 1971 అతనికి ఎంతో దుఃఖాన్ని తెచ్చిన సంవత్సరం. అతని స్నేహితులు జగన్మయ్ ఘోషాల్, ప్రఫుల్ల సర్కార్, నేతాయ్‌సేన్ దాదాపు అతని కళ్ల ఎదుటే హత్యచేయబడ్డారు. వాళ్ళను ఖైదీల శిబిరానికి తీసుకెళ్ళి కాల్చేశారు. తరువాత వాళ్ల శవాలను ఎక్కడో అడవిలో పారేశారు.

హిందువులు కనిపిస్తే పాకిస్తానీలు పట్టుకునేవాళ్ళు. తమ బూటుకాళ్లతో తన్నేవాళ్లు. బాయ్‌నెట్లతో పొడిచేవాళ్ళు. కళ్ళు పీకేసేవాళ్లు. వెన్నెముకల్ని విరిచేసేవాళ్ళు. ఈ చిత్రహింసను భరించి ఇంకాబతికి ఉంటే చంపేసే వాళ్ళు. ముస్లిముల్ని ఎన్ని హింసలు పెట్టినా పాకిస్తానీలు వాళ్ళను ప్రాణాలతో విడిచి పెట్టేవాళ్ళు. కానీ హిందువుల్ని అలావిడిచిపెట్టే వాళ్ళుకాదు. స్వాతంత్ర్యపోరాటకాలంలో ఎంతోమంది హిందు, ముస్లిం స్వాతంత్ర్య వీరుల శవాలను "స్వీపర్స్‌కాలనీ" లోని బావిలో పారేశారు. దేశమంతా తాముకొత్తగా సాధించిన స్వాతంత్ర్యాన్ని తలుచుకుని ఉత్సవాలు చేసుకుంటూఉంటే మజీద్, రహీం, ఇద్రిస్, లాంటి తన స్నేహితులు ఆబావిలో కనిపించిన హిందూ, ముస్లిం సోదరుల ఎముకల్ని చూసి విలపించారు. ఏఎముకలు ఎవరివో తెలియక పోవటంచేత వారి దుఃఖం మరింత బాధాకరంగా ఉండేది. తనకు పాకిస్తానీలు చేసిన అంగవైకల్యాలు – ఒకకాలు విరగ్గొట్టటం, రెండుఛాతీఎముకలు విరగ్గొట్టటం లాంటివి – నెమ్మదిగానయమయ్యాయి. అలాగే తనపురుషాంగానికి వాళ్ళు కలిగించిన వైకల్యంకూడా కాలక్రమాన సద్దుకుంది. కానీ తన హృదయానికైన గాయాలు మాత్రం శాశ్వతంగా నిల్చిపోయాయి. స్వాతంత్ర్యపోరాటకాలంలో తాను నిర్బంధంలో అనుభవించిన బాధలనుంచీ సుధామయ్ తేరుకోలేక పోయాడు, నిర్బంధ శిబిరం నుంచీ ప్రాణాలతో బయటపడ్డాడు కానీ అతరువాత "సజీవంగా"మాత్రం బతకలేకపోయాడు. ఆనాటినుండి అతడు బతుకుతూఉన్న మోసం బతుకూ, భయం బ్రతుకూ అతణ్ణి మానసికంగా కూడా బాగుచేయలేకపోయాయి. ఫూల్‌పూర్‌లోని అర్జున్‌ఖిలా ప్రాంతంలో ఒక వెదురుగుడిసెలో అబ్దుల్ సలామ్ అన్న మారుపేరుతో ఏడేళ్ళు బతికాడు. సురంజన్‌ను సబీర్ అనీ, కిరణ్మయిని ఫాతిమా అని అందరూ పిలిచే వారు. ఆకాలాన్ని తలుచుకుంటే – తనప్రియమైన భార్య "ఫాతీమా"

అన్న మారుపేరుతో బతకటం జ్ఞాపకం వస్తే – ఆనాడు తన విరిగిన ఎముకలు గుండెలో గుచ్చుకోవటంకంటే ఎక్కువ బాధకలుగుతుంది. ఆ డిసెంబర్‌లో స్వాతంత్ర్యపోరాటవీరులు పూల్‌పూర్‌లో ప్రవేశించి "జై బంగ్లా" అని దిక్కులు పిక్కటిల్లేలాగా నినాదాలిచ్చిన తరువాతనే సుధామయ్ తనకు ఎంతో ఇష్టమైన ఆమెను పేరుతో "కిరణ్...కిరణ్...కిరణ్మయీ" అని పిలవగలిగాడు. తన ఎదలో మండుతున్న మంట చల్లారింది. అందరి ఎదుటా తన భార్యను "కిరణ్మయీ" అని పిలిచే స్వాతంత్ర్యం లభించింది. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం రావటమంటే అదేననిపించింది సుధామయ్‌కి.

★ ★ ★

ఎవరో గట్టిగా తలుపు తట్టటంతో సుధామయ్ గతస్మృతులు ఆగిపోయాయి. వచ్చినవాడు హరిపాద భట్టాచార్య. నాలుకకింద ఉంచుకున్న "నిఫికార్డ్" మాత్ర సుధామయ్ ఛాతీనొప్పిని కాస్త తగ్గించింది. అందుచేత అతడు లేచి తన స్నేహితుడికి ఆహ్వానం పలకగలిగాడు. "ఏం ఒంట్లో బాగాలేదా? చాలా బలహీనంగా కనిపిస్తున్నావు?" ప్రశ్నించాడు హరిపాద.

"ఔను హరిపాదా, కొంతకాలంగా ఆరోగ్యం బావుండటంలేదు. ఈలోగా బ్లడ్‌ప్రెజర్ కూడా చూపించుకోలేదు", అన్నాడు సుధామయ్.

"అరె, ఈ విషయం నాకు ముందుగా తెలిస్తే నా బి.పి. పరికరాన్ని తీసుకొచ్చేవాణ్ణికదా!"

"పరిస్థితి ఇలాఉంటే సురంజన్ బయటికెళ్ళాడు. మాకు ఎంత ఆందోళనగా ఉందో తెలుసా? అది సరేకానీ నువ్విక్కడికి ఎలా రాగలిగావు?"

"అడ్డదారిలోవచ్చా – మైన్ రోడ్ తప్పించి."

చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు. చివరికి హరిపాద తానుకప్పుకున్న శాలువను తీసివేస్తూ అన్నాడు, "ఈరోజు ఢాకాలో బాబ్రీమసీదు విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. అదే సమయంలో శాంతియాత్రలుకూడా జరుగుతున్నాయి. రాజకీయపార్టీలూ, ఇతరసంస్థలూ మతసామరస్యానికి పిలుపునిచ్చాయి. ప్రశాంతంగా ఉండమని పార్లమెంటునుంచీకూడా ఒక ప్రకటన వెలువడింది. ఎలాంటి పరిస్థితిలోనూ మతసామరస్యానికి విఘాతం కలగకూడదని షేక్‌హసీనా ఒక రేడియో సందేశంలో ప్రజలకు విజ్ఞప్తి చేసింది. రెండువందలా ముప్పై ఆరుమంది భారతదేశంలో జరిగిన అల్లర్లలో చనిపోయారు. నలభైపట్టణాల్లో నిషేధాజ్ఞలు విధించారు. మతతత్వ పార్టీలను నిషేధించారు. ప్రధానమంత్రి నరసింహారావు బాబ్రీమసీదును పునర్‌నిర్మిస్తామని వాగ్దానం కూడా చేశారు!"

హరిపాద గంభీరంగా కూచున్నాడు. "ఏం చేయాలో నిర్ణయించుకున్నావా? ఇక్కడే ఉండాలనుకుంటున్నావా? ఇంకా ఇక్కడే ఉండాలనుకోవటం క్షేమం కాదని నేననుకుంటున్నాను. మానిక్‌గంజ్‌లోని మా అత్తవారింటికి వెళ్దామా అని ఆలోచించాను. కానీ ఈరోజు సాయంకాలం మా బావమరిది వచ్చాడు.

మానిక్‌గంజ్‌లోనూ, పోలీస్‌స్టేషన్ ఏరియాలోనూ వందకంటే ఎక్కువ ఇళ్ళను లూటీ చేశారట, తగలబెట్టారట. పాతిక దేవాలయాలను బూడిదచేశారట. భోక్‌జోరీ అన్న గ్రామంలో హిందువుల ఇళ్ళనన్నిటినీ తగలబెట్టారట. అర్ధరాత్రిపూట దేబేన్‌షోరీ ఇంట్లోకి జొరబడి, అతని కూతురు సరస్వతిని బయటికిలాగి చెరిచారట".

"ఏమిటీ? మీరు చెబుతున్నది నిజమేనా?" అన్నాడు సుధామయ్ అదిరిపడి, భయంగా.

"మీ అమ్మాయేదీ?" అన్నాడు హరిపాద.

"ఒక స్నేహితుని ఇంటికెళ్ళింది".

"అది ముస్లిం స్నేహితుని ఇల్లేనా?"

"ఔను!"

"అలాగైతే ఫరవాలేదు", బరువు దిగినట్టుగా నిట్టూరుస్తూ.

హరిపాద తీసుకొచ్చిన వార్తతో కిరణ్మయి ఆమె భర్తలాగే చలించిపోయింది. కానీ అతడు మాయచేసిన పనిని గురించి వెలిబుచ్చిన అభిప్రాయంతో కాస్త ఊరట పొందింది. సుధామయ్ కళ్ళజోడుతీసి శుభ్రంగా తుడిచి, మళ్ళీ పెట్టుకున్నాడు.

"ఇది అల్లర్లు జరగటానికి అవకాశం ఉన్న ప్రాంతం. మైమెన్‌సింగ్‌లో మనం ఇంతవరకు అల్లర్లు ఎరగం. అన్నట్టు మైమెన్‌సింగ్‌లో అల్లర్లను గురించి నీకేమైనా తెలుసా?" అన్నాడు సుధామయ్.

"తెలుసు. ఫూల్‌పూర్ జిల్లాలోని బతాడీ గ్రామంలో రెండు దేవాలయాలనూ, ఒక భజనమందిరాన్నీ, ఒక కాళీదేవాలయాన్నీ ధ్వంసంచేశారట", అన్నాడు హరిపాద.

కిరణ్మయి ఏమో అనబోయింది. ఈలోగా మళ్ళీ హరిపాద అన్నాడు.

"నార్త్ బ్రూక్ హాల్ రోడ్‌లోని పూజ కార్యాలయాన్నీ, జమీందారుగారి భవనంలోని కాళీమాత విగ్రహాన్నీ, దేవాలయాన్నీకూడా పూర్తిగా ధ్వంసం చేసేసారట. ఈరోజు శాంతినగర్‌లోని జల్ ఖబర్ – శతరూపస్టోర్స్ అన్న మిఠాయి దుకాణాన్ని పూర్తిగా తగలబెట్టేశారట. కుష్టియాలో అర్ధరాత్రిపూట జమాత్‌శిబిర్ సంస్థకు చెందినవాళ్ళు ఆరు దేవాలయాలమీద దాడిచేశారట. ఇవి కాకుండా చిట్టగాంగ్, సిల్‌హెట్, భోలా, షేర్‌పూర్, కాక్స్ బజార్, నవ్‌ఖాలీ పట్టణాల్లో జరుగుతున్నదాన్ని గురించివింటే కాస్త భయంగా ఉంది".

"దేన్ని గురించి భయం?" ప్రశ్నించాడు సుధామయ్.

"వలస గురించి......"

"లేదు లేదు.... ఈదేశంలో పెద్ద ఎత్తున అల్లర్లు జరగవు. సామూహికంగా వలసపోవటంకూడా జరగదు....."

"దాదా, 1990 లో ఏం జరిగిందో మరిచిపోయావా? లేక... నీకేం అపకారం జరగలేదా?"

"ఓ అదంతా ఎర్షాద్ ప్రభుత్వం ఆడిన నాటకం".

"భలేవాడివి దాదా! బంగ్లాదేశ్ ప్రభుత్వంవారి రికార్డులొకసారి చూడకూడదు?

ఈసారి వలస మరీ ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం నాటకమాడినంత మాత్రాన ప్రజలు పుట్టిన గడ్డనువదిలి పారిపోరు. పుట్టినగడ్డ మట్టి అప్పుడప్పుడూ మార్చటానికి పూలకుండీలోని మట్టివంటిదికాదు. లేదు దాదా, నాకు చాలా భయంగా ఉంది. నా కొడుకు ఒకడు కలకత్తాలో చదువుకుంటున్నాడు. కానీ ఎదిగిన నా కూతుళ్ళిద్దరూ ఇక్కడే ఉన్నారు. వారిని గురించి ఆలోచిస్తూ రాత్రులు నిద్రలేకుండా గడుపుతున్నాను. నేను వెళ్ళిపోతాననుకొంటాను...."

అకస్మాత్తుగా కోపం వచ్చింది సుధామయ్‌కి. కళ్లజోడును విసురుగా చేతిలోకి తీసుకుంటూ గట్టిగా అరిచాడు. "హరిపాదా! నీకు పిచ్చి పట్టిందా? అలాంటి మాటలు ఇంకెప్పుడూ అనకు....." అన్నాడు.

"నువ్వేమంటావో నాకు తెలుసు. కావలసినంత డబ్బు సంపాదించుకుంటూ హాయిగానే ఉన్నానంటావు. సొంత ఇల్లూ వగైరా.... అంతేకదూ"

"కారణం అదికాదు హరిపాదా! ఇది డబ్బుకూ, అవకాశాలకూ సంబంధించిన ప్రశ్నకాదు. కావలసినంత సంపాదన లేకపోయినాసరే దేశాన్ని విడిచిపోవటం ధర్మంకాదు. కదూ? నాసంగతిచూడు. నేను రిటైరైనవాణ్ణి. నాకు సంపాదనకూడా అంతగాలేదు. నాకొడుక్కూకూడా సంపాదనలేదు. నామెడికల్ ప్రాక్టీసుమీద వచ్చే కొద్దిపాటి సంపాదనతో ఎలాగో బండిలాగుతున్నాను. ఈమధ్య నావద్దకు రోగులు దాదాపుగా రావటంలేదు. కాబట్టి నేను నాదేశాన్ని వదిలిపారిపోతానా? దేశాన్ని వదిలి పారిపోయేవాళ్ళు మానవులుకారు. ఈదేశం పరిస్థితి ఎలాగైనా ఉండనీ. ఒకసంగతి గుర్తుంచుకో. బెంగాలీలు అనాగరిక జాతివారుకారు. ఇప్పుడు కొద్దిగా అల్లర్లున్న మాట వాస్తవమే. కానీ అన్నీ సర్దుకుంటాయి. రెండుదేశాలు ఒకదాని సరసన మరొకటి ఉన్నప్పుడు ఒకదేశంలో చెలరేగిన మంటలు మరొక దేశానికి కొద్దిగానైనా వ్యాపించకతప్పదు.... ఒక విషయం గుర్తుంచుకో హరిపాదా! 1964 లో అల్లర్లు ప్రారంభించింది బెంగాలీ ముస్లింలు కారు.. బీహారీలు". శాలువను గట్టిగా కప్పుకుంటూ హరిపాద అన్నాడు, "ఈ శాలువను ఇంతగట్టిగా ఎందుకు కప్పుకుంటానో తెలుసా, దాదా? బీహారీలకు భయపడికాదు, నీముస్లిం సోదరులకు భయపడే".

ఈమాట పూర్తిచేసి హరిపాద నెమ్మదిగా ఇంట్లోనుంచి బయటికి వెళ్లాడు – అంధకారంలోకి. కిరణ్మయి తలుపు కొద్దిగా తెరిచి సురంజన్ జాడ ఏమైనా తెలుస్తుందేమోనని చూసింది. క్షణక్షణానికీ ఆవిడ ఆందోళన పెరిగిపోతోంది. కానీ చెప్పినమాట వినకుండా వెళ్ళిన కొడుకు జాడమాత్రం కనిపించలేదు. ఇంటిముందునుంచి మాటిమాటికీ ఊరేగింపులు వెళ్తున్నాయి. అల్లాపేరుతో నినాదాలు వినిపిస్తున్నాయి. భారతప్రభుత్వం బాబ్రీమసీదును పునర్నిర్మించాలనీ, లేకుంటే సహించేది లేదనీ వాళ్లు కేకలు వేస్తున్నారు....

రాత్రి ఆలస్యంగా సురంజన్ తిరిగి వచ్చాడు. అతడు చాలా అలసిపోయాడు. అతని కాళ్ళు అలసటతో తడబడుతున్నాయి. అతడు తనకు భోజనం అక్కరలేదని తన తల్లితో చెప్పాడు.

★ ★ ★

సురంజన్ దీపం ఆర్పి పడుకున్నాడు. కానీ నిద్ర పట్టలేదు. పడకమీద అటూ, ఇటూ పొర్లాడు. అతని మనసు గతంలోకి వెళ్లింది. కొంతకాలం క్రితం అతడు "ఏకత" అన్న పత్రికకు విలేఖరిగా పనిచేశాడు. పత్రికారచయితగా అతని అనుభవం అతనికి తన భావాలను ఒక క్రమంలో అమర్చుకోవటాన్ని నేర్పింది. అంతేకాకుండా దేశంలో ఏం జరుగుతూ ఉన్నదో తెలుసుకునే అవకాశాన్ని కల్పించింది.

జాతీయవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం అన్న నాలుగు సూత్రాల ఆధారంగా బంగ్లాదేశ్ ఏర్పడింది. స్వాతంత్ర్యంకోసం ఆదేశం సుదీర్ఘంగా, కఠినంగా పోరాడింది. 1952 లో జరిగిన భాషాపోరాటంతో ప్రారంభిస్తే స్వాతంత్ర్యపోరాటం సుదీర్ఘమైంది మాత్రమేకాదు, ఎంతో కఠినమైందికూడా. కానీ మొత్తంమీద స్వాతంత్ర్యం వచ్చింది. ఈలోగా మతతత్త్వం, మతదురభిమానం అన్న రుగ్మతలు ఓడిపోయాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించిన అభివృద్ధి నిరోధకులకు రాజ్యాధికారం వచ్చింది. వాళ్ళు రాజ్యాంగచట్టం స్వరూపాన్నే మార్చేశారు. స్వాతంత్ర్యపోరాటకాలంలో అందరూ తిరస్కరించిన మతతత్వానికీ, మతదురహంకారానికీ ప్రాణం పోశారు. మతాన్ని ఒక రాజకీయ ఆయుధంగా ఉపయోగించారు. అధికసంఖ్యాకప్రజలు ఇస్లాం నిబంధనల్ని అంగీకరించేలా ఒత్తిడి చేశారు. అలా చట్ట వ్యతిరేకంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా ఇస్లాం బంగ్లాదేశ్‌లో జాతీయమతం అయిపోయింది. దీని ఫలితంగా మతతత్వమూ, మత దురభిమానమూ ఎవరూ నిరోధించలేనంతగా పెరిగిపోయాయి. తన దేశంలో మతతత్వమూ, మత దురహంకారమూ చేసిన అపకారాల పట్టికను నెమరువేసుకోసాగాడు సురంజన్.

★ కోమిల్లాజిల్లాలోని ధాకండీ ఉపజిల్లాలోని సభాహో అన్న గ్రామంలో 1979 వ సంవత్సరం ఫిబ్రవరి 8 వ తేదీ దాదాపు నాలుగు వందలమంది పరిసర గ్రామాలకు చెందిన జనం అక్కడ నివసిస్తున్న హిందూ సన్యాసులబృందంమీద దాడిచేశారు. "ప్రభుత్వం ఈదేశాన్ని ఇస్లామిక్ దేశంగా ప్రకటించింది. ఇస్లామిక్ దేశంలో ఉండాలంటే మీరు ఇస్లాంను స్వీకరించాలి. ఇస్లాంను స్వీకరించటం ఇష్టం లేకుంటే మీరు ఈ దేశాన్ని వదిలివెళ్లాలి", అని కేకలు పెడుతూ వాళ్ళు దాడి చేశారు. తమ ఇళ్ళనూ, దేవాలయాలనూ వాళ్ళు దోపిడీ చేస్తుంటే ఆ సాధువులు నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయారు. వాళ్ళలో చాలామందిని బందీలుగా పట్టుకొని తీసుకెళ్ళటంకూడా జరిగింది. వాళ్ళలో కొందరు ఇంకా తిరిగి రాలేదుకూడా. స్త్రీలను దారుణంగా చెరిచారు. హింసించారు, దాడికి గురైనవారిలో కొందరు పూర్తిగా కోలుకోలేకపోయారు.

★ నర్‌షింద్ జిల్లాలోని శివపూర్ ఉపజిల్లాలోని అబిర్దియా అన్న గ్రామంలో నృపేంద్రకుమార్ సేన్‌గుప్తనూ, అతని భార్య అనీమాసేన్ గుప్తనూ ఒక న్యాయవాది ఇంట్లో బంధించారు. 8.75 బిఘాల పొలాన్ని వాళ్లచేత బలవంతంగా రాయించుకున్నారు. ఆ ఆస్తిని మరెవరి పేరనో రిజిస్టర్ చేయించారు. 1979 మార్చి 27 వ తేదీ అనీమా సేన్ గుప్త తన్ను కొంతమంది వేధిస్తున్నారని

చెబుతూ నర్సిండీ పోలీస్ సూపరింటెండ్‌కు రాతమూలకంగా ఫిర్యాదు చేసింది. నిందితులెవరో తెలిసినా చుట్టుపక్కల వాళ్లెవరూ సాక్ష్యం చెప్పటానికి రాలేదు. అనీమాను పోలీసులు కస్టడీలోకి తీసుకొని నాలుగురోజులు వేధించి వదిలిపెట్టారు.

★ అదే సంవత్సరం మే 27 న ఫిరోజ్‌పూర్ జిల్లాలోని కౌవ్‌ఖాలీ ఉపజిల్లాలోని బౌలాకందా గ్రామంలో పది పన్నెండుమంది ఆయుధాలు ధరించి హాలధార్ కుటుంబాలమీద దాడిచేశారు. ఇంటిని నేలమట్టం చేశారు. దేవాలయాన్ని ధ్వంసం చేశారు. వాళ్ళు హిందువులనందరినీ చంపేయాలనీ, దేవాలయాలను కూలదోసి మసీదులుగా మార్చేయాలనీ కేకలు వేశారు. హిందువులందరూ తక్షణం దేశం వదిలి వెళ్ళాలని హెచ్చరికచేసి వెళ్ళారు.

★ చిట్టగాంగ్ జిల్లాలోని గోశ్చి గ్రామంలో మే 9 వ తేదీన సుమారు వందా యాభైమంది ముస్లిములు వైద్యగారి ఇంట్లో జొరబడి, బాంబులు పెట్టి దాన్ని పేల్చివేసి, చాలా భాగాన్ని బూడిదపాలు చేశారు.

★ ఫిరోజ్‌పూర్ జిల్లాలో స్వరూప్ కఠీకి చెందిన అత్‌ఘర్ అన్న గ్రామంలో జూన్ పదహారవతేదీ పది పన్నెండుమంది పోలీసులు గౌరాంగమండల్, నాగేంద్రమండల్, అమూల్యమండల్, సుబోధమండల్, సుధీర్‌మండల్, హీరేంద్రనాథ్ మండల్, జహర్ దేవ్రీ – మొత్తం పదహారుమంది హిందువుల్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. తరువాత వీళ్ళందర్నీ గౌరాంగమండల్ ఇంటికి తీసుకెళ్ళి, వాళ్ళ ముంగిట్లో చావబాదారు. గౌరాంగమండల్ భార్య బేను వాళ్లను ఆపబోతే పోలీసులు ఆమెను ఇంట్లోకి తీసుకెళ్ళి వరసగా మానభంగం చేశారు. ఆ కుటుంబంలోని ఇతర స్త్రీలు ఆవిడను కాపాడబోతే అందర్నీ హింసించారు. సనాతన మండల్ కూతురు రీనానుకూడా మానభంగం చేశారు. తరువాత ఆవిడను ఎత్తుకుపోయారు. ఇంతవరకూ ఆవిడ జాడ తెలియలేదు.

★ జూన్ 18 న ఫిరోజ్‌పూర్ జిల్లాలోని చాంద్‌కఠీ అన్న గ్రామంలో ముగ్గురు పోలీసులు, స్థానిక వాచ్‌మన్‌తోనూ, మరికొందరు సాయుధులైన రౌడీలతోనూ కలిసి హిందువులకోసం అప్రాంతాన్నంతా గాలించారు. దొరికిన హిందువులకు వాళ్ళు వీలైనంత త్వరగా దేశాన్ని వదిలి పారిపోవాలని హెచ్చరిక చేశారు. దులాల్‌కృష్ణమండల్‌నూ మరికొంతమంది హిందువులనూ పోలీస్ కస్టడీలోకి తీసుకొని నానాబాధలూ పెట్టారు. ఆతరువాత ఎనిమిదివేల నుంచీ పదివేల టాకాల జామీను పుచ్చుకొని వాళ్ళను వదిలిపెట్టారు. అందుచేత చాలామంది హిందువులు దేశాన్ని వదిలి పారిపోయారు. ఖుల్నాజిల్లాలోని ఘజీర్హాత్ యూనియన్‌లోని పన్నెండు గ్రామాల్లో హిందువుల్ని బాధలు పెడుతూనే ఉన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన ముల్లాజలాలుద్దీన్ మనుషులు హిందువుల్ని వ్యవసాయం చేసుకోనివ్వటంలేదు, వాళ్ళ పంటల్ని దోచుకుంటున్నారు, పశువుల్ని తోలుకుపోతున్నారు, వాళ్ళ దుకాణాల్ని లూటీ చేస్తున్నారు.

★ బరిసాల్ జిల్లాలోని దుర్గాపూర్ గ్రామంలో డిసెంబరు 10వ తేదీన అబ్దుస్ సాబాహార్ భయ్యా, గులాం హుసేన్ అయుధాలు తీసుకొని రాజేంద్రనాథ్‌దాస్ ఇంట్లోకి జొరబడ్డారు. వీరిద్దరికి భూమికి సంబంధించిన తగాదా ఉండేది. మొదట రాజేంద్రప్రసాద్‌నూ అతని కుటుంబసభ్యులనూ చంపేస్తామని బెదిరించారు. ఆతరువాత ఇంట్లో ఉన్న బంగారాన్నీ, నగల్ని దోచుకొని ఇంటికి నిప్పుపెట్టారు. వారి పూజామందిరంలోని రాధాకృష్ణుల అష్టలోహ విగ్రహాలను తీసుకెళ్లవద్దని వారి కుటుంబసభ్యులు చెబితే వారిని దయాదాక్షిణ్యాలు లేకుండా కొట్టారు. దేశాన్ని వదిలి తక్షణం వెళ్ళిపోకపోతే భయంకరమైన బాధలు పడాల్సి వస్తుందని హెచ్చరికచేసి వెళ్ళారు.

★ బగేర్‌హాత్ జిల్లాలోని తల్‌బూనియా గ్రామంలో ఆగస్టు 26 వ తేదీ స్థానిక మత దురహంకారుల పలుకుబడివల్ల కొంతమంది పోలీసులు లక్ష్మణచంద్రసాల్ అన్న ఎనభై ఏళ్ల వృద్ధుడి ఇంటిమీద దాడిచేసి అతని మనవడు వికాస్ చంద్రపాల్‌ను చావగొట్టారు. అతని కొడుకులు భిహోర్‌పాల్‌నూ, రవీంద్రనాథ్‌పాల్‌నూకూడా కొట్టారు. భార్య జోక్యం చేసుకోబోతే ఆవిడనూ కొట్టారు. అందర్నీ పోలీస్‌స్టేషనుకు లాక్కెళ్లి వాళ్లమీద కేసులు బనాయించి, జైల్లో కుక్కారు. వాళ్లకు బెయిల్‌కూడా ఇవ్వలేదు. స్వాతంత్ర్యం రావటానికి ముందుగావే షోలాకురా గ్రామానికి చెందిన అబ్దుల్ హకీం ముల్లా లక్ష్మణచంద్ర మరదలిని మానభంగం చేశాడు. ఇతర కుటుంబసభ్యుల్ని చావగొట్టాడు. అతణ్ణి అరెస్టు చేసి, కేసుపెడితే శిక్షపడింది. అతడు జైలునుంచి తిరిగొచ్చాక మరి ముగ్గురితో కలిసి లక్ష్మణచంద్రమీద పగతీర్చుకోవడానికి వెళ్లాడు. పోలీసుల సాయంతో అతడి కుటుంబంలోని ప్రతిఒక్కరిమీదా పగతీర్చుకున్నాడు. లక్ష్మణచంద్ర కుటుంబంమీద జరిగిన దాడినిచూసి, తమకు రక్షణ ఎంతమాత్రమూలేదని అర్థంచేసుకున్న ఇతర హిందూకుటుంబాలు దేశాన్ని వదిలిపారిపోయాయి.

★ గోపాల్ గంజ్ జిల్లాలోని గోపాల్‌గంజ్, కోటాలీపారా, మక్‌సద్‌పూర్ మొదలైన ఊళ్లలో హిందువుల ఇళ్లలో దొంగతనాలూ, దోపిడీలూ జరిగాయి. వాళ్ల ఆస్తుల్ని ఇతరులు బలవంతంగా ఆక్రమించుకున్నారు. వాళ్లమీద రకరకాల కేసులు బనాయించారు. వాళ్ల స్త్రీలను మానభంగం చేశారు. మొత్తంమీద వారిని సర్వనాశనం చేశారు. ఆప్రాంతంలోని దేవాలయాలు నేలమట్టమయ్యాయి. హిందువులను హింసించటానికి పోలీసు బలగాలు దగ్గరుండి సాయం చేశాయి.

★ కొటాలీపారా ఉపజిల్లాలోని మంద్రాలకిక్‌పూర్ గ్రామంలో ఆ ఉపజిల్లా ఛేర్‌మన్ అతని గూండాలను హిందూస్త్రీలమీదికి ఉసికొల్పారు. ఇది పట్టపగలు జరిగింది. ఈ గూండాలు మోతేరీబారీ, లకీర్‌పార్, గగన్‌బజార్, ఖేజూర్‌బారీ గ్రామాలమీదకూడా దాడిచేసి విచ్చలవిడిగా దోచుకున్నారు. తన ఆస్తులూ, వస్తువులూ అమ్ముకొన్నట్టుగా దొంగపత్రాలమీద సంతకాలు చేయించుకున్నారు. రక్షణలేని హిందువులు దేశాన్ని వదిలి వెళ్లటం ప్రారంభించారు. కొటాలీసారా సొనాలీ బాంకులో పనిచేసే శ్రీమతి భౌమిక్‌మీద దాడిజరిగిన తరువాత,

కందీగ్రాంకు చెందిన మమత, మధుల మీద అత్యాచారం తరువాత ఈవలస పెద్దవెల్లువైపోయింది.

★ బగేర్‌హాట్ జిల్లాలోని గరీబ్‌పూర్ గ్రామంలో జూలై 3వ తేదీన అనిన్ చంద్ర అన్నవ్యక్తి ఇంట్లోలేని సమయంలో పోలీసులు అతని భార్యనూ, పాపనూ చావగొట్టారు.

★ అదేరోజు ఆ గ్రామంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ ఉన్న అమూల్యబాబు ఇంటిని పోలీసులు దోచుకున్నారు. మరుసటిరోజు సురీగటీలోని క్షితీశమండల్ ఇంటిమీద దాడి చేశారు. మొగవాళ్లెవరూ ఇంట్లోలేని సమయంలో అతని భార్యనూ, కూతురునూ చెరిచారు.

★ ఆ మరుసటి రోజు అదేగ్రామంలో శ్యాంలాల్ బిశ్వాస్ ఇంటిమీద పోలీసులు దాడిచేశారు. శ్యాంలాల్‌బాబు ఇంట్లోలేని సమయంలో అతని కూతురిమీద అత్యాచారంచేసి, విలువైన వస్తువుల్ని తీసుకుపోయారు.

★ మరికొన్ని రోజులతరువాత ఒకస్థానికగూండా చితల్‌మారీలోని నిరోద్‌బిహారీరాయ్ ఇంటిని బలవంతంగా ఆక్రమించుకున్నాడు. రాయ్ స్థానిక ఆఫీసర్లకు ఫిర్యాదు చేసినా ఏలాంటి ప్రయోజనమూ లేకుండాపోయింది.

★ మన్సూర్ మాలిక్ అన్నవ్యక్తి కాలాశిరా అన్నగ్రామంలో ఒక హిందువును బలవంతంగా ఇంటినుంచి వెళ్లగొట్టాడు.

★ గోపాల్‌గంజ్ జిల్లా విద్యాశాఖాధికారి చాలా దుర్మార్గుడు. అతడు హిందూస్త్రీలకు ఉద్యోగాలు ఇప్పిస్తానని మాట ఇచ్చి, నమ్మి దగ్గరికొచ్చినవాళ్లను మానభంగం చేసేవాడు. డెమకోయిూర్ గ్రామానికి చెందిన బిస్వాస్ కుటుంబంలోని ఇద్దరుస్త్రీలకు ఈ గతిపట్టింది. అదేవ్యక్తి హిందూ ఉపాధ్యాయుల్ని బదిలీలు చేస్తానని బెదిరించి ఎంతో సొమ్ము చేసుకున్నాడు.

★ గోపాల్‌గంజ్‌లోని అర్తీగ్రామంలో జగదీశ్ హల్దార్ ఇంటిమీద పోలీసులూ, ఆయుధాలు ధరించిన మరోగుంపు రౌడీ యువకులూ కలిసి దాడిచేశారు. వాళ్ళు ఇంట్లో అందర్నీ చావగొట్టి, ఇంటిని పూర్తిగా దోచుకుపోయారు. వెళ్లేముందు ఇంట్లో అందర్నీ హత్యచేస్తామని బెదిరించారు.

★ అదే సంవత్సరం ఆగస్టు 12 న పోలీసులూ, సాయుధులైన ముస్లింగూండాలూ కలిసి మరింక ఎన్నో హిందూకుటుంబాలమీద దాడిచేశారు. కొన్ని దేవాలయాలనుకూడా ధ్వంసం చేశారు. అశుతోష్‌రాయ్‌నీ, సుకుమార్ రాయ్‌నీ, మనోరంజన్‌రాయ్‌నీ, అంజలీరాయ్‌నీ, సునీతీరాయ్‌నీ, బేలాబిశ్వాస్‌నూ చిత్రహింసలు పెట్టారు. ఈ దేశంలో ఒక్క హిందూ దేవాలయాన్నికూడా ఉండనివ్వనని ప్రతిజ్ఞచేసి మరీ వెళ్లారు.

★ గోపాల్‌పూర్ జిల్లాలోని మక్‌సద్‌పూర్ ఉపజిల్లా చేర్మెన్ చనిపోవటాన్ని మతదురహంకారులూ, పోలీసులూ పెద్ద సమస్యగా తయారుచేశారు. ప్రతీకారంగా ఆ ప్రాంతంలోని హిందువులనందర్నీ చిత్రహింసలు పెడతామని బెదిరించారు.

వాసుదేవపూర్‌లో శివు అన్న అతని భార్యనూ, మహతాలి గ్రామంలో కుమారి అంజలి అన్న స్త్రీనీ పోలీసులు మానభంగం చేశారు.

★ జూన్ 20 వ తేదీన ఫిరోజ్‌పూర్ జిల్లాలోని స్వరూపాక్షి ఉపజిల్లాలోని బస్తుకథీగ్రామంలో పోలీసులు అకస్మాత్తుగా హిందువులమీద దాడిచేశారు. బస్తుకథీ తీరంలో హిందువుల పొలాల్లోని పంటల్ని పోలీసులు ధ్వంసం చేశారు. రైతుల్ని పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. బాగా డబ్బు గుంజుకున్నాక మాత్రమే వదిలిపెట్టారు.

★ అదే గ్రామంలో జూన్ పదకొండవతేదీన మినాతీరాణి అన్న హెల్త్ వర్కర్‌నూ, ఆవిడ అన్నయ్యనూ, వదిననూ పోలీసులు రోడ్డుమీద అడ్డగించి తన శిబిరానికి తీసుకుపోయి వాళ్లను భయభ్రాంతుల్ని చేశారు. వేయి టాకాల జుల్మానా వసూలు చేసికొని వదిలిపెట్టారు. స్వరూపాక్షి గ్రామంలోని షియూలీ అన్న పధ్నాలుగేళ్ల అమ్మాయిని రౌడీలు ఎత్తుకుపోయారు. ఆమె సుధాంశుకుమార్ హల్దార్ కుమార్తె. షియూలీ చివరకు రోడ్డుమీద తెలివితప్పిన స్థితిలో కనిపించింది. సుధాంశుకుమార్ హల్దార్ అధికారులకు ఫిర్యాదు చేస్తే "వీటిని నువ్వు భరించలేకపోతే ఈదేశాన్ని విడిచి వెళ్ళిపో", అనివాళ్ళు సమాధానం చెప్పారు.

★ 1979 ఏప్రెల్ ఏడవతేదీ బగూరాజిల్లాలోని శివగంజ్ ఉపజిల్లాలో బిరూగంజ్ బజార్ అన్న గ్రామంలో మసీదు నిర్మాణానికి సంబంధించిన వివాదం కారణంగా మసీదుకమిటీ సభ్యులు డాక్టర్ సచీంద్రకుమార్ సాహా ఇంటిమీద దాడిచేశారు. కిటికీలూ, తలుపులూ పగలగొట్టి లోపలికొచ్చి దోపిడీ చేశారు. పోతూపోతూ ఇంటిని తగలబెట్టారు. పక్కనే ఉన్న ఒకదేవాలయాన్ని నేలమట్టం చేశారు. ఆతరువాత రెండుగంటలపాటు భయోత్పాతాన్ని సృష్టించి దాదాపు 1.1 మిలియన్‌టాకాల ఆస్తిని దోపిడీచేశారు. ఈ గందరగోళంలోనుంచి ఎలాగో తప్పించుకున్న డా.సాహా కుమారుడు స్థానిక పోలీస్ స్టేషన్ను చేరుకోగలిగాడు. విచారణ చేయటానికి వచ్చిన పోలీసులమీద ఒక నేరస్థుడూ, అతని గుంపుకుచెందినవారూ దాడిచేశారు. ఈ దాడిలో చాలామంది పోలీసులు గాయపడ్డారు. శివగంజ్ పోలీసు అధికారులు ఆ నేరస్థునిమీదా, మరో అరవైఐదుమందిమీదా క్రిమినల్‌కేసుపెట్టి, అరెస్టు చేశారు. కానీ పై అధికారుల జోక్యంవల్ల అందర్నీ విడిచిపెట్టారు. ఆతరువాత అక్కడున్న ఇతరహిందూ కుటుంబాలలాగే డా. సాహా కుటుంబంకూడా ప్రాణభయంతో బతక్కతప్పలేదు.

★ ఫరీద్‌పూర్‌జిల్లా అల్ఫాడంగా ఉపజిల్లాలోని తిక్రాపారా గ్రామంలో 1970 మే రెండు, మూడు తేదీల్లో హిందువులమీద దారుణమైన దాడి జరిగింది. వాళ్లంతా మరోచోట తలదాచుకోవటానికి పారిపోయారు.

★ మగూరా జిల్లాలోని రహత్‌పూర్ గ్రామంలో హరేన్ బిస్వాస్ భార్యమీదా, అతని కోడలిమీదా, మైనర్ కూతురిమీదా ఆప్రాంతంలోని పలుకుబడి ఉన్న వ్యక్తులు

దాడిచేశారు. బిస్వాస్ వారిమీద కేసుపెట్టాడు. దానిఫలితంగా వారి వేధింపుల్ని భరించలేక హారేన్ బిస్వాస్ కుటుంబం దేశంవదిలి వెళ్లిపోవలసివచ్చింది.

★ గోపాల్‌గంజ్ జిల్లాలోని దేవగ్రాం గ్రామంలో మే 19, 20 తేదీల్లో వంగభూమి ఉద్యమంతో సంబంధం ఉందన్న నేరంమీద అనిల్‌కుమార్‌బాగ్చీ, సుశీల్‌కుమార్ పాండే, మకన్‌లాల్ గంగూలీలను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దమొత్తాన్ని లంచంగా చెల్లించిన తరువాత మాత్రమే వాళ్లను విడుదల చేశారు. మీరాఖత్ గ్రామానికి చెందిన రమేశ్‌చంద్ర సీరూను బలవంతంగా ఇస్లాంలోకి మార్చారు. రమేశ్ చంద్రభార్యనూ, అతని అన్ననూ కూడా ఇస్లాంలోకి మారవలసిందిగా బలవంతం చేశారు. ఆమె గ్రామపెద్దలతో మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. పోగా బెదిరింపులు ఎక్కువయ్యాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆమె గ్రామాన్ని వదిలి పారిపోయింది.

★ గోపాల్‌గంజ్ జిల్లా కొచ్వా ఉపజిల్లా జొబాయ్ అన్న గ్రామంలో సుధీర్ వైద్య భార్యను ఒక బర్తరఫ్ అయిన పోలీస్ అధికారి మానభంగం చేశాడు. ఈ విషయాన్ని గురించి బయటికి చెబితే చంపుతామని బెదిరించారు. ఈ అవమానాన్ని భరించలేని సుధీర్‌వైద్య అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయాడు.

★ అదే గ్రామంలో కొందరు దుండగులు ఉపేంద్రమాలోకు చెందిన ఆవును చంపి భోంచేశారు. ఉపేంద్రమాలో అధికార్లకు ఫిర్యాదుచేస్తే వాళ్లు అతణ్ణే హాస్యం చేశారేగానీ ఎలాంటిచర్యా తీసుకోలేదు.

★ బొల్‌టోలీ యూనియన్‌లోని గ్రామంలో తనవరిపంటను దోచుకుపోతున్న ముస్లి ముల్ని కాదన్నందుకు కార్తీక్‌రాయ్ అన్న వ్యక్తిని చంపేశారు. అతడు మామూలు చావే చచ్చాడని అతని భార్య రేణుకచేత చెప్పించారు.

★ 1988 డిసెంబరు నాలుగవతేదీ కోమిల్లా జిల్లాలోని దక్షిణచాంద్‌పూర్ అన్న గ్రామలో మంజురాణీసీల్ అన్న తొమ్మిదవతరగతి అమ్మాయిని రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో అబ్దుల్ రహమాన్ అన్నవ్యక్తీ, అతని గూండాలూ కలిసి ఎత్తుకుపోయారు. ఆ అమ్మాయి కుటుంబసభ్యులు మరుసటిరోజు లక్‌సమ్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఇంతవరకూ మంజురాణీ ఏమైందో ఎవరికీ తెలియదు. ఆమెను ఎత్తుకుపోయిన గూండాలు ఆమె తండ్రి ప్రేమానందసీల్‌ను బెదిరించారు. పోలీసులు ఎలాంటిచర్యా తీసుకోలేదు. ఈ ప్రాంతంలోని హిందువులు తమ పిల్లల్ని బళ్ళకు పంపటానికి హడలిపోతున్నారు.

★ బరిసాల్ జిల్లాలోని గుటియాగ్రామంలో ఏప్రెల్ 25వ తేదీన కీర్తనలు పాడుకుం టున్న పదహారుమంది హిందువుల్ని అరెస్టు చేశారు. వీళ్ళంతా ఆప్రాంతంలోని తమలపాకు తోటల్లో పనిచేసే కూలీలు.

★ జసోర్‌జిల్లాలోని అభయ్‌నగర్ ఉపజిల్లాలో సిద్దిర్‌పాషా అన్న గ్రామంలోని హిందువులు

ఒక బిఘా ఇరవైవేల టాకాల విలువచేసే పొలాలను ఎనిమిదివేల టాకాలకు తెగనమ్మి భారతదేశానికి పారిపోతున్నారు. ఇది బంగ్లాదేశ్ జాతీయమతంగా ఇస్లాంను గుర్తిస్తూ చట్టం వచ్చిన తరువాత పరిణామం. హిందువులు తమ ఆస్తిపాస్తుల్ని అమ్మటం వీలుకాదన్న పుకారు ఊళ్లో ఉండేది. మతహబ్ నంది ఈ పుకారును పట్టించుకోవద్దని సాటి హిందువులతో చెబుతూ ఉండేవాడు. ఒకరోజు రాత్రిపూట ఒక డజనుమంది ఆయుధాలు ధరించిన గూండాలు అతని ఇంటిమీద దాడిచేసి ఏడునెలల గర్భంతో ఉన్న అతనికోడల్నీ, ఎదిగీఎదగని అతని కూతుర్నీ మానభంగం చేశారు.

★ మే 15 వ తేదీ కుష్టియాజిల్లాలో కోస్కా ఉపజిల్లాలో దేబేన్ బిస్వాస్ అన్న వ్యక్తిని కాల్చిచంపారు. ఎవరిమీదా కేసు రిజిస్టరు కాలేదు. ఎవరినీ అరెస్టు చేయలేదు.

★ 1988 ఆగస్టు 12 వ తేదీ బగేర్ హాత్ జిల్లాలోని గరీబ్ పూర్ గ్రామంమీద పోలీసులూ, సాయుధులైన గూండాలూ దాడిచేశారు. దేవాలయంలోని విగ్రహాలను పగలగొట్టారు. గ్రామంలోని యువతుల్ని మానభంగం చేశారు. తమతోపాటు ఆ గ్రామానికి చెందిన పాతికమంది యువకుల్ని తీసుకెళ్ళారు. వాళ్ళను చావగొట్టి బాగా డబ్బువసూలు చేసుకున్న తరువాత మాత్రమే వదిలిపెట్టారు. నారాయణ్ బైరాగినీ, సుశాంతధాలీనీ, అనుకూల్ బరోయానీ, జగదీశ్ బైరాగిని తమ అధీనంలో ఎంతోకాలం ఉంచుకున్నారు.

★ చార్ బాలియారీ గ్రామంలోకూడా సరిగ్గా ఇలాగే జరిగింది. పదిహేను పదహారుమంది యువకుల్ని తీసుకెళ్లి బాగా డబ్బు వసూలు చేసుకొని వదిలిపెట్టారు.

★ ఇలాంటి సంఘటనలే హిజ్లా, బార్బారియా గ్రామాల్లోనూ జరిగాయి. ఎనిమిది, తొమ్మిది మందికి అదేగతి పట్టింది.

★ 1979 మే 16 వ తేదీ సత్కీరాజిల్లాలోని పర్కుమీరా గ్రామంలో మూడవ తరగతి చదువుతున్న చందా అన్న అమ్మాయిని ఆ అమ్మాయి మేస్టారు మానభంగం చేశాడు. ఆమె రవీంద్రనాథ్ ఘోష్ అన్న అతని కూతురు. ఒకరోజు రాత్రి ఆ అమ్మాయి యితర కుటుంబసభ్యులతోపాటు తన ఇంటి వరండాలో నిద్రపోతూ ఉండగా ఆ అమ్మాయి చదివే బళ్ళోని మాస్టారు కొందరు కుర్రరౌడీలతో వచ్చి ఆ అమ్మాయిని ఎత్తుకుపోయాడు. ఆ అమ్మాయిని దగ్గరలో ఉన్న తోటలోకి తీసుకెళ్ళి మానభంగం చేశాడు. మరుసటిరోజు ఆ అమ్మాయి రక్తపుమడుగులో తెలివిలేకుండా పడి ఉంది. ఆమెను దగ్గరలోనే ఉన్న షత్కీరా ఆస్పత్రికి తీసుకెళ్ళారు. నేరస్థులమీద కేసుపెట్టారుకానీ, ఎవర్నీ అరెస్టు చేయలేదు.

★ గోపాల్ గంజ్ జిల్లాలో ముక్ సద్ పూర్ ఉపజిల్లాలోని గోహలా అన్న గ్రామంలో ఉజ్వలరాణి అన్న ఆవిడను ఐదుమంది సామూహిక మానభంగం చేశారు.

వాళ్లు ఆవిడ తండ్రి ఆస్తిపాస్తుల్నికూడా అక్రమించుకున్నారు. ఈ కేసును నమోదు చేసుకోవటానిక్కూడా పోలీసులు నిరాకరించారు.

★ బరిసాల్ జిల్లాలోని జల్కఠీ, నోల్ఛిటీ, స్వరూపాక్ఠి, బవారీపారా, అజైల్ఝోరా, ఉజీర్పూర్, నాజీపూర్, గౌర్నోడీ గ్రామాల్లో సర్వహార పార్టీకి చెందినవారన్న నెపంమీద ఎంతోమంది అల్పసంఖ్యాక ప్రజల్ని అరెస్టు చేశారు. ఎంతోకాలం వాళ్లను చిత్రహింసలపాలుచేసి, బాగా లంచాలు గుంజి వదిలిపెట్టారు. పోలీసుల వేధింపును భరించలేక చాలామంది హిందువులు ఎక్కడెక్కడో వెళ్లి దాక్కున్నారు.

★ అజైల్ఝోరా ఉపజిల్లాలో కాశీనాథ హాల్ధార్ అన్న వ్యక్తిని పోలీసులు చిత్రహింసలు పెట్టారు. అతడు ఆహింసల్ని భరించలేక చనిపోతాడేమో అని అందరూ అనుకున్నారు.

★ ఫిరోజ్పూర్ జిల్లాలోని నవతానా అన్న గ్రామంలో సర్వహార పార్టీతో సంబంధం ఉందన్న నెపంమీద కేశవసాధు ఏకైక కుమారుణ్ణి పోలీసులు చావగొట్టారు. కేశవసాధు కొడుకును ఒకసారి చూసేసరికి గుండెపోటు వచ్చి చనిపోయాడు.

★ నర్షిండీ జిల్లాలోని చరమ్ధువా అన్న గ్రామంలో డెబ్బై, ఎనభైమంది గూండాలు ఇద్దరి నాయకత్వంలో హిందువుల ఇళ్ళమీద దాడిచేశారు. ఈ దాడితరువాత ఇరవై కుటుంబాలకు చెందిన 150 మంది హిందువులు గ్రామాన్ని వదిలిపారిపోయారు.

★ మే 16 వ తేదీ నెట్రకోనా జిల్లాలోని జహంగీర్పూర్ అన్న గ్రామంలో ఒకగుంపు మత దురహంకారులు అల్పసంఖ్యాక హిందువుల నాయకుడైన వినయ్ వైద్య ఇంటిమీద దాడిచేశారు. వినయ్బాబు కుటుంబసభ్యుల్ని ముప్పైఆరు గంటలసేపు నిర్బంధంలో ఉంచారు. వాళ్ల ఇంటిని సునాయాసంగా దోపిడీ చేశారు. పోలీసులకు ఫిర్యాదుచేస్తే వాళ్లు వినయ్బాబు ఇద్దరు కొడుకుల్నీ అరెస్టు చేశారు. తరువాత విడిచిపెట్టారు.

★ డిసెంబరు 10 వ తేదీ చాంద్పూర్ యూనియన్లోని దుర్గాపూర్ గ్రామంలో గులాం హుసేన్ పింటు నేతృత్వంలో దాదాపు వందమంది రాజేంద్రచంద్రదాస్ ఇంటిమీద దాడిచేశారు. వారితో వాదనకుదిగిన కుటుంబసభ్యుల్ని చావగొట్టటమేకాదు, తగలబెట్టారుకూడా. రాజేంద్రచంద్రదాస్ పోలీసులకు ఫిర్యాదుచేస్తే ఆ దుండగులు అతని ఇంటినికూడా తగలబెట్టారు. తరువాత అతడు ఉపజిల్లాకోర్టులో కేసుపెట్టినా ప్రయోజనం లేకపోయింది. అధికారులు ఆకేసునుకూడా పట్టించుకోలేదు.

★ బేగం గంజ్ సబ్డివిజన్లోని మీర్వారిస్పూర్లో ఒకగుంపు దుండగులు దినేశ్చంద్రదాస్ తన మొత్తం ఆస్తిపాస్తుల్ని వదిలిపారిపోయేవరకూ అతణ్ణి వేధించారు.

ఇలా దౌర్జన్యాల, దుర్మార్గాల పట్టిక అనంతంగా అతని మనసులో తిరుగుతూ

ఉంటే సురంజన్ నిద్రపోలేకపోయాడు. అతనికి తాను "ఏకత" పత్రిక విలేఖరిగా పనిచేసిన రెండేళ్లకాలం జ్ఞాపకం వచ్చింది. అప్పుడు తన నోట్‌పాడ్‌నిండా ఇలాంటి బాధామయగాధలే ఉండేవి. అందులో కొన్ని అచ్చయ్యాయి. మరికొన్ని అలాగే మిగిలిపోయాయి. ఆ పత్రికా సంపాదకుడు ఇలా అంటూ ఉండేవాడు, "చూడు సురంజన్, ఇవన్నీకూడా బలవంతులు బలహీనుల్నీ, ఉన్నవాళ్లు లేనివాళ్లనూ పీడించిన సంఘటనలే. నీకు డబ్బుంటే నువ్వు హిందువైనా, ముస్లిమైనా పెద్ద తేడాలేదు. దురదృష్టవశాత్తూ ఇది పెట్టుబడిదారీ సమాజంయొక్క సిద్ధాంతం. నువ్వెళ్ళిచూడు. పేదముస్లింకూడా ఇలాంటి బాధలే పడుతున్నాడు. ఉన్నవాళ్ళు లేనివాళ్లను ఎప్పుడూ పీడిస్తారు - వాళ్లు హిందువులైనాసరే, ముస్లిములైనాసరే".

★ ★ ★

# మూడవరోజు

హేమంత రుతువులో చలి ఉండవలసినంత తీవ్రంగా లేదు. సురంజన్ తను కప్పుకున్న రజాయిని పక్కకు తోసేశాడు. కానీ పడకమీదనుంచి లేవాలని మాత్రం అతనికి అనిపించలేదు. రాత్రంతా నిద్రలేకపోవటంచేత అలాగే పడకమీద దొర్లుతూ పడుకొన్నాడు. ముందురోజు రాత్రి జరిగిన సంఘటనలు అతని మనసులో తిరగసాగాయి. ముందురోజు రాత్రి ఎవరింటికీ వెళ్లాలనిపించలేదు. ఎవరితోనూ మాట్లాడాలనిపించలేదు. కానీ ఊరంతా చెడతిరిగాడు. తల్లిదండ్రుల మాటకాదని ఇంట్లోంచి బయటికి వెళ్లాడుకానీ వాళ్లనుగురించి చాలా ఆందోళనపడ్డాడు. ఎంత ఆందోళనపడ్డా ఇంటికిమాత్రం తిరిగిరాలేదు. అందుకుకారణం లేకపోలేదు. కిరణ్మయి ఎందుకంత భయపడుతోందో తనకు అర్థమైంది. కానీ నాన్నగారి నిరాసక్తత తనకు ఎంతమాత్రమూ సహాయకారిగాలేదు. కుటుంబాన్ని ఎలాగైనా కాపాడమని మాయతన్ను వేడుకుంటున్నప్పుడు ఆమెకళ్లలో కనిపించిన భయం తనకు జ్ఞాపకం రాకుండా ఉండటంకోసం సురంజన్‌కు తాగాలనిపించింది. అతడు చెల్లెల్ని గురించి ఎంతో ప్రేమగా జ్ఞాపకం చేసుకున్నాడు. తనవేలు పట్టుకొని తన చిన్నారిచెల్లెలు నదీతీరంలో పచార్లు చేయటం నిన్నమొన్న జరిగినట్టే అనిపిస్తోంది. ప్రతి ఏడాదీ నవరాత్రులముందు కొత్తబట్టలు కావాలని అల్లరి చేసేది. "పూజల్ని గురించి మరిచిపో. ఆ రోజుల్లో అందరూ మట్టి బొమ్మలముందు బూతునృత్యాలు చేస్తారు. అలాంటి పండగకు నీకు కొత్తబట్టలు కావాలా? నువ్వు ఎదగాలని నాకోరిక", అనేవాడు తాను.

చిన్నపిల్లగా ఉన్నప్పుడుకూడా నల్లగా ఉన్నా ఎంతో అందంగా ఉన్న మాయ ఎంతో ముచ్చటగా బతిమాలేది, "దాదా, దాదా, పూజలు చూట్టానికి నన్ను తీసుకెళ్లవూ?"

సురంజన్ చీవాట్లు పెట్టేవాడు. "నువ్వు మనిషిలా ఉండటం నేర్చుకోలేవూ? నువ్వు హిందువులా ప్రవర్తించటం మానుకోవాలి", అనేవాడు.

"ఏం హిందువులు మనుషులుకారా?" అనేది మాయ, కిలకిలా నవ్వుతూ.

1971లో మాయ తనపేర్లును "షరీదా" అని మార్చుకోవాల్సి వచ్చింది. ఆ అవసరం తీరిపోయాకకూడా సురంజన ఆవిడను ఆ మారుపేరుతో పొరపాటుగా పిలిచేవాడు. మాయకు కోపం వచ్చేది. రాజీ చేసుకోవటంకోసం ఆవిడకు చాక్లెట్లు కొనిపెట్టేవాడు. కోపాన్ని మరిచిపోయి మాయ ఆనందంగా గంతులేసేది. చాక్లెట్‌ను నోట్లో వేసుకుంటుంటే సుకుమారమైన ఆవిడకళ్లు సంతోషంతో పొంగిపోయేవి. ఇవన్నీ ఆవిడచుట్టూరా అల్లుకున్న తియ్యని జ్ఞాపకాలు. ప్రతిఏడాదీ "ఈద్" సందర్భంలో ఆవిడ స్నేహితులు రంగురంగుల బెలూన్లతో ఆడుకుంటుంటే అలాంటివి తనకూ కావాలని అల్లరిచేసేది. టపాకాయల్ని తెచ్చి ఇమ్మనేది. లేదా కిరణ్మయి కొంగుపట్టుకొని తిరుగుతూ ముస్లింలు తినే తిళ్ళు కావాలని మారాం చేసేది. "నదీరా

వాళ్ళింట్లో పలావ్ చేస్తున్నారు. నాకూ పలావ్ చేసిపెట్టు" అని అడిగేది. కిరణ్మయి చేసిపెట్టేది.

ఇప్పుడు మాయ ఇల్లువదిలి వెళ్లిపోయింది. నిన్నకాక మొన్న వెళ్లింది. ఇంతవరకూ ఆమెను గురించిన సమాచారం లేదు. అతని తల్లిదండ్రులు మరీ అంతగా ఆందోళన పడుతున్నట్లు అనిపించడంలేదు. ముస్లిముల ఇంట్లో తలదాచుకుంటూ ఉంటుందని అనుకోవటం అందుకు కారణం కావచ్చు. మాయ కుటుంబంలో చాలా బాధ్యతకలిగిన అమ్మాయి. వయసులో చిన్నదే అయినా అప్పుడే రెండు ట్యూషన్లు చెప్పి కాస్తడబ్బుకూడా సంపాదిస్తోంది. ఆవిడ ఈడెన్‌కాలేజి విద్యార్థిని. తన చదువుక్కూడా ఏనాడూ కుటుంబంనుంచి ఆర్థిక సహాయాన్ని ఆశించలేదు.

కానీ సురంజన్‌కే డబ్బు అవసరం ఎప్పుడూ ఉండేది. అతడికి ఉద్యోగంలేదు. ఫిజిక్స్‌లో తనకున్న ఎమ్.ఎస్.సి. డిగ్రీని అతడు ఏనాడూ ప్రయోజనకరంగా ఉపయోగించుకోలేదు. డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం సంపాదించుకోవాలని చాలా పట్టుదలగా ఉండేవాడు. కొన్ని ఇంటర్వ్యూలక్కూడా వెళ్లాడు. యూనివర్సిటీలోకూడా అతడు చాలా చురుకైన విద్యార్థుల్లో ఒకడు. కానీ చదువులో అతడి వద్ద సాయంపొందిన విద్యార్థులకు అతనికంటే ఎక్కువమార్కులొచ్చాయి. ఉద్యోగంకోసం ప్రయత్నించి నప్పుడుకూడా అదేకథ పునరావృతమైంది. అతనికంటే తక్కువ మార్కులొచ్చిన వాళ్లకు టీచర్లుగా మంచి ఉద్యోగాలొచ్చాయి. అతడు ఇంటర్వ్యూలో బాగా చేయలేదనికాదు. తాము బాగా చేయలేదని పెదవి విరిచినవాళ్లే మొదట ఉద్యోగాల ఆర్డర్లు అందుకున్నారు. సురంజన్‌కు మాత్రం ఏ ఉద్యోగమూ రాలేదు. అతనికి మంచి "మానర్స్" లేవనీ, అందుచేత అతడు పరీక్షకులకు వచ్చలేదనీ కొన్నిచోట్ల అన్నారు. అది ఎంతమాత్రమూ నిజంకాదు. కానీ సురంజన్ "అస్సలామలేకుం" అనికానీ "నమస్కారం" అనికానీ విచక్షణలేకుండా అనలేదని తానే అంగీకరిస్తాడు. అతని అభిప్రాయం ప్రకారం మర్యాద చూపించటానికి అదొకటే మార్గంకాదు. "అస్సలామలేకుం" అని మర్యాదను ప్రదర్శిస్తూ ఉన్నవాళ్లే తమ పరీక్షకులు కనుమరుగుకాగానే వాళ్లను గురించి చాలా అమర్యాదగా మాట్లాడేవాళ్లు. వీళ్లదే మంచి ప్రవర్తన అని అందరూ అనేవాళ్లు. వీళ్లకే ఉద్యోగాలుకూడా వచ్చేవి. మర్యాదను ఏనాడూ నటించని సురంజన్ విధేయతలేనివాడన్న పేరుతెచ్చుకున్నాడు. ఈ కారణాలచేతా లేదా అతడు హిందువుకావటంచేతా అతనికి ప్రభుత్వోద్యోగం దొరకలేదు. ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం దొరికిందికానీ అది నచ్చకపోవటంచేత మూడునెలల తరువాత దాన్ని వదిలేశాడు సురంజన్.

బ్రతకటానికి ఎలాంటి సర్దుబాట్లు చేసుకోవాలో మాయకు బాగా తెలుసు. ట్యూషన్లు చెప్పటాన్ని మాయ బాగా అభివృద్ధి చేసింది. ఆవిడకు ప్రభుత్వోద్యోగంకూడా దొరికే అవకాశం లేకపోలేదు. జహంగీర్‌తో స్నేహంగా ఉండటంచేత మాయ పరిస్థితి మెరుగ్గా ఉందని సురంజన్ అనుమానం. తన కృతజ్ఞతను నిరూపించుకోవటానికి మాయ అతణ్ణే పెళ్లి చేసుకుంటుందా? ఈ విషయాన్ని గురించి అతనికి చాలా ఆందోళనగా ఉంది... కిరణ్మయి వచ్చి టీకప్పు అందించింది. ఆవిడకళ్లు వాచి

ఉన్నాయి. ఆవిడ రాత్రంతా నిద్రపోలేదని సురంజన్‌కు అర్థమైంది. తానుకూడా రాత్రంతా నిద్రపోలేదని చెప్పి ఆవిడ బాధను ఎక్కువచేయటం అతనికి ఇష్టంలేదు. "రాత్రి అంతపొద్దుపోయిందనుకోలేదు", అన్నాడు ఆవులిస్తూ. ఆ మాటల్ని కిరణ్మయి విన్నట్టు అనిపించలేదు. ఆమాటకొస్తే తనచుట్టూరా ఏం జరుగుతూ ఉందో ఆమెకు అర్థం కావటంలేదు. చేతిలో టీకప్పుతో అలా నిలబడి ఉంది. ఆవిడ తనతో ఏదో చెప్పాలనుకుంటూ ఉందని సురంజన్ అనుకున్నాడు. కానీ ఆవిడ ఒక్కమాటకూడా మాట్లాడలేదు. తనకొడుకులేచి కప్పు అందుకొంటాడని అనుకుంటూ ఆవిడ నిలబడే ఉంది. అంతసేపు కిరణ్మయి అలా మాటాపలుకూ లేకుండా నిలబడిందంటే వాళ్లమధ్య అగాధం ఎంతగా పెరిగిపోయిందో! చివరికి సురంజన్‌నే, "మాయ ఇంకా ఇంటికి రాలేదా?" అని అడిగాడు. "లేదు", అంది కిరణ్మయి, ఆప్రశ్నకోసం ఎదురుచూస్తున్నట్టుగా, ఏప్రశ్నకైనా జవాబు చెప్పటానికి సిద్ధంగా ఉన్నట్టుగా. ఆమాట అంటూ కిరణ్మయి సురంజన్ పరుపుమీద కూర్చుంది. తల్లి ఎంతో అభద్రతాభావంతో బాధపడుతూ ఉండటంచేత తనకు అంత దగ్గరగా కూర్చుంటూ ఉందని సురంజన్‌కు అర్థమైంది. అతడు నిద్రలేచి ఆమెకళ్ళనూ, దువ్వుకోని తలనూ, నలిగిపోయిన చీరనూ చూడలేకపోయాడు. లేచికూచొని టీతాగాడు. "మాయ ఎందుకు ఇంటికి రావటంలేదు. ముస్లిములు ఆవిడను కాపాడుతున్నారా? ఆవిడకు మనమీద నమ్మకంలేదా? మనం ఎలా ఉన్నామోకూడా కనుక్కోలేదు. తాను తన సంగతిమాత్రం చూసుకుంటే చాలా?" అన్నాడు.

కిరణ్మయి జవాబు చెప్పలేదు. సురంజన్ సిగరెట్ వెలిగించాడు. ఇంతవరకూ అతడు ఎప్పుడుకానీ అమ్మానాన్నల ముందు సిగరెట్ కాల్చలేదు. సిగరెట్ వెలిగించి, గట్టిగా దమ్ములాగి, విసురుగా పొగవదిలాడు. తాను తన తల్లిముందే సిగరెట్ కాల్చానని అతనికి స్ఫురించలేదు. కానీ ఎలాగో వారిమధ్య ఉన్న పలుచని గోడ కూలిపోయింది. వాళ్లను వేరుచేస్తున్న అగాధం పూడిపోయింది. తల్లి దగ్గరికి ప్రేమగా చేరి అతనికి ఎంతోకాలమైంది. అతనికి తల్లి ఒడిలో పడుకొని చిన్నపిల్లాడిలా గాలిపటాలనుగురించి మాట్లాడాలనిపించింది. నవీన్ మామయ్య సిల్హెట్ నుంచి ఎంతో అందమైన గాలిపటాలు తెచ్చేవాడు. అతనికి చక్కని గాలిపటాలు తయారుచేయటమూ వచ్చు. వాటిని ఎగరేయటమూ వచ్చు. ఎగురుతున్న అన్ని గాలిపటాల దారాలనూ తన దారంతో తెంచేసేవాడు. తన గాలిపటం ఒక్కటిమాత్రమే ఆకాశంలో రాజ్యంచేసేది.

సురంజన్ అమ్మ ఒడివైపు ఆశగా చూశాడు. సిగరెట్టు చివరిదమ్ములాగి ఉంగరంలా వదిలి అడిగాడు, "కమాల్‌కానీ, బెలాల్‌కానీ నిన్న మనింటికి వచ్చారా?"

"లేదు", అంది కిరణ్మయి నిరుత్సాహంగా.

కమాల్‌తాము ఎలా ఉన్నారో తెలుసుకోలేదా? అది నిజంగా ఆశ్చర్యమే. తన స్నేహితులు తాను చనిపోయాడనుకున్నారా? లేదా తన ప్రాణాన్ని కాపాడాలన్న కోరిక వాళ్లలో చచ్చిపోయిందా? "నువ్వు రాత్రి ఎక్కడున్నావు? మేమిద్దరమే ఇంట్లో మిగిలిపోయాం. మాకు ఏదన్నా ప్రమాదం జరుగుతుందన్న భయంకూడా లేదా నీకు? నీకేదైనా ప్రమాదం జరిగి ఉంటే ఎలా? గుడ్లు కొనుక్కురావటానికి గౌతమ్

బయటికెళ్లాడు. ముస్లింలు అతణ్ణి చావగొట్టారు. ముందుపళ్లు రెండు ఊడిపోయాయి. ఒకకాలుకూడా విరిగిపోయిందనుకుంటాను", అంది కిరణ్మయి బాధ పొంగుతున్న కంఠంతో.

"ఓ, అలాగా?"

"నీకు జ్ఞాపకం ఉందా? రెండేళ్లక్రితం గీతావాళ్ల అమ్మ షోనీ వ్యాయామశాల ప్రాంతంనుంచీ మన ఇంటికి పనిచేయటానికొచ్చేది. ఆవిడ ఇంటిని వాళ్లు అప్పటికే తగలబెట్టి చాలాకాలమైంది. ఆమె వాళ్ళింట్లో వీళ్ళింట్లో చాకిరీచేసి మళ్ళీ తన ఇల్లు కట్టుకుంది. ఈరోజు ఆమె తనపిల్లల్తోపాటు ఇక్కడికొచ్చింది. మళ్ళీ ఆమె ఇంటినివాళ్లు తగలబెట్టేశారట. ఆమె ఆత్మహత్య చేసుకోవటానికి విషం ఎక్కడ దొరుకుతుందని అడగటానికొచ్చింది. ఆమెకు పిచ్చిపట్టిందేమోననిపిస్తోంది".

"అలాగా", అన్నాడు సురంజన్ టీకప్పు క్రిందపెడుతూ.

"మాయ మనింటికి తిరిగొచ్చాక అదిమరీ పెద్ద సమస్య అవుతుంది".

"అంటే మాయ జీవితాంతం ముస్లిం కుటుంబంతోనే ఉండాలా?"

సురంజన్ కంఠం కఠినంగా పలికింది. ఒకసారి తాను అందర్నీ తీసుకెళ్ళి ఒక ముస్లింల ఇంట్లో తలదాచుకున్నమాట వాస్తవమే. కానీ ఆనాడు వాతావరణం ఇంత నిరాశాజనకంగా లేదు. ఏదో కొద్దిమంది చెడ్డవాళ్ళు చెడ్డపనులు చేయటానికి ప్రయత్నిస్తున్నారని అనుకున్నారు. కాలక్రమాన దాని ప్రభావం తగ్గిపోతుందని ఆశించాడు. ప్రతిదేశంలోనూ ఇలాంటి వారున్నారు.... కానీ ఈసారి అలాకాదు. అంతా తారుమారుగా ఉంది. తమను హింసించటానికో పథకం, కుట్ర తయారుగా ఉన్నట్లు అనిపిస్తోంది. సురంజన్‌లో ఎంతగా అనుమానం గూడుకట్టుకు పోయిందంటే తన స్నేహితులైన కమాల్, బెలాల్, కైజర్, లుత్‌షార్‌లు కూడా మతతత్వానికి అతీతులుగారేమోనన్న సంశయంలో పడిపోయాడు. 1978లో జియా-ఉర్-రహమాన్ పరిపాలనాకాలంలో బంగ్లాదేశ్ రాజ్యాంగంలో "బిస్మిల్లా" అన్నపదాన్ని చేర్చాలని ప్రజలు ఉద్యమం నడపలేదా? మళ్ళీ 1988లో ఇస్లాంను జాతీయమతంగా గుర్తించాలని ప్రజలు గొంతు చించుకోలేదా? లేకుంటే అలాంటి ప్రకటనను అతడు చేసేవాడా?

స్వాతంత్ర్యోద్యమకాలంలో, అందరూ కలిసి విజయంకోసం పోరాడవలసిన సమయంలో లౌకికతత్వం బెంగాలీ ముస్లిముల దృఢవిశ్వాసంగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చాక వీళ్ళంతా ఏమైపోయారు. మతతత్వం జాతీయజీవనంలో వేళ్ళు పాదుకుంటూ ఉండటాన్ని వీళ్లు గమనించలేకపోయారా? వాళ్లలో ఆందోళన కలగలేదా? దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చింది అలాంటి ఆందోళనకాదా? నెత్తురుమండే ఆప్రజలంతా ఎందుచేత ఈనాడు చల్లగా - ఫూడు పాముల్లా - అయిపోయారు? ఈమతతత్వం అన్న మొక్కను వేళ్లతోపాటు తక్షణం పెరికి పారేయాలని వీళ్లు ఎందుచేత గుర్తించలేదు. లౌకికతత్వంలేకుండా ప్రజాస్వామ్యం ఈదేశంలో బతికిబట్టకడుతుందన్న నమ్మకం వీళ్లకు ఎలా కలిగింది? అది అసాధ్యంకాదా? స్వాతంత్ర్యపోరాటంలో


గ్రంథాలయ
A.C.No. 97120

చేయిచేయికలిపి పోరాడినవాళ్లే ఈనాడు మతతత్వానికి ఊపిరిపోస్తూ ఉండటం చాలా హాస్యాస్పదంగా ఉంది.

"నిన్న వాళ్లు షోరీఘాట్ దేవాలయాన్ని నేలమట్టం చేశారట తెలుసా? శ్యాంపూర్ దేవాలయానిక్కూడా ఇలాటిగతే పట్టిందట".

ఎలాంటి ఆశాలేని గొంతుతో కిరణ్మయి మాట్లాడుతుంటే సురంజన్ ఒళ్ళు విరుచుకున్నాడు.

"నువ్వు పూజకోసం వెళ్లే ఏ దేవాలయమైనా ధ్వంసమైపోయిందా? అందుకునీకు బాధగా ఉందా? వాళ్ళకు ఎన్ని దేవాలయాల్ని పడగొట్టాలనుంటే అన్నిట్నీ పడగొట్టుకోనీ. ఏం పడగొడితే? ఈ మతభవనాలనన్నీ నేలమట్టమైపోనీ", అన్నాడు.

"ఒక మసీదును కూలదోస్తే వాళ్లకంత కోపం వచ్చిందికదా, దేవాలయాల్ని కూలదోస్తే హిందువులకు కోపం వస్తుందని వాళ్లకు అర్థంకాదా? ఒక మసీదును కూలదోస్తే వీళ్లు వందలాది దేవాలయాల్ని కూలదోయాలా? ఇస్లాం మతం శాంతిని బోధించదా?"

"ఈదేశంలోని హిందువులకు కోపం వచ్చినా వాళ్లు సాధించేది ఏమీలేదని ఈదేశంలోని ముస్లిములకు తెలుసు. అందుకే వాళ్లు అడ్డూ అపూ లేకుండా దోపిడీలు చేస్తున్నారు. దాన్నిగురించి వాళ్లు ఒక్కక్షణంకూడా ఆలోచించటంలేదు. హిందువెవడైనా ఒక మసీదును తాకగలిగాడా? నయాబజార్‌లోని దేవాలయం రెండేళ్ళుగా కుప్పకూలిపడిఉంది. దాని శిధిలాలమీద పిల్లలు ఆడుకుంటున్నారు. వాటిమీద ఉచ్చపోస్తున్నారు. హిందువెవడైనా మెరిసిపోతున్న మసీదు గోడమీద ఒక గుద్దు గుద్దగలిగాడా?"

కిరణ్మయి నిశ్శబ్దంగాలేచి వెళ్ళిపోయింది. ఆమె తనచుట్టూ ఇంతకాలంగా గోడలు కట్టుకుంటూ ఉందనీ, అవి ఈనాడు ఆమెను ఏకాకిని చేస్తున్నాయనీ సురంజన్‌కు అర్థమైంది. ఒకనాడు ఆవిడకు పర్వీన్‌కూ, అర్చనకూ తేడా ఉండేదికాదు. ఈనాడు ఆవిడ భావాలు చిత్రంగా ఉన్నాయి. కొత్తప్రశ్నలు ఆవిడలో పుట్టుకొచ్చాయి. "ముస్లిములకు మాత్రమే బాధపడే హక్కూ, కోపం చేసుకునే హక్కూ ఉన్నాయా?"

1992 లో బాబ్రీ మసీదు విధ్వంసానికి ముందుగానే, ఆమాటకొస్తే 1990 అల్లర్లు జరగటానికంటేకూడా ముందుగానే బంగ్లాదేశ్‌లో హిందువుల్ని బాధించటం ప్రారంభమైందన్నది రహస్యమేమీకాదు. 1979 వ సంవత్సరం ఏప్రిల్ రెండవతేదీన రాజ్‌షాహీ జిల్లాలోని సాహెబ్‌బజార్‌లోని చారిత్రాత్మక కాళికాలయంలోని కాళికాదేవి విగ్రహాన్ని అయూబ్ అలీ అన్న వ్యక్తి ముక్కలుముక్కలుగా పగలగొట్టాడు. దేవాలయాన్ని ధ్వంసం చేసిన తరువాత హిందువుల దుకాణాల్ని నాశనం చేశారు. హిందువులమీద జరిగిన ఇతర విధ్వంసకాండకూడా సురంజన్‌న్‌కు జ్ఞాపకం రాసాగింది.

★ జినైదాహ్ జిల్లాలోని షైలాకూపా ఉపజిల్లోలోని ప్రసిద్ధ రామగోపాలస్వామి దేవాలయంలో విగ్రహాన్ని ఎవరో ఎత్తుకుపోయారు. కొంతకాలం తరువాత పగిలిపోయిన విగ్రహం షైలాకూపా స్మశానంవద్ద దొరికింది. విగ్రహానికున్న బంగారం, వెండి నగలుమాత్రం దొరకలేదు.

★ సీతాకుండలో పూర్ణాలాలంగర్ గ్రామంలోని జైగోపాల్ ఘాట్ కాళీదేవాలయాన్ని నేలమట్టం చేశారు.

★ ఉత్తరచాంద్‌గావ్‌లో దుర్గాబారీ విగ్రహాన్ని పగలగొట్టారు.

★ జాతీయమత శాసనం వచ్చిన రెండునెలలకు ఖుల్నా జిల్లాలోని దక్షిణ్‌దీహీ గ్రామంలో విలువైన శిలావిగ్రహాన్నీ, బంగారం నగలనూ ఎవరో ఎత్తుకుపోయారు. దొంగతనాన్ని గురించి ఫిర్యాదు చేయటానికి దేవాలయసంఘం కార్యదర్శి పోలీస్ స్టేషనుకు వెళ్తే అతణ్ణి నిర్బంధంలోకి తీసుకున్నారు. జైల్లో కుక్కి చిత్రహింసలు పెట్టారు. దేవాలయ సంఘం సభ్యులందరిపేరా వారంటు జారీచేశారు. ఉపజిల్లాపోలీసు అధికారి విచారణ చేయటానికి ఆ గ్రామానికి వెళ్లి విగ్రహాన్ని దొంగిలించారని హిందువుల్నే తిట్టాడు.

★ తంగైల్ జిల్లాలోని ద్విముఖ గ్రామంలో డిసెంబరు 8 వ తేదీ రాత్రి ఒకప్రాచీన దేవాలయంమీద దాడి జరిగింది. చలవరాతి శివలింగాన్నీ, అన్నపూర్ణ, రాధాకృష్ణుల విగ్రహాలనూ, సాలగ్రామాలనూ దొంగిలించుకుపోయారు. పోలీసులు వచ్చారు. నూర్ మహమ్మద్ తాలుక్‌దార్ అన్న వ్యక్తి ఈ దొంగతనానికి కారకుడని అందరూ చెప్పారు. కానీ విగ్రహాలను తిరిగి సంపాదించటానికి పోలీసులు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు.

★ కోమిల్లాజిల్లాలో బురీచాంగ్ ఉపజిల్లాలోని హిందువులందరికీ "విశ్వ ఇస్లాం" అన్న సంస్థ తక్షణం దేశాన్ని వదిలి పారిపోవలసిందిగా బహిరంగలేఖలు పంపింది. పూజా పునస్కారాలు చేయటం కొనసాగిస్తే ప్రమాదకరమైన ఫలితాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఏప్రిల్ 14 వ తేదీన కాళీమందిరం బయట ఉన్న వటవృక్షంమీద పెట్రోలు పోసి తగలబెట్టారు. మెయినామోతీ మార్కెట్‌ప్రాంతంలో అలీఅహమద్ అన్న వ్యక్తి అల్లర్లురేపి హిందువుల్ని అంతం చేయాలని బహిరంగంగా చెబుతూ ఉండేవాడు.

★ భోలాజిల్లాలోని లాల్‌మోహన్ ఉపజిల్లాలో మార్చి 11 వ తేదీ శ్రీ శ్రీమదన్‌మోహన్ వ్యాయామశాలవద్ద భజన జరుగుతూ ఉండగా వందలాదిమంది వారిమీద దాడిచేశారు. దేవాలయంలోకి దూరి, విగ్రహాన్ని ముక్కలుముక్కలుచేసి, భజనచేసుకుంటున్న భక్తుల్ని చావబాదారు. ఆ తరువాత దత్తపారాలోని దేవాలయాలన్నిటిమీదా దాడిచేశారు. దేవీ విగ్రహాలను పగలగొట్టారు, యధేచ్ఛగా దోపిడీలు చేశారు, తగలబెట్టారు.

★ మానిక్‌గంజ్ జిల్లాలోని బోర్డియాగ్రామంలో కాళీ దేవాలయానికి అనుకునే జిల్లూర్ అహమద్ అన్న న్యాయవాది సమాధినీ, ఒక మసీదునూ కట్టాలని నిర్ణయించారు. అదే జరిగితే హిందువుల ప్రార్థనలకు తప్పకుండా అంతరాయం కలుగుతుంది.

★ నవ్‌ఖాలీ జిల్లాలోని ఛట్‌ఖాలీ డివిజన్‌లోని మహమ్మద్‌పూర్‌లోని కాళికాలయాన్ని ముస్లిములు వ్యాపారకేంద్రంగా మార్చటానికి ప్రయత్నించారు.

★ ఘజీపూర్‌లోని ఫూకల్ గ్రామంలో మే 26 వ తేదీ రాత్రి లక్ష్మీమందిరంమీద దాడిజరిగింది. విగ్రహం ధ్వంసం చేయబడింది.

★ జినైదాహోజిల్లా కష్టసాగరలో సంవత్సరాంత ఉత్సవాలు జరుగుతున్న మఠంమీద ముట్టడి జరిగింది. పూజారిని చావగొట్టారు. ప్రసాదాన్ని చెల్లాచెదురుచేశారు. వాద్యగాళ్ల వద్దనుంచీ మద్దెలల్ని లాక్కున్నారు. తక్షణం పోలీసులకు ఫిర్యాదుచేసినా ప్రయోజనం లేకపోయింది.

★ గోపాల్‌గంజ్ ప్రధాన ఉపజిల్లాలోని నిజరా అన్నచోట 1979 మార్చి 14 వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు ముస్లిములు హిందూదేవాలయాలమీద దాడిచేసి బాగా ధ్వంసం చేశారు. శివాలయం తలుపుల్ని పగలగొట్టి విలువైన నగలతోపాటు శివలింగాన్నికూడా ఎత్తుకుపోయారు.

★ 1988 అక్టోబర్ 17 వ తేదీన కుష్టియాలో పోలీస్‌స్టేషన్‌ఉన్న ప్రాంతంలోనే దుర్గవిగ్రహాన్ని పగలగొట్టారు.

★ ఖుల్నాలో ప్రార్థనలు ప్రారంభం కావటానికి ముందుగా దాడిచేసి దేవాలయంలోని విగ్రహాలను ముక్కలు చేశారు.

★ జసోర్ జిల్లాలోని గోబ్రాలో దుర్గవిగ్రహాన్ని పగలగొట్టారు.

★ 1988 అక్టోబర్ మొదటి తేదీన ఖుల్నాలో సుప్రసిద్ధమైన ప్రణవానందమఠంలో దుర్గవిగ్రహాలను ధ్వంసం చేశారు.

★ సెప్టెంబర్ 30వ తేదీన సత్‌క్షీరా – కాళీగంజ్ బస్‌స్టాండులోని దేవాలయంలో దుర్గవిగ్రహాన్ని ముక్కలు చేశారు.

★ ఖుల్నాజిల్లాలోని దుమూరియాలో మధుగ్రాంకు చెందిన జామామసీదు ఇమాం దుర్గాపూజా ఉత్సవాల నిర్వాహకులకు ఒక తాఖీదు పంపాడు. తాము అజాన్, నమాజ్ ప్రతిరోజూ చేసుకోవాలికాబట్టి దుర్గాపూజ అనుమతించమని అందులో పేర్కొన్నాడు. ఈ తాఖీదు ఉత్సవ నిర్వాహకులకు అక్టోబర్ 17 వ తేదీన అందింది.

★ ఖుల్నా జిల్లాలో అక్టోబర్ మొదటి వారంలో ఒక ఊరేగింపు జరిగింది. విగ్రహారాధనకు వ్యతిరేకంగా అందులో నినాదాలిచ్చారు. "విగ్రహారాధనను అనుమతించం", "విగ్రహాలను పగలగొట్టండి", "ధ్వంసం చేయండి" – నినాదాలు ఇలా ఉన్నాయి.

★ ఖుష్టియా జిల్లాలో మోహిష్ కోలాగ్రామంలో అక్టోబర్ 23 వ తేదీ కాళికాలయంలోని కాళికాదేవి విగ్రహాన్ని ముక్కలు చేశారు.

★ ఘజీపూర్ జిల్లాలోని కాళీగంజ్ మార్కెట్‌లో పూజకోసం సిద్ధం చేస్తున్న కాళీవిగ్రహాన్ని పగలగొట్టారు.

★ అక్టోబర్ 30 వ తేదీ నకీపూర్ జిల్లాలోని సత్‌కీరాలోని హరితల దేవాలయంలోని కాళీవిగ్రహాన్ని – పూజ మొదలు పెడుతుండగా – పగలగొట్టారు.

★ ఫిరోజ్‌పూర్ జిల్లాలోని భండారియా ఉపజిల్లాలో ఒక మురికినీటి కాలువ కట్టాలన్న నెపంతో కాళికాలయం గోడను కూలదోశారు.

★ బోర్గునా జిల్లాలోని ఫుల్‌జురీ మార్కెట్‌లో విజయదశమిరోజు ముస్లిం ఛాందసవాదులు దుర్గాదేవి విగ్రహాన్ని పగలగొట్టారు.

★ బమానా ఉపజిల్లాలోని బక్కబూనియాలో దసరా ఉత్సవాలు ప్రారంభం కావటానికి ముందుగా దుర్గాదేవి విగ్రహాన్ని ముక్కలు చేశారు.

కానీ వీళ్లు బంగ్లాదేశ్ మతసామరస్యాన్ని నమ్మేదేశమని చెబుతారు! సురంజన్ బిగ్గరగానే నవ్వాడు. అతడు గదిలో ఒంటరిగా ఉన్నాడు. వాకిట్లో కూర్చొనిఉన్న పిల్లి సురంజన్ నవ్వువిని భయంతో గెంతింది. అప్పుడు సురంజన్ దృష్టి పిల్లిమీద పడింది. ఈరోజు ఈ పిల్లి దక్షిణేశ్వరి దేవాలయానికి వెళ్ళిరాలేదా? ఈ పిల్లిది ఏమతం? ఇది హిందూపిల్లేనా? ఇది హిందువుల ఇంట్లో ఉంటున్న పిల్లికాబట్టి హిందూపిల్లే కావాలి. అది నలుపూ తెలుపూ పిల్లి. దానికళ్లు ఆర్ద్రంగా ఉన్నాయి. అది తన్ను సానుభూతితో చూస్తోందని సురంజన్‌కు అనిపించింది. తనమీద దానికి సానుభూతే ఉంటే అది ముస్లింపిల్లి కావాలి. లేదంటే ఉదారవాద ముస్లింపిల్లి. వాళ్లు సాధారణంగా హిందువుల్ని అలాగే చూస్తారు. పిల్లిలేచి వెళ్లిపోయింది. బహుశా అది పక్కింటి ముస్లిముల ఇంటికి వెళ్తోంది కాబోలు. ఈ ఇంట్లో వంట అంతగా లేదుగా. అంటే పిల్లికి మతం లేదన్నమాట! అమాటకొస్తే మనుషులకు మాత్రమే మతభేదాలూ, తెగభేదాలూ ఉన్నాయి. వాళ్లకే దేవాలయాలూ, మసీదులూకూడా ఉన్నాయి. సూర్యకాంతి గదిలో బాగా పరుచుకుంది. అప్పుడు బాగా పొద్దెక్కిందని సురంజన్‌కు అర్థమైంది. ఆరోజు డిసెంబరు తొమ్మిది. సురంజన్‌కు తాను పిల్లిగా ఉండాలన్న కోరిక కలిగింది.

సురంజన్‌కు తన జీవితంలో ఎప్పుడూ పూజచేసిన జ్ఞాపకంలేదు. గుళ్లకు అంతకంటే వెళ్లలేదు. అతడు తన దేశానికి సామ్యవాదాన్ని తెస్తానని ప్రతిజ్ఞచేశాడు. తన కలను వాస్తవం చేసుకోవటంకోసం అతడు వీధిలోకెళ్లి ఉపన్యాసాలిచ్చాడు, విన్నాడు. రైతుకూలీల క్షేమంకోసం కంకణం కట్టుకున్నాడు. తమదేశంలో సామాజిక – ఆర్థిక ప్రగతి జరగాలని ప్రచారం చేశాడు. తాను ఇతరులకోసం ఎంతో సమయాన్ని వెచ్చించటంచేత తన్నుగురించీ, తన కుటుంబాన్ని గురించీ ఆలోచించే సమయమే లేకుండా పోయింది. ఇప్పుడు అదే సురంజన్‌వైపు అందరూ వేలు చూపించి "నువ్వు హిందువువి" అంటున్నారు. "అతణ్ణి పట్టుకోండి .... పట్టుకోండి" అని స్థానికయువకులు తరుముతున్నారు. ఈనాటివరకూ అతణ్ణి ఎవరూ తన్నలేదుకానీ ఆపని రేపు జరగవచ్చు. కోడిగుడ్లు కొనుక్కోవటానికెళ్ళిన గౌతంను తన్నినట్లుగా తాను దుకాణానికి సిగరెట్లు కొనుక్కోవటానికెళ్లినప్పుడు ఎవరో తన వీపుమీద బాదవచ్చు. దెబ్బపడగానే తన నోట్లోని సిగరెట్ కిందపడిపోవచ్చు. తనమీద దెబ్బవేసిన వాడెవడో చూద్దామని వెనక్కు తిరిగితే తనకు ఖుద్దుసో, రహిమానో, విలాయతో, శోభనో కర్రో, చాకో పట్టుకొని తనవేపు క్రూరంగా చూస్తూ ఉండవచ్చు. సురంజన్ తనకు వచ్చిన ఆలోచనకు తానే వణికిపోయాడు. అంటే సురంజన్ భయపడుతున్నాడా? నిజమేకావచ్చు – అతడు పిరికిపంద కాకపోయినా!

పడకమీదనుంచిలేచి, సురంజన్ పిల్లిని వెదుక్కుంటూ బయలుదేరాడు. ఇంట్లోని

నిశ్శబ్దం భయంకరంగా ఉంది. ఈ ఇంట్లో చాలాకాలంగా మనుషులు కాపురం లేనట్టుగా అనిపిస్తోంది. 1971 లో తాము సొంత ఊరు వదిలిపెట్టి బ్రహ్మపల్లిలో కాపురం పెట్టినప్పుడు ఇలానే అనిపించేది. ఆ ప్రాంతంలోని నిశ్శబ్దం సురంజన్‌ను ఇబ్బంది పెట్టేది. అతనికి తన గాలిపటాలూ, కేరంబోర్డూ, పుస్తకాలూ, గోలీలూ దూరమైపోయాయి. పనిలేకపోవటం, స్నేహితులు లేకపోవటం అతణ్ణి చాలా ఇబ్బంది పెట్టింది. అలాంటి ఇబ్బందే ఇప్పుడూ కలుగుతోంది. నాన్నగారు పడకమీదనుంచి లేవలేరా? అతని రక్తపుపోటు పెరిగితే డాక్టర్ని ఎవరు తీసుకొస్తారు?

బజారుకెళ్లటం, మందులు తీసుకురావటం, వస్తువులు పాడైపోతే మెకానిక్‌లను తీసుకురావటం, పాతపత్రికలు సర్దటంలాంటి పనులు సురంజన్ ఏనాడూ చేయలేదు. ఇంటిపనులతో అతనికి అంతగా సంబంధం లేదు. రోజుకు మూడుసార్లు లేదా రెండుసార్లు భోంచేయటం వరకే అతనికి ఇంటితో సంబంధం. అతడు సాధారణంగా ఇంటికి ఆలస్యంగా వస్తాడు, మరీ ఆలస్యమైతే, లేదా తలవాకిలి తాళం వేసి ఉంటే సరాసరి తనగదిలోకి వెళ్లిపోతాడు. డబ్బు అవసరం ఉంటే సుధామయ్‌నో, కిరణ్మయినో అడుగుతాడు. ప్రతిసారీ అడగటానికి సిగ్గుగానే ఉంటుంది. కానీ అడక్కతప్పదు. ఇప్పుడతనికి ముప్పైమూడేళ్ళు. అయినా స్థిరమైన ఉద్యోగంలేదు. "నేను త్వరలో రిటైరౌతున్నాను. నువ్వేదో ఒక ఉద్యోగం చూసుకోవాలి సురంజన్", అనేవాడు సుధామయ్. ఇప్పుడతనికి కుటుంబభారంమోసే శక్తిలేనిమాట నిజమే. కానీ తప్పటంలేదు. బయటిగదిలో కొందరు రోగుల్నిచూసి, నాలుగురాళ్ళు సంపాదించి కుటుంబాన్ని లాక్కొస్తున్నాడు. అది తప్పకుండా శ్రమే. కానీ సురంజన్ పార్టీ ఆఫీసుకూ, మధు కాంటీన్‌కూ, ఘటక్ దలాల్ నిర్మల్ కమిటీ కార్యాలయానికీ, ప్రెస్‌క్లబ్‌కూ తిరిగి తిరిగీ అలసిపోయి ఇల్లు చేరుకుంటాడు. అన్నం డైనింగ్ టేబుల్‌మీద వేచి ఉంటుంది. ఇష్టం ఉంటే తింటాడు.. లేకుంటే అలాగే పడుకుంటాడు. క్రమక్రమంగా సురంజన్ దారివేరూ, కుటుంబందారి వేరూ అయిపోయాయి. ఏడాది ఏడాదికీ ఈ దూరం పెరిగిపోసాగింది. కానీ ఈరోజు కిరణ్మయి, టీ తీసుకొచ్చి అతని పక్కన కూచుంటే అతని తల్లీతండ్రీ ఈనాటికీ అప్రయోజకుడూ, బాధ్యతలేనివాడూ అయిన తమ కొడుకుమీద ఎంతగా ఆధారపడుతున్నారో అతనికి అర్థమైంది. అతనికి చాలా పశ్చాత్తాపం కలిగింది. నిజమే, తాను కుటుంబానికి ఏం చేశాడు?

తాము జీవితంలో ఎంత దిగజారిపోయాము? అంటే ఒకనాడు బాగా కలిగినవాడుగా ఉన్న సుధామయ్ ఈనాడు అనుభవిస్తున్నది అసంతృప్తి ఎంతమాత్రమూకాదు. అతడు తాను తింటున్న అన్నం, పప్పుతో సంతృప్తిగానే ఉన్నాడు – అది చాలా సాధారణ భోజనమైనాసరే! అలాంటి సంతృప్తి సురంజన్‌కుకూడా ఉంది. తాను చిన్నవాడుగా ఉన్నప్పుడు తన తల్లి బలవంతంచేసి తనచేత ఎలా పాలుతాగించేదో, వెన్న తినిపించేదో, తాను మారాంచేస్తే ఎలా తిట్టేదో జ్ఞాపకం వచ్చింది. ఈనాడు తనకు పాలు, వెన్న, చేపలు, మాంసం, పరోటాలూ కావాలంటే నాన్నగారు తేగలరా? తాను ఏనాడూ సంపదనూ, సుఖాన్నీ ఆశించలేదు. తాను ఈ గుణాన్ని నాన్నగారి వద్దనుంచీ

నేర్చుకున్నాడు. సురంజన్ స్నేహితులంతా కొత్తకొత్త ఫాషన్ల బట్టలమోజులో ఉంటే సుధామయ్ తన కొడుక్కు ఐన్‌స్టయిన్, న్యూటన్, గెలిలియో మొదలైనవారి జీవిత చరిత్రలనూ, ఫ్రెంచి విప్లవంమీద రాసిన పుస్తకాలనూ, గోర్కీ, టాల్‌స్టాయ్ రాసిన నవలలనూ తెచ్చి ఇచ్చేవాడు.

సుధామయ్ తనకొడుకు విశిష్టంగా ఎదగాలనుకున్నాడు. ఈనాడు పిల్లివెంట పరుగెడుతున్న సురంజన్‌కు తాను ఎందులోనైనా విశిష్టత సాధించాడా లేదా అన్న విషయం అర్థంకాలేదు. విశిష్టత సంగతి అలా ఉంచితే తాను ఏం సాధించాడోకూడా అర్థంకాలేదు! తనకు దురాశలేదు. భౌతిక అవసరాలపట్ల వ్యామోహంలేదు. స్వార్థమూలేదు. తనకున్న చింత ఇతరుల సుఖాన్ని గురించి మాత్రమే. ఇది జీవితంలో తాను సాధించిన వాటికిందికే వస్తుందా? గజిబిజిగా ఉన్న మనసుతో, అన్యమనస్కంగా సురంజన్ వరండా దాటాడు. పత్రిక చదువుతున్న సుధామయ్ కొడుకునుచూసి, "సురంజన్" అని పిలిచాడు.

"ఏమిటి?" అన్నాడు సురంజన్.

"జోషీ, అద్వానీలతోపాటు మరి ఎనమండుగురిని అరెస్టు చేశారట విన్నావా? దాదాపు నాలుగు వందలమంది చనిపోయారట. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి కల్యాణ్‌సింగ్‌మీద విచారణ జరుగుతుందట. అమెరికా – అమాటకొస్తే ప్రపంచం మొత్తం – బాబ్రీమసీదు విధ్వంసాన్ని ఖండించింది. భోలాలో కర్ఫ్యూ పెట్టారట. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ, అవామీలీగ్ మరికొన్ని పార్టీలూ మతసామరస్యం కాపాడటానికి బయటికొచ్చాయి. ఇందులో దీనికి సంబంధించిన వివరాలున్నాయి".

సుధామయ్ కళ్ళు ఆర్ద్రంగా, ఆశ్చర్యంగా ఉన్నాయి – పిల్లికళ్లలాగా.

"వాస్తవానికి ఏం జరుగుతోందో తెలుసా? ఈ అల్లర్లు చేస్తున్నవాళ్లు తమ మతంమీదున్న అభిమానంతో చేయటంలేదు. వాళ్ల లక్ష్యం దోపిడీలూ, లూటీలూ చేయటం మాత్రమే. వాళ్లు మిఠాయి దుకాణాల్ని ఎందుకు లూటీ చేస్తారో తెలుసా? మిఠాయిలు తినాలన్న కోరికను తీర్చుకోవటం కోసం. అలాగే బంగారం కోసం బంగారం దుకాణాల్ని దోపిడీ చేస్తారు. ఈ అల్లర్లు రౌడీలు చేయిస్తున్నవి మాత్రమే. రెండుమతాల ప్రజలమధ్య ఎలాంటి విద్వేషమూలేదు. శాంతియాత్రలు జరుగుతున్న పద్ధతిచూస్తే త్వరలోనే మామూలు పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందనిపిస్తోంది. 1990 లో – నీకు జ్ఞాపకం ఉండవచ్చు – ఎర్షాద్ ఇదే సమస్య కారణంగానే కూలిపోయాడు. అన్నట్లు సురూ! ఎర్షాద్ హిందువులకు నష్టపరిహారం చెల్లిస్తానన్నాడు. చెల్లించాడా?"

"నీకేమైనా పిచ్చి పట్టిందా బాబా?"

"ఈలోగా జ్ఞాపకశక్తి తగ్గుతోంది. తెలుసా – నిరాదాబాద్ హత్యకేసులో నిందితులకు ఉరిశిక్షపడింది."

హిందువులక్కూడా ఈదేశంలో న్యాయం జరుగుతోందని సుధామయ్ తన్నుతాను నమ్మించుకోవాలని ప్రయత్నిస్తున్నాడని సురంజన్‌కు అర్థమైంది. సుధామయ్ పేర్కొం

టున్న సంఘటన బ్రాహ్మణ్‌బారియా జిల్లాలోని నిరాదాబాద్‌లో జరిగింది. బిరజ్‌బాలా దేవనాథ్‌నూ, అతని ఐదుమంది పిల్లలనూ – నియతిబాల, సుభాష్‌దేవనాథ్, మినాతిబాల, సుమన్‌దేవనాథ్, సుజిన్ దేవనాథ్– ధోపాజురీ సరస్సుదగ్గరికి బలవంతంగా తీసుకెళ్ళి చంపి, గొడ్డలితో ముక్కలు ముక్కలు చేసి, ఆముక్కల్ని ఒకడ్రమ్ములో కూరి, సీలుచేసి సరస్సులోకి తోసేశారు. కానీ మరుసటిరోజు ఆడ్రమ్ము నీటిమీదికి తేలివచ్చింది. ముక్కలుముక్కలుగా ఉన్న శవాలు బయటపడ్డాయి. అంతకుముందు బీరజాబాల భర్త శశాంకను హత్యచేసిన వారే ఈ హత్యకూడా చేశారనీ, అహత్యను కప్పిపెట్టటానికే ఈ హత్య జరిగిందనీ బయటపడింది. ఈహత్యలు ఈకుటుంబానికి చెందిన పొలాన్ని ఆక్రమించుకోవటంకోసం జరిగాయి. ఈహత్యలకు కారకులైన తాజిల్ ఇస్లాంకూ, చోరాబాద్‌షాకూ సుప్రీంకోర్టు మరణశిక్ష విధించింది. సుధామయ్ ఈ హత్యల్ని గురించి చెబుతున్నాడు. బంగ్లాదేశ్‌లో ముస్లిములూ, హిందువులూ సమానమేననీ, హిందువుల్ని ద్వితీయశ్రేణి పౌరులుగా చూట్టంలేదనీ తన్నుతాను నమ్మించుకోవటంకోసం ఈసంఘటనను ప్రస్తావించాడు.

"నిన్న నువ్వుకూడా శాంతియాత్రలో పాల్గొన్నావా? ఆ ఊరేగింపులో ఎంతమంది పాల్గొన్నారు?"

"నాకు తెలీదు".

"జమాతీలు తప్ప ఇతరపార్టీలన్నీ పాల్గొన్నాయికదూ?"

"నాకు తెలీదు".

"ప్రభుత్వం ఆ ఊరేగింపుకు పోలీసు బందోబస్తు ఇచ్చిందా?"

"నాకు తెలీదు".

"శంకరీ బజార్‌లో వరసగా పోలీసు వాహనాల్ని పెట్టారటగా?"

"నాకు తెలీదు".

"భోలాల్లో పరిస్థితి ప్రమాదకరంగా ఉందటగా?"

"నాకు తెలీదు".

"లేక ఇదంతా అతిశయోక్తులేనా?"

"నాకు తెలీదు".

సురంజన్ నిరుత్సాహం సుధామయ్ ఉత్సాహాన్ని నీరుకార్చింది. బయట జరుగుతున్న విషయాలను గురించి తెలుసుకోవాలన్న అతని కోరిక జావగారిపోయింది. తాను చదువుతున్న పత్రికను చూపిస్తూ సుధామయ్ అన్నాడు, "నువ్వు వార్తాపత్రికలు చదవ్వా?"

"చదవటంవల్ల నాకేం లాభం?"

కొడుకు అడిగిన ప్రశ్నను పట్టించుకోకుండా సుధామయ్ "అల్లర్లకు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. పరిస్థితి మరింతగా దిగజారకూడదని అందరూ ప్రయత్నిస్తున్నారు. పోలీసుబారికేడ్లను చీల్చుకొని దేవాలయాల్లోకి దూరే శక్తి జమాతీలకు ఉందంటావా?" అన్నాడు.

"దేవాలయాలకూ మీకూ ఏమిటి సంబంధం? మీకు చివరిదశలో అకస్మాత్తుగా మతంమీద నమ్మకం కుదిరిందా? ఈదేశంలో ఉన్న దేవాలయాలన్నిటినీ ముక్కలుముక్కలుగా పగలగొడితే మాత్రం మీకేం? వాళ్ళు వాళ్లకు కనిపించిన దేవాలయాలన్నిటినీ కూలదోసినా నాకు సంతోషమే".

సుధామయ్‌కి ఇబ్బందిగా అనిపించింది. సరళమైన మంచి మనసున్న తన తండ్రిని తాను నొప్పిస్తున్నానని సురంజన్‌కు తెలుసు. కానీ ఈనాటి పరిస్థితిని గురించి అతని దృక్పథం సురంజన్‌కు పూర్తిగా నచ్చలేదు. ద్వితీయశ్రేణి హిందూ పౌరులుగా ఉంటూ ప్రథమ శ్రేణి ముస్లింపౌరుల్తో సమానంగా ఉన్నామని భావించటంలో అర్థంలేదు. వారేనాడూ సాంప్రదాయిక హిందువులుగా జీవించలేదు. ముస్లిముల్ని తమ స్నేహితులుగా, సోదరులుగా భావించారు. కానీ ఫలితం? అలా భావించటంవల్ల సుధామయ్‌కీ, సురంజన్‌కూ ఒరిగిందేమిటి? వారికున్న ఒకే గుర్తింపు హిందువులుగా మాత్రమే. వాళ్లెప్పుడూ ఆస్తికులుకారు. వాళ్లు నమ్మింది మానవుల్నీ, మానవత్వాన్నీ మాత్రమే. కానీ వాళ్లు సాధించిందేమిటి? అవమానాలకూ హింసకూ భయపడుతూ జీవించటమేనా? మతతత్వంమంటలు తమను దగ్ధం చేస్తాయేమోనన్న భయంతో ఒదిగి ఒదిగీ బతక్కతప్పటంలేదుకదా ఈనాటికీ!

సురంజన్‌కు ఒకపాత జ్ఞాపకం మనసులో కదిలింది. తాను ఏడవతరగతిలో ఉండగా ఫరూక్ అన్న స్నేహితుడు ఒకరోజు మధ్యాహ్న భోజన సమయంలో ఇలా అన్నాడు.

"తినటానికి భలేరుచిగా ఉండే వస్తువు తెచ్చాను. దాన్నిగురించి ఇతరులకు చెప్పను. మనిద్దరమే తినాలి. రా మేడమీదికి పోదాం," అన్నాడు.

సురంజన్‌కు పెద్ద ఆకలిగాలేదుకానీ, ఫరూక్ చెప్పిన మాటను ఒప్పుకున్నాడు. ఇద్దరూ మేడమీదికి వెళ్లారు. ఫరూక్ తన టిఫిన్‌బాక్స్ తెరిచి కబాబులు పెట్టాడు. ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వాటిని తిన్నారు. తానుతిన్న కబాబులకు బదులుగా అమ్మచేత కొబ్బెరబర్ఫీ చేయించి తన స్నేహితునికి పెట్టాలనుకున్నాడు సురంజన్.

"ఇవి మీ అమ్మ చేసిందా? మాఅమ్మ చేతివంట నీకు ఏదో ఒకరోజు తినిపించాలి," అన్నాడు సురంజన్. వాళ్లు తినటం పూర్తికాగానే ఫరూక్ గట్టిగా అరిచి పారిపోయాడు. సురంజన్ తేరుకునేలోగా అతడు మెట్లుదిగి వెళ్లిపోయాడు. ఫరూక్ సురంజన్ చేత గోమాంసం తినిపించాడని ఆనందంలో ఫరూక్‌తోబాటు క్లాసులోని ఇతర విద్యార్థులంతా గంతులేస్తున్నారు. అందరూ సురంజన్‌చుట్టూరా చేరారు. అతణ్ణి గేలిచేయటం ప్రారంభించారు. కొందరు అతణ్ణి గిచ్చారు, మరికొందరు అతడి తలమీద మొట్టికాయలు వేశారు. మరికొందరు అతని చొక్కాలాగారు, మరికొందరు అతని నిక్కరు లాగేయటానికి ప్రయత్నించారు. ఆనందంతో చెలరేగిపోతున్న మరికొందరు అతని జేబుల్లో చచ్చిపోయిన బొద్దింకల్ని కుక్కారు. సురంజన్‌మనస్సు పూర్తిగా చెదిరిపోయింది. అతని కళ్లు కన్నీళ్లతో నిండిపోయాయి. తాను గోమాంసం తిన్నందుకు అతనికి ఏడుపురాలేదు. తనక్లాసు పిల్లలు తన్నుచూసి అనుభవిస్తున్న

రాక్షసానందంచూసి అతనికి ఏడుపువచ్చింది. అతనికి భరించలేనంత ఒంటరితనం అనిపించింది. తానొకరకమైన మనిషనీ, వాళ్ళు మరొకరకమైన మనుషులనీ అతనికి స్ఫురించింది. ఆరోజు అతడు ఇంటికెళ్లి గట్టిగా ఏడ్చేశాడు.

"వాళ్ళు కుట్రచేసి నాచేత గోమాంసం తినిపించారు", అని అమ్మతో, నాన్నతో చెప్పాడు – వాళ్ళు ఎందుకేడుస్తున్నావని అడిగితే.

సుధామయ్ నవ్వాడు. "ఇందుకా నువ్వు ఏడుస్తున్నావ్? గోమాంసం రుచైనవస్తువే. రేపే బజారుకెళ్ళి తీసుకొస్తాను. అందరం కలిసితిందాం", అన్నాడు.

మరుసటిరోజు సుధామయ్ అన్నంతపనీచేశాడు. ఎంతోసేపు బతిమాలుకున్న తరువాతగానీ కిరణ్మయి గోమాంసం వండటానికి అంగీకరించలేదు. అలాంటి ఆచారానికి అర్థంలేదనీ, మునులకూ, రుషులకూ అలాంటి చాదస్తాలు లేవనీ అతడు కిరణ్మయికి నచ్చచెప్పాడు. మసాలాపెట్టిన గోమాంసం వేపుడు చాలా రుచిగాకూడా ఉంటుందనీ, దాన్ని తాము ఎందుకు తినకుండా ఉండాలనీ అన్నాడు. అలా సురంజన్ చిన్నతనంలో అనుభవించిన అవమానం, భయం, పశ్చాత్తాపం అతణ్ని ఇబ్బంది పెట్టటం మానేశాయి.

సుధామయ్ కుటుంబం సురంజన్‌మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సుధామయ్ కూడా పిల్లల్ని బాగా పెంచాడు. సురంజన్ ఎప్పుడూ నాన్నగారిని అసాధారణ వ్యక్తి అనిభావించాడు. ఆరోజుల్లో అంత నిజాయితీ, సరళత్వం, పవిత్రమైన ఆలోచనా, ఆచరణా, ప్రేమా, లౌకికతత్వంలో గాఢమైన నమ్మకం, మతతత్వమంటే అసహ్యం ఉన్న వ్యక్తి లభించటం ఎంతో అరుదు....

సురంజన్ నెమ్మదిగా గదిలోంచీ బయటికి వెళ్లిపోయాడు. అతనికి పత్రిక చదవాలన్న ఉత్సాహంలేదు. వివిధ మేధావులు మతతత్వాన్నిగురించి చెప్పిన అభిప్రాయాలను తెలుసుకోవాలని అసలులేదు. శాంతియాత్రల బొమ్మల్ని చూడాలన్న ఉత్సాహం అంతకంటేలేదు. అలాంటివాటిని తెలుసుకొని అతని నాన్నగారు పొందే ఊరటకూడా సురంజన్‌కు అవసరంలేదు. అతనికి పిల్లిని వెదికిపట్టుకోవాలనే ఉత్సాహమే ఉంది. పిల్లికి మతాలూ, కులాలూలేవు. సురంజన్‌కు మళ్లీ ఒకసారి తాను పిల్లిగా ఉంటే బావుండునన్నకోరిక కలిగింది.

★ ★ ★

సుధామయ్ తన్ను నిర్బంధించిన కాంపునుంచీ కొన్నిరోజులతరువాత తిరిగొచ్చాడు. తాను కాంపులో ఉన్నది ఏడురోజులో, ఆరురోజులో అతనికి స్పష్టంగా తెలీదు. అతనికి తెలిసింది ఒకటే. తాను నిర్బంధంలో ఉన్నంతకాలమూ భయంకరమైన దప్పికతో బాధపడ్డాడు. తనకాళ్ళూ చేతులూ కట్టివేయబడిఉన్నా, కళ్లకు గంతలున్నా ఎక్కడైనా నీటికడవ తగులుతుందేమోనని దొర్లుకుంటూ వెళ్లేవాడు. కానీ ఆకాంపులో నీళ్లెక్కడుంటాయి? పక్కనే బ్రహ్మపుత్ర పరవళ్లు తొక్కుతున్నా కాంపులోని కడవలన్నీ ఖాళీగానే ఉండేవి. మంచినీళ్ళివ్వమని బతిమాలితే ఇతరులబాధే తమ ఆనందమైన పహారాజనాన్లు తన్నుచూసి విరగబడి నవ్వేవారు. ఒకరోజు నీళ్ళు ఇచ్చారు. తనకళ్లకు కట్టిన గంతలు విప్పేశారు. ఒకచిన్న పాత్రలోకి అందరూ ఉచ్చపోశారు. దాన్ని

తన పెదవులవద్దకు తీసుకొచ్చి తాగమన్నారు. తాను అసహ్యంతో ముఖం పక్కకు తిప్పుకుంటే ఒకడు బలవంతంగా తన నోరు తెరిచాడు, మరొకడు దాన్ని తననోట్లో పోశాడు. వెచ్చగా, ఉప్పగా ఉన్న ద్రవం తన గొంతులోంచీ దిగుతుంటే అందరూ ఆనందంగా, భయంకరంగా నవ్వారు. అప్పుడూ సుధామయ్‌కి తాను విషంతాగితే బావుండేదనిపించింది!

తనను ఓ కొయ్యదూలానికి వేలాడదీసి చావగొట్టారు. దెబ్బదెబ్బకూ తాను ముస్లింగా మతం మార్చుకోవాలని బెదిరించారు. "కల్మా" చదవమనీ, తాను ముస్లింగా మారిపోయినట్టు ఒప్పుకోమనీ భయపెట్టారు. కానీ సుధామయ్ గట్టిగా నిలబడ్డాడు. అలెక్స్‌హాలి రాసిన "రూట్స్" అన్న నవలలో తాను టోబీ అని అంగీకరించకుండా చావుదెబ్బలు తినటానికి సిద్ధపడ్డ కుంటాకింటేలాగా సుధామయ్‌కూడా తాను ముస్లింనని అంగీకరించలేదు. వాళ్లు కోపంచేసుకొని తను అంగీకరించినా, అంగీకరించకపోయినా తన మతం మారుస్తామన్నారు. ఒకరోజు తన లుంగీపైకెత్తి, తనకు బలవంతంగా సున్తీచేశారు. కోసేసిన చర్మాన్నీ, రక్తంకారుతున్న అంగాన్నీచూసి వాళ్లు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ సంఘటన తరువాత ప్రాణాలతో ఇల్లుచేరుకోగలనన్న నమ్మకం పోయింది. కాంపులో ఉన్న ఇతర హిందువులు కల్మా చదవటానికీ, ముస్లిములుగా మారటానికీ అంగీకరించినా వాళ్ల ప్రాణాలు దక్కలేదు. ఆశ్చర్యమేమిటంటే తన ప్రాణాలు – అంతకుముందే వాళ్ళు తన మతాన్ని మార్చి ఉండటంచేతకాబోలు – దక్కాయి. చిత్రహింసలు మాత్రం ఆగలేదు. కాంపునుంచీ బయటపడేనాటికి తానొక శిధిలమానవుడు మాత్రమే.

రక్తంకారుతున్న గాయాలతో, విరిగిపోయిన రొమ్ము ఎముకలతో, కాలి ఎముకలతో తాను ఎలా ఇల్లుచేరుకున్నాడో సుధామయ్‌కి ఈనాటికీ ఆశ్చర్యమే. తనకు అంతశక్తీ, ఆత్మస్థైర్యమూ ఎలా వచ్చాయో ఈనాటికీ సుధామయ్‌కి ఆశ్చర్యంగానే ఉంటుంది. బహుశా అది ఆత్మశక్తి మాత్రమే కావచ్చు. అలావచ్చి బ్రహ్మపల్లి చేరుకొని కిరణ్మయి పాదాలవద్దకూలిపోయాడు. రక్తంకారుతూ ఉన్న, శిధిలమైపోయిన అతణ్ణిచూసి కిరణ్మయి చలించిపోయింది. తక్షణం సర్వశక్తుల్నీ కూడదీసుకొని తనభర్తనూ, ఇద్దరు పిల్లల్నీ తీసుకొని భద్రమైన చోటికి వెళ్లింది. ఆమె దుఃఖంతో కూలిపోలేదు. తనలోగూడుకట్టుకున్న కన్నీటిని కార్చలేదు.

అప్పుడేకాదు ఆతరువాత కొన్ని నెలలుకూడా కిరణ్మయికి కన్నీరు కార్చే అదృష్టం పట్టలేదు. ముస్లిం స్నేహితులు వచ్చి, "మౌల్వీని పిల్చుకొస్తాను. అతడు కల్మా చదువుతాడు, మీరు ముస్లిములుగా మారిపొండి, దానికి మించిన భద్రతమీకులేదు. మామయనాన్నగారికి ఈ విషయం నచ్చచెప్పు", అని సలహాచెప్పారు. కానీ కిరణ్మయి స్థైర్యాన్ని కోల్పోలేదు. నిర్బంధశిబిరంలో తనభర్త ఎంతస్థైర్యాన్ని చూపించాడో తానూ అంత స్థైర్యాన్ని చూపించింది. రాత్రి పొద్దుపోయాక, అందరూ నిద్రలోకి జారుకున్నాక తనభర్త పక్కనకూర్చొని కన్నార్పకుండా చూచుకునేది. అతని గాయాలకు తనచీరలుచించి కట్లుకట్టేది. ఇంతబరువుమోస్తున్నా ఏనాడూ కన్నీళ్లు పెట్టేదికాదు. గ్రామంలోని ప్రజలంతా స్వాతంత్ర్యోత్సవాన్ని చేసుకుంటూ ఉంటే ఆనందాన్ని

భరించలేక కిరణ్మయి చుట్టూరా ఉన్న జనాన్నికూడా పట్టించుకోకుండా సుధామయ్‌ని కౌగిలించుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె చిన్నపిల్లలా, ఎలాంటి జంకూగొంకూ లేకుండా మొదటిసారి ఏడ్చింది.

ఇప్పుడుకూడా సుధామయ్‌కి అప్పుడు అనిపించినట్టే అనిపిస్తోంది. 1971 లో కిరణ్మయి తొమ్మిదినెలలపాటు కన్నీళ్లు దాచుకొంది. ఇప్పుడుకూడా కన్నీళ్ళను దాచుకుంటూ ఉన్నట్టే అనిపిస్తోంది. ఆనాటిలాగే ఈనాడుకూడా అకస్మాత్తుగా ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంటుంది. ఈ అసహజమైన ప్రశాంతత పారిపోతుంది. నల్లని మేఘాలు ఆమె హృదయంచుట్టూరా కమ్ముకుంటున్నాయి. ఆమె జైబంగ్లా దినోత్సవంలాంటి ఏదో ఒకరోజుకోసం ఎదురుచూస్తోంది. ఆరోజు ఆమె హృదయంలో గూడుకట్టుకోవున్న ఉద్రేకాలు వెల్లువలా బయటికి దూకుతాయి. ఆమె కుంకుమ పెట్టుకోవటంకోసం, మట్టెలుధరించటంకోసం, తాను ధోవతి కట్టుకోవటంకోసం నిజమైన స్వాతంత్ర్యాన్ని అనుభవించటంకోసం, తాము తాముగా బ్రతకటంకోసం వేచి ఉండకతప్పదు. 1971లో తాము అనుభవించిన నిరాశామయ రాత్రులవంటి రాత్రులు ఎప్పుడు అంతమౌతాయి?

పరిస్థితులు మరింతగా దిగజారిపోతున్నాయి. తనవద్దకు రోగులు పూర్తిగా రావటంలేదు. ఇంతకుముందు వానకురుస్తున్నా – ఆరేడుమందిదాకా వచ్చేవాళ్లు. ఇప్పుడు ఒక్కరూ రావటంలేదు. ఇంట్లోకూచొని, వీధిలో వెళ్ళే ఊరేగింపుల్ని చూస్తూ, "నారయే తక్‌బీర్.... అల్లాహుఅక్బర్.... ప్రాణాలు కాపాడుకోవాలనుంటే హిందువులు ఈదేశం వదిలివెళ్లిపోవాలి...." అన్న వాళ్ల పొలికేకల్నివింటూ కూర్చోవటం విసుగ్గా ఉంది. తాను ఎంత ఆశావాదైనా, తనకు తన దేశంలోని ప్రజలమీద ఎంత నమ్మకం ఉన్నా ఎవరో మతదురహంకారులు బాంబుపెట్టి తన ఇంటిని పేల్చేయవచ్చనీ, లేదా తగలబెట్టవచ్చనీ సుధామయ్‌కి తెలియకపోలేదు. తమ ఇంటిని వాళ్లు దోపిడీచేయవచ్చనీ, తమను వాళ్లు హత్యచేసినా చేయవచ్చనీకూడా సుధామయ్‌కి తెలుసు. నిజంగానే ఈదేశంనుంచీ హిందువులు వెల్లువలా వలసపోతున్నారా? 1990 లో చాలామంది హిందువులు భారతదేశానికి పారిపోయారు. కొత్తజనాభాలెక్కలు హిందూ, ముస్లిముల లెక్కల్ని వేరువేరుగా తయారుచేయలేదు. అందుచేత ఎంతమంది హిందువులు దేశాన్ని వదిలి పారిపోయారో చెప్పటం సాధ్యంకాదు.... షెల్ఫ్‌లోని పుస్తకాలమీద దుమ్ము పేరుకుపోయింది. దాన్ని దులపటానికి సుధామయ్ వృథాప్రయత్నం చేశాడు. తనలాల్చీ కొనతో బూజు దులపటానికి ప్రయత్నించాడు. అప్పుడు కనిపించింది – 1986 జనాభా లెక్కలరికార్డు. అందులో 1974, 1981 కి సంబంధించిన వివరాలుకూడా ఉన్నాయి. ఆపుస్తకం చెప్పిన చరిత్ర ఇలా ఉంది:

"1974 లో చిట్టకాంగ్ పర్వతప్రాంతంలోని మొత్తం జనాభా ఐదులక్షలా ఎనిమిదివేలు. అందులో ముస్లిముల జనాభా 96,000. 1981 కి ముస్లింజనాభా 1,88,000 కు పెరిగింది. మొత్తం జనాభాకూడా ఐదులక్షలా ఎనభైవేలుకు పెరిగింది. 1973 లో హిందువుల జనాభా 53,000. 1981 లో ఇది 66,000 కు పెరిగింది. ముస్లిం జనాభా పెరుగుదల శాతం 87.05. ఈశాతం హిందువుల్లో 18.87

మాత్రమే. 1974 లో కోమిల్లాలో ముస్లిముల జనసంఖ్య 5,250,000. 1981 నాటికి ఈసంఖ్య 6,300,000 కు పెరిగింది. 1974 లో హిందువులసంఖ్య 5,64,000. 1981 లో ఈసంఖ్య 5,65,000. పెరుగుదలరేటు ముస్లిముల్లో దాదాపు ఇరవైశాతం. కానీ హిందువుల్లో అది 0.18 శాతంమాత్రమే. ఫరీద్‌పూర్‌లో జనాభా 17.34 శాతం పెరిగింది. ముస్లింల జనాభా 1974 లో 3,100,000. 1981 లో అది 3,852,000 కు పెరిగింది. పెరుగుదలశాతం 24.26. 1974 లో హిందువులసంఖ్య 9,44,000. అది 1981 నాటికి 8,94,000 కు తగ్గిపోయింది. తగ్గుదలశాతం 5.30. పాబ్నాలో జనాభా 21.63 శాతం పెరిగింది. 1974 లో ముస్లిముల జనాభా 2,546,000. 1981 లో 3,167,000. పెరుగుదల శాతం 24.39. 1974 లో పాబ్నాలో 2,60,000 హిందువులుండేవారు. 1981 కి వారి జనాభా 2,51,000 కు పడిపోయింది. తరుగుదల శాతం 3.46. రాజ్‌షాహీలో జనాభా పెరుగుదల శాతం 27.20. 1974 లో హిందువుల జనాభా 5,58,000. 1981 లో అది 5.03,000 కు తగ్గిపోయింది. తరుగుదల శాతం 9.68."

120 వ పేజీలో సుధామయ్‌కి ఓ ఆసక్తికరమైన అంశం కనిపించింది. 1974 హిందువుల జనాభా 13.5 శాతం ఉండేది. 1981 నాటికి అది 12.1 కి తగ్గిపోయింది. ఈ హిందువులంతా ఎక్కడికి పోయారు? దేశాన్ని వదిలి పారిపోవటమేనా వీరి సమస్యలకున్న ఏకైక పరిష్కారం? వాళ్లు ఇక్కడేఉండి తమ హక్కులకోసం పోరాడి ఉండకూడదా? ఈపారిపోయిన హిందువుల్ని పిరికిపందలని అసహ్యించుకున్నాడు సుధామయ్.

అతని ఆరోగ్యం అసంతృప్తికరంగా అనిపించింది. జనాభాలెక్కలపుస్తకాన్ని షెల్ఫ్ లోంచి కుడిచేతితో అందుకున్నప్పుడు బలహీనంగా అనిపించింది. ఇప్పుడు దాన్ని మళ్లీ షెల్ఫ్‌లో ఉంచబోతే శక్తి చాల్లేదు. కిరణ్మయిని పిలిచాడు సుధామయ్. పిలవటానికి ప్రయత్నించినప్పుడు నాలుకబరువుగా అనిపించింది. అతనికి విపరీతమైన భయం కలిగింది. అడుగు ముందుకువేద్దామని ప్రయత్నించి కాళ్లు తన స్వాధీనంలోలేవని అర్థం చేసుకున్నాడు. "కిరణ్....కిరణ్...." అని బలహీనంగా పిలిచాడు.

అప్పుడే ఆమె పప్పువండటం ప్రారంభించింది. సుధామయ్ పిలుపువిని వచ్చింది. సుధామయ్ ఆమె చేయి అందుకోబోయాడు కానీ వీలుకాలేదు. "కిరణ్, నన్ను పరుపుమీద పడుకోబెట్టు", అన్నాడు చాలా బలహీనంగా. తనభర్త ప్రవర్తనలో అకస్మాత్తుగా వచ్చిన ఈ మార్పును చూసి కిరణ్మయి ఆశ్చర్యపోయింది. అతడు ఎందుచేత అలా వణుకుతున్నాడో, అతని మాటలు ఎందుచేత అలా ముద్దముద్దగా అయిపోయిందో అవిడకు అర్థంకాలేదు.

"ఏం అలా ఉన్నారు?" అంది అతణ్ణి పరుపుమీద పడుకోబెట్టిన తరువాత.

"సురంజన్ ఎక్కడ?"

"ఇప్పుడే ఎక్కడికో వెళ్లాడు. ఉండమని చెబుదామనుకున్నాను. కానీ వాడు మనమాట వినేలా లేడు".

"నాకేం బాగాలేదు కిరణ్. నువ్వేదైనా చేయాలి".

'ఎందుకలా ఉంది మీమాట? స్పష్టంగా మాట్లాడలేకపోతున్నారేం? ఎందుకూ?"

"కుడిచేయి పనిచేయటంలేదు. కుడికాలుకూడా ఆడటంలేదు. నాకు పక్షవాతం వస్తోందా కిరణ్?"

కిరణ్మయికి భయం ప్రారంభమైంది. సుధామయ్ చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుంటూ అంది.

"దేవుడున్నాడు. అలాంటిదేంలేదు. మీరు బలహీనంగా ఉండటంచేత అలా అనిపిస్తోంది. మీరు ఈమధ్య సరిగ్గా తినటంలేదు, నిద్రపోవటంలేదు".

సుధామయ్ ఇబ్బందిగా పరుపుమీద కదిలాడు. "కిరణ్, నిజంచెప్పు. నేను చచ్చిపోతున్నానా? చనిపోయేలా కనిపిస్తున్నానా?"

"ఎవర్ని పిలవమంటారు? హరిపాదబాబును పిలవమంటారా?"

సుధామయ్ తన ఎడమచేతిలో ఉన్న శక్తినంతా ఉపయోగించి కిరణ్‌ను గట్టిగా పట్టుకున్నాడు.

"కదలకు కిరణ్. నువ్వు నాపక్కనే ఉండాలి. మాయ ఏది?" అన్నాడు ఎంతోబాధగా.

"పరుల్ ఇంటికెళ్ళిందిగా. ఇంకా తిరిగిరాలేదు".

"నాకొడుకు...నాకొడుకు ఏడీ కిరణ్?"

"అలా అరవకండి".

"కిరణ్, కిటికీలూ, తలుపులూ తెరువు."

"ఎందుకూ?"

"కొంచెంగాలీ, వెలుతురూ కావాలి".

"వెళ్ళి హరిపాదబాబును తీసుకొస్తాను. మీరు ప్రశాంతంగా పడుకోండి".

"హిందువులంతా ఇళ్ళువదిలి వెళ్లిపోయారు. నీకు దొరకరు... మాయను పిలిపించవ్వూ?"

"ఎలా పిలిపించమంటారు చెప్పండి? వెళ్ళిరావటానికిక్కడ ఎవరూలేరు".

"నువ్వు ఇక్కణ్ణుంచీ కదలకు....ఇక్కడే ఉండు....సురంజన్‌ను పిలువు".

అక్కణ్ణుంచీ సుధామయ్ గొణుగుడు కిరణ్మయికి అర్థంకావటం కష్టమైపోయింది. ఆమెకుచాలా భయమేసింది. తనభర్త పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉన్నట్టు ఆమెకు అర్థమైంది. కానీ తానేం చేయాలి? ఇరుగుపొరుగువాళ్లను పిలవటానికి గట్టిగా అరవాలా? వాళ్లు తనకు సాయం చేయటానికి తప్పకుండా వస్తారు. వాళ్లను తాను చాలాకాలంగా ఎరుగును. తాను అలా ఆలోచిస్తూ ఉండగానే తన ఆలోచన సరికాదని ఆమెకు అనిపించింది. తన ఇరుగుపొరుగుల్లో తనకు సాయం చేయటానికి ఎవరొస్తారు? హైదర్‌కానీ, గౌతంకానీ, షఫీక్ సాహెబ్ ఇంటివాళ్లుకానీ వస్తారా? కిరణ్మయికి తనకు సాయంవచ్చేవాళ్లెవరూ లేరని అర్థమైంది. మాడిపోతున్న పప్పువాసన గదిలోకి కమ్ముకొనివచ్చింది.

★ ★ ★

క్రితంరోజులాగే ఈరోజుకూడా తాను ఎక్కడికి వెళ్లాలో సురంజన్‌కు అర్థంకాలేదు. బెలాల్ ఇంటికి వెళ్లచ్చనుకున్నాడు. కానీ కక్రెయిల్ దాటేసరికి జల్‌ఖబర్ అన్న ప్రసిద్ధ దుకాణం బుగ్గిపాలైపోయి ఉండటం కనిపించింది. మంటల్లో మాడిపోయిన బల్లలూ, కుర్చీలూ చిందరవందరగా పడివున్నాయి. సురంజన్ భవిష్యత్తును గురించి ఆలోచించి తన దారి మార్చాడు. ఛమేలీబాగ్‌లోని పులోక్ ఇంటికి వెళ్లాలనుకున్నాడు. ఒక రిక్షాపిలిచి ఛమేలీబాగ్‌లోని పులోక్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లమన్నాడు. పులోక్ ఒక ఎన్.జీ.ఓ.లో ఉద్యోగం చేస్తాడు. అతణ్ణి సురంజన్ కలుసుకొని చాలాకాలమైంది. అక్కడతానూ, బెలాల్, పులోక్ ఎన్నో సాయంకాలాలు కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ గడిపారు. కానీ ఎంతోకాలంగా ఈకాలేజీ నేస్తాణ్ణి కలుసుకోవటానికి అవకాశం దొరకటంలేదు!

డోర్‌బెల్ నొక్కినా ఎవరూ తలుపుతియ్యలేదు. కానీ సురంజన్ బెల్‌నొక్కటం ఆపలేదు. చిట్టచివరికి ఇంట్లోంచీ ఎవరో "ఎవరది?" అన్నారు వినబడీ వినబడని గొంతుతో

"నేను – సురంజన్‌ని".

"ఏ సురంజన్?"

"సురంజన్ దత్త".

తాళం తెరుస్తున్న శబ్దం వినిపించింది. పులోక్ స్వయంగా తలుపుతీసి "లోపలికి వచ్చెయ్", అన్నాడు లోగొంతుతో.

"ఏమిటోయ్ – ఈభద్రతంతా ఎందుకూ? తలుపుసందులోంచీ చూస్తే చాలదా?" అన్నాడు సురంజన్.

పులోక్ జవాబివ్వలేదు. తాళం సరిగ్గా పడిందో లేదో మరోసారి చూశాడు. ఇదంతా సురంజన్‌కి ఆశ్చర్యంగా ఉంది.

"ఇంట్లోంచి ఎందుకు బయటికొచ్చావు?" అన్నాడు పులోక్ – ఇంకాలోగొంతులోనే మాట్లాడుతూ.

"రావాలనిపించింది".

"ఏమిటోయ్? నీకు భయంలేదా? ఈపనికిమాలిన సాహసం ప్రాణం మీదికొస్తే ఏం చేస్తావ్? ఏం సాహసాలు చేయాలనిపిస్తోందా?"

"నీఇష్టం వచ్చినట్లు ఊహించుకో", అన్నాడు సురంజన్ సోఫాలో కూలబడుతూ.

కానీ అతనికి పులోక్ నిజంగానే భయపడుతున్నాడని అర్థమైంది. అతడు మరోసోఫామీద కూచున్నాడు. "ఏం జరుగుతోందో తెలుసుకుంటున్నావా?" అన్నాడు బరువుగా ఊపిరితీసుకుంటూ.

"లేదు."

"బోర్హానుద్దీన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలాలో, తాజ్‌ముద్దీన్‌లో, గోలక్‌పూర్‌లో పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. ఛోటోదారీ, శంభుపూర్, దాశేర్‌హాత్, ఖాశేర్‌హాత్, దరీరాంపూర్, పద్మామన్, మునీరాం గ్రామాల్లో చాలానష్టం జరిగింది.

పదివేల కుటుంబాలకు చెందిన యాభైవేలమంది హిందువులు దెబ్బతిన్నారు. వాళ్ల ఇళ్లకు నిప్పుపెట్టారు. అంతకుముందుగానే వాళ్ల ఇళ్లను దోచుకున్నారు. విలువైన ప్రతివస్తువునూ పట్టుకుపోయారు. కనీసం ఐదువందల మిలియన్ల టాకాలవిలువున్న ఆస్తి ధ్వంసమైపోయింది. ఇద్దరు చనిపోయారు. దాదాపు రెండువందలమంది గాయపడ్డారు. ప్రజలకు తింటానికి తిండిలేదు. కట్టుకోవటానికి బట్టల్లేవు. ఒక ఇల్లుకూడా ఇంతకుముందున్న పరిస్థితిలో లేదు. వందలాది దుకాణాలు దోపిడీకి గురయ్యాయి. దశీరాహాత్ మార్కెట్ హిందువులకు చెందిన ఒక్క దుకాణంకూడా మిగల్లేదు. బజార్లనిండా ఆశ్రయంలేని జనమే. వాళ్లు చలితో, ఆకలితో బాధపడాలి....

"అంతేకాదు – మదనమోహన ఠాకూర్‌బారీ, దానిపక్కనే ఉన్న దేవాలయం, లక్ష్మీగోవింద ఠాకూర్ బారీ, అందులో ఉన్న దేవాలయం, మహాప్రభు వ్యాయామశాల బూడిదైపోయాయి. నిజానికి బోర్హానుద్దీన్ దౌలత్‌ఖాన్, ఛార్‌ఫాషన్, తాజ్‌ముద్దీన్, లాల్ మోహన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒకదేవాలయంకానీ, వ్యాయామశాలకానీ మిగల్లేదు. హిందువుల ఇళ్లనన్నిటినీ ఒకపద్ధతి ప్రకారం లూటీచేసి, ఆతరువాత తగలబెట్టారు. గుయ్‌నార్‌హాత్ అన్న ప్రాంతంలో రెండుమైళ్ల పరిధిలో ఉన్న హిందువుల ఇళ్లను – ఒక్కటికూడా మిగల్చకుండా – తగలబెట్టారు. 7 వ తేదీరాత్రి దౌలత్‌ఖాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక వ్యాయామశాలను బూడిదచేశారు. బోరానుద్దీన్ మార్కెట్ ప్రాంతంలోని వ్యాయామశాలను పూర్తిగా ధ్వంసం చేశారు. కుతుబా గ్రామంలో యాభై ఇళ్లు బూడిదయ్యాయి. ఛార్‌ఫాషన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హిందువుల ఇళ్లను దోపిడీ చేశారు. అరవిందడే అన్న వ్యక్తిని పొడిచి చంపేశారట".

"నీల ఎక్కడ?"

"ఆమె చాలా భయపడిపోయింది. నువ్వెలా ఉన్నావు?"

సురంజన్ కళ్లుమూసుకొని, ఆందోళన తగ్గించుకునే ప్రయత్నం చేశాడు. ఇక్కడికి కాకుండా తాను బెలాల్ ఇంటికి ఎందుకు వెళ్లలేదా అని ఆశ్చర్యపోయారు. తనలో మతతత్వం ప్రవేశిస్తోందా? తన్ను పరిస్థితులు అలాచేస్తున్నాయా?

"నేను బతికే ఉన్నానని మాత్రం చెప్పగలను."

నేలమీద పడుకోఉన్న పులోక్ కొడుకు – ఆరేళ్లవాడు – ఏడవటంతో సురంజన్ కళ్లు తెరిచాడు.

"వీడు ఎందుకు ఏడుస్తున్నాడో తెలుసా?" అడిగాడు పులోక్.

"......"

"వీడితో మామూలుగా ఆడుకునే పక్కింటిపిల్లలు ఆడుకోవటానికి రామన్నారు. వాళ్ల హుజూర్ వాళ్లను హిందువులపిల్లల్తో కలవద్దని చెప్పాడట".

"ఈ హుజూర్ ఎవరు?"

"వాళ్లింటికి పిల్లలకు అరబిక్ నేర్పటానికొచ్చే మౌల్వీ".

"కానీ పక్కింటి అతను అనీస్ అహమద్‌కదూ? అతడు కమ్యూనిస్టుపార్టీతో సంబంధాలున్నవాడనుకొంటాను. అతడు తన పిల్లలకు అరబిక్ నేర్పిస్తున్నాడా?"

"ఖ్వాను", అన్నాడు పులోక్.

సురంజన్ మళ్లీ ఒకసారి కళ్లుమూసుకున్నాడు. తాను పులోక్ కొడుకు అలోక్ స్థానంలో ఉన్నట్టుగా ఊహించుకున్నాడు. తనకు అర్థంకాని విషయాల్ని తెలుసుకొని ఆ అబ్బాయి ఏడుస్తున్నట్టుగా అతనికి అనిపించింది. ఒక్కసారిగా తనతో ఎంతోకాలంగా ఆడుకున్న స్నేహితుడు లేకుండా పోయాడు.... సరిగ్గా ఇలాగే కొంతకాలం క్రితం మాయ ఏడుస్తూ బడినుంచీ ఇంటికిరావటం సురంజన్‌కు జ్ఞాపకం వచ్చింది......

"మా మాస్టారు నన్ను క్లాసులోంచి బయటికి పంపేశాడు", అంది. ఒళ్లో అన్నీ క్లాసుల్లోనూ మతంగురించి తప్పనిసరి పాఠాలుంటాయి. ఇస్లామియత్ క్లాసులోంచీ మాయను బయటికి పంపేశాడు మాస్టారు. ఆతరగతిలో మాయ ఒక్కటే హిందువు. ఇస్లాంనుగురించి ఆవిడ దగ్గర పాఠ్యగ్రంథాలుకూడా లేవు. ఆ బళ్లో హిందూ ఉపాధ్యాయుడుకూడా లేడు. అందుచేత తరగతిగది బయటతాను ఒంటరిగా నిలబడాల్సి వచ్చిందట.

"నిన్ను క్లాసులోంచీ ఎందుకు బయటికి పంపేశారు?" అడిగాడు సుధామయ్.

"నేను హిందువును కాబట్టి", అంది కూతురు.

సుధామయ్ కూతుర్ని గట్టిగా పొదివి పట్టుకున్నాడు. అతనికి తీవ్రమైన బాధా, అవమానమూ కలిగాయి. కాస్సేపు అతనికి నోరుపెగల్లేదు. అదేరోజును అతడు మతంబోధించే ఆ ఉపాధ్యాయుని ఇంటికెళ్లాడు. తన కూతుర్ని క్లాసులోంచీ బయటికి పంపివేయవద్దనీ, ఆమెను వేరుగా చూడవద్దనీ బతిమాలుకున్నాడు. ఆతరువాత మాయను అతడు క్లాసులో కూచోనిచ్చాడు. మాయకూడా ఆతరువాత చాలా సంతోషంగా ఉండేది. మతప్రబోధం ఆవిడకు ఎంతగా ఒంటబట్టిందంటే తాను ఒంటరిగా ఆడుకుంటున్నప్పుడూకూడా "అల్‌హాందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, అర్‌రహిమాన్ నిర్రహీం మాలికెయోమిద్దీన్", అంటూ పాడూకుంటూ ఉండేది. తన కూతురు అలా పాడుతూ ఉంటే కిరణ్మయి హడలిపోయింది. "చదువుకోవాలంటే మనజాతినీ, మతాన్నీ తప్పకుండా వదిలిపెట్టాలా?" అని భర్తను అడిగింది.

ఈకొత్త పరిణామాన్ని చూసి సుధామయ్‌కూడా ఆందోళనపడ్డాడు. తన కూతుర్ని ఓదార్చటంకోసం ఇస్లాం మతసూత్రాలను నేర్చుకొమ్మనటంవేరు. కానీ ఈకొత్త సమస్యవేరు. మాయ నిజంగానే ఇస్లాంమీద అభిమానం పెంచుకుంటే ఏమౌతుంది! సుధామయ్ మాయచదివే బడి హెడ్మాస్టరుకో ఉత్తరం రాశాడు. మతం చాలా వ్యక్తిగతమైందనీ, బళ్లోదాన్ని బలవంతంగా బోధించటం సబబుకాదనీ అందులో రాశాడు. తండ్రిగాతాను తనపిల్లలు ఏమతాన్ని గురించికానీ తెలుసుకోవటాన్ని అను మతించలేననీ, అలాంటిది ఒక మతాన్ని బలవంతంగా బడి అధికారులు పిల్లలమీద రుద్దటం ఎలా సమర్థనీయమనీ ప్రశ్నించాడు. మతాన్నిగురించి బోధించటంకంటే మహనీయుల బోధనలనూ, జీవితాలనూ అధ్యయనం చేయటం మెరుగన్నాడు. అలాంటి చదువు అన్నిమతాలవారికీ ప్రయోజనకరంగా ఉంటుందనీ, అల్పసంఖ్యాకమతస్తులను ఆత్మన్యూనతాభావంలో పడదోయదనీ సూచించాడు. కానీ బడి అధికారులు సుధామయ్

సలహాను బుట్టదాఖలు చేశారు. పాతపద్ధతి నిరాటంకంగా కొనసాగూతూనే వచ్చింది.....

నీల గదిలో కొచ్చింది. ఆమె నాజూగ్గా, అందంగా ఉంటుంది. సాధారణంగా ఆకర్షణీయంగా తయారౌతుంది. కానీ ఈరోజు చాలా అశ్రద్ధగా ఉన్నట్టు కనిపిస్తోంది. ఆవిడకళ్లకింద నల్లగా చక్రాలు ఏర్పడ్డాయి. ఆవిడ కళ్లు భయాన్నీ, ఆందోళననూ ప్రతిబింబిస్తున్నాయి. ఆవిడ భయంభయంగా ప్రారంభించింది.

"సురంజన్ దా! ఇంతకాలం నువ్వు మాఇంటికి ఎందుకు రాలేదు? మేం ఎలా ఉన్నామో తెలుసుకోవాలనిలేదా? మేము బతికున్నామో, చచ్చిపోయామో నీకు పట్టలేదా? నువ్వు మాపక్కింటికి వచ్చి వెళ్లినప్పుడల్లా మాకు తెలుస్తూనే ఉందిలే....." నీల అకస్మాత్తుగా వెక్కివెక్కి ఏడవటం ప్రారంభించింది.

సురంజన్ వాళ్ల ఇంటికి రాకపోయినంతమాత్రాన ఆవిడ ఏడవాలా? తన మతం ప్రాతిపదికగా తన్ను వేరుగా చూడటంచేత పుట్టిన నిస్సహాయత ఆవిడను ఏడిపిస్తోందా? తానేకాదు – సురంజన్, పులోక్, అలోక్ తనలాగే భద్రతారాహిత్యాన్నీ, బాధనూ అనుభవిస్తున్నారని ఆవిడ భావిస్తోందా?

అకస్మాత్తుగా తాను ఆకుటుంబానికి ఎంతో దగ్గరివాడైపోయినట్టుగా అనిపించింది సురంజన్‌కు. ఐదురోజుల క్రితం బెలాల్ ఇంట్లో కొన్ని గంటలు కబుర్లు చెప్పుకుంటూ, సరదాగా గడిపాడు. అప్పుడు పులోక్ కుటుంబాన్ని చూడాలని అనిపించలేదు. ఇప్పుడు అనిపిస్తోంది.

"ఎందుకంత ఆందోళన? ఢాకాలో వాళ్లేం పెద్దగా ధ్వంసం చేయలేదు. శంఖరీబజార్లో, ఇస్లాంపూర్‌లో, తంతీబజార్లో పోలీసులు కాపలాకాస్తున్నారు".

"క్రితంసారికూడా పోలీసులున్నారు. కానీ ఏం లాభం? వాళ్ల ఎదుటే దక్షిణేశ్వరి దేవాలయాన్ని దోపిడీచేసి, తగలబెట్టారు. పోలీసులేం చేశారు?"

"హుఁ....."

"వీధుల్లోకి రావాలని ఎందుకు అనిపించింది నీకు? ముస్లిముల్ని నమ్మటం సాధ్యంకాదంటే కాదు. నువ్వెవణ్ణి స్నేహితుడనుకుంటావో వాడు అకస్మాత్తుగా నీతలనరికినా ఆశ్చర్యపోనవసరంలేదు."

మళ్లీ సురంజన్ కళ్లుమూసుకునే ఆనందం అనుభవించాడు. అతనికి కళ్లుమూసుకుంటే గుండెల్లో గూడుకట్టుకున్నబాధ తగ్గుతుందా? బయటనుంచీ కేకలూ, అరుపులూ వినిపిస్తున్నాయి. ఎవరో హిందువుకు చెందిన దుకాణాన్ని ధ్వంసం చేస్తున్నారు కాబోలు. సురంజన్‌కు కళ్లుమూసుకున్నా అంతా మనోఫలకంమీద కనిపిస్తోంది. ఎక్కడో ఏదో కాలుతోంది. పలుగులూ, పారలూ పట్టుకున్న మతమూర్ఖులగుంపు పిచ్చిగా నాట్యంచేస్తోంది. క్రితంరోజు సాయంకాలం గౌతం ఇంటికెళ్లాడు. అతడు కళ్లకిందా, రొమ్ముమీదా, వీపుమీదా గాయాలతో పడుకొని ఉన్నాడు. గౌతం ఛాతీమీద చేయివేసి నిశ్శబ్దంగా అతని మంచంమీద కూచున్నాడు తాను. అతనికి మాట్లాడాల్సిన అవసరం కనిపించలేదు. తనతో గౌతం ఇలా అన్నాడు : "దాదా, నేనేం చేయలేదు. వాళ్లు సాయంకాలం నమాజ్ తరువాత

తిరిగొస్తున్నారు. ఇంట్లో సరుకులేవీలేకపోవటంచేత కోడిగుడ్లు తీసుకొద్దామని వెళ్లాను. వాకేమీ భయపడాల్సిన అవసరం కనిపించలేదు. నేను వెళ్లింది మాఇంటికి దగ్గరగా ఉన్నకొట్టుకే. గుడ్లు తీసుకొని డబ్బులిస్తున్నాను. అకస్మాత్తుగా వెనకనుంచీ ఎవరో తన్నారు. తిరిగిచూస్తే ఆరేడుమంది ఉన్నారు. నేను ఒంటరివాణ్ణి. ఏం చేయగలను? వాళ్లు నన్ను తంతుంటే కొట్టువాడూ, దారిలో వెళ్తున్న ఇతరులూ నవ్వుతున్నారు. నన్నునేలమీద పడదోసి కొట్టారు. నేనేం మాట్లాడలేదు. వాళ్లు "తక్కువజాతి హిందువు" అన్నారు. "లంజకొడకా, నిన్ను చంపేస్తాం. మామసీదును కూల్చదోసి తప్పించుకు పోదామనుకుంటున్నావా? మీ అందర్నీ ఈదేశంనుంచీ తన్ని తగలేస్తాం" అన్నారు".

సురంజన్ నిశ్శబ్దంగా వింటున్నాడు. అతణ్ణి ఓదార్చుతూ రెండుమాటలు చెప్పాలనుకున్నాడుకానీ, మాటపెగల్లేదు. గౌతం గుండెకొట్టుకోవటం అతనికి తెలుస్తూనే ఉంది. తన గుండెకూడా అలాగే కొట్టుకుంటూందా? బహుశా అలాగే కొట్టుకుంది – కనీసం ఒకటి రెండుసార్లు.

నీల టీతీసుకువచ్చింది. వాళ్లు టీ తాగుతూ మాయను గురించి మాట్లాడుకున్నారు.

"నాకు మాయను గురించి చాలా ఆందోళనగా ఉంది. అవిడ అకస్మాత్తుగా జహంగీర్‌ను పెళ్లిచేసుకోవాలని నిర్ణయించుకుంటే ఏం చేయాలి?" "సురంజన్‌దా, మరీ ఆలస్యం కాకముందే ఈ విషయాన్ని ఆపు. ఇలాంటివాటిని గురించి నీకుబాగా తెలుసు..... పరిస్థితులు ఒత్తిడిచేసినప్పుడు మనం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటాం".

"చూద్దాం. నేను ఇంటికెళ్తూ దారిలో పరుల్ ఇంటినుంచీ మాయను మాఇంటికి తీసుకెళ్లటానికి ప్రయత్నిస్తాను. కానీ ప్రాణాలు కాపాడుకోవటానికి అవిడ ఫరీదా బేగంలాంటి ఏదో పేరుపెట్టుకున్నా పెట్టుకోవచ్చు. అలాచేస్తేమాత్రం అది స్వార్థమే."

తమ పరిస్థితిలోని నగ్నసత్యం నీలకళ్లలో ప్రతిబింబించింది. అలోక్ నిద్రపోయాడు. వాడి బుగ్గలమీద కన్నీరు చారికలు కట్టింది. పులోక్‌లేచి ఆందోళనగా అటూఇటూ పచారు చేస్తున్నాడు. అతని ఆందోళన కొద్దిగానైనా సురంజన్‌లోకి ప్రవేశించింది. ఇద్దరూ టీతాగటం మరిచిపోయారు. అది చల్లగా అయిపోయింది. టీరాక ముందు సురంజన్ దానికోసం ఎదురు చూస్తున్నాడు. ఇప్పుడు దానిసంగతే మరిచిపోయాడు. కోరికలు ఎలా క్రమక్రమంగా అణగారిపోతాయో ఆశ్చర్యంగా ఉంటుంది. అతనికి కళ్లుమూసుకొని ఆలోచించాలనిపించింది. ఈదేశం – ఎవరేం చెప్పినా – తన తాతముత్తాలది. అలాగే తన తండ్రిదీ, తనదీకూడా. కానీ తాను పరాయివాణ్ణని తనకే ఎందుకు అనిపిస్తోంది. ఈదేశంలో – తనదేశంలో – ఎందుచేత తనకు హక్కులులేవనిపిస్తోంది?

తనకు స్వతంత్రంగా మాట్లాడే హక్కులేదు. తన ఇష్టంవచ్చిన బట్టల్ని వేసుకునేహక్కులేదు. ఒక్కమాటలో చెప్పాలంటే తనకు ఇష్టంవచ్చినపని తాను ఏదీచేయలేదు. ఎప్పుడూ ఎవరో గొంతుపిసుకుతున్నట్టుగా అనిపిస్తుంది. అతనికే తెలియకుండా అతనిచేతులు గొంతుమీదికి వెళ్లాయి. చెమటకారిపోతోంది. గొంతుమీద

చేతులు బిగుసుకున్నాయి. ఊపిరి బయటికి పోతున్నట్టు అనిపించింది. గొంతుమీదినుంచి చేతులుతీసి సురంజిన్ గట్టిగా అరిచాడు, "పులోక్, నాకేంబాగాలేదు....."

పులోక్ నుదుటిమీద చెమట చుక్కలుచుక్కలుగా పొంగివచ్చింది. ఈచలికాలంలో చెమటేమిటి? సురంజిన్ తన నుదురు తడిమి చూసుకున్నాడు. తనక్కూడా చెమటపడుతుండటం గమనించి ఆశ్చర్యపోయాడు. అది భయమా? తమనెవరూ కొట్టటంలేదే? ఎవరూ గొంతు పిసకటంలేదే? మరి ఎందుకు అంత భయం కలుగుతోంది? ఎందుచేత తమ గుండెలు అంతవేగంగా కొట్టుకుంటున్నాయి?

సురంజిన్ ఫోన్ వద్దకెళ్లి దిలీప్‌డేకు ఫోన్ చేశాడు. దిలీప్‌డే సురంజిన్‌కు స్నేహితుడు. ఒకనాడు ప్రసిద్ధ విద్యార్థి నాయకుడు. అదృష్టవశాత్తు అతడు ఇంట్లోనే ఉన్నాడు. "ఎలా ఉన్నావు దాదా! ఏమైనా సమస్యొచ్చిందా?" అన్నాడు.

"సమస్యేంలేదు. కానీ ఎందుకో హాయిగా లేదు. నేనే ఎందుకు ఈ సమస్యల్ని ఎదుర్కోవాలనిపిస్తోంది. దేశం మొత్తం నాలాగే ఆందోళనపడుతూ ఉంది".

"ఔను".

"మువ్వెలా ఉన్నావు. చిట్టకాంగ్ పరిస్థితిని గురించి నీకు తెలిసే ఉంటుందను కుంటాను".

"ఏం జరుగుతోందక్కడ?"

"సందీప్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, కాలాపానియాలో రెండు, మగధ్‌రాయ్‌లో మూడు, ధూరియాలో రెండు, హారీష్‌పూర్‌లో ఒకటి, రహమత్‌పూర్‌లో ఒకటి, పశ్చిమ్‌షరైకైత్‌లో ఒకటి, మైత్‌భంగాలో ఒకటి – దేవాలయాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమ్ షరైకైత్‌లో సుచారుదాస్ అన్న వ్యక్తిని దయాదాక్షిణ్యాలు లేకుండాకొట్టి, అతని వద్దనుంచి పదిహేనువేల టాకాలు దోచుకున్నారు. టోకాటోలీలో ఇద్దరు కత్తిపోట్లకు గురయ్యారు. రెండు ఇళ్లు దోచుకోబడ్డాయి. పాటియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొచువా అన్నచోట ఒక ఇల్లూ, భతికైన్‌లో ఒక దేవాలయం...."

"ఈ వివరాలన్నీ ఎలా తెలుసుకోగలిగావు?"

"నేను చిట్టకాంగ్‌వాణ్ణేనని నువ్వు మరిచిపోతున్నావు. నేను సమాచారంకోసం అడక్కపోయినా అది నాదగ్గరికొస్తుంది. బక్షకాళీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాయిల్బెరీలో మూడు ఇళ్ళూ, పూర్వచంబల్‌లో మూడు ఇళ్ళూ ధ్వంసమయ్యాయి. సరఫ్‌భటా యూనియన్‌లో ఐదుఇళ్ళూ, పైరాయూనియన్‌లో ఏడు ఇళ్ళూ, షిలోక్ యూనియన్‌లో ఒక దేవాలయం, బాదంమోతీలో ఒక దేవాలయం పూర్తిగా ధ్వంసమయ్యాయి. బోరాలో ఒక దేవాలయాన్ని లూటీ చేశారు. బోల్‌గాంవ్‌లో నాలుగు దేవాలయాల్నీ, ఒక ఇంటినీ ధ్వంసంచేశారు. ఒెగోటాలో పదహారు ఇళ్లను నేలమట్టం చేశారు. బోల్‌కాళీలోని మేధస్‌ముని ఆశ్రమాన్ని తగలబెట్టారు".

"కైవల్యధామ్, తులసీధామ్, అభయమిత్ర సంస్థాన్, కాళీబారీ సంస్థాన్, పంచ నందనధామ్ – మొత్తం పదికాళీ దేవాలయాల్ని తగలబెట్టారని విన్నాను", అన్నాడు సురంజిన్.

"అంతేకాదు. సదర్‌ఘాట్ కాళీబారీ, గోల్‌పహోర్ సంస్థాన్ దేవాలయాలమీదకూడా దాడిచేశారట. జమాల్‌ఖాన్ రోడ్‌లోనూ, సిరాజుద్దౌలారోడ్‌లోనూ ఉన్న దుకాణాలను దోపిడీచేశారు. ఇనాయత్‌బజార్‌లోనూ, కె.సి.డే రోడ్‌లోనూ, బ్రిక్‌ఫీల్డ్‌రోడ్‌లోనూ ఉన్న హిందువుల దుకాణాలు దోపిడీలకు గురయ్యారు. కైవల్యధామ్ ప్రాంతంలోని మాలీషారాలో ముప్పైఎనిమిది ఇళ్ళూ, సదర్‌ఘాట్ జిలేషారాలో వందకంటే ఎక్కువ ఇళ్ళూ ధ్వంసమయ్యాయి. మీరేర్‌సరాయ్, సీతాకుండ మొహల్లాల్లో అత్యంతదారుణమైన లూటీలు జరిగాయి. మీరేర్‌సరాయ్‌కి చెందిన సత్‌బారీ గ్రామంలో డెబ్బై అయిదు కుటుంబాలు దిక్కులేనివారైపోయారు. మస్‌దియా యూనియన్‌లో పదికుటుంబాలు, హాదీనగర్‌లో నాలుగుకుటుంబాలూ నిరాశ్రయులైపోయారు. బిసరాత్‌లో మూడు దేవాలయాలను ధ్వంసంచేశారు. వాడేపూర్‌లో ఇరవైఇళ్ళూ, ఖజూరియాలో పదిఇళ్ళూ, జఫ్రాబాద్‌లో ఇరవై ఏడు ఇళ్ళూ దోపిడీల్లో నాశనమైపోయాయి. మురాద్‌పూర్ యూనియన్‌లో, మహేలంకలో, బరియా యూనియన్‌లో, బారబ్‌కుండ్‌లో, ఫరాద్‌పూర్‌లో ఎన్నో కుటుంబాలను లూటీచేశారు, దేవాలయాల్ని దోపిడీచేసి తగలబెట్టారు..."

"దిలీప్‌దా, ఇంకా ఎంతసేపు వినమంటావు? ఇంకావీటిని గురించి వినాలనిపించటంలేదు".

"ఏం సురంజన్ నీకు ఆరోగ్యం బాగాలేదా? నీగొంతు అదోలా ఉంది".

"నాకు నిజంగా తెలీదు".

ఫోను పెట్టేస్తుండగా పులోక్ దేవవ్రత్ ఎలా ఉన్నాడో కనుక్కోమన్నాడు. సురంజన్ దేవవ్రతకూ, మహాదేవ భట్టాచార్యకూ, అసిత్‌పాల్‌కూ, సుబల్‌ధర్‌కూ, మహాదేవీఘోష్‌కూ, కుంతలాచౌదరికీ, సరళ్‌డేకూ, రవీంద్ర గుప్తకూ, నిఖిల్ సన్యాల్‌కూ, నిర్మల్‌సేన్ గుప్తకూ ఫోన్ చేసి వాళ్ళు ఎలాఉన్నారో కనుక్కున్నాడు. వీళ్ళతో సురంజన్‌కు మంచి పరిచయం ఉన్నా వీళ్లతో అతడు మాట్లాడి ఎంతోకాలమైంది. ఇప్పుడూ వాళ్లకూ, అతనికీ మధ్య చిత్రమైన అనుబంధం ఏర్పడటాన్ని సురంజన్ గుర్తించాడు. మళ్ళీ ఫోన్ మోగింది. విసుగ్గా సురంజన్ రిసీవర్‌ను తీసుకున్నాడు. కాక్స్ బజారునుంచీ ఎవరో పులోక్‌తో మాట్లాడాలన్నారు. పులోక్ ఫోన్ అందుకొని మాట్లాడాడు.

"కాక్స్ బజార్‌లోని జమాతీ శిబిరంలో జాతీయపతాకాన్ని తగలబెట్టారట", అన్నాడు మాట్లాడటం పూర్తిచేసి.

ఆవార్త తన్ను కదిలించలేకపోయినందుకు సురంజన్‌కే ఆశ్చర్యం కలిగింది. తనకెంతో దుఃఖమూ, వ్యథా కలిగి ఉండవలసింది. కానీ జాతీయపతాకానికి జరిగిన అవమానం అతణ్ణి తాకనేలేదు. అది తన పతాకమేనా? అతనికి తాను అలా ఆలోచిస్తున్నందుకూడా చాలా ఆశ్చర్యం కలిగింది. అలా ఆలోచిస్తున్నందుకు తన్నుతాను మందలించుకున్నాడు. తాను అంత స్వార్థంగా ఎలా ఉండగలడు? కానీ అతని అనాసక్తి మాత్రం అతణ్ణి వదిలిపెట్టలేదు. ఎంతోకోపం రగలవలసిన అతనిలో ఎలాంటి సంచలనమూ కలగలేదు.

పులోక్ వచ్చి సురంజన్ పక్కలో కూచున్నాడు. "ఈరోజు ఇంటికి వెళ్లవద్దు. మాతోనే ఉండిపో. వీధిలోకెళ్తే ఏం జరుగుతుందో చెప్పలేం. ఈరోజుల్లో మనం ఎవరూ బయటికెళ్లకూడదు", అన్నాడు.

లుత్‌ఫార్ కూడా క్రితం రోజు సాయంకాలం ఇదే సలహా చెప్పాడు. కానీ ఇద్దరు చెప్పింది ఒకే సలహానే అయినా వాటి మధ్య ఎంతో తేడా కనిపించింది సురంజన్‌కు. పులోక్ సలహాలో నిజాయితీ కనిపిస్తే, లుత్‌ఫార్ సలహాలో అహంకారమూ, దర్పమూ కనిపించాయి.

"మనం మనదేశంలో ఇకమీదట ఉండలేం కాబోలు", అన్నది నీల నిట్టూరుస్తూ.

"ఈనాడు మనం భద్రంగానే ఉన్నాం. రేపు మనకు అపకారం జరగవచ్చు. మనం ఈ భయంకరమైన అస్థిరతలో బతకాలి. ఇలా అస్థిరత్వంలో బతకటంకంటే పేదరికంలో బతకటమే మేలనిపిస్తోంది", అందిమళ్లీ.

ఆరోజు రాత్రి అక్కడే ఉండిపొమ్మన్న పులోక్ సలహాను సురంజన్ అంగీకరించేవాడే. కానీ సుధామయ్, కిరణ్మయి ఒంటరిగా ఉన్నారని జ్ఞాపకం వచ్చింది. కాబట్టి ఇంటికి వెళ్లటానికే నిశ్చయించుకున్నాడు.

"తెగించి ఇంటికే వెళ్తాను. మహా అయితే ముస్లింలచేతిలో చనిపోయి మృతవీరుణ్ణి అవుతాను. ఎవరికీ అవసరంలేని ఈ శరీరాన్ని ఈదేశంలోని పువ్వులూ, ఆకులూ కప్పిపెడతాయి. కానీ సాధారణప్రజలు మాత్రం అది కేవలం కాకతాళీయమని మాత్రమే అంటారు. ఏమంటారు?" సురంజన్ బిగ్గరగా నవ్వాడు. కానీ నీల, పులోక్ చిరునవ్వుకూడా నవ్వలేదు.

వీధిలోకొచ్చిన సురంజన్‌కో రిక్షా దొరికింది. కానీ అప్పటికింకా రాత్రి ఎనిమిది గంటలే అయింది. అతనికి అప్పుడే ఇంటికి వెళ్లాలనిపించలేదు. చక్కని అమ్మాయిని పెళ్లిచేసుకొని సుఖంగా జీవితంలో స్థిరపడిపోయిన పులోక్ అదృష్టాన్ని తలుచుకొని సురంజన్ కొద్దిగా ఈర్ష్యపడ్డాడు.... తాను మాత్రమే జీవితంలో ఏమీ సాధించలేకపోయాడు. ఒక్కొసారి పెళ్లిచేసుకొని జీవితంలో స్థిరపడిపోవాలన్న ఆశకలుగుతుంది. పర్వీన్‌కు పెళ్లయిపోయిన తరువాత అలాంటి ఆలోచనలకు స్వస్తి చెప్పాడు. కానీ, రెండునెల్లక్రితం అతడు రత్నఅన్న అమ్మాయిని కలిశాడు. వాడిపోయిన పాతకోరికలు మళ్లీ మొలకెత్తాయి. కానీ తాను ఆవిడను ఎంతగా అభిమానిస్తున్నాడో ఆవిడకు చెప్పే సమయమూ, సందర్భమూ సురంజన్‌కు రాలేదు. అవకాశంవస్తే అతడు తనప్రేమను వ్యక్తంచేస్తాడనడానికి మాత్రం సందేహంలేదు.

వాళ్లు మొదటిసారి కలుసుకోగానే రత్న అడిగింది :

"మీరేం చేస్తారు?"

"ఏమీ చేయను".

"మీరు ఉద్యోగంలోకానీ, వ్యాపారంలోకానీ....లేరా?"

"లేను"

"మీకు రాజకీయాల్తో సంబంధం ఉండేదికదూ?"

"ఇప్పుడులేదు"

"మీరు యువజనసంఘం సభ్యులుగా ఉండేవారని ఎవరో అన్నారు".

"అవేవీ ఇప్పుడు నాకిష్టంలేదు".

"మీకు ఇప్పుడు ఏమంటే ఇష్టం?"

"తిరగటం. మనుషుల్ని కలుసుకోవటం".

"మీకు చెట్లూ, నదులూ అంటే ఇష్టంలేదా?"

"ఇష్టమే. కానీ మనుషులంటే ఎక్కువ ఇష్టం. ప్రతిమనిషిలోనూ ఏదో వైచిత్రి ఉంటుంది. నాకు మనుషుల మనసులోతుల్లోని భావాలను చదవటమంటే సరదా".

"మీరు కవిత్వం రాస్తారా?"

"లేదు. కానీ నాకు కొందరు కవిమిత్రులున్నారు".

"మీరు తాగుతారా?"

"అప్పుడప్పుడూ...."

"సిగరెట్లు మాత్రం బాగా కాలుస్తారుకదూ?"

"ఔను. కానీ నాదగ్గర నాక్కావాల్సినంత డబ్బులేదు".

"సిగరెట్లు తాగటం మంచిదికాదని మీకు తెలుసుననుకుంటాను".

"తెలుసు. కానీ దాన్నిగురించి నేను చేయగలిగిందేమీలేదు".

"మీరెందుకు పెళ్లి చేసుకోలేదు?"

"నన్నెవరూ కోరుకోలేదు".

"ఎవ్వరూనా?"

"ఒకరు కోరుకున్నారు... కానీ చివరికి ఆవిడ తెగించలేకపోయారు".

"ఎందుకూ?"

"ఆవిడ ముస్లింకావటంచేత. నన్ను "హిందువు" అంటారని మీకు తెలుసనుకుంటాను. హిందువును పెళ్ళిచేసుకోవటానికి ఆవిడ హిందువు కావాల్సిన అవసరంలేదు. కానీ నేను ఏ అబ్దుల్ సత్తారో కావాల్సిన అవసరం కలిగింది".

రత్న నవ్వింది.

"పెళ్లి చేసుకోకపోవటమే మంచిది. మనిషిజీవితం చాలా చిన్నది. అందుచేత దాన్ని ఎలాంటి బంధనాలూలేకుండా జీవించటమే మంచిది"

"అందుకేనా మీరూ పెళ్లిచేసుకోలేదు?"

"సరిగ్గా అందుకే".

"చాలా తెలివైనపని చేశారు".

"ఇద్దరికీ ఒకే దృక్పథం ఉందికాబట్టి మనస్నేహం చాలా దృఢంగా ఉంటుంది".

"నాదృష్టిలో స్నేహం చాలా విశాలమైంది. ఏవోకొన్ని అభిరుచులు కలిసినంత మాత్రాన స్నేహం కలిసిపోదు".

"మీస్నేహం సంపాదించాలంటే మిమ్మల్ని బతిమాలుకోవాలా?"

సురంజన్ నవ్వాడు.

"నాకు ఎప్పట్నుంచీ అంత అదృష్టం పట్టింది?" అన్నాడు.

"మీమీద మీకు చాలా తక్కువ విశ్వాసం ఉందనుకుంటాను".

"నాకు నామీద ఉండాల్సినంత నమ్మకం ఉందికానీ ఇతర్లమీద లేదు".

"నన్ను నమ్మటానికి ప్రయత్నించకూడదూ?"

ఆరోజు సురంజన్‌కు చాలా సంతోషం కలిగింది....

ఈరోజు ఆ అనుభూతిని జ్ఞాపకం చేసుకోవాలనుకున్నాడు. రత్నను తలుచుకోవాలనుకున్నాడు. తన్నుతాను ఉత్సాహపరుచుకోవటానికి అది అవసరమనిపించింది. ఈలోగా అతనికి నిరుత్సాహమూ, నిరాశాకలిగినప్పుడల్లా రత్నను జ్ఞాపకం చేసుకోవటం అలవాటు చేసుకున్నాడు. ఆవిడ ఎలా ఉందో? ఒకసారి – ఒకే ఒకసారి – అజీమ్‌పూర్ వెళ్లివస్తే? వెళ్లి ఆవిడ ఆరోగ్యం ఎలా ఉందని పరామర్శిస్తాడు. తన్ను చూడటం ఆవిడకు ఇబ్బందికరంగా ఉంటుందా? అతనికి ఏం చేయాలో అర్థంకాలేదు. ఇలాంటి సందర్భాల్లో హిందువులు ఒకర్నొకరు కలుసుకోవటం, ధైర్యం చెప్పుకోవటం, భద్రతను గురించి ఆలోచించటం వాస్తవమే. తన భద్రతను గురించి పరామర్శించటానికే తాను వచ్చాడని రత్న అనుకోదా? కాబట్టి తను ఆవిడ ఇంటికి వెళ్తే మరీ విచిత్రంగా ఉండకపోవచ్చు....

రిక్షా అతణ్ణి అజీమ్‌పూర్‌కు వెళ్లమన్నాడు. రిక్షా అటువైపు మళ్లగానే సురంజన్ ఆలోచనలుకూడా రత్నవైపు మళ్లాయి. ఆవిడ మరీ ఎత్తుగాలేదు. తన భుజాలవర్ద కూడా రాదు. ఆవిడ ఎర్రగా ఉంటుంది. ముఖం గుండ్రంగా ఉంటుంది. కళ్లు విచారంగా ఉంటాయి. అదే సురంజన్‌కు ఆశ్చర్యంగా ఉంటుంది. ఆ విచారం ఎందుకో అతనికి అర్థంకాదు. అతడు తన పాకెట్‌డైరీతీసి రత్న చిరునామాను మరోసారి చూసుకున్నాడు.

★ ★ ★

రత్న ఇంట్లోలేదు. ఎవరో ముసలతను కొద్దిగా తలుపుతీసి, "నీపేరేమిటి?" అన్నాడు.

"సురంజన్"

"ఆవిడ ఢాకాలో లేదు".

"ఎప్పుడెళ్లింది? ఎక్కడికి?" అన్నాడు సురంజన్. ఆవిడను గురించి తాను చూపిస్తున్న అతి ఉత్సాహం తలుచుకొని సురంజన్ కొద్దిగా సిగ్గుపడ్డాడు.

"సిల్హెట్"

"ఎప్పుడు తిరిగొస్తుందో మీకు తెలుసా?"

"లేదు"

ఉద్యోగం పనిమీద రత్న సిల్హెట్ వెళ్లిందా? లేదా అలా సరదాకి వెళ్లిందా? లేదా ఢాకానుంచీ పారిపోయిందా? లేదా ఎక్కడికీ వెళ్లనేలేదా? తన్ను వదిలించుకోవటానికి

సిల్హెట్ వెళ్లిందంటున్నారా? కానీ తాను తనపేరు చెప్పాడు. తనది నిస్సందేహంగా హిందూపేరే! కాబట్టి భయం అవసరంలేదు.' అజీమ్‌పూర్ వీధుల్లో నడుస్తూ ఉండగా సురంజన్ మనసులో ఇలాంటి భావాలు సందడి చేశాయి. అతడు హిందువని ఎవరూ గుర్తుపట్టలేదు. చాలామంది టోపీలు పెట్టుకున్నారు. కొందరు యువకులు వీధి మలుపుల్లో నిలబడి ఉద్రేకంగా చర్చించుకుంటున్నారు. మరికొందరు అలా తిరుగుతున్నారు. కానీ ఎవరూ సురంజన్‌ను గుర్తుపట్టలేదు. అతనికి ఆశ్చర్యమేసింది. వీళ్లలో ఎవరైనా తాను హిందువని గుర్తుపడితే తన్ను స్మశానానికి రవాణా చేస్తారు. అందుకు సందేహంలేదు. తన్నుతాను రక్షించుకోవటానిక్కూడా వీల్లేదు. మళ్లీ – గౌతమ్‌ను చూట్టానికి వెళ్లినప్పుడు జరిగినట్టుగానే – గుండె దడదడలాడటం ప్రారంభించింది. నుదుటిమీద చెమటపట్టింది. తాను తొడుక్కున్న పల్చని చొక్కాలోంచీ మంచులాంటిగాలి కత్తిలా కోస్తున్నా తన నుదుటిమీద చెమటపట్టటం అతనికి చిత్రమనిపించింది.

సురంజన్ అలాగే పలాశీ వరకూ నడిచాడు. అక్కడ నిర్మలేందు గూన్ గదికెళ్లి అతడు ఎలా ఉన్నాడో చూడాలనిపించింది. ఇంజనీరింగ్ యూనివర్శిటీలో నాలుగోతరగతి ఉద్యోగులకు కేటాయించిన ఇళ్లలో ఒకగది అద్దెకు తీసుకొని అతడు ఉంటున్నాడు. గూన్ అంటే సురంజన్‌కు చాలా గౌరవం. అతడు మంచి సంస్కారవంతుడు. తన అభిప్రాయాలను బయటికి చెప్పటానికి భయపడని ధైర్యశాలి. తలుపుతట్టగానే పన్నెండేళ్ల అమ్మాయి గభాలున తలుపుతీసింది. నిర్మలేందు శ్రద్ధగా టెలివిజన్ చూస్తూ కూచో అన్నాడు. సురంజన్‌ను చూడగానే "అడుగు పెట్టు నాదుపేద గుడిసెలోకి", అన్న టాగోర్ పద్యపాదాన్ని రాగయుక్తంగా పాడాడు.

"టీవీలో ముఖ్యమైన విషయాలేమైనా ఉన్నాయా?"

"నేను వ్యాపారప్రకటనలు చూస్తున్నాను. సన్‌లైట్ బాటరీలూ, జియా పట్టుచీరలూ, పెప్సొడెంట్ టూత్‌పేస్టూ – ఇలాంటివి. నేను హమద్‌నాద్, కురాన్‌వాణి లాంటివికూడా చూస్తాను". సురంజన్‌కు నవ్వాగలేదు.

"నువ్విలాగే పొద్దు గడుపుతావా? నువ్వు బయటికి వెళ్లలేదనుకుంటాను".

"ఓ నాలుగేళ్ల ముస్లిం అబ్బాయి మా ఇంట్లో ఉంటున్నాడు. మేము మాతిండి తిప్పలకు వాడిమీదనే ఆధారపడుతున్నాం. నిన్ననేను అషీం ఇంటికెళ్లాను. అతడు ముందునడిస్తే నేను వెనక నడుస్తూ వచ్చాను".

సురంజన్ మళ్లీ నవ్వాడు.

"నేను తలుపుతడితే ఎవరో అడక్కుండానే తెరిచారు. ఆ అబ్బాయి మరొకడా?"

ఈసారి గూన్ నవ్వాడు.

"రాత్రి రెండుగంటల ప్రాంతంలో కొంతమంది యువకులు ఊరేగింపుతీయాలని ప్రయత్నిస్తూ రోడ్డుమీద నిలబడిఉన్నారు. వాళ్లు హిందువుల్ని అవమానించటానికి ఏవినాదాలివ్వాలి – అని చర్చించుకుంటున్నారు. అకస్మాత్తుగా నేను "ఎవరక్కడ?" అని గట్టిగా అరిచాను. వాళ్లు నెమ్మదిగా వెళ్లిపోయారు. నాజుట్టునూ, గడ్డాన్నీచూసి

చాలామంది నన్ను మౌల్వీనని అనుకుంటారని నీకుతెలుసా?" అన్నాడు నవ్వుతూ.

"కవిత్వం రాస్తున్నావా?"

"ఎందుకు రాయాలి? అన్నీ మానేశాను".

"అజీమ్‌పూార్ మార్కెట్‌కు రాత్రిపూట పేకాటకు వెళ్తున్నావట. నిజమేనా?"

"అక్కడికెళ్లి కాస్సేపు గడుపుతాను. కానీ ఈలోగా వెళ్లటంలేదు."

"ఎందుకూ?"

"ఈలోగా మంచంకూడా దిగటంలేదు. బయటికి వెళ్తే వాళ్లు పట్టుకుంటారని భయం".

"టీ.వీ.లో ఏమైనా చూపిస్తున్నారా? అంటే – ఇక్కడ దేవాలయాల్ని ధ్వంసం చేయటంలాంటివి"

"అలాంటవేం చూపటంలేదు. మన టీ.వీ. చూస్తే మనదేశంలో మతసామరస్యం పొంగిపొర్లిపోతూ ఉందన్న అభిప్రాయం కలుగుతుంది. ఇక్కడ అల్లర్లేం జరగలేదనీ, అలాంటివి భారతదేశంలో మాత్రమే జరుగుతాయనీ అనుకుంటాం".

"భారతదేశంలో నాలుగువేలకు తక్కువకాకుండా మతకలహాలు జరిగాయని ఎవరో అన్నారు. కానీ భారతదేశంలోని ముస్లింలు దేశాన్ని వదిలి పారిపోవటంలేదు. కానీ బంగ్లాదేశ్‌లోని హిందువులు అలాకాదు. వాళ్లకు ఒకకాలు బంగ్లాదేశ్‌లో మరోకాలు భారతదేశంలో ఉన్నాయి. మరోరకంగా చెప్పాలంటే భారతదేశంలోని ముస్లింలు తమహక్కులుకోసం పోరాడుతున్నారు. కానీ బంగ్లాదేశ్‌లోని హిందువులు పారిపోతున్నారు".

"భారతదేశం లౌకిక దేశంకాబట్టి అక్కడ ముస్లిములు పోరాడగలుగుతున్నారు. కానీ ఇక్కడ అధికారం మతదురహంకారులచేతిలో ఉంది. ఇక్కడ హిందువులు పోరాడటం వీలుకాదు. ఇక్కడ హిందువులు ద్వితీయశ్రేణిపౌరులు మాత్రమే. వాళ్లెలా పోరాడగలరు?"

"వీటిని గురించి నువ్వెందుకు రాయకూడదూ?"

"అప్పుడప్పుడూ రాయాలనిపిస్తుంది. కానీ రాస్తే నేను భారతదేశం తరపున మాట్లాడుతున్నానని నిందలు వేస్తారుగా! నాకు ఎన్నో విషయాలను గురించి రాయాలనిపిస్తుంది. కానీ రాయను. రాస్తే మాత్రం ఏం లాభం?" గూన్ మళ్లీ టీ.వీ.వైపు తిరిగాడు.

గీత టీ తీసుకువచ్చింది. గూన్ అభిప్రాయాలు సురంజన్‌ను కలచివేశాయి. అందుచేత అతనికి టీ తాగాలనికూడా అనిపించలేదు. ఉన్నట్టుండి గూన్ నవ్వుతూ అడిగాడు :

"నువ్విలా తిరుగుతూ అందరి భద్రతను గురించీ తెలుసుకుంటున్నావు? నీ భద్రత సంగతేమిటి? నీకు ఉండాల్సినంత భద్రత ఉందా?"

"దాదా, నువ్వు పేకాటలో ఎప్పుడైనా గెలుస్తావా?"

"లేదు"

"మరెందుకు ఆడతావు?"

"ఆడకపోతే మా అమ్మనూ, నాన్ననూ వాళ్లు బూతులు తిడతారు. అందుకు."

సురంజన్ బిగ్గరగా నవ్వాడు. గూన్‌కూడా నవ్వాడు. అతనికి చక్కని హాస్యదృష్టి ఉంది. అతడు ఏ వాతావరణంలో అయినా హాయిగా ఉండగలడు. అతడు లాస్‌వేగాస్ కాసినోల్లో జూదమాడుతూ ఆ వాతావరణంలో కలిసిపోగలడు. పలాశీ మొహల్లోలోని మురికివాడలో దోమలతో దోస్తీ చేయనూగలడు. అతనికి ఎప్పుడూ ఏదీ పట్టదు. ఎప్పుడూ విసుగురాదు. ఈ ఇరుకుగదిలో తన జీవితాన్ని హాయిగానే గడిపేస్తాడు. అతనికి చిన్నచిన్న సుఖాలే పెద్ద సంతృప్తినిస్తాయి. అతడు అంత సంతోషంగా ఎలా ఉంటాడా అని సురంజన్ ఆశ్చర్యపోతుంటాడు. అతని హృదయంలో గూడుకట్టుకున్న దుఃఖాలకు అతని సంతోషం ముసుగు మాత్రమేనా? జీవితంలోని కటువైన సత్యాలను మరిచిపోలేక బలవంతంగా సంతోషం తెచ్చుకుంటున్నాడా?

సురంజన్ లేచి నిలబడ్డాడు. తన హృదయంలో నాటుకున్న దుఃఖం పెరుగుతోంది. బాధ అలా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుందా?

పలాశీ దాటుకొని తికాతులీ వైపుగా నడవటం ప్రారంభించాడు. తనవద్ద ఐదు టాకాలు మాత్రమే ఉండటంచేత రిక్షా ఎక్కకూడదని నిశ్చయించుకున్నాడు. పలాశీ చౌరస్తాలోకొచ్చి సిగరెట్ కొనుక్కోబోయాడు. ఒక "బంగ్లాఫైవ్" సిగరెట్టు ఇమ్మంటే సిగరెట్ బడ్డీవాడు అతనివైపు చిత్రంగా చూశాడు. సురంజన్ గతుక్కుమన్నాడు. కొట్టువాడు తాను హిందువునని గుర్తుపట్టాడా? బాబ్రీ మసీదును కూలదోసిన తరువాత హిందువు ఎవరు కనిపించినా తన్నవచ్చని అతనికి తెలుసా? త్వరత్వరగా సిగరెట్‌కు డబ్బుచెల్లించి ముందుకు నడిచాడు. తనకు అలా అనిపించినందుకు సురంజన్ ఆశ్చర్యపోయాడు. ఇంతకు ముందు ఎప్పుడూ అతనికి అలా అనిపించలేదు. సిగరెట్ వెలిగించుకోకుండా తాను వెళ్లిపోవటానికి కారణం తాను హిందువునని వాళ్లు గుర్తుపట్టటం ఇష్టంలేకనేనా?

ఫలానావ్యక్తి హిందువనో, ముస్లిం అనో అతని ముఖం మీద రాసి పెట్టి ఉండదు. కానీ తన వాలకాన్నో, నడకనో, మాటనో చూసి తాను హిందువని గుర్తుపట్టవచ్చని సురంజన్ భయపడ్డాడు. ఒళ్ళంతా చెమట పట్టింది. చొక్కా గుండీలు ఊడిపోయాయి. అలా చాలా దూరం పరుగెత్తాక ఒక వీధి మలుపులో నిలబడి ఒక్కక్షణం వెనక్కి తిరిగి చూశాడు. ఎవరూ కనిపించలేదు. తాను కారణం లేకుండానే అంత దూరం పరుగెత్తాడా? పట్టుకొమ్మన్నది తన్ను కాదా? ఇదంతా తన భ్రమేనా?

అప్పటికే చాలా ఆలస్యమై పోయి ఉండటం చేత సురంజన్ తలవాకిలి తట్టలేదు. తన గదితలుపు తెరుచుకొని లోపలికి వెళ్ళాడు. "భగవాన్...భగవాన్..." అన్న ఆర్తనాదం, మధ్యమధ్యలో ఏడుపూ వినిపించాయి. ఎవరో బంధువులో, లేక హిందూ స్నేహితులో వచ్చారని మొదట అనుకున్నాడు. ఆలోచిస్తూ నాన్నగారి గదిలోకి వెళ్ళాడు. కిరణ్మయి ఓ విగ్రహం ముందు మోకరిల్లి ప్రార్థిస్తోంది. దుఃఖంలో పూడుకుపోతున్న

కంఠంతో "భగవాన్...భగవాన్" అంటూ వేడుకొంటోంది. ఎదురుచూడని ఈ దృశ్యాన్ని చూసి సురంజన్ క్షణం పాటు కొయ్యబారి పోయాడు. అతనికి ఏంచేయాలో తోచలేదు. ఆ విగ్రహాన్ని పుచ్చుకొని బయటికి విసిరేయాలా? లేదా అక్కణ్ణుంచి కిరణ్మయిని దూరంగా లాక్కుపోవాలా? అతనికి ఆవిడ మోకరిల్లి అలాకూచో ఉండటం అసహ్యమనిపించింది.

సురంజన్ వంగి తల్లిని రెక్కపట్టుకొని పైకి లేపాడు.

"ఏమైంది నీకు? ఆ విగ్రహం ముందు ఎందుక్కూచున్నావ్? అది నిన్ను రక్షిస్తుందా?" అన్నాడు విసురుగా. కిరణ్మయి వెక్కి వెక్కి ఏడవటం ప్రారంభించింది. "మీనాన్నగారికి పక్షపాతం వచ్చింది. కాళ్ళూ చేతులూ పడిపోయాయి. మాట కూడా సరిగ్గా రావటం లేదు", అంది. సురంజన్ వెనక్కి తిరిగి నాన్నగారిని చూశాడు. అతడు మంచంమీద పడుకొని ఏదో వదురుతున్నాడు. సురంజన్ అతని పక్కనే కూచొని, అతని కుడిచేతిని చేతిలోకి తీసుకున్నాడు. అందులో ఎలాంటి స్పర్శా లేదు. అతని చేతిలో సుధామయ్ చెయ్యి వేలాడ సాగింది. పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో అర్థమైంది సురంజన్‌కు. తాతగారిక్కూడా దాదాపు ఇలాగే జరిగింది. డాక్టర్లు దాన్ని పక్షవాతం అన్నారు. తాతగారికి ఎన్నో మందు లిచ్చారు. ఫిజియోథెరపిస్ట్ వచ్చి అతని చేతులకూ, పాదాలకూ వ్యాయామం చేయించేవాడు. సుధామయ్ కిరణ్మయినీ, సురంజన్‌నూ శూన్యంగా చూస్తున్నాడు.

బంధువులెవరూ దగ్గరగా లేరు. తాను ఎవరి దగ్గరికెళ్ళాలి? వాస్తవానికి దగ్గరి బంధువులందరూ దేశంవదిలి వెళ్ళిపోయారు. సురంజన్‌కు దీనంగా, నిస్సహాయంగా అనిపించింది. కొడుకుగా తాను కుటుంబబాధ్యతను వహించాలి. కానీ తాను అప్రయోజకుడైన కొడుకు! ఇంతవరకూ తాను ఏదైనా నిర్మాణాత్మకమైన పని చేయాలన్న కోరికతో తిరుగుతూ ఉండిపోయాడు. కానీ ఏమీ చేయలేదు. ఉద్యోగంలో కానీ, వ్యాపారంలో కానీ కుదురుకో లేక పోయాడు. సుధామయ్ మంచాన పడితే తమకు తింటానికి తిండికూడా ఉండదు. తాము వీధుల్లో పడవలసిందే. అది జరక్క తప్పదా?

"కమాల్‌కానీ, ఇతరులు కానీ వచ్చారా?" "లేదు", అంది కిరణ్మయి, తల అడ్డంగా తిప్పుతూ, ఆశ్చర్యం! తానెలా ఉన్నాడో చూట్టానికి ఎవరూ రాలేదన్న మాట! తానుమాత్రం ఊరంతా తిరుగుతూ అందరిక్షేమ సమాచారము విచారిస్తున్నాడు. అందరూ బాగానే ఉన్నారు – తాను తనకు కుటుంబమూ తప్ప! పేదరికాన్నీ మరోకుటుంబం అనుభవించినట్టులేదు. జారిపోతున్న తండ్రి చేయి పట్టుకున్న సురంజన్‌ను అతని మీద గొప్ప జాలికలిగింది. తనకడ్డంగా కుప్పలు కుప్పలుగా పడుతున్న బాధల్ని భరించలేక తన తండ్రి పక్షవాతాన్ని కోరితెచ్చుకున్నాడా?

"మాయ తిరిగి రాలేదా?"

"లేదు"

"ఎందుకు రాలేదూ?" గట్టిగా అరిచాడు సురంజన్. ఈ అనుకోని ఆవేశాన్ని చూసి కిరణ్మయి తెల్లబోయింది. అతని ఇతరలోపాలెలా ఉన్నా అతడు ఏనాడూ

గొంతు పెద్దదిచేసి మాట్లాడలేదు. అతనిలో ఎందుకింత మార్పువచ్చింది? మాయ పరుల్ ఇంటికెళ్లటంలో తప్పేంలేదు. అంతేకాదు ఆవిడ అక్కడ క్షేమంగాకూడా ఉంటుంది.

సురంజన్ గదిలో అటూఇటూ తిరిగాడు. "ఆవిడకు ముస్లిములమీద అంతనమ్మకం దేనికి? ఆవిడను వాళ్లు ఎంతకాలం బతకనిస్తారు?"

కిరణ్మయి పూర్తిగా తెల్లబోయింది. ఒకవైపు సుధామయ్ చావుబతుకుల మధ్య ఉంటే సురంజన్ మాయ ముస్లింల ఇంట్లో తలదాచుకోవటాన్ని గురించి మాత్రమే ఆలోచిస్తున్నాడు.

మళ్లీ సురంజన్ గొణుగుతున్నాడు.

"ఇప్పుడు డాక్టర్ని పిలవాలి. వైద్యానికి డబ్బెవరిస్తారు? ఎవరో ఇద్దరు కుర్రవెధవలు బెదిరిస్తే పదిలక్షల విలువచేసే ఆస్తిని రెండులక్షలకు తెగనమ్మాడు. ఇలా – ఫకీరులా – జీవించటానిక అయనకు సిగ్గువేయటంలేదూ?"

"ఆకుర్ర వెధవలకోసమే అయన ఆ పనిచేశారంటావా? కోర్టు గొడవలు పడటం ఇష్టంలేక ఆపనిచేశారు", అంది కిరణ్మయి కాస్తకోపంగా.

సురంజన్ కోపంగా ఒక కుర్చీని తన్నాడు.

"మీకూతురు ఓ ముస్లింను పెళ్లిచేసుకోవటానికి వెళ్లిపోయింది. ఆ ముస్లింలు తన్ను గౌరవించి, తనకు కావాల్సిందంతా ఇస్తారని ఆవిడ అనుకుంటోంది. ఆవిడకు డబ్బుకావాలి డబ్బు...."

సురంజన్ బయటికి వెళ్లాడు. అదే మొహల్లాలో ఇద్దరు డాక్టర్లున్నారు. హరిపాదభట్టాచార్య తికాతులీ చౌరస్తాలో ఉంటాడు. అమ్జద్ హుసేన్ మరి రెండిళ్ల కవతల ఉంటాడు. ఎవర్ని పిలవాలి? సురంజన్ నిద్రలో నడిచినట్టుగా నడవసాగాడు. తాను మాయను ఎందుకు తిట్టాడు? ఇంటికి తిరిగి రాలేదనా? లేక ముస్లింలను నమ్ముతోందనా? తనలోకూడా మతతత్వంయొక్క లక్షణాలు ప్రారంభమౌతున్నాయా? తికాతులీ చౌరస్తా దగ్గరికి చేరేసరికి సురంజన్‌కు తన్నుగురించి సందేహాలు ప్రారంభమయ్యాయి.

# నాలుగవరోజు

హైదర్ సురంజన్ ఇంటికొచ్చాడు. అతడు సురంజన్ కుటుంబం ఎలా ఉందో తెలుసుకోవాలని మాత్రమే రాలేదు. కబుర్లు చెప్పుకుందామని వచ్చాడు. హైదర్ అవామీలీగ్ పార్టీతో ఉంటాడు. కొంతకాలం క్రితం సురంజన్ అతనితోకలిసి ఒక చిన్నవ్యాపారం ప్రారంభించాడు. అది అనుకున్నంతగా ముందుకు సాగకపోవటంచేత వదిలిపెట్టాడు. హైదర్‌కు ఇష్టమైన విషయం రాజకీయాలు. ఒకప్పుడు సురంజన్‌కు కూడా రాజకీయాలంటే ఇష్టమే. కానీ ఈలోగా ఆ ఆసక్తి పోయింది. ఎర్షాద్ ఏం చేశాడు? ఖలీదా ఏం చేస్తోంది? హసీనా ఏం చేస్తుంది? సుదీర్ఘమైన శాంతిముఖ్యంకానీ వీళ్లు ఏం చేశారన్నది ముఖ్యంకాదు. జాతీయమతంగా ఇస్లాంను గురించి హైదర్ వివరిస్తున్నాడు.

"అది సరేకానీ హైదర్, మీదేశానిక్కానీ, మీ పార్లమెంటుక్కానీ మతం ఆధారంగా ప్రజల్ని వేరువేరుగాచూసే హక్కు ఎవరిచ్చారు?" అన్నాడు సురంజన్, పరుపుమీద లేచి కూర్చుంటూ.

హైదర్ బల్లమీద కాళ్లుపెట్టి ఏదో పుస్తకంలో పేజీలు తిప్పుతూ కూచో ఉన్నాడు. సురంజన్ ప్రశ్నను విని పగలబడి నవ్వాడు.

"మీదేశం అంటావేం? ఇది నీదేశంకూడా కాదా?"

సురంజన్ ఎగతాళిగా నవ్వాడు. అతడు "మీదేశం" అన్నమాటను కావాలనే ఉపయోగించాడు.

"నేను నిన్ను కొన్ని ప్రశ్నలడుగుతాను. నువ్వు వాటికి సూటిగా సమాధానాలి స్తావనుకుంటాను".

హైదర్ బల్లమీదనుంచి కాళ్లుదించుతూ అన్నాడు. "నీప్రశ్నకు లేదు అన్నదే జవాబు. ఈదేశంలో వేరువేరు మతాలకు చెందిన ప్రజలను వేరువేరుగా చూడరు".

సిగరెట్ దమ్ము గట్టిగాలాగుతూ సురంజన్ మళ్లీ అడిగాడు, "ఈదేశానిక్కానీ, పార్లమెంటుక్కానీ ఒకమతంకంటే మరొకమతాన్ని ఎక్కువగాచూసి, పోషించే అధికారం ఉందా?"

"లేదు", అన్నాడు హైదర్ సంకోచంలేకుండా.

"ఏదేశంకానీ, పార్లమెంటుకానీ పాక్షికంగా ఉండవచ్చా?"

సురంజన్ మూడవప్రశ్న అడిగాడు. హైదర్ లేదన్నట్టు తల ఊపాడు.

"బంగ్లాదేశ్ రాజ్యాంగంలోని అత్యంతప్రధానమైన సూత్రం లౌకికవాదం. దాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు ఉందా?"

"నిశ్చయంగాలేదు". అన్నాడు హైదర్, సురంజన్ ప్రశ్నను శ్రద్ధగా విని.

"ప్రజల హక్కులు సమానంగా ఉన్నప్పుడే ఏదేశమైనా స్వతంత్రదేశం అనిపించుకుంటుంది. రాజ్యాంగ సవరణలపేరుతో మనం ఈపునాదినే కూలదోస్తున్నాంకదూ?"

హైదర్ సురంజన్‌ను అనుమానంగా చూశాడు. అతడు తమాషా చేస్తున్నాడా? జవాబు అప్పుడే చెప్పిన ప్రశ్నల్ని అతడు మళ్ళీమళ్ళీ ఎందుకు అడుగుతున్నాడు?

"ఇస్లాంను జాతీయమతంగా ప్రకటించిన తరువాత ముస్లింలుకానివాళ్లకు దేశం ఇచ్చే భరోసా పోయిందికదూ?" సురంజన్ ఆరవప్రశ్న అడిగాడు.

"నిజమే". హైదర్ కనుబొమలు ముడిపడ్డాయి.

ఇలా మాట్లాడుతున్న సురంజన్‌కూ, హైదర్‌కూ ఆ ప్రశ్నలకు జవాబులు తెలుసు. హైదర్‌కు ఈ సమస్యల్నిగురించి ఉన్న అభిప్రాయాలు తన అభిప్రాయాల వంటివేననికూడా సురంజన్‌కు తెలుసు. రాజ్యాంగచట్టం ఎనిమిదవసవరణను గురించి ఈ ప్రశ్నల్ని అడిగి హైదర్‌ను సురంజన్ ఇబ్బంది పెట్టటానికి కారణం అతనిలో మతతత్వభావాలు బయటికొస్తున్నాయా లేదా అని తెలుసుకోవటానికి మాత్రమే.

"చివరిప్రశ్న. బ్రిటిష్ పరిపాలన తరువాత భారతదేశం రెండు స్వతంత్రదేశాలుగా చీలిపోయింది. అది చాలా క్లిష్టమైన పరిణామమే. మళ్లీ ఈనాడు బంగ్లాదేశ్ ఎందుచేత రెండుజాతుల సిద్ధాంతంలో గందరగోళమైపోయింది. ఈ పరిస్థితులవల్ల ఎవరికి ప్రయోజనం?"

హైదర్ ఈసారి జవాబు చెప్పలేదు. సిగరెట్ వెలిగించి, గట్టిగా దమ్ములాగి వదిలాడు.

"ఒకేదేశం పరిధిలో రెండుజాతులో, రెండు తెగలో ఉండే సమస్యను జిన్నా పట్టించుకోలేదు. "ఈరోజునుంచీ అందరూ పాకిస్తానీలే. ప్రజలను హిందువులనో, ముస్లిములనో, బౌద్ధులనో, క్రైస్తవులనో వేరువేరుగా – వారిమతం ప్రాతిపదికగా – గుర్తించం", అనికూడా అతడు ప్రకటించాడు."

సురంజన్ నిటారుగా కూచున్నాడు.

"మనం పాకిస్తానీలుగానే ఇప్పటికంటే హాయిగా ఉండేవాళ్లంకదూ?"

హైదర్ ఉద్రేకపడ్డాడు. అకస్మాత్తుగా లేచి నిలబడి మాట్లాడసాగాడు.

"లేదు.... హాయిగా ఉండేదికాదు. మనం పాకిస్తానీలుగా ఉన్నంతకాలం మనకు ఎలాంటి ఆశలూ ఉండేవికావు. బంగ్లాదేశ్ అవతరించిన తరువాత – అది లౌకికరాజ్యంగా ఉంటుంది కాబట్టి – ప్రథమశ్రేణి పౌరులకు ఉండవలసిన హక్కులూ, సౌకర్యాలూ మనకందరికీ ఉంటాయని మనం నమ్మాం. కానీ బంగ్లాదేశ్ అవతరించాకకూడా మీకలలూ, కోరికలు తీరకపోయేసరికి మీరు బాధపడ్డారు'.

సురంజన్ పగలబడి నవ్వాడు.

"నువ్వుకూడా "మీకలలూ, మీకోరికలూ' అనాల్సివచ్చిందన్నమాట. "మీరు" అంటే ఎవరు? హిందువులేనా? ఇన్ని సంవత్సరాల అవిశ్వాసం తరువాత నువ్వు నన్ను హిందువుల్లో చేరుస్తున్నావన్నమాట", అన్నాడు నవ్వుతూనే.

సురంజన్ మంచంమీదనుంచి చివాలున లేచాడు. గదిలో అటూఇటూ తిర

గసాగాడు. భారతదేశంలో 650 మంది చనిపోయారు. పోలీసులు ఎనిమిదిమంది మతతత్త్వవాద నాయకుల్ని అరెస్టు చేశారు. వారిలో బి.జె.పి. అధ్యక్షుడు మురళీమనోహరజోషీ, ఎల్.కె. అద్వానీకూడా ఉన్నారు. బాబ్రీమసీదు విధ్వంసానికి నిరసన తెలుపుతూ భారత్‌బంద్ జరిగింది. బొంబాయిలో, రాంచీలో, కర్ణాటక, మహారాష్ట్రల్లో విస్తృతంగా అల్లర్లు జరిగాయి. హిందూ దురహంకారులపట్ల అసహ్యంతో సురంజన్ పిడికిళ్లు బిగిశాయి. తనకే శక్తి ఉంటే ప్రపంచంలో మూలమూలల్లో ఉన్న మతదురహంకారులందర్నీ వరసగా నిలబెట్టి కాల్చేసి ఉండేవాడు. "బాబ్రీ మసీదు విధ్వంసానికి భారతప్రభుత్వందే బాధ్యత.... కానీ భారతదేశప్రభుత్వంచేసిన తప్పుకు బంగ్లాదేశ్‌లోని హిందువులు శిక్ష అనుభవించాల్సిన అవసరంలేదు. మాకు ఈదేశంలోని హిందువులంటే ద్వేషంలేదు. ఇస్లాం సంప్రదాయాన్ని కాపాడుతూ మతసామరస్యాన్ని పాటిద్దాం", అని మతతత్త్వవాదులు ప్రకటనలు జారీచేస్తున్నారు. వాళ్ల ప్రకటనల్ని రేడియోలూ, టీవీ.లు ప్రసారం చేస్తున్నాయి. చిత్రమేమిటంటే ఈ ప్రకటనలు కేవలం ముసుగుగా మాత్రమే ఉపయోగపడుతున్నాయి. బాబ్రీ మసీదు కూల్చివేతకు నిరసనగా జరిగిన హర్తాల్లో నరకం కనిపించింది. విధ్వంసకారులు సృష్టించిన బీభత్సం కనీవినీ ఎరుగనిది. నిరసనపేరుతో 1971 లో హంతకులుగా పేరుపడ్డవీళ్లు ఘటక్‌దయాల్‌నిర్మల్ కమిటీ కార్యాలయానికీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకూ నిప్పుపెట్టారు. అంతెందుకూ? జమాత్-ఎ-ఇస్లామీ ప్రతినిధి వర్గం బి.జె.పి. నాయకుల్నే కలిసింది. వాళ్లు ఏం చర్చించారు? ఏం కుట్రలు పన్నారు? సురంజన్ ఈ ప్రశ్నలకు సమాధానాలు ఊహించటం ప్రారంభించాడు. మొత్తం భారత ఉపఖండమంతా మతంపేరుతో అల్లర్లు జరుగుతున్నాయి. అల్పసంఖ్యాక ప్రజల్ని హింసలు పెడుతున్నారు. తానుకూడా మైనారిటీకి చెందిన వాడేకాబట్టి మైనారిటీల పరిస్థితి అతనికి బాగా అర్థమౌతుంది. బోస్నియాలో, హెర్జగోవినాలో జరుగుతున్న అక్రమాలకు బంగ్లాదేశ్‌లోని క్రైస్తవుల్ని బాధ్యుల్ని చేయటానికి వీల్లేదు. అలాగే భారతదేశంలో హిందువులు ముస్లిములమీద చేస్తున్న దౌర్జన్యాలకు బంగ్లాదేశ్‌లోని హిందువుల్ని తప్పుపట్టి లాభంలేదు. ఈసరళమైన తర్కాన్ని ఎవరికి చెప్పగలడు? ఎవరు వింటారు?

"కానీ....కానీ.... త్వరగా సిద్ధంకా. మతసామరస్యంకోసం ఏర్పాటుచేస్తున్న మానవశృంఖల - హ్యూమన్ చైన్ - లో పాల్గొందాం", అన్నాడు.

"మానవశృంఖల! జాతీయ ఐక్యతా, సమష్టిగా అందరూ పంచుకొన్న భవిష్యత్ దృక్పథమూ సాధించిన ఫలితాలే స్వాతంత్ర్యమూ, దానిచుట్టూరా అల్లుకున్న కలలూ, దేశస్వాతంత్ర్యాన్నీ, సార్వభౌమాధికారాన్నీ రక్షించుకోవటానిక్కూడా సౌభ్రాతృత్వం అవసరమైంది. అందుచేత మతతత్త్వ, ఫాసిస్టుశక్తులకు వ్యతిరేకంగా పోరాడటం కోసమూ 1971 లో ఒక ఉద్యమం ప్రారంభమైంది. జాతీయసమైక్యతామండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సౌభ్రాతృత్వానికి పిలుపునిచ్చి ప్రపంచశాంతికోసం ప్రయత్నాలుకూడా జరిగాయి. ఈ సమైక్యతామండలే ఇప్పుడు మానవశృంఖల కట్టటానికి పిలుపునిచ్చింది".

"దానికీ, నాకూ ఏమిటి సంబంధం?" అన్నాడు సురంజన్.

"అంటే – దానికీ నీకూ సంబంధమేమీ లేదంటావా?" హైదర్ ఆశ్చర్యపోయాడు.

"లేదు", అన్నాడు సురంజన్ నింపాదిగా.

నిలబడి ఉన్న హైదర్ ఆశ్చర్యంతో కుంగిపోయి, కుర్చీలో కూలబడిపోయాడు. మరో సిగరెట్ వెలిగించి, "ఒకప్పు టీ తీసుకొస్తావా?" అన్నాడు.

"ఇంట్లో పంచదారలేదు", అన్నాడు సురంజన్ పరుపుమీద వాలుతూ.

మానవశృంఖల బహదూర్‌షాపార్క్‌నుంచీ జాతీయపార్లమెంటు భవనంవరకూ ఏర్పాటౌతుంది. పదకొండుగంటలనుంచీ ఒంటిగంటవరకూ – మానవ శృంఖల ఏర్పాటుకోసం – ఆదారిలో వాహనాలనుకూడా వెళ్లనీయటంలేదు. హైదర్ మరికొన్ని వివరాలు చెప్పబోయాడుకానీ సురంజన్ అతణ్ణి మధ్యలోనే ఆపి ప్రశ్నించాడు, "నిన్న అవామీలీగ్ సమావేశంలో హసీనా ఏం. చెప్పింది?"

"అంటే శాంతిసమావేశంలోనా?"

"ఔను".

"మతసామరస్యం కాపాడటంకోసం ప్రతిప్రాంతంలోనూ శాంతిదళాల్ని ఏర్పాటు చేయాలని చెప్పింది".

"ఇది హిందువుల్ని – అంటే మమ్మల్ని – రక్షిస్తుందా? మమ్మల్ని ప్రాణాల్తో వదిలిపెడతారా?"

జవాబు చెప్పకుండా సురంజన్‌ని హైదర్ పరీక్షగా చూశాడు. ఆరోజు సురంజన్ గడ్డం గీచుకోలేదు. తలదువ్వుకోలేదు..... హైదర్ మాటమార్చాడు.

"మాయ ఏదీ?"

"నరకానికి పోయింది".

హైదర్ దిమ్మతిరిగిపోయాడు. నెమ్మదిగా తేరుకొని దాన్ని చమత్కారంగా మార్చాలని ప్రయత్నించాడు.

"నరకం ఎలా ఉంటుందో చెప్పగలవా?"

"పాములూ, తేళ్లూ పీకుతుంటాయి. మంటలు నిన్ను మాడ్చుతుంటాయి. క్రమక్రమంగా బూడిదైపోతావు. కానీ చావురాదు".

"బ్రహ్మాండం! నరకాన్ని గురించి నాకంటే నీకే ఎక్కువ తెలుసు".

"తప్పకుండా! మంటలమధ్యలో ఉన్నది మేమేకదా?"

"ఇల్లు ఇంత నిశ్శబ్దంగా ఉందేం? మీ అమ్మా, నాన్నా ఏరీ? వాళ్లని ఎక్కడికైనా పంపావా?"

"లేదు"

"మరోసంగతి గమనించావా సురంజన్? బాబ్రీమసీదు సమస్యను అడ్డంపెట్టుకొని జమాతీలు *గులాం ఆజం వివాదానికి కొత్తరంగులు పులుముతున్నారు".

---

* గులాం ఆజం బంగ్లాదేశ్‌లో రాజకీయ ఆశ్రయంకోరిన పాకిస్తానీ రాజకీయ నాయకుడు. చాలా వివాదాస్పదమైన వ్యక్తి. అతడు బంగ్లాదేశ్‌లో జాతీయవ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నాడనీ, లేదనీ భేదాభిప్రాయాలున్నాయి.

"కావచ్చు. గులాం ఆజంను గురించి మనిద్దరి అభిప్రాయాలూ వేరువేరుగా ఉంటాయి. అతణ్ణి ఉరితీసినా, తీయకపోయినా నాకు ఒకటే".

"నువ్వు చాలా మారిపోయావు".

"హైదర్! ఖలీదా బాబ్రీమసీదును పునర్నిర్మాణంచేయాలని డిమాండ్ చేస్తోంది. ఇక్కడ దేవాలయాల్ని పునర్నిర్మించే విషయాన్ని గురించి ఎందుకు మాట్లాడదు?"

"దేవాలయాల్ని పునర్నిర్మించాలని నీ ఉద్దేశమా?"

"దేవాలయాలన్నా, మసీదులన్నా నాకు ఆసక్తి ఎంతమాత్రంలేదని నీకుతెలుసు. కానీ కొత్తగా పునర్నిర్మించే సమస్యవస్తే అది మసీదులకే ఎందుకు పరిమితంకావాలి?"

హైదర్ మరో సిగరెట్ వెలిగించాడు. బయట మానవశృంఖలకు ఏర్పాట్లు జరుగుతోంటే సురంజన్ ఎందుకు ఇల్లువదిలి రానంటున్నాడో హైదర్‌కు అర్థంకాలేదు. ఇదే సంవత్సరం మార్చి 26 న ప్రజాకోర్టు ఏర్పాటుచేసినప్పుడు సురంజనే వెళ్ళి హైదర్‌ను నిద్రలేపాడు. ఆరోజు భోరున వర్షం కురుస్తోంది. హైదర్‌కు ఆవర్షంలో బయటికి రావాలనిపించలేదు. "నువ్వుకూడా ఇంట్లోనే ఉండిపో. "మురీ" చేయించుకు తిందాం", అన్నాడు హైదర్. కానీ సురంజన్ ససేమిరా ఒప్పుకోలేదు. "మనం తప్పకుండా పాల్గొనాలి. మనం వెనక్కు వెళ్ళిపోతే అంతా పాడైపోతుంది", అన్నాడు లేచినిలబడుతూ. అలా ఆరోజు గాలినీ, వాననూ లక్ష్యంచేయకుండా వెళ్ళారు. ఈరోజు అదే సురంజన్ సభలన్నా, సమావేశాలన్నా అనాసక్తిగా ఉన్నాడు. "ఈమానవ శృంఖల ఒక పనికిమాలిన ప్రహసనం మాత్రమే", అంటున్నాడు.

తొమ్మిది గంటలనుంచీ పదకొండుగంటలదాకా హైదర్‌ను ఒప్పించటానికి ప్రయత్నించాడు. కానీ ఫలితం లేకపోయింది.

★ ★ ★

కిరణ్మయి పరుల్ ఇంటినుంచి మాయను తీసుకొచ్చింది. రాగానే మాయ నాన్నగారి ఎదమీద తలపెట్టి ఏడవటం ప్రారంభించింది. సుధామయ్ ఆవిడను ఓదార్చలేకపోయాడు. కానీ పక్కగదిలోఉన్న సురంజన్ కోపంతో మండిపోతున్నాడు. అతనికి అర్థంలేని కన్నీళ్ళంటే అసహ్యం. కన్నీళ్ళు ఈ ప్రపంచంలో ఏమైనా సాధించాయా? ఇప్పుడు కావలసింది కన్నీళ్ళుకాదు, వైద్యం. డా. హరిపాద చెప్పిన మందుల్ని మూడురోజులకు సరిపోయేలా తీసుకొచ్చాడు. కిరణ్మయి బీరువాలో సురంజన్‌కు తెలియకుండా ఇంకాకొన్ని మందులు ఉండవచ్చు.

సురంజన్ కోపంలో అతనంటే అతనికే ఉన్న జాలికలిసి ఉంది. తనకు ఉద్యోగం సద్యోగం లేదుకాబట్టి తనంటే ఇంట్లో ఎవరికీ లక్ష్యంలేదని అతని అభిప్రాయం. అతడు స్థిరంగా ఒక ఉద్యోగంలో నిలబడలేకపోయాడు. ఇతరుల క్రింద పనిచేయటం అతనికి ఇష్టంలేదు. ఇంతకుముందు హైదర్‌తో తనకున్న వ్యాపారసంబంధాలను పునరుద్ధరించుకోవాలా లేదా అని ఆలోచిస్తుండగా సురంజన్‌కు చాలా ఆకలి అనిపించింది. మళ్ళీ అతనిలో తనంటే తనకున్న జాలి పొంగివచ్చింది. ఈ పొద్దులో

తిండికోసం ఎవర్నడగాలి? అతని తల్లికానీ, చెల్లెలుకానీ తనకు ఆకలిగా ఉందోలేదో తెలుసుకోవటానికి తనగదిలోకికూడా రాలేదు. తాను భోజనం సంగతి అడగనిమాట నిజమే. కానీ తనకు ఉద్యోగంలేనంతమాత్రాన, తాను సోమరి అయినంతమాత్రాన వాళ్ళు తాను తిన్నాడోలేదో పట్టించుకోవాల్సిన అవసరంలేదా?

ఈరోజు అతడు నాన్నగారిని వెళ్లి చూళ్లేదు. కుటుంబంలోని ఇతరుల్తో అతనికున్న సంబంధానికి అదో చిహ్నంకూడా. తాను తన కుటుంబానికి చేసింది ఏమీలేదు. కుటుంబంనుంచీ ఆశించిందే ఎక్కువ. అతని దినచర్యకో క్రమం, పద్ధతీలేవు. అందులో ముఖ్యమైన భాగం స్నేహితుల్తో, పరిచయస్తుల్తో పనీపాటాలేకుండా తిరగటం మాత్రమే. ఇంట్లో అయితే పూర్తి నిర్లక్ష్యం, నిరాదరణ. రాజకీయంగా తాను పార్టీ నిబంధనల్ని పాటించాడు. మార్క్స్, లెనిన్ చెప్పిన సిద్ధాంతాలను ఒక్కోసారి గుడ్డిగా నోటికి నేర్చుకున్నాడు. అది తనకూ, తన కుటుంబానికీ ఏం పనికొచ్చింది?

హైదర్ వెళ్లిపోయాడు. తనకు హాయిగానే ఉంది. తనకు పూర్తిగా రాజకీయాల్లోంచీ వైదొలగాలని లేదుగానీ ఈ మానవశృంఖలలో పాల్గొనటంమాత్రం ఇష్టంలేదు. ఈలోగా తాను అనుభవిస్తున్న తీవ్రమైన ప్రత్యేకతాభావాన్ని ఈ మానవశృంఖల తొలగించలేదనిపించింది. అతని అనిశ్చితత్వమూ, కోపమూ తన విశ్వాసరాహిత్యంలోంచీ ఎక్కువగా ఉద్భవిస్తున్నాయన్నది స్పష్టంగానే కనిపిస్తోంది.

హైదర్, తానూ చాలాకాలంగా స్నేహితులే. వాళ్లు తమ సుదీర్ఘ స్నేహజీవితంలో తార్కిక ఆలోచన ప్రయోజనాలనుగురించీ, హేతువాదబుద్ధినిగురించీ, మానవుని ఆత్మచైతన్యాన్నిగురించీ చర్చించుకునేవారు. వీళ్లిద్దరూ కలిసి తమ జాతీయవారసత్వాన్ని కాపాడుకోమని సాటిపౌరులకు విజ్ఞప్తి చేసేవారు. మానవహక్కులకోసం పోరాడేవారు. ఈనాడు సురంజన్‌కు అవన్నీ నిరర్థకమనిపిస్తున్నాయి. అపనులు చేయటంకంటే తప్పతాగి తందనాలాడే జీవితం గడిపిఉంటేనో, అలాంటి ఇతర సుఖాల్లో తేలియాడి ఉంటేనో లేదా బాధ్యతగలిగిన కుటుంబసభ్యుడుగా బతికిఉంటేనో తనజీవితానికి సార్థకత ఉండేది. ఆదర్శవాదమే దీనికంతకూ కారణం. అదే తనకు అనవసరమైన కష్టాలనూ, ఆందోళననూ తీసుకువచ్చింది! ఇలా ఆలోచిస్తూ సిగరెట్ వెలిగించాడు సురంజన్. టేబిల్‌మీద ఉన్న ఒక పుస్తకం అతనిదృష్టిని ఆకర్షించింది. దాన్ని అతడు అంతకు ముందెప్పుడూ చూళ్లేదు. అది 1990లో జరిగిన మతకలహాలను గురించిన పుస్తకం. తక్షణం అందులో లీనమైపోయాడు సురంజన్.

★ 1990 వ సంవత్సరం అక్టోబర్ 30 వ తేదీ రాత్రి ఒంటిగంట సమయం. పంచనందనధామ్‌లోని ఆశ్రమవాసులు దగ్గరౌతున్న ఊరేగింపులో వినిపిస్తున్న నినాదాలు విని నిద్రలేచారు. ఊరేగింపులోనివాళ్లు మెయిన్‌గేట్‌ను పగలగొట్టి లోపలికొచ్చారు. మరికొందరు ప్రహరీగోడను కూలదోసిలోపలికొచ్చారు. ఆశ్రమవాసుల్ని తిట్టి, ఆశ్రమంలోని పందిరిమీద కిరోసిన్‌పోసి దాన్ని తగలబెట్టారు. ఒకటితరువాత ఒకటిగా ఆశ్రమంలోని విగ్రహాలను ముక్కలుచేశారు. చివరికి సాధుబాబా సమాధిమీదున్న బృందావనాన్నికూడా ముక్కలుచేశారు. ఆశ్రమంలోఉన్న

మతగ్రంథాలనన్నిటినీ బూడిదచేశారు. ఆశ్రమంలోనే ఉన్న సంస్కృతభాషా పరిషత్ గ్రంథాలయంలోని విలువైన గ్రంథాలనుకూడా తగలబెట్టారు. దొరికిన డబ్బునుకూడా దోచుకుపోయారు. అదేరోజు అర్ధరాత్రి దాదాపు 2500 సాయుధులైన వ్యక్తులు సదర్‌ఘాట్ కాళీబారీమీద దాడిచేశారు. గర్భగుడిలోకి జొరబడి విగ్రహాలను పగలగొట్టారు. ఛత్తేశ్వరీ మాయామందిరాన్ని లూటీచేసి, ధ్వంసంచేశారు. గోల్‌పహార్‌లోని స్మశానవాటికను బుగ్గిచేశారు. స్వాసనకాళీ విగ్రహాన్ని పగలగొట్టారు. అక్టోబర్ 30 వ తేదీ రాత్రి వాయిస్ ఆఫ్ అమెరికా వార్తవిని రెచ్చిపోయిన కొందరు కైవల్యాశ్రమంమీద దాడిచేశారు. ఆశ్రమంలోని ప్రతిగదినీ ధ్వంసం చేశారు. విగ్రహాలను పగలగొట్టారు. ఆశ్రమవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చుట్టుపట్ల ఉన్న కొండల్లోకి పారిపోయారు. పారిపోలేకపోయిన వారిని ఇనుపచువ్వలతో కొట్టారు. దేవాలయం ఈదాడిలో బాగా దెబ్బతింది. హారగారీ దేవాలయంలోకూడా ఇలాగే జరిగింది. విగ్రహాలను ధ్వంసం చేశారు. విలువైన వస్తువుల్ని దోచుకొని పోయారు. ప్రాచీనమైన పవిత్రగ్రంథాలను తగలబెట్టారు. దేవాలయంచుట్టూరా ఉన్న ప్రాంతం ధ్వంస మైపోయింది. ఆప్రాంతంలోని ప్రజలంతా నిరాశ్రయులైపోయారు. ఆరాత్రే ఛత్తేశ్వరీ రోడ్‌లోని కృష్ణగోపాలస్వామి దేవాలయాన్ని దోచారు. రెండుకిలోల వెండీ, 250 గ్రాముల బంగారమూ, విలువైన ఒక విగ్రహమూ, మరికొన్ని వస్తువులూ పోయాయి. గేటువద్ద ఉన్న విలువైన గోవుశిల్పం, చుట్టూరా ఉన్న పైన్ వృక్షాలూకూడా ఆదాడిలో ధ్వంసమయ్యాయి. బహదూర్‌హాత్‌లోని ఇలియాస్‌కాలనీ స్మశానభూమి అయిపోయింది. ఆకాలనీలోని హిందువుల ఇళ్లన్నీ దోపిడీకి గురయ్యాయి. ఆప్రాంతంలోని ప్రజల్ని – ఆడామగా తేడాలేకుండా – చావగొట్టారు.

★ చిట్టగాంగ్‌లోని అనేక ప్రాంతాల్లో దోపిడీలూ, గృహదహనాలూ పెద్ద ఎత్తున జరిగాయి. కాలేజీరోడ్‌లోని దశభుజ దుర్గా దేవాలయంకూడా దోపిడీకీ, విధ్వంసానికీ గురైంది. కోర్బానీ గంజ్‌లోని వరదేశ్వరీ కాళీమందిరం, చక్‌బజారులోని పరమహంస మహాత్మా నరసింగమందిరం, ఉత్తరఛాంద్‌గాయ్‌లోని బర్నాకాళీబారీ, దుర్గాకాళీబారీ, సదర్‌ఘాట్‌లోని సిద్ధేశ్వరీ కాళీమందిరం, దేవన్‌హాత్‌లోని దేవానేశ్వరీ కాళీమందిరం, కత్‌ఘర్‌లోని ఉత్తర ఫతంగనరంస్థాన కాళీమందిరం, తూర్పు మోతేర్‌బారీలోని మగధేశ్వరీ విగ్రహం, రక్షాకాళీమందిరం, మోతుల్ గంజ్‌లోని మిలన్ పరిషత్ భవనం, టైగర్‌పాస్‌లోని శివ, విష్ణుదేవాలయాలూ, సదర్‌ఘాట్‌లోని రాజరాజేశ్వరీ దేవాలయం, జలాలాబాద్‌లోని కాళీబారీ, దుర్గామందిరం, నపితపారాలోని శాసనమందిరం, కటుల్‌గంజ్‌లోని కారుణ్యామయి కాళీమందిరం, చంద్రగాంవ్‌లోని జైకాళీమందిరం, నజీర్‌పారాలోని దయామయి కాళీమందిరం, మగధేశ్వరీ దేవాలయం, బ్రహ్మమయి కాళీమందిరం, బారాబజార్‌లోని శ్రీకృష్ణమందిరం..... ఇలా ఎన్నో దేవాలయాలు నేలమట్టమయ్యాయి. హిమాంశదాస్, సతీంద్రదాస్, రామమోహనదాస్, చండీచరణ్‌దాస్‌లకు చెందిన

శివాలయాలు ధ్వంసమయ్యాయి. నందన్‌కానన్‌లోని తులసీధామ మందిరం, పోర్ట్ ఏరియాలోని దక్షిణ హోలిష్ హరార్ మందిరం, గోల్‌పహార్ మహా సంస్థాన్, జలేషారా కాళీమందిరం, మెడికల్‌కాలేజీరోడ్‌లోని ఆనందమాయి కాళీమందిరంకూడా ధ్వంసమయ్యాయి.

★ సత్కానియా కాళీమందిరం, జగోనియా దుర్గామందిరం, దక్షిణకంచరాలోని చండీమంటపం, మగధేశ్వరీ ఆలయం, దక్షిణచార్తీలో, చార్తీలో, మటియాడంగాలో, బజాలియాలో ఉన్న కాళీమందిరాలు నేలమట్టమయ్యాయి. పశ్చిమ మతియాదంగాలోని జలకుమారీ దేవాలయం, బడోనాలోని కృష్ణదేవాలయం, బజాలియాలోని దుర్నిగర్ మహాబోధి ఆలయం, కోడూర్‌ఖిల్‌లోని మిలన్‌మందిరం, కృష్ణదేవాలయం, అబూర్‌దండీలోని జగదానందమిషన్, పశ్చిమషక్‌పురాలోని మగధేశ్వరీ మందిరం, కోడూర్‌ఖిల్‌లోని జగద్ధాత్రీ మందిరం, కోక్ దండియాలోని రుషిగ్రామం, విగ్రహమందిరం, సత్కానియాలోని జగన్నాధమందిరం, దక్షిణపారాలోని బ్రహ్మాదంగా కాళికాలయం కూలిపోయాయి.

★ దాదాపు వందమంది మతోన్మాదులు మీర్జాపూర్‌లోని జగన్నాధాలయంమీద దాడిచేశారు. ఈదాడి రాత్రి 11 గంటలకు జరిగింది. విగ్రహాలను ధ్వంసం చేశారు. విలువైన నగలను దోచుకుపోయారు. మరుసటిరోజు ఆదేవాలయంపై కప్పుకు నిప్పుపెట్టారు. ఈగుంపునుచూసి పోలీసులు తోకముడిచారు. మళ్లీ ఫిర్యాదుచేస్తే ఫిర్యాదులోనే లోపాలున్నాయని దాన్ని పట్టించుకోలేదు. ఆరోజు సాయంకాలమే నలభై అయిదుమంది సాయుధులైన గూండాలు నిస్సహాయులైన గ్రామస్తులమీద దాడిచేశారు. వాళ్లు పారిపోయారు. ఆగుంపు ఇళ్లనూ, గుళ్లనూ స్వేచ్ఛగా దోచుకున్నారు. విగ్రహాలను ముక్కలు చేశారు. విలువైన వస్తువుల్ని దోచుకొనిపారిపోయారు.

★ చందనైష్ సబ్‌డివిజన్‌లో హరిమందిరంలోని విగ్రహాలను సాయుధులైన గూండాలు ధ్వంసంచేశారు. జగన్నాధుని రధాన్నికూడా ముక్కలుచేశారు. ధోరోకల్ యూనియన్‌లో మాతృమందిరాన్నీ, రాధాగోవిందమందిరాన్నీ వీళ్లే కూలదోశారు. రాత్రి 12 గంటలకు 400 మంది కోడుర్‌కిల్ యూనియన్ ప్రాంతంమీద దాడిచేసి హిమాంశుచౌదరి, పరేశ్‌బిశ్వాస్, భూపాల్‌చౌదరి, ఫణీంద్రచౌదరి, అనుకూల్‌చౌదరిగార్ల కుటుంబాలకు చెందిన దేవాలయాలను ధ్వంసం చేశారు. బన్‌షోలీ ఉపజిల్లాలోని ప్రాచీనమైన రుషిధామ్ ఆశ్రమాన్ని పూర్తిగానేలమట్టం చేశారు. ఆశ్రమంలోని గదులన్నిటినీ కూలదోశారు. గ్రంధాలయాన్ని బూడిదచేశారు.

★ అక్టోబర్ 31 వ తేదీన సీతాకుండలోని జగన్నాధ ఆశ్రమాన్ని మతతత్వవాదులు ముట్టడించి, ధ్వంసంచేశారు. బట్టలాలో 200 ఏళ్లక్రితం నిర్మించిన కాళీమందిరం మీద దాడిచేశారు. ఆ విగ్రహంతలను పగలగొట్టేశారు. వెండీ, బంగారం నగలను దోచుకుపోయారు. బార్‌సరత్ గ్రామంలో హిందువులు అధికసంఖ్యాకులుగా ఉండేవారు. నవంబర్ మొదటితేదీన రెండుమూడు వందలమంది ఆ గ్రామంమీద

దాడిచేసి సర్వం దోచుకుపోయారు. తాము తీసుకుపోలేక పోయిన వస్తువుల్ని తగలబెట్టారు. వాళ్లు వెళ్లిపోతూ ఆగ్రామవాసులు 10 వ తేదీలోగా దేశాన్ని వదిలి పారిపోవాలని హెచ్చరించారు. అలా వెళ్లిపోకపోతే మరింత భయంకరమైన దాడి జరుగుతుందని బెదిరించారు. గొర్రెల్నీ, పశువుల్నీ చంపేశారు. గరిసెలను తగలబెట్టారు. దాదాపు 4000 మంది హిందువులు చాలా నష్టపోయారు. దాదాపు ముప్పాతిక ఇళ్లు కాలిపోయాయి. ఎన్నో గొర్రెల్ని, పశువుల్ని చంపేశారు. చాలామంది స్త్రీలను మానభంగం చేశారు. మొత్తం నష్టం దాదాపు పాతిక మిలియన్లటాకాలు. దాదాపు 200 మంది దుండగులు లాఠీలూ, ఇనుపచువ్వలూ పట్టుకొని వచ్చి సత్‌బారియా గ్రామదేవత ఆలయంమీద దాడిచేసి, అందులోని విగ్రహాలను ధ్వంసం చేశారు. ఈ విధ్వంసాన్ని గురించి తెలిసిన పక్కగ్రామంలోని ప్రజలు ఊరువదిలి పారిపోయారు. వాళ్లలో చాలామంది చుట్టుపట్ల ఉన్న అడవుల్లో తలదాచుకున్నారు. దుండగులు ప్రతిఇంటినీ దోచారు. దుర్గామందిరాన్ని నేలమట్టం చేశారు. ఖజారియా అన్న పక్క గ్రామానిక్కూడా ఇదే గతిపట్టింది. రైతులు సర్వం పోగొట్టుకున్నారు. శైలేన్‌కుమార్ అన్న వ్యక్తియొక్క భార్యకు నిప్పంటించారు. ఆమె ఒళ్లంతా కాలిపోయింది. అక్కడే శివాలయంలో ప్రార్థనచేసుకుంటున్న భక్తుల్ని, ఈ దుండగులు ఇబ్బందులు పెట్టారు, తిట్టారు. విగ్రహాలను పగలగొట్టారు. వెళ్లేముందు వాటిమీద అందరూ ఉచ్చపోశారు....

సురంజన్ కళ్లు బైర్లుకమ్మాయి. ఆ దుండగులు తన ఒంటిమీద ఉచ్చబోసినట్లుగా అనిపించింది. అసహ్యంతో ఆపుస్తకాన్ని విసిరిపారేశాడు.

★ ★ ★

తనచేత వ్యాయామం చేయించి, తన ఆరోగ్యం కుదుటపడేలా సాయం చేయటాన్ని డా. హరిపాద కిరణ్మయికీ, మాయకూ నేర్పించాడు. ఫిజియోథెరపీవల్లా, మందులవల్లా అతని ఆరోగ్యం కుదుటపడటం ప్రారంభించింది. కానీ అతడు మామూలు మనిషికావటంమాత్రం సాధ్యంకాదు. ఈవిషయం అందరికంటే ఎక్కువగా మాయను బాధపెట్టింది. నాన్న అలా పడకమీద కొయ్యమొద్దులా పడిఉండటం చూసేసరికి మాయ ఉత్సాహమంతా నీరుకారిపోయింది. "మాయా....మాయా...." అని అతడు బాధతో మూలిగినప్పుడల్లా ఆవిడ భయపడిపోయేది. తనతండ్రి – తన తండ్రినీడ – అలా నిశ్చేతనంగా పడుకోఉన్నా అతని గాజుకళ్లు ఏమో చెబుతున్నట్టుగా మాయకు అనిపించేది.

తనతండ్రి తన్ను ఎప్పుడూ నిటారుగా, నిర్భయంగా, నిజాయితీగా ఉండమని చెబుతుండేవాడు, తానుకూడా ఎంతో నిజాయితీగా ఉండేవాడు. అతని నిజాయితీ అతని బలహీనతలా ఒక్కోసారి కనిపించేది. తన్ను హద్దుల్లో పెట్టాలని ఎవరైనా విమర్శిస్తే సహించేవాడుకాదు. తమకూతురికి పెళ్లీడు వచ్చిందనీ, దానిపెళ్లినిగురించి ఆలోచించాలనీ కిరణ్మయి అప్పుడప్పుడూ జ్ఞాపకం చేస్తూ ఉండేది. కానీ సుధామయ్ అంగీకరించేవాడుకాదు. "లేదు.... మాయ ఇంకా చదువుకోవాలి.... ఉద్యోగం సంపాదించుకోవాలి.... అప్పుడు అవసరమనుకుంటే పెళ్లిచేసుకోవచ్చు", అనేవాడు.

పరేనన్నట్టుగా కిరణ్మయి భుజాలెగరేసేది – వాదించటం ఇష్టంలేక. తరువాత మాయను కలకత్తాలో ఉన్న మేనమామగారింటికి పంపటాన్నిగురించి ప్రస్తావించేది. ఇది ఆమె మాటిమాటికీ ఎత్తే విషయం: అంజలీ, ఆభా, నీలిమ, శివానీ మాయ ఒకే ఈడువాళ్లే. వీళ్లంతా పైచదువులకు కలకత్తాకే వెళ్లారు. మనంకూడా మాయను అక్కడికే పంపుదాం – అనేది. కానీ సుధామయ్ గట్టిగా వ్యతిరేకించేవాడు. "కలకత్తాకు ఎందుకెళ్లాలి? ఈదేశంలో చదువును రద్దుచేసేశారా? స్కూళ్లూ, కాలేజీలూ మూసేశారా?" అనేవాడు.

"మన అమ్మాయికి వయసొచ్చింది. రాత్రిపూట నాకు నిద్రపట్టటంలేదు. అది కాలేజీకి వెళ్తుంటే వాళ్లు అల్లరిపెట్టరూ?" అనేది కిరణ్మయి.

"ముస్లిం అమ్మాయిల పరిస్థితీ అలాగే ఉందిగా? ముస్లిం అమ్మాయిలు మానభంగాలకూ, అపహరణలకూ గురికావటంలేదా?"

"మీరు చెబుతోంది నిజమే....కానీ...."

మాయను గురించి తనకున్న ప్రణాళికను తనభర్త ఎంతమాత్రమూ అంగీకరించడని కిరణ్మయికి క్రమక్రమంగా అర్థమైంది. తనపెద్దల ఆస్తి పోయి ఉండవచ్చు. కానీ ఈదేశంలో నిలబడటానికి చోటులేకపోలేదు. ఈమాత్రం తన భర్తకుచాలు. అతడు అంతటితోనే సంతృప్తిపడతాడు. నిజం చెప్పాలంటే కలకత్తాకు వెళ్లాలన్న ఉత్సాహాన్ని మాయ ఎప్పుడూ చూపించలేదు. అవిడ ఒకే ఒకసారి కలకత్తాలో ఉన్న అత్తయ్యావాళ్ల ఇంటికి వెళ్లింది. ఆ ప్రయాణం అవిడకు అంతగా నచ్చలేదుకూడా. ఆఇంట్లోని పిల్లలుకూడా అవిడకు నచ్చలేదు. వాళ్లు చాలా పొగరుగా ప్రవర్తించారట. వాళ్లు మాయతో కలుపుగోలుగా ఉండలేదట. అందుచేత మాయ ఎక్కువకాలం ఒంటరిగానే గడపవలసివచ్చేదట. బంగ్లాదేశ్‌లోని తమ కుటుంబాన్ని గురించి ఆలోచిస్తూ కూచునేదిట. అవిడ దసరా సెలవులదాకా ఉండాలనే కలకత్తా వెళ్లింది. కానీ సెలవులు రావటానికి ఎంతో ముందుగానే తాను బంగ్లాదేశ్ వెళ్లిపోతానని మామయ్యతో అంది.

"అక్కయ్య నిన్ను దసరాకు ఇక్కడే ఉండాలని పంపింది", అంది అత్తయ్య.

"నాకు ఇంటికి వెళ్లాలనిపిస్తోంది", అంది మాయ, కళ్లనిండుగా నీళ్లుపెట్టుకొని. దుర్గాపూజాకాలంలో కలకత్తా ఎంతో సరదాగా ఉంటుంది. దీపాలూ, సాంస్కృతిక కార్యక్రమాలూ ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఇవేవీ మాయను ఆకర్షించలేదు. కలకత్తా అంటే ఇష్టపడి మాయ అక్కడే ఉండిపోవటానికి ఒప్పుకుంటుందనుకుంది కిరణ్మయి. కానీ మాయ వెళ్లిన ఏడురోజులకే తిరిగొచ్చేసింది....

నాన్నగారి తలవద్దకూచొని జహంగీర్‌ను గురించి ఆలోచిస్తోంది మాయ. పరుల్ ఇంటినుంచీ రెండుసార్లు ఫోన్‌లో అతనితో మాట్లాడింది. అతనిలో ఇంతకు ముందున్న ఉత్సాహం కనిపించలేదు. అమెరికాలో అతనికో మామయ్య ఉన్నాడనీ, అతడు పై చదువులకోసం అమెరికాకు వెళ్లాలనుకుంటున్నాడనీ అర్థమైంది. తాను అమెరికాకు వెళ్లటంకోసం ఏర్పాట్లు చేసుకుంటున్నాననికూడా జహంగీర్ చెప్పాడు. మాయ దిమ్మెరపోయింది. అవిడకు గట్టిగా అరవాలనిపించింది.

"నిజంగానే వెళ్లిపోతున్నావా?" అంది ఎంతో కష్టంమీద తన్నుతాను సంబాళించుకొని.

"భలేదానివే. వెళ్తోంది అమెరికాకు కదా? తప్పకుండా వెళ్తాను". అన్నాడు జహాంగీర్.

"వెళ్లి అక్కడేం చేస్తావ్?"

"కొంతకాలం అదీ ఇదీ చేస్తాను - పౌరసత్వం వచ్చేవరకూ".

"అంటే తిరిగిరావా?"

"తిరిగొచ్చి ఏం చేయాలి? బుద్ధిసరిగ్గా ఉన్నవాడెవడైనా ఈదిక్కుమాలిన దేశంలో ఉండగలడా?"

"ఎప్పుడెళ్తున్నావ్?"

"వచ్చేనెలలో వెళ్తున్నాను. బాబానన్ను ఇక్కణ్ణుంచీ పంపేస్తున్నాడు. నేను స్థానిక రాజకీయాల్లో కూరుకుపోతానని అతడు భయపడుతున్నాడు".

"అలాగా!"

తాను వెళ్లిపోతే ఆవిడ ఏంచేస్తుందని జహాంగీర్ మాయను ఒక్కమాటకూడా అడగలేదు. మాయతనతోబాటు రావాలనుకుంటున్నాడా? లేక తాను తిరిగివచ్చేవరకూ ఎదురుచూడాలనుకుంటున్నాడా? నాలుగు సంవత్సరాల తమ ప్రేమానుబంధాన్నీ, రెస్టారాలలోతాము తీరిగ్గా కూర్చొని చేసిన చర్చల్నీ, క్రెసెంట్ లేక్‌గట్టుమీద కూచొని తమపెళ్లినిగురించి మాట్లాడుకున్న మాటల్నీ జహాంగీర్ మరిచిపోవాలనుకుంటున్నాడా? అతని అమెరికా ప్రయాణంకలలు వీటిని నిజంగానే మరిపిస్తున్నాయా? జీవితాన్ని గురించి అతడు కనే పగటికలలు ఎదుట ఉన్న మాయలాంటి విలువైన బహుమతిని మరిచిపోయేలా చేస్తున్నయా? సుధామయ్ పక్కనే కూచోఉన్న మాయకు ఈవిషయాలు వద్దన్నా జ్ఞాపకం వస్తున్నాయి. జహాంగీర్ జ్ఞాపకం వస్తున్నాడు. ఎంతప్రయత్నించినా మరుపురావటంలేదు. అలా మాయబాధలకు పక్షవాతంలో దాదాపుగా కుంగిపోతున్న అవిడనాన్నగారి బాధలు జతకలిశాయి.

కిరణ్మయి బాధమరింతలోతైంది. దానికి ఉపశమనంకూడా లేదు. అర్ధరాత్రిపూట అకస్మాత్తుగాలేచి ఏడుస్తుంది. తాను ఎవరికోసం ఏడుస్తోందో, ఎందుకు ఏడుస్తోందో చెప్పదు. కన్నీరు ఎండిపోయిన తరువాత మళ్లీ ఇంటిచాకిరీలో మునిగిపోతుంది - వండటం, వార్చటం, భర్త స్నానపానాలకు అన్నీ సిద్ధం చేయటం ........

పాపిటలో సిందూరం పెట్టుకోవటాన్ని కిరణ్మయి ఎప్పుడో మానేసింది. అందరూ హిందూ ఇల్లాళ్లలాగా ఆమె మట్టెలూ, గాజులూకూడా ధరించటంలేదు. 1971 లో వీటన్నిట్నీ సుధామయ్ మానేయమని చెప్పాడు. ఎంతోబాధపడ్డాక 1975లో వీటిని ఉపయోగించడం మానేసింది కిరణ్మయి. సుధామయ్‌కూడా తనకెంతో ఇష్టమైన ధోవతిని మానేశాడు. ఆరుఖలీఫావద్దకెళ్లి పైజమాలు కుట్టించుకున్నాడు. ఆరోజు ఇంటికొచ్చి తలనొప్పిగా, జ్వరంగా ఉందన్నాడు సుధామయ్. ఆందోళన కలిగినప్పుడల్లా అతనికి అలా అనిపిస్తుందని కిరణ్మయికి తెలుసు.

★ ★ ★

సురంజన్ ఇలాంటి సమయంలోకూడా కుటుంబంలో అంటీ అంటనట్టుగా

ఉండటం మాయకు ఆశ్చర్యంగా ఉంది. అర్థంకాకుండాగూడా ఉంది. రోజంతా తనగదిలోంచి బయటికిరాడు. తిండంటే ఆసక్తిలేదు. ఆకలిగాఉన్నా అన్నంపెట్టమని అడగడు. రోజురోజుకి చావుకు దగ్గరౌతున్న రోగిష్టితండ్రినికూడా అతడు పట్టించుకోవటంలేదు. అతని స్నేహితులు సరాసరి అతని గదిలోకే వెళ్తారు. వాళ్లు బిగ్గరగా చర్చించుకుంటారు. అకస్మాత్తుగా, ఎవరితోనూ చెప్పకుండా ఇంట్లోంచీ బయటికి వెళ్తాడు. ఎప్పుడు తిరిగొస్తాడో తెలియదు. అతనికేం బాధ్యతలేదా? మాయచాలా బాధతో ఆలోచించసాగింది. అతణ్నెవరూ డబ్బు అడగటంలేదు. కానీ ఒకకొడుకుగా తండ్రిని గురించి శ్రద్ధతీసుకోవాల్సిన బాధ్యత అతనికి లేదా? మందులు కొనుక్కురావచ్చు. డాక్టర్ను తీసుకురావచ్చు. కనీసం నాన్నగారి పక్కనకూచొని ధైర్యం చెప్పవచ్చు. తనకొడుక్కు తనమీద శ్రద్ధ ఉందని చూపించుకోవటానికైనా అతడు అప్పుడప్పుడూ తన దగ్గరికొచ్చి కూచోవాలని సుధామయ్ ఆశిస్తున్నాడని అందరికీ తెలుసు.

డా. హరిపాద వైద్యం ఫలితంగా సుధామయ్ బాగా కోలుకున్నాడు. ఇప్పుడతని మాట తక్కువగా తడబడుతోంది. కానీ పక్షవాతంసోకిన కాలూ, చేయి ఇంకా ఆడటంలేదు. క్రమం తప్పకుండా వ్యాయామంచేస్తే అతని ఆరోగ్యం తప్పకుండా మరింత బాగుపడుతుందని చెప్పాడు. అతణ్ణి కంటికిరెప్పలా చూసుకుంటూ, ఎప్పుడూ అతని పక్కనే ఉంది మాయ. ఆవిడకు ఇప్పుడు ట్యూషన్లు లేకపోవటంచేత నాన్నగారితోనే ఉండగలుగుతోంది. మాయవద్దకు ట్యూషనుకు వచ్చిన చిట్టచివరి అమ్మాయిపేరు మినాతి. ఒకరోజు ఆ అమ్మాయి అమ్మవచ్చి ఇకమీదట మినాతి ట్యూషనుకురాదనీ, భారతదేశానికి వెళ్లిపోతోందనీ చెప్పింది.

"భారతదేశానికెందుకూ?" అందిమాయ.

మినాతీ అమ్మ విషాదంగా చిరునవ్వు నవ్విందేకానీ జవాబు చెప్పలేదు....

మాయకు మరో విషయం జ్ఞాపకం వచ్చింది.

మినాతీ బికరున్నీసా పాఠశాలలో చదువుతుండేది. ఒకరోజు మాయ ఆఅమ్మాయికి లెక్కలు పాఠం చెబుతోంది. ఆ అమ్మాయి లెక్కలు చేస్తూ "అల్‌హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీ....అర్రహీం....." అంటూ గొణుగుతోంది.

"ఏమిటి నువ్వు అంటున్నది?" అంది ఆశ్చర్యంగా మాయ.

"ఏం? మేము మాబళ్లో ప్రార్థన సమావేశాల్లో "సురా" చదువుతాంకదా!" అంది.

"నిజమా?"

"రెండు సురాలు చదువుతాం. ఆతరువాత జాతీయగీతం పాడతాం."

"సురా చదువుతున్నప్పుడు మీరేం చేస్తారు?"

"మేమూ చదువుతాంగా. నేనుకూడా తలమీద ముసుగు వేసుకుంటాను".

"హిందువులకూ, బౌద్ధులకూ, క్రైస్తవులకూ ప్రార్థనలేదా?"

"లేదుగా".

మాయచాలా ఆశ్చర్యపోయింది. రాజధానీ నగరంలో ఉన్న అత్యంత ప్రసిద్ధమైన బడిఅది. అందులో అన్ని మతాలవారి ప్రార్థనలకూ అవకాశం లేకపోవటం అవినీతిగా అనిపించింది మాయకు.... అవిడకు మరో అమ్మాయికూడా జ్ఞాపకంవచ్చింది. ఆవిడపేరు సుమయా. ఆవిడ పరుల్‌కు బంధువుకూడా. ఒకరోజు ఆ అమ్మాయి అకస్మాత్తుగా మాయతో ఇలా అంది, "దీదీ, నేను రేపట్నుంచీ మీ వద్దకు ట్యూషన్‌కు రాను".

"ఎందుకూ?" అంది మాయ.

"నాన్నగారు ముస్లింటీచర్ని చూస్తానని చెప్పారు".

"అలాగా!"

ఇలా మాయ దగ్గరికి ట్యూషనుకొస్తున్న ఇద్దరు విద్యార్థులూ వెళ్లిపోయారు. అనవసరంగా ఆందోళన పడతారని ఈవిషయాన్ని మాయ ఇంట్లో ఎవరితోనూ చెప్పలేదు. సురంజన్ తన అలవాటు ప్రకారం తనకు కావాల్సిన డబ్బు కిరణ్మయిని అడిగితీసుకునేవాడు. మాయకూడా అలాచేస్తే కిరణ్మయి ఎలా నెట్టుకురాగలదు?

కిరణ్మయి వంటింట్లో అన్నమూ, పప్పూ వండుతోంది. ఆవిడ సుధామయ్‌కోసం కాస్త "సూప్", పళ్లరసంకూడా తయారుచేయాలి. కానీ పళ్లెవరు తెస్తారు? తాను సహాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిసికూడా పడకమీదనుంచి లేవని కొడుకును తలుచుకుంటే ఆవిడకు కోపంగా ఉంది. కారణంవేరు కానీ మాయకుకూడా సురంజన్ అంటే కోపంగానే ఉంది. 7 వ తేదీనాడు తాము తలదాచుకోవటంకోసం ఒక ఆశ్రయంచూడమని అతణ్ణి తాను వేడుకుంది. కానీ సురంజన్ కాలుకదల్చలేదు. వాళ్లింకా ప్రమాదంలోనే ఉన్నారు. కానీ తన అప్రయోజకపు అన్నయ్య చేస్తున్నదల్లా సోమరిగా తిరగటం మాత్రమే. అన్నయ్య సోమరితనం, నిర్లక్ష్యం, అనాసక్తి మాయలోకూడా నిరాశనూ, నిస్పృహనూ కలగజేసాయి. దీనికి కుటుంబాన్ని కమ్ముకున్న నిరాశా, నిస్పృహతోడయ్యాయి. అందుచేత మాయ తమకుటుంబాన్ని ఈ సంకటపరిస్థితిలోంచీ రక్షించే మార్గాలకోసం వెదకటం మానుకుంది. ఆవిడ క్రమక్రమంగా నిరుత్సాహంగా తయారైంది. తమ కుటుంబ క్షేమాన్ని గురించీ, భద్రతను గురించీ సురంజనే పట్టించుకోనప్పుడు తానేం చేయగలదు? పరుల్ ఇంట్లోకూడా తనకు హాయిగాలేదు. పరుల్ సందేహంలేకుండా మంచి స్నేహితుడే. తాము వాళ్లింటికి వెళ్తే ఎందుకొచ్చావని ఎవరూ ఎప్పుడూ ప్రశ్నించలేదు. కానీ ఈసారి వాళ్లింటికి వెళ్లినప్పుడు వాళ్ల చూపులు అలాలేవు: వాళ్లకు ఎంతోబాగా తనతో పరిచయం ఉన్నా ఈసారి తన్ను వాళ్లు పరాయివ్యక్తిని చూసినట్టే చూశారు. "ఇక్కడి కెందుకొచ్చావ్?" అన్నట్టుగా ఉన్నాయి వారిచూపులు. ఎక్కువరోజులు ఉండటానికి తమ ఇల్లు అంత భద్రమైనచోటుకాదని పరుల్‌కూడా చెబుతుండేవాడు.

ఎంతచిత్రం? పరుల్‌కో, అలాంటివారికో రాని భద్రతసమస్య తనకే ఎందుకురావాలి? తమ ఇంట్లో తలదాచుకోవటానికి పరుల్ ఎప్పుడైనా వస్తాడా? అలాంటి పరిస్థితి వస్తుందా? మాయకు సందేహం కలిగింది.

ఒకసారి పరుల్ బంధువులెవరో అడిగారు.

"నీపేరు?"

"మాయ".

"పూర్తిపేరు?"

అక్కడే ఉన్న పరుల్ తొందరగా ఈసంభాషణలోకి జోక్యం చేసుకొని ఆవిడపేరు జకియాసుల్తాన్ అని చెప్పాడు. ఆ తరువాత అలా మాయపేరు ఎందుకు దాచాల్సివచ్చిందోకూడా చెప్పాడు.

"వాళ్లు మాలాంటి వాళ్లుకాదు... ఒకరకంగా వాళ్లు పెద్ద మౌల్వీలు. వాళ్లు మేము హిందువులకు ఆశ్రయం ఇస్తున్నామని బయటికెళ్లి అందరితో చెప్పినా ఆశ్చర్యంలేదు", అన్నాడు.

"ఓ....."

మాయ ఈ సమస్యను తన స్నేహితుని దృక్పథంనుంచీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నించింది. హిందువులకు ఆశ్రయం ఇవ్వటం నేరమా? ఎంతోకాలం ఆవిడను ఆందోళనపెడుతున్న సమస్య ఇప్పుడు సరైనరూపాన్ని తీసుకుంటోంది. అసలు హిందువులు ఎందుకు ఇతరుల ఆశ్రయం కోరాలి? మాయ తన పరీక్షల్ని డిస్టింగ్షన్‌లో పాసయింది. ఇంటర్మీడియట్‌లో ఆవిడకు ప్రత్యేక గుర్తింపుగా ఇచ్చే "స్టార్" మార్క్‌కూడా వచ్చింది. పరుల్ సెకండ్‌క్లాస్‌లో మాత్రమే పరీక్షపాసయ్యాడు. కానీ అనేక సందర్భాల్లో పరుల్‌కున్న అవకాశాలూ, ఆదరణలూ తనకు లేకపోయాయి....

"బాబా, వేళ్లు ముడుచుకో. చేతులెత్తటానికి ప్రయత్నించు".

సుధామయ్ చిన్నపిల్లవాడిలాగా, వినయంగా ప్రయత్నించాడు. అతని వేళ్ళకు కాస్త బలం రావటంచూసి మాయకు ఎంతో సంతృప్తి కలిగింది. నాన్నగారి చేతుల్ని తనచేతుల్లోకి తీసుకుంది.

"అన్నయ్య అన్నం తినడా?"

"ఎవరికి తెలుసు? ఇప్పుడే చూశాను – నిద్రపోతున్నాడు!", సురంజన్ యోగక్షేమాలు కిరణ్మయికి బొత్తిగా పట్టినట్టులేదు.

కిరణ్మయికూడా అన్నం తినలేదు. కానీ మాయకోసం అన్నంతీసి పక్కనపెట్టి ఉంచింది. మాయకు నిద్రముంచుకొస్తోంది. కళ్లుమూతలు పడిపోతున్నాయి. కానీ మూసిన తలుపుల్లోంచీ, కిటికీల్లోంచీ చీకటి గుయ్యారంలాంటి గదిలోకి నినాదాలహోరు జొరబడటంతో నిద్రపారిపోయింది. "బ్రతకాలంటే హిందువులారా! ఈదేశాన్ని వదిలిపొండి", అన్నకేకలు వినిపిస్తున్నాయి. సుధామయ్‌కూడా ఈకేకల్ని విన్నాడు. మాయచేతిమీద – తిరిగి వస్తున్న శక్తికి నిదర్శనంగా అతని వేళ్లు బిగిశాయి.

ఆకలితో సురంజన్ కడుపులో పేగులు లుంగలు చుట్టుకుంటున్నాయి. ఇంతకు ముందు – అతడు తిన్నా తినకపోయినా – ఒకగిన్నెలో అన్నం అతనికోసం డైనింగ్‌టేబిల్‌మీద ఎప్పుడూ సిద్ధంగా ఉండేది. ఇప్పుడలాలేదు. తనపట్ల కుటుంబానికి శ్రద్ధ తగ్గిపోయిందనటానికి ఇదో నిదర్శనం. తాను ఆకలితో ఉన్నానని ఎవరితోనూ చెప్పకూడదనుకున్నాడు సురంజన్. పెరట్లోకి వెళ్లి ముఖం కడుక్కున్నాడు. అక్కడే

కమ్మీమీదున్న తువ్వాలుతో ముఖం తుడుచుకున్నాడు. మళ్లీ తనగదిలోకొచ్చి చొక్కా మార్చుకొని, బయటికి నడిచాడు, తాను హైదర్ ఇంటికెళ్లాలా? ఈసమయంలో హైదర్ ఇంట్లో ఉండడు. అలాగైతే బెలాల్ ఇంటికో, కమాల్ ఇంటికో వెళ్లాలా? వెళ్లచ్చు. కానీ తాను తలదాచుకోవటానికి వాళ్ల ఇళ్లకు వచ్చినట్టుగా వాళ్లు భావిస్తే? వాళ్ల దయాదాక్షిణ్యాలకోసం వచ్చానని వాళ్లు అనుకుంటే? వాళ్ల ఇళ్లకు వెళ్లకూడదు. ఒంటరిగా అలా నగరమంతా తిరిగి రావాలని నిశ్చయించుకున్నాడు సురంజన్. ఒకనాడు మైమెన్‌సింగ్ వదిలి రాలేకపోయాడు. ఒకరోజు రాత్రి తనతోకూడా చెప్పకుండా నాన్నగారు తమ ఇంటిని రైజుద్దీన్‌కు అమ్మేశారు. తెల్లవారి తాను నిద్రలేచేసరికి తన ఇల్లు తనదికాకుండా పోయింది. కామినీ పుష్పాలసౌరభంతో ఘుమఘుమలాడిపోయిన తన జన్మస్థానం, తాను చిన్నతనంలో ఈతలాడిన తేటనీటి ఊటచెరువూ పరాయివారి పాలైపోయాయి. "దత్తాబారీ" (దత్తావారి ఇల్లు) తమచేతుల్లోనుంచి వెళ్లిపోయింది. తాము మరో వారంరోజుల్లోగా తమ ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోవాలని తెలియగానే సురంజన్ కోపంతో ఇల్లువదిలి వెళ్లిపోయాడు. రెండురోజులు తిరిగిరాలేదు.

తాను ఎందుచేతమరీ ఇంత ముక్కోపి అయిపోతున్నాడో, తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న విషయం ఏమిటో సురంజన్‌కు అర్థం కావటంలేదు. ఒక్కోసారి దీనికి కుటుంబంలోని వారంతా – తనతోబాటు – బాధ్యులనిపిస్తుంది. మరోసారి బాధ్యతంతా పర్వీన్‌దే ననిపిస్తుంది. ఒకనాడు ఆమె తన్ను ప్రేమించేదని స్ఫురించినప్పుడల్లా అతని మనసులో ముల్లుగుచ్చుకున్నట్టనిపిస్తుంది. ఆరోజుల్లో తరచుగా తనగదికి పరుగెత్తుకుంటూ వచ్చేది. "రా....పరుగెత్తిపోదాం...." అనేది.

"ఎక్కడికి?" అనేవాడు తాను.

"దూరంగా.... కొండల్లోకి".

"ఇక్కడ కొండలేవీ? కొండలు కావాలంటే సిల్హెట్‌కో, చిట్టగాంగ్‌కో పోవాలి", అనేవాడు తాను.

"అక్కడికే పోదాం. అక్కడే ఇల్లుకట్టుకుందాం".

"మనం ఏం తినాలి? గడ్డా?"

పర్వీన్ నవ్వుతూ తనమీద వాలిపోయేది.

"నువ్వులేకుండా నేను బతకలేను", అనేది.

"అమ్మాయిలు ఇలాగే మాట్లాడుతుంటారు. నిజానికి ఎవ్వరూ చచ్చిపోరు", అనేవాడు సురంజన్.

సురంజన్ అన్నదే నిజమైంది. పర్వీన్ నిజంగానే చచ్చిపోలేదు. బుద్ధిగా ఆమె అమ్మానాన్నా చెప్పినట్టుగా విన్నది. సురంజన్ వద్దకు వచ్చి అతడు ఇస్లాం మతంలోకి మారాలని తన అమ్మానాన్నా కోరుతున్నారని చెప్పింది.

"నాకు మతంలో నమ్మకంలేదని నీకు తెలుసుగా", అన్నాడు సురంజన్ నవ్వుతూ.

"అలాకాదు. నువ్వు ముస్లిం అయితీరాలి".

"నాకు ఇష్టంలేదు".

"అంటే? నేనునీకు అక్కరలేదనేనా?"

"అలాకాదు. నువ్వుకావాలి. కానీ అంతమాత్రంచేత నేను ముస్లింగా ఎందుకు మారాలి?"

పర్వీన్ అందమైన ముఖంకోపంతో ఎర్రబడింది. తన్ను శాశ్వతంగా వదిలిపెట్టాలని పర్వీన్ కుటుంబం ఆమెను ఒత్తిడి చేస్తోందని సురంజన్‌కు స్పష్టంగా అర్థమైంది. ఆవిడ అన్నయ్య హైదర్ ఎవరివైపున్నాడో సురంజన్‌కు అర్థంకాలేదు. అతడు తనకు స్నేహితుడు. కానీ అతడు తమ బంధుత్వాన్ని గురించి తనతో ఏనాడూ ప్రస్తావించలేదు. అది సురంజన్‌కు కాస్త ఇబ్బందిగానే ఉండేది. కానీ తాను ఎలా బలవంతం చేయగలడు?

సురంజన్‌కు ఇస్లాం మతం పుచ్చుకోవాలన్న ఆలోచనే రాలేదు. అందుచేత పర్వీన్ అతనితోబాటు కొండల్లో కాపురంచేసే కలలకు నీళ్లు వదిలేసింది. అన్నట్టు కలలకు అంత సులభంగా నీళ్లు వదిలేయటంసాధ్యమా? కలలు పూజల తరువాత విసర్జించే మట్టి విగ్రహాలేనా? అవి తాత్కాలికానందంకోసం. మాత్రమేనా?

పర్వీన్ ఓ ముస్లిం వ్యాపారస్తుణ్ణి పెళ్లిచేసుకుంది. చాలా తక్కువకాలంలోనే ఆ పెళ్లిలో సమస్యలు పుట్టుకొచ్చాయి.

"పర్వీన్ విడాకులు పుచ్చుకుంటుందేమో", అన్నాడు హైదర్ ఒకనాడు సురంజన్‌తో.

"రెండేళ్లలోనే విడాకులా?" అనాలనుకున్నాడు సురంజన్. కానీ అనలేదు. తాను పర్వీన్‌ను తన స్మృతిపథంలోంచి తీసేశాడు. కానీ ఆవిడ విడాకులు తీసుకోవచ్చునన్నవార్త మళ్లీ ఆశనూ, పాత జ్ఞాపకాలనూ చిగురింపచేసింది. తాను తన హృదయమందిరంలో పర్వీన్ పేరును ఇంతకాలంగా సుకుమారంగా భద్రపరుచుకో ఉన్నాడా? నిజమేనేమో! ఆవిడనుచూసి ఎంతకాలమైంది? పాతజ్ఞాపకాలు అతణ్ణి ముంచెత్తాయి. తన ఆలోచనల్ని రత్నవైపు మళ్లించాడు. రత్నామిత్ర! రత్న అందమైన అమ్మాయి. ఆవిడ తనకుబాగా తగిన అమ్మాయి..... పర్వీన్ విడాకులు పుచ్చుకుంటోందన్నమాట.... కానీ దానికీ తనకూ ఏమిటి సంబంధం? ఆవిడ తన కుటుంబం ఆమోదించిన ముస్లింను పెళ్లిచేసుకుంది. కాబట్టి అన్నీ సజావుగా జరిగిపోతాయని అందరూ ఆశించారు. మతమూ, కులమూ కలిస్తే మనసులుకూడా కలిసిపోతాయన్న భరోసా ఉందన్నట్టు అందరూ ప్రవర్తిస్తారు. అది నిజమే అయితే ఈ తిరుగు ప్రయాణం ఏమిటి? ఆవిడ భర్త పర్వీన్‌ను కొండలకు తీసుకెళ్లలేదా? ఆవిడ కలలు పండలేదా? అదిసరే, తనకూ దీనికీ ఏమిటి సంబంధం? తాను ఉద్యోగంలేని, వీధులు తిరిగేహిందూ యువకుడు. తాను ఆవిడకు తగిన మొగుడెలా అవుతాడు? సురంజన్ తికాతులీ చౌరస్తాలో రిక్షాఎక్కాడు. పర్వీన్ అతని మనసును వదలటంలేదు. అతని హృదయమందిరంలోంచీ ఆవిడ చిత్రం మాటిమాటికీ మనోఫలకంమీదికి వస్తోంది. తాము కలిసి ఉన్నప్పుడు పర్వీన్ తన్ను ముద్దుపెట్టుకునేది. తాను ఆమెను గట్టిగా కౌగలించుకొని "నువ్వు నా చిట్టిచిలకవి", అనేవాడుతాను.

పర్వీన్ విరగబడి నవ్వుతూ "నువ్వు కోతివి", అనేది.

తాను నిజంగా కోతేనా? నిజమే కాబోలు. కాకపోతే తాను ఎదుగూ బొదుగూ లేకుండా ఇలా ఎందుకుండిపోతాడు? ఐదు సంవత్సరాలు గడిచిపోయాయి – బురదగుంటల్లో పూచే పిచ్చిపువ్వుల్లా. కానీ సాగిపోతున్న కాలమూ, జీవితమూ తనకు ఉపయోగపడ్డాయా? లేదు. "నువ్వంటే నాకు ఎంతో ఇష్టం" అని పర్వీన్‌లాగా తనతో ఎవరూ చెప్పలేదు. ఆమాట మొదటిసారిగా పర్వీన్ తనతో అన్నరోజున తాను అడిగాడు, "ఈమాట నాతో అంటానని ఎవరితోనైనా పందెంకాశావా?"

"అంటే?" అంది పర్వీన్.

"చూడు.... ఈమాట నువ్వునాతో అనవచ్చోలేదో నీకు తెలుసా?"

"అదినాకు అనవసరం".

"నువ్వు ఆమాటను తెలిసే అంటున్నావా?"

"నేను ఏమన్నా తెలిసే అంటాను".

ఇంత ఆత్మవిశ్వాసం ఉన్న అమ్మాయి తన కుటుంబం పెళ్లి ప్రస్తావన తీసుకురాగానే ఎలా జావగారిపోయింది! ఆవిడ అందమైనకలలు ఆవిరైపోయాయి. ఆవిడ ఆత్మవిశ్వాసమూ, ఆవిడ సాధించాలనుకున్న విషయాలూ మరుగున పడిపోయాయి. "నేను ఆ ఇంట్లో ఉన్న కోతిని పెళ్లిచేసుకుంటాను", అని పర్వీన్ కనీసం పెళ్లిరోజుకూడా ఒక్కసారైనా అనలేదు. పర్వీన్‌వాళ్ల ఇల్లు తమ ఇంటికి రెండిళ్ల అవతలే ఉండేది. కిరణ్మయి, మాయ మాత్రమే పర్వీన్ పెళ్లికి వెళ్లారు. సురంజన్ వెళ్లలేదు.

సురంజన్ రిక్షావాణ్ణి ఛమేలీబాగ్‌కు వెళ్లమన్నాడు. నగరంమీద సాయంకాలపు నీడలు దిగుతున్నాయి. ఇప్పుడతనికి చాలా ఆకలనిపించింది. గతంలో అతడు అజీర్తితో బాధపడేవాడు. కానీ ఇప్పుడు ఆకలితో తలతిరుగుతోంది. అతని నాన్నగారు అతడు "అంటాసిడ్స్" వాడాలని చెప్పాడు. కానీ చప్పరిస్తే పెదవులమీద పేరుకుపోయే మాత్రలంటే అతనికి చిరాకు. అంతేకాకుండా బయటికెళ్తున్నప్పుడు మాత్రల్ని తీసుకెళ్లటం ఎప్పుడూ మరిచిపోయేవాడు.... పులోక్ ఇంటికెళ్లి, ఏమైనా తినాలనుకున్నాడు సురంజన్. ఐదురోజుల్నుంచీ పులోక్ ఇల్లు వదిలి బయటికి వెళ్లలేదు. తప్పకుండా ఇప్పుడుకూడా ఇంట్లోనే ఉంటాడు....

పులోక్ తలుపుతెరవగానే –

"తింటానికేమైనా ఉంటే ఇవ్వు. మాఇంట్లో వంటచేసినట్టుగాలేరు", అన్నాడు సురంజన్.

"ఎందుకూ?"

"డాక్టర్ సుధామయ్ దత్తాగారికి స్ట్రోక్ వచ్చింది. వారి భార్యా, కూతురూ వారికిసేవ చేయటంలో నిమగ్నమై ఉన్నారు. ధనవంతుడైన సుకుమార్‌దత్తాగారి కుమారుడు సుధామయ్‌దత్తాగారికి ఈనాడు తనవైద్యానికక్కూడా కాసుల్లేవు".

"నిజానికి నువ్వేదైనా ప్రయోజనకరమైన పనిచేయాలోయ్ – ఏదైనా ఓ ఉద్యోగం సంపాదించుకోవటంలాంటిది...."

"ఓ.... చాలా ప్రయత్నాలు చేశాను. ఈ ముస్లిందేశంలో ఉద్యోగం సంపాదించటం సాధ్యంకాదు. అయినా ఈ నిరక్షరాస్యులకింద ఎవరు పనిచేయగలరు?"

పులోక్ ఆశ్చర్యపోయాడు. "సురంజన్, నువ్వు ముస్లింలను తిడుతున్నావా?" అన్నాడు.

"నువ్వు భయపడాల్సిన అవసరంలేదు. ముస్లింలను తిడుతున్నది నిజమే. కానీ నీతోమాత్రమే తిడుతున్నాలే. వాళ్లని ముఖంమీద తిట్టటం సాధ్యమనుకుంటున్నావా? వాళ్లు ఈ తలను ఈ మొండెంనుంచి వేరుచేసెయ్యరూ?"

నీలత్వరగానే అన్నమూ, కూరా వడ్డించింది.

"సురంజన్‌దా, నువ్వు ఈరోజూ ఏమీతినలేదా?" అంది ఎంతో బాధపొంగుతున్న కంఠస్వరంతో.

సురంజన్ బాధగా నవ్వాడు. "నేను తింటే ఎవరిక్కావాలి? తినకపోతే ఎవరిక్కావాలి?" అన్నాడు.

"నువ్వు పెళ్లిచేసుకోవాలి".

సురంజన్‌కు పొరపోయింది. "పెళ్లా? నన్నెవరు చేసుకుంటారు?" అన్నాడు.

"ఆ అమ్మాయి పర్వీన్ కారణంగా నువ్వు పెళ్లిగురించి ఆలోచించటం మానుకోకూడదు".

"కాదు.... కారణం అదికాదు. నేను ఏదోఒకరోజు పెళ్లిచేసుకోవాల్సి వస్తుందన్న విషయంనాకు తెలియనే తెలియదు". పులోక్, నీలా విషాదంగా చిరునవ్వు నవ్వారు.

సురంజన్‌కు అన్నం రుచించటంలేదు. నాలుక చవిచచ్చిపోయినట్టుగా ఉంది. కానీ ఆకలి తీరటంకోసం తింటున్నాడు. "కాస్త డబ్బు అప్పుగా ఇవ్వగలవా పులోక్?" అన్నంతింటూ అడిగాడు సురంజన్.

"ఎంత?"

"నువ్వు ఎంత ఇవ్వగలిగితే అంత. మా ఇంట్లో డబ్బుసంగతులు నాతో ఎవరూ చెప్పరు. మా అమ్మపర్సు ఖాళీగా ఉందని నానమ్మకం".

"అలాగే. నీక్కావలసినంత ఇస్తాను. అదిసరేకానీ దేశంలో ఏం జరుగుతోందో తెలుసుకుంటున్నావా? భోలాలో, చిట్టగాంగ్‌లో, సిల్హెట్‌లో, కాక్స్‌బజారులో, ఫిరోజ్‌పూర్‌లో?"

"నువ్వు చెప్పబోతోందేమిటో నాకుతెలుసు. వాళ్లు అనేక దేవాలయాల్ని ధ్వంసం చేశారు. హిందువుల ఇళ్లను లూటీ చేశారు. వాటికి నిప్పుపెట్టారు. హిందూ పురుషుల్ని చావగొట్టారు, చంపారు. హిందూస్త్రీలను మానభంగం చేశారు..... ఇవికాకుండా కొత్తవిషయాలేమైనా ఉంటే చెప్పు".

"అంటే ఇవన్నీ నీకు సాధారణంగానే కనిపిస్తున్నాయా?"

"కాను. ఈదేశంలో మరోలా ఎలా జరుగుతుంది? వీపువాళ్లవైపుకు తిప్పి రక్షణలేకుండా కూచుంటావు. వాళ్లు నీ బుర్రపగలగొడితే అయ్యోయ్యోయ్యోమంటావు. అది న్యాయంకాదుకదా?" సురంజిన్ వ్యంగ్యంగా అన్నాడు.

డైనింగ్ టేబిల్ వద్ద కూచోఉన్న పులోక్ మారుమాట మాట్లాడలేదు. కాస్సేపాగి ఇలా అన్నాడు.

"సిల్హెట్ లో చైతన్యదేవ్ ఇంటిని బూడిదచేశారు. వాళ్లు ప్రాచీన గ్రంథాలయాన్ని కూడా వదిలిపెట్టలేదు. మా అన్నయ్య సిల్హెట్ నుంచీ తాజా సమాచారం తెచ్చాడు. కాళీఘాట్ లోని కాళికాలయం, శివాలయం, జగన్నాథ వ్యాయామశాల, మీరా బజార్ లోని రామకృష్ణామిషన్ భవనం, బలరాం వ్యాయామశాల, నిర్మలాబాలవిద్యార్థి మందిరం, బండోర్ బజార్ లోని బ్రహ్మసమాజ భవనం, జిందాబజార్ జగన్నాథవ్యాయామశాల, గోవిందజీ వ్యాయామశాల, లామాబజార్ లో కొన్ని వ్యాయామశాలలూ బియానీబజార్ లోని ఢాకా దక్షిణమహాప్రభు దేవాలయం, ఘాటాటికోర్ లోని శివాలయం, మహాలక్ష్మీ మహాపీఠం, షర్కార్ ఖానాలోని దుర్గామందిరం, షాజీమందిరం, చంద్రగ్రామంలోని శివాలయం, అఖిల్ పూర్ వ్యాయామశాల, జీవన్ పూర్ కాళీమందిరం, బాలాగంజ్ కాళీమందిరం, బరోహటా, గజీపూర్ లలోని వ్యాయామశాలలూ – అన్నీ నేలమట్టమయ్యాయి. వేణుభూషణదాస్, సునీల్ కుమార్ దాస్, కనూభూషణదాస్ లను సజీవంగా తగలబెట్టారు".

"నిజమా?"

"ఏమిటేమిటో జరుగుతున్నాయి సురంజన్. ఈదేశంలో ఎలా బతికి బట్టకట్టగలమో అర్థంకావటంలేదు. చిట్టగాంగ్ లో హిందువుల ఇళ్లనూ, గుళ్లనూ ధ్వంసంచేయటానికి జమాతీలూ, బి.ఎన్.పీ. వాళ్లూ చేతులు కలిపారు. హిందువుల ఇళ్లల్లోంచీ పాత్రలూ, బట్టలూ దోచుకుపోయారు. అంతేకాదు చేపలకొలనుల్లోని చేపల్నికూడా పట్టుకుపోయారు. రోజులతరబడి హిందువులకు తినటానికేమీ దొరకలేదు. సీతాకుండలోని ఖజూరియా అన్న గ్రామంలో జమాతీలు తుపాకులు చూపించి కనూబిహారీనాథ్ నూ, అతనికొడుకు అర్జున్ బిహారీనాధ్ నూ ఇరవైవేల టాకాలు ఇమ్మని బెదిరించారు. ఇవ్వకపోతే ఇంట్లోంచి బయటికి గెంటేస్తామని దబాయించారు. వాళ్లు భయంతో ఊరువదిలిపారిపోయారు. మీరాసరాయ్ కళాశాలలోని అధ్యాపకుని కుమార్తె ఉత్పలరాణీభౌమిక్ ను అర్థరాత్రిపూట ఎత్తుకుపోయారు. తెల్లవారుతుండగా మాత్రమే ఆవిడ ఇంటికి తిరిగొచ్చింది. వీటిని గురించి మనం నిరసనకూడా తెలియజేయమా? నిరసన తెలియజేస్తే ఏమౌతుందో తెలుసా" నిన్ను నేను తన్నాను. అదినీకు నొప్పిగా ఉందనే ధైర్యం నీకెలావచ్చింది?" అనే డి.ఎల్.రాయ్ పాటనువ్వెప్పుడూ వినలేదూ?"

సురంజిన్ కుర్చీలో వెనక్కువాలి, కళ్లుమూసుకున్నాడు. "వాళ్లు భోలాలో కొన్నివేల ఇళ్లు ధ్వంసంచేశారు. ఈరోజు పగటిపూట పన్నెండుగంటలపాటు కర్ఫ్యూ ఎత్తేశారు. ఆ కొద్దిపాటి వ్యవధిలో వాళ్లు ఇనుపచువ్వలూ, పారలూ, పలుగులూ పట్టుకొనివచ్చి మూడోసారి లక్ష్మీనారాయణ వ్యాయామశాలమీద దాడిచేశారు.

ఇదంతా జరుగుతోంటే పోలీసులు కాలుకదపకుండా వినోదంచూస్తూ నిలబడ్డారు. భోర్హానుద్దీన్‌లో దాదాపు పదిహేనువందలమందిమీద దాడిజరిగింది. కనీసం రెండువేల ఇళ్లు ధ్వంసమయ్యాయి. తాజ్‌ముద్దీన్‌లో రెండువేలా రెండువందల ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో రెండువేల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండువందలా అరవైదేవాలయాలను భోలాలో మాత్రమే ధ్వంసంచేశారు."

"పత్రికా విలేఖరిలాగా పట్టిక చెబుతున్నావు. ఇవన్నీ జరిగినందుకు నీకు బాధగా ఉందా?" సురంజన్ నవ్వుతూ అడిగాడు.

పులోక్ ఆశ్చర్యపోయాడు. "నీకు బాధగాలేదా?" అన్నాడు.

"లేదు. ఎంతమాత్రంలేదు", అన్నాడు సురంజన్ బిగ్గరగా నవ్వుతూ.

"అక్కడ నాకు చాలా మంది బంధువులున్నారు. నాకు ఆందోళనలేకుండా ఉండటం సాధ్యకాదు", అన్నాడు పులోక్.

"ముస్లిములేదోచేశారు, దానికి ప్రతీకారంగా మనమింకేదో చేయాలనుకోవటం హిందువులకు భావ్యంకాదు. నీతో అంగీకరించలేను పులోక్, సారీ".

పులోక్ సురంజన్‌ను చిత్రంగా చూశాడు. తరువాత గదిలోంచి బయటికెళ్లి రెండువేల టాకాలు తీసుకొచ్చాడు. ఆ డబ్బును సురంజన్ చేతికిచ్చాడు.

"అలోక్ ఎలా ఉన్నాడు? అతణ్ణి అతని స్నేహితులు తమ జట్టులో చేర్చుకున్నారా?" అన్నాడు పులోక్ ఇచ్చిన డబ్బును తనజేబులో కుక్కుకుంటూ.

"లేదు. అతడు రోజంతా ఒంటరిగానే ఉన్నాడు. అతని స్నేహితులంతా ఆడుతుంటే చూట్టంమాత్రమే అతడు చేయగలిగింది. ఒంటరిగా గదిలోకూచొని బాధపడుతున్నాడు."

"పులోక్, నీకో విషయంతెలుసా? మనం ఎవరికి మతతత్వంలేదనీ, ఎవరు మనవాళ్ళనీ అనుకుంటామో వాళ్లు అంతరాంతరాల్లో ఎంతో మత తత్వవాదులు. మనం ఈ దేశంలో ముస్లిముల్తో ఎంతో బాగా కలిసిపోయాం. మనం "అస్సలామలేకుం", "ఖుదాహాఫీజ్" అనివాళ్లను పలకరించటానికి సందేహించటంలేదు. "జలం" అనటానికి బదులుగా "పానీ" అనటానిక్కానీ, "స్నానం" అనటానికి బదులుగా "గోసోల్" అనటానిక్కానీ మనం జంకటంలేదు. వాళ్ల మతవిశ్వాసాలకు మనం ఎంతో విలువ ఇస్తాం. రంజాన్‌నెలలో బహిరంగంగా సిగరెట్‌కాల్చం, టీకూడా తాగం. నిజానికి ఆనెలలో వాళ్లు నడిపే హోటళ్ళక్కూడా వెళ్లం. మనం ఇంత సర్దుకుంటున్నామా? వాళ్లు మనతో ఎంత సర్దుకుంటున్నారు? ఎంత ఆత్మీయంగా ఉంటున్నారు? మనం ఎవరికోసం ఈ త్యాగాలు చేస్తున్నాం? మనకు దసరాకు ఎన్నిరోజులు సెలవులిస్తున్నారు? ఇంత సర్దుకున్నా హిందువుల్ని తరుముతూనే ఉంటారు. రెండురోజులు వాళ్ళకు "ఈద్" సెలవులిస్తే మనం ఆస్పత్రుల్లో ఎక్కువసేపు పనిచేయాలి. రాజ్యాంగానికి ఎనిమిదో సవరణ తెచ్చారు. అవామీలీగ్ వాళ్లు దాన్ని గురించి గొప్ప అల్లరిచేశారు. హజ్ యాత్రనుంచీ తిరిగొచ్చినట్టుగా హసీనాకూడా నెత్తిన కొంగుకప్పుకోవటం ప్రారంభించింది.... పులోక్, వాళ్లంతా ఒకటే. మన బతుక్కు రెండే దారులున్నాయి. ఆత్మహత్యయినా చేసుకోవాలి. లేదా ఈదేశాన్ని వదిలి పారిపోవాలి".

సురంజన్ లేచి తలుపుదగ్గరికెళ్లాడు.... ఈలోగా కిరణ్మయి అతణ్ణి మైమెన్‌సింగ్ వెళ్లి రైజుద్దీన్‌ను కలిసి రమ్మని చెప్పింది. అతడు వాళ్ల ఇంటికి కారు చవగ్గా కొనేశాడు, ఇప్పుడు తామున్న పరిస్థితిలో ఆర్థికంగా కాస్త ఆదుకుంటాడేమో అడిగి రమ్మంది. కానీ రైజుద్దీన్‌ను సాయం అడగటం సురంజన్‌కు ఇష్టంలేదు. అతనికి అప్పులుచేయటంకూడా నచ్చలేదు. కానీ పరిస్థితులు బాగాలేవు. కొట్టువాడికి డబ్బు ఇవ్వాలి. ఇంకా ఇవ్వవలసిన వాళ్లున్నారు. రైజుద్దీన్‌ను అడగటంకంటే పులోక్‌ను అడగటమే మంచిదనుకొన్నాడు సురంజన్. క్రితంలో సురంజన్ పులోక్‌ను ఆదుకున్నాడుకూడా. లేదా సాటి హిందువుకావటంచేత పులోక్ అల్పసంఖ్యాకుల సమస్యల్నీ, కష్టాలనీ మెరుగ్గా అర్థం చేసుకుంటాడా? ఏది ఏమైనా ముస్లింలను సాయంకోరకూడదని సురంజన్ కొన్నిరోజులుగా అనుకుంటున్నాడు.

పులోక్ దగ్గరా, అతని కుటుంబ సభ్యులదగ్గరా సెలవుతీసుకొని సురంజన్ ఇంటివైపు బయల్దేరాడు. తన్ను ఇంట్లో అందరూ ఎలాచూస్తారో ఆలోచిస్తూ నడుస్తున్నాడు. తనకు బాధ్యత అప్పగించటం ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదు. తాను దేశాన్నిగురించి మాత్రమే ఆలోచించగల దేశభక్తుడని వాళ్లు అనుకుంటున్నారుకాబోలు. తనకు ఇతర విషయాలను గురించి ఆలోచించే సమయంలేదని వాళ్ల అభిప్రాయంకావచ్చు. ఈరోజు తనవద్ద ఉన్నడబ్బు అమ్మకిస్తాడు. కుటుంబాన్ని ఆమె లాక్కొస్తున్న పద్ధతిని తలుచుకొని సురంజన్ ఆశ్చర్యపోయాడు. ఆమె ఎవర్నీ తప్పుపట్టదు – చిట్టచివరికి పనికిమాలిన తనకొడుకునుకూడా. తాము ఎన్నో కష్టకాలాల్ని చూశారు. కానీ ఆవిడ ఏనాడూ ఎవర్నీ తప్పుపట్టలేదు.

అకస్మాత్తుగా సురంజన్‌కు తనబతుకుమీద అసహ్యంకలిగింది. తాను బతకాల్సిన అవసరంలేదనిపించింది. ఒకవైపున సుధామయ్ చావుబతుకులమధ్య ఉన్నాడు. అతణ్ణి కంటికిరెప్పలా చూసుకోకతప్పదు. ఇలాంటి పరిస్థితిలో తాను ఎందుకోసం బతకాలి? పెథిడ్రిన్ ఇంజక్షన్లు కొనుక్కొని, తానే గుచ్చుకొని ఆత్మహత్య చేసుకోవాలని క్షణకాలంపాటు సురంజన్‌కు అనిపించింది. ఆక్షణంలో చావు అతని కళ్లముందు స్పష్టంగా కదలాడింది. తాను తనమంచంమీద చనిపోయి పడుకొని ఉంటాడు. ఆవిషయం తన కుటుంబంలో ఎవరికీ తెలీదు. తాను బాగా అలసిపోయి నిద్రపోతున్నాననుకుంటారు. ఎవరూ తన్ను నిద్రలేపరు. చిట్టచివరికి మాయ తన గదిలోకొస్తుంది, "దాదా, నిద్రలేయ్. నాన్నగారికి నీతో కాస్తపనుంది...." అంటుంది. కానీ ఆవిడ దాదా నిద్రలేవడు....

ఇలా ఆలోచిస్తూ నడుస్తుంటే ఒక ఊరేగింపు విజయనగర్ చౌరస్తా వద్దనుంచీ ముందుకుసాగుతుండటం సురంజన్‌కు కనిపించింది. అది మతసామరస్యాన్ని కోరుతూ జరుగుతున్న ఊరేగింపు. వాళ్లు హిందూ–ముస్లిం ఐక్యతను గురించి నినాదాలిస్తూ ముందుకు సాగిపోయారు. సురంజన్ నిరాశగా చిరునవ్వు నవ్వకుండా ఉండలేకపోయాడు.

తమ ఇంటికి వెళ్లటానికి ముందుగా గౌతమ్ ఇంటికి వెళ్లాడు సురంజన్. అతని పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. కానీ అతడింకా భయపడుతూనే ఉన్నాడు. చిన్నశబ్దం

విన్నా బెదిరిపోతున్నాడు. భారతదేశంలో ఎవరో బాబ్రీమసీదును కూలదోస్తే ఇక్కడ అతణ్ణి ఎవరో చావగొట్టటం చిత్రంగా ఉంది. గౌతమ్‌కు తన మెడికల్ కోర్సుతప్ప రాజకీయాలు పట్టవు. అతనికి ఈ మొహల్లాలో శత్రువులులేరు.

అక్కడే ఉన్న గౌతమ్ తల్లి సురంజన్‌కు దగ్గరగా వచ్చి అతని చెవిలో చెప్పింది, "మేం వెళ్లిపోతున్నాం".

"వెళ్లిపోతున్నారా?" అన్నాడు సురంజన్ ఆశ్చర్యపోయి.

"ఔను. ఈఇల్లుకూడా అమ్మేయాలని ప్రయత్నిస్తున్నాం".

వాళ్లు ఎక్కడికి వెళ్తున్నారో సురంజన్ అడగలేదు. అతనికి అడగాలనిపించలేదు. ఇంకా కాస్సేపు అక్కడే కూర్చుంటే వాళ్లు దేశం వదిలి వెళ్లిపోతున్నారన్న భయంకరమైన వార్త వినవలసిరావచ్చు. కాబట్టి వెళ్లటానికి లేచాడు సురంజన్. కానీ గౌతమ్ తల్లి అతణ్ణి ఆపింది.

"అప్పుడే వెళ్లిపోకు బాబూ! మేం వెళ్లిపోయేలోగా మళ్లీ కలుస్తామోలేదో. కూచో. కాస్సేపు మాట్లాడుకుందాం", అంది. ఆవిడ కంఠం కన్నీళ్లతో రుద్ధమైపోయింది.

"లేదు పెద్దమ్మా. నాకు ఇంటివద్ద పనుంది. మరోసారి వచ్చికలుస్తా".

సురంజన్ గౌతమ్‌నుకానీ, అతని తల్లినికానీ కళ్లెత్తి చూళ్లేదు. తలవంచుకొని బయటికి నడిచాడు. కానీ అతడు నిట్టూర్పును మాత్రం ఆపుకోలేకపోయాడు.

★ ★ ★

# ఐదవరోజు

విరూపాక్ష చదువుమీద ఆసక్తి ఉన్న యువకుడు. అతడూ సురంజన్ ఒకే రాజకీయపార్టీకి చెందినవారు. ఆరోజు సురంజన్ ఇంకా నిద్రలేవకముందే విరూపాక్ష వచ్చాడు.

"గంట పదైంది. ఇంకా నిద్రపోతున్నావా?" అన్నాడు.

"నిద్రపోవటంలేదు. అలా పడుకో ఉన్నాను. చేసే పనేమీ లేనప్పుడు పడుకోవటమే మంచిది. మనకు మసీదుల్ని ధ్వంసంచేసే ధైర్యంలేనప్పుడు పడుకోవటమే శరణ్యం".

"నువ్వన్నది నిజమే. వాళ్లు వందలాది గుళ్లను కూల్చేస్తున్నారు. మనం మసీదుమీద ఒకరాయి విసిర్తే పరిణామాలెలా ఉంటాయో తెలుసుగా! పాకిస్తానీలు నాలుగువందల ఏళ్లనాటి రామోనా కాళికాలయాన్ని దుమ్ముదుమ్ము చేశారు. దాన్ని పునర్నిర్మిస్తామని ఏ ప్రభుత్వమూ వాగ్దానం చేయలేదు".

"హసీనా బాబ్రీమసీదును పునర్నిర్మించటాన్ని గురించే ఎప్పుడూ మాట్లాడుతుంది. బంగ్లాదేశ్‌లో హిందువులకు జరిగిన నష్టానికి పరిహారం ఇస్తారన్న ఆశ ఉందా? వాళ్లు కూల్చేసిన దేవాలయాలను పునర్నిర్మించే సంగతిసరేసరి. హిందువులు ఈదేశంలోకి వరదల్లో కొట్టుకురాలేదన్న సంగతి ఇంతవరకూ వాళ్లు గుర్తించలేదు. వాళ్లలాగే మనంకూడా ఈదేశపౌరులమే. మనకూ బతికే హక్కు ఉంది. మనప్రాణాల్ని రక్షించుకునే హక్కు ఉంది. మన ఆస్తుల్నీ, ప్రార్థనామందిరాలనీ కాపాడుకునే హక్కు ఉంది".

"ఇప్పుడు జరుగుతున్న లూటీలూ, దోపిడీలూ బాబ్రీ మసీదును కూల్చివేయటంవల్ల మాత్రమే జరుగుతున్నాయనుకోకూడదు. 1992 మార్చి, 21 వ తేదీన బగేర్‌హాటా గ్రామంలో మోక్‌లెసూర్ రహమాన్, చాంద్‌మియా తాలూక్‌దార్ కాళీంద్ర హల్ధార్ కూతురు పుతుల్ రాణిని బలవంతంగా ఎత్తుకుపోయారు.

"పోటువకాలీ యూనియన్ ఉపాధ్యక్షుడు యూనస్‌మియా, యూనియన్ సభ్యుడు నబీఅలీమిర్ధా మోనీకన్తయలాల్ కుటుంబాన్ని చిత్రహింసలపాలు చేశారు. ఆబాధల్ని భరించలేక ఆకుటుంబసభ్యులు దేశాన్ని వదిలిపారిపోయారు....

"రాజ్‌నగర్‌జిల్లాలో బీరేన్ అన్నవ్యక్తిని నిర్బంధంలో ఉంచి, అతని ఆస్తినంతా రాయించుకున్నారు. ఈనాటివరకూ బీరేన్ అన్న ఆవ్యక్తి ఏమైపోయాడో ఎవరికీ తెలీదు. అలాగే సుధీర్ అన్న వ్యక్తి పొలాన్నికూడా లాక్కున్నారు. అతడు భయంతో దేశాన్ని వదిలి వెళ్లిపోయాడు. అలాగే చందన్‌శీల్ అన్న వ్యక్తిని అపహరించుకుపోయారు. అతడేమైపోయాడో ఈనాటికీ తెలీదు. బోగా గ్రామంలో చిత్తరంజన్ చక్రవర్తి వరిపంటను దోచుకుపోయారు. చిత్తబాబు ఫిర్యాదుచేస్తే ఫిర్యాదును వాపస్ తీసుకోమన్నారు. తీసుకోకపోతే చంపుతామని బెదిరించారు".

సురంజన్ సిగరెట్ వెలిగించాడు. తనకు ఇష్టంలేకపోయినా వాదనలోకి తాను

లాగబడుతూ ఉన్నాడని అతడు అర్థం చేసుకున్నాడు.

"ఏప్రిల్ మొదటి తారీఖున జల్ ఖబర్‌లో కొంతమంది తుపాకీచూపించి స్వప్న చంద్రఘోష్‌ను చందా అడిగారు. అతడు ఇవ్వననేసరికి అతని ఉద్యోగుల్ని చావగొట్టి కాష్‌బాక్స్ బలవంతంగా తెరిచి ఇరవైవేల టాకాలు పట్టుకొని పారిపోయారు. అప్పుడు ముస్లిం దుకాణాల్లోకూడా ఇలాంటి సంఘటనలు జరిగేవి. రౌడీలు వారివద్దకూడా మామూళ్ళు వసూలు చేసేవారు. ఈరౌడీ మామూళ్ళు పెద్దసమస్యగా తయారయ్యాయి. ఉదాహరణకు సిద్దిక్ బజార్లోని మానిక్‌లాల్ ధూపీ సంగతిచూడు. ఆప్రాంతంలోనే ఉండే షహబుద్దీన్, సిరాజ్ పర్వేజ్, సలాహుద్దీన్ బలవంతంగా అతని ఆస్తుల్ని ఆక్రమించుకున్నారు. ఇతరుల ఆస్తుల్నికూడా అలాగే ఆక్రమించుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారు."

సురంజన్ కాస్సేపు నిశ్శబ్దంగా ఉన్నాడు.

"పంటల్ని దొంగిలించటం, స్త్రీలను ఎత్తుకుపోవటం, మానభంగం చేయటం, ఆస్తుల్ని బలవంతంగా ఆక్రమించుకోవటం, తమకు ఇష్టంలేనివాళ్లను చావగొట్టటం, ఇళ్లలోంచి బయటికి తరిమేయటం, ఒక్కోసారి దేశంనుంచే తరిమేయటం – ఇవన్నీ మనచుట్టూరా మాత్రమే జరగటంలేదు. దేశమంతా జరుగుతున్నాయి. ఈహింసాకాండను గురించి మనకు ఎంత తెలుసు? దేశంనుంచి తరిమివేయబడ్డవారు ఎంతమందో మనకు తెలుసా?"

"సేన్‌బాగ్‌లో అబ్దుల్‌కలాంమున్షీ, అబ్దుల్ ఖాసిం మరికొందరు కలిసి కృష్ణలాల్ దాస్ భార్య స్వర్ణబాలను బలవంతంగా ఎత్తుకుపోయారు. ఆమెను చెరిచి వరిపొలాల్లో వదిలి వెళ్లిపోయారు", అన్నాడు విరూపాక్ష

సురంజన్ పరుపుమీదనుంచి లేచి, ముఖం కడుక్కోవటానికి వెళ్లాడు. బాత్‌రూంకి వెళ్తూ కిరణ్మయితో రెండుకప్పులు టీకావాలని చెప్పాడు. ఆముందురోజే ఆమెకు రెండువేల టాకాలు ఇచ్చాడు సురంజన్. ఇప్పుడామె తనకొడుకు పూర్తిగా అసమర్థుడని అనుకోలేదు. ఈరోజు ఆమె – తన ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండటంచేత కాబోలు – కాస్త హాయిగా ఉంది. సురంజన్ తనగదికి తిరిగివచ్చేసరికి విరూపాక్ష ఆందోళనగా కుర్చీలో కూర్చో ఉన్నాడు. సురంజన్ అతణ్ణి ఉత్సాహపరచటానికి ప్రయత్నించాడు. ఆమాటకొస్తే అతనిక్కూడా కాస్త హుషారుగానే ఉంది. నాన్నగారి గదిలోకెళ్లి అతని పరిస్థితి ఎలాగుందో చూసివద్దామా అనికూడా అనుకున్నాడు. ఈలోగా మాయ రెండుకప్పులు టీ తీసుకొచ్చింది.

"హేయ్, ఈలోగా సన్నబడిపోయినట్టున్నావ్. పరుల్‌వాళ్ల ఇంట్లో తింటానికి సరిగ్గా పెట్టలేదా?" అన్నాడు సురంజన్.

మాయ ఆమాటను పట్టించుకోకుండా లోపలికి వెళ్లిపోయింది. ఆవిడకు సురంజన్‌మీద కోపంగా ఉంది. సుధామయ్ జబ్బుగా ఉన్నాడు. ఛలోక్తులకిది సమయంకాదు. మాయ తిరస్కారం సురంజన్‌కు పరిస్థితిని అర్థమయ్యేలా చేసింది. అతడుకూడా నిశ్శబ్దంగా అయిపోయాడు.

"సురంజన్‌దా, నువ్వు మతాన్ని నమ్మవుకదూ?" అన్నాడు విరూపాక్ష ఆమాటతో సురంజన్ వాస్తవప్రపంచంలోకొచ్చాడు.

"నువ్వు ప్రార్థనలు చేయవు. నువ్వు గోమాంసంకూడా తింటావు. కాబట్టి నువ్వు పరిశుద్ధమైన హిందువుకాదనీ, సగం ముస్లింఅనీ వాళ్లతో చెప్పకూడదూ?"

"నేను నిజమైన మానవుణ్ణిమాత్రమే. అది మాత్రమే వాస్తవం. అందుకే వాళ్లు అభ్యంతరం చెబుతారు. హిందూ దురహంకారులకూ, ముస్లిం దురహంకారులకూ మధ్య అసలు వైరుధ్యమేలేదు. మనదేశంలోని జమాతీలకూ, భారతదేశంలోని బి.జె.పి. వారికీ పోలికలు చూడు. వీరిద్దరూ రాజకీయాధికారంకోసం పోరాడుతున్నవారే. 'భారతదేశంలో అల్లర్లకు భారతీయ జనతాపార్టీ బాధ్యతలేదు. అల్లర్లకు కాంగ్రెసే కారణం' – అన్నదెవరో తెలుసా? బైతుల్ మొకర్రమ్ సమావేశంలో ఈమాటను నిజామీనే స్వయంగా అన్నాడు....

"భారతదేశంలో జరిగిన అల్లర్లలో వేయిమంది చనిపోయారు. విశ్వహిందూ పరిషత్‌నూ, ఆర్.ఎస్.ఎస్.నూ బజరంగదళ్‌నూ, జమాత్–ఎ–ఇస్లామీనీ ప్రభుత్వం నిషేధించింది. ఇక్కడ సిల్హెట్‌లో సమ్మె ప్రకటించారు. ఫిరోజ్‌పూర్‌లో 144 వ సెక్షన్ విధించారు. భోలాలో కర్ఫ్యూ ప్రకటించారు. కానీ దేశంలో అనేకచోట్ల శాంతియాత్రలు జరుగుతున్నాయి. మతసామరస్యంకోసం పిలుపులు వినబడుతున్నాయి. ఈ ఊరేగింపుల్లో ఆశ్చర్యకరంగా "నిజామీ–అద్వానీ భాయి భాయ్...." లాంటి నినాదాలుకూడా వినిపిస్తున్నాయి. వీరిద్దరిమధ్య ఏమిటి పోలిక? ఈనాడు మతతత్వానికి వ్యతిరేకంగా అన్నిపార్టీలూ కలిసి శాంతిఉద్యమంగా ఏర్పడ్డాయి. ఇంగ్లండులోకూడా దేవాలయాలమీద దాడులు జరిగాయట. టోఫీల్ అహమద్ భోలాలో పరిస్థితిచూసి ఇప్పుడే తిరిగొచ్చాడు. అక్కడ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉందనీ బంగ్లాదేశ్ రైఫిల్స్ దళాన్ని అక్కడికి తక్షణం పంపాలనీ అతని అభిప్రాయం.

"కానీ ఇదంతా ఎందుకు? అంతా బూడిదైపోయాక బంగ్లాదేశ్ రైఫిల్స్ దళం చేయగలిగింది ఏముంటుంది? బూడిదను సేకరించటమా? టోఫీల్ అహమద్ అరవతేదీన ఎక్కడున్నాడు? ఆరోజు రాత్రే అతడు రక్షణ కార్యక్రమాలు ఎందుకు ప్రారంభించలేదు?"

సురంజన్‌కు ఉద్రేకం వచ్చింది. "అవామీలీగ్‌లో మహాత్ములున్నారనుకోకు", అన్నాడు ఆవేశంగా.

"అవామీలీగ్ అల్లర్లు ఆపకపోవటానిక్కారణం శాంతిభద్రతలు కాపాడలేకపోయిందన్న నింద ప్రభుత్వానికి రావాలనేగా?"

"నాకు తెలీదు. బహుశా నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. ఇవన్నీ ఓట్ల రాజకీయాలు. ఎవరికీ ఆదర్శాలులేవు. ఎలాగో ఒకలాగు ఓట్లు సంపాదించాలి. అంతే. అవామీలీగ్ తాను హిందూఓట్లు సంపాదించగలననుకుంటోంది. దీన్నేమంటారు? ఓట్‌బాంక్ రాజకీయాలనేనా? నీకు మరో విషయం తెలుసా? కొన్నిచోట్ల వాళ్లే స్వయంగా విధ్వంసాన్ని ప్రోత్సహించారు".

"సాధారణంగా అవామీలీగ్ గెలిచే ప్రాంతాల్లో బి.ఎస్.పి. వాళ్లు అల్లకల్లోలాన్ని సృష్టించారు. దేవాలయాల్ని కూలదోశారు. మీరు ఓట్లేసిన నాయకులు ఎక్కడికి పోయారని స్థానిక ప్రజల్ని అడిగారు. అలాగే బి.ఎస్.పి.నియోజకవర్గాల్లో అవామీలీగ్ వాళ్లు విధ్వంసాన్ని సృష్టించారు. అదే ప్రశ్ననే అడిగారు. భోలాలో బి.ఎస్.పి. వాళ్లు అల్లకల్లోలాన్ని సృష్టిస్తే, మహేష్‌ఖాలీలో, మానిక్‌గంజ్‌లో అపని అవామీలీగ్‌వాళ్లు చేశారు".

"ఇందులో పోలీసుల పాత్రకూడా ఉంది. మతదురహంకారుల జోలికిపోకుండా వాళ్లేం సాధించలేరు. అన్నట్టు పత్రికలన్నీ ఒకేరకమైన సంపాదకీయాలు రాశాయటగా. వాళ్లు మతసామరస్యంకోసం విజ్ఞప్తిచేశారని ఎవరో అన్నారు".

"నువ్వు పత్రికలు చదవ్వా?"

"చదవాలని అనిపించటంలేదు".

మాయ గదిలో కొచ్చింది.

"అమ్మ దీన్ని నీకివ్వమంది. ఇది అమ్మకు అక్కర్లేదట", అంది ఒకవరు బల్లమీద పెడుతూ.

మాయ తీసుకువచ్చిన కవర్లో ఏముందో సురంజన్ అడిగేలోగా మాయ వెళ్లిపోయింది. సురంజన్ కవరు తీసిచూశాడు. క్రితంరాత్రి తాను కిరణ్మయికిచ్చిన రెండువేల టాకాలున్నాయందులో. సురంజన్‌కు చాలా అవమానమనిపించింది. కిరణ్మయి ఉద్దేశం ఏమిటి? తానిచ్చిన డబ్బు తీసుకోవటానికి అవిడ ఆత్మగౌరవం అంగీకరించదా? లేదా తననిరుద్యోగి కొడుకు అడబ్బును ఎక్కడైనా దోచుకు వచ్చాడనుకుంటోందా? సురంజన్ మనస్సు వికలమైపోయింది. అతనికి ఎవరితోనూ – చివరికి విరూపాక్షతోనూ – మాట్లాడాలనిపించలేదు. తన్ను ఒంటరిగా ఉండనిస్తే చాలనిపించింది.

★ ★ ★

కిరణ్మయి నాన్నగారు అఖిల్‌చంద్రబాసు ప్రసిద్ధ న్యాయవాది. తన పదహారేళ్ల కూతుర్ని ఒక యువడాక్టరుకిచ్చి వివాహంచేసి తాను తన కుటుంబంతోపాటు కలకత్తాకు వెళ్లిపోయాడు. తన కూతురూ, అల్లుడూ ఎప్పుడో ఒకప్పుడు భారతదేశంలో తన్ను కలుసుకుంటారని అతడు ఆశపడ్డాడు. దాదాపు కుటుంబమంతా కలకత్తాలో ఉండటంచేత సుధామయ్‌కూడా భారతదేశానికి వెళ్లిపోవటానికి ఇష్టపడవచ్చని కిరణ్మయికూడా ఆశించింది. కానీ ఆమె అత్తగారి కుటుంబం చిత్రమైన కుటుంబం. ఆమె ఆరేళ్లపాటు అత్తమామలతోనే కలిసిఉంది. ఆ కాలంలో చాలామంది బంధువులూ, స్నేహితులూ దేశం వదిలి వెళ్లిపోయారు. కానీ అవిడ భర్తమాత్రం దేశం వదిలివెళ్లే విషయాన్ని ఒక్కసారికూడా ప్రస్తావించలేదు. కిరణ్మయి రహస్యంగా కన్నీరు పెట్టుకునేది. కలకత్తానుంచి ఆవిడ నాన్నగారు ఉత్తరాలు రాసేవారు

ప్రియమైన కిరణ్,

మీరు ఇక్కడికి రాకూడదని తిరుగులేని నిర్ణయం తీసేసుకున్నారా? మళ్లీ ఒకసారి సుధామయ్‌ని మనసుమార్చుకోమని అడుగు. మాక్కూడా మాతృదేశాన్ని వదిలి రావటం సంతోషదాయకంగాలేదు. కానీ రాకతప్పలేదు. ఇక్కడకూడా హాయిగాలేదు.

మమ్మల్ని మాతృదేశం పిలుస్తోంది. కానీ ఏం చేస్తాం? వాస్తవికంగా ఉండాలికదా! నిన్ను తలుచుకుంటే బాధగా ఉంది.

మీ
నాన్న

కిరణ్మయి ఇలాంటి ఉత్తరాల్ని ఏకాంతంగా చదువుకొని కన్నీళ్లు పెట్టుకునేది. ఒక్కోసారి రాత్రిపూట సుధామయ్ మనసుమార్చటానికి ప్రయత్నించేది. "మీ బంధువుల్లో చాలామంది వెళ్లిపోయారు. మా బంధువులూ అంతే. మనం ఇక్కడే ఉంటే మనకేదైనా ఇబ్బందులొస్తాయనుకుందాం. అప్పుడు మనకు ఒకగ్లాసు మంచినీళ్లిచ్చేవాళ్లుకూడా ఉండరు", అనేది. సుధామయ్ నవ్వి, ఎగతాళి చేసేవాడు. "నువ్వెందుకు మంచినీళ్లకోసం అడుక్కోవాలి. నీకు బ్రహ్మపుత్రానదినే ఇచ్చేస్తాను. నువ్వెన్ని నీళ్లు తాగుతావో చూద్దాం. అయినా మన బంధువుల దగ్గర బ్రహ్మపుత్రలోకంటే ఎక్కువ నీళ్లున్నాయా?" అనేవాడు.

సుధామయ్ కుటుంబంలో ఎవరూ – సుధామయ్ నాన్నగారితో ప్రారంభించి సురంజిన్‌వరకూ – బంగ్లాదేశ్‌ను వదిలివెళ్లే ఆలోచనకూడా చెయ్యలేదు. అందుచేత కిరణ్మయికి వాళ్లను అనుసరించటంతప్ప గత్యంతరంలేకపోయింది. అంతేకాకుండా ఈ క్లిష్టపరిస్థితుల్లో కుటుంబాన్ని నడిపే బాధ్యతకూడా అవిడమీదనే పడింది. దాన్నిగురించి అవిడ ఏనాడూ చెప్పుకోనైనాలేదు. ఈలోగా తనకు మిగిలిన ఒకేఒక బంగారుగాజులజత డాక్టర్ హరిపాద భార్యకు అమ్మినప్పుడుగూడా అవిడ దాన్నిగురించి ఎవరితో చెప్పలేదు. ఇంట్లో ఎవరితోనూ చర్చించనూలేదు. ప్రాణంమీదికొచ్చినప్పుడుకూడా అమ్మకూడదనంత విలువైన వస్తువేంకాదు బంగారం. ఇప్పుడు సుధామయ్ ఆరోగ్యం ముఖ్యం, అతడు త్వరగా కోలుకోవటం ముఖ్యం.

కిరణ్మయి తీరిగ్గా ఉన్నప్పుడు ఆలోచించేది. తనలోని ఏ అగాధమైన లోతుల్లోంచి తనభర్తపట్ల ఈ ప్రేమ నిరంతరంగా ప్రవహించి వస్తోందని ఆశ్చర్యపోయేది. ఇది శారీకర్రపేమకాదు. ఎందుకంటే 1971 నుంచీ వారిమధ్య శారీరకసంబంధంలేదు. "కిరణ్మయీ! నిన్నునేను మోసం చేశానుకదూ?" అనేవాడు సుధామయ్ అప్పుడప్పుడూ.

అతడు ఏం చెప్పటానికి ప్రయత్నిస్తున్నాడో కిరణ్మయికి అర్థమైనా జవాబు చెప్పేదికాదు. "లేదు. మీరునన్ను మోసం చేయలేదు. అమాట ఎవరన్నారు?" అనాలనిపించేది. కానీ సరైనమాటలు తోచేవికావు. "నువ్వు నన్ను వదిలి వెళ్లిపోతావా కిరణ్? ఒక్కోసారి నాకుచాలా భయమౌతుంది", అనేవాడు సుధామయ్ నిట్టూరుస్తూ.

అది అసాధ్యం. అతణ్ణి వదిలివెళ్లే సమస్యేలేదు. స్త్రీపురుషులమధ్య లైంగిక సంబంధం ఒకటే ప్రధానమా? ఇతర అంశాలకు ప్రాధాన్యతలేదా? ముప్పైఐదు సంవత్సరాల అనుబంధానికి విలువలేదా? ఇంతకాలమూ సాంసారిక జీవితంలో కలిసి అనుభవించిన సుఖాలనూ, దుఃఖాలనూ అంతతేలిగ్గా తీసిపారేయవచ్చా? "కాదు" అని తనకుతాను సమాధానం చెప్పుకునేది కిరణ్మయి. ఆజీవితం తిరిగిరాదు. కాబట్టి మంచిని తీసుకొని చెడ్డని వదిలిపెట్టాలి. దురదృష్టవశాత్తూ వాళ్ల జీవితంలో ఒకభాగం

నిస్సారమైపోయింది. కానీ కిరణ్మయి ఆ వాస్తవాన్ని అంగీకరించగలదు. సుధామయ్ అర్ధరాత్రిపూట తన్ను నిద్రలేపి తన అసమర్థతను గురించి చెప్పి క్షమాపణ అడిగేవాడు. తన అసమర్థత కారణంగా ఆవిడ బాధపడుతోందా అని ప్రశ్నించేవాడు. "లేదు. ఎందుకు బాధపడాలి?" అనేది కిరణ్మయి.

సుధామయ్ తన అసమర్థత కారణంగా చాలా బాధపడటం కిరణ్మయి గమనించింది. అతడు తన ముఖాన్ని తలగడలో దాచుకున్నప్పుడు అతని బాధమరింత స్పష్టంగా కనిపించేది. కిరణ్మయి గోడవైపు ముఖం తిప్పి పడుకొని రాత్రంతా కునుకులేకుండా గడిపేది. "నువ్వు కొత్తజీవితాన్ని ప్రారంభించాలనుకుంటే నాకు ఎలాంటి అభ్యంతరమూలేదు", అనేవాడు సుధామయ్.

కిరణ్మయిలో ఏనాడూ కోరిక కలగలేదని చెప్పటం సత్యంకాదు. సుధామయ్ స్నేహితులొచ్చి, కబుర్లు చెప్పుకుంటూ కూర్చునేవారు. ఒక్కోసారి వాళ్లనీడలు కిరణ్మయి ఒళ్లోపడేవి. అసంకల్పితంగా ఆనీడలు నిజాలు కాకూడదా అనిపించేది కిరణ్మయికి. ఒకనీడ రక్తమాంసాలతో నిండిపోయి తన ఒళ్లో తలపెట్టి పడుకుంటే ఎంత అద్భుతంగా ఉంటుందో అన్న ఆలోచన వచ్చేది.

కానీ కిరణ్మయి శారీరకవాంఛలు ఎక్కువకాలం కొనసాగలేదు. ఆమె శరీరం తనకు అందని అనుభవానికి అలవాటు పడిపోయింది. జీవితం ఆగిపోలేదు. ముందుకు సాగుతూనే వచ్చింది. దీనికి పెరుగుతున్న వయస్సుకూడా జతకలవటంతో గతకాలపు కోరికలు అదృశ్యమైపోయాయి. నీడల్లా సుదూరాలకు వెళ్లిపోయాయి. ఆనాటినుంచీ ఈనాటికి ఇరవై ఒక్క సంవత్సరాలు గడిచిపోయాయి. కిరణ్మయికి తాను ఏదో పోగొట్టుకున్నానన్న బాధ ఈనాడు ఎంతమాత్రమూలేదు. ఒకవేళ తాను మరోపురుషుణ్ణి స్వీకరించి ఉంటే తనసమస్య తీరిపోయేదా? అతడుకూడా అందుకు అసమర్థుడే అయివుంటే ఏం జరిగేది? ఒకవేళ అతడు సమర్థుడే అయినా అతనికి సుధామయ్‌కున్నంత మంచి మనసు ఉండేదా? కిరణ్మయి అప్పుడప్పుడూ ఇలా ఆలోచించేది.

సుధామయ్ తన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాడని కిరణ్మయికి తెలుసు. ఈ అనుభూతి ఆవిడకు ఎన్నో విధాలుగా కలుగుతుంది. ఆ అనుభూతి ఆవిడను హాయిగా ఉంచుతుంది. తాను అతనితోపాటు భోజనానికి కూచుంటేతప్ప అతడు భోంచేసేవాడుకాదు. ఎప్పుడూ చేపలకూరలోని పెద్దముక్కలు తనకే పెట్టేవాడు. పనిమనిషి రాకపోతే (తాము ఈనాటి స్థితికి రావటానికి పూర్వం) అతడు ఇల్లుతుడవటంలో, బట్టలు ఉతకటంలో తనకు సాయం చేయటానికి వచ్చేవాడు. సాయంకాలంపూట తాను విసుగ్గా ఒంటరిగా కూచుంటే తన జుట్టు చిక్కుతీయటానికి వచ్చేవాడు. లేదా దుకాణానికి వెళ్లి రెండు చీరలు కొనుక్కొచ్చుకొమ్మనేవాడు. "నీకు ఇంట్లో కట్టుకోవటానికి చాలినన్ని చీరలు లేవు", అనేవాడు. లేదా "కిరణ్, నావద్ద డబ్బుంటే నీకోసం ఓ పెద్ద ఇల్లుకట్టాలని ఉంది. ఆ ఇంటిపెరట్లో నువ్వు హాయిగా తిరగచ్చు. అన్నిరకాల పళ్లచెట్లూ పెట్టుకోవచ్చు. కూరగాయలు పండించుకోవచ్చు. పూలమొక్కలు పెంచుకోవచ్చు. చిక్కుడూ, బీరా, బీన్సూ పందిళ్లు వేసుకోవచ్చు.

గోరింటపూల పరిమళం నీగదిలోకి తేలివచ్చేది. నిజానికి బ్రహ్మపల్లిలో మనం ఉన్న ఇల్లు నీకుబాగా నచ్చేది. కానీ నాసమస్య నీకుతెలుసుగా. డబ్బునాకు ప్రధానంకాదు. డబ్బుసంపాదించటం ఒకటే ధ్యేయంగా నేను బతకలేను. అంటే డబ్బుసంపాదించే శక్తినాకు ఉండేదికాదనికాదు. మీనాన్నగారు మాఇల్లుచూసి, నాఆర్థికస్తోమతను గురించి గొప్ప అంచనావేసుకున్నారు. ఇప్పుడు ఇల్లూలేదు. డబ్బూలేదు. ఇప్పుడు మనది బొటాబొటి బతుకు. నేనెలాగో ఈబతుకుతో సర్దుకోగలను. కానీ నువ్వు బాధపడుతున్నావని నాకుతెలుసు కిరణ్".

దాపరికాలులేని ఈ సాదాసీదా మనిషి తన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాడని కిరణ్మయికి అర్థమైంది. అలాంటి వ్యక్తికోసం కొన్ని చిన్నచిన్న సుఖాల్ని పోగొట్టుకోవచ్చు. అమాటకొస్తే అలాంటి వ్యక్తిప్రేమకోసం పెద్దసుఖాలను త్యాగం చేసినా నష్టంలేదు. ఇరవైఎనిమిది సంవత్సరాల వయస్సునుంచీ తనకు కొన్ని కోరికలు తీరటంలేదు. కానీ ఎదలోపలి ఎదలో ప్రేమ సముద్రంలా పొంగుతూ శరీరానికి సంబంధించిన గాయాలను మాన్పుతూ ఉంది.

కిరణ్మయి ఆలోచనలు సురంజన్ వైపుకు మళ్లాయి. అతడు కొంతడబ్బు తెచ్చిచ్చాడు. బహూశా ఆడబ్బును అతడు ఎవరివద్దనైనా అప్పుగా తెచ్చి ఉండవచ్చు. తనకు ఉద్యోగమూ, సంపాదనాలేవు. కాబట్టి సురంజన్ తాను అప్రయోజకుణ్ణని అనుకుంటూ ఉండవచ్చు. కానీ తన ఆర్థికపరిస్థితి మరీ అంత అధ్వాన్నంగాలేదు. తాను ఎలాగో లాక్కొస్తోంది. సుధామయ్ తాను సంపాదించిన డబ్బుమొత్తం తనచేతిలో పెడుతూ ఉండటంచేత తనవద్ద ఇంకా కాస్త డబ్బు మిగిలే ఉంది. అదికాకుండా మిగిలున్న బంగారం నగలున్నాయి. అందుచేతనే సురంజన్ ఇచ్చిన డబ్బును వాపస్ ఇచ్చేసింది. కానీ అది అతణ్ణి బాధపెడుతుందని ఆలోచించలేకపోయింది. అతడు తనగదిలోకి దూకుడుగా వచ్చి "ఏం? ఆడబ్బు నేనెక్కడైనా దోచుకొచ్చాననుకున్నావా? లేదా నాలాంటి పనికిమాలిన నిరుద్యోగి వద్దనుంచి డబ్బు తీసుకోవటం నీకు అవమానంగా ఉందా? మీకోసం నేనేమీ చేయలేనిస్థితిలో ఉన్నమాట నిజమే. కానీ నాకు చేయాలని ఉందని నీకుతెలీదా? అమాత్రం నీకు అర్థంకాదా?" అన్నాడు.

అతనిమాటలు కిరణ్మయి హృదయంలోంచీ దూసుకుపోయాయి. ఆవిడ నోటమాటరాకుండా నిలబడిపోయింది.

★ ★ ★

సురంజన్ రత్న ఇంటి తలుపు తట్టాడు. ఆవిడే తలుపుతీసింది. సురంజన్ రావటం ఆవిడకేం ఆశ్చర్యం కలిగించలేదు. అతనికోసం ఎదురుచూస్తున్న దానిలాగా అతణ్ణి సరాసరి తనగదిలోకి తీసుకుపోయింది. ఆవిడ సాధారణమైన నూలుచీరకట్టుకో ఉంది. ఆవిడ నుదుటిమీద ఎర్రనిబొట్టూ, పాపిటలో ఎర్రని సిందూరరేఖా ఉంటే మరింత బావుండేదనిపించింది సురంజన్‌కు. అతనికి మతసూత్రాలన్నా, చిహ్నాలన్నా నమ్మకంలేదు. కానీ అతనికి కుంకుమన్నా, సిందూరమన్నా, శంఖనాదమన్నా ఎంతో ఇష్టం. అతని కుటుంబం మత సంప్రదాయాలను ఏనాడూ పాటించలేదు. కానీ దసరా ఉత్సవాల్లో పాల్గొనటంమీద మాత్రం ఎలాంటి నిబంధనలూలేవు.

రత్న అతణ్ణి వదిలిపెట్టి టీ తీసుకురావటానికి వెళ్లింది. "ఎలా ఉన్నావు?" అనిమాత్రమే అంది. సురంజన్‌కుకూడా మాట్లాడాలనిలేదు. పర్వీన్ తరువాత తాను మరొక అమ్మాయిని ప్రేమిస్తున్నానని అర్థంకాగానే అతనికి మాటలు కరువైపోయాయి. అతడు చాలాకాలం తరువాత గడ్డం గీచుకున్నాడు, ఇస్త్రీచేసిన చొక్కా వేసుకున్నాడు. కొద్దిగా కొలోన్‌కూడా రాచుకున్నాడు.

రత్న అమ్మానాన్నా బాగా పెద్దవారైపోయారు. ఆవిడకో అన్నయ్య ఉన్నాడు. అతనికి ఇద్దరు పిల్లలు. ఆ పిల్లల్ని సురంజన్‌కు ఎవరూ పరిచయం చేయలేదు. వాళ్లు సురంజన్‌ను చిత్రంగా చూస్తారు. రత్న వీరందరితోపాటు ఉంటుంది. రత్న అన్నయ్య పిల్లలు తలుపు సందులోంచి చూస్తున్నారు. ఏడేళ్ల వయస్సున్న అమ్మాయిని పిలిచి "నీ పేరేమిటి?" అని అడిగాడు సురంజన్.

"మృత్తిక", అంది ఆ అమ్మాయి ఉత్సాహంగా.

"ఎంత అందమైన పేరు! రత్న నీకేం కావాలి?"

"మా అత్తయ్య".

"అలాగా"

"మీరు మా అత్తయ్య ఆఫీసులో పనిచేస్తారా?"

"నేనేం పనీచేయను. అలా తిరుగుతూ ఉంటాను".

తిరుగుతూ అన్నమాట ఆఅమ్మాయికి నచ్చినట్టనిపించింది. ఆ అమ్మాయి సంభాషణ కొనసాగించటానికి సిద్ధంగానే ఉంది. కానీ ఇంతలో రత్న ఒక పళ్లెంపట్టుకొని గదిలోకొచ్చింది. అందులో రెండురకాల స్వీట్లూ, వేడిసెనగలూ, కాసిన్ని బిస్కెట్లూ, టీ ఉన్నాయి.

"అరె! హిందువుల ఇళ్లలో తిండిలేదనీ, వాళ్లు బయటికివెళ్లి ఆహారపదార్థాలు కొనుక్కోలేకుండా ఉన్నారనీ అంటున్నారు. కానీ ఈ ఇంట్లో అది నిజంకాదులాఉంది. ఈ ఈపళ్లెంలోని వస్తువుల్తో ఓ దుకాణమే పెట్టవచ్చు! అదిసరే కానీ నువ్వు సిల్హెట్‌నుంచి ఎప్పుడు తిరిగొచ్చావు?"

"నేను సిల్హెట్ వెళ్లలేదు. హబీగంజ్, సునంగంజ్, మౌల్వీబజార్ చూసొస్తున్నాను. హబీగంజ్‌లో నాకళ్లెదుటే మూడు దేవాలయాల్ని తగలబెట్టారు."

"ఈ విధ్వంసమంతా ఎవరు చేస్తున్నారు?"

"ఇంకెవరు? గడ్డాలూ, టోపీలూ ఉన్న ముస్లిములే! ఆతరువాత షాపింగ్ సెంటర్‌లోని కాళికాలయాన్ని ధ్వంసంచేశారు. తపన్‌దాస్ గుప్త అన్న మా బంధువొకాయనున్నాడు. అతడు డాక్టర్. అతని కన్సల్టింగ్ రూమ్‌నుకూడా లూటీచేసి ధ్వంసంచేశారు. 8 వ తేదీన సునంగంజ్‌లో రెండుదేవాలయాల్ని నేలమట్టం చేశారు 9 వ తేదీన నాలుగు దేవాలయాల్నీ, యాభై దుకాణాల్నీ బూడిదచేశారు. మౌల్వీ బజార్‌లో, రాజ్‌నగర్‌లో, కులారాలో ఆరు- దేవాలయాల్నీ, ఒక వ్యాయామశాలనీ ధ్వంసంచేశారు. బ్రాహ్మణబజార్‌లో ఏడు దుకాణాల్ని లూటీచేశారు."

"అవి హిందువుల దుకాణాలే ననుకుంటాను".

రత్న నవ్వకుండా ఉండలేకపోయింది.

"అందుకు సందేహమా?"

"ఈదేశంలో ఉండటం సాధ్యమేనంటావా?" అంది మళ్లీ. సెనగలూ, టీ సురంజన్ ముందుపెడుతూ.

"ఎందుకుకాదు? ఈదేశం ముస్లిముల సొంత ఆస్తా?"

రత్న నవ్వింది. సన్నని విషాదరేఖ ఆవిడ పెదవులమీద కదిలింది.

"తమ ఆస్తుల్ని చాలా చవగ్గా అమ్మేసి – ఇంతకూ అమ్మగలిగితే – వెళ్లిపోతున్నారు. ఇదీ భోలాలో పరిస్థితి".

"భోలా వదిలిపోతున్న వాళ్లు ఎవరు? హిందువులేనా?"

"నిస్సందేహంగా".

"మరి ఆమాట ఎందుకు చెప్పవు?" అన్నాడు సురంజన్ సెనగలు నోట్లో వేసుకుంటూ.

చెప్పాల్సిన అవసరంలేదని సురంజన్‌కు తెలుసు. బాధలు పడుతున్నది హిందువు లేకాబట్టి వారే వెళ్తారు. కానీ "హిందువులు" అన్నమాట ఆవిడచేత చెప్పించాలన్న పట్టుదలతో అడిగాడు.

రత్న సురంజన్ మాటను ఎలా అర్థం చేసుకుందో కానీ జవాబుమాత్రం చెప్పలేదు. అతడు తింటూఉంటే కన్నార్పకుండా అతణ్ణి చూస్తూ ఉంది. సురంజన్ మనస్సు ఒకే విషయంమీద ఉంది. "నువ్వంటే నాకుచాలాఇష్టం. నీకూ ఇష్టం ఉంటే నిన్ను సంతోషంగా పెళ్లిచేసుకుంటాను", అని చెప్పటానికి – ఎలాంటి అరమరికలూ లేకుండా చెప్పటానికి – వచ్చాడు.

రత్న మంచినీళ్లు తీసుకురావటానికి లోపలికెళ్లింది. ఆవిడ వెళ్తుండగా ఆవిడ చీర చెరుగు అతని చేతికి తగిలింది. అతడు ఆ స్పర్శతో పులకించిపోయాడు. రత్న సులభంగా తన భార్యకావచ్చు! తన తిరుగుబోతు జీవితానికి నిలకడ కలగటంకోసంకాదు ఆవిడను పెళ్లిచేసుకోవటం. తమ దాంపత్యం సంతోషదాయకంగా ఉంటుంది. అందుకు సందేహంలేదు. తాము ఒకరిపక్కన ఒకరు పడుకొంటారు. తాను ఆవిడ వేళ్లను తన చేతిలోకి తీసుకొని వాటితో ఆడుకుంటాడు. తాము చిన్నపిల్లలుగా, బట్టలుకూడా లేకుండా తిరుగుతున్న కాలాన్నిగురించి కబుర్లు చెప్పుకుని నవ్వుకుంటారు. తమమధ్యఉన్న గోడలు త్వరలోనే కూలిపోతాయి. రత్న భార్యగాకాదు స్నేహితురాలిగానే తనకు ఎక్కువగా కావాలి.

కానీ ఆవిడ అభిప్రాయం ఏమిటి? ఆవిడకళ్లలోతుల్లో దాగి ఉన్న ఆలోచనలేమిటి? అవేమిటో తనకు అర్థం కానందుకు సురంజన్‌కాస్త నిరాశపడ్డాడు.

"మీరంతా క్షేమంగానే ఉన్నారేమో చూద్దామని వచ్చాను", అన్నాడు చివరికి.

"క్షేమం? ఈమాట పురుషులకోరకంగా, స్త్రీలకు మరో రకంగా అర్థమౌతుంది. మీరు ఎవరి క్షేమంగురించి తెలుసుకోవటానికి వచ్చారు?"

"ఇద్దరిక్షేమమూ".

రత్న తలదించుకొని నవ్వింది. ఆమె నవ్వితే ముత్యాల తళతళలుండవు. కానీ ఆమె నవ్వుచూట్టం అందమైన అనుభవమే. సురంజన్ ఆమె ముఖంమీదనుంచి చూపును మరల్చుకోలేకపోయాడు. ఆవిడకూ తనకూ వయస్సులో ఎక్కువతేడా ఉందా అని క్షణంపాటు ఆశ్చర్యపోయాడు. తనవయస్సు వచ్చేసరికే మొగవాళ్లు కాస్త వడలిపోతారా? లేదా తాను రత్నను పెళ్లిచేసుకోవటానికి అసలు పనికిరాడా? తాను ఇలా ఆలోచిస్తుంటే రత్న తన్ను పరీక్షగా చూస్తోందని అతడు గమనించాడు. ఆవిడకళ్లలో లీలగా ప్రేమ కదులుతోంది.

"మీరు ఇంకా పెళ్లి చేసుకోకూడదన్న దృఢనిశ్చయంలోనే ఉన్నారా?" అంది రత్న చిరునవ్వుతో.

సురంజన్ జవాబు చెప్పటానికి కాస్త సమయంతీసుకున్నాడు.

"జీవితం నదిలాంటిది. అదిమీకు తెలుసుకదా? ఎప్పుడైనా నది ఒకచోట ఆగిపోతుందా? అలాగే నిర్ణయాలుకూడా అప్పుడప్పుడూ మారుతుంటాయి. అవి ఎప్పుడూ మారకుండా అలాగే ఉండిపోవు".

రత్న అతని మాటల్ని శ్రద్ధగా, పూర్తిగా వింది. సుగంజన్ వెళ్లటానికి లేచాడు. రత్న అందంగా నవ్వుతూ అంది. "థాంక్‌గాడ్".

ఈనాడు హిందువులున్న పరిస్థితిలో, మొత్తం దేశం ఉన్న పరిస్థితిలో "థాంక్‌గాడ్" అన్న మాటకాస్త అసంగతంగా వినిపించింది.

కానీ సురంజన్ అసంతృప్తిగా ప్రవర్తించలేదు.

ఆవిడ ఆమాట ఎందుకన్నదో అతనికి తెలుసుకాబట్టి ఎందుకన్నావని ఆవిడను ప్రశ్నించాల్సిన అవసరం అతనికి లేదు. రత్న సాన్నిధ్యంలో అతనికి కల్తీలేని ఆనందం లభించటం ప్రారంభించింది. ఆవిడ నాజూకైన వేళ్లను సుతారంగా పట్టుకొని "రాపోదాం – సాలవృక్షాల అడవిలోకి. వెన్నెల్లో పడుకుందాం. చంద్రుణ్ణి మనమీద ఉజ్వలంగా వెలగమనీ, మనల్ని రక్షించమనీ అడుగుదాం. మన పాతభావాలనూ, నిర్ణయాలనూ మార్చుకుందాం. కలిసి బతుకుదాం" అందామనిపించింది.

కానీ ఏమీ అనలేకపోయాడు. అనగలిగిన క్షణం దాటిపోయింది. రత్న తాను మేడమెట్లు దిగుతుంటే వీడ్కోలు చెప్పింది. "మళ్లీ రండి. మీరొచ్చారు కాబట్టి మాకూ కావాల్సిన వాళ్లున్నారన్న నమ్మకం కలిగింది. మేంకూడా ఒంటరివాళ్ళం కాదన్నమాట...."

ఒకనాడు పర్వీన్ తన హృదయాన్ని గువ్వను లేపినట్టుగా నిద్రలేపింది. ఆకదలికలు ఈనాడు మళ్లీ తన హృదయంలో కలిగాయి. ఒకనాడు పర్వీన్ తనకు దారిచూపించిన ఆనంద స్వర్గాలలోకి తేలిపోతున్నట్టుగా అనిపించింది సురంజన్‌కు.

★ ★ ★

# ఆరవరోజు

ఉదయంటీకప్పుతోపాటు పత్రికల్నికూడా అందుకున్నాడు సురంజన్. ఈరోజు అతడు ఆందోళన లేకుండా ఉన్నాడు. ముందురోజు రాత్రిహాయిగా నిద్రపోయాడుకూడా. పత్రికల్ని తిరగేసిన తరువాత మాయను పిలిచాడు.

"ఏమిటి మాయా! నువ్వెప్పుడూ ఎందుకంత కుంగిపోయినట్టుగా ఉంటావ్?" అన్నాడు.

"నేను మామూలుగానే ఉన్నాను. నువ్వే చిత్రంగా ప్రవర్తిస్తున్నావు. నువ్వు ఇంతవరకూ నాన్నగారివద్ద ఒక్కక్షణంకూడా కూచోలేదు".

"నాకలాంటి పనులు చేతకావు. ఇంతవరకూ ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్న మనిషి కొయ్యమొద్దులా అలా పడుకోఉంటే చూడటంనాకు కష్టంగా ఉంటుంది. మీరిద్దరూ అక్కడకూచొని కన్నీళ్లు పెట్టుకుంటూ ఉంటే నాకు మరీ కష్టంగా ఉంటుంది. అదిసరేకానీ నేనిచ్చిన డబ్బు అమ్మ ఎందుకు తిరిగిచ్చేసింది? అమ్మదగ్గర దండిగా డబ్బుందా?"

"అమ్మ తన నగల్ని అమ్మేసింది".

"మంచిపనిచేసింది. నాకు నగలంటే ఇష్టంలేదు".

"ఇష్టంలేదా? అలాగైతే పర్వీన్‌కు ముత్యాల ఉంగరాన్ని ఎందుకిచ్చావ్?"

"ఓ అదా! అప్పుడు నేను చాలా అపరిపక్వంగా ఉన్నాను. నాకంత తెలివితేటలుకూడాలేవు...."

"అలాగైతే నీకిప్పుడు పరిపక్వత వచ్చిందన్నమాట", అంది నవ్వుతూ.

మాయనవ్వటం సురంజన్‌కు ఎంతో సంతోషాన్ని కలగజేసింది. ఆవిడ సంతోషంగా నవ్వుతూ కనిపించి ఎంతో కాలమైంది. ఆవిడను మరింత నవ్వించటంకోసం తాను చదువుతున్న పత్రికలో పతాకశీర్షికను చూపించాడు.

"చూడు... మనం అన్నిమతాలూ, కులాలూ సామరస్యంతో జీవిస్తున్న దేశంలో ఉన్నాం. అఖిలపక్షశాంతిసంఘం మతతత్వాన్ని అంతంచేయమనీ, దౌర్జన్యాలకూ, హత్యలకూ పాల్పడినవాళ్లను శిక్షించమనీ గట్టి పిలుపునిచ్చింది. భారతదేశంలో పరిస్థితి మెరుగుపడింది. బాబ్రీ మసీదుప్రాంతంలో భూమిని అక్రమంగా ఆక్రమించుకోవటం చట్టవిరుద్ధమని హైకోర్టు తీర్పు ఇచ్చింది. బాబ్రీమసీదు విధ్వంసానికి బాధ్యత పూర్తిగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానిదేననీ, కేంద్రప్రభుత్వానిదికాదనీ నరసింహారావు ప్రకటించాడు. పశ్చిమబెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలు ఇంకా సైనికదళాల పర్యవేక్షణలో ఉన్నాయి. వామపక్షపార్టీలు మతతత్వంమీద యుద్ధాన్ని ప్రకటించాయి. మతసామరస్యాన్ని రక్షించటంకోసం శాంతిదళాన్ని ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో సి.పి.బి. ఈరోజు పల్టాన్ జంక్షన్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేస్తోంది. ఇందుకు అవామీలీగ్‌కూడా ప్రయత్నిస్తోంది. నగరసమన్వయసంఘం అల్లర్లకు బాధ్యులైనవారినీ,

ప్రోత్సహిస్తున్నవారినీ అరెస్టుచేయాలని డిమాండ్ చేసింది. మతతత్వ నిర్మూలనాసంఘం కూడా ఈరోజు ఒక సమావేశాన్ని ఏర్పాటుచేస్తోంది. టోంగీలో అఖిలపక్షశాంతి ప్రదర్శన జరగబోతోంది. "బంగ్లాదేశ్ మతతత్వశక్తుల్ని అంతంచేసి తీరుతుంది" అని సాంస్కృతిక ఐక్యతావేదిక పిలుపునిచ్చింది. పదిహేనుమంది ప్రముఖులు, పౌరులు మతసామరస్యాన్ని కాపాడే బాధ్యతను స్వీకరించాలని కోరారు. ఫాసిస్టు జమాతీల నడుము విరగ్గొట్టాలని కర్నల్ అక్బర్ ప్రకటించాడు. బరిసాల్‌లో ఐక్యమతసామరస్య సమాఖ్యను ఏర్పాటుచేశారు. మతసామరస్యం దెబ్బతింటే విజయమాసోత్సవాలకు ఎలాంటి పవిత్రతా ఉండదని ఢాకా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం ప్రకటించింది. దేవాలయాల్ని దోచుకుంటున్న ఇరవైఎనిమిది మందిని ధంరాజ్‌లో అరెస్టు చేశారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబాసు భారతదేశం ప్రపంచంఎదుట తలవంచుకోవాల్సి వచ్చినందుకు ఎంతో బాధపడ్డాడు".

"నువ్వు మంచి వార్తలు మాత్రమే చదివావు...." పరుపుమీద పద్మాసనంవేసుకొని కూచుంటూ అంది మాయ, అన్నయ్యచేతిలోంచి పత్రిక లాక్కుంది.

"ఇతరవార్తల సంగతేమిటి? భోలాలో పదివేలకుటుంబాలు నిరాశ్రయులు అయ్యారు. చిట్టకాంగ్‌లో ఏడువందల ఇళ్లను తగలబెట్టారు. కిషోర్‌గంజ్‌లో దేవాలయాలను కూలదోశారు. ఫిరోజ్‌పూర్‌లో 144 సెక్షన్ ప్రకటించారు. మిర్‌సరీలో ఏడువందల ఇళ్లను తగలబెట్టారు".

"ఈరోజు నేను మంచిమూడ్‌లో ఉన్నాను. చెడ్డవార్తల్నీరోజు వినను", అన్నాడు సురంజన్ గట్టిగా.

"ఎందుకూ? పర్వీన్ విడాకులు పుచ్చుకుంటోందనా? ఆవిడ నిన్నమనింటికి వచ్చింది. ఆవిడ మొగుడు ప్రతిరాత్రీ ఆవిణ్ణి కొడతాడట".

"దాన్నిగురించి ఇప్పుడేం చేయగలం? ఆవిడ ముస్లింను పెళ్లిచేసుకుంటే మాత్రమే సంతోషంగా ఉంటుందని వాళ్లు గట్టిగా నమ్మారు. నా సంతోషానికీ పర్వీన్‌కు ఎలాంటి సంబంధమూలేదు. అసలు ముస్లిముల్తోనే సంబంధంలేదు. మేం పెళ్లిచేసుకోవటానికి ముందు 'నువ్వు మతం మార్చుకోవటానికి అంగీకరిస్తావా?' అని ఇద్దరూ బాధగా అడగాల్సిన అవసరంలేదు".

మాయ హాయిగా నవ్వింది. అతడు ఆ అందమైననవ్వును విని ఎంతోకాలమైంది.

ఉన్నట్టుండి సురంజన్ సీరియస్‌గా అయిపోయాడు.

"నాన్నగారెలా ఉన్నారు? త్వరగాలేచి తిరుగుతారుకదూ!" అన్నాడు.

"ఇప్పుడు ఫరవాలేదు. ఇప్పుడు బాగా మాట్లాడగలుగుతున్నారు. ఎవరైనా సాయంచేస్తే బాత్‌రూందాకా నడుస్తున్నారు. కొద్దిగా మెత్తని ఆహారంకూడా తీసుకుంటున్నారు. అన్నట్టు నిన్న బెలాల్‌భాయ్ వచ్చి, నీకోసం అడిగాడు. నాన్నగారిని చూసివెళ్లాడు. నువ్వు బయటికి వెళ్లకూడదనీ, వెళ్లటం ప్రమాదమనీ చెప్పివెళ్లాడు."

"అలాగా?"

సురంజన్ అకస్మాత్తుగా లేచినిలబడ్డాడు. అతనెందుకంత తొందరపడుతున్నాడో మాయకు అర్థంకాలేదు.

"ఏమిటి? బయటికెళ్తున్నావా?"

"నేను ఇంట్లో ఉండేరకం మనిషినేనా?"

"నువ్వు బయటికెళ్తే అమ్మకు భయంగా ఉంటుంది. వెళ్లొద్దుదాదా! నాకూ భయంగా, ఆందోళనగా ఉంటుంది".

"నేను పులోక్‌కు డబ్బు వాపస్ ఇవ్వాలి. నీదగ్గరేమైనా డబ్బుందా? ఏమైనా నువ్వు ఉద్యోగం ఉన్నదానివికదా! నీదగ్గరున్న డబ్బులోంచి సిగరెట్లకు కాస్త డబ్బివ్వు".

"సిగరెట్లకైతే డబ్బివ్వను. నువ్వు త్వరగా చచ్చిపోవటం నాకిష్టంలేదు".

ఆమాట అంటూనే మాయ లోపలికెళ్లింది. వందటాకాలనోటు తీసుకొచ్చి అన్నయ్యకిచ్చింది. సురంజన్ చెల్లెల్ని ఎంతో అభిమానంతో చూశాడు. చాలాసంవత్స రాలక్రితం జరిగిన సంఘటన అతని మనసులో మెదిలింది. అప్పుడు మాయచాలా చిన్నపిల్ల. "హిందువు హిందువు హిందువు....గోవుల మాంసంతినే హిందువు...." అని బళ్లో తోటిఅమ్మాయిలుగేలి చేశారు. మాయకు దుఃఖం వచ్చింది.

"దాదా! నేను హిందువునా?" అని సురంజన్‌ను అడిగింది.

"ఔను" అన్నాడు సురంజన్.

"హిందువుగా ఉండటంనాకు ఇష్టంలేదు. నేను హిందువునుకాబట్టి అందరూ ఎగతాళి చేస్తున్నారు", అంది.

ఈ సంభాషణనువిన్న సుధామయ్ అన్నాడు.

"నువ్వు హిందువని ఎవరన్నారు? నువ్వు మనిషివి. మనిషిగా ఉండటంకంటే ఏదీ గొప్పకాదు". అతడలా అన్నప్పుడు సురంజన్ హృదయం అతనికి వినమ్రంగా నమస్కరించింది. తానుచాలామందిని చూశాడు. కానీ నాన్నగారివంటి ఉన్నతుణ్ణీ, సహృదయుణ్ణీ, సహనవంతుణ్ణీ, చూడలేదని అతనికి అనిపించింది.

★ ★ ★

1964 లో ఒక దౌర్జన్యకాండను ఆపటానికి సుధామయ్ "తూర్పుపాకిస్తాన్ దేశమా! వాళ్లను ఆపు.... వాళ్లను అడ్డుకో...." అన్న నినాదాన్ని సృష్టించాడు. కానీ అదృష్టవశాత్తు షేక్ ముజీబ్ జోక్యం చేసుకోవటంచేత ఆ దౌర్జన్యకాండ ఎక్కువగా వ్యాపించలేదు. వాస్తవానికి ఆదౌర్జన్యకాండను ప్రభుత్వానికి వ్యతిరేకంగా వస్తున్న ఉద్యమాలను భగ్నంచేయటంకోసం అయూబ్‌ఖాన్ మద్దతుదార్లే ప్రారంభించారు. ఆదౌర్జన్యం ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతోందని అధికారులు కోర్టులకెళ్లారు. విద్యార్థులమీద కేసులు బనాయించారు. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న రాజ కీయనాయకుల్ని కేసుల్లో ఇరికించారు. సుధామయ్ అలా కేసుల్లో ఇరుక్కున్నవాళ్లలో ఒకడు. అతనిలో గతవైభవస్మరణలేదు. కానీ గతం ముక్కలుముక్కలుగా అతని మనసులోకి రావటం ప్రారంభించింది. అతనికే తెలియకుండా అతడు విచారంలోకి జారిపోయాడు. దేశ వ్యవహారాలతో, దేశ సౌభాగ్యంతో దేశ భవిష్యత్తుతో అతని

అనుబంధం ఏమైంది? అది ఎలా పరిణమించింది? 1975 నుంచీ దేశపరిపాలన క్రమక్రమంగా మతదురహంకారుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇది ప్రజలకు తెలిసినా ఎవరూ ప్రతిస్పందించటానికి ఇష్టపడలేదు. ఈతరానికి విలువల పరిజ్ఞానంలేదా? గతకాలపు చైతన్యం ఎక్కడికిపోయింది? బెంగాలీని జాతీయభాషగా చేయాలని 1952 లో ఉద్యమాలు నడిపిన యువచైతన్యం ఇప్పుడేదీ? తమ ఆదర్శంకోసం ఆనాటి యువకులు మూకుమ్మడిగా బలైపోవటానికి సిద్ధపడ్డారు. 1969 లో ఉప్పెనలా పైకుబికి తమ ప్రాణాలను తాము నమ్మిన ఆదర్శంకోసం త్యాగంచేసిన యువతరానికి ఈనాడు వారసులేరీ? 1971 నాటి లక్షలాది దేశభక్తులేరీ? వారి ఉత్సాహాన్ని ఎవరు నీరుగార్చారు? వారి ఆదర్శాలను ఎవరు భగ్నంచేశారు? ఈ ఉద్యమంలోకి తన్ను నడిపించిన ఉద్రేకమూ, ఉత్సాహమూ ఏవీ? ఈనాటి యువకుల శరీరాలు పాముల శరీరాల్లా ఎందుకు చల్లబడిపోయాయి? లౌకికదేశంలోకి మతతత్వాన్ని ఎందుచేత అందరూ సాదరంగా ఆహ్వానిస్తున్నారు? రాబోయేకాలం ఎంత ప్రమాదకరంగా ఉంటుందో ఎందుచేత ఎవరూ ఆలోచించటంలేదు? ఆలోచనలు ఇలా ముసురుకుంటూ ఉంటే సుధామయ్ మంచంమీదనుంచీ లేవటానికి ప్రయత్నించాడు. కానీ వీలుకాలేదు. బాధా, బలహీనతా అతని ముఖంమీద గీతలుగా బయటపడ్డాయి.

★ ★ ★

ఆయూబ్ ఖాన్ ప్రభుత్వం ఆనాడు ప్రవేశపెట్టిన "ఎనిమీప్రాపర్టీ ఆక్ట్" (శత్రువుల ఆస్తులకు సంబంధించిన చట్టం)ను అవామీలీగ్ ప్రభుత్వం "అక్వాయిర్డ్ ప్రాపర్టీ ఆక్ట్" (స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించిన చట్టం) అన్నమారు పేరుతో ఈనాడు ప్రవేశపెట్టింది. పాతచట్టం ప్రకారం దేశాన్ని వదిలివెళ్ళిపోయిన హిందువుల ఆస్తిని "శత్రువుల ఆస్తి"గా పరిగణించేవారు. అంటే సుధామయ్ మామయ్యలు శత్రువులేకదా? వాళ్లకు చాలా పొలాలుండేవి. అవిగాక ఢాకాలో, సోనార్‌గాఁవ్‌లో, నర్సిందీలో, కిషోర్‌గంజ్‌లో, ఫరీద్‌పూర్‌లో పెద్దపెద్ద భవనాలుండేవి. వాళ్లు వెళ్లిపోయిన తరువాత ఆ భవనాల్లో విద్యాసంస్థల్నీ, పశువుల ఆసుపత్రుల్నీ, కుటుంబనియంత్రణ కార్యాలయాల్నీ, ఆదాయపుపన్నుల కార్యాలయాల్నీ పెట్టారు. సుధామయ్ చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు రామకృష్ణా మిషన్‌రోడ్లో అనిల్ అన్న మామయ్య ఉండేవాడు. అతను చాలాపెద్ద భవనంలో ఉండేవాడు. అతనికి పదిగుర్రాలుకూడా ఉండేవి. ఆగుర్రాలమీద తన్ను స్వారీచేయించటం సుధామయ్‌కి ఇంకాబాగా జ్ఞాపకమే.

ఈనాడు సుధామయ్ తికాతులీ మొహల్లాలో చీకటి గుయ్యారంలాంటి చిన్న ఇంట్లో ఉంటున్నాడు. అదేప్రాంతంలో అతని మామయ్యకో పెద్దభవంతి ఉండేది. ఇప్పుడు దాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. కొత్తచట్టంలో ఆస్తుల్ని ఇలకాదేశంలో ఉన్న వారి బంధువులకు ఇవ్వాలనే సూత్రం ఉండి ఉంటే బంగ్లాదేశ్‌లోనే ఉండిపోయిన హిందువులజీవితాలు ఇప్పుడున్నంత దీనంగా ఉండేవికావు. ఈ విషయాన్ని అనేకమంది ప్రభుత్వ ఉన్నతాధికారులకు సూచించినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇది అతని అనేక పరాజయాల్లో ఒకటి. ఇలాంటి పరాజయాలతోనే అతడు అలిసిపోయాడు. ఇప్పుడతనికి కదిలీ కదల్లేని పక్షవాతరోగిగా జీవితాన్ని లాగటంతప్ప

మరో మార్గంలేదు. తాను ఇంకా బ్రతకాల్సిన అవసరం అతనికి కనిపించటంలేదు. తాను నిశ్శబ్దంగా నిద్రలో చనిపోతే ఎవరికీ నష్టంలేదు. కిరణ్మయికి నిద్రలేని రాత్రులూ, నిరంతరమైన బాధా తప్పుతాయి. అలా మంచంలో పడిఉన్న సుధామయ్ బంగ్లాదేశ్ ప్రభుత్వం హిందూపౌరుల్ని రక్షించటంలో ఎలా విఫలమైందో మరోసారి ఆలోచించకుండా ఉండలేకపోయాడు.

1965 లో జరిగిన భారతపాకిస్తాన్ యుద్ధం తరువాత రెండు అంశాలు "శత్రువుల ఆస్తి చట్టం" రావటానికి దారితీశాయి. మొదటిది తూర్పుపాకిస్తాన్‌ను ఒక వలసగా పరిగణించే పాకిస్తానీ ఫాసిస్టు తత్వం. రెండవది పాకిస్తాన్ మతతత్వం. కానీ స్వాతంత్ర్యం వచ్చాక అదే చట్టాన్ని మరోపేరుతో ప్రవేశపెట్టారు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశానికిది అవమానకరమైన చట్టమని సుధామయ్ గట్టిగా నమ్మాడు. ఈచట్టం ప్రాథమికమైన మానవతా, ప్రజాస్వామ్య హక్కుల గొంతు పిసికిందన్నది సత్యం. పాతచట్టానికి పేరు మార్చటం తప్పితే హిందువులకు ఇతరుల్తో సమానహక్కులు లభించలేదు. కుట్రలాంటి ఈచట్టం రెండుకోట్లమంది హిందువుల్ని సర్వనాశనం చేసింది. వారిని తమ ఇళ్లలోంచి బయటికి నెట్టేసింది. ఇలాంటి పరిస్థితిలో హిందువులు తమకు భద్రతలేదంటే వారిని ఎవరైనా ఎలాతప్పు పట్టగలరు? మళ్లీ ఈనేలలో మతతత్వ బీజాల్ని నాటారు. అది వాళ్లుచేసిన తప్పా?

ఈదేశపురాజ్యాంగచట్టం అందరికీ సమానమైన భద్రతనూ, హక్కులనూ ఇచ్చింది. కానీ "శత్రువుల ఆస్తిచట్టం" మాత్రం రాజ్యాంగచట్టానికి వ్యతిరేకమైంది. అంతేకాదు దేశం యొక్క స్వాతంత్ర్యానికీ, సార్వభౌమత్వానికీ ఇది అవమానకరమైన చిహ్నంకూడా. రాజ్యాంగచట్టంలో ప్రాథమిక హక్కుల్నిగురించి స్పష్టమైన ప్రకటన ఇలాఉంది :

26(1) ఈ భాగానికి వ్యతిరేకంగా ఇప్పటికే ఉన్న చట్టాలూ, లేదా ఇకమీదట చేయబడే చట్టాలూ – ఈభాగంలో అంగీకరించనంతవరకూ – ఎలాంటి విలువనూ కలిగిఉండవు.

26(2) ఈ భాగానికి వ్యతిరేకంగా రాజ్యం–స్టేట్– ఎలాంటి చట్టాన్నీ చేయకూడదు. అలాంటి చట్టానిక్కూడా – ఈభాగంలో అంగీకరించనంతవరకూ – ఎలాంటి విలువాలేదు.

27 ఈదేశంలోని పౌరులందరూ చట్టంముందు సమానులే. అందరికీ సమానంగా చట్టంయొక్క రక్షణ ఉంటుంది.

28(1) మతం, జాతి, కులం, లింగం, పుట్టినచోటు ఆధారంగా రాజ్యం పౌరులను వేరువేరుగా చూడదు.

31 చట్టంయొక్క రక్షణను కలిగి ఉండటం, చట్టం ప్రకారం చూడబడటం – చట్టం ప్రకారం మాత్రమే చూడబడటం – ప్రతిపౌరునికీ ఉన్న హక్కు. అతడు ఎక్కడున్నా లేదా తాత్కాలికంగా బంగ్లాదేశ్‌లో ఉన్నా అతని స్వాతంత్ర్యానికీ ధనమానప్రాణాలకూ భంగం కలిగించే చర్యల్ని, చట్టానికి లోబడిమాత్రమే, తీసుకోవాలి.

112 వ అధికరణం ఇలా స్పష్టంగా చెబుతుంది. "ఈ రిపబ్లిక్‌లోని పరిపాలనా, న్యాయాంగశాఖల అధికారులు సుప్రీంకోర్టు సహకారంతో పనిచేస్తారు".

1965 లో వచ్చిన పాకిస్తానీ రక్షణ చట్టంలో 'శత్రువులు' అన్న పదాన్ని ఇలా నిర్వచించారు.

ఎ. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా యుద్ధంచేస్తున్న దేశంలేదా దేశాధిపతి.

బి. శత్రుదేశంలో నివాసం ఉన్నవ్యక్తి.

సి. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా యుద్ధంకానీ, సైనికచర్యకానీ చేస్తున్న దేశంలో చట్టబద్ధంగా ఏర్పాటుచేసిన ప్రజాసంస్థ.

డి. కేంద్రప్రభుత్వంచేత శత్రువుగా ప్రకటించబడిన వ్యక్తి లేదా వ్యక్తులసంఘం.

ఇ. శత్రువుగా ప్రకటించబడిన వ్యక్తి లేదా వ్యక్తులచేత నడపబడుతూ ఉన్న సంస్థ.

ఎఫ్. ఆసంస్థచేత శత్రుదేశంలో నడపబడుతూ ఉన్న వ్యవహారాలతో సంబంధం ఉన్న వ్యక్తి లేదా వ్యక్తులు.

ఈవిషయాన్ని గురించి 169 అధికరణంలో మరింత వివరణా, వర్గీకరణా ఉన్నాయి.

ఎ. పాకిస్తాన్‌తో యుద్ధం లేదా సైనికచర్య చేస్తూ ఉన్న దేశంయొక్క పౌరసత్వాన్ని కలిగినవ్యక్తి, లేదా అలాంటి పౌరసత్వాన్ని ఒకప్పుడు కలిగి ఉండి దాన్ని పోగొట్టుకొని, ఇప్పుడు మరొకదేశ పౌరసత్వం లేనివ్యక్తి.

బి. అలాంటి దేశంలో చట్టప్రకారం ఏర్పాటైన లేదా గుర్తింపుఉన్న ప్రజాసంస్థ.

169.4 "శత్రువుల ఆస్తి" అంటే 161వ రూలుప్రకారం శత్రువైన వ్యక్తి తరఫున ఇతరుల స్వాధీనంలో ఉన్నలేదా అజమాయిషీ చేయబడుతూ ఉన్న ఆస్తి లేదా వ్యాపారసంస్థ. ఇందులో 1957 (XXL, 1957) చట్టం ప్రకారం (పాకిస్తాన్ ఇవాక్యుయీ ప్రావర్టీ చట్టం) ప్రమాదకరమైన స్థలాలనుంచి తొలగించబడిన వారి ఆస్తిపాస్తులు చేరవు.

అందులో ఇంకా ఇలా ఉంది :

"పాకిస్తాన్‌లో నివసిస్తూ ఉన్న ఒక శత్రువు చనిపోతే అతడు చనిపోవటానికి ముందు అతని అధీనంలోకానీ, అతనికి సంబంధించినవారి అధీనంలోకానీ ఉన్న ఆస్తి శత్రువు ఆస్తిగానే పరిగణించబడుతుంది".

1947 తరువాత తూర్పుపాకిస్తాన్‌లో మతకలహాలు ప్రారంభమయ్యాయి. లక్షలాది హిందువులు భారతదేశానికి పారిపోయారు. అప్పుడు పాకిస్తాన్ ప్రభుత్వం "తూర్పుబెంగాల్ నుంచి వెళ్లిపోయినవారి ఆస్తులచట్టం" అన్నపేరుతో ఆస్తుల్ని ప్రభుత్వం నిర్వహించటానికి 1949 లో, స్వాధీనం చేసుకోవటానికి 1951 లో చట్టాల్ని తీసుకువచ్చింది. 1951 లో తెచ్చిన "ఈస్ట్ బెంగాల్ ఇవాక్యుయీ చట్టం" చట్టం నెం. XXIV లో ఇలా ఉంది.

"క్రింది సందర్భాల్లో దేశంవదిలి వెళ్లిపోయినవారి ఆస్తుల్ని స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వం నియమించిన సంఘానికి ఉండదు."

1. ఆస్తి సొంతదారుడుకానీ అతని భాగస్తులుకానీ తమ ఆస్తిని అజమాయిషీ చేయటానికి సొంత ఏర్పాట్లు చేసుకున్నామని ప్రకటించినప్పుడు, ఆ ఏర్పాట్లు చట్టబద్ధంగా ఉన్నాయని ఈ సంఘం నమ్మినప్పుడు.
2. సొంతదారుని అక్షేపణను ఈసంఘం ఆమోదించినప్పుడు.

దేశాన్ని వదిలి వెళ్లిపోయిన వ్యక్తి తన ఆస్తిని స్వాధీనం చేసుకొమ్మని కోరినప్పుడు మాత్రమే ఈసంఘం ఆ ఆస్తిని స్వాధీనం చేసుకుంటుందనీ, ఆస్తి సొంతదారునికి తన ఆస్తిని తన ఇష్టంవచ్చిన పద్ధతిలో అమ్ముకునే హక్కు ఉందనీ ఈచట్టం స్పష్టంగా చెబుతుంది.

1957 లో పాకిస్తాన్ ప్రభుత్వం ఈచట్టానికి సవరణ (చట్టం నెం.XXII 1957) తీసుకువచ్చింది. ఈచట్టం ప్రకారం "భారతదేశంలోకానీ, భారతదేశం ఆక్రమించుకున్న ప్రాంతంలోకానీ నివసిస్తూ తన ఆస్తిని సొంతంగా అజమాయిషీ చేసుకోలేకపోయిన వారి ఆస్తి" కూడా "శత్రువు ఆస్తి" గా పరిగణించబడింది. కాని ఈ చట్టంకూడా 1964 లో వచ్చిన ఆర్డినెన్స్‌లాగా హిందువుల్ని బాధపెట్టలేదు.

1965 లో జరిగిన ఇండో–పాక్ యుద్ధం తరువాత పాకిస్తాన్ ఎమర్జన్సీని ప్రకటించింది. 1962 నాటి రాజ్యాంగ చట్టంలో మార్పులు చేసింది. రాజ్యాంగ చట్టంలోని 1,2 అధ్యాయాల్లో ప్రకటించిన ప్రాథమిక హక్కుల్ని కుదించింది. "డిఫెన్స్ ఆఫ్ పాకిస్తాన్ రూల్స్" అన్న చట్టాన్ని 1965 సెప్టెంబర్6 న ప్రకటించింది.

ఈచట్టంలోని 182 వ సూత్రం ఇలా చెబుతుంది, "శత్రువుల కంపెనీలకు మూల్యం చెల్లించటం ఆపుచేయాలన్న ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ఆ ఆస్తుల్ని అజమాయిషీ చేయటంకోసం ఒక సంరక్షకుణ్ణి (కస్టోడియన్), ఒకరిద్దరు స్థానిక ఉపసంరక్షకులను నియమించవచ్చు. వారు శత్రువుల ఆస్తిని అజమాయిషీచేయవచ్చు, ఇతరులకు బదిలీ చేయవచ్చు, లేదా చట్టం ప్రకారం తగిన ఇతరచర్యలు తీసుకోవచ్చు". ఈ చట్టాల ప్రకారం అలాంటి ఆస్తులన్నీ ప్రభుత్వ ఆస్తులయ్యాయి.. యుద్ధకాలంలో ఏదోకారణంగా జైల్లో ఉన్న సొంతదారుల ఆస్తులకూ, ప్రభుత్వ నిర్బంధంలో ఉన్నవారి ఆస్తులకూ ఎలాంటి రక్షణా లేకుండాపోయింది. ఆ ఆస్తులు శత్రువుల ఆస్తులుగా పరిగణించబడ్డాయి. ఈఆస్తుల పరిరక్షణను తాత్కాలికంగా ప్రభుత్వమే స్వీకరించింది. ఆ ఆస్తుల్ని మళ్లీ వాపస్ ఇస్తామని సొంతదారులకు వాగ్దానాలు మాత్రం చేసింది. కానీ 1965 లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్తచట్టమూ, 1966 లో తెచ్చిన మరోచట్టమూ ఆ ఆస్తుల్ని నిర్వహించే అధికారాన్నీ, నష్టపరిహారం నిర్ణయించే అధికారాన్నీ "కస్టోడియన్" గా నియమించబడ్డ అధికారికి అప్పగించాయి.

ఇండో–పాక్ యుద్ధం తరువాత శత్రువుల ఆస్తికి సంబంధించిన చట్టాలనూ, ఒకటవ ఆర్డినెన్స్‌నూ పొడిగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బంగ్లాదేశ్‌కూ, భారతదేశానికీ ఎలాంటి విరోధమూ లేకున్నా, భారతదేశం బంగ్లాదేశ్‌కు సౌహార్ద్రదేశమే అయనా బంగ్లాదేశ్ అధ్యక్షుడు (నెం. 29/1972) ఆస్తుల్ని గురించి ఆర్డినెన్స్ జారీచేశాడు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం పాకిస్తాన్ అధీనంలో ఉన్న శత్రువుల ఆస్తి బంగ్లాదేశ్ ప్రభుత్వం అధీనంలోకొచ్చింది. వాస్తవానికి పాకిస్తాన్ ప్రభుత్వం ఆస్తుల్ని

వాపస్ చేస్తామని చేసిన వాగ్దానాన్ని బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా భగ్నం చేసింది. పాకిస్తాన్ ప్రభుత్వకాలంలోలాగే బంగ్లాదేశ్ ప్రభుత్వకాలంలోనూ "శత్రువుల ఆస్తి" చట్టవ్యతిరేకంగా, రహస్యంగా ప్రభుత్వంచేతిలోనే ఉంది. నష్టపోయిన ప్రజలు తమకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తే "శత్రువుల ఆస్తి ఆర్డినెన్స్" కు పేరు మార్చి "ప్రవాసుల ఆస్తుల చట్టం" (నెం. XLVI, 1974) అన్నపేరుపెట్టి హాస్యాస్పదంగా ప్రవర్తించారు. ఈచట్టం ప్రకారం పాకిస్తాన్ ప్రభుత్వ అధీనంలో ఉన్న మొత్తం ఆస్తి బంగ్లాదేశ్‌ను వదిలివెళ్లిపోయి, ఇతరదేశాల పౌరసత్వం స్వీకరించిన వారి ఆస్తిగా ప్రకటించబడింది. అలాంటి ఆస్తిని అజమాయిషీ చేయటానికీ, రక్షణకూ ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం "శత్రువుల ఆస్తిగా" పాకిస్తాన్ ప్రభుత్వం నిర్ణయించిన ఆస్తినేకాకుండా ఇతర ఆస్తుల్నికూడా "శత్రువుల ఆస్తి" గా ప్రకటించింది. ఈలోగా 1976 ఆర్డినెన్స్ (నెం. XCII)ను విడుదల చేశారు. దీని ప్రకారం "చట్టం ప్రకారం దఖలుపడిన ఆస్తుల్ని అజమాయిషీ చేయటం, అమ్మటం, ఇతరులకు ఇవ్వటం ప్రభుత్వం నియమించిన అధికారులచేత చేయబడుతుంది. ఆతరువాత ఒక ఏడాదిలోగానే, అంటే 1977 మే 23 న ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను విడుదలచేసింది. 10 హెక్టేర్ల వ్యవసాయేతర భూమిని దీర్ఘకాలికకౌలుకు ఇస్తారనీ, మార్కెట్ విలువను అందుకు బజానాగా చెల్లించవలసి ఉంటుందనీ, అదికాకుండా అద్దెకూడా ఇవ్వవలసి ఉంటుందనీ ఆ సర్క్యులర్ ప్రకటించింది. అంతే కాకుండా వ్యాపారకేంద్రాల్లో ఉన్న స్థలాన్ని బహిరంగవేలంలో అత్యధికమొత్తం చెల్లించటానికి సిద్ధపడినవారికి ఇవ్వబడుతుందనికూడా ప్రకటించారు. మరోరకంగా చెప్పాలంటే దాదాపు కోటిన్నర–రెండుకోట్ల ప్రజలు బంగ్లాదేశ్‌లో తమకున్న వ్యవసాయేతర భూమిని పోగొట్టుకుంటారు. ఆభూమి వేలం వేయబడుతుంది. ప్రభుత్వం దీర్ఘకాలిక అద్దెకింద ఎంతో డబ్బును సంపాదించుకుంటుంది. ఈ సర్క్యులర్‌లోని 37 వ పేరా అలాంటి ఆస్తుల్ని గుర్తించి, ప్రభుత్వానికి తెలియజేసే రెవిన్యూ అధికారులకూ, భూసంస్కరణల అధికారులకూ ప్రత్యేకగౌరవాలూ, అవార్డులూ ఉంటాయని ప్రకటించింది. గౌరవాలూ, అవార్డులూ పొందాలన్న దురాశతోవారు అసంఖ్యాకమైన హిందువుల్ని వారి పూర్వీకుల ఆస్తులనుంచి తరిమేశారు.

1966 తరువాత తూర్పుపాకిస్తాన్ ప్రభుత్వం ఒక అధికారసర్వేను నిర్వహించి 1947 అల్లర్లలో, ఆతరువాత 1950 లో, 1954 లో జరిగిన మతకలహాల్లో దేశంవదిలి పారిపోయిన హిందువుల ఆస్తుల్ని గుర్తించి వాటిని "శత్రువుల ఆస్తి"గా ప్రకటించింది. కానీవాళ్లు తమ ఇళ్లూ, తోటలూ, చేపలచెరువులూ, కుటుంబ స్మశానాలూ, దేవాలయాలూ, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు తమకు తిరిగి ఇస్తారన్న భరోసాతో వాళ్లు వెళ్లారు. భారతదేశానికి వెళ్లిన హిందువుల ఆస్తుల్ని మాత్రమే కాకుండా భారతదేశంలో తాత్కాలికనివాసం ఏర్పరచుకొని ఇతరదేశాలకు వెళ్లిన వారి ఆస్తులుకూడా "శత్రువుల ఆస్తులు"గానే పరిగణించబడ్డయి. కానీ భారతదేశంలోకానీ, ఇతరదేశాల్లోకానీ ఉన్న ముస్లిముల ఆస్తుల్నిమాత్రం ప్రభుత్వం ముట్టుకోలేదు. వారి ఆస్తుల్ని గురించి సర్వేకూడా నిర్వహించలేదు. హిందూ

ఉమ్మడి కుటుంబ సిద్ధాంతాల ప్రకారం కర్త (కుటుంబపెద్ద) చనిపోయిన తరువాత మిగిలిన వారు ఆస్తిని అనుభవిస్తారు. కానీ ప్రభుత్వం ఈ సంప్రదాయాలనూ, చట్టాలనూ నిరాదరించి అటువంటి ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంది.

సుధామయ్‌కి నియాజ్‌హుసేన్, ఫజుల్ ఆలం, అన్వర్ అహమద్, మరింకెంతో మంది జ్ఞాపకం వచ్చారు. వీరంతా అమెరికాకో, ఇంగ్లండుకో తమ కుటుంబాలతోపాటు వెళ్లిపోయారు. ఇప్పుడువారి ఇళ్లలో వారి దూరపుబంధువులో, అద్దెకుంటున్న వాళ్లో ఉంటున్నారు. వీళ్ల ఆస్తుల్ని ప్రభుత్వం "శత్రువుల ఆస్తి"గా పరిగణించలేదు. ఇలాంటి అన్యాయాన్ని గురించి ఆలోచిస్తూ సుధామయ్ మంచంమీదనుంచీ లేవటానికి ప్రయత్నించాడు. ఆప్రయత్నంలో ఒళ్లంతా చెమటతో తడిసిపోయింది. ఇంట్లో ఎవరూలేరు. కిరణ్మయి, మాయ, సురంజన్ ఎక్కడికెళ్లారో!

★ ★ ★

ఢాకా పాతబస్తీలో తిరుగుతూ మెమెన్ సింగ్ పట్టణం తనకు ఎంతబాగా జ్ఞాపకం ఉందో ఆలోచించాడు సురంజన్. ఢాకాలో ఇన్ని సంవత్సరాలుగా ఉంటున్నా మైమెన్‌సింగ్ మరుపురావటంలేదు. తాను ఆపట్టణంలో పుట్టాడు. తన బాల్యం, యవ్వనం అక్కడే గడిచాయి. ఢాకాలోని బురీగంగలోకి దిగితే మైమెన్‌సింగ్‌లోని బ్రహ్మపుత్ర జ్ఞాపకం వస్తుంది. తనపుట్టుకను తిరస్కరించినవాడు తప్ప తన పుట్టిన ఊరును తిరస్కరించలేడు. అలాగే తనుపుట్టిన ఊళ్లోని నదిని మరిచిపోలేడు.... గౌతమ్ కుటుంబం దేశాన్ని వదిలివెళ్లిపోతోంది. ఈదేశంలో ఉండటం ఇకమీదట క్షేమంకాదని వాళ్లు భావించటం ప్రారంభించారు. అదే నిజమైతే వెళ్లిపోవటాన్ని తలుచుకొని వాళ్లు అంతగా ఎందుకు ఏడుస్తున్నారు? ఐదేళ్ల క్రితం తాము బ్రాహ్మణబారియాలో ఉండగా కలకత్తానుంచి మామయ్య వచ్చాడు. అతడు చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. తనకు కలకత్తాకు వెళ్లాలని ఉందా అని అడిగింది అమ్మ. తాను లేదంటే లేదన్నాడు.

దాదాపు ఐదారేళ్లక్రితం సురంజన్ పార్టీ పనిమీద మైమెన్‌సింగ్ వెళ్లవలసివచ్చింది. రైల్లో కిటికీవద్ద కూచొని వెనక్కిపోతున్న పచ్చని వరిపొలాలనూ, వరసలు వరసలుగా నిలుచున్న చెట్లనూ, మట్టితో కట్టిన గుడిసెలనూ, గడ్డివాములనూ, నగ్నంగా చెరువుల్లో చేపలు పడుతున్న పిల్లలనూ, రైలు కనబడగానే తలెత్తిచూసే అమాయకరైతులనూ చూస్తున్నాడు. ఈ దృశ్యాలనుచూసి సురంజన్ పులకించిపోయాడు. తాను బంగ్లాదేశ్ ఆత్మను చూస్తున్నట్టుగా భావించాడు. కవి జీవానంద దాస్ ఈ సౌందర్యాన్ని చూసి ఎంతగా మురిసిపోయాడంటే సౌందర్యాన్నిచూసి ఆనందించటానికి ప్రపంచంలో మరోచోటికి వెళ్లాల్సిన అవసరంలేదన్నాడు.

కానీ సురంజన్ ఉత్సాహం అంతలోనే నీరుకారిపోయింది. ఇంతకుముందు స్టేషన్‌కు రామలక్ష్మణపూర్ అన్న పేరుండేది. దాన్నిప్పుడు అహమద్‌బారీ అని మార్చేశారు. అలాగే కాళీబజార్ ఫాతిమానగర్ అయిపోయింది. అలాగే కృష్ణనగర్ అలియానగర్ అయిపోయింది. దేశంమొత్తంమీద ఇస్లామీకరణం జరుగుతోంది. కాబట్టి వాళ్లు మైమెన్‌సింగ్‌లోని ఒకచిన్న రైల్వేస్టేషన్నుకూడా సహించలేకపోయారు.

బ్రాహ్మణ బారియాను బి.బారియా అనీ, బరిసాల్ బ్రజమోహన్ కాలేజీని

బి.యం. కాలేజీ అని మురారీచంద్ కాలేజీని యం.సి. కాలేజీ అని ఎందుకు పిలుస్తారో సురంజన్‌కు అర్థమైంది. అక్కడ ప్రజలకు ఏమైనాసరే హిందూపేర్లను పలకటం ఇష్టంలేక వాటిని కుదిస్తున్నారన్నమాట. కొంతకాలానికి ఈకుదింపులు మహమ్మద్ అలీ కాలేజ్, సిరాజుద్దౌలా కాలేజ్ అని మారిపోవచ్చు! స్వాతంత్ర్యం వచ్చిన ఇరవైఒక్క సంవత్సరాల తరువాతకూడా ఢాకా యూనివర్సిటీలోని జిన్నాహాల్‌కు సూర్యసేన్‌హాల్ అనిపేరు మారిస్తే జరిగిన అల్లర్లు సురంజన్‌కు జ్ఞాపకం వచ్చాయి. స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించినవాళ్లు సూర్యసేన్ దోపిడీదొంగ అన్నారు. ఒక దోపిడీదొంగ పేరు ఆ హాలుకు పెట్టటం తప్పన్నారు! ప్రభుత్వం మతోన్మాదుల దయాదాక్షిణ్యాలతో అధికారంలో ఉందికాబట్టి వాళ్ల పిచ్చికోరికలకు లొంగిపోయినా ఆశ్చర్యంలేదు – అనుకున్నాడు సురంజన్.

ఢాకా పాతబస్తీలో ఇంకా దెబ్బతినకుండా ఉన్న హిందువుల దుకాణాలు మూసి వున్నాయి. వాళ్లు దుకాణాల్ని ఎలా తెరవగలరు? భయపడాల్సిన అవసరంలేదని వారికి ఎవరు ధైర్యం చెప్పగలరు? కానీ 1990 అల్లర్ల తరువాత కొంతకాలానికి హిందువులు తమ దుకాణాల్ని తెరిచారు. 1992 అల్లర్ల తరువాతకూడా అలాగే జరగవచ్చు. బహుశా హిందువులు ఓపిక ఎక్కువగా ఉన్న మనుషులేమో. అందుచేతనే కాబోలు వాళ్లు కూలిపోయిన తమ ఇళ్లను మళ్లీ కట్టుకున్నారు. చెదిరిపోయిన తమ వ్యాపారాలను మళ్లీ సమకూర్చుకున్నారు. నెర్రెలుపడిపోయిన భవనాలను ఇటుకలూ, సున్నమూ ఉపయోగించి అతకవచ్చు. కానీ పగిలిపోయిన వాళ్ల మనస్సుల్ని అతకటానికి దేన్ని ఉపయోగించాలి?

సురంజన్ మనస్సు 1990 అల్లర్లలో జరిగిన విధ్వంసంమీదికి వెళ్లింది. పటువాతులీ బ్రహ్మసమాజం, శ్రీధరవిగ్రహ మందిరం, నయాబజార్‌లోని ప్రాచీన మఠం బూడిదైపోయాయి. పటువాతులీ భట్టాచార్య అండ్ కంపెనీ, హోటల్‌రాజ్, ఢాకేశ్వరీ నగల దుకాణం, ఎవర్‌గ్రీన్ నగలదుకాణం, కాశ్మీరీ బిరియానీ హౌస్, రూపశ్రీ నగలదుకాణం, మనీషా నగల దుకాణం, శంకరీ బజార్‌లోని సోమాస్టోర్స్, అనన్యలాండ్రీ, కృష్ణాహేర్‌డ్రస్సర్స్, షాహో కాంటీన్, సదర్‌ఘాట్‌లోని ఉజాలా హోటల్ – వీటిని లూటీచేశారు. నయాబజార్‌లోని మునిసిపల్ పారిశుధ్యకార్మికుల కాలనీమీద దాడిచేసి తగలబెట్టారు. ఢాకాజిల్లాకోర్టుకు సంబంధించిన ఇలాంటి కాలనీక్కూడా ఇదే గతిపట్టింది. కేరణీగంజ్‌లోని హరిసభామందిరం, కాళీమందిరం, మీర్‌బాగ్‌లోని మరోదేవాలయం, గోసుంబజార్‌లోని వ్యాయామశాల, శుభద్యగోషాయ్‌బాగ్‌లోని కాళీమందిరం, చంద్రనికరారీ మందిరం, పశ్చిమపారా కాళీమందిరం, టెగోరియా పుబ్‌నదీలోని రామకన్హయ్యా దేవాలయం, కాళిందీ బజార్‌లోని దుర్గామందిరం, మనీషా మందిరం – ఇవన్నీ దాడులకు గురయ్యాయి. ఈ దేవాలయాల్లోని విగ్రహాలను పగలగొట్టారు. భేజుల్‌బాగ్ ఉపజిల్లాలో పరిమోహన్‌మిశ్రా కుమారుడు రవీమిశ్రా ఇంటితోబాటు దాదాపు యాభై ఇళ్లు ధ్వంసమయ్యాయి. టెగోరియాలో భబతోష్ ఘోష్, పరితోష్ ఘోష్ ఇళ్లతోబాటు మందయిల్ హిందూపారాలో, బంగోవ్ రిషీపారాలో దాదాపు మూడు వందలహిందూ గృహాలమీద దాడులు జరిగాయి.

ఆ దాడుల్లో చాలా ఇళ్లు ధ్వంసమయ్యాయి. సురంజన్ ఈ విధ్వంసకాండలో కొంతభాగాన్ని స్వయంగా చూశాడు, మరికొంత దాన్నిగురించి విని తెలుసుకున్నాడు.

సురంజన్ కొంతసేపట్నుంచీ గమ్యంలేకుండా తిరుగుతూనే ఉన్నాడు. ఎక్కడికి వెళ్లాలోకూడా అతనికి తెలియదు. ఢాకానగరంలో తనవాళ్లు ఎవరున్నారు? తాను కొంతసేపు కబుర్లు చెప్పుకోవటానికి తగిన వాళ్ళున్నారా? మాయ తనకు ఇష్టంలేకున్నా వందటాకాలిచ్చింది. ఎందుకో ఆ డబ్బును ఖర్చుపెట్టాలనిపించటంలేదు. ఎన్నోసార్లు "బాంగ్లాఫైవ్" సిగరెట్ పెట్టె కొనుక్కుందామనిపించింది. కానీ ఎందుకూ? సిగరెట్లు ఎంతసేపుంటాయి? తనకు డబ్బంటే బలహీనతలేదు. నాన్నగారు బట్టలు కొనుక్కొమ్మని డబ్బులిస్తే తాను ఎన్నోసార్లు ఆ డబ్బును స్నేహితులకోసం ఖర్చు పెట్టాడు.

అతని స్నేహితుల్లో ఎవరైనా పారిపోయి పెళ్లి చేసుకోవాలంటే డబ్బులు సురంజనే సమకూర్చేవాడు. పరీక్ష ఫీజుకట్టమని సుధామయ్ ఇచ్చిన డబ్బును ఒకసారి రహమత్ అన్న అబ్బాయికి ఇచ్చేశాడు. అప్పుడు ఆ అబ్బాయి తల్లి ఆస్పత్రిలో ఉంది. మందులు కొనుక్కోవటానిక్కూడా వాళ్ల దగ్గర డబ్బుల్లేవు. ఆ సంగతి తెలియగానే తనవద్ద ఉన్న పరీక్షఫీజు డబ్బుల్ని ఇచ్చేయటానికి అనుమానించలేదు సురంజన్....... రత్నను కలుసుకోవాలా అని ఆలోచించాడు సురంజన్. రత్నామిత్ర! పెళ్లయిపోయాక రత్న తన ఇంటిపేరు అలాగే ఉంచుకోగలుగుతుందా? పెళ్లయాక అమ్మాయిలు తమ ఇంటిపేరును అసలెందుకు మార్చుకోవాలి? పెళ్లికాకముందు నాన్నలతోకలు తగిలించుకోవాలి. పెళ్లయాక వాటిని వదిలిపెట్టి భర్తలతోకలు తగిలించుకోవాలి. నాన్సెన్స్! ఒక్కోసారి సురంజన్‌కే "దత్త" అన్న తన ఇంటిపేరును వదిలిపెట్టేద్దామనిపిస్తుంది. ఇలాంటి ఇంటిపేర్లూ, కులంపేర్లూ, మతంపేర్లూ మనిషికీ మనిషికీ మధ్య సంబంధాలను నాశనం చేస్తున్నాయి. బెంగాలీలు—తాము హిందువులైనా, ముస్లిములైనా – బెంగాలీపేర్లనే పెట్టుకోవాలి. మాయపేరు నీలాంజనా మాయఅని ఉంటే బావుంటుందని అతనికి అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. తన పేరు.... తనపేరు..... నిబిర్ సురంజన్ అనో, సురంజన్ సుధా అనో, నిఖిల్ సురంజన్ అనో ఉంటే బావుండేదేమో! అలా ఉంటే తనపేరుకు మతం మురికి ఉండేదికాదు. కొంతమంది బెంగాలీ ముస్లిములు అరబిక్ పేర్లు పెట్టుకోవటం సురంజన్ గమనించాడు. బెంగాలీ సంస్కృతిలో పండిపోయిన వారుకూడా ఫైజుల్ రహమాన్, తౌహిదుల్ ఇస్లాం, ఫైజ్ చౌధురీలాంటి పేర్లు పెట్టుకున్నారు. కానీ ఎందుకు? బెంగాలీలకు అరబిక్ పేర్లు ఎందుకుండాలి? తాను తనకోకూతురు పుడితే స్రోతశ్విని అనో నీలిమ అనో ఆపాపకు పేరుపెడతాడు. "నీలిమ" అన్నపేరు "నీలాంజన" అన్నపేరుతో చక్కగా పొందుతుంది. కాబట్టి నీలిమ అన్నపేరు తనకూతురికి ప్రత్యేకించేయాలి.

సురంజన్ అలాగే అగమ్యంగా తిరుగుతున్నాడు. ఇంటినుంచీ బయలుదేరినప్పుడు తానుచేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయనిపించింది. తనచుట్టూరా ఉన్న ప్రజలు ఏవో పనులమీద తిరుగుతున్నారు. తనకే ఏపనీలేదు. భయంతో వణికిపోతున్న ఈ నగరంలో తనకు ఎక్కడైనా కూచొని ఎవర్తోనైనా మాట్లాడాలనిపిస్తోంది. బంక్‌షల్‌లో ఉన్న

దులాల్‌ను కలుసుకోవచ్చా? లేదా అజీమ్‌పూర్ మొహల్లాలోని మహదేవ్‌దాను కలుసుకోవచ్చా? ఇస్పాహానీకాలనీకెళ్లి కాజల్‌దేవ్‌నాథ్‌ను కలుసుకోవటం మంచిదేమో. తాను వెళ్లటానికి హిందువుల ఇళ్లే ఎందుకు ఎన్నుకుంటున్నాడు? నిన్న బెలాల్ తమ ఇంటికొచ్చాడు. ఈరోజు తాను వాళ్లింటికి వెళ్లవచ్చు. ఆరోజు హైదర్ వచ్చాడు. అతని ఇంటికి వెళ్లటంకూడా మంచిదే. కానీ వాళ్ల ఇళ్లకు వెళ్లటంలో ఓ ఇబ్బంది ఉంది. బాబ్రీ మసీదు విధ్వంసాన్ని గురించి చర్చరావచ్చు. ఇండియాలో ఏం జరుగుతోంది? ఎంతమంది చనిపోయారు? బి.జె.పి. నాయకులు ఏమంటున్నారు? ఏ నగరాల్ని సైన్యం స్వాధీనం చేసుకుంది? ఎవర్ని అరెస్టు చేశారు, ఏపార్టీలను నిషేధించారు – ఇలాంటి విషయాల్ని చర్చించి, చర్చించీ సురంజన్‌కు విసుగొచ్చేసింది. భారతదేశంలో బి.జె.పి. ఎలాంటిదో బంగ్లాదేశ్‌లో జమాత్–ఎ–ఇస్లామీ అలాంటిది. ఇద్దరి ఆదర్శమూ ఒకటే – మత దురహంకారాన్ని ప్రచారం చేయటం. ఈ రెండుదేశాల రాజకీయ కార్యక్రమంలోంచీ మతాన్ని తొలగిస్తే ఎలా ఉంటుంది? మూడవ ప్రపంచదేశాల సామాజిక వ్యవస్థలమీద మతం ఎంతో బలంగా, బలవంతంగా వచ్చికూచుంది. బలహీనులైన పేదదేశాల ప్రజలు దాని ఇనుపపిడికిలినుంచి బయటపడలేరు. సురంజన్‌కు అతనికెంతో ఇష్టమైన మార్క్స్ ప్రవచనం జ్ఞాపకం వచ్చింది.

"మతానికి సంబంధించిన సమస్యలన్నీ నిజానికి భౌతికమైన లోపాలకు వ్యక్తీకరణలే. అంతేకాదు, వాటికి వ్యతిరేకంగా వ్యక్తమైన నిరసనలుకూడా. మతం పీడిత మానవుల నిట్టూర్పు. హృదయంలేని ప్రపంచంయొక్క హృదయం. ఆత్మలేని ప్రపంచంయొక్క ఆత్మ. మతం సాధారణ మానవులపాలిటి మత్తుమందు."

సురంజన్ ఈమాటల్ని తనలోతాను అనుకుంటూ రద్దీగా ఉన్న నగరవీధుల్లో తిరిగాడు. సాయంకాలం వరకూ నారీ, నవాబ్‌పూర్, తంతీబజార్, కోర్టు ఏరియా, రజనీ బసక్‌లేక్, గెండోరియా, బేగంబజార్ ప్రాంతాల్లో తిరిగి చివరకు కాజల్ ఇల్లు చేరుకున్నాడు. ఇతర హిందువుల్లాగే అతడు ఇంట్లోనే ఉన్నాడు. ఈరోజుల్లో హిందువులు తమ ఇళ్లలోకాకుండా ఇతరచోట్లలో తలదాచుకుంటున్నారు. లేదా ఇల్లువదిలిపెట్టి కదలకుండా ఉంటున్నారు. అతనికేం పనిలేదు. తాను వెళ్లినప్పుడు తన స్నేహితులు ఇళ్లలోనే ఉంటున్నారు. సురంజన్ కాజల్ ఇంటికెళ్లేసరికి అక్కడ సుభాష్‌సింఘా, తపస్‌పాల్, దిలీప్‌డే, నిర్మల్ ఛటర్జీ, అంజన్ మజుందాస్, జతీన్ చక్రవర్తి, సయీదుర్ రహమాన్, కబీర్ చౌధురీ ఉన్నారు.

"ఏమిటి తాజావార్తలు? గొప్పహిందూ సమావేశం పెట్టేశారు", సురంజన్ చేసిన వ్యాఖ్యకు ఎవరూ నవ్వలేదు. చివరికి సురంజనే నవ్వాడు.

"ఏమిటి? ఎందుకూ అంతా అలా చిన్నపోయి కూచున్నారు? హిందువుల్ని తంతున్నారనా?" సురంజన్ అడిగాడు.

"సంతోషంగా ఉండటానికేమైనా కారణం ఉందా?" సుభాష్ ప్రశ్నకు ప్రశ్నవేశాడు.

కాజల్‌దేవనాథ్ హిందూ–బౌద్ధ–క్రైస్తవ ఐక్యతా సంఘంలో సభ్యుడు. ఈ సంఘానికి మత వాసన ఉండటంచేత సురంజన్ దాన్ని ఏనాడూ ప్రోత్సహించలేదు.

దాన్ని సురంజన్ ప్రోత్సహించి ఉంటే రాజకీయాలు మతానికి దూరంగా ఉండాలని చెప్పటానికి అర్థం లేకుండా పోయేది. నలభై సంవత్సరాలు ఎదురుచూసి, నిరాశ చెంది ఆత్మగౌరవం నిలుపుకోవటం కోసం చేసిన చివరి ప్రయత్నమే ఈ సంఘం ఏర్పాటు చేయటం అంటాడు కాజల్.

"ఈ దేశాన్ని మతతత్వం కబళిస్తోందని ఖలీదా ఎప్పుడైనా అంగీకరించిందా?" ఎవరో అడిగారు. "ఈ విషయంలో అవామీలీగ్ చేసింది మాత్రం ఏముంది? ఎప్పుడూ కుంటిసాకులు చెప్పటం తప్ప. జమాతీలు చేసిందీ అంతేననుకోండి. గత ఎన్నికల్లో అవామీలీగ్ అధికారానికి వచ్చిన తరువాత రాజ్యాంగ చట్టంలోంచీ "బిస్మిల్లా" అన్న పదాన్ని తీసేస్తామని దొంగ వాగ్దానాలు చేశారు. ఇప్పుడు వాళ్ళకు అధికారం పోయింది. ఎనిమిదవ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా పోతే తమకు ప్రజాదరణ తగ్గవచ్చునని అనుకుంటున్నారు. అవామీలీగ్‌కు ఎన్నికల్లో గెలవటం కావాలా, విధానాలు కావాలా? విధానాలే కావాలనుకుంటే ఎనిమిదవ రాజ్యాంగ సవరణ వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడరు?"

"మొదట అధికారంలోకి రావటం, ఆ తరువాత సంస్కరణలు ప్రారంభించటం పద్ధతిగా ఉంటుందని భావిస్తున్నారేమో!" సయీదుర్ రహమాన్ అవామీలీగ్‌ను బలపరచాడు. "ఎవర్నీ నమ్మలేం. అధికారంలోకి వచ్చిన ప్రతివాడూ ఇస్లాంను పొగడటం, భారతదేశాన్ని తిట్టటం పనిగా పెట్టుకుంటాడు. ఈ పని ఎంత ఎక్కువగా వీలైతే అంత ఎక్కువగా చేస్తాడు. ఈ దేశంలో చాలామందికి ఈ రెండు పనులూ ఎంతో ఇష్టం", కాజల్ ఈ మాటను సమస్యను బాగా అర్థం చేసుకున్న వాడిలా అన్నాడు.

అకస్మాత్తుగా సురంజన్ మరో విషయంలోకి వెళ్ళాడు. "కానీ కాజల్‌దా, ఇలాంటి మత సంస్థకంటే మతాతీత సంస్థను ఏర్పాటు చేయటం మంచిదేమో? సయీదుర్ రహమాన్ మీ సంస్థలో ఎందుకు చేరలేదు?" అన్నాడు.

"అది మా తప్పుకాదు......" జతీన్ చక్రవర్తి గంభీరమైన గొంతుతో అన్నాడు. "అది 'జాతీయ మతం' అన్న భావాన్ని సృష్టించిన వాళ్ళ తప్పు. ఇంత కాలమూ మనకు ఇలాంటి సంస్థను స్థాపించాల్సిన అవసరం ఉండేదికాదు! ఈనాడు ఆ అవసరం ఎందుకొచ్చింది? బంగ్లాదేశ్ తనంతకు తానుగా అవతరించలేదు. హిందువులూ, ముస్లిములూ, బౌద్ధులూ, క్రైస్తవులూ కలిసి ప్రయత్నిస్తే అవతరించింది. కాబట్టి ఒక మతాన్ని జాతీయ మతంగా గుర్తిస్తే ఇతర మతాలవారికి అన్యాయం చేసినట్టే. మనిషి మనిషికి దేశాన్ని ప్రేమించటంలో తేడాలుండవు. దానికి కులానికీ, మతానికీ సంబంధం లేదు. దేశభక్తి వీటన్నిటికీ అతీతమైన భావం. జాతీయ మతంగా గుర్తించబడిన మతానికి చెందినంత మాత్రాన కొందరు ద్వితీయశ్రేణి పౌరులు కాకూడదు. వారిమతం ద్వితీయశ్రేణి కాకూడదు. అలా జరిగితే వారి ఆత్మ గౌరవం తీవ్రంగా దెబ్బతింటుంది. కాబట్టి వారి జాతీయవాదం – మతవాదం అయిపోతే మీకు తప్పు పట్టే అధికారం ఉందా?"

ఈ ప్రశ్న సుర్థంజన్‌కు వేయబడింది. అతడు దాన్ని గురించి వ్యాఖ్యానించాలని అందరూ ఆశిస్తారు కూడా.

"కానీ ఆధునిక రాజ్యంలో ఇలాంటి మత సంస్థ ఉండటాన్ని ఎలా సమర్థిస్తారు?" అన్నాడు.

"అల్పసంఖ్యాకుల్లో అలాంటి మతతత్వం రావటానికి బాధ్యత ఎవరిది? జాతీయ మతం ఉండాలని ప్రతిపాదించిన వాళ్ళు కారకులు కారా? ఒక మతాన్ని జాతీయ మతం అని ప్రకటిస్తే రాజ్యానికి జాతీయ లక్షణం పోతుంది. జాతీయ మతాన్ని ప్రకటించిన దేశం ఏ రోజైనా మత రాజ్యంగా మారిపోవచ్చు కదా? ఈ దేశం క్రమ క్రమంగా మతతత్వదేశంగా మారిపోతోంది. ఈ సమయంలో జాతీయ సమైక్యతను గురించి మాట్లాడటం హాస్యాస్పదం. రాజ్యాంగానికి ఎనిమిదవ సవరణ కేవలం కంటి తుడుపు. అల్ప సంఖ్యాక ప్రజలు దాని కారణంగానే ఎన్నో బాధలు పడ్డారు. ఈ విషయాన్ని వాళ్ళు ఇప్పుడే అర్థం చేసుకుంటున్నారు".

"బంగ్లాదేశ్ జాతీయమతంగా ఇస్లాంను ప్రకటించటం ఏరకంగానైనా ముస్లింలకు సహాయ పడుతుందంటావా? నాకు నమ్మకం లేదు".

"ఉపయోగపడదు. అందుకు సందేహం లేదు. ఆ విషయం వాళ్ళకు ఇప్పుడు అర్థంకాదు. కానీ ఏదో ఒక రోజు ఆ విషయం వాళ్ళకు తెలిసొస్తుంది".

"అవామీలీగ్ ఈ పరిస్థితుల్లో నిర్వహించాల్సిన పాత్ర ఉందని నాకు అనిపిస్తోంది", అన్నాడు అంజన్.

"అవామీలీగ్ బిల్లులో కూడా ఎనిమిదవ సవరణను తిరస్కరించే ప్రస్తావనలేదు. ప్రజాస్వామ్యదేశంలో బ్రతుకుతున్న ఎవరికైనా లౌకిక తత్వం ప్రజాస్వామ్యానికి పునాది అని తెలుసు. ఎనభై ఆరు శాతం ముస్లింలున్న దేశంలో ఇస్లాంను జాతీయ మతంగా ప్రకటించాల్సిన అవసరం ఏమిటో అర్థంకావటం లేదు. బంగ్లాదేశ్‌లోని ముస్లింలకు మతం మీద భక్తి విశ్వాసాలున్నాయి. వాళ్ళకోసం ఒక మతాన్ని జాతీయ మతంగా ప్రకటించాల్సిన అవసరం లేదు", అన్నాడు సురంజన్.

"విధానాల విషయంలో రాజీ ఉండకూడదు. తనకు వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని తెలిసినప్పట్నుంచీ అవామీలీగ్ రాజీపడుతోంది", అన్నాడు అంతవరకూ నిశ్శబ్దంగా కూచోని ఉన్న జతీన్‌బాబు.

ఇంతవరకూ సుభాష్ గూడ నిశ్శబ్దంగా ఈ చర్చను వింటున్నాడు. అతడు మొదటిసారిగా మాట్లాడాడు. "మనం అనవసరంగా అవామీలీగ్‌ను గురించి చర్చిస్తున్నాం. వాస్తవానికి మనం బి. ఎన్.పి.ని గురించీ, జమాతీలను గురించీ ఆలోచించాలి. వాళ్ళు అవామీలీగ్ కంటే ఎలా మెరుగు...."

"తెలిసిన శత్రువుల్ని గురించి మాట్లాడటానికి ఏమీ ఉండదని నువ్వు తెలుసుకోవాలి. మనం నమ్మిన వాళ్ళు మోసం చేసినప్పుడే మనకు బాధకలగటం ప్రారంభిస్తుంది", అన్నాడు కాజల్ మధ్యలో జోక్యం చేసుకుంటూ.

"లౌకిక తత్వాన్ని గురించి ఇంత చెప్పారు. కానీ లౌకిక తత్వమంటే అన్ని మతాల పట్ల్లా ఏకగ్రీవమైన, సమానమైన దృక్పధాన్ని ఏర్పాటు చేసుకోవటం. లౌకిక తత్వంలో పక్షపాతానికి చోటులేదు. అంటే రాజకీయాలనూ, మతాన్నీ దూరంగా, వేరువేరుగా ఉంచటమన్నమాట", అన్నాడు కబీర్‌చౌదరి.

"భారతదేశం యొక్క విభజన జరిగినప్పుడు ముస్లిం మతతత్వవాదులు పాకిస్తాన్‌కు పురుడు పోశారు. కానీ భారతదేశంలో హిందూ మతతత్వవాదులు ఓడిపోయారు. అందుచేతనే భారతదేశం ఆధునిక ప్రజాస్వామ్య లౌకిక దేశంగా రూపొందగలిగింది. భారతదేశంలోని ముస్లింలకు హిందువులతో సమానమైన గౌరవం ఇవ్వబడింది. ఇది ఒకరకంగా రెండు దేశాల్లోని ముస్లింలకు నైతిక విజయంగా భావించబడింది. భారతదేశంలో హిందువులు నష్టపోయారు కాబట్టి బంగ్లాదేశ్‌లో వారిని తమ దేశంలో ఒక భాగంగా ఇక్కడి ప్రజలు గుర్తించలేదు. ఇదంతా వాళ్ళను ఈ దేశంనుంచీ తరిమేయాలనీ, వాళ్ళ ఆస్తిపాస్తుల్ని ఆక్రమించుకోవాలనీ జరిగిన కుట్రమాత్రమే. మళ్ళీ ఇప్పుడు – పాకిస్తాన్ పరిపాలనా కాలంలో లాగే – ఇస్లామీకరణం జరగాలని అరుస్తున్నారు. సహజంగానే హిందువులు భయపడుతున్నారు. ఈ దేశాన్ని మళ్ళీ లౌకిక రాజ్యంగా ప్రకటిస్తే తప్ప హిందువులకు ఇక్కడ బతకటం కష్టమైపోతుంది. "శత్రువుల ఆస్తి" చట్టాన్ని కూడా మనం తిరస్కరించాలి. ఇంకా మనం పోరాడాల్సిన అంశాలున్నాయి. ఈనాటి పరిపాలనలో హిందువులకు స్థానం లేదు. పాకిస్తాన్‌ల కాలం నుంచీ కూడా హిందువులు ఏనాడూ ప్రభుత్వంలో కార్యదర్శిస్థాయికి ఎదగలేదు. సైన్యంలో చాలా కొద్దిమంది హిందువులు మాత్రమే ఉన్నారు. వాళ్ళకు ఒక స్థాయి తరువాత ప్రమోషన్లు రావు. నావికాదళంలోనూ, వైమానిక దళంలోనూ హిందువులే లేరనుకుంటాను".

"కాజల్ దా! బ్రిగేడియర్లుగా కానీ, మేజర్ జనరల్స్‌గా కానీ హిందువులు లేని మాట వాస్తవమే. డెబ్భైమంది కర్నల్స్ ఉంటే వాళ్ళలో హిందువు ఒకడే ఉన్నాడు. 450 మంది లెఫ్టినెంట్ కర్నల్స్‌లో ఎనిమిది మంది, 1300 మంది కాప్టెన్స్‌లో ఐదు మంది, 900 మంది సెకండ్ లెఫ్టినెంట్స్‌లో ముగ్గురూ, 80,000 మంది సిపాయిల్లో 500 మంది మాత్రమే హిందువులున్నారు. 40,000 మంది బంగ్లాదేశ్ రైఫిల్స్ దళంలో హిందువులు 300 మంది మాత్రమే. ప్రభుత్వ కార్యదర్శులుగా హిందువులేకాదు, బౌద్ధులూ లేరు, క్రైస్తవులూ లేరు. అదనపు కార్యదర్శుల స్థాయిలోనూ పరిస్థితి ఇంతే. 134 మంది సంయుక్త కార్యదర్శులుంటే వాళ్ళలో హిందువు ఒకడే", అన్నాడు నిర్మల్.

"విదేశాంగ శాఖలో అల్పసంఖ్యాక మతాలకు చెందిన వాళ్ళెవరైనా ఉన్నారా?" అడిగాడు కాజల్.

"లేరు, ఎవ్వరూ లేరు", అన్నాడు సుభాష్ స్టూల్ మీద నుంచి లేస్తూ.

నేలమీద పరిచి ఉన్న తివాచీ మీద కూచున్నాడు సురంజన్. సర్దుకొని అక్కడున్న కుషన్‌కు జేరగిలబడ్డాడు. అతనికి అక్కడ జరుగుతున్న సంభాషణ ఆనందంగా ఉంది. "పాకిస్తాన్ పరిపాలనా కాలం నుంచీ ఈనాటి దాకా చూస్తే మనోరంజన్‌ధర్ ఒక్కరే జపాన్‌కు బంగ్లాదేశ్ రాయబారిగా కొద్ది కాలంపాటు పనిచేశారు. పై చదువులకోసం, శిక్షణ కోసం ఇతర దేశాలకు విద్యార్థుల్ని పంపటం గురించి చూస్తే హిందువుల్ని జాగ్రత్తగా దూరం ఉంచుతున్నారు. మంచి లాభదాయకమైన వ్యాపారం ఏదీ హిందువులచేతుల్లో లేదు. వాస్తవానికి వ్యాపారంలోకి దిగాలనుకున్న హిందువుకు

ముస్లిం భాగస్తుడు ఉండి తీరాల్సిందే. అప్పుడు మాత్రమే అతనికి వ్యాపార లైసెన్స్ లభిస్తుంది. అంతేకాదు. ఇతర వ్యాపారాభివృద్ధి సంస్థలు కూడా అలా ఉన్నప్పుడు మాత్రమే అప్పులిస్తాయి", కబీర్ చౌదరి అన్నాడు.

"నువ్వంటున్నది నిజమే. నేను రెడ్‌మేడ్ బట్టల వ్యాపారం ప్రారంభించాలని ఎంతో ప్రయత్నించాను. జోళ్ళరిగి పోయేలా తిరిగాను. కానీ ప్రయోజనం లేకపోయింది. బ్యాంకులు నాకు సాయం చేయటానికి నిరాకరించాయి. ఆ తరువాత అఫ్జర్‌ను పార్ట్నర్‌గా ఉండమనికోరాను. అతడు అంగీకరించాకే అప్పు దొరికింది", అన్నాడు అంజన్. "నువ్వో విషయం గమనించావా?.....టీ.వీ., రేడియో ప్రోగ్రాములు ఖురాన్ పఠనంతో ప్రారంభమౌతాయి. ఎందుకో తెలుసా? ఖురాన్ ఒక్కటే పవిత్ర గ్రంథం. భగవద్గీత నుంచీ, త్రిపిటకాలనుంచీ కూడా కొన్ని భాగాలు చదువుతారు. కానీ అవి పవిత్ర గ్రంథాలు కావట."

"ఇదంతా అనవసరం. వీటన్నిట్నీ మానిపించాలి. టీ.వీ.లో, రేడియోలో మతకార్యక్రమాలుండకూడదని మనం పట్టుపట్టాలి", అన్నాడు సురంజన్ గట్టిగా.

కాస్సేపు అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. సురంజన్‌కు ఒకప్పు టీ తాగితే బావుణ్ణనిపించింది. కానీ ఈ ఇంట్లో అది దొరికే అవకాశం లేదు. అతనికి ఆ తివాచీ మీద పడుకొని అక్కడున్న అందరి మనస్సులో సుళ్ళు తిరుగుతున్న బాధల్ని గురించీ, దుఃఖాల్ని గురించీ లోతుగా ఆలోచిస్తే బావుణ్ణని కూడా అనిపించింది.

కాజల్‌దేవనాథ్ మళ్ళీ మాట్లాడటం ప్రారంభించాడు.

"అన్ని ప్రభుత్వ సమావేశాల్లో, సమాజాల్లో ఖురాన్ నుంచి కొన్ని భాగాలను ఎంతో భక్తి, శ్రద్ధలతో చదువుతారు. కానీ భగవద్గీత నుంచీ ఎందుకు చదవరు? సంవత్సరం మొత్తానికి హిందువుకు రెండే సెలవు రోజులున్నాయి. వాళ్ళు మరే ఇతర సెలవూ ఉపయోగించుకోవటానికి వీల్లేదు. ప్రతి సమావేశంలోనూ కొత్త మసీదులు కట్టటానికి ప్రతి పాదనలు చేస్తారు. కానీ దేవాలయాలు కట్టటాన్ని గురించి మాట్లాడరు. ఉన్న దేవాలయాలనూ, చర్చిలనూ, బౌద్ధారామాలనూ సక్రమంగా నిర్వహించటాన్ని కూడా పట్టించుకోరు".

"రేడియోలోనో, టెలివిజన్‌లోనో భగవద్గీతను వింటే నీకు ఆనందం కలుగుతుందా? కొత్త దేవాలయాల్ని కడితే మనకేమైనా లాభమా? ఇరవై ఒకటవ శతాబ్దం వచ్చేస్తోంది. కానీ మనం రాజకీయాల్లోనూ, సామాజిక విషయాల్లోనూ, మతం ద్వారా మాత్రమే మన అస్తిత్వాన్ని నిరూపించుకోవాలని ప్రయత్నిస్తున్నాం. మనం రాజకీయ విధానాలనూ, సామాజిక నియమాలనూ, విద్యావిధానాలనూ మతంనుంచీ విముక్తం చేయాలని కానీ, వాటిలో మతం జొరబడకుండా చూడాలని కానీ ప్రయత్నించటం లేదు. మనకు లౌకిక తత్వం కావాలంటే రేడియోలో, టీవీలో ఖురాన్ చదివినన్ని సార్లు గీత చదవటం వల్లరాదు. రాజకీయ కార్యకలాపాలనుంచీ మతాన్ని బహిష్కరించటం వల్ల మాత్రమే వస్తుంది. బళ్ళల్లో, కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లో మత సమావేశాల్నీ, ప్రార్థనల్నీ, మతబోధనీ, మతనాయకుల జీవితాలను

ఆకాశానికెత్తటాన్నీ మానెయ్యాలి. అలాగే మత కార్యకలాపాల్లో రాజకీయాలను జొరబడనివ్వకూడదు. రాజకీయ నాయకుడెవరైనా మత సమావేశాల్లో పాల్గొన్నా, మత సంస్థలకు సహాయం చేసినా అతణ్ణి పార్టీనుంచీ బహిష్కరించాలి. ప్రభుత్వాన్ని మత ప్రచారం కోసం ఉపయోగించకూడదు. ఉద్యోగాలకు దరఖాస్తు పెట్టుకున్న వాడు ఏ మతానికి చెందిన వాడో అడగకూడదు", అన్నాడు సురంజన్.

సురంజన్ పూర్తి చేయగానే కాజల్‌దేవనాథ్ నవ్వాడు. "నువ్వు చాలా అభ్యుదయవాదివై పోయావు. నీ ప్రతిపాదనలన్నీ లౌకిక రాజ్యంలో పనికొస్తాయి. ఈ దేశంలో కాదు", అన్నాడు.

ఏదైనా చెప్పాలని చాలా సేపట్నుంచి కాచుకొని ఉన్న సుభాష్ ఇదే తగిన సమయం అని చర్చలో జోక్యం చేసుకున్నాడు.

"బంగ్లాదేశ్ విద్యార్థి యువకాంగ్రెస్ తరఫున నేను ఈ రోజు ఒక సమావేశం ఏర్పాటు చేశాను. ధ్వంసమైన దేవాలయాలను మళ్ళీ నిర్మించాలనీ, కూల్చేసిన ఇళ్ళను మళ్ళీ కట్టుకోవటానికి ఆర్థిక సహాయం చేయాలనీ, ఆశ్రయం కోల్పోయి వీధిన పడ్డవారికి నష్టపరిహారం చెల్లించాలనీ, నేరస్తుల్ని శిక్షించాలనీ, ముఖ్యంగా మత రాజకీయాలను నిషేధించాలనీ హోంమంత్రి గారికి ఒక మహజర్ పంపాం".

తివాచీ మీద పడుకొని ఉన్న సురంజన్ లేచి సుభాష్‌తో అన్నాడు.

"నీ ప్రతిపాదనల్లో ఒక్కదాన్ని గూడా ప్రభుత్వం ఒప్పుకోదు". "సురంజన్ చెప్పింది నిజం. హోంమంత్రి నూటికి నూరు పాళ్ళూ దేశద్రోహి".

"ఇలాంటి దేశద్రోహులు ఇప్పుడు అధికారంలో ఉండటం చిత్రంగా ఉంది. షేక్ ముజీబ్ వాళ్ళను క్షమించాడు. జియా-ఉర్-రెహమాన్ వాళ్ళకు అధికారం ఇచ్చాడు. ఎర్షాద్ వాళ్ళ అధికారాల్ని పెంచాడు. ఖలీదా వాళ్ళమద్దతుతోనే అధికారానికొచ్చింది", అన్నాడు సయీదుర్ రహమాన్.

మాట్లాడే అవకాశం కోసం ఓపిగ్గా కాచుకొనిఉన్న తపస్‌పాల్ అన్నాడు.

"సెబాఖోలాలోని కాళీ కాళీమందిరాన్ని ధ్వంసం చేసినట్టుగా కాక్స్ బజార్‌నుంచీ ఇప్పుడే నాకు వార్త అందింది. మరో దేవాలయానికీ అదే గతి పట్టింది. జలాలాబాద్‌లోని కేంద్ర కాళీమందిరం, హిందూపారాలోని దుర్గామందిరం, మానస మందిరం, హరిమందిరం, మచుపారాలోని క్లబ్ భవనం - వీటన్నిటినీ జమాత్‌లు తగలబెట్టారు. ఇస్లామాబాద్‌లోని మందిరం, బోల్‌ఖలీ దుర్గామందిరం, ఆదిత్య చింతాహరిమఠం, ప్రధాన అర్చకుని ఇల్లూ, కనీసం మరో ఐదు దేవాలయాలు కూడా మంటలకు ఆహుతయ్యాయి. అదే ప్రాంతంలోని హరిమందిరాన్ని లూటీచేశారు. చౌఫల్ దండిలో ఎనిమిది దేవాలయాలూ, ఆరు ఇళ్ళూ, రెండు దుకాణాలూ ధ్వంసమై పోయాయి. హిందువులు నివసించే ప్రాంతంలో నూట అరవై ఐదు ఇళ్ళూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. షాపింగ్ సెంటర్‌లో ఐదు హిందువుల దుకాణాలను లూటీ చేశారు. హిందువులు కనిపిస్తే కొడుతున్నారు. నానా హింసలూ పెడుతున్నారు. హిందువుల ఇళ్ళలో ఉన్న గరిసెల్ని తగిలబెడుతున్నారు. ఉఖియాలోని భైరవ బారీ దేవాలయాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. టెక్‌నఫ్ కాళికా దేవాలయం,

పురోహితుని ఇల్లూ, తగల బెట్టారు. పర్ భంగ్‌లోని దేవాలయాన్ని కూల్చేశారు. మహేశ్ కాళీలో మూడు దేవాలయాలనూ, పదకొండు హిందువుల ఇళ్ళనూ కూడా బూడిద చేశారు. భగవద్గీతను పారం చెప్పే నాలుగు పారశాలల్ని మంటలకు గురిచేశారు. కలరామా మార్కెట్‌లోని కాళీమందిరానికీ, హరిమందిరానికీ అదే గతి పట్టింది. నాలుగు చేతి వృత్తులవారి దుకాణాల్ని కూల్చేశారు. అలీ అక్బర్ డేల్‌లో యాభై జాలరుల ఇళ్ళు దోపిడీ చేశారు. ఆ తరువాత తగలబెట్టారు - కుతుత్ దియాలో ముగ్గురు పిల్లలు గాయపడ్డారు. రామ్‌పూర్ ఈద్‌గా సమీపంలోని కాళీమందిరం, జిలేపారాలోని హరిమందిరం ధ్వంసమైపోయాయి. చివరికి బూడిదగా మారాయి. ఫతేఖాన్ ఖుల్‌లోని చాలా ఇళ్ళను తగల బెట్టారు......"

"ఓ, నీకు పుణ్యం ఉంటుంది అపు. దీనికంటే ఓ పాట పాడకూడదూ? విందాం", అన్నాడు సురంజన్ తపస్ పాల్‌ను అపుతూ.

"పాట!" అందరూ దిమ్మెర పోయారు. ఇలాంటి పరిస్థితిలో ఎవరైనా పాడగలరా? ఈ రోజు మామూలు రోజుకాదు. ఇళ్ళూ, దేవాలయాలూ, దుకాణాలూ తగలబడుతున్నాయి. సురంజన్ పాట . పాడమని అడుగుతున్నాడు!

మళ్ళీ ఓసారి సురంజన్ విషయం మార్చాడు. "కాజల్‌దా, నాకు చాలా ఆకలిగా ఉంది. కాస్త అన్నం పెట్టగలవా? " అన్నాడు అందరూ ఆశ్చర్యపోయేలా?

అన్నం! ఈ వేళప్పుడు! సురంజన్‌కేమైంది? కానీ సురంజన్‌కి కావాల్సింది మాత్రం అన్నమే. దండిగా అన్నం, కొన్ని ఎండుచేపలు! అది ఈగల్ని గుంపులు గుంపులుగా ఆకర్షించాలి, తాను ఎడమ చేత్తో వాటిని తోలుకుంటూ, కుడిచేత్తో అన్నం తినాలి. తాము బ్రహ్మపల్లిలో ఉండగా రామ్‌రతియా తమ మండువాలో కూచొని ఎలా అన్నం తినేవాడో అతనికి మనసులో మెదిలింది. రాజ్‌బాలీ బళ్ళో రామ్‌రతియా చెత్త ఊడ్చేవాడుగా ఉద్యోగం చేసేవాడు..... ఒక రోజు అతడు మాయను ఇంటికి తీసుకొచ్చాడు. అప్పుడు మాయ చాలా చిన్నపిల్ల. ఆ రోజు కడుపునొప్పితో బాధ పడుతోంది. తాను దొడ్డికెళ్ళాల్సి ఉందని చెప్పాలని గూడా ఆ చిన్నపిల్లకు తోచలేదు. తానేమో తోటలో నిలబడి గట్టిగా ఏడుస్తూ ఉంది. ఉన్నట్లుండి తెల్లని పైజమా పచ్చగా అయిపోయింది. హెడ్‌మిస్ట్రెస్ దాన్ని గమనించి రామ్‌రతియాను తోడిచ్చి మాయను ఇంటికి పంపింది. మాయను ఇంటికి తీసుకొచ్చిన రామ్‌రతియాకు కిరణ్మయి అన్నం పెట్టింది. అతడు అన్నం తినటంలో అనుభవించిన ఆనందాన్ని సురంజన్ మరిచి పోలేదు. ఆనాడు రామ్‌రతియా అన్నం తినటాన్ని చూసి ఉండకపోతే అన్నం తినటంలోని ఆనందం తనకు అర్థమై ఉండేది కాదనుకుంటాడు సురంజన్. ఇప్పుడతడు అందరి ఎదుటా కాస్త అన్నం పెట్టమని అడుగుతున్నాడు. అతనికి పిచ్చి పట్టిందా? లేదనుకుంటాను. అతనికి పిచ్చేపట్టి ఉంటే అతడు విన్నవీ, కన్నవీ అతని మనసును కదిలించేవి కావు. అక్కడ చాలా తీవ్రమైన చర్చ జరుగుతోంది. అతడక్కడ కుంగి, కూలబడి పోవటం హాస్యాస్పదంగా ఉంటుంది. అతడు చాలా సేపట్నుంచి ఎండలో తిరుగుతున్నాడు. అతడు అలసిపోయాడు. ఆకలిగా కూడా ఉన్నాడు.

"నర్షిండీ జిల్లాలోని లోహార్‌కంద గ్రామంలోని ప్రజలు బషోనా రాణీ చౌదరిని ఆమె తన ఆస్తిని వదిలి పెట్టి పారిపోయేలా తరిమివేశారు. ఆమె కొడుకు చేత ఖాళీగా ఉన్న స్టాంప్ పేపర్ మీద కత్తితో బెదిరించి సంతకం పెట్టించుకున్నారు. ఈ విషయాన్ని బయటికి చెబితే ఆమెనూ, ఆమె కొడుకులనూ చంపేస్తామని చెప్పి వెళ్ళారు". ఈ మాటలు సురంజన్‌కు వినిపించీ వినిపించకుండా వినిపించాయి. బషోనాదేవి తన తల్లి కిరణ్మయిలాగా మృదువుగా ఉండే శాంతి కాముకురాలేమో అనిపించింది సురంజన్‌కు.

"మదరీపూర్ జిల్లాలోని రంజాన్‌పూర్ గ్రామంలో సబితారాణి, పుష్పారాణి అన్న స్త్రీలను యూనస్ సర్దార్ మనుషులు మానభంగం చేశారు. ఖుల్నాలో గూండాలు అర్చనారాణి బిస్వాస్, భగవతీరాణి బిస్వాస్ అన్న స్త్రీలను దారికాచి అడ్డగించి మానభంగం చేశారు. ఈ పని ఎవరు చేశారో తెలుసా? వాళ్ళ పేర్లు మధు, షౌకత్, అమీనుర్ చిట్టగాంగ్ జిల్లాలోని పాటియాలో పరిమళ్‌దాస్ కొడుకు ఉత్తమ దాస్‌ను బాద్‌షామియా, నూర్‌హుసేన్, నూర్ ఇస్లాం కలిసి హత్య చేశారు. ఉత్తమ్ బంధువులు వాళ్ళమీద కేసుపెట్టారు. ఫలితం ఒకటే. స్థానికులు వాళ్ళను అక్కణ్ణుంచీ తరిమేయాలని కుట్రలు చేస్తున్నారు. సిల్హెట్ జిల్లాలోని బోర్‌లేఖా కాలేజీ విద్యార్థిని సబితారాణీదే రాత్రిపూట చదువుకుంటూ ఉంది. నిజాముద్దీన్ అన్నవాడు తన గుండాలతో వచ్చి, వాళ్ళ ఇంట్లోకి దూరి బలవంతంగా ఆమెను ఎత్తుకుపోయాడు. ఈనాటికీ ఆమె ఏమైపోయిందో ఎవరికీ తెలియదు. బొగూరాలో నృపేంద్ర చంద్రదత్త కుమార్తె ఫేషాలీరాణి దత్తను కూడా బలవంతంగా ఎత్తుకుపోయి ఇస్లాం మతంలోకి మార్చారు. ఈ సంఘటనను గురించి దర్యాప్తు చేయమని కోరితే అధికారులు ఎంతమాత్రమూ ఆసక్తి చూపించలేదు. జసోర్ జిల్లాలోని సురోలోనూ, బాగ్‌డంగాలోనూ దుండగులు హిందువుల ఇళ్ళను చుట్టుముట్టారు. మనుషుల్ని ఏరి ఏరి చావగొట్టారు. పదకొండు మంది హిందూ యువతుల్ని రాత్రల్లా మానభంగం చేశారు".

ఎవరో అడిగాడు. అడిగింది ఎవరైనా అతని కళ్ళు భయంతో, అసహ్యంతో పెద్దవై ఉంటాయి కదూ? కానీ సురంజన్ కళ్ళు మూతలు పడి ఉన్నాయి. అతనికి నిద్రవస్తోంది. వెల్లువలా వస్తున్న సమాచారాన్ని అతని స్నేహితులు ఎలా స్వీకరిస్తున్నారో కూడా అతడు తెలుసుకోవాలని ఉత్సాహం చూపటం లేదు. మళ్ళీ భయంకరమైన విధ్వంసాల పట్టిక ప్రారంభమైంది.

నవ్‌ఖాలీలోని ఘోష్‌బాగ్ మొహల్లాలో కాపురం ఉంటున్న సావిత్రీ బాలారాయ్‌నీ, ఆవిడ భర్త మోహార్‌భాషీ రాయ్‌నీ, వాళ్ళ కూతుర్నీ తరిమేశారు. ఒక రోజు అలీపూర్‌కు చెందిన అబ్దుల్ హాలీంనూర్, అబ్దురబ్ బచ్చుమీయా సావిత్రీ బాల ఇంటికొచ్చారు. అంతకుముందే ఆ కుటుంబం వాళ్ళు కూతురి పెళ్ళికని పొలం అమ్మి, 18వేల టాకాలు దాచుకొని ఉన్నారు. నూర్, మియా ఆ డబ్బును తమకిచ్చేయమని బెదిరించి, తీసుకుపోయారు. వాళ్ళకింకా మిగిలి ఉన్న పొలాన్ని కూడా తమకు అమ్మినట్టుగా పత్రం రాసిచ్చి, భారతదేశానికి వెళ్ళిపోవాలని కూడా

చెప్పారు. పోతూ పోతూ కొంతంలో ఉన్న పశువుల్ని తోలుకు పోయారు. వాళ్ళు భారతదేశానికి వెళ్ళి ఉండకపోతే ఏం జరిగేది? వాళ్ళు సావిత్రీ బాల కూతుర్ని చంపేసే వాళ్ళేమో......షేర్‌పూర్‌లోని షాప్ మారీ ప్రాంతంలో నివసిస్తున్న 360 పాలమ్ముకునే వారి కుటుంబాలను ముస్లిం మతోన్మాదులు చిత్రహింసలు పెట్టారు. వాటిని భరించ లేకుండా వారు భారతదేశానికి పారిపోయారు. కిశోర్‌గంజ్‌లో ముస్లిం గూండాలు దొంగ పత్రాలు సృష్టించారు. చంద్ర సర్కార్‌కూ, సుమంత మోహర్ సర్కార్‌కూ, జతీంద్రమోహర్ సర్కార్‌కూ, దినేశ్ చంద్రమోహర్ సర్కార్‌కూ చెందిన పొలాలను కాజేశారు. దపూరియాకు చెందిన రంజర్ రాజ్‌భర్‌కూ ఇలాగే జరిగింది. రంజన్ చెల్లెళ్ళు మాలతినీ, రామ్‌రతినీ ముస్లింలు పెళ్ళి చేసుకున్నారు. కానీ పెళ్ళి చేసుకున్న కొన్ని నెలలకే వాళ్ళను వదిలేశారు. జైపూర్‌కు చెందిన బాలీఘటా గ్రామంలో నారాయణచంద్ర కుందుకు చెందిన ఇరవై భిఘాల పొలాన్ని ముస్లిం కౌలుదార్లు కుయుక్తులతో లాక్కున్నారు. అక్కడితో ఆగకుండా ఆ పొలాలమీద తాము ఇళ్ళు కూడా కట్టుకున్నారు". సురంజన్‌కు నిద్ర ముంచుకొస్తున్నా ఇతరులు చెబుతున్న విషయాలను వింటున్నాడు.

"నారాయణ్ గంజ్‌కి చెందిన చోర్‌గోర్‌కుల్‌లో అలీ మాస్టర్, అబ్దుల్‌బసర్, షాహిద్‌మొరోల్ స్టైన్‌గన్‌లతో అరు హిందువుల ఇళ్ళమీద దాడిచేశారు. సుభాష్ మండల్, సంతోష్, నేతాయ్, క్షేత్రమోహన్‌ల ఇళ్ళ నుంచీ సర్వమూ దోచుకుపోయారు. వాళ్ళ పొలాలను కూడా బలవంతంగా లాక్కున్నారు".

ఈలోగా ఎవరో గట్టిగా అరిచారు.

"సురంజన్, లెయ్, లెయ్. అన్నం వచ్చింది – తిందువుగానీ", అలా అన్నది కాజల్‌దా కావచ్చు. మాయకూడా అలాగే అతణ్ణి భోజనానికి పిలుస్తోంది. "దాదా, త్వరగా రా. అన్నం వడ్డించాను. త్వరగా వచ్చి తిను", అంటుంది.....

"మాయ తన కిచ్చిన డబ్బుతో దండిగా నిద్రమాత్రలు కొంటాను – అనుకున్నాడు సురంజన్ మసక మసగ్గా. తాను నిద్రపోయి ఎంతో కాలమైనట్టనిపిస్తోంది. చీకటి కాగానే నల్లులు కుట్టటం ప్రారంభిస్తాయి. తాను చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు కిరణ్మయి ఎలా నల్లుల్ని చంపేదో జ్ఞాపకం వచ్చింది సురంజన్‌కు. ఈ రోజే తన పరుపు శుభ్రం చేయమనీ, నల్లుల్ని నిర్మూలించమనీ మాయతో చెప్పాలి – అనుకున్నాడు సురంజన్. నల్లులు రాత్రంతా తన్ను కుడతాయి. జుట్టులోకి దూరి తల మీద కూడా కుడుతున్నాయి. ఆ ఆలోచన రాగానే అతనికి తలనొప్పి ప్రారంభమైంది. తలతిరగటం ప్రారంభించింది.

ఈ లోగా ఎవరో (తపస్ కాబోలు) తాము ఉంటున్న ప్రాంతంలో ముప్పై దేవాలయాలు నేలమట్టమయ్యాయని అంటున్నారు. ఆ దేవాలయాల చుట్టూరా ఉన్న ఇళ్ళు గూడా ధ్వంసం మయ్యాయట. అక్కణ్ణుంచీ మరెవరో కవితా శైలిలో కొనసాగించారు. "వినండి వినండి. వనభాలీలో జరిగింది వినండి". సుందర్‌పూర్‌లో ఏడు ఇళ్ళూ, అఘోర్ చంద్ ఆశ్రమమూ దోపిడీ చేయబడ్డాయట. ఆ తరువాత దుండగులు వాటిని తగలబెట్టారట. జగనందన్ అన్న గ్రామంలో మూడు ఇళ్ళకు

ఇదేగతి పట్టిందట. గంగాపూర్‌లో, రఘ్రాగావ్‌లో, దౌలత్‌పూర్‌లో, గోఘ్‌బాగ్‌లో ఇలాంటివే జరిగాయి. సోనాపూర్‌లోని కాళీమందిరం, సుల్తాన్‌పూర్‌లోని అఖండాశ్రమం, మరికొన్ని దేవాలయాలూ ధ్వంసమయ్యాయి. ఛోయనీబజార్‌లో, బాబుపూర్‌లో, తెటుయాలో, మహదీపూర్‌లో రంజ్‌గంజ్ బజార్‌లో, టోంగ్‌పార్‌లో, ఖజీర్‌హాట్‌లో రసూల్‌పూర్‌లో, జమీర్‌దార్‌హాట్‌లో, చౌమూహినీ, పోరాబర్‌లో కూడా ఇలాంటి విధ్వంసమే జరిగింది. భటోర్డీ అన్న గ్రామంలో పది దేవాలయాలూ, పద్దెనిమిది ఇళ్ళూ ధ్వంసమయ్యాయి. రాజ్‌పూర్‌లో పందొమ్మిది ఇళ్ళను లూటీ చేశారు. స్త్రీలను చెరిచారు. రాండీ గ్రామానికి చెందిన విప్లవ భౌమిక్‌ను నరికి చంపేశారు....."

సురంజన్ తన చెవుల్లో దూది పెట్టుకోగలిగితే ఎంత బావుంటుంది? అతని చుట్టూరా బాబ్రీ మసీదు విధ్వంసాన్ని గురించిన కథలే! లూటీలనూ, గృహదహనాలనూ, విధ్వంసాన్నీ గురించిన గాథలే! కాస్త నిశ్శబ్దం, శాంతి ఉంటే ఎంత బావుంటుంది?

ఇతర ప్రాంతాలతో పోల్చితే మైమెన్‌సింగ్‌లో తక్కువ విధ్వంసం జరిగింది. అక్కడికి పారిపోగలిగితే ఎంతో బావుండేది. తన శరీరంలోని మంట చల్లారేదాకా బ్రహ్మపుత్రలో ఈదేవాడు.... అదిరిపడిలేచాడు సురంజన్. ఇంతకుముందు గదిలో ఉన్న మిత్రులంతా దాదాపు వెళ్ళిపోయారు. సురంజన్ గూడా లేచి వెళ్ళబోయాడు.

"అన్నం టేబిల్ మీదుంది తిని పోరాదూ? ఇదేమిటి ఈ వేళలో నిద్రపోయావు? ఆరోగ్యం బాగా లేదా?" అన్నాడు కాజల్.

"లేదు కాజల్‌దా, అన్నం తినలేననుకుంటాను. తినాలనిపించటంలేదు. నువ్వన్నది నిజమే. ఆరోగ్యం బాగాలేదు", అన్నాడు సురంజన్ ఒళ్ళు విరుచుకుంటూ.

"అంటే?"

"నిజానికి ఏమి లేదు. ఒక్కోసారి విపరీతమైన ఆకలౌతుంది. కానీ ఏమైనా తినేలోగా ఆకలి అదృశ్యమైపోతుంది. బహుశా నాకు "అసిడిటి" ఉందేమో! నిద్రకూడా అంతే. నిద్ర ముంచుకొచ్చేస్తుంది. పడుకుంటే నిద్రపట్టదు. ఏం చేయాలి?" జతీన్‌చక్రవర్తి సురంజన్ భుజాలమీద చేతులేస్తూ అన్నాడు. "సురంజన్, నువ్వు మానసికంగా దెబ్బతింటున్నావు. జాగ్రత్తగా ఉండు. ఇది ఎవరికీ జరక్కూడదు. మనమంతా ఎలాగో ఒకలాగు బతుకులాగాలి".

తలవంచుకొని నిలబడి ఉన్న సురంజన్‌కు జతీన్‌దా మాటలు సుధామయ్ మాటల్లా వినిపించాయి. తాను తన తండ్రి పక్కన కూచోని అతని ఆరోగ్యాన్ని గురించి పరామర్శించి చాలా రోజులైంది. అతనికి తక్షణం ఇంటికి వెళ్ళాలనిపించింది. కాజల్‌దాని కలిసినప్పుడల్లా ఇలాగే జరుగుతుంది. ఎప్పుడూ కాజల్‌దా ఇంటికొచ్చినా చాలామంది ఉంటారు. రాజకీయాలను గురించీ, రాజకీయాలతో సంబంధం ఉన్న విషయాలను గురించీ సుదీర్ఘమైన కప్పదాటు చర్చ జరుగుతుంది. ఆ చర్చతో రాత్రి చాలా పొద్దుపోతుంది.

సురంజన్ అన్నం తినకుండానే వెళ్ళి పోయాడు. తాను ఇంట్లో అన్నంతిని

కూడా ఎన్నో రోజులైంది. ఈ రోజు మాయతో, కిరణ్మయితో, సధామయ్‌తో కలిసి అన్నం తినాలనుకున్నాడు. సురంజన్ తనకూ వాళ్ళకూ మధ్య గోడలు మొలిచాయి. ఈ రోజు ఆ గోడల్ని పగలగొట్టాలి. కానీ గోడలు మొలవటానికి కారకుడు తానే. ఈ రోజు తాను వాళ్ళతో నవ్వుతూ, తుళ్ళుతూ ప్రవర్తిస్తాడు. మళ్ళీ ఒకసారి – ఉదయంలాగా – సంతోషంగా, సంతృప్తిగా ఉంటాడు. గడిచిపోయిన రోజుల్ని గురించీ, చిన్ననాటి ముచ్చట్లను గురించీ, ఎండలో కూచోని ఆవిరిలో ఉడికిన బియ్యపు రొట్టెల్ని తినటాన్ని గురించీ అందరితో కబుర్లు చెబుతాడు. నాన్న, కొడుకు, అన్నయ్య, చెల్లెలు, అన్న లాంటి వ్యక్తిత్వ తారతమ్యాలు లేకుండా అందరూ స్నేహితుల్లా ఉంటారు. ఈ రోజు మరెవరి ఇంటికి తాను వెళ్ళడు. పులోక్ ఇంటికి వెళ్ళడు, రత్న ఇంటికి వెళ్ళడు. సరాసరి తికాతులీ వెళ్తాడు. ఉన్నది తింటాడు. రాత్రి పొద్దుపోయే వరకూ కబుర్లు చెప్పి, ప్రశాంతంగా నిద్రపోతాడు.

కాజల్ సురంజన్‌ను గేటుదాకా వచ్చి సాగనంపాడు. "నువ్విలా తిరుగుతూ ఉండగూడదు. మేము మా మొహల్లాలు వదిలి బయటికి పోవటం లేదు. నువ్వు చూడు. నగరమంతా ఒంటరిగా తిరుగుతున్నావు. ఏ నిమిషంలో ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అన్నాడు ఎంతో ఆందోళనగా.

సురంజన్ జవాబు చెప్పలేదు. పెద్ద పెద్ద అంగవేస్తూ ముందుకు నడిచాడు. అతనివద్ద రిక్షామీద వెళ్ళటానికి తగినంత డబ్బున్నా మాయ డబ్బును ఖర్చుపెట్టటానికి అతనికి మనస్కరించలేదు. ఈ రోజంతా అతడు సిగరెట్ కాల్చ లేదు. పొద్దుపోయిన తరువాత, డబ్బు మాయదే అయినా, సిగరెట్ కొనాలనిపించింది. దుకాణం వద్దకు వెళ్ళి ఒక "బంగ్లా ఫైవ్" సిగరెట్ కొని వెలిగించాడు. బ్రహ్మాండంగా అనిపించింది. కాక్రైల్ చౌరస్తా వరకూ నడిచి అక్కడ రిక్షా ఎక్కాడు. ఈలోగా ఢాకా నగరం జబ్బు మనిషిలా త్వరగా ముసుగు తన్నేస్తోందనిపించింది సురంజన్‌కు. ఈ నగరానికున్న జబ్బేమిటి? వీపుమీద పుండు వచ్చిన స్నేహితుడు జ్ఞాపకం వచ్చాడు సురంజన్‌కు. అతడు రోజుల్లా బాధతో కేకలు పెట్టేవాడు. కానీ వైద్యం మాత్రం చేయించుకునే వాడు కాదు. అతనికి మందులంటే భయం. సూది మందులంటే మరీను. ఈ నగరానిక్కూడా వీపుమీద పుండు ఉందా? ఉందనిపించింది – రిక్షాలో కూచొని ఇంటికి వెళ్తున్న సురంజన్‌కు.

★ ★ ★

"మాయా, సురంజన్ విషయం ఏమిటమ్మా? ఇప్పుడు వాడు ఎక్కడుంటాడో నీకు తెలుసా?" అడిగాడు సుధామయ్.

"పులోక్‌దా ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. అక్కడే చిక్కుకుపోయి ఉంటాడు".

"చీకటిపడ్డా ఇంటికి రాకపోవటానికి కారణం అదేనా?"

"నాకు తెలీదు.... ఈసరికి వచ్చేయాల్సింది".

"మనకు ఆందోళనగా ఉంటుందనీ, తాను త్వరగా ఇల్లు చేరుకోవాలనీ వాడికి తెలీదా?"

సుధామయ్ ఉద్వేగాన్ని తగ్గించటానికి ప్రయత్నించింది మాయ. "మీరు పట్టించుకోకండి. మీరు ఇంత ఎక్కువగా మాట్లాడకూడదు. మాట్లాడితే మీ బాధ ఎక్కువౌతుంది. ప్రశాంతంగా పడుకోండి. మీ భోజనానికి టైమైంది. తరువాత ఏమైనా చదివి వినిపించమంటారా? సంతోషంగా ఆ పని చేస్తాను. మీరు నిద్రమాత్ర తీసుకొని పది గంటలకు పడుకోవాలి. ఆ వేళకు అన్నయ్య వచ్చేస్తాడు. ఆందోళన పడకండి", అంది.

"నీ సేవతో నన్ను చాలా త్వరగా కోలుకునేలా చేస్తున్నావు మాయా. మరిన్ని రోజులు పడకమీదే ఉంటే సరిపోయేది. ఆరోగ్యం బావుంటే కొన్ని ఇబ్బందులున్నాయిగా".

"ఎలాంటివి?" మాయ అడిగింది అన్నం మెత్తగా పిసుకుతూ.

"నువ్వు అన్నం పెడతావు. మీ అమ్మ ఒళ్ళు పడుతుంది, కణతలు నొక్కుతుంది. నా ఆరోగ్యం బాగుపడితే నాకింత ప్రేమ లభిస్తుందా? ఆ తరువాత నేను నా రోగులతో, కూరల మార్కెట్‌కు వెళ్ళి రావటంతో, లేదా అప్పుడప్పుడూ నీతో పోట్లాడుతో...." సుధామయ్ బిగ్గరగా నవ్వాడు. మాయ ఆశ్చర్యపోయింది. అతడు జబ్బు పడ్డాక అలా నవ్వటం ఇదే మొదటి సారి.

అంతకుముందే అతడు కిరణ్మయితో ఇలా అన్నాడు.

"ఈ రోజు కిటికీ తలుపులన్నీ తెరిచిపెట్టు. ఈ గది ఇలా చీకటిగా ఉండటం నా కిష్టం లేదు. కాస్త తాజా గాలి లోపలికి రానివ్వు. హేమంత పవనాలు నాకు తగలటమే లేదు. వసంతంలో మాత్రమే గాలి తాజాగా ఉంటుందనుకుంటున్నావు కదూ? నేను చిన్నవాడుగా ఉన్నప్పుడు రక్తం గడ్డకట్టే హేమంత ఋతువులో చొక్కా మాత్రమే వేసుకొని రాత్రిపూట పోస్టర్లు అంటించటానికి వెళ్ళేవాణ్ణి. నేను మోనీసింగ్‌తో పాటు సుషాంగ్ దుర్గాపూర్ ప్రాంతంలోని కొండలన్నీ తిరిగాను. నీకు టాంక్ ఉద్యమాన్ని గురించి కానీ, హజాంగ్ తిరుగుబాటును గురించి కానీ ఏమైనా తెలుసా"? అని అడిగాడు కిరణ్మయిని.

కిరణ్మయి మనసులో ఇంతకాలమూ గూడుకట్టుకున్న ఆందోళన బాగా తగ్గింది.

"మనకు పెళ్ళయిన కొత్తలో వాటిని గురించి మీరెంతో చెప్పారు. మోనీసింగ్‌తో పాటు మీరు నేత్రకోణలో ఎవరి ఇంట్లోనో గడిపినట్లు కూడా చెప్పారనుకుంటాను", అంది కిరణ్మయి.

"కిరణ్మయీ, సురంజన్ ఉన్ని బట్టలేసుకొని వెళ్ళాడా?" అన్నాడు సుధామయ్ అకస్మాత్తుగా. మాయ మృదువుగా నవ్వింది.

"లేదు. మీ లాగా పల్చని చొక్కా వేసుకొని వెళ్ళాడు. అతడు ఆధునిక విప్లవకారుడు కదా! అతనికి రాజకీయ పవనాలే కానీ ప్రకృతి పవనాలు పట్టవు", అంది.

"వాడు ఎక్కడ తిరుగుతుంటాడో, ఏం తింటాడో దేవునికే తెలుసు. అసలేమైనా తింటున్నాడా? వాడి అరాచకత్వం రోజు రోజుకీ పెరిగిపోతోంది", అంది కిరణ్మయి కోపంగా.

ఎవరో తలుపుతట్టారు. సురంజనేనా? సుధామయ్ మంచంమీద కూర్చొని ఉన్న కిరణ్మయి తలుపు తీయటానికి లేచింది. సురంజన్ తలుపు సరిగ్గా అలాగే తడతాడు. కాని అతడు ఆలస్యంగా ఇంటికొస్తే సరాసరి తన గదికి వెళ్ళిపోతాడు, మరో ద్వారం గుండా. ఆ ద్వారం సాధారణంగా బయటినుంచి తాళం వేయబడే ఉంటుంది. ఒక వేళ లోపలినుంచీ గడియపెట్టి ఉంటే దాన్ని ఎలా తెరవాలో గూడా సురంజన్‌కి తెలుసు. ఇప్పుడు మరీ ఆలస్యంగా కాలేదు. కాబట్టి తలుపు తట్టింది సురంజనే అయి ఉండాలి. మాయ సుధామయ్ కోసం అన్నమూ, పప్పూ మెత్తగా కలుపుతోంది. చిన్న చిన్న ముద్దలు చేసిస్తే అతనికి తినటం సులభంగా ఉంటుందనుకుంటోంది మాయ. అతడు జబ్బుపడ్డ తరువాత చాలా రోజులు ద్రవాహారం మీదనే బతికాడు. ఇప్పుడిప్పుడే డాక్టరు మరీ అంత గట్టిగాలేని ఆహారం పెట్టటానికి అనుమతించాడు. ఈ రోజు వాళ్ళు తేటగా చేపల పులుసు చేశారు. అన్నమూ, పప్పూ, చేపల పులుసూ మెత్తగా కలుపుతోంది మాయ. అప్పుడు తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

కిరణ్మయి తలుపు వద్ద కెళ్ళి "ఎవరూ?" అంది, సుధామయ్ అటువేపే చూస్తున్నాడు. తలుపుకు అటువేపునుంచీ అస్పష్టమైన జవాబు వినిపించింది. కిరణ్మయి తలుపు తెరిచింది. ఏడుమంది యువకులు కిరణ్మయిని పక్కకు తోసేస్తూ విసురుగా లోపలికొచ్చారు. అందులో నలుగురి చేతుల్లో ఇనుప చువ్వలున్నాయి. వాళ్ళు మెరుపులా లోపలికి రావటం చేత ఇతరుల చేతుల్లో ఏమున్నాయో కనిపించలేదు. వాళ్ళంతా దాదాపు ఇరవై ఏళ్ళ వయసులో ఉన్నారు. ఇద్దరు పైజామాలూ, కుర్తాలూ, టోపీలు ధరించారు. మిగిలిన వాళ్ళు పొంట్లూ, షర్టులూ వేసుకున్నారు. లోపలి కొచ్చిన వాళ్ళు సమయం వృధా చేయలేదు. ఒక పద్ధతిగా గదిలో ఉన్న వస్తువుల్ని ధ్వంసం చేయటం ప్రారంభించారు. వాళ్ళలో ఒక్కరూ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. వాళ్ళ నిశ్శబ్దం భయంకరంగా ఉంది. పగిలిపోతున్న బల్లలూ, కుర్చీలూ, అద్దాల బీరువాలూ, పుస్తకాల షెల్ఫ్‌లూ, డ్రెస్సింగ్ టేబిలూ, పంకాలూ; చించివేయబడుతూ ఉన్న బట్టలూ – వీటి శబ్దం తప్ప గదిలో మరో శబ్దం లేదు. ఆశ్చర్యపోయిన సుధామయ్ లేచి కూచోవటానికి వృధా ప్రయత్నం చేశాడు. మాయ "బాబా..." అని గట్టిగా అరిచింది. కొయ్యబారి పోయిన కిరణ్మయి తలుపు ఇంకా తెరిచిపట్టుకునే ఉంది. తమ విధ్వంస కార్యక్రమాన్ని పూర్తి చేసిన తరువాత వాళ్ళలో ఒకడు కొడవలి బయటికి తీశాడు.

"బాస్టర్డ్స్, బాబ్రీ మసీదును కూలదోసిన తరువాత తప్పించుకోవాలనుకుంటు న్నారా?" అన్నాడు భయంకరంగా మీది కొస్తూ.

ఆవేశంతో పశువులైపోయిన వాళ్ళు ఆ కుటుంబానికి చెందిన వస్తువుల్ని ధ్వంసం చేయటం కొనసాగించారు. భయంతో గడ్డకట్టుకుపోయిన కుటుంబ సభ్యులు ముక్కలు ముక్కలై పోతున్న తమ వస్తువుల్ని చూస్తూ ఉండిపోయారు. వాళ్ళలో ఒకడు మాయను పట్టి లాగటంతో అందరికీ తెలివొచ్చింది. కిరణ్మయి గట్టిగా అరిచింది. సుధామయ్ బాధగా అశక్తతతో మూలిగాడు. మాయ తన్ను తాను రక్షించుకోవాలన్న

ఉద్దేశంతో మంచం కోడును గట్టిగా పట్టుకుంది. కిరణ్మయి పరుగెత్తుకుంటూ వచ్చి కూతుర్ని పట్టుకుంది. కానీ వాళ్ళు వదిలి పెట్టలేదు. కిరణ్మయిని దూరంగా లాగి పారేశారు. మంచం కోడు పట్టును విడిపించి మాయను తమ వెంట లాక్కుని బయటికి నడిచారు. కిరణ్మయి విషయాన్ని అర్థం చేసుకొని అరుస్తూ వాళ్ళ వెంట పరుగెత్తింది.

"దయచేసి నా కూతుర్ని వదిలి పెట్టండి", ఏడుస్తూ వాళ్ళను బతిమాలుకుంది.

వీధిలో రెండు ఆటోరిక్షాలు వేచి ఉన్నాయి. మాయ చేతులమీద తాను కలుపుతున్న అన్నం, పులుసు మరకలు అలాగే ఉన్నాయి. ఆవిడ బట్టలు చిందర వందరై పోయాయి. "అమ్మా...అమ్మా... నన్ను కాపాడు", అని భయంతో విచ్చుకున్న కళ్ళతో, అరవసాగింది. తన్ను లాక్కుపోతున్న వాళ్ళతో పోరాడింది. కిరణ్మయి తన శక్తికొద్ది ప్రయత్నించింది. తన ప్రాణాన్ని లెక్క చెయ్యకుండా ఆ దుర్మార్గుల మీదకి ఉరికింది. తన కోసం విసురుతున్న కొడవలిని తప్పించుకుంటూ, మాయను పట్టుకోవటానికి ప్రయత్నించింది. మాయను పట్టుకొని ఉన్న ఇద్దరు కిరణ్మయిని దూరంగా తోసిపారేసి, మాయను ఆటోలోకి తోశారు. ఆటోలు బయలు దేరాయి. ఏడుస్తూ, అరుస్తూ కిరణ్మయి వాటి వెంట పరుగెత్తింది, "వాళ్ళు నా కూతుర్నెత్తుకు పోయారు. రక్షించండి....రక్షించండి...." అని అరుస్తూ. వీధి చివరకు వచ్చేసరికి ఆవిడ శక్తి కడబట్టిపోయింది. ఆవిడ జుట్టు రేగిపోయింది. బట్టలు చెదిరి పోయాయి. అక్కడ ఆవిడకు బాగా పరిచయం ఉన్న మోతీమియా కనిపించాడు. "దాదా.... వాళ్ళు నాకూతుర్నెత్తుకు పోయారు. దయచేసి రక్షించండి దాదా", అని వేడుకుంది. ఇతరుల్లాగే అతడు కూడా శూన్యంగా ఆవిడకేసి చూశాడు. అందరూ ఆమెను చెత్తాచెదారం చిమ్ముతున్న పిచ్చి బిచ్చగత్తెను చూసినట్లుగా చూశారు. తన శక్తినంత గూడదీసుకొని కిరణ్మయి కనిపించకుండా పోయిన తన కూతుర్ని వెదుక్కొంటూ చీకట్లోకి పరుగుతీసింది.........

తెరిచి ఉన్న తలవాకిలిని చూసి సురంజన్ ఆశ్చర్యపోయాడు. ఇంట్లోకి అడుగుపెట్టగానే కనిపించిన విధ్వంసాన్ని చూసి దిమ్మెరపోయాడు. టేబిళ్ళు తిరగబడి ఉన్నాయి. ఇల్లంతా పుస్తకాలు పడి ఉన్నాయి. పరుపులూ, దుప్పట్లూ ముక్కలు ముక్కలుగా అయిపోయాయి. బట్టల బీరువా పగిలిపోయి ఉంది. బట్టలు చిందరవందరంగా పడిఉన్నాయి. ఒక గదిలోంచి మరొక గదిలోకి వెళ్ళి చూసిన సురంజన్‌కు ఊపిరి ఆడలేదు. పగిలిపోయిన గాజుముక్కలు అతని పాదాల కింద పరపరలాడాయి. బాధతో సుళ్ళు తిరిగిపోతూ నాన్నగారు నేలమీద పడి ఉన్నారు. కిరణ్మయి, మాయ అతనిక్కనిపించలేదు. తాను ఇంట్లో లేనప్పుడు ఏం జరిగిందని అడగటానికి అతనికి భయమేసింది. నాన్నగారు ఎందుకు నేలమీద పడివున్నారు? అమ్మా, చెల్లాయి ఎందుకు ఇంట్లో లేరు – ఈ ప్రశ్నల్ని వేసుకుంటున్న సురంజన్ తన గొంతు అదురుతున్నదని గమనించాడు.

"వాళ్ళు మాయను ఎత్తుకు పోయారు", అన్నాడు సుధామయ్ బలహీనమైన కంఠంతో.

"ఎత్తుకు పోయారంటే? ఎవరెత్తుకు పోయారు? ఎక్కడికి? ఎప్పుడు?" షాక్

తగ్గి కోపమూ, భయమూ పెరిగాయి సురంజన్‌లో.

సుధామయ్ జవాబు చెప్పలేకపోయాడు. అతనికున్న ఇంతో అంతో శక్తి కూడా కడబడుతోంది. సురంజన్ అతణ్ణి మెల్లగా లేవనెత్తి మంచం మీద పడుకొబెట్టాడు. అతడు ఊపిరాడకుండా బాధపడుతున్నాడు. చిన్న చిన్న గుక్కల్లో ఊపిరి తీసుకుంటున్నాడు.

"అమ్మేదీ?" మెల్లిగా సురంజన్ అడిగాడు.

సుధామయ్ ముఖం తెల్లగా - కర్ర కేసిన తోలులా - పాలిపోయింది. అతనికి తక్షణం ఏదైనా చేయకపోతే, అతని బ్లడ్‌ప్రెజర్ పెరిగితే అతడు చనిపోతాడు. సురంజన్‌కు ఏమీ తోచలేదు. నాన్నగారిని చూసుకోవాలా? చెల్లెల్ని వెదుక్కుంటూ వెళ్ళాలా? భయంతో, నిస్సహాయతతో సురంజన్ వణికిపోయాడు. తనమీదికి ఉరకలేస్తూ వస్తున్న నీటి ప్రవాహం అతని మనసులో కదిలింది. అదృశ్యం చెదిరిపోయి ఒక గుంపు వీధి కుక్కలు నిస్సహాయంగా ఉన్న పిల్లికూన మీదికి ఉరికే దృశ్యం వచ్చింది. ఒక నిర్ణయం తీసుకున్నాడు సురంజన్. "మాయను తీసుకొస్తాను నాన్నా - ఏమైనా సరే", అన్నాడు. స్పర్శజ్ఞానం కోల్పోయిన నాన్నగారి చేతిమీద మృదువుగా తడుతూ, తరువాత వీధిలోకి నడిచాడు.

సురంజన్ హైదర్ ఇంటికెళ్ళి బిగ్గరగా తలుపు తట్టాడు. అతని అర్భాటానికి హైదర్ వచ్చి స్వయంగా తలుపు తీశాడు. "ఏమిటి సురంజన్? ఏమిటి సంగతి?" అన్నాడు హైదర్.

సురంజన్ జవాబు చెప్పలేకుండా పోయాడు. అతనిలోని బాధా, నిరాశా అతని నోటమాట రానివ్వలేదు.

"వాళ్ళు మాయను ఎత్తుకు పోయారు....." అన్నాడు చివరకి, అతని కంఠం ఉద్రేకంతో వణుకుతోంది. ఎవరెత్తుకు పోయారని చెప్పాల్సిన అవసరం లేదు.

"ఎప్పుడెత్తుకుపోయారు?"

సురంజన్ జవాబు చెప్పలేదు. మాయను ఎప్పుడెత్తుకుపోయారని చెప్పటం అవసరమా? ఎత్తుకు పోయారని చెబితే చాలదా? హైదర్ కనుబొమలు ముడిపడ్డాయి. ఇది చాలా ఆందోళనకరమైన వార్తే! తాను పార్టీ సమావేశానికెళ్ళి, ఇప్పుడే వచ్చాడు. బట్టలు మార్చుకోవాలనుకుంటుండగా సురంజన్ వచ్చాడు. సురంజన్‌లో కనిపిస్తున్న మార్పును చూసి హైదర్ ఆశ్చర్యపోయాడు. అతని విశ్వాసాలన్నీ వరదలో కొట్టుకుపోయిన వాడిలా నిలబడ్డాడు అతడు. తలుపునానుకొని నిలబడ్డా అతని చేతులు వణుకుతున్నాయి. పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. తన స్నేహితుణ్ణి అనునయించటం కోసం హైదర్ అతని భుజాల చుట్టూ చేతులు వేశాడు. "ఆందోళన వద్దు. ఇంట్లోకి రా. దీన్ని గురించి ఏం చేయాలో ఆలోచిద్దాం" అన్నాడు.

హైదర్ తన్ను తాకగానే సురంజన్ చెదిరిపోయాడు. "హైదర్, మాయను నువ్వు తీసుకురావాలి.... దయచేసి మాయను తీసుకురావాలి", అన్నాడు తాను కూడా హైదర్ భుజాల మీద చేతులేస్తూ.

అతడు వెక్కి వెక్కి ఏడవసాగాడు. అతని వేదన శరీరాన్ని కుదిపి వేయసాగింది. చివరికి సురంజన్ హైదర్ కాళ్ళమీద పడి అదే కోరిక కోరాడు. హైదర్ దిమ్మెర

పోయాడు. గట్టివాడూ, సమర్థుడూ, అందర్నీ ఆటపట్టించేవాడూ అయిన తన స్నేహితుడు ఇలా బేలగా కుప్పకూలి పోతాడని హైదర్ కల్లోకూడా ఊహించలేదు. సురంజన్‌ని లేవనెత్తాడు. అతడు ఎంతో ఆకలిగా ఉన్నాడని తెలిసినా తిండి సంగతి తరువాత ఆలోచించవచ్చని అనుకున్నాడు.

"రా వెళ్దాం. మనం మన ప్రయత్నం చేద్దాం", అన్నాడు హైదర్. హోండా మోటార్ సైకిల్ ఎక్కి తికాతులీలోని సందుల్లోకీ, గొందుల్లోకీ వెళ్ళారు. హైదర్ గుడిసెల్లోకీ, భవనాల్లోకి వెళ్ళి వచ్చాడు. దొంగల్లా కనిపిస్తున్న పాన్‌వాలాలతోనూ, ఆధునికంగా కనిపిస్తున్న యువకుల్తోనూ మాట్లాడాడు. అలాంటి మనషులూ, చోట్లూ తను నివసిస్తున్న ప్రాంతంలోనే ఉండటం సురంజన్‌కు ఆశ్చర్యం కలిగించింది. కానీ, హైదర్ ప్రయత్నానికి ఫలితం కనిపించలేదు. తికాతులీ దాటి వాళ్ళు ఇంగ్లీష్ రోడ్, లక్ష్మీ బజార్, లాల్‌బాగ్, సూత్రపూర్, వైజ్‌ఘాట్, సదర్‌ఘాట్, పారీమోహన్ దాస్‌రోడ్, అభయ్‌దాస్ లేన్, నరిందా, ఆటా బజార్, పారీదాస్ రోడ్, బాబూ బజార్, ఉర్దూ రోడ్, చౌక్ బజార్‌ల గుండా వెళ్ళారు. మాయను దాచి పెట్టటానికి అవకాశం ఉందనుకున్న ప్రతిచోటా వెదికారు. ఆవిడ జాడ తెలియలేదు. కానీ వాళ్ళు ఆశ వదులుకోలేదు. ఎన్నో తలుపులు తట్టారు. ఎందరితోనో మాట్లాడారు. కానీ ఫలితం లేకపోయింది. హైదర్ ఆగిన ప్రతిచోటా సురంజన్ మనసులో ఆశ చిగురించేది..... ఈసారి మాయను గురించి తెలుస్తుంది..... అనిపించేది. ఆవిడను కొట్టేసి ఉండవచ్చు. చావగొట్టి ఉండవచ్చు.... కాని ఆవిడ దొరుకుతుంది. ఒకవేళ కొట్టటంతో సంతృప్తిపడి ఉండకపోతే? సురంజన్ తన చెవులు రిక్కించి వింటున్నాడు – మాయ ఏడుపు వినిపిస్తుందన్న ఆశతో.

వాళ్ళిద్దరూ లక్ష్మి బజార్‌లో నుంచీ వెళ్తుండగా అకస్మాత్తుగా సురంజన్ హైదర్‌ను బండి ఆపమన్నాడు. తాను మాయ ఏడుపు విన్నట్టుగా అతనికి అనిపించింది. ఆ ఏడుపు శబ్దాన్ని అనుసరిస్తూ వెళ్తే అది ఎవరో పసిపాప ఏడుపని తేలింది. అప్పటికే రాత్రి బాగా పొద్దుపోయింది. కాని హైదర్, సురంజన్ తమ గాలింపు కొనసాగిస్తూనే ఉన్నారు. వెదకాల్సిన చోట్లు ఎన్నో ఉండటం చేత వాళ్ళు ఎక్కడా ఎక్కువ సేపు ఆగటం లేదు. ప్రతి సందుమలుపులోనూ ఎర్రని చూపులు వాళ్ళను పరిశీలనగా చూస్తున్నాయి. వాళ్ళను చూడగానే వీళ్ళే మాయను ఎత్తుక పోయారని సురంజన్ అనుకున్నాడు.

"హైదర్ మాయ ఎక్కడ? మనం ఆవిడ ఎక్కడుందో ఎందుకు తెలుసుకోలేకుండా ఉన్నాం?"

"ప్రయత్నిస్తున్నా".

"తెల్లవారేలోగా మాయెక్కడుందో తెలుసుకొని తీరాలి".

"స్థానికంగా ముఖ్యమైన వాళ్ళనందర్నీ కలుసుకున్నాను. ఇంతకంటే ఏం చేయగలను?"

సురంజన్ సిగరెట్లు ఆర్పకుండా కాలుస్తున్నాడు. ఆ సిగరెట్లను తాను మాయ ఇచ్చిన డబ్బుతో కొనుక్కున్నానన్న జ్ఞాపకం వచ్చేసరికీ తీవ్రమైన బాధ కలిగింది అతనికి.

"సూపర్ స్టార్ హోటల్‌కెళ్ళి ఏమైనా తిందాం. నాకు చాలా ఆకలిగా ఉంది".

హైదర్ రెండు ప్లేట్లు పరోటాలూ, మాంసమూ ఆర్డర్ చేశాడు. సురంజన్ తినటానికి ప్రయత్నించాడు. పరోటాను తుంచి చేతిలో పట్టుకున్నాడు కాని నోట్లో పెట్టుకోలేక పోయాడు. నిమిషాలు గడుస్తున్నాయి. హృదయంలోని శూన్యం నిమిష నిమిషానికి పెరుగుతోంది. హైదర్ మాత్రం హాయిగా తిన్నాడు. తినటం పూర్తయిన తరువాత సిగరెట్ వెలిగించాడు.

"రా వెళ్దాం. మాయ ఎక్కడుందో తెలుసుకోవాలి", అన్నాడు సురంజన్ హైదర్‌ను ఉత్సాహపరుస్తూ.

"ఇంకెక్కడ చూడగలనో నువ్వే చెప్పు. మనం ఎంత జాగ్రత్తగా వెదికామో నువ్వే చూశావు కదా?"

"ఢాకా చిన్న ఊరు. ఇక్కడే మాయను దాచి ఉంటే మన దృష్టికి రాకుండా పోయేదికాదు. పోలీసు స్టేషన్ కెళ్దాం రా".

సురంజన్ మొత్తం సంఘటన ఎలా జరిగిందో వాళ్ళకు వివరంగా చెప్పాడు. పోలీసులు ఆసక్తిలేని ముఖాలతో అంతా విన్నారు. మొత్తం మీద రాత మూలకంగా ఒక కంప్లెయింట్ ఇవ్వగలిగాడు.

"వీళ్ళు శ్రద్ధ తీసుకుంటారనుకోను", అన్నాడు సురంజన్.

"తీసుకోవచ్చు".

"వారీకెళ్దాం రా. అక్కడ నీకెవరైనా తెలుసా?"

"పార్టీ వాళ్ళకు ఈ పని అప్పగించాను. వాళ్ళు కూడా చూస్తారు. మరీ ఎక్కువగా ఆందోళన పడకు". నిజమే. హైదర్ చేయగలిగిందంతా చేసాడు. కానీ సురంజన్‌కు సంతృప్తికరంగా లేదు. అతని ఆందోళన అతణ్ణి ముందుకు తరుముతోంది. ఆ రోజు రాత్రల్లా వాళ్ళు తిరుగుతూనే ఉన్నారు. వాళ్ళు నగరంలోని దొంగ వ్యాపారుల్ని కలిశారు. జూదాలు జరిపే ఇళ్ళకు వెళ్ళారు. అక్రమ సారా వ్యాపారుల్ని చూశారు. కానీ ఎవరూ ఏమీ చెప్పలేక పోయారు. ఇలా వాళ్ళు హైదర్‌కు ప్రార్థన సమయమయ్యే వరకూ తిరుగుతూనే ఉన్నారు.

సురంజన్‌కు అజాంశబ్దం చాలా ఇష్టం. కానీ ఈ రోజు ఆ శబ్దం దుర్భరంగా ఉంది. అజాం సమయమైందంటే తెల్లవార్తు తోందన్నమాట..... కానీ మాయమాత్రం కనిపించలేదు.

తికాతులీలో మోటార్ సైకిల్ ఆపాడు హైదర్. "సురంజన్, ఢీలా పడిపోకు. ఏం చేయాలో మళ్ళీ ఆలోచిద్దాం", అన్నాడు సాధ్యమైనంత మృదువుగా.

సురంజన్ ఇల్లుచేరేసరికి ముక్కలై పోయిన తన ఇంటి వస్తువుల మధ్య కూచొని ఆతురతగా, నిరాశగా చూస్తూ ఉంది కిరణ్మయి. ఉద్రేకంతో నిద్రలేమితో మరింతగా బలహీన పడిపోయిన సుధామయ్ గూడా సురంజన్ మాయను తీసుకొస్తాడన్న ఆశ కాని ఆశతో ఎదురుచూస్తున్నాడు. కానీ అలసిపోయిన తమ కొడుకు దుఃఖంగా, ఒంటరిగా తిరిగి రావటంతో వాళ్ళ ఆశ నిరాశైపోయింది. అంటే తామిక మాయను చూడలేరన్న మాటేగా? దుఃఖంతో, భయంతో వారి శరీరాలు వణికాయి. ఇంట్లోని

విధ్వంసదృశ్యం గాలీ వెలుతురూ లేని ఆ గదిలో మరింత భయంకరంగా కనిపిస్తోంది. గదిలో ఉన్న తలుపులూ, కిటికీలూ మూసివేయబడి ఉన్నాయి. గదిలో కొచ్చిన సురంజన్‌కు అమ్మతో, నాన్నతో మాట్లాడాలనిపించలేదు. భయంగా, బాధగా, నిశ్శబ్దంగా కూలబడ్డాడు. వాళ్ళ కళ్ళల్లోని అనంతమైన ప్రశ్నలకు సురంజన్ జవాబు ఒకటే "మాయ కనిపించలేదు".

సురంజన్ అలసటతో నేలకు జారిపోయి కాళ్ళు చాచుకున్నాడు. అతనికి వాంతి అయ్యేలా అనిపించింది. ఈ సరికి మాయ మీద సామూహిక అత్యాచారం జరిగి ఉండవచ్చు. మాయ ఆరుసంవత్సరాల అమ్మాయిగా ఉన్నప్పుడు రెండు రోజులు కనిపించలేదు. అకస్మాత్తుగా మూడో రోజు కనిపించింది. ఇప్పుడు గూడా మాయ అలా తిరిగొస్తే ఎంత ఆనందంగా ఉంటుంది. తలుపు తెరిచే ఉంది. బాధగా, అసలటగా – కానీ సజీవంగా మాయ తెరిచిన తలుపులోంచి వచ్చి, కుంగిపోయిన కుటుంబాన్ని కలుసుకుంటే ఎంత బావుంటుంది! ఆమె తిరిగి రావాలి. భయంలో పూర్తిగా చెదిరిపోయిన తన చిన్న కుటుంబాన్ని కలుసుకోవటానికి రావాలి.

రెండవ రోజు గూడా మాయకోసం వెదుకుతానని హైదర్ చెప్పాడు. కాబట్టి మాయ తిరిగి వచ్చే ఆశ ఉందా? మాయను ఎందుకు వాళ్ళు ఎత్తుకు పోయారు? ఆవిడ హిందువు కావటం చేతనేనా? ఈ దేశంలో ఉండాలంటే హిందువులు ఇంకా ఎన్ని మానభంగాలనూ, ఎంత రక్తపాతాన్నీ, ఆస్తి నష్టాన్నీ భరించాలి? చిప్పలో తలలు దాచుకున్న తాబేళ్ళలా ఇంకా ఎంత కాలం బతకాలి? ఎంతకాలం....ఎంత కాలం? ఈ ప్రశ్నలకు జవాబుల కోసమే అతడు వెదుకుతోంటే అవి దొరకలేదు.

కిరణ్మయి గోడకానుకొని కూచో ఉంది. ఆవిడ మాట్లాడుతోంది – ఎవర్నీ ఉద్దేశించకుండా. "పిన్నీ, మీరెలా ఉన్నారో చూడాలని వచ్చాం. మేము ఇక్కడి వాళ్ళమే. తలుపు తీయండి – అన్నారు. వాళ్ళ వయస్సు ఎంత ఉండవచ్చు? ఇరవై ఒకటో, ఇరవై రెండో! అంతకంటే ఎక్కువ లేదు. వాళ్ళను నేను ఎలా అడ్డుకునేది? చుట్టుపట్ల అన్ని ఇళ్ళకూ వెళ్ళాను. సహాయం చేయమని అడిగాను. వాళ్ళకు సహాయం చేయాలని ఉండచ్చు. కానీ ఎవరూ సహాయం చేయటానికి ముందుకు రాలేదు.... వాళ్ళలో ఒకడి పేరు రఫిక్. ఎవరో వాడిపేరు పిలిచారు. వాడు టోపీ కూడా పెట్టుకున్నాడు.... మాయ పరుల్ ఇంట్లో కొంతకాలం తలదాచుకుంది. అది అక్కడే ఉండి పోయి ఉంటే దానికీ సమస్య వచ్చేది కాదు.... మాయ ఇంక అసలు తిరిగి రాదంటారా? ఈ ఇంటిని వాళ్ళు తగలబెట్టి ఉండచ్చుగా. ఈ ఇంటి సొంతదారు ముస్లిం కదూ? అందుకే తగలబెట్టలేదు కాబోలు! మరి నన్నెందుకు చంపలేదు? నా బతుకు అయిపోయిందిగా. చంపేసుంటే పీడ విరగడైపోయేది. దాని బతుకు ఇప్పుడే ప్రారంభమౌతోంది....

సురంజన్ తల తిరిగి పోతోంది. తలలో భరించలేని పోటు. అతడు బాత్‌రూంలోకి పరుగెత్తి పెద్దగా వాంతి చేసుకున్నాడు....

★ ★ ★

# ఏడవ రోజు

వరండాలోకి సూర్యకాంతి రాగానే నలుపు, తెలుపు పిల్లి అడ్డంపడి వచ్చింది. అది ఆహారం కోసం వెదుకుతోందా? మాయకోసం వెదుకుతోందా? పిల్లిని చంకలో పెట్టుకొని తిరిగేది మాయ. అది మాయ దుప్పట్లోకి దూరి వెచ్చగా పడుకునేది. దానికి మాయ ఇంట్లో లేదని తెలుసా?

మాయ ఎక్కడున్నా కళ్ళు పోయేలా ఏడుస్తూ ఉంటుంది. ఆవిడ కాళ్ళూ, చేతులూ కట్టేసి ఉంటారా? నోట్ల బట్టలు కుక్కి ఉంటారా? ఆరేళ్ళ అమ్మాయికీ, ఇరవై ఒక్క ఏళ్ళ అమ్మాయికీ చాలా తేడా ఉంది. వీరిని కిడ్నాప్ చేయటానికున్న కారణాల్లో కూడా అంతే తేడా ఉంటుంది. ఇరవై ఒక్క సంవత్సరాల వయసులో ఉన్న యువతిని ఏడు మంది మగవాళ్ళు ఏం చేయటానికి అవకాశం ఉందో స్ఫురించగానే సురంజన్ నిశ్చేష్టుడై పోయాడు. ఆ ఆలోచనకే భయపడ్డాడు. భరించరాని బాధతో అతడు శవంలా కొయ్యబారిపోయాడు. తాను బతికే ఉన్నాడా? ఔను, సందేహంలేదు. మాయే వెళ్ళిపోయింది – బహుశా శాశ్వతంగా. ఎవరూ తమ్మ ప్రాణాన్ని ఇతరుల ప్రాణం కోసం త్యాగం చేయరు. ఇదే ప్రపంచం నడిచే దారి. ప్రపంచంలోని ఏ జీవికీ మనిషికున్నంత స్వార్థం లేదు. మాయ వెళ్ళిపోయినంత మాత్రాన ఆవిడ బంధువులెందుకు చావాలి?

హైదర్ మాయకోసం కష్టపడి వెదికిన మాట నిజమే. కానీ అతడు తన శక్తిని పూర్తిగా ఉపయోగించి వెదకలేదని సురంజన్ అనుకుంటున్నాడు. ఎంత కాదన్నా హైదర్ ముస్లిమే గదా! ముస్లిముల్ని వెదకటానికి ముస్లింను ఉపయోగించటం ఎముకను తీయటానికి ఎముకను ఉపయోగించటం లాంటి పనికిమాలిన పని. ఎండలో పడుకొని పిల్లిని చూస్తూ ఉన్న సురంజన్‌కు కొత్త ఆలోచన వచ్చింది. మాయను ఎత్తుకుపోయిన వాళ్ళెవరో హైదర్‌కు తెలిసినా తెలియనట్టుగా నటిస్తున్నాడా? అతడు సూపర్ స్టార్ హోటల్‌లో భోజనం చేస్తున్నప్పుడు అతని ముఖంలో ఆందోళన కనిపించలేదు. అతడు హాయిగా తిన్నాడు. భోజనం తరువాత తృప్తిగా తేన్చేడు. ఆ తరువాత నెమ్మదిగా సిగరెట్ కాల్చాడు. అతని ప్రవర్తనలో తాను గొప్ప ప్రమాదంలో ఉన్న వ్యక్తిని వెదుకుతున్న ఆందోళనా, ఆతురతా కనిపించలేదు. ఇప్పుడాలోచిస్తే వెదికే కార్యక్రమం తనకంత ముఖ్యమైంది కాదన్న అభిప్రాయం అతనికుందేమో అనిపిస్తోంది. రాత్రిపూట బండిమీద నగరంలో తిరగటం హైదర్‌కు చాలా ఇష్టం. తాను నిన్నరాత్రి అతని కోరిక తీర్చాడా? మాయకోసం నిజాయితీగా వెదికే ప్రయత్నం అతనిలో ఉందా? అతడు పోలీస్ స్టేషన్‌లో కూడా అంటీ అంటనట్టుగా ప్రవర్తించాడు. అతడు స్నేహం పోగొట్టుకోవటమెందుకులే అని కంటి తుడుపుగా తనతో తిరిగాడా? తన పార్టీ మనుషులతో హైదర్ అసలు ఏమైనా చెప్పాడా అన్న సందేహం కలిగింది సురంజన్‌కు. బహుశా మాయను వెదకటం అతని కార్యక్రమంలో మొదటి అంశం కాదేమో. ఈ దేశంలో హిందువులు ద్వితీయ శ్రేణి పౌరులు కాబట్టే అంతా ఇలా జరుగుతోందా?

పక్క గదిలో మాయ నాన్నగారి చేతికి వ్యాయామం చేయిస్తూ లేదని నమ్మటానికి సురంజన్‌కు ఇప్పుడు కూడా కష్టంగానే ఉంది. తాను గదిలోకి రాగానే "దాదా, నువ్వేమీ చేయవా?" అని మాయ అడుగుతుందని అతడు ఎదురుచూశాడు. నిజమే. తాను ఆవిడకు చేయవలసినంత చేశాడా? సురంజన్ పశ్చాత్తాపంతో ఆలోచించాడు. అందరు చెల్లెళ్ళూ అన్నయ్యల్ని చిట్టిచిట్టి కోరికలు కోరరా? నన్ను బయటికి తీసుకెళ్ళు..... నాకు అది కొనివ్వు..... ఇది కొనివ్వు.... నిజమే! ఇవి అందరు చిట్టి చెల్లెళ్ళూ కోరే చిట్టి కోరికలే. మాయ కూడా ఇలాంటి కోరికల్ని ఎన్నో కోరింది. కాని సురంజన్ ఏనాడూ వాటిని పట్టించుకోలేదు. ఎప్పుడూ తనపనే తనది. ఆవిడను పట్టించుకునే తీరిక తనకు ఏనాడూ లేదు. తన స్నేహితులూ, తన రాజకీయాలూ, తన పార్టీ సమావేశాలూ.... అంతే! నాన్న, అమ్మ, చెల్లాయి తనకు ఏనాడు పట్టలేదు. వాళ్ళ సుఖ దుఃఖాలు తనను ఏనాడూ తాకలేదు. దేశం భవిష్యత్తు తప్ప తనకు ఏమీ పట్టలేదు. ఈ దేశంలోని తాను చూసిన సమస్యల్ని పరిష్కరించటానికి తానెంతో శ్రమపడ్డాడు. కానీ తాను విజయం సాధించాడా?

తొమ్మిది గంటలు కాగానే సురంజన్ దగ్గరే ఉన్న హైదర్ ఇంటికి పరుగెత్తాడు. అతడు ఇంకా నిద్రపోతున్నాడు. సురంజన్ హాల్లో కూచొని అతడు నిద్రలేవటం కోసం ఎదురుచూశాడు. అతని మనసులోకి ఒక చిత్రమైన అనుమానం నెమ్మది నెమ్మదిగా ప్రవేశించింది. మాయను ఎత్తుకు పోయిన రౌడీల్లో ఒకడైన రఫిక్ హైదర్‌కు తెలిసినవాడు కావచ్చు. బంధువు కూడా కావచ్చు. సురంజన్‌కు వణుకు పుట్టింది. రెండు గంటలు గడిచిన తరువాత హైదర్ బయటికొచ్చాడు.

"మాయ వచ్చేసిందా?" అన్నాడు.

"మాయ ఇల్లుచేరుంటే నేనెందుకొస్తానూ?" అన్నాడు సురంజన్, మాటకు మాటగా.

"ఓ" అన్నాడు హైదర్ అనాసక్తంగా. అతడు చొక్కా లేకుండా లుంగీ మాత్రమే కట్టుకో ఉన్నాడు. "ఈ సంవత్సరం మరీ అంత చలిగా లేదు కదూ?" అన్నాడు ఎదమీద గోక్కుంటూ. "ఈ రోజు పార్టీ అధ్యక్షుని ఇంట్లో సమావేశం ఉంది. వాళ్ళు ఊరేగింపుకు ఏర్పాట్లు చేస్తున్నారనుకుంటాను. గులాం ఆజం కార్యక్రమం ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు ఈ అల్లర్లు ప్రారంభ మయ్యాయి. ఈ అల్లర్లను నిస్సందేహంగా బి.ఎన్.పి.నే ప్రారంభించింది. వాళ్ళు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని ప్రయత్నించారు", అన్నాడు మళ్ళీ.

"అన్నట్లు హైదర్, నీకు రఫీక్ అన్న యువకుడు తెలుసా? మా ఇంటి కొచ్చిన రౌడీల్లో ఆ పేరున్నవాడు ఒకడున్నాడు".

"ఎక్కడి వాడు?"

"తెలీదు. వాడి వయస్సు ఇరవై ఒకటో, ఇరవై రెండో ఉండవచ్చు. బహుశా ఈ మొహల్లా వాడే కావచ్చు".

"ఆ పేరున్నవాడు నాకెవరూ తెలీదు. ఎందుకైనా మంచిది నా మనుషుల్తో చెబుతాను".

"బయటికెళ్దాంరా. మనమిలా సమయం వృధా చేయకూడదు. మా అమ్మా, నాన్నల ముఖం చూడలేకుండా ఉన్నాను. నాన్నగారికి మళ్ళీ స్ట్రోక్ వచ్చింది. ఈ ఆందోళనలో అంతకంటే భయంకరమైంది ఏమీ జరక్కుండా ఉంటే చాలు".

"ఈ టైంలో నువ్వు నాతోపాటు తిరగటం మంచిది కాదు".

"ఎందుకూ? ఎందుకు మంచిది కాదు?"

"నీకెందుకర్థం కాదు?"

హైదర్‌కు తనతోపాటు బయట కనిపించటం ఎందుకు ఇష్టం లేదో సురంజన్ అర్థం చేసుకున్నాడు. సురంజన్ హిందువు. హిందువు కాబట్టి అతనికి ముస్లిముల్ని – వాళ్ళు దొంగలైనా, రౌడీలైనా, హంతకులైనా సరే – పట్టుకునే అధికారం లేదు. ఒక హిందూ యువతిని ముస్లిముల చెరనుంచీ విడిపించమని కోరటం కూడా అధిక ప్రసంగమే కావచ్చు.

హైదర్ ఇంటి నుంచి సురంజన్ నిరాశగా బయటికి నడిచాడు. ఇప్పుడెక్కడికెళ్ళాలి? ఇంటికా? ఆ అడవిలోకి వెళ్ళటం అతని ఇష్టంలేదు. ఇంకా తన అమ్మా నాన్నా తాను మాయను తీసుకొస్తానని పిచ్చిగా నమ్ముతున్నారు. మాయను తీసుకెళ్ళకుండా తాను ఒంటరిగా ఇంటికెళ్ళటం ఇష్టం లేదు సురంజన్‌కు.

మాయకోసం వెదకమని తన మనుషులకు చెప్పినట్లుగా హైదర్ అన్నాడు. వాళ్ళు నిజంగా వెదుకుతారా? వాళ్ళేం పోగొట్టుకున్నారు కాబట్టి వెదుకుతారు? వాళ్ళకూ, మాయకూ ఏమిటి సంబంధం? ముస్లిములకు హిందువులంటే ఎందుకు ప్రేమాభిమానాలుండాలి? ఉంటే హిందువుల ఇళ్ళు ఇలా ధ్వంసమయ్యేవా? బూడిదయ్యేవా? సురంజన్, గోపాల్, కాజలేందు ఇళ్ళు మాత్రం ఎందుకు విధ్వంసానికీ, దోపిడీకి గురయ్యాయి?

సురంజన్ ఇంటికెళ్ళలేదు. వీధుల వెంట తిరిగాడు... నగరమంతా చెడ తిరిగాడు – మాయను వెదుకుతూ. అంత క్రూరంగా ఎత్తుకు పోవటానికి మాయ ఏం పాపం చేసింది? హిందువుగా పుట్టటం క్రిమినల్ నేరమా? హిందువులుగా పుట్టిన నేరానికి వాళ్ళనూ, వాళ్ళ ఇళ్ళనూ తగల బెట్టవచ్చా? వాళ్ళ స్త్రీలను మానభంగం చేయవచ్చా? సురంజన్ అగమ్యంగా తిరిగాడు. అప్పుడప్పుడూ పరుగెత్తాడు. ఇరవై ఒక్క సంవత్సరాల వయస్సున్న ప్రతివాడూ సురంజన్‌కు అనుమానాస్పదంగానే కనిపించాడు. ఇస్లాంపూర్ కాలనీలో అతడు ఓ కిరాణా కొట్టు వద్దకి సిగరెట్ కొనుక్కోవాలని వెళ్ళాడు. కొట్టువాడు సురంజన్ ముఖంలోకి చూడకుండా తప్పించుకోవాలని ప్రయత్నించాడు. వాడి ముఖం చూస్తే తన చెల్లెల్ని ఎత్తుకుపోవటాన్ని గురించి వాడికి తెలుసునన్న నమ్మకం కలిగింది సురంజన్‌కు.... మళ్ళీ నడక ప్రారంభించాడు. వీధులన్నీ తిరిగి తిరిగీ నయా బజార్ వద్ద ఆగాడు. అక్కడున్న మఠం శిథిలాల్లో కాస్సేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్నాడు. ఇంకా అతనికి ఆందోళన తగ్గలేదు. తనకు

తెలిసిన వాళ్ళను కలుసుకోవటాన్ని అతడు భరించలేకుండా ఉన్నాడు. కలుసుకొని ఏం లాభం? బాబ్రీ మసీదు విధ్వంసాన్ని గురించి మాట్లాడతారు. ఆ రోజు సలీం ఏమన్నాడు? "మా మసీదును మీరు ధ్వంసం చేస్తే మేము మీ దేవాలయాల్ని ధ్వంసం చేయటంలో తప్పేమిటి?" నిజమే. సలీం ఈ మాటను హాస్యంగానే అన్నాడు. కానీ ఎన్నో భయంకరమైన భావాలు హాస్యంగానే బయట పడతాయి.

మాయ ఇల్లు చేరుకుంటే ఎంత బాగుంటుంది! బహుశా చేరుకుంటుందేమో. మానభంగానికి గురైనా సరే మాయ ఇంటికి రావాలి. మాయ ఇల్లు చేరుకొనే వుంటుందేమో అన్న ఆశతో సురంజన్ ఇల్లు చేరుకున్నాడు. కానీ ఇంటి పరిస్థితిలో ఎలాంటి మార్పూ లేదు. సుధామయ్, కిరణ్మయి అలాగే కూచొని తాము కోరుకుంటూ ఉన్న అద్భుతం జరక్కపోతుందా అని ఎదురుచూస్తున్నారు.

మాయ తిరిగి రాకపోవటానికి మించిన భయంకరమైన వార్త ఏముంది? సురంజన్ పరుపుమీద వాలిపోయి తలగడలో ముఖాన్ని దాచుకున్నాడు. అవతలవైపు గదిలోంచి సుధామయ్ మూలగటం వినిపిస్తోంది. రాత్రి పొద్దుపోయిన తరువాత కిరణ్మయి ఏడుపు సురంజన్ మనసులోకి దూసుకొని వచ్చింది. ఆ శబ్దం కీచురాళ్ళ శబ్దంలా సురంజన్‌ను నిద్రపోనివ్వలేదు. తాము ముగ్గురూ విషం తీసుకొని ఎందుకు చవిపోకూడదు? అలా చేస్తే బాధతో మరింతగా ముక్కలై పోకుండా ఉండవచ్చు. ఈ దేశంలో హిందువులు జీవించాలని ప్రయత్నించటంలో అర్థం లేదని తెలుస్తూ ఉంది.

★ ★ ★

మెదడులోని రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టటం చేతనో, ఎక్కడో రక్తప్రసారం ఆగిపోవటంచేతనో తాను కుప్ప కూలిపోయానని సుధామయ్‌కి అర్థమైంది. రక్తనాళాలు చిట్లి ఉంటే తన పని ఈసరికి పూర్తయి పోయి ఉండేది. ఇప్పుడలా జరిగుంటే బావుండేదనిపిస్తోంది. మాయ ప్రాణాన్ని కాపాడటం కోసం తన ప్రాణాన్ని ఎందుకు త్యాగం చేసి ఉండకూడదు? ఆ అమ్మాయికి బతుకు మీద ఎంతో ఆశ ఉండేది. తనంతకు తానుగా పరుల్ ఇంటికి పారిపోయింది – తన ప్రాణాన్ని కాపాడుకోవటానికి! తన అనారోగ్యమే ఆవిడను ఇంటికి రప్పించింది. ఎందుకూ? హృదయం లేని ఆ దుర్మార్గులు ఎత్తుకు పోవటానికి. సుధామయ్ మనసులో పశ్చాత్తాపం ముల్లులా గుచ్చుకుంది. మాటిమాటికీ కళ్ళు నీళ్ళతో నిండాయి. కిరణ్మయి కోసం చేయి చాచాడు. ఎవరూ లేరు. సురంజన్ ఇంట్లోలేడు. మాయ శాశ్వతంగా వెళ్ళిపోయింది. దప్పితో నాలుక పిడచకట్టుకపోతోంది. నోరు ఎండిపోతోంది.

అతని వల్ల కిరణ్మయి కూడా ఎన్నో బాధలు పడింది. ఆవిడకు సాంప్రదాయికంగా పూజలు చేసుకోవాలని ఉండేది. కాని సుధామయ్ తన ఇంట్లో అలాంటివి అనుమతించనన్నాడు. ఆమె చక్కని గాయని కూడా. ఆవిడ సభల్లో, సమావేశాల్లో పాడటం ప్రారంభిస్తే అందరూ ఆవిడను "సిగ్గూ శరం లేని హిందూ స్త్రీ"

అన్నారు. ఎంతగా ఆవిడను ఈ మాటలు బాధ పెట్టాయంటే ఆవిడ పూర్తిగా పాడటం మానేసింది. ఆవిడ ఈ త్యాగం చేసినప్పుడు సుధామయ్ ఆవిడ వెనక నిలబడ్డాడా? ఆవిడను ఎంతగా సమర్థించాడు? సామాజికంగా ఆమోదయోగ్యం కాని విషయాలకు దూరంగా ఉండటమే మంచిదని అతను కూడా అనుకున్నాడా? గత ఇరవై ఒక్క సంవత్సరాలుగా అతడు ఆవిడ పక్కనే పడుకున్నాడు. పడుకోవటమంటే పడుకోవటం మాత్రమే. అలా ఆవిడ పాతివ్రత్యాన్ని రక్షిస్తున్నాడు. ఉత్తమ ఇల్లాలుగా ఉండటానికి దోహదం చేస్తున్నాడు. ఇది కూడా ఒక రకంగా అసాధారణ ప్రవర్తనేగా? ఆవిడ కెప్పుడూ చీరలన్నా, నగలన్నా వ్యామోహం లేదు. "నాకాచీర కొనివ్వు, ఈ కమ్మలు తీసివ్వు", అని తాను ఏనాడు అడగలేదు.

"కిరణ్మయీ, నాతో చెప్పకుండా ఏవైనా బాధలు దాచుకుంటున్నావా?" అని సుధామయ్ అప్పుడప్పుడూ అడిగేవాడు.

"లేదు. కుటుంబం సుఖంగా సంతోషంగా ఉంటే నాకు చాలు. నా సంతోషం ముఖ్యంకాదు", అనేది తాను.

సుధామయ్‌కి కూతురంటే ఎంతో ఇష్టం. సురంజన్ పుట్టటానికి ముందు స్టెతస్కోప్ కిరణ్మయి పొట్టమీద పెట్టి "నా కూతురు గుండె శబ్దం వినబడుతోంది. నువ్వూ వింటావా?" అని అడిగేవాడు.

"ముసలితనంలో కూతురే తల్లిదండ్రుల్ని జాగ్రత్తగా చూచుకుంటుంది. కొడుకులు పెళ్ళి చేసుకొని తమ పెళ్ళాలను తీసుకొని బయటి కెళ్ళిపోయి వేరు కాపురాలు పెట్టుకుంటారు. కూతుళ్ళు తమ సొంత సంసారాలు కూడా వదిలి వచ్చి తల్లిదండ్రుల్ని చూసుకుంటారు. ఇది నిజం. జబ్బుతో అస్పత్రిలో ఉన్న తమ తల్లిదండ్రుల్ని కూతుళ్ళు అలా చూసుకొనటం నేను గమనించాను. కొడుకులు రారని కాదు. వస్తారు. చుట్టపు చూపుగా", అన్నాడు ఒకసారి.

కడుపుతో ఉన్నంత కాలమూ కడుపులోని పాప గుండె చప్పుడును స్టెతస్కోపుతో కిరణ్మయికి వినిపించేవాడు. ప్రపంచంలో అందరూ కొడుకులు కావాలనుకుంటారు. కానీ సుధామయ్ మాత్రం తనకు కూతురే కావాలనుకున్నాడు. సురంజన్ చిన్న పిల్లవాడుగా ఉన్నప్పుడు వాడికి గొన్లు తొడిగి షికారుకు తీసుకెళ్ళేవాడు.

మాయ పుట్టినప్పుడు సుధామయ్ కోరిక తీరింది. "మాయ" అన్న పేరు కూడా అతడే పెట్టాడు. "అది మా అమ్మ పేరు. ఒక అమ్మ పోయింది. మరో అమ్మ వచ్చింది", అన్నాడు.

సుధామయ్‌కి రాత్రిపూట మందులిచ్చే బాధ్యత ఎప్పుడూ మాయదే. మందు సమయం ఈ రోజు ఎప్పుడో దాటిపోయింది. "మాయా....మాయా...." తన ప్రియమైన కూతురికోసం పలవరించాడు సుధామయ్. చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళు నిద్రపోతున్నారు. సుధామయ్ బాధగా పిలిచిన పిలుపు ఇంకా మేలుకో ఉన్న కిరణ్మయి, సురంజన్ విన్నారు. ఆ పిలుపును నలుపూ తెలుపు పిల్లికూడా విన్నది.

★ ★ ★

# ఎనిమిదవ రోజు

అయోధ్యలోని బాబ్రీమసీదును కూలదోసిన తరువాత భారతదేశంలో వ్యాపించిన హత్యాకాండా, రక్తపాతమూ తగ్గటానికి కొంత కాలం పట్టింది. చనిపోయిన వారి సంఖ్య 1800 దాటింది. భోపాల్‌లో, కాన్పూర్‌లో ఇంకా దౌర్జన్యకాండ జరుగుతోంది. గుజరాత్‌లో కేరళలో, ఆంధ్రప్రదేశ్‌లో, అస్సాంలో, రాజస్థాన్‌లో, పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతలు కాపాడటానికి సైన్యాన్ని ఆహ్వానించారు. నిషేధానికి గురైన రాజకీయపార్టీల కార్యకలాపాలు బందయ్యాయి.

శాంతి సామరస్యాలు కాపాడటానికి ఢాకాలో అన్ని పార్టీలూ తమంతకుతాముగా ఊరేగింపులు నిర్వహిస్తున్నాయి. కానీ ఇదంతా బయటికి కనిపించేది మాత్రమే. దీని వెనక జరుగుతున్న కథ వేరు.

* గోరక్‌పూర్‌లో ముష్టైమంది హిందూ స్త్రీలను మానభంగం చేశారు. వీరిలో చంచల, సంధ్య, మణి, నికుంజదత్త చనిపోయారు. భగవతి అన్న ముసలావిడ భయంతో గుండె ఆగి చనిపోయింది. గోరక్‌పూర్ మానభంగాలు పగటిపూట జరిగాయి. ముస్లింల ఇళ్ళలో తలదాచుకుంటూ ఉన్న హిందూ స్త్రీలను కూడా మానంభగం చేస్తున్నారు.
* దోసహాత్ బజార్‌లో నంతు హల్దార్‌కు చెందిన పద్నాలుగు వందల మణుగుల వక్కల్ని బూడిద చేశారు.
* భోలాలో దేవాలయాల్ని కూలదోస్తూ ఉంటే పోలీసులు, మాజిస్ట్రేటూ, డి.సి. నోరెత్తకుండా చూస్తూ ఉన్నారు.
* దేవాలయాల్లోని నగల్ని బహిరంగంగా దోచుకున్నారు.
* హిందూ చాకలి పేటను పూర్తిగా తగలబెట్టారు.
* మానిక్‌గంజ్‌లో లక్ష్మీ దేవాలయాన్నీ, శివాలయాన్నీ, కంసాలిపేటనూ, గదాధర్‌పాల్‌కు చెందిన గిడ్డంగులనూ ధ్వంసం చేశారు.
* త్వారా, బనియాజురీ, పుకూరియా, ఉథిలీ, మహదేవపూర్, జోకా, శివాలయ గ్రామాల్లో మూడు లారీల్లో వచ్చిన జనం పోలీస్ స్టేషన్ల మీద దాడిచేశారు.
* నగరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బేటిలా అన్న గ్రామంలో హిందువుల ఇళ్ళను లూటీ చేసి, తరువాత తగల బెట్టారు.
* అదే గ్రామంలో శతాబ్దంనాటి నాథ్‌మందిర్‌ను కొల్లగొట్టారు.
* గార్‌షారులో జీవర్ సాహా ఇంటిని తగలబెట్టారు. మూడు పశువుల కొట్టాలూ, వందలాది మణుగులు వడ్లూ ఆ మంటల్లో నాశనమయ్యాయి.
* ఫిమోర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తేరోశ్రీ బజార్‌లోని హిందువుల దుకాణాల్ని తగలబెట్టారు. గంగ్ దూబీలో, బనియాజురీలో, సేక్‌పారాలో గూడా హిందువుల

ఇళ్ళను తగలబెట్టారు. సేక్ పారాలో ఒక హిందూస్త్రీని మానభంగం చేశారు.

* ఫిరోజ్‌పూర్‌లోని కాళీమందిరం, దేవార్చనా కమిటీ వారి కాళికాలయం, మనీషా మందిరం, శీతల మందిరం, శివ మందిరం, నారాయణ మందిరం, ఫిరోజ్‌పూర్ మదన మోహన విగ్రహమందిరం, రాయ్‌కథలోని కాళీమందిరం, కృష్ణానగర్‌లోని రసరాజ సేవాశ్రమం, దునూర్తాలోని శ్రీ గురు సంఘ ఆశ్రమం, దేవాలయం, సురేష్ సాహగారి ఇంట్లోని కాళీమందిరం, నరేక్‌సాహో గారి ఇంట్లోని మనీషా మందిరం, సుచరణ మండల్, గౌరాంగ హల్దార్, హరీంద్రనాథ సాహో, నరేంద్ర నాథ సాహోగార్ల ఇళ్లలోని వంశపారంపర్య దేవతార్చనా మందిరాలు, హైస్కూల్ పక్కనే ఉన్న కాళీమందిరం, రాణీపూర్‌లోని పంచదేవీ మందిరం, హెలూర్‌హాత్‌లోని కమ్యూనిటీ హాల్, కార్తిక్ దాస్ ఫర్నిచర్ దుకాణం, కాళీమందిరం, సనాతనాశ్రమం, జుకోలా గౌర గోవింద సేవాశ్రమం, హరిసభా సనాతన ధర్మమందిరం, రంజీత్‌సీల్‌గారి ఇంట్లోని కాళీమందిరం, గబ్‌లోలా హైస్కూల్ దగ్గరున్న దేవాలయాలు, నకుల్‌సాహో గారికి చెందిన సినిమా హాలు, అమల్‌గుహోగారి ఇల్లూ, హేమంతసీల్ గారి ఇంట్లోని దేవాలయం, జాదవ్‌దాస్‌గారి ఇంట్లోని పూజామందిరం బూడిదయ్యాయి.
* మిస్త్రీ పారాలోని శివాలయాన్ని ధ్వంసం చేశారు.
* రథ్‌దంగా గ్రామంలోని దేవాలయం, కూడూలియాలోని స్మశాన వాటిక, నిఖిల్ చంద్రదేవ్, కాళీపాదహజా, శివప్రసాదపాల్, దూలాల్‌చంద్ర చక్రవర్తిగార్ల ఇళ్ళలోని దేవతార్చనా మందిరాలు, తల్‌టలాలోని దేవాలయం, బాధోలోని దులాబ్ చంద్ర చక్రవర్తి, వైద్యనాధసాహో, సుకునూరబిస్వాస్‌గార్ల సొంత దేవాలయాలు, పంకబిలా గ్రామంలోని దేవాలయం, నారాయణ మందిరం ధ్వంసమయ్యాయి.
* ఖుల్నాలో పది దేవాలయాల్ని ధ్వంసం చేశారు.
* రాదూలీ, శోభానదాస్, బాకా గ్రామాల్లో నాలుగైదు దేవాలయాలనూ, ఇళ్ళనూ లూటీ చేశారు.
* లూలింపూర్‌లో రెండు దేవాలయాల్ని ధ్వంసం చేశారు. దేవాలయల సమీపంలోని హిందువుల ఇళ్ళను దోపిడీచేశారు.
* డిసెంబర్ 8వ తేదీ రాత్రి తిక్‌లియా, సేక్‌హతీ కాలనీల్లో మూడు దేవాలయాలకు నిప్పుపెట్టారు.
* సహదేవపూర్‌లో పదమూడు ఇళ్లమీద దాడి జరిగింది.
* జైపూర్ గ్రామంలో జరిగిన దాడిలో ఇరవైమంది గాయపడ్డారు.
* లంగల్ బోవా గ్రామంలో మోజం హుసేన్ ప్రేరణతో గోవింద ప్రసాదరాయ్ ఇంటిమీద దాడి జరిగింది. అందులో రెండు వందల మంది పాల్గొన్నారు. కమల్ బిస్వాస్ అన్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చనిపోయినా ఆశ్చర్యం లేదు.

బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న విధ్వంసకాండకు సంబంధించిన వివరాలను విరూపాక్ష నయన్, దేవవ్రత ఇస్తున్నారు. వీరంతా సురంజన్‌కు ఎదురుగా కూచొని మాట్లాడుతున్నారు. కానీ సురంజన్ వారి మాటల్ని వినటం లేదు. అతడు కళ్ళుమూసుకొని పడుకున్నాడు. "భోలాలో, చిట్టకాంగ్‌లో, ఫిరోజ్‌పూర్‌లో, సిల్హెట్‌లో, కోమిల్లాల్లో మాత్రమే హిందువుల ఇళ్ళను దోపిడీ చేశారని మీరనుకుంటున్నారు. ఇక్కడే తికాతురీలో ఒక ఇంటిని లూటీ చేశారు. మాయ అన్న అందమైన అమ్మాయిని ఎత్తుకు పోయారు. ఈ సంగతి మీలో ఎవరికీ తెలీదు. స్త్రీలు వస్తువులైపోయారు. బంగారాన్ని ఎత్తుకు పోయినట్టుగా స్త్రీలను ఎత్తుకు పోతున్నారు". – అని తీవ్రమైన బాధతో మనసులోనే అనుకున్నాడు సురంజన్. "సురంజన్, ఏమిటి సంగతి? నువ్వు నోరు తెరిచి మాట్లాడవా?" అన్నాడు దేవవ్రత.

"నాకు తాగాలనిపిస్తోంది. ఈ రోజు తృప్తిగా మందుకొట్టటానికి వీల్లేదా?" అన్నాడు సురంజన్.

"నిజంగానే."?

"నిజంగానే. నాజేబులో డబ్బుంది. మీలో ఎవరైనా వెళ్ళి ఒక బాటిల్ విస్కీ తీసుకురండి".

"అంటే – ఇంట్లో కూచొని మందుకొడతావా? మీ అమ్మా నాన్నా ఏమనుకుంటారు?"

"వాళ్ళను గంగలో దూకమను. నాకు తాగాలనిపిస్తోంది. తాగుతాను. విరూ, నువ్వెళ్ళి తీసుకురా, సకూరాలోకానీ, ప్యాసీలోకానీ దొరుకుతుంది......"

"కానీ సురంజన్ దా...."

"నీకు పుణ్యం ఉంటుంది. వెళ్ళు...."

పక్కగదిలోంచి కిరణ్మయి ఏడుపు వినిపించింది.

"ఎవరు ఏడుస్తున్నారు?" అన్నాడు విరూపాక్ష

"హిందువుగా పుట్టాక కన్నీళ్ళు తప్పవు", అన్నాడు సురంజన్.

అక్కడున్న ముగ్గురు యువకులూ నిశ్శబ్దంగా అయిపోయారు. వాళ్ళూ హిందువులేకాబట్టి కిరణ్మయి పిన్ని ఎందుకేడుస్తుందో వాళ్ళకు అర్థం కావాలి. ఈ రోజుల్లో ప్రతి హిందువు గుండెలోనూ దుఃఖం గూడు కట్టుకో ఉంది. ఆ దుఃఖానికి వివరణ లేదు. వ్యాఖ్యానం లేదు. ఆ బాధనుంచీ తప్పించుకోవటానికి కన్నట్టుగా డబ్బు తీసుకొని విరూపాక్ష త్వరగా బయటికి వెళ్ళాడు. సురంజన్‌కు గూడా ఆ బాధను తప్పించుకోవాలనే ఉంది. దానికతడు ఎన్నుకున్న దారి తాగటం.

విరూపాక్ష వెళ్ళిపోయిన తరువాత సురంజన్ అడిగాడు.

"దేవవ్రతా, మనం ఒక మసీదును తగలబెట్టలేమా?"

"మసీదునా? నీకేమైనా పిచ్చి పట్టిందా?"

"ఈ రోజు రాత్రికి తారా మసీదును తగలబెడదాంరా".

సురంజన్ వైపునుంచీ నయన్ వైపుకు చూశాడు దేవవ్రత.

"ఈ దేశంలో రెండు కోట్ల హిందువులున్నారు. కావాలనుకుంటే మనం బైతుల్ మొకర్రం మసీదునే తగలబెట్టి ఉండేవాళ్ళం".

"నువ్వు హిందువునని ఏనాడూ చెప్పుకోలేదు. దాన్ని ఈ రోజెందుకు ప్రారంభిస్తున్నావు?"

"ఔను నేను మానవుణ్ణని చెప్పుకునే వాణ్ణి. మానవత్వం మీద నమ్మకం కూడా ఉండేది. కానీ ఈ ముస్లింలు నన్ను మానవుడుగా ఉండనివ్వలేదు. వాళ్ళు నన్ను హిందువును చేశారు.".

"నువ్వు చాలా మారిపోయావు సురంజన్".

"అది నా తప్పుకాదు".

"మసీదుల్ని కూలదోస్తే మనకు జరిగేదేమిటి? మన దేవాలయాలు తిరిగొస్తాయా?" దేవవ్రత అడిగాడు.

"మనకు జరిగేదేమీ లేకపోయినా మనం కూడా ధ్వంసం చేయగలమని నిరూపించవచ్చు. మనక్కూడా కోపం వస్తుందని నిరూపించుకోవాల్సిన అవసరం లేదా? బాబ్రీమసీదు నాలుగు వందలా యాభై ఏళ్ళక్రితంది. కానీ చైతన్యదేవ్ మందిరం ఐదువందల ఏళ్ళనాటిది. వాళ్ళు దాన్ని ధ్వంసం చేయలేదా? నాకు శోభన్ బాగ్ మసీదును కూలదోయాలనిపిస్తోంది. గుల్షన్ కాలనీలో సౌదీ అరేబియన్లు మసీదును కట్టారు. మనం ఒక దేవాలయాన్ని ఎందుకు కట్టకూడదు?" "ఏమిటి సురంజన్, నీకు పిచ్చిపట్టి లేదు కదా?" మసీదులు, దేవాలయాలకు బదులుగా చెరువులుంటే వాటిలోకి బాతుల్ని వదల వచ్చని మనం చెప్పేవాళ్ళం. నీకు గుర్తు లేదా?"

"నేను అంతకంటే ఎక్కువే చెప్పేవాణ్ణి 'ఆ ప్రార్థనా మందిరాలను ముక్కలుగా పగలగొట్టండి. మందిరాలూ, మసీదులూ, గిర్జాలూ, గురుద్వారాలూ ఉండగూడదు. వాటిని చదును చేసి ఆ స్థలాల్లో చిన్న పిల్లలు ఆడుకోవటానికి అందమైన పూలతోటలు నాటుదాం. మానవజాతికి మంచి జరగాలంటే ఆస్పత్రులూ, అనాధశ్రమాలూ, పాఠశాలలూ, విశ్వవిద్యాలయాలు నిజమైన ప్రార్థనా స్థలాలు కావాలి. లలిత కళల అకాడమీలూ, చేతివృత్తుల పాఠశాలలూ, సైన్సు పరిశోధనాలయాలూ నేటి నుంచీ ప్రార్థనా స్థలాలు కావాలి. మనగుళ్ళూ, మసీదులూ పచ్చని పంట పొలాలు కావాలి. పచ్చికమైదానాలు కావాలి. గలగలలాడే సెలఏళ్ళూ, గర్జించే సముద్రాలూ కావాలి' అనేవాణ్ణి". "మొన్న దేబేశ్‌రాయ్ బడేగులాం అలీఖాన్‌ను గురించి రాసిన వ్యాసం చదివాను. అతడు "హరి ఓం తత్సత్.... హరి ఓం తత్సత్" పాడుతుంటే ఎవరో లేచి నిలబడి నాట్యం చేశాడట. ఈ రోజుకూ బడేగులాం అలీ ఆ పాటను పాడతాడు. బాబ్రీమసీదును కూలదోసి అక్కడ రాముని విగ్రహాన్ని పెట్టిన హిందువులు ఆ పాటను ఎప్పుడూ విని ఉండరు. అద్వానీలూ, అశోక్ సింఘాల్‌లు ఆ పాటలు వినరు. ఆర్.ఎస్.ఎస్., భజరంగ్‌దళ్ వాళ్ళ చెవుల దాకా అవి వెళ్ళవు. బడేగులాం అలీఖాన్ ముస్లిమే అయినా అతని పాటల్లోని జీవం "హరి ఓం తత్సత్".

దేవాలయాలను ధ్వంసం చేయాలన్న కృతనిశ్చయంతో ఉన్న ముస్లింలు కూడా బడేగులాం పాటను వినరు. వాళ్ళకు అర్థమయ్యేది ఒకటే. మసీదును కూలదొస్తే దేవాలయాన్ని కూల దోయాలి", అన్నాడు దేవవ్రత.

"దేవాలయాన్ని ధ్వంసం చేస్తే మసీదును ధ్వంసం చేయటం సరైన ప్రతీకారం కాదంటావా? నువ్వు మా నాన్నలాగా ఆదర్శవాదివి. అతడంటే నాకు అసహ్యం. ఆ ముసలి తొక్కంటే నాకు ద్వేషం", ఇంతవరకూ పడుకో ఉన్న సురంజన్ ఆవేశంతో పైకి లేచాడు. "ఆవేశపడకు సురంజన్. నువ్వు చెబుతోంది పరిష్కారం ఎంతమాత్రం కాదు".

"కాదు. ఇదొక్కటే పరిష్కారం. ఆ విషయం తెలుసుకో. నాకు కొడవళ్ళు, చాకులు, పిస్తోళ్ళు కావాలి. గట్టి ఇనుప చువ్వలు కూడా కావాలి. ఢాకా పాతనగరంలోని దేవాలయం శిధిలాల మీద వాళ్ళు ఉచ్చ పోయలేదా? నాక్కూడా వాళ్ళ మసీదులమీద ఉచ్చపోయాలని ఉంది".

"దేవుడా! సురంజన్, నువ్వు మతదురహంకారివై పోతున్నావు".

"ఔను. నిజమే. అయితే ఏం?"

దేవవ్రత, సురంజన్ ఒకే రాజకీయ పార్టీలో పనిచేశారు. కానీ దేవవ్రతకు ఈనాటి సురంజన్‌కూ, ఆనాటి సురంజన్‌కూ పోలిక కనిపించలేదు. సురంజన్ ప్రవర్తన చూసి అతడు దిమ్మెరపోయాడు. అతనికి తాగాలని ఉందట! తాను మతతత్వవాదినని అంగీకరిస్తాడట! అతడు తన తండ్రిని కూడా తిట్టాడు. దేవవ్రత సురంజన్ ప్రవర్తన చూసి జడుసుకున్నాడు.

★ ★ ★

"అల్లర్లు వరదల వంటివి కావు. కాబట్టి నిన్ను రక్షించి, కాస్త తిండిపెట్టి తాత్కాలికంగానైనా బతకమని చెప్పటానికి వీల్లేదు. అవి అగ్నిప్రమాదాలవంటివి కూడా కాదు. వాటిని ఆర్పి ప్రజల్ని రక్షించటానికి వీల్లేదు. అల్లర్లు జరుగుతున్న కాలంలో మానవులు తమ మానవత్వాన్ని పక్కన బెడతారు. మానవునిలో అత్యంత విషపూరితమైన లక్షణాలు అల్లర్లు జరుగుతున్నప్పుడే బయటపడతాయి. అల్లర్లు ప్రకృతి వైపరీత్యాలు వంటివి కూడా కాదు. అవి పెడదారి పట్టిన మానవత్వానికి చిహ్నాలు...." సుధామయ్ ఆపి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు. కిరణ్మయి అక్కడే మూగగా కూర్చో ఉంది. తన ఆరాధ్యదైవాన్ని కౌగలించుకొని, ఆవిడ ఆరాధించే మట్టి విగ్రహం ఇంటిమీద జరిగిన దాడిలో ముక్కలై పోయింది. ఆవిడ ఎక్కడో ఒక రాధా – కృష్ణుల పటాన్ని సంపాదించి గట్టిగా పట్టుకో ఉంది. అప్పుడప్పుడూ ఆ పటాన్ని నుదుటికి తాకించుకుంటూ ఉంది. నిశ్శబ్దంగా ఏడుస్తూ ఉంది. రాధాకృష్ణులు మాయను ఇల్లు చేర్పించగలరా అని సుధామయ్ ఆలోచిస్తూ పడుకున్నాడు. మతదురహంకారుల బందిఖానా నుంచీ మాయను విడిపించగల శక్తి ఈ పటానికి నిజంగా ఉందా అని అతడు ఆశ్చర్యపోయాడు. తాను ఈ దేశం పౌరుడు. తాను భాషా పోరాటంలో పాల్గొన్నాడు. పాకిస్తానీలను తరిమికొట్టి దేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించటానికి

తనవంతు కృషి చేశాడు. కానీ ఈ దేశం తనకు ఇంత వరకూ రక్షణ కల్పించగలవన్న భరోసా ఇవ్వలేదు. అసలు పరిస్థితి ఇలాగుంటే రాధాకృష్ణులు ఏం రక్షించగలరు? మొదటి నుంచి ఇరుగుపొరుగువాళ్ళే తన్ను భయపెడుతున్నారని అతని నమ్మకం. మొదట తన ఆస్తిని లాక్కున్నారు. ఇప్పుడు తన కూతుర్ని ఎత్తుకు పోయారు. మనకు బాగా తెలిసిన వాళ్ళూ, మనం ఎవరిమీద ఆధారపడతామో వాళ్ళూ మనకు ప్రమాదకరంగా తయారైనప్పుడు కృష్ణుడనే దేవుడు ఎలా రక్షించగలడు? మనల్ని రక్షించే శక్తి ఎవరికైనా ఉంటే అది జాతి, మతాలను విస్మరించి ఒకటిగా ఉండగలిగిన ప్రజలకు మాత్రమే ఉంది.

సుధామయ్ బలహీనమైన గొంతుతో భార్యను పిలిచాడు. కిరణ్మయి వచ్చి అతని ఎదుట బొమ్మలా నిలబడింది.

"ఈ రోజు సురంజన్ మాయను వెదకటానికి వెళ్ళలేదా?" అడిగాడు సుధామయ్.

"నాకు తెలీదు".

"హైదర్ తన మనుషులకి ఆపని అప్పగించాడటగా. ఈ రోజు అతడు వచ్చాడా?"

"లేదు"

"మనకు ఆశ లేనట్టేనా? మాయ ఇక మనకు కనిపించదా?"

"నాకు తెలీదు".

"ఇలా నాపక్కన కాస్సేపు కూర్చుంటావా కిరణ్?" కిరణ్మయి యాంత్రికంగా అతని పక్కన చతికిలబడింది. ఆవిడ అతని చేతిని తన చేతిలోకి తీసుకోలేదు. అతని వైపు చూడనైనా లేదు. పక్కగదిలోంచీ పెద్దగా అరుపులు వినిపించాయి.

"సురంజన్ ఎందుకలా కేకలు పెడుతున్నాడు? వాడు హైదర్ దగ్గరకి వెళ్ళలేదా? నేనిలా జబ్బు పడిపోయాను. లేకుంటే నేనే వెళ్ళే వాణ్ణి. నేను ఆరోగ్యంగా ఉంటే మాయను ఎవడైనా తాకగలిగే వాడా? వాణ్ణి చంపేసి ఉండేవాణ్ణి. నా ఆరోగ్యం బావుంటే ఎలాగో ఓలాగు మాయ ఎక్కడుందో తెలుసుకో గలిగే వాణ్ణి...." సుధామయ్ లేవాలని ప్రయత్నించి చేతకాక కూలబడి పోయాడు. కిరణ్మయి అతణ్ణి పట్టుకోవాలని ప్రయత్నించ లేదు. తాళం వేసి ఉన్న తలవాకిలిని చూస్తూ ఉండి పోయింది. ఆ తలుపును ఎవరు, ఎప్పుడు తడతారు? మాయ ఎప్పుడు తిరిగొస్తుంది?

"మీరెళ్ళి మీ ముద్దుల కొడుకును పిలవండి. వాడో వెధవ. వాడి చెల్లెలు కనిపించటంలేదు. వాడు సిగ్గూ ఎగ్గూ లేకుండా ఇంట్లోనే తాగుతున్నాడు. ఆనందిస్తున్నాడు కాబోలు. వాడికి అసలు సిగ్గులేదు", విసుగ్గా మళ్ళీ అన్నాడు సుధామయ్.

కిరణ్మయి సురంజన్‌ను పిలవటానికి లేవలేదు. సుధామయ్‌తో ఆవేశపడవద్దని కూడా చెప్పలేదు. ఆవిడ తలుపుకేసి చూపు మరల్చకుండా చూస్తునే ఉంది. అప్పుడప్పుడు రాధాకృష్ణుల పటాన్ని చూస్తోంది. ఇప్పుడావిడున్న పరిస్థితిలో ఆవిడను ఎవరూ ఓదార్చలేరు. దేవుడు ఆవిడను దయగా చూస్తే ఎంత బావుంటుంది!

సుధామయ్‌కి ఒక్కసారంటే ఒక్కసారి లేచి నిలబడాలనిపించింది. లేచి జొనాథన్ స్విఫ్ట్‌లాగా మనమంతా ఒకర్నొకరు ద్వేషించుకునే వాళ్ళమేననీ, మనలో చాలా కొద్దిమందికి మాత్రమే ఇతరుల్ని ప్రేమించటం తెలుసుననీ చెప్పాలనిపించింది. మనిషిచరిత్ర మతయుద్ధాలతో కలుషితమై ఉంది. 1946 లో "హిందూ – ముస్లిం భాయీ భాయీ" అన్న నినాదాన్ని పట్టుకొని ఊరేగారు. ఈ రోజుకూడా అదే నినాదం వినిపిస్తోంది. ఈ నినాదాన్ని ఇంతకాలం ఉపయోగించాల్సిన అవసరం ఎందుకు కలుగుతోంది? ఈ ఉపఖండంలో ఈ నినాదం ఇంకా ఎన్ని శతాబ్దాల పాటు ప్రతిధ్వనిస్తుంది? ప్రజల్ని ఇంకా చైతన్యవంతుల్ని చేయాల్సిన అవసరం ఉందా? బుద్ధిహీనులైన మతోన్మాదులు ఎప్పుడైనా సరే ఈ నినాదానికి ప్రతిస్పందిస్తారా? ప్రజలు మతతత్వాన్ని తమ హృదయాల్లోనుంచీ తొలగించుకోలేకపోతే నినాదాలవల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు. ఇది తిరుగులేని సత్యం.

★ ★ ★

సురంజన్ హైదర్ ఇంటికి వెళ్ళాడు. అతడు ఇంట్లో లేడు. అతడు హిందువులు అనుభవించిన నష్టాన్ని అంచనా వేయటానికి భోలా వెళ్ళాడని చెప్పారు. సురంజన్ మనోనేత్రంలో అనేక దృశ్యాలు కదిలాయి. బాధలు పడ్డవాళ్ళమీద హైదర్ సానుభూతి చూపించడం, అనేక చోట్ల హైదర్ ఉపన్యాసాలివ్వటం, అందరూ అతణ్ణి మెచ్చుకోవటం, అతని దయాదాక్షిణ్యాలనూ, మతతత్వం లేని అతని ప్రవర్తననూ అందరూ పొగడటం సురంజన్ కళ్ళముందు కదిలాయి. ఇంకేం! అవామీలీగ్‌కు హిందువుల ఓట్లు తప్పకుండా పడతాయి! కానీ సురంజన్‌కు విపరీతమైన కోపం వచ్చింది. పక్కింట్లో ఉన్న మాయకు దారుణమైన అన్యాయం జరిగితే అతనికి చీమ కుట్టినట్టులేదు కానీ అతడు ఎక్కడో ఉన్న భోలాకు మాయలాంటి వాళ్ళను ఆదుకోవటానికి పరుగెత్తాడు.

సురంజన్ సీసామూత తెరిచి, గ్లాసు నింపి తాగటం ప్రారంభించాడు. అతని స్నేహితులకు తాగాలని ఎంత మాత్రమూ లేదు. కానీ సురంజన్ జతగా ఉండటం కోసం తాగటానికి ఒప్పుకున్నారు. పరకడుపు మీద తాగుడు ప్రభావం భయంకరంగా ఉంది. "నాకు సాయంకాలం పూట షికారు కెళ్ళటం ఇష్టం. ఏదో ఒక రోజు మాయను షాల్‌బన్ విహార్‌కు తీసుకెళ్ళాలి", అన్నాడు సురంజన్.

"ఉలేమా మషాయక్‌లు జనవరి రెండునుంచీ దీర్ఘయాత్రకు బయలుదేరుతారట", అన్నాడు విరూపాక్ష

"దీర్ఘయాత్రేమిటి?"

"వాళ్ళు బాబ్రీమసీదును పునర్నిర్మించటానికి భారతదేశం వెళ్తారట".

"వాళ్ళతోపాటు హిందువుల్ని కూడా తీసుకెళ్తారా?"

"తీసుకెళ్ళేలా ఉంటే నేనూ వెళ్తాను. మీరూ వస్తారా?" సురంజన్ అడిగాడు.

ఎవరూ జవాబు చెప్పలేదు. ఒకర్నొకరు ఆదోరకంగా చూసుకున్నారు.

"నువ్వు ఎందుకు ఎప్పుడూ హిందువులు, ముస్లిములు అంటూ మాట్లాడుతావ్?

ఈలోగా నీకు హిందూ మతం తలకెక్కిందని", అన్నాడు దేవవ్రత కాస్త అసహనంగా.

సురంజన్ ఆ మాటల్ని పట్టించుకోలేదు.

"మొగవాళ్ళైతే ఒక వ్యక్తి హిందువో, ముస్లిమో తెలుసుకోవచ్చు. అతడికి సున్తీ జరిగిందో లేదో తెలుసుకుంటే మతం సంగతి తెలిసిపోతుంది. ఆడవాళ్ళ మతం ఎలా తెలుసుకోవటం? ఉదాహరణకు మాయనే తీసుకో. అవిడను కాళ్ళూ చేతులూ కట్టి వీధిలో పారేస్తామనుకో. అవిడ హిందువో ముస్లిమో ఎలా తెలుస్తుంది? అవిడ ముస్లిముల్లాగే కాళ్ళూ, చేతులూ, ముక్కూ, మొహమూ ఉన్నాయి", అన్నాడు.

దేవవ్రత మాట మారుస్తూ అన్నాడు:

"జియా–ఉర్–రహమాన్ కాలంలో ఫరాకా ప్రాజెక్ట్ వివాదాన్ని పరిష్కరించటానికి సరిహద్దు దాకా ఊరేగింపు జరిగింది. 1993లో ఖలీదా బాబ్రీ మసీదును పునర్నిర్మించాలంటూ అయోధ్యదాకా ప్రదర్శన జరుపుతుంది. ఫరాకా ప్రదర్శన నీటికోసం కానట్లే ఈ ప్రదర్శన బాబ్రీమసీదు కోసం కాదు. బాబ్రీ మసీదు పేరుతో జరిగే ఈ అల్లరంతా రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించటం కోసమే జరుగుతోంది. దిగజారిపోతున్న తమ ప్రతిష్టను సర్దుకోవటం కోసమే జరుగుతోంది. గులాం అజాద్ వ్యతిరేక ఆందోళన నుంచీ మన దృష్టి మళ్ళించటం కూడా ఈ కుట్రలో భాగమే. ఇంత విధ్వంసం జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం కనిపిస్తూనే ఉంది కదా? ప్రతి రోజూ భయంకరమైన సంఘటనలు జరుగుతున్నాయి. కానీ ప్రభుత్వం ఈ దేశంలో మతసామరస్యం ఉందని చెబుతోంది". ఇంతలో పులోక్ గదిలోకి ప్రవేశించాడు.

"ఇదేమిటి ఇలా తలుపులు బార్లా తెరిచి కూచున్నారు", అన్నాడు. "ఔను, తలుపులు తెరిచి ఉంచాం. తాగుతున్నాం, కేక లేస్తున్నాం. మాకేం భయంలేదు. చనిపోవాలనుంటే చనిపోతాం. ఇదేమిటి నువ్వు బయటికొచ్చేశావ్?"

"పరిస్థితి బాగా మెరుగుపడింది. అందుకే ధైర్యం చేసి బయటి కొచ్చాను".

"పరిస్థితి మళ్ళీ చెడిపోతే ఇంట్లో దూరుకొని, గొళ్ళెం పెట్టుకుంటావా?" సురంజన్ బిగ్గరగా నవ్వాడు.

మత్తుతో జోగుతున్న సురంజన్‌ను చూసి పులోక్ దిమ్మెరపోయాడు. తాను స్కూటరెక్కి పరిస్థితి బాగా లేకున్నా తెగించి ఇంత దూరం వచ్చాడు. కానీ రాజకీయ చైతన్యం ఉందని చెప్పుకునే సురంజన్ ఇంట్లో కూచొని మందు కొట్టటం తప్ప మరేం చేయటం లేదు. పులోక్ తన కళ్ళను తానే నమ్మలేక పోయాడు. ఎక్కడ పొరపాటు జరిగింది? తన స్నేహితుడు ఇంతగా ఎందుకు మారిపోయాడు?

సురంజన్ మరో గుక్క తాగాడు.

"గులాం అజం....గులాం అజం....నాకూ అతనికీ ఏం సంబంధం? అతడికి శిక్షపడితే నాకు ఒరిగేదేమిటి? అతడికి వ్యతిరేకంగా నేనెందుకు ప్రచారం చేయాలి? మాయ....మాయకు ఆ పేరంటే అసహ్యం. వాడి పేరు వింటే మాయకు డోకొచ్చేది. మీకు తెలుసా – స్వాతంత్ర్య పోరాట కాలంలో పాకిస్తానీలు ముగ్గురు

బాబాయిల్నీ, ముగ్గురు మామయ్యల్ని కాల్చి చంపారు. వాళ్ళు మా నాన్ననెందుకు చంపలేదో ఆశ్చర్యంగా ఉంది. బహుశా.....బహుశా..... స్వాతంత్ర్యం ఫలితాలు వారు అనుభవించాలని వదిలేశారు కాబోలు. ఇప్పుడు ఆయన అనుభవిస్తున్నాడుగా.... డా. సుధామయ్ దత్త తమ శ్రీమతితో, కొడుకుతో, కూతురితో స్వాతంత్ర్యం తెచ్చిన ఆనందాన్ని అనుభవిస్తున్నాడుగా".

సురంజన్ కాళ్ళు చాచుకొని నేలమీద కూచో ఉన్నాడు. పులోక్ అతని పక్కన కూచో ఉన్నాడు. పుస్తకాలూ, కాగితాలూ నేలమీద చిందరవందరగా పడున్నాయి. గదంతా దుమ్ము దుమ్ముగా ఉంది. విరిగి పోయిన ఫర్నిచర్ గదంతా పడి ఉంది. సిగరెట్ పీకలూ, బూడిదా గదిని మరింత గలీజుగా చేస్తున్నాయి. గదిలో ఒక మూల విరిగిపోయిన బీరువా ఉంది. ఈ విధ్వంసమంతా సురంజన్ కోపంలో చేసిన పనేనని పులోన్ అనుకున్నాడు. అందరూ నిశ్శబ్దంగా ఉన్నప్పుడు ఇల్లు నిర్జనంగా ఉన్నట్టు అనిపిస్తోంది.

పులోక్ అన్నాడు.

"ఎక్రం హుసేన్ భోలా వెళ్ళివచ్చాడు. అక్కడ జరిగిన సంఘటనలు బాబ్రీమసీదు కూల్చివేతకు వ్యతిరేకంగా సహజంగా వచ్చిన ప్రతిక్రియ అని పోలీసులూ, అధికారులూ, బి.ఎన్.పి. వాళ్ళూ చెబుతున్నారట. వాటిలో విధ్వంసం కూడా ఎవరి ప్రేరణా లేకుండా జరిగాయట. హిందువుల్ని తరిమేయటం కోసం పల్లెల్ని వరసగా తగలబెట్టారు. అక్కడ గాలి కమురు కంపుకొడుతోందట. గడ్డివాములూ, గరిసెలూ – ఒకటేమిటి అన్నిటినీ సర్వనాశనం చేశారు. ఇళ్ళలో నుంచీ సామాన్లు బయటేసి వాటిమీద కిరోసిన్ పోసి తగలబెట్టారు. చిట్టచివరికి కొబ్బరితోటల్ని కూడా నిర్దాక్షిణ్యంగా బూడిద చేశారు. చిన్నపిల్లల బట్టలు లాగేశారు. ఇష్టం వచ్చిన అమ్మాయిలమీద అత్యాచారం చేశారు. చీరలు, నగలు దోచుకుపోయారు. కొందరు హిందువులు పారిపోయి వరిపొలాల్లో దాక్కున్నారు. అలా దాక్కో ఉన్నప్పుడే శంభుపూర్‌లో పనిచేసే ఉపాధ్యాయుడు నికుంజదత్తను పట్టుకున్నారు. అతణ్ణి చావగొట్టి, అతని దగ్గరున్న మొత్తం డబ్బును లాక్కున్నారు. అతడు ఆ దెబ్బల్తోనే చనిపోయాడు. భోలాలో హిందువుల్ని ప్రాణాలతో ఉండాలంటే దేశం వదిలి పారిపొమ్మని బెదిరించారు. హిందువుల్ని ముక్కలుగా నరికి కాకులకూ, గద్దలకూ వేస్తామన్నారు. ధనికులైన హిందువులు ఉన్నదంతా పోగొట్టుకున్నారు. వాళ్ళకు అన్నం తినటానికి అరిటాకులూ, నీళ్ళుతాగటానికి కొబ్బరిచిప్పలూ తప్ప మరేమీ దక్కలేదు. మరింత ఘోరమేమిటంటే ఎవరైనా దయతలచి పెడితే తప్ప వాళ్ళకు అన్నం లేదు. వాళ్ళు రోజా కొకపూట ఆకులూ, అలమూలూ ఉడకబెట్టుకొని తింటున్నారు. వాళ్ళ ఎదుటే వారి భార్యలూ, చెల్లెళ్ళూ, కూతుళ్ళూ మానభంగం చేయబడుతున్నారు. తల్లుల్నీ కూతుళ్ళనీ కలిపి మానభంగం చేయటం కూడా జరిగింది. "ఇక్కడ ఉండం. అవసరమైతే అడుక్కొని బతుకుతాం. మేం వెళ్ళిపోతాం", అని ఎందరో బహిరంగంగా చెబుతున్నారు. తమకు సాయం చేయటానికి వస్తున్న సంస్థలతో తమకు సాయం అవసరం లేదని స్థానిక హిందువులు చెబుతున్నారు. కానీ వాళ్ళు దేశం వదిలి వెళ్ళాలంటే వాళ్ళకు

తప్పకుండా కొంత సాయం కావాలి. ఇంతకుముందు జమాత్ శిబిర్‌లో ఉండి ఈలోగా బి.ఎన్.పి.లో చేరిన ఎమ్.వి. బాచట్, షిరాజ్ పట్వారీ శంభుపూర్‌లో, గోరక్‌పూర్‌లో దాడులు చేశారు. సుప్రసిద్ధ స్వాతంత్ర్య పోరాట వీరుడు ప్రియలాల్ బాబు ఇంటిని లూటీ చేసి, తగలబెట్టారు. అబ్దు ఖాదర్, విలాయత్ హుసేన్ అన్నవాళ్ళు వాళ్ళ గ్రామం మీద దాడి చేశారు. బాబుల్‌దాస్‌కు చెందిన రెండు ట్రాక్టర్లను ధ్వంసం చేశారు. ఎక్రం అన్నవాడు బెదిరిస్తే అతడు పారిపోవటానికి అంగీకరించాడు......" పులోక్ ఇంకా ఇలా కొనసాగించేవాడే. కానీ –

"నోర్మూయ్. ఇంకోమాట మాట్లాడావంటే తంతాను", అని అరిచాడు సురంజన్.

పులోక్ భయపడి పోయి, వాక్యం మధ్యలోనే ఆపేశాడు. సురంజన్ ఎందుచేత ఇంత చిత్రంగా ప్రవర్తిస్తున్నాడు? ముందు ఎక్కువైందా? దేవవ్రత వైపు చూసి చిరునవ్వు నవ్వాడు.

చాలాసేపు ఎవరూ మాట్లాడలేదు. సురంజన్ ఆపకుండా తాగుతూనే ఉన్నాడు. అతనికి తాగుడు అలవాటు లేదు. ఎప్పుడైనా మిత్రులతో కలిసి కొద్దిగా తాగేవాడు. కానీ ఇప్పుడు కసిగా తాగుతున్నాడు. పులోక్‌ను సురంజన్ నోరుముయ్యమన్నపట్నుంచీ అసహజమైన నిశ్శబ్దం గదిలో గడ్డకట్టుకొని ఉంది. ఈ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ సురంజన్ ఏడవటం ప్రారంభించాడు. ఈ ఆకస్మిక పరిణామానికి అందరూ ఆశ్చర్యపోయారు. తన తలను పులోక్ భుజం మీద ఆనించి సురంజన్ కుమిలి కుమిలి ఏడ్చాడు. చివరకు నేల మీద కూలిపోయాడు. గదిలో ఉన్న అందరూ భయంతో కొయ్యబారి పోయారు. ఇదంతా వాళ్ళకు దుర్భరంగా ఉంది. ఆల్కహాల్ వాసన వేస్తున్న గది సురంజన్ ఏడుపులో ప్రతిధ్వనించి పోయింది. సురంజన్ ఈలోగా అన్నం తినలేదు. స్నానం చేయలేదు. బట్టలు మార్చుకోలేదు. అతడు నేలమీద పొర్లటంతో అసలే మాసి ఉన్న బట్టలు మరింత మురికిగా తయారయ్యాయి. చిట్టచివరకి అతడు "నిన్న రాత్రి వాళ్ళు మాయను ఎత్తుకుపోయారు", అని వెక్కిళ్ళు పెట్టి ఏడవటం ప్రారంభించాడు. "ఏమిటన్నావు?" పులోక్ ఆశ్చర్యపోయాడు. దేవవ్రత, నయన్, విరూపాక్ష కూడా దిమ్మెర పోయారు.

సురంజన్ శరీరం వెక్కిళ్ళతో ఎగిసి ఎగిసి పడుతోంది. అతడు లేవగానే తూలి విస్కీగ్లాసుల మీద పడిపోయాడు. గ్లాసులోని విస్కీ నేలమీద చిందిపోయి గది మరింత దుర్భరంగా అయిపోయింది. కాని ఎవరూ పట్టించుకోలేదు. మాయను ఎత్తుకుపోయారన్న వార్తముందు ఇతర విషయాలేవీ ముఖ్యం కాకుండా పోయాయి. అందరి మెదళ్ళూ మొద్దుబారి పోవటం చేత ఎవరూ, ఏమీ మాట్లాడ లేకుండా పోయారు. ఇలాంటి సందర్భంలో ఎలాంటి అనునయ వాక్యాలు పనికొస్తాయి?

అప్పుడు బెలాల్ లోపలికొచ్చాడు. అతడు చుట్టూరా చూసి సురంజన్ నేలమీద పడి ఉండటాన్ని గమనించాడు. "సురంజన్, వాళ్ళు నిజంగానే మాయను ఎత్తుకు పోయారా?" అన్నాడు దగ్గరికివెళ్ళి.

సురంజన్ తల ఎత్తలేదు.

"నువ్వు పోలీస్ డయిరీలో కంప్లెయింట్ నమోదు చేయించావా?"

సురంజిన్ జవాబు చెప్పలేదు. జవాబు చెప్పమన్నట్టుగా బెలాల్ ఇతరుల్ని చూశాడు. కానీ ఎవరూ ఏమీ చెప్పలేదు.

"ఎవరు ఎత్తుకు పోయారో తెలుసుకోవటానికి ప్రయత్నించావా?"

సురంజిన్ ఇంకా నిశ్శబ్దంగానే ఉండిపోయాడు.

బెలాల్ మంచంమీద కూచొని సిగరెట్ వెలిగించాడు. "మన చుట్టూరా ఏం జరుగుతుందో నాకర్థం కావటం లేదు. దొంగలు, రౌడీలు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇక్కడ ఇలా ఉంటే అక్కడ భారతదేశంలో వాళ్ళు మనల్ని వరసగా చంపుతున్నారు".

""మనం" అంటే?" అన్నాడు విరూపాక్ష

"ముస్లిములు. అక్కడ బి.జె.పి. వాళ్ళు మనల్ని ముక్కలుగా నరుకుతున్నారు".

"అలాగా?"

"భారతదేశం నుంచీ అలాంటి వార్తలొస్తే ఇక్కడ వీళ్ళకు మతులు పోతాయి. ఎవర్ని తప్పుపట్టాలి? అక్కడ మేం చస్తున్నాం. ఇక్కడ మీరు చస్తున్నారు. మసీదును కూలదోయటంలో అర్థమేమిటి? భారతీయులు రామజన్మ స్థానాన్ని కనుక్కోవటం కోసం ఒక మసీదును తవ్వేశారు. రాముడేమో పురాణ పాత్ర! కొన్ని రోజుల తరువాత వీళ్ళు హనుమంతుడు తాజ్‌మహల్లో పుట్టాడంటారేమో. కాబట్టి తాజ్‌మహల్‌ను ఎందుకు కూలదోయకూడదు? వీళ్ళు భారతదేశం లౌకిక వాదాన్ని పాటిస్తున్నారట! మాయను ఎందుకెత్తుకుపోయారు? అద్వానీ, జోషీలాంటి హీరోలనడగాలి. కలకత్తాలోని మెటియాబురుజు ప్రాంతంలో పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందిట".

సురంజిన్ అనాధ ప్రేతంలా నేలమీద పడి ఉన్నాడు. పక్క గదిలోంచీ కిరణ్మయి ఏడుపులూ, సుధామయ్ మూలుగులూ వినిపిస్తుంటే బెలాల్ బాధల గాధల్ని ఎవరూ పట్టించుకోలేదు.

"మాయ తప్పకుండా తిరిగొస్తుంది. ఆమెనెవరూ తినెయ్యరు. పిన్నిని ధైర్యంగా, ఓపిగ్గా ఉండమను. అసలు నువ్వెందుకుకిలా ఆడదానిలా ఏడుస్తున్నావ్? మీరంతా ఎందుకిలా గుంపుగా కూచున్నారు? మాయకు ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేయరా?"

"ఆసంగతి మాకిప్పుడే తెలిసింది. సరాసరి మనుషుల్ని ఎత్తుకుపోయిన వాళ్ళ దగ్గరికెళ్ళి వాళ్ళెత్తుకుపోయిన మనుషుల్ని విడిపించుకు రావటం ఎప్పట్నుంచీ ప్రారంభమైందో మాకు తెలీదు. మాయకోసం వెదకటం ఎక్కణ్ణుంచీ ప్రారంభించాలి?"

"మాయను ఎత్తుకుపోయిన వాళ్ళు తప్పకుండా డ్రగ్స్‌కు అలవాటు పడిన వాళ్ళయి ఉంటారు. గంజాయి, హెరాయిన్ మందుభాయిలై ఉంటారు. వాళ్ళు తప్పకుండా ఆ ప్రాంతం వాళ్ళే కూడా అయి ఉండాలి. అందమైన అమ్మాయిని చూశారు... అవకాశమూ ఉంది... ఎత్తుకుపోయారు. మర్యాదస్తులు అలాంటి పనులు ఎప్పుడూ చేయరు. ఈనాటి యువకులు నిజంగా భ్రష్టుపట్టి పోయారు. దీనిక్కారణం ఆర్థికంగా వాళ్ళకు స్థిరత్వం లేకపోవటం. అర్థమైంది కదూ?"

విరూపాక్ష తలవంచుకొని కూచున్నాడు. వాళ్ళలో ఎవరికీ బెలాల్‌తో పరిచయం లేదు. అతడు ఆవేశపడి పోతున్నాడు. జేబులోంచీ ఒక బెన్సన్ అండ్ హెడ్జస్ సిగరెట్ తీసి చేతిలో పట్టుకున్నాడు. మళ్ళీ మాట్లాడటం ప్రారంభించాడు.

"మందుతాగితే సమస్యలు పరిష్కారమై పోతాయా? చెప్పండి. పరిష్కారమై పోతాయా? ఈ దేశంలో ఎప్పుడైనా అల్లర్లు – పెద్ద అల్లర్లు – జరిగాయా? ఇప్పుడు జరుగుతున్న వాటిని అల్లర్లంటారా? పిల్లలకు మిఠాయిలు తినాలనిపిస్తుంది. వాళ్ళు మిఠాయి దుకాణాలమీద దాడిచేస్తారు. కాని భారతదేశంలో ఇప్పటి వరకూ కనీసం ఆరువేల అల్లర్లు జరిగాయి. వేలాది మంది ముస్లింలు చనిపోయారు. ఇక్కడ ఎంతమంది హిందువులు చనిపోయారో చెప్పండి చూద్దాం. ప్రతి హిందూ మొహల్లాలో ట్రక్కుల కొద్దీ పోలీసులు శాంతిని రక్షిస్తున్నారు".

ఎవరూ మాట్లాడలేదు. సురంజన్ కూడా జవాబు చెప్పలేదు. అతనికి జవాబు చెప్పాలనిపించలేదు. విస్కీ పనిచేయటం ప్రారంభించింది. అతనికి నిద్రముంచుకొస్తోంది. బెలాల్ ఇంకా సిగరెట్ వెలిగించలేదు. ఏదోపని ఉందని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఒకరొకరుగా అందరు వెళ్ళిపోయారు.

★ ★ ★

# తొమ్మిదవ రోజు

గోపాల్ ఇంటిని లూటీ చేశారు. సురంజన్ ఇంటికి పక్క ఇల్లే గోపాల్‌ది. గోపాల్ పన్నెండేళ్ళ చెల్లెలు సురంజన్ ఇంటి కొచ్చి, జరిగిన విధ్వంసాన్ని చూసింది. అప్పటికింకా సురంజన్ నేలమీద పడి ఉన్నాడు. కానీ ఆ అమ్మాయి తిరుగుతూ ఉండటాన్ని గమనించాడు. ఆ అమ్మాయి పిల్లిలా నిశ్శబ్దంగా తిరుగుతోంది. ఆ అమ్మాయి చిన్నపిల్లే అయినా జరిగిన విధ్వంసం ఎంత పెద్దదో ఆ అమ్మాయికి అర్థమైంది. ఆ అమ్మాయి సురంజన్ గది ముందు నిలబడి, కళ్ళు పెద్దవి చేసి జరిగిన విధ్వంసాన్ని చూస్తోంది. సురంజన్ కళ్ళు తెరిచి వరండా మీద పడుతున్న ఎండను చూసి బాగా పొద్దెక్కిందని అర్థం చేసుకున్నాడు. మెల్లగా ఆ అమ్మాయిని దగ్గరికి పిలిచాడు.

"నీపేరు?" అన్నాడు.

"మథోల్....."

"నువ్వు ఏ బడికెళ్తావు?"

"శ్రీ బంగ్లా బాలికా విద్యాలయ".

ఆ బడికి అంతకుముందు పేరు నారీ శిక్షామందిర్. దాన్ని లీలానాగ్ ప్రారంభించింది. ఈ రోజు లీలానాగ్ పేరెక్కడుంది'. ఆడపిల్లల్ని చదువుకు అనుమతించని కాలంలో ఆవిడ ఇంటింటికీ తిరిగి స్త్రీ విద్యను ప్రచారం చేసిన విద్యావేత్త. ఢాకా నగరంలో బాలికలకు మంచి బడిని ప్రారంభించాలని పోరాడింది. ఆవిడ పోరాడి స్థాపించిన బడి అలాగే ఉంది. కానీ ఆవిడ పేరు మాత్రం లేదు. ఆ బడిపేరు మారిపోయింది. ఎందుకు? ఈనాటి ప్రభుత్వానికి నచ్చని ఆదర్శానికి సంకేతం నారీ శిక్షామందిర్! బి.యం. కాలేజ్, ఎం.సి. కాలేజ్‌లాగా ఈ పాఠశాల పేరుకూడా మారిపోయింది. మొత్తం మీద ఒక హిందువుకు ఈ దేశంలో ఎలాంటి స్థానమూ ఉండకుండా చేయటమన్నదే ఈ మార్పులోని ఉద్దేశం. 1971లో ఢాకాలోని రోడ్ల పేర్లు మార్చాలని ఓ ఉద్యమం వచ్చింది. పాకిస్తానీలు దాదాపు 240 రోడ్లపేర్లను ఇస్లామీకరించారు. లాల్‌మోహన్ పోద్దార్ రోడ్ అబ్దుల్‌కరీం ఘజ్నవీ వీధిగా మారిపోయింది. శంకర్‌నగర్ వీధి గుల్‌బదన్ వీధిగా మారిపోయింది. నవీన్‌చంద్ గోస్వామి రోడ్ బక్తియార్ ఖిల్జీ రోడ్ గాను, కాళీచరణ్ సాహా రోడ్ ఘాజీ సలాహుద్దీన్‌రోడ్‌గానూ, రాయ్‌బజార్ సుల్తాన్‌గంజ్ గానూ, శశిభూషణ్ చటర్జీరోడ్ సయ్యద్ సలీంవీధిగానూ, ఇందిరారోడ్ అనార్కలీ రోడ్‌గానూ మారిపోయాయి.

"నేలమీద ఎందుకు పడుకోవున్నావు"? అని ఆ అమ్మాయి అడిగింది

"నేలంటే నాకిష్టం కాబట్టి".

"నాకూ ఇష్టమే. మా ఇంట్లో పెరడు ఉండేది. ఇప్పుడు మేము పెరడులేని కొత్త ఇంటికి మారిపోతున్నాం".

"అంటే నువ్వు ఆడుకోలేవన్న మాట".

ఆ అమ్మాయి వచ్చి సురంజన్ పక్కన కూచుంది. సురంజన్‌తో మాట్లాడటం ఆ అమ్మాయికి ఇష్టంగా ఉంది. ఆ అమ్మాయిని సురంజన్ కనిపించకుండా పోయిన చిన్నారి మాయగా ఊహించుకున్నాడు. మాయతో మాట్లాడేవాడు. ఫుట్‌బాల్‌ను గురించి చెప్పేవాడు. ఇంకా ఎన్నో విషయాలను గురించి మాట్లాడే వాడు.... ఓహ్! ఎంత కాలమైంది మాయతో కబుర్లు చెప్పి?

తాము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు నదీతీరంలో చిన్న చిన్న మట్టి గుడిసెలు కట్టేవారు. పగటిపూట వాళ్ళు కట్టిన గుడిసెల్ని రాత్రిపూట అలలు తీసుకెళ్ళేవి.... స్మృతులు ముసురుకొని వస్తున్నాయి. తమ నాలుకల్ని ఎర్రగా చేసే మిరాయిల్ని ఎన్ని తినే వాళ్ళు! ఆరోజు తాము రెల్లు పొదల్లో ఆడుకోవటానికి వెళ్ళినప్పుడు....

సురంజన్ ఆ అమ్మాయి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. మాయ చేతుల్లాగా ఆ అమ్మాయి చేతులు మృదువుగా ఉన్నాయి.... ఇప్పుడు మాయ చేతుల్ని ఎవరు పట్టుకో ఉన్నారో? అవి మొరటు చేతులు, క్రూరమైన చేతులు అయి ఉంటాయి. మాయ పారిపోవాలని ప్రయత్నిస్తోందా? ఎంత ప్రయత్నించినా పారిపోవటానికి వీలుకాలేదు కాబోలు. ఆ ఆలోచన మనసులో గుచ్చుకోగానే సురంజన్ వణికిపోయాడు.... అతడు మధోల్ చేతుల్ని విడిచిపెట్టలేదు. అవి మాయ చేతుల్లాగే ఉన్నాయి. తాను ఆ అమ్మాయి చేతుల్ని వదిలి పెడితే ఎవరేనా వచ్చి ఆ అమ్మాయిని కూడా ఎత్తుకు పోతారు కాబోలు. అమ్మాయిని తాడుతో కట్టేసి....

"నీ చేతులు ఎందుకలా అదురు తున్నాయి?" అకస్మాత్తుగా అడిగింది మధోల్.

"నిజంగానా? నువ్వెళ్ళి పోతున్నావని నాకు చాలా బాధగా ఉంది".

"మేము భారతదేశానికి వెళ్ళటం లేదు. మీర్‌పూర్‌కు వెళ్తున్నాం. సుబోల్ వాళ్ళు భారతదేశానికి వెళ్తున్నారు".

"వాళ్ళు మీ ఇంటి కొచ్చినప్పుడు నువ్వేం చేస్తున్నావ్?"

"నేను వరండాలో నిలబడి ఏడుస్తున్నాను. నాకు చాలా భయమేసింది. వాళ్ళు మా టీవీ తీసుకెళ్ళి పోయారు. అల్మారా లోంచీ నగలూ, నాన్నగారి డబ్బూ కూడా పట్టుకుపోయారు".

"నీతో ఏమైనా అన్నారా?"

"వెళ్ళిపోతూ గట్టిగా చెంపమీద కొట్టి 'నోరుముయ్యి ఏడవకు' – అన్నారు".

"అంతేనా? నిన్ను తీసుకెళ్ళిపోవాలనుకోలేదా?"

"లేదు. వాళ్ళు మాయ అత్తయ్యను కూడా కొడుతుంటారేమో కదూ? వాళ్ళు మా అన్నయ్యను తలమీద కొట్టారు. బాగా రక్తం వచ్చింది".

మాయ కూడా మధోల్ వయసే ఉంటే మాయను కూడా వదిలి పెట్టేసే వాళ్ళేమో. ఆవిడను ఎంతమంది మానభంగం చేశారో? ఐదుగురా? ఏడుగురా? మాయకు రక్తస్రావం జరుగుతోందా?

"మా అమ్మ పెద్దమ్మను చూసి రమ్మంది. పెద్దమ్మ ఏడుస్తూనే ఉందిగా", అంది మళ్ళీ ఆ అమ్మాయి.

"నాతోపాటు షికారు కొస్తావా, మధోల్?"

"అమ్మ భయపడుతుంది".

"వెళ్ళేముందు మీ అమ్మతో చెబుదాం లే".

"దాదా, నన్ను కాక్స్ బజార్‌కు తీసుకెళ్ళవూ? మధుపూర్ అడవులకన్నా వెళ్దామా? సుందరవనాలకన్నా ఆనా? అక్కడి కెళ్ళాలని నాకు చాలా ఇష్టంగా ఉంది", అని అడిగేది మాయ. జీవానంద దాస్ కవిత్వాన్ని చదివినప్పుడు నాతోటి వెళ్ళాలనేది. సురంజన్ ఆమె చిత్రమైన కోరికల్ని చూసి గేలిచేసేవాడు.

"తేజ్‌గావ్‌లోని మురికివాడల కెళ్ళి అక్కడ ప్రజలు ఎలా బతుకున్నారో చూడు. చెట్లను చూట్టంకంటే వాళ్ళ బతుకుల్ని చూట్టం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది, అనేవాడు. మాయ ఉత్సాహం ఉన్నట్టుండి నీరుకారి పోయేది. జీవితాన్ని చూసి చూసీ తానేం మూటకట్టుకున్నానని సురంజన్ ఇప్పుడు ఆశ్చర్యపోతున్నాడు. మానవులంతా సుఖంగా ఉండాలని కోరుకొని తాను సాధించిందేమిటి? తాను చిన్నతనం నుంచీ పెంచి పోషించుకున్న కార్మిక, కర్షకోద్యమాలు, కష్టజీవుల సౌఖ్యం, సామ్యవాద విస్తరణ లాంటి ఆదర్శాలు ఏమయ్యాయి? తనలాంటి ప్రజలు ఎందరు నమ్మినా సామ్యవాద ఆదర్శం ఓడిపోయింది. లెనిన్ విగ్రహాన్ని కూలదోసేశారు. మానవత్వాన్ని పోషించిన మహానాయకుడి దేశంలోనే మానవత్వానికి మానభంగం జరగటం విపరీత పరిణామం కదూ?

మధోల్ మెల్లగా లేచి నిలబడింది. సురంజన్ చేతిలోంచీ తన మృదువైన చేతుల్ని – మాయచేతుల్లాగా మృదువుగా ఉన్న తన చేతుల్ని – విడిపించుకుంది.

హైదర్ ఆరోజు కూడా రాలేదు. ఈ విషయంలో జోక్యం చేసుకోవటం తన కిష్టంలేదని బయటికి చెప్పినా అతనికి వచ్చే ధైర్యం లేకపోయి ఉండవచ్చు. మాయకోసం ఇంకా ఎదురు చూసి లాభం లేదని సురంజన్ అర్థం చేసుకున్నాడు. ఒకవేళ తిరిగొచ్చినా ఆనాడు ఆరేళ్ళ వయస్సులో లాగా తిరిగొస్తుందా? సురంజన్ పూర్తిగా నిరుత్సాహపడి పోయాడు. మాయ పరుల్ ఇంటికెళ్ళినప్పుడు ఇల్లు ఇలాగే నిశ్శబ్దంగా ఉంది. కానీ ఇంత నిర్జీవంగా లేదు. మాయ తిరిగొస్తుందని తమ ముగ్గురికీ తెలుసు. ఈ ప్రశాంతత శ్మశాన ప్రశాంతత. నిజంగానే ఇంట్లో ఎవరో చనిపోయినట్టనిపిస్తోంది. గదంతా పడి ఉన్న ఖాళీ విస్కీ సీసాలూ, గ్లాసులూ చూసేసరికి సురంజన్ ఖాళీ హృదయం కన్నీటితో నిండిపోయింది. కళ్ళలో ఉండాల్సిన కన్నీళ్ళు ఆశ్చర్యకరంగా హృదయంలో నిండిపోయాయి.

ఈసారి అతని స్నేహితులు కమాల్, రబీయుల్ అతణ్ణి పరామర్శించటానికన్నా రాలేదు. తమ సంగతి తాము చూసుకోవటమే ఉత్తమమనుకున్నారు కాబోలు. బెలాల్ మాటి మాటికి చెబుతున్న విషయం సురంజన్‌కు జ్ఞాపకం వచ్చింది. "మీరు

బాబ్రీమసీదు నెందుకు కూలదోశారు?" అన్నది అతని వాదనలోని సారాంశం. బాబ్రీమసీదుకూ, బెలాల్‌కు సంబంధమేమిటి? బాబ్రీమసీదు బెలాల్‌ది ఎప్పుడైంది? సురంజన్ ఆశ్చర్యపోయాడు. అది భారతదేశంలో ఉంది. అది భారతీయుల ఆస్తి, దాన్ని సురంజన్ కూలద్రోశాడని ఎవరైనా అనగలరా? తాను ఎప్పుడూ భారతదేశం వెళ్ళలేదు. బెలాల్ భారతదేశంలో హిందువులనూ, బంగ్లాదేశ్‌లోని హిందువులనూ ఒకే గాట్లోకట్టేస్తున్నాడా? హిందువులు బాబ్రీమసీదును కూలదోస్తే సురంజన్ కూలదోసినట్టేనా? సురంజన్‌నూ అయోధ్యలోని హిందూమత దురహంకారులూ ఒకటేనా? తాను బెలాల్, కమాల్, హైదర్ వంటివాడు కాదా? తనకున్న గుర్తింపు ఒక్క హిందువుగా మాత్రమేనా? భారతదేశంలో ఒక మసీదును కూలదోస్తే తాను – సురంజన్ – ఎలా బాధ్యుడౌతాడు? జాతీయతనూ, దేశాన్ని మతం తుడిచేసిందా? మతం ఇచ్చే సుఖాన్నీ, భద్రతనూ చదువురాని వాళ్ళు కోరుకోవచ్చు. కానీ బెలాల్‌కు కూడా అది కావాలా? బెలాల్ పెద్ద చదువులు చదువుకున్న స్వాతంత్ర్యపోరాట వీరుడు. అతడు మతం బురదలో ఎందుకు కూరుకుపోవాలి? ఈ ప్రశ్నలకు జవాబులు లేవు.

టేబుల్‌మీద రెండు బిస్కెట్లూ, ఒక అరటిపండూ కనిపించాయి సురంజన్‌కు. వాటిని కిరణ్మయి అక్కడ పెట్టి వెళ్ళి ఉండవచ్చు. వాటిని తినాలనిపించలేదు కానీ మిగిలిన విస్కీ తాగాలనిపించింది అతనికి. రాత్రి మందు ఎక్కువ కావటం చేత అతనికి స్పృహ తప్పిపోయింది. అప్పుడు మాయవచ్చింది.... అతనికి మరింత నిస్సహాయతా, సిగ్గూ కలిగాయి.... కళ్ళుతెరిస్తే అవిడ చిరునవ్వి నవ్వుతోంది.... కళ్ళు మూసుకుంటే ఒక గుంపు వేట కుక్కలు తప్ప మరేం కనిపించలేదు.

మాయ ఏమైపోయిందో తెలుసుకోవాలని హైదర్ ప్రయత్నించలేదని తెలిసిపోయింది. అతనికి ఈ ప్రాంతంలోని రౌడీలందరూ చాలా బాగా తెలుసు కాబట్టి సురంజన్ అతని సహాయాన్ని కోరాడు. లేకుంటే మాయను వెదకటానికి తానే ఒంటరిగా బయలుదేరేవాడు. పరిస్థితులు ఎంతగా మారిపోయాయంటే రౌడీలు తమ కార్యకలాపాలను రహస్యంగా కొనసాగించాల్సిన అవసరంలేదు. హిందూస్త్రీలను మానభంగం చేయటానికి సందు గొందులే అవసరం లేదు. లూటీలు చేసినట్టుగానే మానభంగాలను కూడా నడివీధుల్లో, నలుగురి ఎదుటా చేయవచ్చు. ఇది పరోక్షంగా ప్రభుత్వం ఇస్తోన్న సహకారం వల్ల మాత్రమే సాధ్యపడుతోంది. అది లౌకిక ప్రభుత్వం కాదుకదా? వాస్తవానికది మతదురహంకారుల అవసరాలను రక్షించే ప్రభుత్వం మాత్రమే. భారతదేశంలో నివసిస్తున్న 14 కోట్ల ముస్లిముల భద్రతకోసం బంగ్లాదేశ్‌లో మతసామరస్యాన్ని రక్షించాలని షేక్‌హసీనా ప్రకటించింది. భారతదేశంలోని ముస్లిముల భద్రతను గురించి హసీనా ఎందుకు ఆలోచించాలి? ఈ దేశంలోని పౌరులుగా హిందువులకు మతసామరస్య వాతావరణాన్ని ఆశించే హక్కులేదా? తమదేశంలోని పౌరుల క్షేమం కంటే భారతదేశంలోని ముస్లిముల క్షేమాన్ని గురించి ఎక్కువగా ఎందుకు ఆందోళన చెందాలి? అవామీలీగ్ కూడా జమాతీలలాగే భారత్ వ్యతిరేక,

ఇస్లాం అనుకూల భావాలను వ్యాపింపచేస్తూ ఉందని అర్ధం చేసుకోవాలా?

ప్రభుత్వం అభిప్రాయం పూర్తిగా తప్పని సురంజన్‌కు అనిపించింది. భారతదేశం లోని ముస్లిముల అవసరాలు కాదు ముఖ్యం. శాంతి సామరస్యాలను కాపాడటానికి ఉండవలసిన కారణం రాజ్యాంగ చట్టంలో ఇచ్చిన హక్కుల్ని రక్షించాలన్న ప్రాధమికమైన, తర్కబద్ధమైన బాధ్యత. ఈ దేశంలోని హిందువులకు ఈ దేశంలోని పౌరులుగా తమ మాన ప్రాణాలనేకాకుండా తమ ఆదర్శాలనూ, మతాన్నీ పరిరక్షించుకునే హక్కు ఉంది. ఇక్కడ హిందువులు జీవించగలగటానిక్కారణం ఒక మతం కానీ, రాజకీయపార్టీకానీ, ఒక వ్యక్తికానీ చూపించే దయాదాక్షిణ్యాలు కారణం కాదు. బంగ్లాదేశ్ రాజ్యాంగ చట్టం అనుమతించటం చేత వాళ్ళు ఇతర పౌరుల్లాగే ఇక్కడ జీవిస్తున్నారు. కాబట్టి సురంజన్ కమాల్, బెలాల్, హైదర్ల దయాదాక్షిణ్యాల కోసంకానీ, ఆశ్రయంకోసం కానీ ఎందుకు దేబిరించాలి?

చిట్టకాంగ్‌లో విద్యార్ధి సంఘనాయకుడు కమల్ భౌమిక్ ఇంటిని తగలబెట్టారు. ఆ మంటలో అతని అత్తయ్య కాలిపోయింది. కుతుబ్‌దియాలోని హిందూకాలనీలో ముగ్గురు పిల్లలు నిప్పుపెట్టిన ఇంట్లో మాడిపోయారు. షాత్‌కనియానాధ్‌పురాలో సూర్యమోహన్ అన్న వ్యక్తి, మంటల్లో కాలిపోయి, చనిపోయాడు. మీర్‌సరాయ్‌కి చెందిన వాసుదేవ్ ఎవరో "ఈ దుర్మార్గాలు చేసింది ఎవరు?" అని అడిగారు. అతడు "రాత్రిపూట హత్యలు చేసిన వాళ్ళే పగటిపూట మా మీద సానుభూతి కురిపించటానికి వస్తారు", అని జవాబు చెప్పాడు. అదే ప్రశ్న భజారియాకు చెందిన జాత్రమోహన్‌నాథ్‌కు వేస్తే అతడు "ఈ ప్రశ్న అడగటం కంటే మీరు నన్ను చంపేయటమే మంచిది", అని జవాబు చెప్పాడు. ప్రాణాంతకమైన ఈ మత కలహాలు ప్రారంభమైన ఆరురోజుల తరువాత బంగ్లాదేశ్‌లోని మతతత్వ వ్యతిరేక పార్టీలు, సాంస్కృతిక సంఘాల సమాఖ్య కలిసి ఒక సమన్వయ సంఘాన్ని స్థాపించాయి. కానీ ఈ సంఘం మతకలహాలు కొద్దిగా తగ్గిన తరువాతనే ప్రారంభమైంది. ఇంతవరకూ ఆ సంఘం ఒక శాంతి యాత్రనూ, ఒకే ఒక బహిరంగ సభనూ నిర్వహించగలిగింది. మతసామరస్యాన్ని ఎప్పుడైనా సరే సాధించాలంటే జమాత్ శిబిర్ వారి రాజకీయ భావజాలాన్ని నిషేధించి తీరాలన్నది చాలా మంది అభిప్రాయం. కానీ ఈ శాంతి సంఘాలు ఈ డిమాండుకు ఎంత ప్రాధాన్యత నిస్తాయో వేచి చూడాలి. ప్రభుత్వం జమాతి భావజాలాన్ని నిషేధించకపోయినా, శాంతి సమన్వయ సంఘాలు దానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టకపోయినా దేశనాయకులు నిర్లిప్తంగా చూస్తూ ఉంటారని సురంజన్‌కు బాగా తెలుసు. ఈ శాంతి సంఘాల్లోని కొందరు సభ్యులు లూటీలు, గృహదహనాలూ చేస్తున్న వాళ్ళను శిక్షించాలనీ, హిందూదేవాలయాలనూ, ఇళ్ళనూ ధ్వంసం చేసిన వాళ్ళకు బుద్ధి చెప్పాలనీ అంటున్నారు. కానీ షోనీ వ్యాయామశాలకు చెందిన ఒక బాధితుడు ఇలా అన్నాడు. "ఈ దుర్మార్గాలు చేసిన వాళ్ళెవరో నాకు బాగా తెలుసు. వాళ్ళను కోర్టుకు లాగటం తెలివిలేని పని. మామీద దాడులు జరిగినప్పుడు మమ్మల్ని రక్షించలేని పార్టీలు కోర్టుకేసుల తరువాత కూడా రక్షించలేవు". దోషుల్ని కోర్టుకు లాగటం విషయానికొస్తే దాదాపు ప్రతి

బాధితుడూ ఇదే అభిప్రాయాన్ని చెబుతాడు. కాబట్టి దోషుల్ని కోర్టుకు లాగటమన్న నినాదం ఒట్టి రాజకీయ నాటకం అని సురంజన్‌కు తెలుసు.

మతతత్వం వ్యాపించకుండా నిరోధించగలిగినంత బలంగా ప్రజాస్వామ్యం లేదు. అంతేకాకుండా మతతత్వ మురాలన్నీ ఎంతో పట్టుదలతో తమ లక్ష్యంకోసం ప్రయత్నిస్తున్నాయి. కాబట్టి మతసామరస్యం కాపాడటానికేర్పడ్డ ఈ కమిటీల ప్రయోజనం ఏమిటి? ఈ అఖిలపక్ష కమిటీల నియమావళి ద్వారా రిపబ్లికన్ రాజకీయ పార్టీలు పొందిన సంతృప్తి ఏమిటి? బంగ్లాదేశ్‌లోని మేధావుల్లో చాలామంది భారతదేశంకంటే బంగ్లాదేశ్‌లో తక్కువ మతకలహాలు జరిగాయంటారు. కానీ వాళ్ళకు భారతదేశంలో ముస్లిములు ప్రతికారం తీర్చుకోగలిగారనీ, బంగ్లాదేశ్‌లో హిందువులు ఆ పనిచేయలేకపోయారనీ అర్థంకాదు.

ఈ ఉపఖండంలోని మూడు దేశాల్లోనూ ప్రభుత్వాలూ మతతత్వాన్నీ, ఫాసిజాన్నీ తమ స్వార్థ ప్రయోజనాలకోసం పోషించాయి. మతతత్వవాదులు ప్రపంచంలోని అన్నిదేశాల్లోనూ బలం పుంజుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. భారతదేశంలో, తజికిస్తాన్‌లో, అఫ్గనిస్తాన్‌లో, అల్జీరియాలో, ఈజిప్టులో, ఇరాక్‌లో, సెర్బియాలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయటమే వాళ్ళ ఉద్దేశం. జర్మనీలో ముగ్గురు టర్కిష్ స్త్రీలకు నిప్పుపెట్టినందుకు రెండు ఫాసిస్టు పార్టీలను నిషేధించారు. భారతదేశంలో రెండు మతదురహంకార పార్టీలను నిషేధించారు. కానీ ఈ నిషేధం ఎంత కాలం అమల్లో ఉంటుందో అందరికీ తెలుసు. అల్జీరియాలో కూడా అలాంటి పార్టీలను నిషేధించారు. ఈజిప్టు ప్రభుత్వం కూడా అలాంటి పార్టీలమీద చావుదెబ్బ కొట్టింది. కానీ తజికిస్తాన్‌లో మతదురహంకారలూ, కమ్యూనిస్టులూ సంఘర్షణ పడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం మతతత్వవాదుల్నీ, ఫాసిస్టుల్నీ, కంట్రోల్‌చేసే ప్రయత్నం ఎప్పుడైనా చేసిందా? ఈ దేశంలో కనీసం రాజకీయాలు మతతత్వం ప్రభావంలోంచి ఏనాటికైనా బయటపడతాయా, అని సురంజన్ బాధగా ఆలోచించాడు.

భారతదేశంలోని మతతత్వ పార్టీలకు సహకరించటం కోసం ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉన్న బి.ఎన్.పి. గులాం అజంకేసును సాకుగా ఉపయోగిస్తోంది. ఈ సమస్య మీద జమాత్ శిబిర్ లాంటి మతతత్వ పార్టీలు ప్రభుత్వాన్ని ఎంతో గట్టిగా సమర్థిస్తున్నాయి. గులాం అజంకేసు సృష్టించిన సంచలనం ప్రభుత్వం తప్పుదోవ పట్టించటం చేత అణిగిపోయింది.

"మతతత్వ వాదులు సృష్టించే అల్లర్లను బంగ్లాదేశ్ ఆపుతుంది" అన్న నినాదం ఐక్య సాంస్కృతిక పార్టీ సమావేశంలో వినిపించింది. ఓహ్! బంగ్లాదేశ్‌కు ఎంత దూరాలోచన ఉంది! బంగ్లాదేశ్.... వెధవలు....పందులు.... ఇదే నా బంగ్లాదేశ్" అనుకున్నాడు సురంజన్ సిగరెట్ కాలుస్తూ. అదే మాటల్ని కసిగా మళ్ళీ మళ్ళీ అనుకున్నాడు. అలా అనుకోవటంలో అతనికి అనిర్వచనీయమైన ఆనందం లభించింది. తరువాత బిగ్గరగా నవ్వాడు – బాధగా, చేదుగా.

* * *

మధోల్ కిరణ్మయి ఒళ్ళో ఒదిగి కూచొనిఅంది. "మాషిమా, మేం మీర్‌పూర్‌కు వెళ్ళిపోతున్నాం. ఆ గుండాలు అక్కడికి రాలేరు".

"ఎందుకు రాలేరూ?" అంది కిరణ్మయి.

"మీర్‌పూర్ ఎంతో దూరంలో ఉందిగా ....."

ఆ అమ్మాయి దృష్టిలో రౌడీలు తికాతులీలో మాత్రమే ఉంటారు. మీర్‌పూర్ అక్కడికి చాలా దూరంలో ఉంది కాబట్టి వాళ్ళు అక్కడికి రాలేరు. వాళ్ళ దాడుల్ని తాను తప్పించుకోవచ్చు. కానీ కిరణ్మయి అది అంతతేలికైన విషయంకాదుకదా అని ఆశ్చర్యపోయింది. హిందువుల ఇళ్లను దోపిడీచేసి, తగలబెట్టి, మాయలాంటి యువతుల్ని ఎత్తుకుపోయిన వాళ్లు కేవలం మామూలు రౌడీలేనా? హిందువులకూ, ముస్లిములకూ తేడా తెలియని వారేనా? కాదు. మతం పేరుతో కావాలని దౌర్జన్యాలు చేసిన వీళ్ళను రౌడీలనీ, దొంగలనీ, దుర్మార్గులనీ పిలవటం చాలదు.

సుధామయ్ పడుకో ఉన్నాడు. అంతకంటే అతడు చేయగలిగింది మరేంలేదు. పక్షవాతంతో మూలబడిపోయిన ఈ బతుకు బతకటం ఎందుకు? తన బతుకు కిరణ్మయికి బరువుమాత్రమే. కిరణ్మయి ఓపిక మాత్రం ఊహాతీతమైంది. ఆవిడకు అలసటే ఉన్నట్టులేదు. రాత్రంతా ఏడుస్తూనే ఉంటుంది. తెల్లవారగానే మళ్లీ వంటింట్లో పనికి సిద్ధమై పోతుంది – అవసరం ఉన్నా లేకపోయినా కడుపుకోర్కె కోర్కెలు ఇతర కోరికల్ని ఎప్పుడూ తోసిరాజంటాయి.

వాళ్ల జీవితాలు మరింత అధ్వాన్నంగా మారిపోయాయి. సురంజన్ స్నానం చేయటం, అన్నంతినటం దాదాపుగా మానేశాడు. కిరణ్మయీ అంతే. లేదంటే అవిడ అనాసక్తి మరింత ఎక్కువగా ఉంది. సుధామయ్‌కి కూడా ఏమి తినాలనిపించడం లేదు. మాయ ఇంకా తిరిగి రాకపోవటం వారి జీవితాల్లో జరిగిన అత్యంత దుర్భరమైన సంఘటన. మాయను తిరిగి తీసుకురాగలిగితే! తాను నడివీధిలో నిలబడి "మాయతిరిగి రావాలి. మాయతిరిగి రావాలని కోరే హక్కు నాకుంది" అని గట్టిగా అరవగలిగితే! "హక్కు" ఆ మాటకు ఈనాడు అర్థంలేదు – అనిపించిది. సుధామయ్‌కి 1946లో జరిగిన ఒక సంఘటన మనసులో మెదిలింది. అప్పుడు తాను చాలా చిన్నవాడు, ఒకమిఠాయి దుకాణంలో మిఠాయిని తిని మంచినీళ్లు అడిగాడు. తాను సాధారణంగా ఉపయోగించే "జలం" అన్నమాటకు బదులుగా "పానీ" అన్న మాటను ఉపయోగించాడు. అప్పుడు హిందూ ముస్లిముల మధ్య ఘర్షణలు, తారాస్థాయిలో ఉన్నాయి.

బ్రిటీష్ వారు ఈ పరిస్థితిని బాగా అర్థం చేసుకున్నారు. వాళ్లు ఈ ఉపఖండంలో హిందూముస్లిముల మధ్య ద్వేషాన్ని పెంచి, విభజించి పాలించే విధానానికి పురుడు పోశారు.

కానీ అసలు వైరుధ్యం నుంచీ ఘర్షణ ప్రారంభమై ఉంటే బావుండేదని సుధామయ్ భావించే వాడు. తొంభైశాతం ముస్లిం రైతులున్న దేశంలో తొంభై శాతం భూమి హిందూ భూస్వాముల చేతిలో ఉండేది. భూమి సమస్య లోంచే

రష్యన్, చైనీస్, విప్లవాలు పుట్టాయి. భూమిసమస్య లోంచే హిందూ ముస్లిం ఘర్షణ కూడా ప్రారంభమైంది. భూమి ప్రాతిపదికగా ప్రారంభమైన హిందూ - ముస్లిం ఘర్షణ మత ఘర్షణగా పరిణామం చెందింది. బ్రిటీష్ వారి సౌజన్యంతో 1906 లో మత ప్రాతిపదికమీద ముస్లింలీగ్ పుట్టింది. రాజకీయ వాతావరణాన్ని మతతత్వంతో కలుషితం చేయటానికి ఈ పార్టీనే కారణం. కానీ కాంగ్రెస్‌పార్టీ కూడా ఆ నిందనుంచీ తప్పించుకోలేకపోయింది.

1947 తరువాత ఇరవైనాలుగు సంవత్సరాల కాలం పాకిస్తానీ పాలకులు సామ్రాజ్యవాదాన్ని పోషించారు. ఇస్లాం మతాన్ని ప్రోత్సహించారు, మతతత్వాన్ని రగుల్కొలిపారు, భారతదేశ వ్యతిరేకతకు ఆజ్యం పోశారు, బంగ్లాదేశ్ ప్రజల ప్రజాస్వామిక హక్కులన్నీ కాలరాచారు. 1971 లో ఆ హక్కులు లభించినప్పుడు సుధామయ్ హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బంగ్లాదేశ్ రాజ్యాంగ చట్టానికి నాలుగు కొత్త సూత్రాలను కలిపారు. అందులో ఒకటి లౌకిక సూత్రం. మళ్ళీ మతతత్వం తల ఎత్తకుండా ఉపయోగించిన గొప్ప ఆయుధం అది. కానీ 1975 ఆగస్టు 15 తరువాత బంగ్లాదేశ్‌లో మతతత్వం పునర్జన్మ పొందింది. దాంతోపాటే మతదురహంకారం, మాతమౌఢ్యం, ద్వేషం, నియంతృత్వంగూడా వచ్చాయి. మతతత్వ భావజాలానికి సమాజంలో ఆమోదం లభించటం కోసం దానికి ఆదర్శవాదపుముసుగు తొడిగారు. పాకిస్తాన్ ఏర్పడటానికి పూర్వమే దీనికి "రెండు జాతుల సిద్ధాంతం" అన్నపేరు పెట్టారు. బంగ్లాదేశ్ ఏర్పడ్డ తరువాత దానికి "బంగ్లాదేశ్ జాతీయ వాదం" అన్న పేరు పెట్టారు. వేయి సంవత్సరాలు చరిత్రకలిగిన బెంగాలీ సంస్కృతి తుడిచిపెట్టుకుపోయి దాని స్థానంలో బంగ్లాదేశ్ సంస్కృతి అవతరించింది. అవుల్లాగా, గాడిదల్లాగా, వరిసాగులాగ, జనపనారలాగ మనిషి కూడా బంగ్లాదేశీయుడుగా ముద్రపడిపోయాడు. 1988 లో వచ్చిన 8 వ రాజ్యాంగ సవరణ ఇలా అంది. "బంగ్లాదేశ్‌లోని ప్రభుత్వమతం ఇస్లాం. కానీ ఇతరమతాల వారు రిపబ్లిక్ తో శాంతియుతంగా వ్యవహరిస్తూ ఇతర మతాలను అనుసరించవచ్చు". "అనుసరించవచ్చు" అన్న మాటను ఎందుకు ఉపయోగించారు? "అనుసరించాలి" అన్న మాటను ఎందుకు ఉపయోగించలేదు? కాని రాజ్యాంగచట్టం "మతం ప్రాతిపదికగా కానీ జాతి, కులం, లింగం, జన్మస్థానం ప్రాతిపదికగా కానీ ఏ పౌరుణ్ణీ తక్కువగా చూడటానికి వీలులేదు. బహిరంగవినోద ప్రదర్శనాస్థలాలలోకి కానీ, విద్యాసంస్థల్లోకి కానీ అతనికి ప్రవేశాన్ని నిషేధించటానికి వీలులేదు", అని ప్రకటించింది. కానీ భేదభావం లేదని చెప్పే కబుర్లన్నీ నిజమే అయితే మాయను ఎందుకు ఎత్తుకుపోయారు? తమను "తక్కువ జాతివాళ్లు" అని ఎందుకు తిడుతున్నారు. ఇతర రౌడీలు అలాంటి తిట్లు తిడతారా? కాదు. ఈనాడు జరుగుతున్న హింసా, విధ్వంసమూ మాములు గుండాల పని ఎంతమాత్రమూకాదు.

బంగ్లాదేశ్‌లో మారుతున్న పరిస్థితులకు అసలైన నిదర్శనాలు పాఠశాలలు "మద్రసాలు" గా మారిపోతున్న వేగం, మసీదులు పెరుగుతుండటం, ఇస్లామిక్ కార్యక్రమాల అభివృద్ధి. ప్రతిమొహల్లోనూ లౌడ్‌స్పీకర్లు అమర్చిన మసీదులుండటం చేత ప్రతి

మూడు గంటలకూ అజాఁ శబ్దాలతో చెవులు చిల్లులు పడిపోతాయి. కానీ హిందువుల పండుగల సందర్భంలో మైక్‌లు ఉపయోగించటం మీద అనేక నిబంధనలున్నాయి. మైకులు ఉపయోగించడాన్ని అనుమతిస్తే హిందువులకంటే ముస్లిములకు అనుమతి ఎందుకు ఎక్కువగా లభించాలి? ఐక్యరాజ్యసమితి మానవహక్కుల సంఘం 28వ నిబంధన ప్రకారం "ఎవరైనా సరే స్వతంత్రంగా తమమతాన్ని అనుసరించే హక్కు ఉంది. మతం మార్చుకోవాలన్నా, మతకార్యకలాపాలనుంచీ దూరంగా ఉండాలన్నా కూడా అలా అనుకునే వ్యక్తికి ఆ అధికారం ఉంది. తనమతాన్ని రహస్యంగా కానీ, బహిరంగంగా కానీ ప్రచారం చేసుకోవటం గూడా అతని స్వతంత్రమైన హక్కే". ఇదే నిజమైతే హిందూ దేవాలయాలను ఎందుకు కూలద్రోయాలి? సుధామయ్‌కి దేవాలయాలమీద విశ్వాసం ఉందనికాదు. అతని అభ్యంతరం చాలా సరళమైంది. కూలద్రోయటం ఎందుకు దేవాలాయలకే పరిమితం కావాలి? ఇన్ని దేవాలయాలను కూలద్రోసిన వారికేమైనా శిక్ష ఉందా? బంగ్లాదేశ్ పీనల్‌కోడ్ ప్రకారం ఆ నేరానికి శిక్ష ఒక ఏడాది మాత్రమే. కానికొన్ని సందర్భాల్లో రెండు లేదా మూడు సంవత్సరాలు.

దేశానికి పట్టిన జబ్బును గురించి ఆలోచిస్తూ తన జబ్బును గురించి మరిచిపోయాడు సుధామయ్. దేశం యొక్క ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణిస్తోంది. అనేక సంవత్సరాల పోరాటం తరువాత 1971 ఆగష్టు 26న పాకిస్తాన్ గుప్పిట్లో నుంచీ బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని పొందింది. ఒక కొత్తరాజ్యాంగ చట్టాన్ని ఏర్పరచుకుంది. స్వతంత్ర సర్వసత్తాక ప్రజారాజాన్ని స్థాపించుకుంది.

"జాతీయవాదం, సోషలిజం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం వంటి మహోన్నత ఆదర్శాలతో ఉత్తేజితులైన వీరోచిత ప్రజలూ, మృతవీరులూ మనకు ఆదర్శం. జాతీయ విముక్తి పోరాటంలో వారిని ఉత్తేజితుల్ని చేసిన ఆదర్శాలే మన రాజ్యాంగ చట్టానికి ప్రాథమిక సూత్రాలు"

ఇందులో "జాతీయ విముక్తి పోరాటం" అన్నమాటను 1978లో "జాతీయ స్వాతంత్ర్యం కోసం జరిగిన వీరోచిత యుద్ధం" అనిమార్చారు. సవరణకు మరొక వాక్యాన్ని కూడా జోడించారు. "....మహోన్నత ఆదర్శాలూ, అంతిమ సత్యమూ, భగవంతుడైన అల్లామీద సంపూర్ణమైన విశ్వాసమూ, జాతీయవాదమూ, ప్రజాస్వామ్యమూ, ఆర్థిక సామాజిక న్యాయం అనే సోషలిజమూ...." అన్నది ఆ వాక్యంలోని భాగం. "విముక్తి పోరాటం" అన్నమాట "స్వాతంత్ర్యం" గా మారిపోయింది.

1972 వ సంవత్సరానికి చెందిన రాజ్యాంగ చట్టం యొక్క ప్రారంభం 1978 లో "బిస్మిల్లా ఇర్‌రహమానిర్రహీం" గా మారిపోయింది. రాజ్యాంగచట్టం లోని 12 వ అధికరణం పూర్తిగా తొలగించబడింది. ఆ అధికరణం ఇలా ఉండేది.

"లౌకికతత్వం, మతస్వాతంత్ర్యం".

12. లౌకికతత్వం క్రింది విషయాలను నిర్మూలించడం ద్వారా సాధించబడుతుంది.

ఎ. మతతత్వం యొక్క అన్ని. రూపాలు.

బి. మతాలకు రాజకీయ స్థాయిని కల్పించటం.

సి. రాజకీయ ప్రయోజనాలకోసం మతాన్ని దుర్వినియోగం చేయటం.

డి. ఏదైనా ఒక మతాన్ని అనుసరిస్తున్న వ్యక్తుల్ని తక్కువగా చూడటం లేదా బాధపెట్టటం.

ఆ తరువాత 25 (2) అధికరణం నుంచీ "లౌకిక తత్వం" అన మాటను తొలగించారు. ఇప్పుడు అధికరణం ఇలా ఉంటుంది. – "బంగ్లాదేశ్ రాజ్యం ఇస్లామిక్ ఐక్యత ఆధారంగా ముస్లిందేశాల మధ్య స్నేహసౌహార్ద్రాలను సాధించటానికీ, వాటిని నిలబెట్టడానికీ ప్రయత్నిస్తుంది. "

1972 లో 6 వ అధికరణం ఇలా ఉండేది. "బంగ్లాదేశ్ పౌరసత్వం చట్టబద్ధంగా స్థిరీకరించబడుతుంది, క్రమబద్ధం చేయబడుతుంది. బంగ్లాదేశ్‌లోని పౌరులు బెంగాలీలు అని పిలువబడుతారు". దీన్ని జియా – ఉర్ – రహమాన్ "బంగ్లాదేశ్ పౌరులు బంగ్లాదేశీయులు అని పిలువబడతారు" అని మార్చాడు.....

సుధామయ్‌కి తన చుట్టూరా చీకటి మాత్రమే కనిపించింది. పొద్దు మధ్యాహ్నం మాత్రమే అయింది. అప్పుడే ఎందుకు చీకటి కావాలి? తనకంటి చూపు తగ్గిపోతోందా? కళ్ళడోడు పోతదైనందుకలా అనిపిస్తోందా? లేదా కళ్ళలో పొర వస్తోందా? లేక కన్నీళ్ళుచూపుకు అడ్డం వస్తున్నాయా?

సురంజన్ గూడా మారిపోతున్నాడు. ఒక్కసారంటే ఒక్కసారి గూడా వాడొచ్చి తనపక్కన కూచోలేదు. మాయను వాళ్ళెత్తుకు పోయిన తరువాత వాడు తన గదిలోక్కూడా రాలేదు. తనకొడుకుగదిలో జరుగుతున్న దేమిటో సుధామయ్‌కి తెలుస్తూనే ఉంది. తాగుడుతో కలసి చర్చలుదిగ్గరగా వినిపిస్తున్నాయి. ఇంతకు ముందు సురంజన్ ఇంట్లో తాగటం సుధామయ్ ఎరుగడు. బహుశా వాడికి ఎవరన్నా ఖాతరు లేకుండా పోయిందేమో. వాడు మాయను రెండే రెండు రోజుల్లో మరిచిపోయాడా? సుధామయ్ దీన్ని నమ్మలేకపోయాడు. అతడు అప్పటికే మోస్తున్న బరువును కొడుకులో వచ్చిన మార్పు అధికం చేసింది. సురంజన్ భ్రష్టు పట్టిపోతున్నాడా?

★ ★ ★

సురంజన్‌కు ఇల్లు వదిలి వెళ్ళాలనిపించలేదు. ఇంకా మాయకోసం వెదకటం వృధా అని అతనికి అర్ధమైంది. కాబట్టి ఇంట్లో ఉండటమే మంచిది. బయటికెళ్ళి "అదో, బాబ్రీమసీదును కూలదోసిన లంజకొడుకు" అనిపించు కోవటంకంటే ఇంట్లో ఉండటమే మంచిది. "ఈ గాడిదకొడుకుల్ని దేశం నుంచి తరిమేయాలి", అంటారు. ఆ మాట వీనీ వీనీ వెగటుగా వుంది. ఇప్పుడతనికి సోషలిష్టు పార్టీమీదకాని, కమ్యూనిష్టు నాయకత్వం మీద కానీ నమ్మకం లేదు. హిందువుల మాటెత్తితే వామపక్ష నాయకులు కూడా "పందులు" అని తిట్టటం విన్నాడు.

కమ్యూనిష్టు పార్టీలోని హిందువుల ప్రవర్తన కూడా అంతకంటే భిన్నంగా లేదు. వాళ్లుకూడా ఈనాటి పరిస్థితులకు తలవంచేస్తున్నారు. కష్ణ వినోద్‌రాయ్ పేరు ఇప్పుడు కబీర్‌భాయ్. బదీర్‌దత్త తనపేరును అబ్దుల్ సలామ్ అని మార్చుకున్నాడు. కమ్యూనిష్టు పార్టీలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగితే ఇక ఎవర్ని నమ్మాలి? జమాతీ ఇస్లామీ పార్టీలో చేరిపోవాలా? సరాసరి నిజామీవద్దకెళ్ళి "హుజూర్, అస్సలామాలేకుం",

అనాలా? మరుసటి రోజే పత్రికలు "జమాతీ ఇస్లాం పార్టీలో చేరిన హిందువు", అని పతాక శీర్షికలు పెడతాయి. హిందువులకోసం ప్రత్యేకంగా నడిపే జగన్నాథ హోస్టల్ లో కూడా జమాతీలకు ఓట్లు పడ్డాయి. డబ్బుమహాత్యం! నెలకుఐదువేల టాకాలిస్తే ఎవరు మాత్రం జమాతీలకు ఓటువేయరు? తనలో ఆశలు రగిలించి వాటిని భగ్నం చేసిన వామపక్ష పార్టీల మీద ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది సురంజన్‌కు. వాస్తవానికి ఆపార్టీలనుంచి ఒకరి తరువాత ఒకరుగా బయటికి వెళ్ళి పోతున్నారు. ఇతర పార్టీల్లో చేరిపోతున్నారు. ఈ రోజు వీళ్ళొక మాటచెపుతారు, రేపుమరో పాటపాడుతారు. కామ్రేడ్ ఫర్హాద్ చనిపోయినప్పుడు బంగ్లాదేశ్ కమ్యూనిష్టు పార్టీ ఖరాన్ ఖానీ, మిలాద్ మోహాఫిల్ ఏర్పాటు చేసింది. అతరువాత వైభవోపేతంగా ఖననక్రియలు జరిగాయి. ఎందుకు? కమ్యూనిష్టులు ఇస్లామిక్ జండా నీడలో ఎందుకు నిలడవలసి వచ్చింది. వాళ్లు నాస్తికులని ప్రజల్లో ఉన్న అభిప్రాయాన్ని తొలగించుకోవటానికేనా? కాని వాళ్ళకు వాళ్ళు ఆశించిన ఫలితం లభించిందా? సురంజన్ ప్రజల్ని ఏనాడూ తప్పుపట్టలేదు. తన గమ్యం ఏమిటో తనకే తెలియక పోయినా వామపక్ష వాదులమని చెప్పుకునే వారిని మాత్రమే తప్పుపట్టాడు.

దేశంలో "మద్రసా" ల సంఖ్య పెరుగుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థను అల్లకల్లోలం చేయటానికి ఇది అద్భుతమైన పథకం. చాలా మందికి తెలియక పోవచ్చు, కానీ ముజీబ్ పల్లెపల్లెకూ వెళ్ళి మద్రసాలకు అనుకూలంగా ప్రచారం చేశాడు. ఈ దేశంలో జరిగిన విషాదసంఘటనలన్నీ నమ్మాలంటే వాటిని చూసి తీరవలసిందే. ఆశ్చర్యమేమిటంటే ఈ సంఘటనలు భాషా ఉద్యమం జరిగిన దేశంలో, స్వాతంత్ర్యం కోసం పోరాడి 1971 లో స్వాతంత్ర్యాన్ని పొందిన దేశంలో జరిగాయి. బెంగాలీ జాతీయవాదానికి చెందిన భావాలు ఈ నాడేవీ? హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ మతాలకు చెందినవారు ఐక్యంగా ఇచ్చిన బెంగాలీ జాతీయవాద నినాదం ఇప్పుడు ఏమైపోయింది? సురంజన్‌కు ఈనాడు ఏదీ నిశ్చల నిశ్చితంగా కనిపించటం లేదు. అతడు నమ్ముకున్న ఆదర్శాలన్నీ ఒకదానితరువాత ఒకటిగా కూలి పోతున్నాయి. ఇప్పుడు తానొక మనిషికాదు. బెంగాలీ కాదు. హిందువనే రెండుకాళ్ళజంతువు. తన దేశంలోనే సురంజన్‌కు పరాయివాడినన్న భావం కలిగింది.

ఈ దేశంలో "మత విషయాల మంత్రిత్వ శాఖ" అని ఒకటుంది. క్కొన్ని సంవత్సరాలుగా మతానికి బడ్జట్ కేటాయింపులు పుష్కలంగానే జరుగుతున్నాయి. వాస్తవానికి జాతీయాభివృద్ధికి జరిగే కేటాయింపుల్లో ఎక్కువభాగం మత సంస్థలకూ, మతానికీ అందుతోంది. ఢాకాలోని ఇస్లామిక్ ఫౌండేషన్‌కు పదిహేను లక్షల టాకాల గ్రాంటు ఇచ్చారు. వక్ఫ్ ప్రశాసక్ సంస్థకు ఎనిమిది లక్షల టాకాలు, ఇతర మత సంస్థలకు 26 లక్షల టాకాలు ఇచ్చారు. జగత్ ఫౌండేషన్‌కు రెండులక్షల ఇరవై వేల టాకాలు, ఇస్లామిక్ ఫండ్‌కు రెండున్నర లక్షల టాకాలు దక్కాయి. కానీ అల్పసంఖ్యాక మతాలకు రెండున్నర లక్షల టాకాలు మాత్రమే ఇచ్చారు. దేశంలోని మసీదులన్నీటికీ ఉచిత విద్యుత్తు ఇవ్వటం కోసం ప్రభుత్వం కోటి ఇరవై లక్షల టాకాలు కేటాయించింది. మసీదులకు ఉచిత నీటిసరఫరా కోసం మూడు లక్షల

టాకాలిచ్చింది. మొత్తం మీద మతసంస్థల కిచ్చిన డబ్బు ఎనిమిది కోట్ల నలభై ఐదు లక్షలా డెబ్బైవేల టాకాలు. బైతుల్ మొకర్రమ్ మసీదుమీద మాత్రమే పదిహేనులక్షల టాకాలు ఖర్చుపెట్టారు. అల్పసంఖ్యాక మతాలకు మాత్రం రెండులక్షలా యాభైవేలు మాత్రమే దక్కింది. శిక్షణకూ, ఉత్పత్తికేంద్రిత కార్యక్రమాలకూ ఇచ్చిన మొత్తం 109,338,000 టాకాలు. ఈ దేశంలో అల్పసంఖ్యాక మతాలకు చెందిన ప్రజలు ఇరవై ఐదుమిలియన్లున్నారు. వారికిచ్చిన మొత్తండబ్బు ఇరవై మిలియన్ల మాత్రమే. దీనికి మించిన హాస్యాస్పదమైన విషయం మరొకటి ఉండదు.

మత విషయాల మంత్రిత్వశాఖ అభివృద్ధి బడ్జెట్ 2,000,000 టాకాలు. ఇందులో "వరల్డ్ ట్రెజరీ ఆఫ్ ఇస్లాం" అన్న గ్రంధాన్ని ప్రచురించటానికి 20,000 టాకాలు ఖర్చుపెట్టారు. ఇస్లామిక్ ఫౌండేషన్ వారి నూతన సాంస్కృతిక కేంద్రానికి 19,000,000 టాకాలు ఖర్చుపెట్టబోతున్నారు. ఇస్లాంమీద అనువాద గ్రంధాలను ప్రచురించటం కోసం 16,875,000 టాకాలు ఇచ్చారు. ఇస్లాం ఫౌండేషన్ లైబ్రరీకీ, ఇస్లాంశిక్షణా సంస్థకూ 1,500,000 టాకాలు కేటాయించారు. ఈ మొత్తం ఖర్చు 56,895,000 టాకాలయింది. ఇదికాక ఇస్లామిక్ కార్యక్రమాలకూ, పండుగలకూ, 500,000 ఇచ్చారు. ఇస్లామిక్ మత సంస్థలకు మరో 500,000 టాకాలిచ్చారు. ఇస్లామిక్ మత సంస్థలు నిర్వహించిన కార్యక్రమాల ఆధారంగా వాటికి అదనపుగ్రాంటుగా 2,860,000 టాకాలు మంజూరు చేశారు.

మసీదులు రిపేరు చేయటానికీ, పునర్నిర్మాణానికీ ఘనతవహించిన పార్లమెంటు సభ్యుల ఆమోదంతో 20,000,000 టాకాలు లభించాయి. మతయాత్రికుల ఖర్చుకోసం మరో 1,000,000 టాకాలు, మతసంస్థలకు విరాళాలుగా 640,000 టాకాలూ, బీద ముస్లిముల పునరావాసానికి 1,000,000 టాకాలూ, మొత్తం 26,000,000 టాకాలు ఈ పద్దుల క్రింద ఇచ్చారు. 1991-92 లో మతకార్యక్రమాలను ప్రోత్సహింతటంకోసం 16,621,3000 టాకాలు కేటాయించారని తెలిసినవారు చెప్పారు. కొత్తగా ముస్లిం మతాన్ని స్వీకరించిన వారి (నియో_ముస్లింస్) పునరావాసానిక్కూడా బడ్జెట్ కేటాయింపులు ఉండటం చిత్రం. పదిలక్షల టాకాలను అందుకు కేటాయించారు. కానీ అల్పసంఖ్యాక మతాల ప్రోత్సాహానికి మాత్రం ఎలాంటి కేటాయింపులూలేవు. అనేకమతాలకూ, జాతులకు చెందిన ప్రజలు నివసిస్తున్న ఈ పేదదేశంలో ఒకేఒక మతాన్ని ప్రోత్సహించటానికి మించిన అవమానంలేదు.

ఈ దేశానికి ఆర్థికమైన వెన్నెముక లేదు. మనం ఎప్పుడైనా మన ప్రజల సరాసరి ఆదాయాన్ని గురించి ఆలోచించామా? విదేశీ రుణాన్ని గురించి ఆలోచించామా? ఇస్లాం అభివృద్ధికి ఇంత డబ్బును ఎలా ఖర్చుపెడుతున్నాం? దీన్ని గురించి ఎవరూ ఆలోచించరేం? - సురంజన్ ఇలా ఆలోచిస్తూండగా తలుపుతెరుచుకొని కాజల్‌దేవనాధ్ లోపలికొచ్చాడు.

"ఏమిటోయ్ సురంజన్, ఈ పొద్దులో పడుకో ఉన్నావేం?" అన్నాడు.

"నాకు దేనికీ పొద్దు లేదు," సురంజన్ కొద్దిగా జరిగి, దేవనాధ్ కూచోటానికి చోటిచ్చాడు.

"మాయతిరిగొచ్చిందా?"

"లేదు...." సురంజన్ దీర్ఘంగా నిట్టూర్చాడు.

"మనం ఏంచేయాలంటావ్? మనం ఏదో ఒక ప్రయత్నం చేయాలనిపిస్తోంది".

"ఏం చేస్తావ్?"

దేవనాథ్ తలనెరుస్తోంది. వయస్సు కూడా నలభై దాటింది. జేబులోంచీ సిగరెట్ పెట్టెతీసి, సురంజన్‌కు ఒక సిగరెట్ ఇస్తేంటే అతని కనుబొమలు ముడిపడ్డాయి.

సురంజన్ సిగరెట్ అందుకున్నాడు. అతడు సిగరెట్లుకొని చాలా కాలమైంది. కొనాలంటే డబ్బులులేవు. కిరణ్మయిని డబ్బులు అడగాలంటే ధైర్యం చాలటంలేదు. మాయను వాళ్ళు ఎత్తుకు పోవటానికి బాధ్యతంతా తనదేననిపిస్తోంది. అందుచేత నాన్నగారి గదిలోకి వెళ్ళాలంటేనే సిగ్గుగా ఉంది. బాధ్యత నిజంగా తనదేనేమో! ఎందుకంచే అందరికంటే ఎక్కువగా ఈదేశం మతతత్వానికి అతీతమైందని భావించినవాడుతానే. అందుకే ఆ అవమానం తనదే! తాను నాన్నగారి గదిలో కెళ్ళలేకుండా ఉన్నాడు. నిజాయితీపరుడూ, ఆదర్శవాదీ అయిన అతనికి తన ముఖం చూపించలేకుండా ఉన్నాడు.

సురంజన్ పరకడుపుతో సిగరెట్ వెలిగించాడు. మాయ చూసి ఉంటే అభ్యంతరం చెప్పేఉండేది. "దాదా, నీమీదనీకు దయే లేదులా ఉంది. పరకడుపుతో ఇలా సిగరెట్లు కాలిస్తే కాన్సర్‌తో చచ్చిపోతావు. ఆ సంగతి నీకుతెలీదా?" అనేది.

తనకు కాన్సర్ వస్తే ఏంనష్టం ? చావు కోసం ఎదురు చూస్తూ పడుకొని ఉండేవాడు. అంతేకాని తన కలలు నిజంకావాలని ఎదురు చూడాల్సిన అవసరం ఉండేది కాదుగా?

దేవనాథ్‌కు ఏం చేయాలో తోచలేదు. "ఈ రోజు నీ చెల్లిల్ని ఎత్తుకుపోయారు. రేపు నాకూతుర్నెత్తుకు పోతారు. నిజంగానే ఎత్తుకు పోతారు, ఈ రోజు గౌతంను చావగొట్టారు. రేపు నన్నో నిన్నో చావగొడతారు", అన్నాడు.

"ఒక్కమాట చెప్పు. మనం మొదట మనుషులమా, హిందువులమా?" అన్నాడు నిరంజన్.

దేవనాథ్ చుట్టూరా చూశాడు. "వాళ్ళు ఈ గదిలోకి కూడా వచ్చారుకదూ? అన్నాడు".

"వచ్చారు".

"అప్పుడు మాయ ఏం చేస్తోంది?"

"నాన్నగారికోసం అన్నం కలుపుతోంది".

"వాళ్లను వీళ్లు తన్నలేకపోయారా?"

"ఎలా తంతారు? వాళ్ళ చేతుల్లో ఇనుపచువ్వలున్నాయి. అంతేకాదు, హిందువులకు ముస్లిముల్ని తన్నే హక్కులేదు. ఉందంటావా? భారతదేశంలో ముస్లిములకు తిరగబడి తన్నే హక్కు ఉంది. రెండు గుంపులు పోట్లాడుకుంటే అది ఘర్షణ అవుతుంది. ఈ

దేశంలో ప్రజలు ఘర్షణను గురించి ఆలోచించగలరా? ఆ దేశంలో జరుగుతున్నది మత సంఘర్షణలూ, మతకల్లోలాలూకావు. ఇక్కడ జరుగుతున్నది మతభయోత్పాతం, మతహింస, మతదమనకాండ. ఒకగుంపు మరో గుంపును ఏకపక్షంగా చావగొట్టటం".

"మాయ తిరిగొస్తుందంటావా?"

"నాకు తెలీదు," అన్నాడు సురంజన్.

మాయను గురించి మాట్లాడినప్పుడల్లా సురంజన్ కంఠం ఆవేశంతో పూడు కుపోతోంది. హృదయం శూన్యంగా అయిపోతోంది..

"కాజల్ దా, ఏమిటి కొత్త విశేషాలు ఈ దేశంలో?" అన్నాడు సురంజన్, మాయను గురించి మాట్లాడటం తప్పించుకోవాలన్న ఉద్దేశంతో.

కాజల్ దేవనాథ్ తలపైకెత్తి, సిగరెట్ పొగవదిలాడు.

"28,000 ఇళ్ళూ, 2,700 దుకాణాలూ, 3,600 దేవాలయాలూ ధ్వంసమయ్యాయి. పన్నెండు మంది చనిపోయారు. మొత్తం విధ్వంసం విలువ రెండు బిలియన్ల టాకాలుండవచ్చని అంచనా! పల్లెతరువాత పల్లెగా ధ్వంసమైపోయాయి. నలభై రెండు జిల్లాల్లో ఈ విధ్వంస్వం జరిగింది. రెండువేల ఆరువందల మంది స్త్రీలు అత్యాచారాలకు గురయ్యారు. సిల్హెట్ లోని ఐదువందల ఏళ్ళనాటి గౌరాంగ మహాప్రభుదేవాలయం పూర్తిగా ధ్వంసమై పోయింది. బనియాఛోంగ్ లోని శతాబ్దాలనాటి కాళీమందిరానిక్కూడా అదే గతిపట్టింది. చిట్టగాంగ్ లోని కైవల్యధామ్, తులసీధామ్ కూడా నేలమట్టమయ్యాయి. భోలాలోని మదనమోహన వ్యాయామశాల, సునంగంజ్, ఫరీద్‌పూర్‌లలోని రామకృష్ణమిషన్ భవనాలు కూడా కూల్చివేయబడ్డాయి".

"ప్రభుత్వం ఆదుకొనే ప్రయత్నం చేయలేదా?"

"లేదు తాను ఆదుకోకపోగా ఆదుకోవటానికి ముందుకొచ్చిన వాళ్ళనుకూడా ఆదుకోనివ్వలేదు. కానీ కొన్ని ప్రైవేటు సంస్థలు కొద్దిగా సాయం చేశాయి. వేలాది మంది నిరాశ్రయులైపోయారు. తిండీ, బట్టా లేకుండా వీధుల్లో పడి ఉన్నారు. మానభంగాలకు గురైన యువతులు మాటాపలుకూ లేకుండా దిమ్మెరపోయి ఉన్నారు. లేదా వాళ్ళజాడే తెలియటం లేదు. వ్యాపారస్తులు అంతా పోగొట్టుకొన్నారు. ఇంకావాళ్ళదగ్గర ఏమైనా మిగిలిఉంటే వీళ్ళు పిండుకొంటున్నారు. బరిసాల్‌లో 750 మిలియన్ల విలువ కలిగిన ఆస్తి ధ్వంసమైపోయింది. చిట్టగాంగ్‌లో 200 మిలియన్లూ, ఢాకాలో 100 మిలియన్లూ, ఖుల్నాలో 10 మిలియన్లూ, రాజ్‌షాహీలో 10 మిలియన్లూ విలువగల ఆస్తులు నేలమట్టమైపోయాయి. మొత్తం నష్టం 1.070 బిలియన్లు ఉండవచ్చునని అంచనా. దుకాణాలకు జరిగిన నష్టం మరో 220 మిలియన్లు ఉండవచ్చు. దేవాలయాలకు జరిగిన నష్టమే సుమారు 570 మిలియన్ల టాకాలు ఉంటుంది."

"ఓ, దీన్ని భరించడం సాధ్యం కాదు. "

"నీకు తెలుసా ఈ దేశం నుంచీ సామూహిక వలస ప్రారంభమైంది. దాన్ని

ఆపడానికి మార్గం కనిపించటంలేదు. కానీ ప్రభుత్వం మొదటినుంచీ హిందువులు ఈ దేశాన్ని విడిచి వెళ్ళడం లేదని చెపుతూనే ఉంది. కలకత్తా నుంచీ వచ్చే "దేశ్" పత్రికలో దీన్ని గురించి చదివే వుంటావు. కనీసం 150,000 బంగ్లాదేశీయులు భారతదేశంలోకి అనుమతి లేకుండా ప్రవేశించారు. వీరిలో ఎక్కువ మంది తిరిగి రాలేదు. గతఇరవై ఏళ్లుగా కనీసం ఐదులక్షల మంది అల్పసంఖ్యాక మతాలవారిని ఈ దేశం నుంచీ తరిమేశారు గత ఆరుజనాభా లెక్కల్లో చూస్తే ఏం జరిగిందో తెలుస్తోంది. 1941 లో ముస్లిం జనాభా శాతం 70.3 హిందూ జనాభా శాతం 28.3. 1951 జనాభా లెక్కల ప్రకారం ముస్లిములు 76.9 శాతమూ, హిందువులు 22.0 శాతం ఉన్నారు. 1961 లెక్కలప్రకారం ముస్లింజనాభా 80.4 శాతం ఉంటే హిందువుల జనాభా సుమారు 12.4 శాతం వుంది. దీన్ని చూస్తే మనకు ఏం తెలుస్తుంది? ప్రతి సంవత్సరానికీ, ముస్లిముల సంఖ్యపెరుగుతోంది. హిందువులసంఖ్య తరుగుతోంది. హిందువులు ఏమైపోతున్నారు? ఎందుకు దేశాన్ని వదిలి వెళ్ళిపోతున్నారు? వాళ్లు దేశం వదిలి వెళ్లటంలేదని ప్రభుత్వం వాదిస్తే జనాభా లెక్కల్ని ఎలా కాదంటుంది? కొత్త జనాభా లెక్కల్ని గురించి నీకు తెలుసా? ముస్లిముల్ని హిందువుల్నీ వేరువేరుగా లెక్కించరట".

"ఎందుకూ?"

"హిందువు సంఖ్య ఎంత త్వరగా తగ్గిపోతున్నదంటే వాళ్ళను ముస్లిముల్తో కలిపేయవచ్చు," అన్నాడు కాజల్ దేవనాథ్ వ్యంగ్యంగా.

"ప్రభుత్వం చాలా తెలివైంది, ఏమంటావు కాజల్‌దా?" సురంజన్ అన్నాడు.

దేవనాథ్ బదులు చెప్పలేదు. కాలుస్తున్న సిగరెట్ ఆర్పి మరో సిగరెట్ వెలిగించటం కోసం అష్ ట్రే కోసం అటూ ఇటూ చూశాడు.

"అష్ ట్రే ఉందా?" అన్నాడు.

మొత్తం గదినే అష్ ట్రే గా ఉపయోగించవచ్చు.

"మీ అమ్మనూ, నాన్ననూ చూడాలని ఉంది. కానీ వాళ్లను ఓదార్చడానికి నావద్ద మాటల్లేవు," అన్నాడు దేవనాథ్ అవమానభారంతో తలవంచుకొని. మాయనుఎత్తుకుపోయింది తన తమ్ముడే అన్నంతగా అతడు సిగ్గుపడుతున్నాడు.

మళ్ళీ మాయ సంగతి! అగ్ని పర్వతంలోంచి లావా ఉబికినట్లు సురంజన్‌లోంచి కోపం పొర్లివచ్చింది. మళ్ళీ మాటమార్చాడు.

"కాజల్‌దా, మనమంతా పాకిస్తానీలుగా ఉంటామనీ, ముస్లిములుగా, హిందువులుగా కాదనీ జిన్నా వాగ్దానం చేయలేదా? అతని వాగ్దానం హిందువులు వలస పోకుండా ఆపగలిగిందా?"

"జిన్నా ముస్లిమే అయినా అతడు ఇస్మాయిలీ ఖోజా. వాళ్ళు హిందువారసత్వ పద్ధతిని అనుసరిస్తారు, అతని ఇంటిపేరు "ఖోజాని" అతని పూర్తిపేరు జినాభాయ్ ఖోజానీ. అతడు "జిన్నా" అని మాత్రమే ఉంచుకొని మిగిలిన పేరును వదిలేశాడు. జిన్నా నువ్వన్న వాగ్దానం చేసినమాట నిజమే. కానీ హిందువులు బాధలుపడక తప్పలేదు.

కాక పోతే 1948 జూన్‌కల్లా పదకొండు మిలియన్ల హిందువులు తూర్పు పాకిస్తాన్ వదిలి భారతదేశానికి ఎందుకు పారిపోతారు? దురదృష్టవశాత్తు, భారతదేశంలో వారు "కాందిశీకులు" గా పిలువబడ్డారు".

"ఎంతో మంది ముస్లిములు అల్లర్లు జరుగుతున్నకాలంలో పశ్చిమ బెంగాల్ నుంచీ ఈ దేశానికి రాలేదా?"

"నిజమే అస్సాం నుంచీ, పశ్చిమ బెంగాల్ నుంచీ పెద్ద సంఖ్యలో వచ్చారు. కానీ ఆసమయంలో భారత్ – పాక్ ప్రభుత్వాలు "నెహ్రూ లియాఖత్ ఒడంబడిక"ను చేసుకున్నాయి. దాని ప్రకారం "రెండు దేశాల్లోనూ అల్పసంఖ్యాక మతస్థులు ఇతర మతాలవారితో సమానంగా అన్ని హక్కులనూ కలిగి ఉంటారని" వాగ్దానం చేశారు. జీవించే హక్కు, ఆస్తిపాస్తుల్ని కలిగి ఉండే హక్కూ, తనసంస్కృతిని అనుసరించే హక్కు అన్ని అల్పసంఖ్యాక మతాలవారికీ ఇచ్చారు. భావప్రకటనా స్వాతంత్ర్యమూ, మత స్వాతంత్ర్యమూ కూడా వారికి ఇవ్వబడ్డాయి. ఈ ఒడంబడిక ఆధారంగా చాలామంది ముస్లిములు భారతదేశానికి తిరిగి వెళ్లారు. కానీ తూర్పు పాకిస్తాన్ నుంచీ భారతదేశానికి వెళ్ళిన వారుమాత్రం తిరిగిరాలేదు. 1951 లో పాకిస్తాన్ లెజిస్లేటివ్ అసెంబ్లీ తూర్పు బెంగాల్ నుంచీ వెళ్లిపోయిన వారికీ వారి ఆస్తులకు సంబంధించి రెండు చట్టాలు చేసింది. వీటికారణంగా వెళ్ళిపోయిన వారి సంఖ్య మూడున్నర మినియన్లకు పెరిగింది. మీనాన్నగారి నడిగితే వీటిని గురించి మరిన్ని వివరాలు చెప్పగలరు."

"ఇలాంటి విషయాలు ఆయన నాతో మాట్లాడరు. ఈ దేశాన్ని వదిలి పెట్టిపోయే సమస్య వచ్చినపుడు గట్టిగా అరుస్తారు. అంటే ఆ దేశాన్ని వదిలి వెళ్లే ఆలోచనే రానివ్వరు".

"మేము మాత్రం ఈ దేశాన్ని వదిలి వెళ్లాలను కొంటున్నామా? వెళ్ళిన వాళ్ళుకూడా రహస్యంగానే వెళ్ళారు. వాళ్ళను ఎలా వాపస్ తీసుకొస్తావు? వాళ్ళకు మనమేదో నమ్మకం ఇవ్వాలిగా. ఎవరు కానీ తన మాతృదేశాన్ని వదిలి ఎందుకు పారిపోతారు? తాను పుట్టి పెరిగిన మట్టిమీదున్న వాడే సంతోషంగా బతకగలడనే సామెత నీకు తెలుసుగా. హాజీ యాత్ర పేరుతో ఒక ప్రాంతంనుంచీ మరొక ప్రాంతానికి వెళ్ళటం ముస్లిముల అలవాటు. కానీ హిందువులు అలాకాదు. వాళ్ళు మతం కోసమైనాసరే, బతుకుకోసమైనా సరే తాము పుట్టినగడ్డ మీదే బతుకుతారు".

ఆవేశం పెరుగుతూ ఉండటంచేతదాన్ని చల్లార్చుకోవటం కోసం కాబోలు వరండాలో కెళ్లాడు దేవనాథ్. కాస్సేపటి తరువాత మళ్ళీ గదిలోకొచ్చి అన్నాడు.

"టీ తాగాలనిపిస్తోంది. రాబయటికెళ్లి తాగొద్దాం".

సురంజన్ చాలారోజులుగా మార్చకపోవటంచేత అతని బట్టలు బాగా మాసి ఉన్నాయి. అలాగే అతడు స్నానం చేసి కూడా చాలా రోజులే అయింది. కడుపునిండా అన్నం కూడా తినలేదు. కాబట్టి కాజల్ దేవనాథ్ టీ ప్రసక్తి తెచ్చేసరికి సంతోషంగా "పదపోదాం, ఇలా పడుకొని పడుకొని శరీరం తుప్పుపట్టిపోతోంది", అన్నాడు.

వాళ్లుబయటికి వెళ్లేటప్పుడు సురంజన్ తలుపుమూయలేదు. ఎందుకు మూయాలి? జరగవలసింది జరిగే పోయింది. "నువ్వు అసలు ఇంట్లో ఏమైనా తింటున్నావా?" అన్నాడు.

"అమ్మనా గదిలో అన్నం పెడుతుంది. కొన్ని రోజులు తింటాను. కొన్ని రోజులు తినను. నిజానికి నాకేమీ తినాలనిపించదు". అన్నాడు సురంజన్ గోళ్ళతో తలదువ్వుకుంటూ. అతని ఉద్దేశం తలసర్దుకోవటం కాదు. లోపల గూడుకట్టుకోఉన్న బాధను కరిగించటం.

సురంజన్ మళ్ళీ పాత విషయానికే వెళ్లాడు.

"1969 లోనూ 1970 లోనూ దేశం వదిలి వెళ్లిన హిందువుల సంఖ్యచాలా తక్కువనుకుంటాను".

"1966 లో స్థానిక స్వపరిపాలన కోసం ఆరు అంశాల ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడే పెద్ద తిరుగుబాటు కూడా వచ్చింది. 1970 లో ఎన్నికలకూ, స్వాతంత్ర్యం రావడానికీ మధ్య హిందువుల వలస తగ్గింది. 1955–60 మధ్య చాలా మంది హిందువులు దేశాన్ని వదిలి పోయారు. 1960–65 మధ్యలో అలా వెళ్ళిన వారి సంఖ్య దాదాపు పదిలక్షలు. యుద్ధం ప్రారంభమయ్యాక దాదాపు కోటిమంది భారతదేశంలో తలదాచుకున్నారు. వీరిలో దాదాపు 80 శాతం హిందువులే. యుద్ధం తరువాత వాళ్ళు బంగ్లాదేశ్‌కు తిరిగొస్తేవాళ్ళలో చాలామంది భూముల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకో ఉంది. కాబట్టి వాళ్ళలో చాలామంది మళ్ళీ భారతదేశానికి వెళ్ళిపోయారు. కొంతమంది నిరాశ్రయులుగా బంగ్లాదేశ్‌లోనే ఆగిపోయారు. వాళ్లు స్వతంత్రదేశంలో తమకు రక్షణ ఉండవచ్చని ఆశించారు. కానీ 1974 లో కూడ ముజీబ్ ప్రభుత్వం శత్రువుల ఆస్తుల చట్టానికి పేరు మాత్రమే మార్చింది. జియా – ఉర్ – రహమాన్ స్వాతంత్ర్యానికి వ్యతిరేకులైన, మతతత్వవాద గుంపుల్ని మాత్రమేనమ్మాడు. లౌకికవాదం అన్న ఆదర్శం రాజ్యాంగచట్టం నుంచీ అదృశ్యమైపోయింది. ఆ తరువాత వచ్చిన ఎర్షాద్ ఇస్లామీకరణాన్ని పునరుద్ధరించాడు. 1982 డిసెంబర్ 22 న ఎర్షాద్ రాజ్యాంగాన్ని సవరించడానికి ఖురాన్ పునాదిగా ఉంటుందని ప్రకటించాడు. ఇరవై నాలుగు సంవత్సరాల తరువాత మతం మళ్లీ ఇంత సగౌరవంగా దేశరాజకీయాల్లోకి తిరిగి వస్తుందని ఎవరనుకున్నారు?"

ఇద్దరూ ఒక టీకొట్టు వద్ద ఆగారు. దేవనాథ్ సురంజన్‌ను పరీక్షగా చూస్తూ అన్నాడు, "నువ్వు అదోలా ఉన్నావు. నీకు జవాబులు తెలిసిన ప్రశ్నల్ని నన్నడుగుతున్నావు. నీ ఆందోళన నాకుతెలుసు. కానీ నువ్వు అలా అయిపోకూడదు. నీలాంటి ప్రతిభావంతుడు అలా నిరాశలో కూరుకుపోకూడదు." ఒక చిన్నబల్ల వద్ద ఇద్దరూ ఎదురెదురుగా కూచున్నారు. "టీ తోపాటు ఏమైనా తింటావా ?" అన్నాడు దేవనాథ్. సురంజన్ తలవూపాడు. అతడు రెండు "సింగరా"లు తిన్నాడు. కాజల్ కూడా ఒకటి తిన్నాడు. తినటం పూర్తయ్యాక కాజల్ దేవనాథ్ హోటల్ కుర్రాణ్ణి అడిగాడు.

"కాస్త "పానీ" తెచ్చిస్తావా?"

దేవనాథ్ "పానీ" అన్నమాటను ఉపయోగించటం చూసి సురంజన్ ఆశ్చర్యపోయాడు. ఇంట్లో అతడెప్పుడు 'జల్' అన్న మాటనే ఉపయోగిస్తాడు. కానీ అతడు బయట "పానీ" అన్నమాటనే ఎప్పుడూ ఉపయోగిస్తాడా? అతడు భయపడుతున్నాడా? ఈ విషయం తెలుసుకోవాలనిపించింది. అడగాలన్న మాట నోటిదాక వచ్చింది. కానీ ఆగిపోయాడు, అనేకమంది తమను పరిశీలనగా చూస్తున్నట్టుగా సురంజన్‌కు అనిపించింది. త్వరగా టీ ఒక్కగుక్క తాగాడు. తానుకూడా భయపడుతున్నాడా? తాను ఎందుకు భయపడుతున్నాడు? టీ చాలా వేడిగా ఉండటంచేత నాలుక చుర్రుమంది. ఎదురుగా ఉన్న బల్లవద్ద కూచొని తన్ను పరిశీలనగా చూస్తున్న యువకుడు అల్లిన టోపీ పెట్టుకున్నాడు. అతనికి గడ్డంకూడా ఉంది. అతని వయస్సు సుమారు ఇరవై ఏళ్ళు ఉండవచ్చు. మాయను ఎత్తుకుపోయిన వాళ్ళలో అతడు ఉండవచ్చనిపించింది సురంజన్‌కు. కాకపోతే తన్నెందుకంత పరిశీలనగా చూస్తున్నాడు?అతడు హేళనగా నవ్వుతున్నట్టుగా తోచింది సురంజన్‌కు. "ఎలా ఉంది మీకు? మీ చెల్లాయ్‌తో మేం చాలా ఖుషీగా గడిపాం...." అన్నట్టుగా ఉంది అతని చిరునవ్వు. సురంజన్ అక్కడ ఉండలేకపోయాడు. అకస్మాత్తుగా లేచి నిలబడి "లెయ్ కాజల్ దా, వెళ్దాం. ఇక్కడ నాకు నచ్చటం లేదు", అన్నాడు

"వెళ్ళటమా? అప్పుడే.....?"

"ఔను నేనిక్కడ ఉండలేను, అన్నాడు సురంజన్".

★ ★ ★

# పదవరోజు

"1954 లో ఈదేశం జనరల్ అసెంబ్లీలో 890 మంది సభ్యులున్నారు. వీరిలో 72 మంది అల్పసంఖ్యాక మతాలకు చెందినవారు. 1970 లో 300 మంది సభ్యుల్లో అల్పసంఖ్యాకులు పదకొండుగురు మాత్రమే. 1973 లో 315 మంది సభ్యుల్లో 12 గురు, 1979 లో 330 మందిలో 7 మంది, 1991 లో 330 మందిలో 12 గురు ఉండేవారు.......సైనికదళాల్లోనూ, పరిపాలనా సర్వీసుల్లోనూ పరిస్థితి ఇంతే నిరాశాజనకంగా ఉండేది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సర్వీసుల్లో మొదటి తరగతి, రెండవ తరగతి ఆఫీసర్ల స్థాయిలో అల్పసంఖ్యాకమతాలవారు ఐదు శాతానికి మించి ఉండేవారుకారు. పోలీసుశాఖలో 80,000 మందిలో అల్పసంఖ్యాక మతాలవారు 2,000 మాత్రమే. ఆఫీసర్లస్థాయిలో 870 మందిలో 53 మంది మాత్రమే అల్పసంఖ్యాకులు. ఎక్సైజ్ శాఖలోని ఆఫీసర్లు మొత్తం 152 మంది అయితే వారిలో అల్పసంఖ్యాక మతాలకు చెందినవారు ఒక్కరంటే ఒక్కరు మాత్రమే. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లోని 450 మంది అధికార్లలో ఎనిమిది మంది మాత్రమే అల్పసంఖ్యాకమతాలవారు. జాతీయ పరిశ్రమల్లో ఆఫీసర్ల స్థాయిలో ఒక శాతం కార్మికుల స్థాయిలో 3 లేక 4 శాతం. కూలీల స్థాయిలో ఒక శాతం కంటే తక్కువగానూ మాత్రమే అల్పసంఖ్యాక మతాలవారున్నారు. అంతేకాదు. బంగ్లాదేశ్ బాంక్‌లోనూ, ఇతర బాంకుల్లోను డైరక్టర్‌స్థాయిలో, ఛైర్మన్ స్థాయిలో, ఎమ్.డి స్థాయిలో ఒక్క హిందువు కూడా లేడు. వాణిజ్యబాంకుల్లో కూడా హిందువులకు ఎలాంటి స్థానమూ లేదు" .

సురంజన్ రాత్రల్లా పడకమీద పొర్లుతూనే ఉన్నాడు. అతనిలోని నిరాశ నిద్రను దూరంగా తరిమివేసింది. తెల్లవారాక కిరణ్మయి ఒకసారి అతని గదిలో కొచ్చింది. మాయను గురించి ఏమైనా తెలిసిందేమోఅన్న ఆశతో కాబోలు ఆవిడ వచ్చింది. మాయలేకుండావే ఇకమీదట తమ జీవితాలు తెల్లవారాలా? కొన్నివారాలుగా కిరణ్మయి మరీమరీ నీరసించి పోతోంది. కళ్లక్రింద నల్లని చక్రాలేర్పడ్డాయి. ముఖం పీక్కుపోయింది. ఆవిడ మాట్లాడటం, చిరునవ్వు నవ్వటం మరిచిపోయింది. సురంజన్ నిద్రపోతున్నట్లు నటించాడు.

ఇన్నిరోజులుగా సురంజన్ తాను ఎంతగా కుమిలి పోతున్నాడో కిరణ్మయిని గమనించనివ్వలేదు. ప్రతిరోజూ ఆవిడ టేబిల్ మీద అన్నం పెట్టివెళ్తోంది, ఒక్కోసారి ఆవిడ నిశ్శబ్దప్రవర్తన చూస్తే సురంజన్‌కు మండిపోతుంది. జబ్బుతో బాధపడుతున్న భర్తను గురించో, జీవచ్ఛవంలా పడిఉన్న కొడుకును గురించో, కనిపించకుండా పోయిన తన కూతుర్ని గురించో మాట్లాడవచ్చుకదా? ఆవిడ మనిషేనా? లేక రాయా? ఆవిడ దేనికీ ప్రతిస్పందించదా? ఆవిడ ఎంత విచిత్రంగా ప్రవర్తిస్తోంది – దేనికీ ప్రతిస్పందించకుండా, శవంలా!

సురంజిన్ రోజంతా నిద్రపోవాలని నిర్ణయించుకున్నాడు. తాను ఎన్నో రోజులుగా సరిగ్గా నిద్రపోలేదు. తనకు నిద్రకావాలి. కానీ నిద్రపోవాలని కళ్ళుమూసుకున్నప్పుడల్లా ఒక పెద్దచేయి తన కళ్ళముందు కదుల్తోంది. అది తన్ను గొంతు పిసికి చంపాలని ప్రయత్నిస్తోంది. అలాంటి చేయి ఒకటి కాదు...ఎన్నో తనవైపుకు వస్తున్నాయి. క్షణం కూడానిద్ర పట్టలేదు.

★ ★ ★

మానిక్ గంజ్‌కి చెందిన నోనీ గోపాల్ అన్న దూరపు బంధువు అతని భార్యతోనూ, కూతురితోనూ సుధామయ్ ఇంటికి వచ్చాడు. ఆ ఇంట్లోని విధ్వంసాన్ని చూసి అతడు ఆశ్చర్యపోలేదు.

"అంటే వాళ్లు మీ ఇంటినికూడా వదిలి పెట్టలేదన్నమాట" అన్నాడు యధాలాపంగా.

నోని గోపాల్ భార్య లలిత తనపాపిట్లోంచి సిందూరాన్ని చెరిపేసింది. ముఖం మీద ముసుగేసుకుంది. ఆవిడ కిరణ్మయిని కౌగిలించుకొని గట్టిగా ఏడ్చింది. లలితకూతురు ఇబ్బందికరంగా అక్కడే నిలబడి ఉంది. సుధామయ్‌కి ఆఅమ్మాయ్ పేరు జ్ఞాపకం రాలేదు. ఆ అమ్మాయికి సుమారుగా మాయ వయస్సు ఉండవచ్చు. లేదంటే ఈ అమ్మాయి కాస్త చిన్నది కావచ్చు. సుధామయ్‌కి ఆఅమ్మాయిని చూడగానే కళ్లలో నీళ్ళు తిరిగాయి. మాయ ఇప్పుడు లేదు. అతనికి ఆ చేదునిజం మింగుడు పడటం లేదు. మాయ పక్కింటికి వెళ్ళిందని నమ్మాలనిపిస్తోంది. లేదా ట్యూషన్లు చెప్పటానికి వెళ్ళిందనీ, ఇప్పుడో అప్పుడో తిరిగొస్తుందనీ నమ్మాలనిపిస్తోంది. ఆనమ్మకం అందరిదీ కావచ్చు. హింసకూ, మానభంగానికి గురై, చితికి పోయిన మాయ ఏనాడో ఒకనాడు తిరిగి రావచ్చునన్న కోరిక అందరిలోనూ మినుకు మినుకు మంటూ ఉండవచ్చు.

"దాదా, ఈ దేశంలో ఉండటం ఇకమీదట సాధ్యంకాదు. మాఅమ్మాయికూడా వయసుకొచ్చింది. అందుచేత పరిస్థితులు మరింత భయంకరంగా కనిపిస్తున్నాయి", అన్నాడు నోనీ గోపాల్.

సుధామయ్ ఆ అమ్మాయి మీదనుంచి చూపు తిప్పి గోపాల్‌ను చూశాడు.

"దేశం విడిచి వెళ్ళటాన్ని గురించి ఏమీ చెప్పకు. నాకు అలాంటి మాటలు వినాలని లేదు. పక్కింట్లో ఉన్న గౌతం వాళ్ళు కూడా వెళ్ళిపోతున్నారనుకుంటాను. మవ్వూ అంతేనా? మీరు వెళ్లాలనుకుంటున్న ఊళ్లో రౌడీవెధవలు లేరా? ఆ ఊళ్ళో భయానికి అవకాశమే లేదా? వయసొచ్చిన ఆడపిల్లలకు భద్రత ఎక్కడా లేదు. పక్కింటి వాడి దొడ్లోని గడ్డి మనింటి దొడ్లోకంటే ఎక్కువ పచ్చగా కనిపిస్తుందన్న సామెత నీకు తెలీదా? నీతో ఉన్న సమస్యే అది".

నోనీ గోపాల్ సుధామయ్‌కి జవాబు చెప్పేశక్తిలేక తలవంచుకుని కూచున్నాడు.

లలిత మళ్ళీ ఏడవడం ప్రారంభించింది. కిరణ్మయి ఆవిడను ఓదార్చటానిక్కానీ, పలుకరించటానిక్కానీ ప్రయత్నించలేదు. మాయను ఎత్తుకు పోయారని చెప్పే ఓపికావిడకు లేకుండాపోయింది.

నోనీ గోపాల్ కలపవ్యాపారి. అతని కలప అడితిని కూడా వాళ్లు తగలబెట్టేశారు. దానికంటే ఏదో ఒకరోజు తనకూతురు అంజలిని బలవంతంగా ఎత్తుకుపోతారేమోనన్న ఆలోచనే అతణ్ణి ఎక్కువగా భయపెట్టింది.

"దాదా, లలిత బంధువొకతను చంద్రపూర్‌లో ఉండేవాడు. వాళ్లు అతణ్ణి తీసుకెళ్లి చంపేశారు. అతని ఆస్తినంతా దోచుకున్నారు. జయదేవపూర్‌లో అశ్వనీ చంద్రకుమార్ గారి కూతురు మికోను వాళ్ళు బలవంతంగా ఎత్తుకుపోయారు. ఆ తరువాత ఆఅమ్మాయిని మానభంగం చేశారు. ఈ విషయం నీకు తెలీదా? ఆ అమ్మాయి చనిపోయింది కూడా. గోపాల్ గంజ్ జిల్లాలోని వేదగ్రామంలో హరీంద్రహీరాగారి కూతురు నందితను ఎత్తుకుపోయారు. బంటారంపూర్‌లో క్షితీశచంద్రదేవనాథ్ కూతురు కరుణబాలను ముస్లిం యువకులు ఎత్తుకుపోయి మానభంగం చేశారు. భోలాలోని కాళీనాధ బజార్‌లో శోభారాణి గారి కూతురు తంద్ర రాణిని తీసుకెళ్లి మానభంగం చేశారు. తంగైల్‌లో సుధీర్‌చంద్రదాస్ కూతురు ముక్తిరాణీ ఘోష్‌ను ఒక ముస్లిం వ్యాపారస్తుడు బలవంతంగా ఎత్తుకు పోయాడు. భాలూకాలో పూర్ణచంద్ర బర్మన్ కూతురికీ ఇలాగే జరిగింది. రంగ్‌పూర్‌లో తిర్‌కోళి షాహ్ గారికూతురు జయంతీరాణీ షాహ్ ను కూడా వాళ్లే అపహరించుకుపోయారు. ఇవన్నీ నీకు తెలీదా?" అన్నాడు నోని గోపాల్.

"ఇవన్నీ ఎప్పుడు జరిగాయి?" బలహీనంగా అడిగాడు సుధామయ్.

"1989లో"

"ఇవన్నీ చాలాకాలం క్రితం జరిగినా నీకు చాలా బాగా జ్ఞాపకం ఉన్నాయే".

"ఇలాంటి సంగతుల్ని ఎలా మరిచిపోతాం"

"అంతేనా? పరిబానూలో, అక్బారాలో, మనువారాలో, సుఫియాలో, సుల్తానాలో కూడా ఏంజరుగుతోందో తెలుసుకుంటున్నావా? అక్కడ ఎవర్నీ ఎత్తుకు పోయి, మానభంగాలు చేయటం లేదా? "

నోనీ గోపాల్ తలవంచుకున్నాడు.

"నాకు నీ అనారోగ్యం గురించి తెలుసు. నిన్ను చూట్టానికి రావాలనే అనుకుంటున్నాను. కానీ నేను కుటుంబంతో పాటు రావటం క్షేమంగా ఉంటుందా లేదా అని తటపటాయిస్తూ వచ్చాను. కానీ వెళ్లిపోవటానికి మాత్రమే రాగలిగాను. ఇదే చివరిసారి మేమురావటం. ఈ రోజు రాత్రి మేము బనాపూల్ వెళ్లిపోతున్నాం. మాఇంటిని అమ్మటానిక్కుదరలేదు. మా లలిత బంధువొకతనికా బాధ్యత అప్పగించి దేశం వదిలి వెళ్లిపోతున్నాం", అన్నాడు.

అతణ్ణి ఆపటానికి ప్రయత్నించి లాభంలేదని సుధామయ్ అర్థం చేసుకున్నాడు. కానీ దేశం వదలి పారిపోయి వీళ్లు ఏం సాధించాలనుకుంటున్నారో అతనికి అర్థంకాలేదు. హిందువులసంఖ్య ఈ దేశంలో తగ్గేకొద్దీ వారిమీద జరిగే హింస పెరుగుతుంది. దేశంలో ఉండి పోయిన వాళ్ళకూ, వదిలిపోయిన వాళ్లకూ కూడా అదిక్షేమంకాదు. గతంలోనూ ఇప్పుడూ భారతదేశంలో హిందువులు చేసిన పాపాలకు

బంగ్లాదేశ్ లోని హిందువులు ఇంకా ఎంతకాలం బాధలు పడాలో, చావాలో సుధామయ్‌కి అర్థంకాలేదు. అర్థమైతే ఆత్మహత్యయినా చేసుకోవచ్చు. అలా కొంత శాంతిని హిందువులకు ఇవ్వవచ్చు.

★ ★ ★

ఆ రోజు సాయంకాలం షఫీ అహమద్ భార్య అలేయాబేగం వాళ్ళను చూట్టానికొచ్చింది. ఇంతకు పూర్వమైతే ఆవిడరోజూ వచ్చేది. ఈలోగా రోజూ వచ్చే వాళ్లుకూడా మానుకున్నారు. హైదర్ అమ్మా, నాన్న కూడా ఈ లోగా రాలేదు. కిరణ్మయి ఎంత ఒంటరితనాన్ని అనుభవిస్తోందో తలుచుకుంటే సుధామయ్‌కి బాధ కలిగింది. కిరణ్మయి తలుపుతీసి అలేయాబేగంను చూసి ఆశ్చర్యపోయింది. ఎవరు మాత్రం తమని చూట్టం కోసం ఎందుకు రావాలి? ఈ ఇల్లు ఎవరు రావటానికీ పనికి రాదు.

ఆలేయాబేగం చిరునవ్వు ముఖాన్నీ, నిగనిగ లాడిపోతున్న బట్టల్నీ, తళతళలాడు పోతున్న నగల్నీ చూసి కిరణ్మయి కుంగిపోయి ఉంటుందనిపించింది సుధామయ్‌కి. అనేక సందర్భాల్లో అనుకున్నట్టుగానే తాను కిరణ్మయికి అన్యాయం చేశానా అనిపించింది అతనికి. చదువు, సంస్కారం, సంపద, ఉన్న కుటుంబంలోనుంచీ ఆవిడను తన దివాలా తీసిన కుటుంబంలోకి తీసుకొచ్చాడు. అంతేకాదు. ఇరవై ఒక్క సంవత్సరాలుగా ఆవిడశారీరక అవసరాలను కూడా తాను తీర్చలేకపోయాడు. ఎప్పుడూ తన అవసరాలకే ప్రాధాన్యత ఇచ్చాడు. ఆవిడ మళ్ళీ పెళ్లి చేసుకోవాలని తానెందుకు పట్టుపట్టలేదు? తాను పెళ్ళి చేసుకొని వెళ్ళమంటే కిరణ్మయి వెళ్ళిపోయేదా? అలేయా బేగం జీవిస్తున్న జీవితంలాంటి జీవితం తనకూ ఉండాలని కిరణ్మయి అంతరాంతరాల్లో కోరుకోదా? ఆతళుకూ, ఆ జీవనోత్సాహం తనకు అక్కర్లేదా? ఆవిడా మనిషే. ఆవిడ తన్ను వదిలిపెట్టి వెళ్ళి పోయి ఉంటే తాను ఆశ్చర్యపోయేవాడుకాదు. తాను ఆవిడను అంతగా అంటిపెట్టుకుని బతికింది ఆవిడ వెళ్ళిపోతుందేమో నన్న భయం తన మనసులో ఎక్కడో ఉండటంచేతనేనేమో. తాను తన స్నేహితుల్ని ఇంటికి పిలవటం మానేశాడు. అందుచేత తనకు స్నేహితుడన్నవాడు లేకపోయాడు. అదితనకేం బాధకాదు. ఎందుకంటే కిరణ్మయి "సమర్థుడైన" తనస్నేహితుల్లెవర్నయినా చూసి ఆకర్షితురాలయ్యేదేమో! కాబట్టి తనకు స్నేహితులు రాకపోవటం అంతవరకూ మంచిదే. తనలోపాన్ని తాను మరో విధంగా పూరించుకున్నాడు. ఆవిడను తాను ఎంతో తీవ్రంగా ప్రేమించాడు. శరీర సుఖం కంటే ఆ ప్రేమ అధికమైందనీ, తాను భర్తను వదిలి వెళ్లాల్సిన అవసరం లేదనీ ఆవిడకు పరోక్షంగా నచ్చచెప్పగలిగాడు. కానీ మనిషి ఉద్రేకాలన్నీ ప్రేమతోనే చల్లారుతాయా? ఇన్నేళ్ళ తరువాత ప్రేమతో పాటు మనిషికి మరింకేదో కూడా కావాలని అర్థమైంది.

అలేయాబేగం ఇంట్లోని విధ్వంసాన్ని చూసింది. సుధామయ్ శారీరక పరిస్థితిని గమనించింది. మాయను ఎత్తుకుపోవటాన్ని గురించి విని ఎంతో సానుభూతి ప్రకటించింది.

"వదినా మీకు భారతదేశంలో బంధువులెవరూ లేరా?" అని ప్రశ్నించింది.

"ఎందుకు లేరూ? మా బంధువలంతా అక్కడే ఉన్నారు".

"మరి మీరు ఇక్కడే ఎందుకు ఉండిపోయారు?"

"ఎందుకంటే – ఇది మాదేశం కనుక".

కిరణ్మయి చెప్పిన జవాబు విని అలేయాబేగం ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయింది. అలేయాబేగం చెప్పగలిగినంత విశ్వాసంతో "ఇది నాదేశం"అని కిరణ్మయి ఎలా చెప్పగలదు? అలేయాబేగం, కిరణ్మయి – ఇద్దరూ స్త్రీలే అయినా, ఇద్దరూ ఒకే దేశం లోని పౌరులే అయినా వాళ్లిద్దరినీ ఒకే గాట కట్టేయటం వీలుకాదని సుధామయ్‌కి ఆసందర్భంలో అర్థమైంది. ఎక్కడో కనిపించీ కనిపించని రేఖ వాళ్ళిద్దరినీ వేరు చేస్తోంది.

★ ★ ★

# పదకొండవ రోజు

అది విజయోత్సవ దినం – బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్న దినం. స్వాతంత్ర్యం అన్న మాట సురంజన్‌ను విషపు చీమలా కుట్టింది. దేశం మొత్తం అచారిత్రక దినోత్సవాన్ని జరుపుకునే ఉత్సాహంలో ఉంది. సైనిక కవాతులు వీధుల్లో జరుగుతున్నాయి. ఉత్సాహవంతులైన ప్రజలు వారికి జైకొడుతున్నారు. గతంలో అయితే సురంజన్, ఉదయాన్నే బయలుదేరి ఊళ్ళో జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొనేవాడు. లారీమీదికెక్కి దేశభక్తిగీతాలు పాడేవారు. ఈనాడు అదంతా వృధాశ్రమ అనుకుంటున్నాడు. దేశం స్వాతంత్ర్యాన్ని సాధించాక తాను ఏంలాభం పొందాడు? తానేం స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నాడు?

"జయ్ బంగ్లా....జయ్ బంగ్లా...జయ్...." నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ టాగోర్, నజురుల్ ఇస్లాం, జీవానంద దాస్ మొదలైన కవులు బంగ్లాదేశ్‌ను గురించి పొగిడిన పొగడ్తలు సురంజన్ మనసులో మెదిలాయి. ఆ పాటల్ని పాడాలనిపించినా అతడు పాడలేదు. ఈ సందర్భంలో అతనిలో ఎప్పుడూ పొంగి పొర్లే ఉత్సాహం తలెత్తినా దాన్ని అతడు బలవంతంగా అణచివేశాడు.

అలా రోజంతా పడుకోఉన్న సురంజన్‌లో ఏదో కోరిక పడగెత్తింది. ఆ కోరికను అతడు చాలా కాలంగా జాగ్రత్తగా కాపాడుకుంటూవస్తున్నాడు. ఇప్పుడది రెక్కలు విచ్చి ఎగరబోతోంది. రోజంతా అతడు ఆ కోరికకు నీరు పోసి పెంచాడు. ఇప్పుడది పెరిగి, పూలు పూస్తోంది. అపూల వాసన అతణ్ణి తాకుతోంది. ఆ కోరికను అలాపెంచి, పోషించుకొని రాత్రి ఎనిమిది గంటలకు ఇల్లువదిలి, బయట పడ్డాడు. రిక్షాను పిలిచి రిక్షావాడికి తోచిన చోటికల్లా తీసుకెళ్లమన్నాడు. అతడు సురంజన్ తోఫ్‌ఖానా, విజయ్‌నగర్, కాక్‌రైల్, మోగ్ బజార్ తిప్పి, చివరకు రొమానా మొహల్లాకు తీసుకెళ్లాడు. సురంజన్ దీపాలంకరణ తో వెలిగి పోతున్న నగరాన్ని చూశాడు. వెలిగిపోతున్న ఈ వీధులకు తాను హిందువునని తెలుసా? తెలిస్తే ఈ తారురోడ్లు కోపంతో పగిలి పోతాయేమో. తనదేహంలోని కణకణంలోనూ రగిలిపోతున్న కోరికను ఎలాగైనా తీర్చుకోవాలి. ఆకోరిక తీరటం వల్ల ఏ సమస్యా పరిష్కారం కాకపోవచ్చు. కానీ కోరిక తీర్చుకోవటం వల్ల తనకోపమూ, బాధా కొద్దిగానైనా తగ్గవచ్చు.

బార్ కౌన్సిల్ ఎదుట రిక్షాఆపి, సిగరెట్ వెలిగించాడు. తన వరకూ తాను మాయను గురించి ఆశవదులుకున్నాడు. ఆ మాట అమ్మతో, నాన్నతో కూడా చెప్పాలని నిర్ణయించుకున్నాడు. మాయ ఏరోడ్డు ప్రమాదంలోనో చనిపోయిందనుకోవటం వాళ్లకుకాస్త ఊరటగా ఉంటుంది... అతని మనస్సు మళ్ళీ నిరాశలోకి జారిపోయింది. నిన్న మొన్నటివరకూ సుధామయ్ అరోగ్యంగా ఉండేవాడు. ఈనాడు అతని బాధను సురంజన్ చూడలేకుండా ఉన్నాడు . అతడు రోజంతా బాధతో మూలుగుతుంటాడు.

మాయలేదన్న బాధ అతణ్ణి నిద్రపోనివ్వదు.... వాళ్లు శవాన్ని రాబందులు చీల్చితిన్నట్టుగా మాయను చీల్చేస్తున్నారు కాబోలు. ఆమె శరీరంతో విందు చేసుకొంటున్నారు కాబోలు. వాళ్ళు నరమాంసభక్షకుల్లా ఆమె మాంసాన్ని రుచి చూస్తున్నారు కాబోలు. ఈ ఆలోచనలు సురంజన్‌లో బాధను – భయంకర మైన బాధను – కెలికాయి. తన శరీరాన్ని ఏడు హైనాలు చీల్చితిన్నట్టుగా అనిపించింది. సురంజన్‌కు. తన సిగరెట్ ఇంకాపూర్తి కాకముందే ఎవరో అమ్మాయి రిక్షా వద్దకొచ్చింది. నియాన్ లైట్లు ఆవిడ ముఖం మీద ప్రకాశిస్తున్నాయి. చవకబారు కేక్ తనముఖానికి పులుముకో ఉంది. వయస్సు పందొమ్మిదో, ఇరవైయ్యో ఉండవచ్చు.

"ఇలారా", అన్నాడు సురంజన్ సిగరెట్ విసిరిపారేస్తూ.

ఆ అమ్మాయి వచ్చి రిక్షాకు ఆనుకొని నిలబడింది. చీరని గుండ్రంగా తిప్పుతూ చిరునవ్వు నవ్వింది.

"నీ పేరు?" అడిగాడు సురంజన్.

"పింకీ", అంది ఆఅమ్మాయి వెకిలిగా నవ్వుతూ

"పూర్తిపేరు చెప్పు"

"షమీమా బేగం"

"మీ నాన్న పేరు?"

"అబ్దుల్ జలీల్"

"ఊరు"

"రంగపూర్"

"నీ పేరు మరోసారి చెప్పు"

"షమీమా".

ఆ అమ్మాయికి అనుమానం కలిగింది. ఇంతవరకూ తన్ను తననాన్న పేరు ఊరు అడిగిన వాళ్లు లేరు. "ఎవడీ పాసింజర్?" అనుకుంది ఆ అమ్మాయి. సురంజన్ అమ్మాయికి పరిశీలనగా చూశాడు. ఆ అమ్మాయి అబద్ధాలు చెపుతోందా? కావచ్చు, కాకపోవచ్చు.

"సరే రిక్షా ఎక్కు" అన్నాడు.

షమీమా రిక్షా ఎక్కింది. సురంజన్ రిక్షా వాణ్ణి టికాతులీ వెళ్లమన్నాడు. దారిపొడవునా అతడు ఆ అమ్మాయితో మాట్లాడలేదు. కనీసం ఆవిడ ముఖంలోకి కూడా చూళ్ళేదు. కానీ ఆ అమ్మాయి సురంజన్‌కు ఆనుకుని కూచోని గలగలా మాట్లాడుతూనే ఉంది. అప్పుడప్పుడు ఓ పాటను అందుకొంటోంది. లేదా గట్టిగా నవ్వుతోంది. సురంజన్ ఉలకలేదు, పలకలేదు. సిగరెట్ వెలిగించడానికి మాత్రమే కదులుతున్నాడు. రిక్షావాలాకు ఈ సవారి ఖుషీగా ఉన్నట్టుంది. అతడు కూడా మాటిమాటికి తిరిగి చూస్తూ రాగం లేకుండా హిందీ సినిమా పాటల్ని పాడటం ప్రారంభించాడు. నగరమంతా ఎరుపూ, నీలం లైట్లతో వెలిగిపోతోంది. సురంజన్ ఆ ఆనందంలో పాలుపంచుకోవటంలేదు. అతడు ఈ రోజు రాత్రి చాలా

ఆవేశరహితంగా ఉన్నాడు. ముందుగానే తన చర్యల్ని గురించి బాగా ఆలోచించి పథకం వేసుకున్నాడు.

★ ★ ★

ఊళ్ళోకి వెళ్ళేముందు – ఇతరుల్ని ఇబ్బంది పెట్టకూడదన్న ఉద్దేశంతో – బయటినుంచీ తాళం వేసుకొని వెళ్లాడు సురంజన్. వాళ్ళిద్దరూ నిశ్శబ్దంగా లోపలికి నడిచారు. వాళ్ళిద్దరూ లోపలికెళ్లగానే – "మనం రేటు సంగతి మాట్లాడుకోలేదు...." అంది షమీమా.

"నిశ్శబ్దంగా ఉండు.... శబ్దంఅసలు ఉండకూడదు, " అన్నాడు సురంజన్.

గదంతా ఇంకా చిందరవందరగానే ఉంది. మంచం మీదన్నుంచి బెడ్‌షీట్ వేలాడుతోంది. పక్కగదిలోంచి ఎలాంటి శబ్దమూ వినిపించటం లేదు. బహుశా అందరూ నిద్రపోయారేమో. సురంజన్ శ్రద్ధగా విన్నాడు. సుధామయ్ మూలగడం వినిపించింది. తనముద్దుల కొడుకూ, ప్రతిభావంతుడైన విద్యార్థి వేశ్యను ఇంటికే తీసుకొచ్చాడని అతనికి తెలుసా? కానీ సురంజన్ మాత్రం షమీమాను వేశ్యగా చూడటంలేదు. అతని దృష్టిలో తన చెల్లెలికి జరిగిందానికి ప్రతీకారంగా అతనికి అలాంటి అమ్మాయిని మానభంగం చేయాలన్న తహతహ ఉండేది. అతడు లైట్లు ఆర్పేశాడు. ఆ అమ్మాయిని నేలమీద పడదోశాడు, బట్టలు లాగేశాడు, గట్టిగా ఊపిరి పీల్చుకొని తనగోళ్లతో ఆ అమ్మాయి శరీరాన్ని చీరాడు. గుండెల్ని కొరికాడు. మనసులోని ఒక భాగం తాను చేస్తున్నది శృంగారం కాదని చెబుతూనే ఉంది. ఆవిడ జుట్టు గుంజాడు. చెంపలమీదా, గుండెలమీదా గట్టిగా కరిచాడు. పొడవుగా ఉన్న తనగోళ్లతో ఆవిడ నడుముమీద, పొట్టమీద, తొడలమీద, పిర్రలమీదా గట్టిగా చీరాడు. కాని ఆవిడ వేశ్య మాత్రమే. నగ్నంగా ఉన్న ఆవిడ శరీరం మీద దాడి చేశాడు. బాధతో ఆ అమ్మాయి మూలిగింది. అరిచింది. "అయ్యో దేవుడా బాధతో చచ్చిపోతున్నాను", అనిమొరపెట్టుకుంది. సురంజన్ పాశవిక సంతృప్తితో నవ్వాడు. ఇంకా ఇంకా ఆవిడను బాధించాడు. తరువాత మానభంగం చేశాడు. అతడు తనమీద కదులుతున్నంతసేపూ తాను ఇంత క్రూరమైన జంతువులాంటి పాసింజర్ని చూడలేదని ఆవిడ గజగజలాడిపోతూ ఉంది. పులిపంజా లోంచీ తప్పించుకునే జింకపిల్లలాగా ఆ పిల్ల సురంజన్ బంధంలోంచీ తప్పించుకొని, చీరను అందుకొని తలుపు వద్దకు పరుగెత్తింది.

సురంజన్ మీదున్న బరువుదిగిపోయింది. అతడు కాస్త చల్లబడ్డాడు. రోజంతా అతణ్ణి కాల్చుకు తిన్న కోరిక పోయింది. తన సంతోషం నిజంగా పూర్తికావాలంటే ఆ పిల్లను బయటికి గెంటెయ్యాలి. మళ్ళీ ఆందోళన పెరిగింది. ఊపిరి బరువెక్కింది. ఆ పిల్లను బయటికి గెంటెయ్యాలా? నగ్నంగా, భయంతో వణికి పోతూ ఆ అమ్మాయి తలుపుదగ్గరే నిలబడి ఉంది. ఆ అమ్మాయికి అతణ్ణి ఏమీ అడిగే ధైర్యం లేదు. మాట్లాడకూడదని అతడు అప్పుడే చెప్పాడుకాబట్టి ఆ అమ్మాయి అలాగే నిలబడి ఉంది.

మాయేదీ? ఆవిడను మానభంగం చేయటానికి వాళ్లు ఆవిడ కాళ్ళూ, చేతులూ,

కట్టేశారా? ఆ ఏడుమంది ఆవిడను సామూహికంగా మానభగం చేశారా? అయ్యో మాయా....ఆవిడకు ఎంతో బాధ కలిగి ఉంటుంది....ఒకసారి మాయ పదిహేను పదహారు ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు "దాదా....దాదా...." అని కేకలు పెట్టింది. సురంజన్ పరుగెత్తు కెళ్ళి చూశాడు. మాయ నిద్రలేచింది కానీ, వణికి పోతోంది. "ఎందుకు మాయా, ఎందుకలా వణికి పోతున్నావ్"? అన్నాడు సురంజన్. పీడకల ప్రభావం ఇంకా వదల్లేదు, మాయ వణుకుతూనే ఉంది. "దాదా.... నువ్వూ, నేనూ ఓ అందమైన పల్లెకు వెళ్లాం. కబుర్లు చెప్పుకుంటూ పచ్చని వరిపొలాల్లో నడిచి వెళ్తున్నాం. మనతో పాటు మరికొందరు నడుస్తున్నారు. వాళ్లు కూడా మన కబుర్లలో అప్పుడప్పుడూ కలగజేసుకుంటున్నారు. కానీ....అకస్మాత్తుగా పొలాలు అదృశ్యమై పోయాయి. చుట్టూరా ఎడారి....నువ్వు కూడా అదృశ్యమైపోయావు....కొంతమంది మనుషులు చుట్టు ముట్టి నామీదికి వస్తున్నారు. నాకు చాలా భయమేసింది. నీకోసం అరుస్తూ....నిన్ను గట్టిగా పిలుస్తూ పరుగెత్తటం ప్రారంభించాను...." అయ్యో మాయా! సురంజన్ కనిపించకుండా పోయిన చెల్లెల్ని గురించి బాధగా ఆలోచించసాగాడు. అతని ఉఛ్వాసనిశ్వాసాలు బరువుగా, వేగంగా అయ్యాయి. మాయ ఎక్కడో బందీగా ఉంటుంది. తన్ను రక్షించమని గొంతెత్తి పిలుస్తూ ఉంటుంది. కానీ ఆమె అరుపులు ఎవరికీ వినిపించవు. ఎదురుగా క్రూరమృగాలుంటాయి. వాటి దయకోసం మాయ ప్రాధేయపడుతూ ఉంటుంది. మాయెక్కడుందో? ఇది ఇంత చిన్న ఊరైనా తన చెల్లెలు ఎక్కడుందో తాను కనిపెట్టలేకపోయాడు. తన చెల్లెలిప్పుడు చెత్తకుండీలో ఉందా? వ్యభిచార గృహంలో ఉందా? గంగానదిలో తేలుతూ ఉందా? ఎక్కడ? ఎక్కడ? మాయ ఎక్కడుంది?...తన ఎదుట నిలబడి ఉన్న అమ్మాయిని బయటికి గెంటేయాలని మాత్రమే అనిపించింది సురంజన్‌కు.

సురంజన్ ప్రవర్తన చూసి ఆ అమ్మాయి గజగజలాడిపోయింది. త్వరత్వరగా బట్టలేసుకుంది.

"డబ్బు ఇవ్వు", అంది ధైర్యంచేసి.

"బయటికి నడు... ఊc....తొందరగా వెళ్ళు", అన్నాడు సురంజన్.

షమీమా తలుపుతెరిచి, ఒక కాలుబయటపెట్టి, మళ్లీ వెనక్కు తిరిగి దీనంగా సురంజన్ వైపు చూస్తూ అంది, "పదిటాకా లైనా సరే....దయచేసి ఇవ్వు". ఆవిడ చెక్కుల మీదమంచీ రక్తం ధారగా జారుతోంది.

సురంజన్ కోపంతో కంపించి పోయాడు కానీ ఆ అమ్మాయి కళ్లల్లోని దైన్యాన్ని చూసి కొద్దిగా మెత్తబడ్డాడు. ఎంతకాదన్నా ఆఅమ్మాయి బీదది....తిండికోసం శరీరాన్నమ్ముకొంటున్న బీదది. అవిడకేదైనా ప్రతిభ అన్నది ఉంటే దాన్ని గుర్తించకుండా ఈ దుష్ట వ్యవస్థ అవిడను మురికి కూపంలోకి నెట్టేసింది. తాను నాలుగు డబ్బులిస్తే ఆ అమ్మాయి ఈ పూట తిండి తింటుంది. ఆ అమ్మాయి ఎన్ని పూటలుగా పస్తుపడుకుంటూ ఉందో? సురంజన్ పది టాకాలు తీసి ఆ అమ్మాయి చేతిలో పెట్టాడు.

"నువ్వు ముస్లిమేకదూ?" అన్నాడు.

"ఔను"

"మీకు పేర్లు మార్చుకొనే అలవాటుంది. నీది అలా మార్చుకున్న పేరేనా?"

"కాదు"

"నువ్వెళ్ళు"

షమీమా వెళ్ళిపోయింది. సురంజన్‌కు ఆంథోళన తగ్గింది. ఈ రోజు జరగబోయే దానికి బాధపడకూడదని అతడు అప్పుడే అనుకున్నాడు. ఈ రోజు విజయోత్సవదినం – స్వతంత్రదినం. ఇరవై ఒక్క సంవత్సరాలక్రితం సంపాదించుకున్న స్వాతంత్ర్యం యొక్క ఫలితాలను అందరూ అనుభవిస్తున్నారు. ఈ రోజు మరో విజయోత్సవదినం కూడా. షమీమా బేగం సురంజన్ దత్త ఇంటికొచ్చింది. జయించబడింది. సురంజన్‌కు చిటికలేస్తూ అందరూ పాడే దేశభక్తి గీతాన్ని పాడాలనిపించింది.

"నా ప్రేమకు గమ్యం బంగ్లాదేశ్
నాసర్వస్వం బంగ్లాదేశ్
బంగ్లాకోసం జీవిస్తా
బంగ్లాకోసం మరణిస్తా"

తనపేరు షమీమాకు చెప్పలేదు. తనపేరు సురంజన్‌దత్త అని చెప్పి ఉండవలసింది. అప్పుడు తన్ను చెరిచినవాడు, రక్తంకారేలా కరిచిన వాడు హిందువని ఆవిడకు తెలిసేది. ఔను! హిందువులక్కూడా చెరచటం వచ్చు. వాళ్లకూ చేతులున్నాయి. కాళ్ళున్నాయి. బుర్రనిండుకూ ఆలోచనలు కూడా ఉన్నాయి. వాళ్ల పళ్లు పదునుగా ఉంటాయి. వాళ్లగోళ్లు పంజాల్లా పనిచేస్తాయి....షమీమా మంచి అమ్మాయి....మృదువుగా మర్యాదగా ప్రవర్తించే అమ్మాయి. కానీ ముస్లిమేకదా! ముస్లింను ఎవరైనా ఝాడించి చెంపమీద ఒక దెబ్బ కొట్టగలిగినాచాలు. తనకెంతో సంతోషం కలుగుతుంది.

సురంజన్ పడకమీద పొర్లుతూ రాత్రంతా గడిపాడు. అతనికి ఎంతప్రయత్నించినా నిద్రరాలేదు. రాత్రంతా నిశ్శబ్దంతో స్నేహం చేస్తూ, భయంకరమైన అభద్రతా భావంతో గడిపాడు. ఆ రోజు తానో చిన్న ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. కానీ తీర్చుకోలేకపోయాడు. తనకు ప్రతీకారం తీర్చుకోవటం చేతకాదు. రాత్రంతా అతని కళ్లముందు బాధతో వంకర్లు తిరిగి పోతున్న షమీమా ముఖమే కదలాడుతోంది. సురంజన్‌కు ఆ అమ్మాయిని తల్చుకుంటే చాలా బాధకలిగింది. అతనికి కోపమూ, ఏదో సాధించిన దర్పమూ కలిగి ఉండాల్సింది. కానీ కలగలేదు. తాను తీర్చుకున్న ప్రతీకారం ఎలాంటిది? ఇది పరాజయమేకానీ ప్రతీకారంకాదు. సురంజన్ ఓడిపోయాడా? ఔను – అతడు ఓడిపోయాడు. ఎందుకు? ఎందుకంటే అతడు షమీమాను మోసంచేయలేకపోయాడు కాబట్టి. ఆవిడను మోసం చేసింది ఆవిడ సామాజిక స్థాయిమాత్రమే కాబట్టి. ఆవిడకు రతికీ, మానభంగానికీ తేడాలేదు. ఈ సత్యం స్ఫురించగానే సురంజన్ పరుపుమీద ముడుచుకు పోయాడు. అవమానం ముంచుకొచ్చింది. అందులో అతడు కొట్టుకుపోయాడు.

రాత్రి చాలాపొద్దు పోయింది....సురంజన్ ఇంకా ఎందుకు మేలుకో ఉన్నాడు. తన శరీరమంతా ఎందుకు కుళ్ళి పోయినట్టనిపిస్తోంది? తన శరీరంలోని భాగాలన్నీ బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత ఎందుకు ముక్కలుముక్కలై పోయినట్టు అనిపిస్తోంది? తాను తమ మగతనంతో ఛిన్నాభిన్నం చేసిన ఆ అమ్మాయిని తలుచుకుంటే తనకు జాలి కలుగుతోందా? తాను ఆ అమ్మాయిని కొరికాడు, రక్కాడు, రక్తం కళ్ళచూశాడు. తాను ఆ అమ్మాయి చెంపలమీద కారుతున్న రక్తాన్ని తుడుచి ఉంటే బావుండేది? ఆ అమ్మాయిని మళ్ళీ తాను కలవలేడా? మళ్ళీ కలిస్తే క్షమించమని అడగాలని నిశ్చయించుకున్నాడు సురంజన్. అతనికి అంత చలికాలంలోనూ ఉక్కపోసినట్టు అనిపించింది. రజాయ్‌ని దూరంగా విసిరేశాడు. అతని బెడ్‌షీట్ అతని కాళ్ల వద్ద ముద్దగా పడి ఉంది. అతడు కుక్కలా మోకాళ్ళ మధ్య తలపెట్టుకొనికూచున్నాడు.

తెల్లవారుజామున అతనికి బాత్‌రూంకు వెళ్ళాలనిపించింది. కానీ పడకమీదనుంచి లేవలేక పోయాడు. అలవాటు ప్రకారం కిరణ్మయి వచ్చి అతని బల్లమీద టీ పెట్టివెళ్ళింది. అతనికి తాగాలనిపించలేదు. అతనికి వాంతిచేసుకోవాలనిపించింది. వేడినీళ్ళతో స్నానం చేయాలనిపించింది. కానీ వేడినీళ్లెక్కడ దొరుకుతాయి? బ్రహ్మపల్లిలోని ఇంట్లో నీటి గుంట ఉండేది. అందులో తాను చలికాలపు రోజుల్లో స్నానం చేసేవాడు. అలా – నీటిగుంటలో స్నానం చేస్తే ఎంతో బావుంటుంది....కానీ నీటి గుంట ఎక్కడుంది? ఇచ్చిన నీళ్లతో, బాత్‌రూంలో స్నానం చేయాలంటే అసహ్యం....జీవితాన్ని అలా ఎందుకు కొలుచుకోవాలి? జీవితం అలా ఎందుకుండాలి?

★ ★ ★

# పన్నెండవ రోజు

మరుసటి రోజు ఉదయం పదిగంటలకు పడక మీదనుంచి లేచాడు సురంజన్. వరండాలో నిలబడి బ్రష్‌తో పళ్ళు తోముకుంటున్నాడు. ఇంతలో ఖదీమ్ కొడుకు అష్రఫ్ వచ్చి ఇలా అన్నాడు.

"పిన్నీ గెండెరియా వంతెన కింద మాయను పోలిన ఓ అమ్మాయి శవం తేలుతోందని పుతు అంటున్నాడు విన్నావా?"

సురంజన్ పట్టు బ్రష్ మీద గట్టిగా బిగిసింది. శరీరం ఒణికింది. ఉన్నట్టుండి భయంకరమైన ఒంటరి తనం స్ఫురించింది. ఇతర గదుల్లోంచి ఏ శబ్దమూ వినిపించటంలేదు – చివరికి ఏడుపుశబ్దంకూడా. ఇల్లంతా అసహజమైన నిశ్శబ్దం అలుముకొని ఉంది. ఎంత మెల్లిగా మాట్లాడినా అది నిశ్శబ్దం అన్నగోడకు తగిలి ప్రతిధ్వని వచ్చేలా ఉంది. గతవేయి సంవత్సరాలుగా ఆ ఇంట్లో సురంజన్ తప్ప మరెవరూ లేనట్టుగా అనిపిస్తూ ఉంది. చుట్టూరా ఉన్న నగరం కూడా నిశ్శబ్దంగానే ఉంది. గతరాత్రి జరుపుకున్న విజయోత్సవాల మత్తు నిద్రలోంచీ అదింకా లేవలేదు. సురంజన్ ఇంకా బ్రష్ చేతిలో పట్టుకొని అలాగే నిలబడ్డాడు. ఇంతలో హైదర్ అదారిన వచ్చాడు. చూపులుకలవటంచేత పలకరించుకోవాల్సిన అవసరం కలిగింది.

"ఎలా ఉన్నావు?" అన్నాడు హైదర్.

"బావున్నాను," అనాడు సురంజన్ చిరునవ్వునవ్వుతూ.

వాళ్ళ సంభాషణ మాయ వద్దకు రావాల్సింది, కానీ రాలేదు.

"నిన్న విజయోత్సవాల తరువాత రాజ్‌షాహీ విశ్వవిద్యాలయం వద్ద ఉన్న సామూహిక సమాధుల్ని జమాతీలు అపవిత్రం చేశారు", అన్నాడు హైదర్ వరండాకున్న ఇనుప కటకటాలకు ఆనుకొని నిలబడుతూ. సురంజన్ పేస్టు బురుగును నేలమీద ఉమ్మేశాడు.

"సామూహిక సమాధులంటే?" అన్నాడు.

"సామూహిక సమాధులంటే తెలీదా" హైదర్ ఆశ్చర్యంగా అడిగాడు.

సురంజన్ తెలియదన్నట్టుగా తల ఊపాడు.

కోపంతో హైదర్ ముఖం నల్లగా అయిపోయింది, స్వాతంత్ర్యపోరాటంలో ప్రధాన పాత్ర వహించిన సురంజన్‌కు సామూహిక సమాధుల్ని గురించి తెలియకుండా ఎలా ఉంటుంది. కానీ సురంజన్ దృష్టివేరు. సమాధులమీదున్న ఫలకాలను జమాతీలు ధ్వంసం చేసి ఉంటే చేసుకోనీ. వారి చేతుల్లో ఆయుధాలున్నాయి. వాటిని వాళ్లు ఉపయోగించాలనుకుంటే వాళ్ళను ఆపేదెవరు? త్వరలోనే వాళ్లు అజేయమైన బంగ్లాదేశ్‌నే ముక్కలుచేస్తారు. పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని

చెరిపేస్తారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని నాశనం చేస్తారు. కానీ వారిని ఆపగలిగిన వాళ్ళెవరు? కొన్ని ఊరేగింపుల్నీ, సమావేశాల్నీ జరపవచ్చు, "జమాతీల రాజకీయ విధానాన్ని ఆపాలి", అని నినాదాలివ్వవచ్చు. అంతే. ఈ నిరసనలో ఒరిగేదీ, తరిగేదీ ఏమీ ఉండదు.

కోపం తగ్గి హైదర్ మెత్తబడ్డాడు. ఏమైనా మాట్లాడాలనుకున్నాడు.

"ఈ సంగతి తెలుసా? పర్వీన్ ఇక్కడే ఉంది. విడాకులు తీసుకుంది", అన్నాడు కొన్ని నిమిషాల తరువాత.

సురంజన్ జవాబు చెప్పలేదు. పర్వీన్ విడాకులు తీసుకున్నందుకు అతనికి ఎంత మాత్రం బాధ కలగలేదు. అంతేకాదు. అతనికి సంతోషం కూడా కలిగింది. ఇతడే పర్వీన్ హిందువును పెళ్ళి చేసుకోకూడదని పట్టినపట్టు వదలకుండా ముస్లింకే ఇచ్చి చేశాడు. దానివల్ల ఏంజరిగిందో చూడు. సురంజన్ అప్పుడే మానసికంగా పర్వీన్‌ను చెరిచేశాడు. పొద్దు పొడవగానే, పళ్ళుతోముకునే వేళ మానభంగాలు ఎవరికీ ఆకర్షణీయంగా ఉండవు. సురంజన్‌కు అలా కాదు. అది కేవలం మానసికం కాబట్టి దాని ఆకర్షణ దానికుంది.

"మళ్ళీ కలుద్దాం" అంటూ కొన్ని నిమిషాల తరువాత వెళ్ళిపోయాడు హైదర్. సురంజన్ జవాబు చెప్పలేదు.

★ ★ ★

సుధామయ్ కాస్త కూర్చోగలుగుతున్నాడు. దిండుకానుకొని కూచొని అతడు ఇంట్లో పరుచుకో ఉన్న నిశ్శబ్దాన్ని వింటున్నాడు. ఈ ఇంట్లో బతుకు మీద నిజమైన కోరిక ఉన్న ఒకే ఒక వ్యక్తి మాయ. తాను జబ్బుపడకపోతే మాయ పరుల్ ఇంటినుంచి తిరిగి వచ్చేదికాదు. ఇలా అపహరణకు గురయ్యేది కాదు. మాయ శవాన్ని చూశామని ఎవరో అన్నారు. వంతెన క్రింద చూశారట. కానీ శవాన్ని గుర్తుపట్టటానికి ఎవరు వెళ్తారు? ఇంట్లోని వాళ్లెవరూ వెళ్లరని సుధామయ్‌కి తెలుసు. మాయ ఏదో ఒక రోజు తిరిగి రావాలని అందరూ నమ్మటానికి ప్రయత్నించేవాళ్ళే. మాయ శవాన్ని గుర్తిస్తే ఆవిడ ఒకటి రెండు రోజుల్లోనో, ఒకటి రెండు నెలల్లోనో తిరిగిరావచ్చునన్న ఆశ అడుగంటి పోతుంది. కొన్ని ఆశలు మనకు బతుకుమీద ఆశను కలిగిస్తాయి. మనబతుకుల్లో బతకటానికున్న ఆశలు చాలా తక్కువ. అలాంటి ఆశల్ని చేజేతులా జారవిడుచుకోవటంలో అర్థంలేదు. ఆ ఆశలే జీవితాన్ని నడిపిస్తాయి.

సుధామయ్ సురంజన్‌ని తన గదికి పిలిచాడు. అలాపిలిచి చాలా కాలమే అయింది. సురంజన్ వచ్చాక అతణ్ణి తనపక్కనే కూచోమన్నాడు. "ఇలా తలుపులూ, కిటికీలూ మూసుకొని కూచోవటం సిగ్గుగా ఉంది", అన్నాడు సుధామయ్.

"మీకు సిగ్గుగా ఉందా? నాకు కోపంగా ఉంది", అన్నాడు సురంజన్.

"నిన్ను గురించి కూడా ఆందోళనగా ఉంది".

"ఎందుకూ?"

"నువ్వు చాలా ఆలస్యంగా ఇంటికొస్తావు, నిన్న హరిపాద వచ్చాడు. భోలాలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైందట. వేలాదిమంది ప్రజలు ఆశ్రయం

కోల్పోయారట. ఎంతో మంది స్త్రీలను మానభంగం చేస్తున్నారట".

"ఇదంతా మీకు కొత్తగా ఉందా?"

"ఔను కొత్తగానే ఉంది. అందుకే నిన్ను గురించి ఆందోళనగా ఉంది. సురంజన్".

"నన్ను గురించి ఆందోళనగా ఉందా? ఎందుకూ? మిమ్మల్ని గురించీ, అమ్మనుగురించీ ఆందోళనగా లేదా? మీరు హిందువులు కారా?"

"వాళ్లు మమ్మల్నేంచేస్తారు?"

"మీతలలు నరికేసి బురీగంగా నదిలో పారేస్తారు. ఈదేశంలోని ప్రజల స్వభావం మీకింకా అర్థం కాలేదా? హిందువు దొరికితే వాణ్ణి ఫలహారం చేస్తారు. వాళ్ళకు వయసులో ఉన్నవాళ్లు, ముసలివాళ్లు అన్న తేడాలేదు".

విసుగులో సుధామయ్ నొసలు ముడతలు పడింది. "నువ్వు ఈ దేశంలోని ప్రజల్లో ఒకడు కాదా?"

"కాదు, ఈ దేశంలో నేనూ ఒక భాగమని నేనిప్పుడు భావించటం లేదు. అలా అనుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాను. కానీ వీలుకావటంలేదు. ఇంతకు ముందు కాజల్ అన్నయ్య ఈ దేశంలోని ముస్లిం అనుకూల వైఖరిని గురించి మాట్లాడితే విసుక్కునే వాణ్ణి. "ఈ దేశంలో హిందువులు ఎంత పోగొట్టుకున్నారో, ఏం పోగొట్టుకున్నారో ఆలోచించటం మానేద్దాం. ఈ దేశంలో చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి, వాటిని గురించి ఆలోచిద్దాం." అనేవాణ్ణి, ఇప్పుడు అతడే కరెక్టని తెలుసుకున్నాను. నేను మారిపోతున్నాను. నేను ఇలా ఉండి ఉండకూడదు బాబా...." సురంజన్ మాటలు తడబడ్డాయి.

"ప్రజలు దాన్ని గురించి మాట్లాడుతున్నారు, నిరసన వ్యక్తం చేస్తున్నారు. పత్రికలు రిపోర్టుల్ని ప్రచురిస్తున్నాయి. మేధావులు తన అభిప్రాయాల్ని చెబుతున్నారు?" అన్నాడు సుధామయ్ ఊరడింపుగా కొడుకు భుజం తడుతూ. "అదంతా అర్థం లేని వ్యవహారం", అన్నాడు సురంజన్ కోపంగా.

"ఒక గుంపు కత్తులూ, గొడ్డళ్ళూ పట్టుకొని యుద్ధరంగంలో కొచ్చింది. మరో గుంపు నోటితోనో, అప్పుడప్పుడూ ఒట్టిచేతుల్తోనో సమాధానం చెబుతోంది. అది సరిపోదు. గొడ్డలిని గొడ్డలితోనే ఎదుర్కోవాలి. ఆయుధాలను ఖాళీ చేతుల్తో ఎదుర్కోవాలనుకోవటంలో అర్థం లేదు", అన్నాడు మళ్ళీ సురంజన్.

"అంటే – మన ఆదర్శాలను వదిలిపెట్టేయాలంటావా?"

"ఏమిటి మీ ఆదర్శాలు? వాటికి అర్థం లేదు".

గత కొన్ని రోజులుగా సుధామయ్ తల మరింతగా నెరిసిపోయింది. ఈనాటి సుధామయ్ ఆనాటి సుధామయ్‌కి నీడాలా మాత్రమే కనిపిస్తున్నాడు. కానీ అతని ఆదర్శాలు, నమ్మకాలూ మాత్రం చెదిరిపోలేదు.

"ప్రజలు కనీసం తమ నిరసనను వ్యక్తం చేయగలగుతున్నారని మరిచిపోవద్దు. అస్వాతంత్ర్యం ఎన్ని దేశాల్లోఉంది?" అన్నాడు సుధామయ్.

సురంజన్ జవాబు చెప్పలేదు. "బంగ్లాదేశ్ ప్రజా రిపబ్లిక్ " అన్న పేరు "బంగ్లాదేశ్ ఇస్లామిక్ రిపబ్లిక్" గా మారిపోతుందన్నది అతని గట్టి నమ్మకం. ఇస్లామిక్ సూత్రాలు దేశం లోని జీవిత విధానాన్ని నడుపుతాయి. స్త్రీలు బురఖాల్తో మాత్రమే వీధుల్లో కనిపిస్తారు. గడ్డాలూ, టోపీలూ ధరించిన పురుషుల సంఖ్యకూడా పెరుగుతుంది. స్కూళ్ళు, కాలేజీలకు బదులుగా మసీదులూ, మద్రసాలూ పెరుగుతాయి. నెమ్మది నెమ్మదిగా హిందువులు చంపివేయబడతారనటానికి సందేహంలేదు...ఈ ఆలోచనరాగానే సురంజన్ శరీరం గజగజ వణికిపోయింది. ఎవరైనా బతికి బట్టకడితే అతడు సమాజ వ్యతిరేక శక్తిలాగానో, నలుగురిలోకి రాలేని వాడిలాగో ఇంట్లో కూచోవాలి. వీధిలో ఓ ఊరేగింపు పోతూ ఉందనుకో వాడు భయంతో ఇంట్లోంచే బయటికి రాకూడదు. ముస్లిములు తన నిరసనను తెలియచేయవచ్చు. కానీ హిందువులకు ఆ హక్కు లేదు. ఎవరైనా హిందువు తన నిరసన తెలియజేస్తే అతని గొంతుకోసేస్తారు. అహమద్ షరీఫ్ తప్పుచేస్తే, అతడు నేరం చేశాడని అంగీకరించినా అతని ప్రాణాని కొచ్చిన భయమేంలేదు. కానీ సుధామయ్ అనకూడని మాట ఏదైనా అంటే అర్ధరాత్రి పూట వచ్చి అతని పీకనులిమేస్తారు. హిందువులు పోరాటానికి దిగితే ఛాందస ముస్లిములేకాదు, ఆధునిక అభ్యుదయ ముస్లింలు కూడా వారిని వ్యతిరేకిస్తారు. ఈ వైరుధ్యాలను తలచుకుంటే సురంజన్‌కు నవ్వొచ్చింది. అభ్యుదయ వాదులు కూడా తమను తాము ముస్లిములనీ, హిందువులనీ నిర్వచించుకొంటున్నారు! ఎంత ఆశ్చర్యం! సురంజన్ తాను ఆధునికున్ననుకునేవాడు. కానీ ఇప్పుడు తాను హిందువుననుకోవటం ప్రారంభించాడు. తానులోలోపలే కుళ్ళి పోతున్నాడా? కుళ్ళిపోతున్నాననే అతనికి అనిపించింది.

సుధామయ్ సురంజన్ మరింత దగ్గరగా రమ్మన్నాడు. సురంజన్ నాన్నగారి వైపుకు జరిగాడు.

"ఇక మాయ కనిపించదా?" అన్నాడు సుధామయ్.

"తెలీదు"

"ఆ దాడి జరిగిన నాటినుంచీ కిరణ్ నిద్రపోలేదు. ఆవిడ నిన్ను గురించి కూడా చాలా ఆందోళన పడుతోంది. నీ కేమైనా జరిగితే...."

"చనిపోవాలనుంటే చనిపోతాను. ఎంతో మంది చనిపోతున్నారుగా...."

"నేను ఇలా కూచోగలుగుతున్నాను. బాత్‌రూంకు వెళ్లడానికి కిరణ్ సాయం చేస్తుంది. కాని నేను పూర్తిగా కోలుకుంటే తప్ప రోగుల్ని చూడలేను. రెండు నెలలుగా ఇంటి అద్దె అలాగే ఉంది.... నువ్వో ఉద్యోగం చూసుకుంటే...."

"ముక్కు మొహం తెలీనివాళ్ళ దగ్గర నేను ఉద్యోగం చేయను...."

"చూడు....మన కుటుంబానికి – అంటే మనకు – పూర్వం ఉన్న జమిందారీపోయింది. గరిసెనిండుకూ వడ్లూ, చెరువునిండుకూ చేపలూ, పెరటి నిండుకూ పాడి పశువులూ....వీటన్నిట్నీ నేను చూశాను. నువ్వు చూళ్ళేదు. అదే నా బాధ. ఊళ్ళో ఉన్న పొలం మొత్తం అమ్మేశాను. అందులో మేము కొద్దిగా మిగిలించుకో

ఉన్నా అక్కడో చిన్న ఇల్లు కట్టుకొని, ముసలితనాన్ని అక్కడ గడిపేసేవాళ్ళం". సురంజన్ కోపంతో గట్టిగా అరిచాడు.

"మతిలేకుండా మాట్లాడకండి. ఆ ఊళ్ళో మీరు బతక గలిగే వారా? ఆ ఊళ్ళోని పెద్దలు ఇనుపచువ్వలతో వచ్చి మీ బుర్ర పగలగొట్టి మీ ఆస్తంతా తీసుకెళ్ళి పోయి ఉండేవారని మీకు అర్ధంకావటం లేదా?"

"అలా అందర్నీ అనుమానించకూడదు. మంచి వాళ్ళింకా కొందరైనా మిగిలే ఉంటారు".

"లేరు"

"నువ్వు అనవసరంగా నిరాశా వాదిలా మాట్లాడుతున్నావు?"

"అనవసరంగా మాత్రం కాదు".

"నీ స్నేహితుల మాటేమిటి? నువ్వు ఇన్నాళ్ళు కమ్యూనిజం అధ్యయనం చేశావు. ఉద్యమాల్లో పాల్గొన్నావు. నీలాంటి వారితో ఎన్నో సమస్యల్ని చర్చించావు....వాళ్లు మంచి వాళ్ళుకారా?"

"కాదు. ఒక్కరూ కాదు. వాళ్ళంతా మతవాదులే".

"నువ్వు కూడా మతవాదివై పోవటం లేదు కదా?"

"అయిపోయాను. ఈ దేశం నన్ను మతవాదిగా తయారుచేస్తోంది. అందులో నా తప్పేంలేదు".

"ఈ దేశం నిన్ను మతతత్వవాదిగా చేస్తోందా?" సుధామయ్ అపనమ్మకంగా అడిగాడు.

"ఔను, ఈ దేశమే".

సురంజన్ "దేశం" అన్నమాటను ఒత్తిపలికాడు. సుధామయ్ మాట్లాడలేదు. సురంజన్ గదిలోని గాజుముక్కల్ని చూశాడు. ఈ గాజు ముక్కలు పాదాల్లో గుచ్చుకోవా? అవి ఎప్పుడో వాళ్లహృదయాల్లో గుచ్చుకున్నాయి.

★ ★ ★

సురంజన్ ఆ రోజంతా పడకమీదే గడిపాడు. అతనికి ఎక్కడికీ వెళ్లాలనిపించలేదు. ఎవరితోనూ మాట్లాడలని కూడా అనిపించలేదు. వంతెన కింద కనిపించిన శవాన్ని తానొక క్షణం పాటు చూసొస్తే? ఒకవేళ అది మాయ శవమే అయితే – తాను ఉబ్బిపోయి, లుకలుకలాడుతున్న మాయ శవాన్ని చూడాలా? అవసరం లేదు. ఆరోజు ఎక్కడికీ వెళ్లకూడదని నిశ్చయించుకున్నాడు సురంజన్.

సాయంకాలం పడకమీద నుంచీలేచి అలా ముంగిట్లో పచారు చేయటం ప్రారంభించాడు. అకస్మాత్తుగా అతనికి తానొక పని చేయాలని తోచింది. ఇంట్లోకెళ్ళి పుస్తకాలన్నీ తీసుకొని వచ్చి బయటవేశాడు. పుస్తకాల్లోని చిమటల్ని వదిలించటం కోసం వాటిని ఎండలో ఆరబడుతున్నాడనుకొంది కిరణ్మయి. "దాస్ కాపిటల్"; మార్క్స్, ఏంగిల్స్, లెనిన్, మార్గన్, గోర్కీ, దాస్తోవస్కీ, టాల్‌స్టాయ్, జీన్‌పాల్ సార్త్రే, పావ్‌లోవ్, రవీంద్రనాధటాగోర్, మానిక్ బంధ్యోపాధ్యాయ, నెహ్రూ, అజాద్ రాసిన

పుస్తకాలు; సామాజిక శాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయాలు, చరిత్ర మొదలైన విషయాల మీదరాసిన గ్రంథాలు, ఇటుకల ప్రమాణంలో ఉన్న పెద్ద పుస్తకాలూ, చిన్నపుస్తకాలూ – అన్నిట్నీ ముంగిట్లోకి తీసుకొచ్చిన తరువాత చించటం ప్రారంభిచాడు. చించి కుప్పపోయటం ప్రారంభించాడు. ఆపని పూర్తయ్యాక అగ్గిపుల్లవెలిగించి ఆకుప్పకు నిప్పపెట్టాడు. హిందువుల్ని చూసినప్పుడు మతదురహంకార ముస్లిములు మండినట్టుగా ఆకుప్ప మండటం ప్రారంభించింది. ఇంటి ముంగిలంతా నల్లని పొగతో నిండిపోయింది. మండుతున్న కాగితం వాసన చూసి కిరణ్మయి బయటకొచ్చింది.

"చలికాచుకోవాలా? రా", అన్నాడు సురంజన్ నవ్వుతూ.

"నీకు పిచ్చి పట్టిందా?" అన్నది కిరణ్మయి, అలసిపోయిన గొంతుతో.

"ఔను. ఇంతవరకూ నేను మంచి అబ్బాయిని, ఇప్పుడు నేను పిచ్చివాణ్ణయిపోవాలని నిశ్చయించుకున్నాను. పిచ్చి వాడైపోతే తప్ప శాంతిలేదు".

కిరణ్మయి వాకిట్లో నిలబడి సురంజన్ హోమజ్వాలల్ని బాధగా చూసింది. తాను బాత్‌రూంలోకి వెళ్లి నీళ్ళు తీసుకొచ్చి మంటలమీద పోయాలని ఆమెకు తోచలేదు. మంటల నేపథ్యంలో సురంజన్ స్పష్టంగా కనిపించలేదు. సురంజనే మంటల్లో నిలబడి ఉన్నట్టు కిరణ్మయి భ్రమపడింది.

ఇంట్లో కూచో ఉన్న సుధామయ్ ఆలోచిస్తున్నాడు. ఎంతో ప్రతిభావంతుడైన తనకొడుకు మతతత్వ విషానికి విరుగుడుగా ఉండేవాడు. ఇప్పుడు తానే ఆ విషాన్ని మింగుతున్నాడు. గంటలకొద్దీ తన గదిలో పడుకొని స్నేహితులతో వాదించటం, ముస్లిముల్ని తిట్టటం, ఇప్పుడు పుస్తకాల్ని తగలబెట్టటం చూసిన తరువాత సురంజన్ మానసికంగా ఎంత చితికి పోయాడో సుధామయ్‌కి అర్థమైంది. అతణ్ణి కుటుంబం బాధ పెట్టింది, సమాజం బాధపెట్టింది – అన్నిటికంటే ఎక్కువగా ఈ దేశం బాధ పెట్టింది. ఇప్పుడు వాడు ఆత్మన్యూనత అన్న మంటల్లో తన్ను తాను కాల్చుకుంటున్నాడు.

మంటల్ని చూస్తే సురంజన్‌కు సంతోషం కలిగింది. దేశమంతా వాళ్ళు హిందువుల ఇళ్లని ఇలాగే కాలుస్తున్నారు. వాళ్ళు తగల బెట్టింది ఇళ్ళనీ, దేవాలయాల్నీ మాత్రమేనా? హిందువుల మనస్సుల్ని తగలబెట్టలేదా? నాన్నగారి ఆదర్శ వాదాన్ని ఇంకాపట్టుకొని వేలాడకూడదని నిశ్చయించుకున్నాడు సురంజన్. సుధామయ్ వామపక్ష భావజాలంమీద గట్టి నమ్మకం ఉన్నవాడు. సురంజన్ ఆపిడివాద వాతావరణం లోనే పెరిగాడు. కానీ ఇకమీదట ఆ ప్రభావం తనమీద ఉండదు. వామపక్ష వాదులు హిందువుల్ని ఎందుకలా తిడతారు? పొగతగిలి సురంజన్ కళ్ళు తడయ్యాయి. అవి బాధలకన్నీళ్ళా? లేదా పొగతగిలి వచ్చిన కన్నీళ్ళా?

పుస్తకాలు పూర్తిగా కాలిపోయి బూడిద మాత్రమే మిగిలాక సురంజన్‌కు గొప్ప సంతృప్తి కలిగింది. తమతప్పుడు అభిప్రాయాలతో, సిద్ధాంతాలతో ఈ పుస్తకాలు తన్ను చాలా క్షోభపెట్టాయి. ఈ అభిప్రాయాలనీ, సిద్ధాంతాలనీ శక్తికొద్దీ తన్ని తగలేయాలనిపించింది. తాను మాత్రమే ఆ సిద్ధాంతాలకు ఎందుకు కట్టుబడిఉండాలి?

విజ్ఞానాన్ని చాలామంది చప్పరిస్తారు. తృప్తిగా తాగరు. తాను మాత్రమే ఎందుకు అంత తృప్తిగా విజ్ఞానాన్ని తాగాలి.

యజ్ఞం పూర్తయ్యాక సురంజన్‌కు నిద్ర పోవాలనిపించింది. పడుకొని ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. రత్నమాటిమాటికీ జ్ఞాపకం వస్తోంది. ఈ లోగా అవిడను కలుసుకోలేదు. అవిడ ఎలా ఉందో! రత్న కళ్ళు విశాలంగా, మాట్లాడుతున్నట్టుగా ఉంటాయి. ఆవిడ ఏంచెప్పాల్సిన అవసరమే లేదు. తాను ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళింటి తలుపు తడతానని ఎదురుచూస్తూ ఉంటుంది కాబోలు. తామిద్దరూ కూచుని టీతాగుతూ తమ జీవితాలను గురించి మాట్లాడుకోవచ్చు. ఆ రోజు సాయంకాలం రత్నను కలుసుకోవాలని నిశ్చయించుకున్నాడు సురంజన్. "నేనే ఎందుకు కలుసుకోవటానికి రావాలి? ఇతరులు రాకూడదా", అని అవిడను అడుగుతాడు.

సురంజన్ ఒకరోజు సాయంకాలం చిత్రమైన అనుభూతిని పొందాడు. నిరాశగా ఉన్న ఆ రోజు సాయంకాలం రత్న అకస్మాత్తుగా వచ్చింది. "నాకు అదోలా అనిపించింది సురంజన్. కాబట్టి నిన్ను కలుసుకోవాలని వచ్చాను," అంది. తన్ను ఎవరైనా ముద్దుపెట్టుకొని ఎంతో కాలమైంది. పర్వీన్ ఆ పని చేసేది. తన్ను గట్టిగా కౌగలించుకొని "నువ్వు నా వాడివి. నా వాడివి మాత్రమే. నిన్ను వంద సార్లు ముద్దెట్టుకుంటాను", అనేది. కిరణ్మయి గదిలో కొస్తే తామిద్దరూ దూరంగా జరిగి కూచునేవారు. ఇవన్నీ జరిగాక కూడా పర్వీన్ చివరికి ముస్లింనే పెళ్ళిచేసుకోవటానికి నిశ్చయించుకుంది. అన్ని సమస్యలనూ దూరంగా ఉంచవచ్చని ఆశపడింది. రత్నతో మతానికీ, కులానికీ సంబంధించిన సమస్యలు లేవు. తన కడగండ్ల జీవితాన్ని అవిడ పాదాలముందే సమర్పిస్తాడు. ఈ రోజు అవిడను తప్పకుండా కలుసుకోవాలి. తన శరీరానికి పట్టిన మురికినంతా శుభ్రంగా కడుక్కొని, ఉతికిన బట్టలేసుకొని రత్న ఇంటికి వెళ్ళాలి....ఎవరో తలుపు తట్టారు. సురంజన్ వెళ్ళి తలుపు తీసేసరికి రత్నే అక్కడ నిలబడిఉంది. రత్న చాలా అందంగా కనిపించింది. ఆవిడ తళతళలాడి పోతున్న చీరకట్టుకుంది. అవిడ తొడుక్కున్న గాజులు నడుస్తుంటే గలగల లాడుతున్నాయి. అవిడ చిరునవ్వు నవ్వింది. ఆ అందానికీ, మృదుత్వానికి సురంజన్ ఆశ్చర్యపోయాడు.

"రండి....లోపలికి రండి", అవిడ వెనక అందంగా ఉన్న ఒక యువకుడు నిలబడి ఉండటాన్ని సురంజన్ గమనించాడు.

అవిడను ఎక్కడ కూచోమనాలి? గది అధ్వాన్నంగా ఉంది. గదిలోకి వాళ్ళు వచ్చాక అవిడకు ఓ విరిగిపోయిన కుర్చీ చూపించాడు.

"నాతో ఎవర్ని తీసుకొచ్చానో ఊహించుకో", అంది రత్న నవ్వుతూ.

సురంజన్ అంతకు ముందెప్పుడో రత్న అన్నయ్యను కలుసుకో ఉన్నాడు. ఇప్పుడు వచ్చిన వ్యక్తి అతడేనా అని ఆలోచించాడు.

"ఇతడు హుమయూన్ – నాభర్త", అవిడ తొడుక్కున్న గాజుల్లాగా అవిడ కంఠం కూడా గలగలమంది.

అతని హృదయంలో ఓ భయంకరమైన తుఫాను ఉవ్వెత్తుగా లేచింది. తనకు

ఆధారం అనుకున్న చివరి చెట్టు కూడా కూలిపోయింది. వృధా అయిపోతున్న తన బతుకును రత్న సహచర్యంతో బాగు చేసుకుందామని తాను ఆశపడ్డాడు. ఇప్పుడామె తన ముస్లింమొగుడితో పాటు తన్ను చూడటానికి వచ్చింది! సురంజన్ ముఖం కోపంతో కమిలిపోయింది. తన్నెలా మరిచిపోయింది? తన మొగుణ్ణి కూడా తనతో తీసుకు రాగలిగిన ధైర్యం ఆమె కెప్పుడొచ్చింది? వాళ్ళను తన గదిలో కూచోబెట్టుకొని వాళ్లతో కబుర్లు చెప్పటానికి తాను సిద్ధంగా లేడు. ఆ అందగాడు – బహుశా బాగా ఉన్నవాడు – తన పేదగదిలో కూచోని కబుర్లకు దిగుతాడేమో. వాళ్లతో కరచాలనం చేసి, మళ్ళీ రమ్మని చెప్పాలని కూడా అనిపించటంలేదు. ఈ సామాజిక మర్యాదల్ని తగలబెట్టినట్టే ఉంది.

"నేను అర్జంటు పని మీద తొందరగా బయటికెళ్ళాలి. మీతో మాట్లాడే టైంలేదు", అన్నాడు సురంజన్ కరుగ్గానే.

ఆశ్చర్యం, అవమానం వాళ్లముఖాల్లో కనిపించాయి. తొందర తొందరగా క్షమాపణ చెప్పి వాళ్ళు బయటికి నడిచారు. సురంజన్ తలుపు గట్టిగా వేసి, దానికానుకొని నిలబడ్డాడు. అతడు అలాగే చాలాసేపు నిలబడ్డాడు, కిరణ్మయి గదిలో కొచ్చి "నువ్వు అప్పుగా తెచ్చిన డబ్బు తిరిగి ఇచ్చేశావా? " అని అడిగింది. "అప్పు" అన్న మాటలో విషం లాంటి అంతరార్థం వినిపించింది. జవాబు చెప్పకుండా కిరణ్మయి ముఖంలోకి కోపంగా చూశాడు సురంజన్.

★ ★ ★

సురంజన్‌కు ఊపిరాడటంలేదు. తనగది తప్పించుకొని పారిపోవటానికి వీల్లేని ఇనుపపెట్టెలా అతనికి అనిపించింది. కాస్సేపు వరండాలో పచారుచేశాడు. అతణ్ణి ముంచెత్తుతున్న దుఃఖం తగ్గలేదు. కిరణ్మయి టీ కప్పుతో గదిలో కొచ్చి తన అలవాటు ప్రకారం బల్లమీద పెట్టి వెళ్ళిపోయింది. కానీ సురంజన్ టీకప్పును అందుకోలేదు. మళ్ళీ కాస్సేపు పడుకొని లేచాడు. వంతెన వద్దకెళ్ళి శవాన్ని చూసి రావాలా? ఆ ఆలోచనే అతణ్ణి కదిలించివేసింది. తమ ఇంటి ముందున్న మురికి నీటికాలువలో ఓ శవం తేలుతున్నట్టుగా అతనికి అనిపించింది.... ఇల్లు నిశ్శబ్దంగా ఉన్న సరస్సులా ఉంది. అలాంటి సరస్సులో నీటిమీద తిరిగే పురుగుల్లా ఇంట్లో ఉన్న ముగ్గురూ, ఒకరికి మరొకరు ఎదురు రాకుండా, ఒకరితో మరొకరు మాట్లాడకుండా తిరుగుతున్నారు.

అలాంటి నిశ్శబ్దాన్ని అకస్మాత్తుగా చీల్చుతూ కిరణ్మయి గట్టిగా ఏడవటం ప్రారంభించింది. ఆవిడ దుఃఖం ఆవిడలోనుంచి కాక భూమిలోపల పొరల్లోనుంచీ వస్తున్నట్టుగా ఉంది. ఆ దుఃఖం తీవ్రతకు ఆశ్చర్యపోయిన సుధామయ్ లేచి కూర్చున్నాడు. సురంజన్ పరుగెత్తుకుంటూ వచ్చాడు. కిరణ్మయి ముఖం గోడవైపుకు తిప్పుకొని, గోడకు తల ఆనించి ఉగ్గబట్టుకోలేని దుఃఖంతో ఏడుస్తోంది. ఈ కన్నీళ్లను ఆపటం సాధ్యంకాదని సురంజన్‌కు అర్థమైంది. ఈ కన్నీళ్లు బయటికి రావాల్సిందే. అనేక పగళ్ళూ, అనేక రాత్రులూ ఈ కన్నీళ్లు బయటపడకుండా కిరణ్మయి అడ్డుకుంది. ఇప్పుడు ఆనకట్ట బద్దలైపోయింది. నీళ్ళు అవతలికి ప్రవహించ వలసిందే.

సుధామయ్ తలవంచుకొని కూచున్నాడు. ఆవిడ దుఃఖం అతని హృదయాన్ని ముక్కలు చేసింది. అతణ్ణి నిస్సహాయుణ్ణి చేసింది. ఆవిడ అలా వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తూనే ఉంది. ఎవరూ ఆవిడను ఎందుకేడుస్తున్నావని అడగలేదు. అడగాల్సిన అవసరమూలేదు. ఎవరూ ఆవిడను ఓదార్చలేదు. ఓదార్చడానికి సాధ్యమూకాదు.

సురంజన్ వాకిట్లో నిలబడ్డాడు. కాస్సేపటి తరువాత నిశ్శబ్దంగా, కిరణ్మయి కన్నీళ్లకు అడ్డం రాకుండా లోపలికి నడిచాడు. అతని ఊహాలోకంలోని ఇల్లు కూలిపోయింది, బూడిదగా కాలిపోయింది. కిరణ్మయి తన ఏడుపుతో అందరినీ ఆశ్చర్యపోయేలా చేసినట్టు సురంజన్ "బాబా...." అని బాధగా అరిచిన అరుపు అందరి గుండెల్లోనూ దూసుకుపోయింది.

సుధామయ్ దిమ్మెరపోయి సురంజన్‌ను చూశాడు.

సురంజన్ నాన్నగారి చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని ప్రాధేయపడుతున్నట్టుగా అన్నాడు.

"బాబా, నేను రాత్రల్లా ఒకే విషయాన్ని గురించి ఆలోచిస్తున్నాను. నా సలహా మీకు నచ్చదని నాకు తెలుసు. కానీ చేతులు జోడించి ప్రార్థిస్తున్నాను.....దయచేసి.... బాబా.....రండి....వెళ్ళిపోదాం...."

"ఎక్కడికి?" అడిగాడు సుధామయ్.

"భారతదేశానికి...."

"భారతదేశానికి?" సుధామయ్ అసహ్యించుకున్నట్టుగా అన్నాడు. తనకొడుకు తన్ను అనరాని మాటేదో అన్నట్టుగా అనిపించింది అతనికి.

కిరణ్మయి కన్నీళ్లు క్రమంగా తగ్గాయి. ఆవిడ శరీరం వణికి, వణికి కుప్పగా కూలిపోయింది. సుధామయ్ అలాగే అసహ్యంగా చూస్తున్నాడు.

"భారతదేశం మీ అబ్బగారి దేశమా, తాతగారు దేశమా? మన కుటుంబం వాళ్ళు అక్కడ ఎవరున్నారు? నీ మాతృదేశం నుంచీ పారిపోవాలనుకుంటున్నావా? అలా ఆలోచించటానికి నీకు సిగ్గు వేయటం లేదూ?" అన్నాడు సుధామయ్.

"మాతృదేశమా బాబా....? ఆ దేశం నాకేమిచ్చింది? ఏం ఇస్తోంది? ఈ దేశం మాయకేమిచ్చింది? అమ్మ ఎందుకు ఏడుస్తోంది. నువ్వు రాత్రంతా ఎందుకు మూలుగుతున్నావు? నాకెందుకు నిద్ర పట్టటం లేదు? "

"అల్లర్లు అన్ని దేశాల్లోనూ జరుగుతాయి. భారతదేశంలో అల్లర్లు లేవా? అక్కడ అల్లర్లలో జనం చనిపోవటం లేదా? అక్కడ ఎంత మంది చనిపోయారో నువ్వు లెక్కపెడుతున్నావా?"

"అవి అల్లర్లయితే ఫరవాలేదు బాబా. ఇక్కడ జరుగుతున్నవి అల్లర్లు కావు, ఇక్కడ ముస్లిములు హిందువుల్ని చంపుతున్నారు అంతే".

"అంటే నిన్ను నువ్వు హిందువనుకుంటున్నావన్నమాట!" ఆవేశంతో సుధామయ్ మంచంమీదనుంచీ లేవబోయాడు. సురంజన్ అతణ్ణి వెనక్కి కూచోబెట్టి మళ్ళీ వేడుకోవటం ప్రారంభించాడు.

"మనల్ని మనం నాస్తికులమనో, మానవతావాదులమనో పిల్చుకుంటున్నాం కానీ వాళ్లు మాత్రం మనల్ని హిందువులనే అంటున్నారు. లంజకొడుకులనే పిలుస్తున్నారు. మనం ఈ దేశాన్ని ఎంత ఎక్కువగా ప్రేమిస్తే అది మనకు అంత దగ్గరౌతుంది. కానీ వాళ్ళు మనల్ని అంతగా దూరంగా పెడుతూనే ఉన్నారు. ఈ దేశంలోని ప్రజల్ని మనం ఎంత ఎక్కువగా ప్రేమిస్తామో వాళ్లు మనల్ని అంత ఒంటరి వాళ్లను చేస్తారు. వీళ్లని మనం నమ్మలేం, బాబా. వీళ్లలో ఎంతో మందికి మీరు ఉచితంగా వైద్యం చేశారు. కానీ మీరు కష్టాల్లో ఉన్నప్పుడు ఎంతమంది మిమ్మల్ని ఆదుకున్నారు. ఎప్పుడో ఒకప్పుడు మనల్ని వంతెన మీదినుంచీ నదిలోకి తోసి చంపేస్తారు. బాబా....దయచేసి....దయచేసి వెళ్ళిపోదాం...."

"మాయ తిరిగొస్తుంది".

"రాదు బాబా రాదు...." సురంజన్ కంఠస్వరం బాధతో బలహీనంగా జారిపోయింది.

"మాయనే రక్షించలేనివాణ్ణి, ఎవర్ని రక్షించగలను?" అన్నాడు ఎంతో బలహీనంగా.

"మనల్ని మనమే రక్షించుకోవాలి. మీరు ఇప్పటికే పోగొట్టుకున్నదాన్ని తలుచుకొని ఏడవడానికేనా మీరీదేశంలో ఉండాలి? అందులోనూ ఇలాంటి కల్లోలంలో? మనకు భద్రతలేదు. లేదంటే లేదు. మనం ఈ దేశం నుంచీ వెళ్లిపోదాం".

"అక్కడేం చేయాలనుకుంటున్నావ్?"

"ఏమైనా చేయవచ్చు. ఇక్కడేం చేస్తున్నాం. మనం బాగా సంపాదించుకున్నామా? సంతోషంగా ఉన్నామా?"

"మనది వేళ్ళు తెంపుకున్న బతుకైపోతుంది...."

"మీ వేళ్ళతో ఏంచేస్తారు? బాబా, ఈ దేశంలో మీవేళ్ళు అంత బలంగా నాటుకో ఉంటే మీరిలా తలుపులూ, కిటికీలూ మూసుకొని ఎందుకు దాక్కో ఉన్నారు? మన ఇళ్ళలోకి దూరటం, మనల్ని చంపటం వాళ్ళకు అలవాటైపోయింది. ఇలా ఎలుకలా బతకడానికి సిగ్గుగా ఉంది బాబా. ఈ అవమానం నన్ను చీల్చుకు తింటోంది బాబా....కానీ నేను ఏమి చేయలేని అశక్తుణ్ణి. నాకు కోపం వచ్చినప్పుడు నేనుకూడా ఒకటి రెండు ఇళ్ళని ఎందుకు తగల బెట్టకూడదు? వాళ్లు మనల్ని ఇంత అవమానం పాలుచేస్తూ ఉంటే, మన బతుకుల్ని ఇంతగా నాశనం చేస్తూ ఉంటే మనం ఎందుకు చేతులు ముడుచుకొని కూచోవాలి? నన్నొక ముస్లిం చెంపమీద కొడితే నేనెందుకు తిరిగి కొట్టగూడదు? లేదుబాబా....ఇక్కణ్ణుంచి వెళ్లిపోదాం....దయచేసి ఊఁ అనండి...."

"పరిస్థితి చల్లబడుతోందిగా. ఎందుకింతగా ఆందోళన పడతావు? ఇలా ఉద్రేక పడితే ఎలా?"

"పరిస్థితి చల్లబడుతోందా? అది పూర్తిగా తప్పుదారి పట్టించే అభిప్రాయం. కానీ లోలోపల ఉన్న క్రూరత్వమూ, ద్వేషము శాశ్వతంగా ఉండిపోతాయి. వాళ్ళు మనమీద దాడిచేయటానికి సిద్ధంగా ఉంటారు.... అవకాశం కోసం ఎదురు చూస్తూనే ఉంటారు. మీరు ధోవతి కట్టుకోవటం వదిలేసి పైజమా లెందుకు వేసుకుంటున్నారు?

మీకు ధోవతి కట్టుకునే స్వాతంత్ర్యం ఎందుకు లేదూ? రండి బాబా....వెళ్ళిపోదాం..."

"నేను రాను.... నీకు వెళ్ళాలనుంటే నువ్వెళ్ళు", సుధామయ్ గట్టిగా అరిచాడు.

"మీరు రారా ?"

"రాను", విసుగ్గా తలతిప్పుకున్నాడు సుధామయ్.

"మళ్ళీ అడుగుతున్నాను బాబా....రండి వెళ్ళిపోదాం", ప్రాధేయపడ్డాడు సురంజన్.

"రాను", దృఢంగా అన్నాడు సుధామయ్.

"రాను" అన్నమాట ఇనుపచువ్వలా తాకింది సురంజన్‌ను.

తన ప్రయత్నం ఫలించదని మొదటినుంచి తెలుసు. సుధామయ్ తన అభిప్రాయాల విషయంలో అంత మొండిగా ఉంటాడు. అతణ్ణి కదిలించటం, మార్చటం సాధ్యంకాదు. అతణ్ణి కొట్టినా, తన్నినా తాను పుట్టిన గడ్డ వదిలి వెళ్ళడు. ఆగడ్డమీదున్న తేళ్ళూ, పాములూ అతని కాళ్ళువేసినా సరే అతని నిర్ణయం మారదు.

కిరణ్మయి ఏడవటం ఆపి, గది మూలలో ఉన్న రాధాకృష్ణుల పటాన్ని కన్నార్పకుండా చూస్తోంది. ఈ బాధలనుంచి, భయాలనుంచీ హింసనుంచీ, చావునుంచీ రక్షించమనీ, అవిలేని జీవితాన్ని ప్రసాదించమనీ వారిని వేడుకొంటోంది.

ఈ నిరాశా ప్రవాహానికి ఎదురుగా సురంజన్ ఒంటరిగా ఈదవలసిన పరిస్థితి వచ్చింది.....చీకటిపడింది.... రాత్రి బాగా పొద్దు పోయాక భయంకరమైన ఒంటరితనం అతణ్ణి చుట్టుముట్టింది. తనవాళ్ళు అన్నవాళ్ళెవరూ లేరు. తాను ఒంటరివాడు. ఎవరిమీదా ఆధారపడలేదు. తన దేశంలోనే తాను పరాయి వాడైపోయాడు. తన విశ్వాసాలూ, ఆదర్శాలూ, ప్రాపంచిక దృక్పథం పనికి రాకుండా పోతున్నాయి. తను ఇంతకాలమూ ప్రయాణం చేస్తూ వచ్చిన బాట ఆగిపోయింది, ముందుకు ఇక దారిలేదు అనిపించింది సురంజన్‌కు.

ప్రతి ఒక్కరూ తమ జీవితాలు భయంకరంగా అంతమౌతాయని ఎదురుచూస్తు న్నట్టుగా ఉన్నారు. ఇప్పుడు మాయకోసం కాదు, తనకోసం, తనభవిష్యత్తుకోసం తన గుండె రెపరెపలాడిపోతోంది. అందరూ ఒంటరివాళ్ళే. ప్రతి ఒక్కరిదీ ఒంటరి బ్రతుకే. ముస్లిం స్నేహితులూ పరిచయస్తులూ అప్పుడప్పుడూ వచ్చి పలకరిస్తున్నారు. నిజమే. కాని ఈ దేశంలో ఉండటంలో ప్రమాదం లేదని ఎవరూ గట్టిగా చెప్పలేకుండా ఉన్నారు. "ఆందోళన పడకండి. భయపడకండి. మీరు క్షేమంగా తిరగవచ్చు. భయం లేకుండా పని చేయవచ్చు. హాయిగా నవ్వుకోవచ్చు. ప్రశాంతంగా నిద్ర పోవచ్చు", అని ఎవ్వరూ చెప్పలేకుండా ఉన్నారు.

రాత్రంతా సురంజన్ పరుపు మీద దొర్లుతూనే ఉన్నాడు.

★ ★ ★

# పదమూడవ రోజు

తెల్లవారుతూ ఉండగా సురంజన్‌కు నిద్ర పట్టింది. అతనికో కలవచ్చింది. ఒక నది ఒడ్డున తాను ఒంటరిగా నడుస్తున్నాడు. ఓ పెద్ద కెరటం వచ్చి లోపలికి లాగేసింది. తానో సుడిగుండంలో చిక్కుకున్నాడు. క్రమక్రమంగా మునిగి పోతున్నాడు. తనకు బతికి బయటపడాలని ఉంది. కానీ తన్ను గట్టుకులాగే వాళ్ళెవరూ లేవిరి. అలాతాను అగాధమైన నీటిలో మునిగిపోతూ ఉన్నాడు....సురంజన్‌కు తాను చెమటతో తడిసిపోతున్నానని అర్థమైంది.

అప్పుడే ఓ చేయి అతణ్ణి మెల్లిగా కుదిపి నిద్రలేపింది. సుడిగుండంలో చిక్కుకొని మునిగిపోతూ, భయంతో వణికిపోతూ, పిలిస్తే పలికే దిక్కులేకుండా ఉన్న అతనికి చివరి క్షణంలో ఆదుకునే చేయి దొరికింది. అతడు దాన్ని గట్టిగా పట్టుకున్నాడు. నిద్రమేల్కొన్నాక అతనికి తాను ఇంకా స్వాధీనంలో ఉన్న సుధామయ్‌చేతిని పట్టుకో ఉన్నానని అర్థమైంది.

కిరణ్మయి సహాయంతో సుధామయ్ సురంజన్ గదిలోకొచ్చి, పీడకలభయంతో కలవరిస్తున్న కొడుకును చూశాడు. ఇప్పుడు అతణ్ణి గట్టిగా పట్టుకొని కూచున్నాడు. అతని కళ్ళు కొత్త వెలుగుతో తళతళలాడుతున్నాయి.

"బాబా?"

సురంజన్ గుండెలో ఒక నిశ్శబ్ద ప్రశ్న దడదడలాడుతోంది. కిటికీ సందులగుండా వెలుగు జారుతోంది.

"రా....వెళ్ళిపోదాం", అన్నాడు సుధామయ్.

సురంజన్ ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయాడు.

"ఎక్కడికి బాబా?"

"భారతదేశానికి"

సిగ్గు ముఖం మీద అలుముకుంటే జీరబోయిన గొంతుకతో అతడు ఆ మాట అన్నాడు. ఆ మాట అనటానికి తన్ను తాను ఎంతో బలవంతపెట్టుకున్నాడు. తాము వెళ్ళి పోతున్నామని కష్టపడి చెప్పగలిగాడు. అది అలాగే జరగాలి. తనలో తాను నిర్మించుకున్న మహాపర్వతం రోజురోజుకూ కూలిపోతూ మరోలా జరగదు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయం
A C.No. 97120
గచ్చిబౌలి, హైదరాబాద్-500032



తస్లీమా నస్రిన్

తస్లీమా నస్రిన్ బంగ్లాదేశ్‌లోని మైమెన్ సింగ్ నగరంలో 25 ఆగస్టు, 1962లో జన్మించింది. మైమెన్‌సింగ్ వైద్య కళాశాల ద్వారా వైద్యశాస్త్రంలో పట్టభద్రురాలైంది. ప్రభుత్వ ఆస్పత్రులలో కొన్ని సంవత్సరాలు డాక్టరుగా ఉద్యోగం చేసింది. తస్లీమా నస్రిన్ తన సాహిత్య జీవితాన్ని కవిత్వంతో ఆరంభించింది. తర్వాత కొన్నాళ్లకు పత్రికల్లో సాహిత్యపరమైన ఫీచర్లు రాయడం ఆరంభించింది. క్రమంగా వ్యాసాలూ, నవలలూ రాసి ప్రచురించింది. బంగ్లాదేశ్‌లోని ప్రముఖ పత్రికలన్నీ ఈమె రచనలను ప్రచురించేవి. కలకత్తాలోని ఆనంద పురస్కార్ 1992లోను, ఢాకాలోని నాట్యసభా పురస్కార్ 1993లోనూ వీరికి లభించాయి.

1993 ఫిబ్రవరిలో వెలువడ్డ ఈ "లజ్జ" నవల అయిదు మాసాలలో 60,000 ప్రతులు అమ్ముడయ్యాయి. మత ఛాందసత్వం యొక్క వికృత రూపం మానవత్వాన్ని ఎలా మంటగల్పుతుందో ఈ నవలలో రచయిత్రి వివరించింది. పదమూడు రోజుల్లో జరిగిన అనేక సంఘటనల సమాహార రూపం ఈ నవల "లజ్జ". ఈ నవల రాసినందుకే ముస్లిం మతఛాందసవాదులు తస్లీమా నస్రిన్‌కు మరణదండన విధిస్తూ "ఫత్వా" జారీ చేశారు. 1993 సెప్టెంబర్‌లో బంగ్లాదేశ్ ప్రభుత్వం ఈ నవలను నిషేధించింది. నస్రిన్‌కు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది.